
రామాయణం

# రామాయణ రత్నాకరము - 1,2,3



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ

# రామాయణరత్నాకరము

★


గ్రంథకర్త

వంగీపురం రంగస్వామయ్యంగారు

పాకాల


★

హక్కులు మా యధీనము ] [ వెల 12 అణాలు

# విషయసూచిక.


| | | | | పుట |
|---|---|---|---|---|
| 1. | రామాయణోదయము | ... | ... | 5 |
| 2. | అవతారము | ... | ... | 12 |
| | ఋష్యశృంగుఁడు | ... | ... | 13 |
| | అవతారము | ... | ... | 18 |
| | నామకరణము | ... | ... | 19 |
| | పరస్పరప్రేమ | ... | ... | 21 |
| 3. | విశ్వామిత్రుని యజ్ఞము | ... | ... | 22 |
| 4. | మిథిలానగర గమనము | ... | ... | 31 |
| | సగరునివృత్తాంతము | ... | ... | 32 |
| | అహల్యావృత్తాంతము | ... | ... | 35 |
| | విశ్వామిత్రుని చరిత్రము | ... | ... | 38 |
| | శునశ్శేఫునివృత్తాంతము | ... | ... | 41 |
| 5. | కల్యాణము | ... | ... | 44 |
| | సీతాకల్యాణము | ... | ... | 50 |
| 6. | పట్టాభిషేక భంగము | ... | ... | 56 |
| | మంథర కైకేయికి దుర్బోధనలు సేయుట | | ... | 61 |
| | కైకేయి లోఁగుట | ... | ... | 64 |
| | దశరథుని రాక | ... | ... | 64 |
| 7. | అరణ్య గమనము | ... | ... | 73 |
| | రాముఁడు సీతకడకుఁబోవుట | ... | ... | 78 |
| | దశరథుని యనుజ్ఞ | ... | ... | 83 |
| | సుమంత్రుడు కైకనుదూరుట | ... | ... | 84 |
| | పయనము | ... | ... | 86 |
| 8. | పాదుకాపట్టాభిషేకము | ... | ... | 90 |
| | దశరథుని మరణము | ... | ... | 93 |
| | భరతుని రాక | ... | ... | 94 |

| | | | |
|---|---|---|---|
| భరతుని దుఃఖము | ... | ... | 96 |
| భరతుని శపథములు | ... | ... | 99 |
| దశరథుని యంత్యక్రియలు | ... | ... | 100 |
| భరతుఁడు రాముని బ్రార్థింపఁ బోవుట | | ... | 101 |
| రాముని దర్శించుట | ... | ... | 105 |


# విన్నపము.

శ్రీరాముని ప్రేరేపణముచే నుద్యోగ విరమణసమయమున నామతి కత్యంతోపయోగమగు కైంకర్యమని తోఁచిన రామచరితామృతమును "రామాయణరత్నాకరమను" నామంబున సులభశైలిని వ్రాసి భక్తకోటికి నందించుట ధర్మమని యీగ్రంథ ముద్రణమునకు సాహసించితిని. నావంటి యల్పజ్ఞునకు నశక్తున కియ్యది యసాధ్యమే యయ్యును భగవదాజ్ఞనుల్లంఘింప వీలు లేదని దీనినొక యజ్ఞమని పవిత్రముగ నెంచిన శ్రీరామభక్తచరణదాసుని సంకల్పము నెఱవేరుటకు రెండు మూఁడు భాగములుగ ముద్రింపఁదగు సహాయ మొనర్తురని తలంచెదను.

పాకాల, }
5—2—1955. }

భక్తాంఘ్రి రేణువు,
గ్రంథకర్త.

## గ్రంథము దొఱకుచోట్లు.

1. వి. రంగస్వామి, గ్రంథకర్త, పాకాల.
2. సి. యం. శ్యామారావు, రిటైర్డు టీచరు, 157/6 బ్రాహ్మణవీధి, చిత్తూరు.

శ్రీ

# రామాయణరత్నాకరము

## 1 రామాయణోదయము

శ్రీమన్నారాయణుని దశావతారములలో నేడవది శ్రీరామావతారము. బ్రహ్మలోకమున శతకోటి శ్లోకములతో వెలయు శ్రీమద్రామాయణము భూలోకమున మానవులకుం దగినరీతిని వ్రాయించుట మానవులకు మోక్షోపాయమగునని బ్రహ్మ తలఁచెను. అతఁడు తన మానసపుత్రుఁడగు నారదుని పిలిచి 'నీవు భూలోకమున వాల్మీకిచే శ్రీమద్రామాయణము రచియింపంజేయుమ'నియె. అందులకు కారణమున్నది. వాల్మీకి బ్రాహ్మణుఁడై జన్మించి బోయస్త్రీ సాంగత్యమునఁ కుటుంబవృద్ధిచేసికొని జీవనోపాయముగానక దొంగలతోఁ జేరి బాటసారుల వధించి వారిసొత్తు నపహరించుచుండెను. అతని యందు దయ తలఁచి సప్తఋషులు వృద్ధులవలె మూటల నెత్తుకొని యా మార్గమున వచ్చిరి. వారిని చూచినంతనే వాల్మీకి నిలునిలుఁడని యడ్డగించెను. వారేల మమ్మడ్డగింతువని యడుగ నాలుబిడ్డలబోషింప నేనిట్లు వచ్చినవారిని వధించి వారి సొత్తు నపహరించుచుందు ననెను. అంత వారు మేమిచ్చటనే యుందుము. అట్లు గాకున్న మేము బంగారము దొంగిలించిన వారు, మద్యము త్రాగినవారు, గురుపత్నిని చెఱచినవారు, పొందు పాపఫలముల ననుభవింతుమని ఒట్టుపెట్టుకొని యిట్లు నిరి. 'ఓరీ, నీ వింటికిఁబోయి నీ యాలుబిడ్డల వేఱువేఱుగ

నేను మహాపాపములుచేసి తెచ్చు సొత్తును బాల్గొందురే నా పాపమునుగూడ పంచుకొనుఁడని యడుగుము. వారేమి చెప్పె దురో వచ్చి మాతోఁజెప్పుము పొమ్మనిరి. వాఁడట్లే వారల నడుగ వారిలో నొక్కరైనను సమ్మతింపక నీసొత్తుకు హక్కు దారులమేగాని నీ పాపములతో మా కగత్యములే దనిరి. నా భార్య, నాబిడ్డలని యహంకరించుచుండినవాఁడు మునులఁ జూచి వారికి మ్రొక్కి, యాలుబిడ్డలసంబంధ మెట్టిదసి తెలిసి కొంటిని. ఇఁక మోక్షమునకు దారిజూపుఁడని ప్రతిమాలెను. వారు కరుణించి రామయనినను పలుకలేఁడనితలంచి "మరా మరా" యని జపించుచుండుము, మేము మరల వత్తుమని వెడలిపోయిరి. అతఁడొకేపట్టుదలతో నామంత్రమును జపిం చుచు నిశ్చేష్టుండై యుండ నతనిచుట్టు పుట్టపెరిగినది. వారు చాలకాలమున కచ్చటికివచ్చి మునీశ్వరా, వాల్మీకీ, వెడలి రమ్మనిరి. అతఁడు సూర్యునివంటి తేజస్సుతో నాపుట్టనుండి వెలువడినందున వాల్మీకియను పేరుపొందెను. "రామ"యను రెండక్షరములను వ్యత్యస్తముగఁ బలికియుఁ దాను గూడఁ బెట్టిన కొండంతపాపమును బోఁగొట్టుకొనినాఁడు. ఇది రామ నామ మహిమవలననేకదా. అతని చేతులార శ్రీరామ చంద్రునిచరిత్రము వ్రాయించుట సర్వవిధములనొప్పి లోక మునకొక గుణపాఠముగ నేర్పడునని బ్రహ్మదేవుఁ డతనియొద్ద కు నారదునిఁ బంపెను.

నారదుఁ డెట్టివాఁడు? ఎవరి నాలుగు మోములనుండి నాలుగు వేదములు పుట్టెనో యట్టి బ్రహ్మదేవుని పుత్త్రుఁడు. జరిగినది జరుగుచున్నది జరుగనున్నది తెలిసినవాఁడు. తలఁచి

నంతనె మూఁడు లోకములు సంచరించువాఁడు. లోకులకుఁ గలహాభోజనుఁడుగఁ జూపట్టునేగాని నిజముగ శ్రీమన్నారాయణుని సంకల్పము ననుసరించి మున్ముందుగఁ బరిస్థితులు చక్కబెట్టును. అట్టి నారదుఁడు వచ్చినంతనె వాల్మీకి యెదురేగి నమస్కరించి తోడి తెచ్చి యర్ఘ్యపాద్యాదులనిచ్చి యుచితాసనమునఁ గూర్చుండనిచ్చి కుశలంబులడిగి యిట్లని ప్రశ్నించెను. "బ్రహ్మర్షీ ! ఇక్కాలమున నీలోకమున సద్గుణములు గలిగి, పరాక్రమశాలియై, ధర్మము దెలిసినవాఁడును మేలు మఱువనివాఁడును, నిత్యసత్యవ్రతుఁడును, దృఢమగు నియమము పాటించువాఁడును, కులాచారమును విడువనివాఁడును, సకలప్రాణులయందు మేలుదలఁచువాఁడును, సకలవిద్యలు నేర్చినవాఁడును, కార్యనిపుణుఁడును, నెల్లప్పుడు ప్రియమగు రూపముగలవాఁడును, మనసు స్వాధీనమందుంచుకొనినవాఁడును, క్రోపము జయించినవాఁడును, దేహకాంతికలవాఁడును, అసూయలేనివాఁడును, యుద్ధమునఁ గోపము పూనినంతనె యెవనిఁజూచి దేవతలందఱు భయపడుదురో యట్టి మానవోత్తముఁ డెవఁడని తెలిసికొన నువ్విళ్ళూరుచున్నాను. నాకీ విషయము దెలియఁజేయఁగలవాఁడవు నీవే" యనెను. ఇచ్చట వాల్మీకి యడిగిన ప్రశ్న సామాన్యమైనది కాదు. పదునాఱు ప్రశ్నలడిగెను. షోడశకళలతో నిండినవాఁడు పూర్ణచంద్రుడే. అట్టిచంద్రుఁ డమృతకిరణుఁడని లోకప్రసిద్ధి. ఎట్టి వ్యాకులము నైనను బోగొట్టి యాహ్లాదముపుట్టించువాఁడు. లోకము నానందమున ముంచువాఁడు. ఆ చంద్రునివలె రూపముచేతను, గుణములచేతను లోకోపకారముఁజేయు పురుషశ్రేష్ఠుఁడని యర్థము.

ఇట్టి యాశ్చర్యమగు ప్రశ్న యడిగినందున నారదుడు తాను వచ్చినపని పూర్తియైనదనియే భావించి సంతోషించి యిట్లనియె: "వాల్మీకీ! నీవు మునిశ్రేష్ఠుఁడవు. ఇట్టి పురుషోత్తమునిగూర్చిన సంగతి వినుటకు నీవే తగినవాఁడవు. నాకుఁదెలిసినంతవఱకు చెప్పెదను. నీ వడిగినప్రశ్న కఠినమైనది. సకల కల్యాణగుణ పరిపూర్ణుఁడు భగవంతుఁడే. మానవులలో నట్టివాఁ డెవఁ డంటివి. చెప్పెదను వినుమా. ఇక్ష్వాకువంశమునఁ బుట్టిన శ్రీరామచంద్రుఁడే నీవడిగిన మానవోత్తముఁడు. పురుషోత్తముఁడు మానవోత్తముఁడుగ నవతరించియున్నాడు. అతఁడు సాముద్రికశాస్త్రములోఁ జెప్పఁబడిన సకల శుభచిహ్నముల తోఁగూడిన శరీరముగలవాఁడు. సకల ధర్మముల నాచరించుటలో నద్వితీయుఁడు. సకల ప్రాణికోటిని రక్షించువాఁడు. అతఁడు సర్వజ్ఞుఁడు, సర్వశక్తుఁడు. వేయేల, మానవాకారమునఁ దోఁచు పరబ్రహ్మ మతఁడే. అట్టి శ్రీరామునిచరిత్రము సంగ్రహముగఁ జెప్పెదను. నీ కతని చరిత్రములో నొక్కొక్క రహస్య విషయముగూడ కరతలామలక మగును. నీవీ కార్యముచేసి తరించుటేగాక లోకులఁ దరింపఁజేయుదు వని నియమించి వెడలిపోయెను. ఇచ్చట గురువెట్టివాఁడు, శిష్యుడెట్టివాఁడు, వారిరువురకుఁగల పరస్పర భక్తివాత్సల్యము లెట్టివియని యాలోచింపవలెను. లోకమున శిష్యుఁ డాచార్యులకడకేగి బహువిధముల శుశ్రూషనుచేసి గురువుల దయను సంపాదించి యుపదేశముపొందుట సహజము. 'నారందదాతి' నారమనఁగా జ్ఞానము. దాని నిచ్చువాఁడు ఇచ్చట జ్ఞానదాతయని పేరుగల దేవర్షి నారదుఁడు శిష్యుని

వెదకుచువచ్చుట యాశ్చర్యమె. ఇది విశేషధర్మము. ఎట్లు? తండ్రిమాట పాటించి శ్రీరాముఁడు కీర్తిపొందెను. ప్రహ్లాదుఁడు తండ్రిమాటలు జవదాటుటచేఁ గీర్తియు, ముక్తియుఁ బొందెను. ఇందుకు ప్రహ్లాదుని వచనమేసాక్షి. ఎట్టివాఁడు తండ్రి? 'తండ్రి హరిఁజేరుమనియెడి తండ్రి తండ్రి! భగవంతుని చేరుమనువాఁడు దండ్రిగాని భగవంతుని దూషించి యతని స్మరింపఁగూడదని పడరానిపాట్లు పెట్టించువాఁడు తండ్రియా? స్వధర్మమును బోఁగొట్టుకొని తనకుఁ గలుగవలసిన గీర్తి ప్రతిష్ఠలు పోగొట్టుకొనెను. ప్రహ్లాదుని ధర్మము సామాన్యధర్మముగాదు. విశేషధర్మము. అట్లే నారదులవారు వాల్మీకి వద్దకు వచ్చుటయు విశేషధర్మము ననుసరించినదేయగును. శిష్యునకు గురునిపట్ల నీవే బోధింపఁగలవను బూర్ణమగు విశ్వాస ముండవలెను. గురువునకు శిష్యునియందు నీవే యిట్టి యుపదేశముపొంద నర్హుఁడవను నమ్మకముండవలెను. గురుశిష్యుల పట్ల నిట్టి పరస్పర విశ్వాసము లేనియెడ నెట్టి యుపదేశమును సఫలము గానేరదు.

ఇట్లు నారదుఁడుపోయినతర్వాత వాల్మీకి తన శిష్యుఁడగు భరద్వాజునిఁగూడి తమసానదికి మాధ్యాహ్నిక స్నానమునకై పోయెను. ఆ స్వచ్ఛమైన నీటిని చూడఁగా నానందమొంది వాల్మీకి భరద్వాజా! చూచితే యీ నీరము సత్పురుషుని మనమువలె నిర్మలముగనున్న దనెను. గొప్పవారేవస్తువును జూచినను గొప్పభావములనే పొందుదురని తెల్లముగుచున్నది. శిష్యునివద్ద వల్కలమును దీసికొని ప్రకృతిసౌందర్యముఁ జూచి యాశ్చర్యపడుచుండఁగా నొకచోట రెండు

కొంచెపిట్టలు భార్యాభర్తలు మోహపరవశమున నానందించుచుండఁగా నొక బోయవాఁడు మును లుండుటయైనను జూడక మగపక్షిని బాణముతోఁ గొట్టెను. అది క్రిందపడి నెత్తుటిలోఁ దేలుచుండగా నాడుపక్షి విలపించుచుండెను. దానిం జూచి కడు జాలినొంది వాల్మీకి యాబోయవానిని శపించెను. కాని మరల నేనేల యోపికలేక శపించితినని తనలో తా ననుకొనుచు స్నానముచేసి యాశ్రమముసేరి యాహ్నికముల ముగించి శిష్యునిఁగూడి తననోట వెడలిన శాపవచనములొక శ్లోకరూపముగనున్నందు కాశ్చర్యపడుచుండెను. ఇంతలో బ్రహ్మదేవుఁడచ్చటికివచ్చెను. వాల్మీకి బ్రహ్మకుఁ దగినవిధమునఁ బూజలు గావించి వినయముతో నుండఁగా బ్రహ్మ యతనిఁ జూచి “వాల్మీకీ! నేను సరస్వతిని నీ నాలుకయందుండి యట్లు పలికింపుమంటిని. నీనోట వెడలినది శోకమునవచ్చినమాటలైనను శ్లోకరూపమున నున్నవి. అందు మంగళమగు అర్థమునుండుటచే దానినే మంగళశ్లోకముగ నుపయోగించి నీవు రామచరితము వ్రాయు” మని చెప్పి యంతర్ధానమయ్యెను.

వాల్మీకిమహర్షి తాను చిత్రకూటప్రాంతముననున్నతటి తనయాశ్రమంబున కరుదెంచిన సీతారామలక్ష్మణుల నమస్కృతుల నందిననాఁటినుండి వారి దివ్యగుణముల ననవరతము చింతించుచుండినందున నారదుని దాను ప్రశ్నించునపుడే తన మనసులోని భావము గురూపదేశముగఁ బొంద నెంచెను. కనుక నారదుఁడు బోధించినట్లు బ్రహ్మ నియోగించినరీతిని శ్రీరామచరిత్రము వ్రాయనెంచి యాచమించి సుఖాసీనుఁడై శ్రీమద్రామాయణము రచింప నారంభించెను. శ్రీరామున

కుఁ బట్టాభిషేకమైనతరువాత శ్రీమద్రామాయణము వ్రాసెను. కారణాంతరములచే రాముడు సీతను వనమున విడిచివచ్చున ట్లాజ్ఞాపింప నిండు చూలాలగు వదినెను విధిలేక వాల్మీక్యాశ్రమప్రాంతమున లక్ష్మణుఁడు వదలివచ్చెను. మహర్షి సీతా దేవిని తన యాశ్రమంబున రక్షించుచుండ నొక శుభదినమునఁ గుశలవులనెడు కవ లుద్భవించిరి. మహర్షి వారికి జాతకర్మో పనయనాదులుచేసి వేదాధ్యయనము చేయించుచు శ్రీమద్రా మాయణమును వారి కధ్యయనముచేయించి వారిచే గానము చేయించుచుండెను. ఇట్లుండ నొకనాఁడా బాలురు శ్రీరాముని కొలువుకూటముననే శ్రీరామాయణమును గానమొనర్చిరి. శ్రీరామచంద్రుఁడే సింహాసనము దిగివచ్చి మహానుభావురా లగు సీతయొక్క చరిత్రమును వినుఁడు సకలశుభంబులుఁగలుగు నని సభికులతోఁ జెప్పెను. ఈవిధముగ శ్రీమద్రామాయణము నవరసభరితమై వీణాదివాద్యముల సప్తస్వరముల ననుసరించి పాడుటకనువై చదువుటకై సర్వజనమనోహరమై యుండె ను. మహర్షి గాయత్రీమంత్రములోని 24 అక్షరములకు 24,000 శ్లోకములతో వేదోపబృంహణమగు శ్రీమద్రామా యణ మను మహాకావ్యమును రచించి యాచంద్రార్కము లోకమున కుపకారముచేసి యితర కవులకు మార్గదర్శి యయ్యెను.

# 2. అవతారము

పుణ్యభూమియగు భరతఖండంబున గంగానది కుత్తరమునఁ గోసలదేశముగలదు. అది సరయూనదితోఁగూడి సస్యశ్యామలమై యుండెను. దాని కయోధ్య రాజధాని. ఆ నగరము సూర్యవంశరాజగు మనువుచే నిర్మింపఁబడినది. అది బలమగుకోటలు, ప్రాకారములు, అగడ్తలు, ఫిరంగులాదిగాఁ గల యుద్ధపరికరములతోనిండి శత్రువులకజేయమై యయోధ్య యను సార్థకనామముతో వెలయుచుండెను. విశాలమగు వీధులతోడను నున్నతభవనములతోడను రమ్యమగు నుద్యానవనములఁగూడి రథగజతురగ పదాతులు గలిగి జనసమ్మర్దమై దేవేంద్రుని యమరావతివలె విరాజిల్లుచుండెను. దానిని ఇక్ష్వాకువంశజుఁడగు దశరథమహారాజు పాలించుచుండెను. అతఁడు దేవతలకు సాయమొనర్చి యవక్రపరాక్రమంబుగలిగి దేవేంద్రునివలెను, నైశ్వర్యంబునఁ గుబేరునివలెను ముల్లోకంబులఁ గీర్తి వహించియుండెను. అతఁడు సకల సద్గుణంబులు గలిగి తండ్రివలె నాదరంబునఁ బాలించినందునఁ బ్రజ లతని వేనోళ్ళఁ బొగడుచుండిరి. అతనికి సుమంత్రాదు లెనమండ్రు మంత్రులుండిరి. వసిష్ఠమహర్షి యతని పురోహితుఁడు. వామదేవాదులు వసిష్ఠుని ముందిడుకొని రాజునకు సకలధర్మంబులు సెప్పుచుండిరి. పన్నులు మితముగ విధింపఁబడినవి. న్యాయవిచారణ సక్రమంబుగ జరుగుచుండె. నేరమునకుం దగిన దండన విధింపఁబడుచుండె. ప్రజలు రాజును దేవతగఁ బూజించిరి.

ఎన్నియున్న నేమి? పుత్రసంతానములేమి దశరథున కొకకొఱత. *[వసిష్ఠు ననుమతంబున దశరథుఁడు అంజనాద్రియనంబడు వేంకటాచలమునఁ దపస్సుచేసె. శ్రీనివాసుఁ డతనికి ప్రత్యక్షమయ్యెను. రాజద్దేవున కత్యంత ప్రియంబగు వరాహపురాణములోని నాలుగు శ్లోకములతోఁ బొగడినందున నద్దేవుఁడు ప్రసన్నుఁడై నీవు నన్ను నాల్గుశ్లోకములతోఁ గీర్తించినందున నీకు నలుగురుపుత్రు లుద్భవింతురని యనుగ్రహించె.] అంత దశరథుఁడు నిజపురంబున కేగి వసిష్ఠునియానతి చొప్పున ఋశ్యశృంగమహర్షిని గొనితేర నరిగె.

* (వరాహపురాణాంతర్గతవిషయము)

## ఋ శ్య శృం గు డు.

---

విభండకుఁడను ఋషిపుత్రుఁడు ఋశ్యశృంగుఁడు. అతఁడు శైశవమునుండి తండ్రినిమాత్రము చూచినవాఁడు. స్త్రీయన నెట్టిదో తెలియనివాఁడు. చంపకానగరరాజగు రోమపాదుఁడు దనరాజ్యమున ననావృష్టి తొలఁగుటనిమిత్తము బ్రాహ్మణులమాటవిని ఋశ్యశృంగుని తోడ్కొనివచ్చుటకై వేశ్యల నంపెను. వారెట్లో మాయోపాయముచే నతని తోడుకొనివచ్చిరి. రోమపాదుఁడతని యుక్తవిధమునఁబూజించి తన కూఁతురగు శాంతనిచ్చి వివాహముచేసి తనయింటఁబెట్టుకొనెను. దశరథుఁడు సనత్కుమారుని వచనమని చెప్పిన సుమంత్రునిమాటచొప్పున వసిష్ఠు ననుమతంబున ముగ్గురు భార్యలతోను సుమంత్రాదులతోను బరివారసమేతుఁడై రోమపాదుని నగరముచేరఁగా నారాజు తన కత్యంతాప్తుఁడగు దశరథుని

సపరివారముగ ననేకవిధుల సత్కరించెను. కొన్ని దినములు ఋశ్యశృంగుని పరిచయముపొంది రోమపాదుని సమ్మతంబున శాంతాసమేతుండైన ఋశ్యశృంగు నయోధ్యకుఁ గొని తెచ్చి యథావిధి సత్కరించె. కొన్ని దినములు గడువ పుత్రకామేష్టి చేయవలెనను కోరిక యమ్మునికిం దెలిపి యతని యధ్వర్యమున వసిష్ఠాదులచే యజ్ఞము యథావిధిఁ జేయనెంచె.

ఇట్లుండ దేవతలు బ్రహ్మదేవునియొద్దకేగి లోకకంటకుండగు రావణుని దండగములు సహింప వీలుగాదు. వాఁడు మీ రిచ్చిన వరగర్వముచేఁ గన్నుగానక దేవేంద్రుని పాఱఁ ద్రోల నెంచియున్నాఁడు. దేవ ఋషిగణంబుల కాతని హింస సహింపరానిది. నీ వేయుపాయముతోనైన నతని వధించుట లోకోపకారమనిరి. బ్రహ్మ యోచించి "యిందుల కుపాయమున్నది. రావణుఁ డహంకారపూరితుండై మానవులచే మరణము గలుగరాదని యడుగలేదు" అనెను. అంత దేవతలు బ్రహ్మతో విష్ణుదేవునొద్ద కరిగిరి. బ్రహ్మదేవుఁడు పీతాంబరధారియు, శంఖ చక్ర వనమాలా విభూషితుండునగు శ్రీమన్నారాయణుని స్తుతియించి "దేవా! లోకకంటకుఁడగు రావణుని భయముచే సూర్యుఁడు చల్లఁబడిపోయెను. వాయుదేవుఁడు నిశ్చలుఁడైయున్నవాఁడు. సముద్రుఁ డలలులేక స్తబ్ధుఁడయ్యె. ఇంద్రుఁడు పదచ్యుతుఁడు గానున్నాడు. దేవ ఋషి సంఘములు దల్లడిల్లుచున్నవి. లోకహితార్థము నాలుగంశములతో మానవావతారమెత్తి రావణసంహారముచేసి ధర్మసంస్థాపనము చేయఁగోరుచున్నామ"నెను. శ్రీహరి వల్లెయని దశరథుని ముప్పురు భార్యలందు నల్గురుపుత్రులుగ నవత

రింప సంకల్పించెను. దేవతలు సంతసించి తమతమ నెలవు లకు వెళ్ళిరి.

అయోధ్యాపురము వెలుపల యజ్ఞవేదికల నేర్పరచి సకల సంభారములు సమకూర్చి దశరథుఁడు హయమేధము నకుం దొడంగె. అన్నివర్ణములవారి కాబాలగోపాలము నిరంతర మన్నదానము, వస్త్రదానము విరివిగఁ జేసి హయమేధము పూర్తిచేసి దశరథుఁడు ఋశ్యశృంగమహర్షిని పుత్రకామేష్టి చేయఁ బ్రార్థింప నమ్మునిసంతసించి "ఓ రాజా! నీకు నలుగురు పుత్రు లుద్భవింతురని చెప్పి మంత్రయుక్తముగ హోమము చేసెను. అగ్నికుండమునుండి యసమానకాంతితో, నలుపు ఎఱుపుకలిసిన వస్త్రము ధరించి, రక్తవర్ణమగు ముఖముగలిగి దుంధుభివాద్యమువంటి గంభీర కంఠస్వరముతో, సింహము రోమమువంటి కేశములుగలిగి, సకలశుభలక్షణములతోఁగూడి దివ్యాభరణములుగలిగి పర్వతమువలె నున్నతమై, మదించిన వ్యాఘ్రమువంటి పరాక్రమముగలిగి, సూర్యునివంటికాంతితో నగ్నివలె మెఱయుచు నొక మహాపురుషుఁడు పుటము వేసిన బంగారుతో చేయఁబడి వెండిమూతఁగలిగి దేవనిర్మితంబగు పాయసముతోఁగూడిన యొకపాత్రమును ఇష్టురాలగు భార్యవలె భుజమున ధరించి యుద్భవించెను. అతఁడు దశరథునిఁజూచి, "ఓ రాజా! నేను ప్రాజాపత్యపురుషుండను. నీ యజ్ఞముచేఁ దృప్తులై దేవత లీ పుత్రోత్పత్తికరంబగు పాయసము నంపిరి. దీనిచే నీకు శుభముగలుగును. దీనిని గ్రహింపుము. కులగుణ శీలములందు నీకుందగినవారలగు నీభార్యల కీపాయసము నిమ్ము. వారలవలన నీవుకోరినట్టి పుత్రు లుద్భవింతురని చెప్పఁగా

రాజు సంతోషించి భక్తితో నాపాత్రము గ్రహించి తనభార్య లగు కౌసల్య, సుమిత్ర, కైకేయీలకీరీతి పంచెను. కౌసల్యకు సగము, మిగిలిన సగములో సగము సుమిత్రకు, ఆ మిగిలిన సగములో సగము కైకేయికి, మిగిలినది మరల సుమిత్ర కిచ్చెను. (అనఁగా కౌసల్యకు $\frac{1}{2}$, సుమిత్రకు $\frac{3}{8}$, కైకేయికి $\frac{1}{8}$.) పాయసవిభాగములోని భేదము వారివారివయసుల ననుసరించినది. ప్రీతిననుసరించినదిగాదు. ఈవిభాగమువలన రాముఁడు విష్ణువులో నర్ధాంశము, లక్ష్మణుఁడు పాదాంశము, భరత శత్రుఘ్నులు అష్టమాంశములని తెల్లమగుచున్నది.

పాయసపాత్ర బంగారుతోఁ జేయఁబడియుండ మూత వెండిగ నుండనేల యను సంశయము గలుగవచ్చును. స్వర్ణకాంతి పసుపు. అది ఎఱుపువలె రజోగుణచిహ్నము. రామచంద్రుఁడు రజోగుణయుక్తమగు కార్యములు మానవభావము ననుసరించి చేసినను ప్రతివిషయముననుసత్వగుణమే ప్రధానముగ వెలసెను. సత్వగుణము తెలుపువర్ణముచే సూచితము. అందుచే శ్వేతవర్ణమగు వెండిమూతయుండినదని యూహింపనగును.

ఇఁక పాయసవిభాగము వయసు ననుసరించిన దంటిమి. అట్లయిన భరతుఁ డెట్లు లక్ష్మణ శత్రుఘ్నులకంటెఁ బెద్దవాఁ డయ్యెనను శంక రావచ్చును. కౌసల్య తనకిచ్చిన సగముభాగమును త్రాగెను. సుమిత్ర తనకు లభించిన పాతికభాగమును త్రాగక కైక కెంతభాగము లభించునో యని యున్నకుండెను. దీనిని గుర్తించిన దశరథుఁడు మిగిలినదానిలోసగము కైకేయి కిచ్చి శేషించిన యష్టమాంశమును మరల సుమిత్ర కిచ్చెను.

ఆ సెయిుం దొలుత లభించిన పాయసభాగమును ద్రాగి మరల నష్టమాంశమును ద్రాగినందున భరత లక్ష్మణ శత్రుఘ్నుల జననక్రమం బేర్పడిన ట్లూహింపఁదగును. భరతుఁడు సాక్షా ద్విష్ణువులో నాలవయంశమనుట దెట్లు పొసఁగుసని యాక్షే పము రావచ్చును. సాక్షాద్విష్ణువులో ననఁగా నిప్పుడు ప్రత్య క్షమగు రామరూపుఁడగు విష్ణువునందని యర్థము గ్రహింప నగును.

ఈ రీతి పాయస విభాగముచేసి కౌసల్యా సుమిత్రా కైకేయీ లానందముతో నాపాయసము స్వీకరించిన వెనుకఁ గ్రమముగ నలువురు నసాధారణమగు గర్భములుధరించి దివ్య మగు కాంతితో దశరథున కానందముగలిగించిరి. అట బ్రహ్మ దేవుని యానతి-చొప్పున దేవతలు దమతమ యంశములతో రాక్షసుల మాయలకు బలమునకుఁ బరాక్రమంబునకుఁ దగిన రీతి నానావిధరూపులగు వానరులుగను, భల్లూకములుగను పర్వత వన నదీ ప్రాంతముల నసంఖ్యాకములుగ నవతరించిరి. ఇంద్రసుతుఁడగు వాలిని కిష్కింధానగరమున రాజుగను, సూర్యునిపుత్రుఁడగు సుగ్రీవుని యువరాజుగను, బుద్ధిమంతుఁ డును బలవంతుఁడు నగు హనుమంతుని, నీలుని, నలుని మం త్రులుగను గొని వానరులు స్వేచ్ఛగ నుండిరి. ఇంతకుఁబూ ర్వమె బ్రహ్మ యావులింపఁగ నతని నోటినుండి జాంబవంతుఁ డను నెలుగుబంటి మేటి పుట్టియుండెను. ఇట్లు భగవంతుఁ డవత రించుటకు మున్నే జరుగనున్న రావణ వధకు రాముని సహా యార్థము గావలసిన సన్నాహము లేర్పడియుండెను.

---

## అ వ తా ర ము .

యజ్ఞము ముగిసిననాఁటినుండి పండ్రెండవమాసమున శ్రీరామాదుల జననము. ఆ కాల మెద్దియని విచారింతము. కృత, త్రేత, ద్వాపర, కలి యుగములు నాలుగు. ఈనాల్గింటి మొత్తమొక మహాయుగమగును. డెబ్బదియొక్క మహాయుగము లొక మన్వంతరము. ఇట్టి మన్వంతరము లాఱు గడచినవి. ఇప్పు డేడవదియగు వైవస్వతమన్వంతరము జరుగుచున్నది. ఈ మన్వంతరమున నైదవమహాయుగమునఁ గడచిన త్రేతా యుగమున నాల్గవభాగమున ముప్పది వేల సంవత్సరము లుండు తఱి విలంబినామ సంవత్సర చైత్ర శుద్ధ నవమీ బుధవారము మధ్యాహ్నము కర్కాటక లగ్నంబునఁ బునర్వసు నక్షత్రంబున గురుచంద్రయోగమున నైదుగ్రహము లుచ్చస్థితియందుండఁగా కౌసల్యాదేవి రామునిం గనియె. జన్మనక్షత్రము పునర్వసు.

| | | | |
|---|---|---|---|
| శబు | ర | | |
| కే | రాశి | | గు చ/ల |
| కు | | | రా |
| | | శ | |

నాల్గవపాదము. కైకయి దశమితిథియందు పుష్యమీనక్షత్ర మున మీనలగ్నమందు భరతునిఁ గనెను. సుమిత్ర దశమి

యుఁడే యాశ్లేషానక్షత్రమునఁ గటకలగ్నమునందు లక్ష్మణ శత్రుఘ్నులం గనెను. శ్రీమన్నారాయణుని యంశంబుల జనించిన నా శిశువులు తేజఃపుంజములై వెలసిరి. కౌసల్యాది తల్లులును దేవేంద్రునిఁ గన్న యదితివలె మిక్కిలియుఁ బ్రకాశించిరి. ఈ నలువురు శిశువులు పూర్వాభాద్ర ఉత్తరాభాద్రలవలె జ్వలించుచుండిరి. ఆ జననసమయమున దేవదుందుభులు మ్రోగినవి; పుష్పవర్షము గురిసెను. దశరథుఁడు దగినవారి కనేకవిధ దానములిచ్చెను. అయోధ్యానగరము శుభవార్తతో యానందసాగరమున మునింగియుండెను.

## నా మ క ర ణ ము.

సాధారణముగ బ్రాహ్మణులకుఁ బురుడుదినములు పది. పదునొకండవదినము పుణ్యాహవాచనము నామకరణము జరుగును. క్షత్రియులకుఁ బురుడుదినములు పండ్రెండు. పదుమూఁడవదినము నామకరణము. వాల్మీకి పదునొకండు దినములు గడువఁగా నామకరణముజరిగె ననెను. అనఁగా లక్ష్మణుఁడు జనించిననాటినుండి పదునొకండు దినములు గడువఁగా లేక రామావతారదినమునుండి పండ్రెండు దినములు గడువఁగాఁ బదుమూఁడవ దినమని యర్థము. త్రికాలజ్ఞుఁడగు వసిష్ఠమహర్షి కౌసల్యానందనునకు శ్రీరాముఁడనియుఁ, గైకేయీతనయునకు భరతుఁడనియు, సుమిత్రాపుత్రులకు లక్ష్మణుఁడు శత్రుఘ్నుఁడని నామకరణము చేసెను. ఇందలి యౌచిత్యమును వివరింతము. సకల శుభగుణములుగలిగి యెల్లర నెల్లవేళల సంతోషింపఁ జేయువాఁడును, బురుషులను సైతము

మోహింపఁజేయువాఁడును, యోగులమనసు నాకర్షించువాఁడును నగు కౌసల్యాతనయునకు రాముఁడని నామమిడుట సర్వవిధముల నొప్పియున్నది. శ్రీరాముని సేవయే తనకు సంపదయని భావించి యెడతెగక నాతని సేవచేయ నవతరించినవాఁడగుట సుమిత్రానందనులలోఁ బెద్దవానికి లక్ష్మణుఁడని పేరిడుటయు యుక్తమే. ఇంతేగాక లక్ష్మణుఁడు శేషాంశమునఁ బుట్టినవాఁడు. క్షీరసముద్రమున నుండునపుడు శేషుఁడు శయ్యగను, వైకుంఠమున సింహాసనముగను, విష్ణుదేవుఁడు బయలుదేరునపుడు గొడుగునై సేవచేయునట్టివాఁడు, వేయేల యాదిశేషుఁడన మొదటిసేవకుఁడని యర్థము. వైకుంఠమునఁగాని యవతారదశయందుగాని హరిసేవ తప్పనివాఁడు. కనుక రామావతారమున లక్ష్మణుఁడుగ నవతరించెను. అట్లు భగవంతుని సేవయే సంపదగ నెంచినవానికి నా నామము సార్థక మగునని వేఱుగఁ జెప్పనేల? శ్రీరామ భక్తిభరితుఁడై రాముని వనవాసకాలమున రాజ్యభారము మోయఁబోవువాఁడు గనుక కైకేయీపుత్రుని భరతుఁడనుటయు సమంజసమే. నిత్యశత్రువు లయిన కామక్రోధాదులకు లొంగక వానిని జయించి రాముని భక్తుఁడగు భరతుని మహాభాగవతుని సేవించుట తనకు త్తమ ధర్మమని భావించి యెట్టి శత్రువునైనను జయింపఁగలవాఁడగుటచే శత్రుఘ్నుఁ డను నామము సుమిత్రానందనులలో ద్వితీయునకుఁ బెట్టుట యుక్తమే.

పుష్పమునకు వికసించునప్పుడే పరిమళము గలుగును. తులసిచెట్టునకుఁ బుట్టినప్పటినుండి సువాసన గలదు. అట్లే లక్ష్మణునకు బాల్యమునుండియు శ్రీరామునియెడ నత్యంత భక్తి. ఒకక్షణమైనను రాముని విడిచియుండడు. ఇఁక రాముఁ డెట్టివాఁడు ? కౌసల్యాదేవి బంగారుగిన్నెలో మంచియన్నము గలిపి రామునినోటవేయవలెనన్న ముందుగ లక్ష్మణునకుఁ బెట్టినఁగాని వీలుగాదు. ఈకాలమున విద్యుద్దీపములు వెలిగించవలెనన్న దీపమువద్ద పోయి చేయువలసిన దేమియు లేదు గదా. గోడలోని సాధనమును నొక్కిన దీపము వెలుఁగును. అట్లే రాముఁడు తినవలెననిన్ను, వస్త్రములు ధరింపవలెనని నను నిద్రింపవలెనిననను లక్ష్మణునిచే మున్ముందుగఁ జేయించు టే సుకరమార్గము. వేయేల రాముని వెలుపలిప్రాణమే లక్ష్మణుఁడు. లక్ష్మికిని విష్ణువునకును గల యవినాభావసంబంధమే లక్ష్మణునకును రామునకును గల సంబంధము. ఈ విషయము రానురాను స్పష్టమగును. ఇట్లే భరతునకును శత్రుఘ్నునకును గల సంబంధము. రామలక్ష్మణభరతశత్రుఘ్నులు వేదవేదాంగములను సకలశాస్త్రముల నభ్యసించిరి. క్షత్రియులగుటచే వీరు రథగజతురగారోహణములును ధనుర్వేదమును జక్కగ నభ్యసించిరి. వీరిని వసిష్ఠాది పురోహితులును సుమంత్రాది మంత్రులును బౌరులును స్త్రీపురుషు లెల్లరు మెచ్చుకొనుచుండిరి. వీరికి వివాహము చేయువలెనని దశరథుఁ డాలోచించుచుండెను. వీరిలో రాముఁడు దశరథునిప్రాణమే యనవలెను. రాముని గుణగణములను బొగడనివారు లేరు.

# 3. విశ్వామిత్రుని యజ్ఞము

ఇంతకు ముందు శ్రీరాముని జననకారణము వివరించితిమి. ఇఁక నతని యవతారమువలని ఫలములు వివరింపఁబడును. వ్యవసాయదారుఁడు భూమిని చక్కఁబెట్టి విత్తనము చల్లును. చేసినపైరు నాశనముగాకుండునట్లు కలుపుదీయును. అట్లే సాధువుల రక్షింపనెంచు భగవంతుఁడు దుష్టుల సంహరింపక తప్పదు. ఇట్టి లోకోపకారకార్యము చేయఁబూనిన శ్రీరామునకుఁ దనవలన సహాయముండవలెననియు, రాఁబోవు రావణాదుల వధకుఁ గావలసిన యస్త్రశస్త్రములఁ బ్రయోగోపసంహారములు రామునకు నేర్పవలెననియు, భగవంతుని మహాత్మ్యమునఁదాను గొంత పంచుకొనవలెననియు, అనేకోద్దేశములతో విశ్వామిత్రుఁడు దశరథు నొద్దకు వచ్చెను. అతని యాగమనవార్త వినినంతనే దశరథుఁడు పురోహితసహితుఁడై యెదురేగి యర్ఘ్యపాద్యాదులొసఁగి యుచితాసనమున గూర్చుండఁబెట్టి మిక్కిలి వినయముతోఁ బ్రమొక్కి కుశలమడిగెను. విశ్వామిత్రుఁడును దశరథుని యోగక్షేమములడిగి రాజ్యపాలనఁ జక్కఁగ నెరవేఱుచున్నదా యని ప్రశ్నించెను.

అంత దశరథుఁడు వినయముతో నిట్లనెను. 'బ్రహ్మర్షీ! అచింతితమగు మీరాకచే నాగృహము పావనమయ్యె. కుమారుల వివాహమునుగూర్చి ప్రశంసించుతఱి యరుదెంచిన తమరాక యమృతము లభించునట్లున్నది. అనావృష్టితో బాధపడువారికి కుంభవృష్టిగ వానగురిసినట్లును, మరణించిన యాప్తులు లేచివచ్చిన ట్లున్నది. బిడ్డలులేనివారికి పుత్రజననమట్లున్నది. ధారవోయినఁబెన్నిధిమరల దొరికినట్లున్నది. నా

జన్మము తరించినది. క్షత్రియకులంబునఁ బుట్టి బ్రహ్మర్షియైన మీమహిమ నేమని కొనియాడఁగలను? సృష్టికిఁ బ్రతిసృష్టి చేయఁగల తమకు నాచేఁగావలసిన దేమియుండును? కేవలము నాకు శుభముగలిగించుటనిమిత్తమే మీ రిచ్చటికి కేతెంచితిరి. ప్రపంచమున మీకు సాటియగు పుణ్యమూర్తులు లేరు. ఏ యుద్దేశముతో నిట కేతెంచితిరో దెలిపినంతనే తప్పక యిచ్చి ధన్యుండ నగుదును, సెలవిండని ప్రార్థించె. అంత విశ్వామిత్రుఁ డిట్లు చెప్పెను "దశరథా! నీ వంశమునకుం దగినరీతిని పలికితివి, సంతసించితిని. నేనొక యజ్ఞము చేయ దీక్షఁగొంటిని. సుబాహు మారీచులను రాక్షసులు రక్తమాంసములు వర్షించి యజ్ఞమునాశ మొనరుచు. యజ్ఞము చేయుతఱి శపింపరాదు. నా యజ్ఞమురక్షింప నీలమేఘశ్యాముడును కాకపక్షములుగలవాఁడును మహాశూరుఁడు నగు నీ జ్యేష్ఠకుమారుని రాముని నా వెంటఁ బంపుము. బాలుఁడనియు రాక్షసులతో యుద్ధము చేయలేఁడనియు భావింపకుము అతని మహిమ పరాక్రమము నాకును వసిష్ఠునకును నిచ్చటనున్న మునులకును దెలియును. యోచింపక పంపు మనెను. పిడుగువంటి ఋషి వాక్యము విన్నంతనే దశరథుఁడు గడగడ వడఁకెను. కొన్ని నిముసములు మూర్ఛిల్లి మరలఁదెలివినొంది యిట్లనియె. "మునిసత్తమా! రాముఁడు పదునాఱేండ్లు గానివాఁడు. తామర రేకులవంటి కన్నులు సూర్యాస్తమయమైనంత నిద్రించును. రాత్రించరులును మాయావులును మహాక్రూరులు నగు రాక్షసులతో యుద్ధముచేయు నేర్పు లేనివాఁడు. లేక లేక పుట్టినవాఁడు. నా ప్రాణమే రాముఁడు. వాఁడు లేక యొక క్షణమైనను బ్రతుకు

వాఁడనుగాను. దేవతలకు సాయమొనర్చిన నేను నా చతు రంగ బలముతో వత్తును. రాముని మాత్రము పంపునట్లు గోర కున్న నాకుఁ బ్రాణదానము చేసినవాఁడ వగుదువు. పుత్ర కామేష్టి చేయఁగాఁ బుత్రోత్పత్తికరంబగు పాయసమిచ్చి సంతా నము గలిగించినవాఁడు దయాసముద్రుఁడగు దేవుఁడే. ఇప్పుడు రాముని యడుగక వాని ప్రాణముగా పాడి యందువలన నాప్రాణ మును సంరక్షింపఁగల నీవే నాపాలిటి యిప్పటిదేవుఁడవు.

అని యీరీతిని కేవలము పామరుఁడై పుత్రవాత్సల్యముచే, వచ్చినవాఁ డెవఁడని యోచింపక, యాడినమాట తప్పరాదని యెంచక, కులగౌరవము నేని లెక్కింపక. పశుప్రీతినే పాటించిన దశరథునిఁజూచి ఋషి మిక్కిలి కోపించి 'ఓ రాజా! హరిశ్చంద్రుని వంశమునఁబుట్టినవాఁడవు మాటతప్పవు కోరినదాని నిత్తువని నీగుణ మిట్టిదని తెలియక యడిగితిని. నీవు నీ పుత్రులతోడను బంధువులతోడను సుఖముగ నుండుము. నేను వచ్చినదారినే పోయెద" నని బయలుదేరెను. ఇఁక నూరకుండిన రాజవంశ మునకే ముప్పుతప్పదని యెంచి వసిష్ఠుఁడు లేచి యిట్లనెను. "రాజా! ఆడితప్పని యిక్ష్వాకువంశమునఁబుట్టి యిచ్చెద నని లేదంటువా? నీవు సత్యసంధుఁడవే, దాతవే, ధైర్యముగలవాఁ డవే, బుద్ధిమంతుఁడవే, యిట్టి నీకు మాటతప్పుట పాడిగాదు. రాముని మునివెంటఁ బంపుము. విశ్వామిత్రుఁ డెట్టివాఁ డను కొంటివి? తపోబలముగలవాఁడు. ముల్లోకములలో నతనియం తటి ధార్మికుఁడు లేడు. వీరులలో మేటి, సకలాస్త్రశస్త్రములు నేర్చినవాఁడు. రామునిమహిమఁదెలిసి యతనికి నేకె శుభము లొనగూర్ప వచ్చినవాఁడు. దేవలోకమున నగ్నిచక్రముచే

రక్షింపఁబడుచున్న యమృతకలశమువలె విశ్వామిత్రుని రక్షణలోనున్న రామున కెవ్వరు నెట్టియాపదయుఁ గలిగింపలేరు. నిర్భయముగ నిండుమనంబుతో శీఘ్రమున రాముని బంపుము.

అంత దశరథుఁడు కుదుటఁబడిన మనసుగలవాఁడై రాముని పిలువనంపి కౌసల్యయుఁ దానును రామునికి మంగళాచరణములు గావించి శిరము మూర్కొని పంపెను. రామచంద్రుఁడు విల్లునమ్ములుపూని సంతోషముతోఁ దల్లిదండ్రులకు వసిష్ఠాదులకు నమస్కరించి వారి యాశీర్వచనములు పొంది బయలుదేర, లక్ష్మణుఁడును ధనుర్బాణ తూణీరములతో నన్న వెంటఁబోయెను. విశ్వామిత్రుఁడు ప్రసన్నుఁడై దశరథుని మునులను వీడ్కొని రామలక్ష్మణులతో బయలువెడలెను. వారు సరయూనదిచేరఁగా విశ్వామిత్రుఁడు మిక్కిలి యాదరముతో "రామా! జలముతీసికొనుము. నీకు బల-అతిబల యను మహామంత్రముల నుపదేశింతును. వీనిని జపించుటచే నీ కాఁకలిదప్పులుగాని దారినడచుటచేఁ గష్టముగాని తోఁపదు. నీవెట్టివారితోనయినను నిర్భయముగ యుద్ధముచేసి గెలుపొందుదువు వేగిరపడు" మనెను. వెంటనే రామలక్ష్మణులు ఋషి వాక్యము పాటించి మంత్రోపదేశము పొందిరి. రామలక్ష్మణులు సరయూతీరమున మహర్షిచే బుజ్జగింపఁబడుచు నా రాత్రి గడపిరి.

తెల్లవాఱఁగా విశ్వామిత్రుఁడు 'కౌసల్యయొక్క సత్పుత్రా! వేకువజామైనది. పురుషశ్రేష్ఠా లెమ్ము. తెల్లవాఱి గావించవలసిన సంధ్యావందనాది దేవకార్యములు చేయవలెనని మేలుకొలిపెను. సాధారణముగ నొక బాలుని పిలుచునపుడు పురు

షులు దండ్రిపేరు వెట్టియు, స్త్రీలు తల్లిపేరు పెట్టియుఁ బిలుచుట వాడుక. ఇచ్చట వ్యతిరిక్తముగనున్నది. కారణ మేమని కొంత యాలోచింతము. దశరథుఁడు విశ్వామిత్రుని దర్శించినపు డాతని మహిమను గొండంతగఁ బొగడి నీవు నాపాలిటి దేవుఁడవే. నాజన్మము తరించినది. నీ వేమికోరిన నిత్తునని వాక్రుచ్చి రాముని తనవెంటఁబనుప నడిగినంతనే నే నీయననెను. కేవల మజ్ఞానములో మునిఁగి దేహవాశముచూపెనేగాని వచ్చినఋషి యొక్క గొప్పదనమునుగాని, తన యాత్మగౌరవమునుగాని వంశప్రతిష్ఠనుగాని పాటింపలేకపోయెను. అందువలన మహర్షి కతనియందు గౌరవభావము లేకపోయెను. అట్లుగాక కౌసల్య కొంచెమేనియు సందేహములేక శ్రీరామునకు రక్షాబంధము గావించి యాశీర్వదించి విశ్వామిత్రునివలన రామచంద్రునకు గొప్ప శుభము గలుగునని పూర్ణవిశ్వాసము గలిగియుండెను. దశరథునకైనను నలుగురు పుత్రులలో నొకఁ డనవచ్చును. కౌసల్య కట్లుకాదుగదా. ఆమె చింతింపక మంచిమనసుతోఁ బంపినందున రాముని మహిమయు నామె యెఱిఁగినట్లు తండ్రి యెఱుఁగలేదు. దశరథునికంటె జ్ఞానవంతురా లగుటచే నామె సుపుత్రుఁడని సంబోధించుట సర్వవిధముల నొప్పియున్నది. రాముఁడు భగవంతుఁడని తెలిసి యేకాంతమునఁ దనివితీర నతని సేవచేసి యానందించ నెంచిన మహర్షి యారీతి మేలుకొలుపుట యుక్తముగనున్నది. “మానవోత్తమా, యనుటచే నీ వాదర్శజీవనము గడుప నవతరించిన పరమాత్మవు. నీ వేమార్గముపట్టిన సామాన్యజను లామార్గమునే యవలంబింతురు. కనుక నీకగత్యముకాకున్నను లోకక్షేమమునకొఱకు వేకువలేచి

దైవకార్యము నిర్వర్తింపుమని చెప్పిన ట్లూహింపవలెను. ప్రాతః కాలకృత్యములఁదీర్చికొని బయలుదేరి సరయూ గంగా సంగమ స్థలముయొక్క రామణీయతఁ గని యానందించి మన్మథుఁడు గర్వముచే శివునివలన ననంగుఁడైన స్థలమునుచూచి యచ్చటి మునులచేఁ బూజలంది యారాత్రి గడిపిరి.

ఉదయమున గంగానదినిదాఁటి మలదకరూశ దేశములఁ జూచి రామచంద్రుఁ డీదేశవృత్తాంత మేమని యడుగ ముని సంతసించియిట్లనియె "తొల్లి దేవేంద్రుఁడు వృత్రాసురుని జంపి బ్రహ్మహత్యాపాపముపోగొట్టుకొనుటకై దేవతలచేతను ఋషులచేతను గంగాజలముననభిషేకింపఁబడెను. అతనిశరీరమునుండి వెలువడిన మలమును, నతని కేర్పడిన యాకలియు నిచ్చటఁ బోయినందున నివి మలదకరూశదేశము లనఁబడెను ఇచ్చటి భూమి చాలసారవంతమై ధనధాన్యసమృద్ధములగు ప్రదేశము లయ్యెను. ఇట్లుండ సుకేతుండను యక్షునకు బ్రహ్మవరమున వేయియేనుంగుల బలముగల తాటకయనునొక కూతురుపుట్టెను. ఆమె సుందుఁడనువాని భార్యయయ్యెను. ఆమెకు మహాపరాక్రమవంతుఁడగు మారీచుఁడు పుట్టెను. సుందు డగస్త్యునిచేఁ జచ్చినందునఁ దాటకయు మారీచుఁడు నగస్త్యుని మ్రింగ బోగా నమ్ముని మారీచుని రాక్షసుఁడవుగమ్మనియుఁ దాటకను ఘోరరూపముదాల్చి మనుష్యుల భక్షింపు మనియు శపించె. అందుచే నామె యీపట్టణముల నాశముచేయఁగా నీ ప్రదేశమిట్టి ఘోరారణ్యమయ్యెను. ఆ రాక్షసి యీ ప్రాంతమున నున్నది. మన మామార్గమునఁబోవలెను. నీవు దానిని స్త్రీ యనిభావించి స్త్రీహత్యయనియు, నందు సంహారక్రియకు మొట్ట

మొదట నబలనువధించుటఁ బాపమనియుఁదలంపకుము. బహు జనులకును మునులకును మృత్యుదేవతగానుండు తాటకను దయఁదలంచక వధింపుము. ఇట్టి మహాపాపాత్మురాండ్రను విష్ణుదేవుఁడు వధించియున్నాఁడని ప్రసిద్ధము.” అంత శ్రీ రాముఁడు వినయముతో “మునీశ్వరా! ఋషివాక్యము పాటించుట ధర్మమని మాతండ్రి చెప్పియున్నాఁడు. నేను పితృవాక్య పాలనావ్రత మనుష్ఠించువాఁడను. మీవలన నాసందియంబులు దీరినవి. కనుక మీయాజ్ఞఁ బాటింతు ననుచుండఁగా భయంకర శబ్దముతో వికృతరూపమున మహాట్టహాసము చేయుచు వచ్చుచున్న తాటకను చూచి రామచంద్రుఁడు “లక్ష్మణా! భయపడకుము. ఇది యాఁడుది, దీని ముక్కు చెవులు గోసిన చాలదా” యనునంతలోఁ దాటక శిలావర్షము గురియించెను. అంత రాముఁడు దాని హస్తములు ఖండించెను, లక్ష్మణుఁడు చెవులుముక్కును గోసివైచె. రక్కసి మాయచే శిలావర్షము గురియించెను. కౌశికుఁడు “రామా! దయదలఁచకుము. మనకు హానిగలుగును. వధింపు” మనఁగానే రాముఁ డొక్క బాణము బొమ్మున నాటినంతనే యది మహావృక్షమువలె నేలఁగూలెను. ఇంద్రాది దేవతలు రాముని స్తుతించి విశ్వామిత్రునిఁ బూజించి రామచంద్రునకు సకలాస్త్రముల నుపదేశింపుమని తమదారిని బోయిరి. ఆరాత్రి మునియు రాజకుమారులును దాటకావనంబున నిర్భయముగ నిద్రించిరి. ఉదయమున యాహ్నికంబులఁ దీర్చి విశ్వామిత్రుఁడు సకలాస్త్రముల నుపదేశించి యా యా యస్త్రముల శరీరములతో రప్పించె. అవి గొప్పకాంతితో రామునకు మ్రొక్కి మేమెల్లప్పుడు నీస్వాధీనములో నుందుము

స్మరించినఁజాలునని క్రొముకొఱఁగా రాముడు వానిని స్పృశించి నామనసు ననుసరించి యుండుఁడని చెప్పెను. అంత రాముఁడు కృతజ్ఞతాసూచకముగ మునికి క్రొమ్మొకి యస్త్రంబుల నుప సంహారంబుల నుపదేశింపుఁ డనిన మునుపటియట్లు ఋషి యస్త్రములు సశరీరులుగ రావించి రాముని యానతిచొప్పున నడచుకొన విధించెను. రాముని యనుగ్రహముఁబొంది యవియు మఱుగుపడినవి.

విశ్వామిత్రుఁడు రామలక్ష్మణుల వెంటఁగొని తన యాశ్రమము సమీపింప రామచంద్రుఁడీ యాశ్రమవృత్తాంత మేమని యడుగ, మహర్షి సంతసించి "రామా! పూర్వము విరోచనుని పుత్రుఁడగు బలిచక్రవర్తి దేవేంద్రపదవికిం దగు యజ్ఞముగావింప నింద్రాదుల ప్రార్థన లంగీకరించి విష్ణువు వామనరూపుఁడై మూఁడడుగుల నేలయడిగి త్రివిక్రముఁడై బలిని పాతాళమున కనిపినకతమున దేవతలకోర్కెలు సిద్ధించినందున సిద్ధాశ్రమమని దీనికి పేరుగలిగెనని చెప్పెను.

విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులతో నాశ్రమము ప్రవేశింప నచ్చటి మునులెల్లరు రాముని దర్శించి యాతిథ్యము లిచ్చిరి. రాముఁడు విశ్వామిత్రుని యజ్ఞము ప్రారంభింపవచ్చు ననెను. అంత మహర్షి, రామా! మీ రిరువురు చాల జాగరూకతతో మెలఁగవలెను. మహామాయావులగు సుబాహు మారీచు లదృశ్యులై యాకసమందుండి రక్తమాంసాదుల వర్షించి యజ్ఞమును భంగమొనర్తురని హెచ్చరించి యజ్ఞమారంభించెను. రామచంద్రుఁడు లక్ష్మణునిచూచి లక్ష్మణా! మెలఁకువతో నుండుము. రాక్షసులు మాయావు లనెను. ఇంతలో

సుబాహు మారీచులు రక్తమాంసాదుల గురియింప వచ్చి మేఘముల మఱుగున నుండు విషయము గ్రహించి రాముఁడలిగి మానవాస్త్రముచే మారీచుని సముద్రమునఁ బడవైచె. ఆగ్నేయాస్త్రముగొని సుబాహుఁబొమ్మన నేయ వాఁడు నేలఁగూలె. వాయవ్యాస్త్రమునఁ దక్కుంగల రాక్షసులఁ బరిమార్చెను. మును లెల్లరు రాముని బొగడిరి. విశ్వామిత్రుఁడు "రామా! నీ భుజబలపరాక్రమంబున నాయజ్ఞము సిద్ధింపఁజేసి సిద్ధాశ్రమ నామమును సార్థకము చేయించితివి. నేను కృతకృత్యుఁడనైతి" ననెను.

# 4. మిథిలానగర గమనము

విశ్వామిత్రుని యజ్ఞము ముగిసిన మఱునాఁడు రామలక్ష్మణులు ప్రాతఃకాలకృత్యములఁదీర్చి మునికిమ్రొక్కి కర్తవ్యమేమని యడుగుచుండ నచ్చటి మునులందఱు విశ్వామిత్రునకు నమస్కరించి రామునిఁజూచి యిట్లనిరి. "మిథిలాధిపతియగు జనకుఁడు యాగముచేయనున్నాఁడు. మే మందఱ మచ్చటికిఁ బోయెదము. నీవును మాతోడరమ్ము. జనకునొద్ద విచిత్రమగు శివధనువు గలదు. దాని నెట్టివారు నెక్కుపెట్టలేకైరి. దానిని నీవు చూడవచ్చుననిరి. అంత విశ్వామిత్రుఁడు, రామలక్ష్మణులు, మునులు, పయనమయిరి. వారు శోణానదీతీరముసేరగా రామచంద్రుఁ డాప్రదేశమునుగూర్చి ప్రశంసింప విశ్వామిత్రుడు బ్రహ్మమానసపుత్రులలోనొకఁడగు కుశునకుఁ గుశనాభుఁడనియు నతనికి గాధియనియు రాజశ్రేష్ఠు లుద్భవించిరనియుఁ జెప్పి యా గాధినందనుఁడే తానని కుశవంశమునఁ బుట్టినందునఁ గౌశికుఁడని పేరుగలిగెనని ప్రస్తావవశమునఁ దన వంశానుక్రమము దెలిపెను. ఆరాత్రి యచ్చటఁగడిపి మఱునాఁడు ప్రయాణముచేయుచు గంగనుజూచిరి. రామచంద్రుఁడా పుణ్యనదీవృత్తాంత మడుగ విశ్వామిత్రుఁ డిట్లనియె. 'రామా! ప్రపంచమున మహోన్నతుఁడగు హిమవంతుఁడను బర్వతరాజు గలఁడు. (పర్వతనదీసముద్రవనాదులకు నగ్నివాయు విత్యాదులకు నధిష్ఠానదేవత లున్నారని వారినిగూర్చిన విషయ మసి గ్రహింపనగును). అతనికి మేరుపర్వత పుత్రియగు మనోరమ భార్య. వారికి గంగాదేవి, యుమాదేవి యని యిద్దఱు పుత్రికలు పుట్టిరి. దేవతలు ముల్లోకములలోఁ బారు గంగాదేవిని

లోకోపకారము హిమవంతునిమూలమునఁబడసిరి. ఉమాదేవి ఘోరతపస్సుచేసి రుద్రుని వివాహమాడెను. దేవతల యభిమతము ననుసరించి గంగానది దేవలోకములోఁబ్రవహించెను.'

## సగరుని వృత్తాంతము.

రామా! తొల్లి సగరుఁడనురా జయోధ్యను బాలించెను. అతఁడు నిజభార్యలగు కేశిని, సుమతి యనువారితో హిమవంతమునకరిగి తపస్సుచేసెను. భృగుమహర్షి "రాజా! నీ తపంబునకు మెచ్చితిని నీ భార్యలలో నొకతెకు వంశకరుండగు పుత్త్రుఁ డొకఁడును మఱి యొకతెకు బహుపుత్త్రులు నుదయింతు రనెను. అంత సగరుఁ డెవతె కొకఁడుపుత్త్రుఁడని యడుగ నీ వెవతె కొకఁడుపుత్త్రుఁడుకలుగవలెనందువో యట్లే యగుగాకయని యనుగ్రహించి మహర్షి వెడలిపోయెను. సగరుఁడు పత్నులతో నగరంబుసేరి వారి యీప్సితంబు లడుగఁ గేసిని 'నాకొకఁడేచాలుననియె.' సుమతి 'నాకఱువదివేవురు పుత్రులుగావలె' ననియె. కొంతకాలమునకుఁ గేశిని యసమంజసుఁడనుపుత్త్రుఁబడసె. సుమతికొక సొఱకాయవంటి పిండము పుట్టెను. దానిని ఛేదింపఁగా నఱువదివేవురుపుత్త్రు లుదయించిరి. పెద్దవాఁడగు అసమంజసుఁడు ప్రతిదిన మూరివారిబిడ్డలను గొంపోయి సరయూనదీజలంబులఁ బడవైచి వారు మునుగుచుండుటనుజూచి నవ్వుచుండెను. సగరుఁడు వానిని పురమునుండివెడలఁగొట్టె. ఆయసమంజసునికుమారుఁ డంశుమంతుని సుగుణములకుఁ బ్రజలెల్ల రానందించిరి. కొంతకాలమునకు సగరుఁడు యజ్ఞము ప్రారంభించెను. ఆ యజ్ఞపశువగు గుఱ్ఱ

మును దేవేంద్రుఁడు మాయచే నపహరించెను. ఋత్విజులు యజ్ఞము పూర్తిగాకున్నఁ దనకును రాజునకును గీడువాటిల్లు ననిరి. సగరుఁడు పుత్రులందఱిని బిలిచి "కుమారులారా! యజ్ఞాశ్వమును మూలమూలలు వెదకి పట్టుకొనిరండని" యాన తిచ్చెను. వారు దిక్కులన్నిఁట వెదకి విసుఁగుచెంది 'గుఱ్ఱము గాని, దానిని దొంగిలినవాఁడుగాని మాకుఁ గానరాఁడయ్యె' ననిరి. సగరుఁడు గోపించి, "మరలఁబోయి పాతాళమువఱకు భూమిని భేదించియైనను గుఱ్ఱమును గొనిరండు. మీకు శుభ మగుగాక" యని యాశీర్వదించి పంపెను. సగరకుమారులు రోషముతో భూమిని పాతాళమువఱకుఁ ద్రవ్విరి. అం దొక చోట గుఱ్ఱము పచ్చిక మేయుచుండుటఁగని చాలసంతోషించిరి గాని సమీపమునఁదపస్సుచేయుచున్న కపిలమహర్షియే దొంగ యని తూలనాడిరి. వెంటనే మహర్షి హుంకరించెను. సగర కుమారులెల్లరు భస్మమయిరి. కుమారు లెంతకాలమునకు రానందున సగరుఁడు మనుమఁడగు అంశుమంతునిఁ జూచి "వత్సా! నీ పినతండ్రులు తిరిగిరాని కారణము తెలియకున్నది. నీ వన్ని దిక్కులు గలయ వెదకి వారిందోడ్కొని గుఱ్ఱము వెంటఁ గొనిరమ్ము. నీకు సర్వశుభంబులగు" నని దీవించి పంపెను. అంశుమంతుఁడు ధనువును బాణములను గవచమును ధరించి వెడలిపోయి దిగ్గజములకు మ్రొక్కి యచ్చటఁ గనఁబడిన వైన తేయునకు మ్రొక్కఁగా నతఁడు "వత్సా! గుఱ్ఱము గనఁబడు చున్నది చూడుము. గర్వముచే నీపినతండ్రులు గపిలునివలనఁ బూదికుప్పలైరి. గంగాజలమున నీ కుప్పలను దడిపిన వారు స్వర్గము చేరఁగలరు" అనెను. అంత నంశుమంతుఁడు గుఱ్ఱ

మునుగొనిరాఁగా యజ్ఞముపూర్తియయ్యె. సగరుఁడు గంగను దెచ్చుటకలవిగాక మరణించెను. అంశుమంతుఁడు రాజై ధర్మపాలనము సేసి కుమారుఁడగు దిలీపునకు రాజ్యమిచ్చి తపము చేసి మరణించెను. దిలీపుఁడును క్రమముగఁ బాలించి తపము చేసి దేహము చాలించెను. అతని కుమారుఁడగు భగీరథుఁడు సంతానముకొఱకు గొప్ప తపస్సుచేయఁగా బ్రహ్మదేవుఁడు ప్రత్యక్షమై 'భగీరథా! నీతపంబునకు మెచ్చితి. వరంబు వేఁడు' మనఁగా భగీరథుఁ డద్దేవునికి మ్రొక్కి "దేవా! సగరకుమారులు బూదికుప్పలై యున్నవారు. గంగాజలమున నా రాసులను దడిపిన వారు స్వర్గముచేరఁగలరు గావున గంగవచ్చుటకుఁ గొంపోవ ననుగ్రహింపుము. మా వంశము వర్ధిల్లుటకై సంతానమొసఁగుమని" కోరెను. అంతఁ జతుర్ముఖుఁడు "రాజా! ఆ గంగ యురవడిని సహింపఁగలవాఁడు శివుఁడే గనుక యతనిఁ బ్రార్థింపు" మని చెప్పి గంగాదేవితో భగీరథుని కోర్కెదీర్ప ననుజ్ఞ యొసఁగె.

వెంటనే భగీరథుఁడు బొటనవ్రేలూని నిలిచి ఘోర తపంబుసేయఁ బార్వతీపతి ప్రసన్నుఁడై "నీ కోరికచొప్పున గంగను శిరమున ధరింతు"నని యంతర్ధానమయ్యె. గంగ కడు రయంబునరాఁగా దానిగర్వ మడంప శివుఁడు తన జటాజూటమున గంగను బూర్తిగ నణఁచివేసెను. మరల భగీరథుఁడు ప్రార్థింపఁ గొంతవదలెను. అట్లు స్రవించు గంగ జహ్నుమహర్షి యజ్ఞభూమిం దడుపఁగా నతఁడలిగి గంగను బానముచేసెను. భగీరథుఁడతనిఁగూర్చి మిక్కిలితపింపఁగా నమ్ముని దేవ ఋషి గణంబుల నుతిఁగొని గంగను దనపుత్రిగాభావించి చెవిమూల

మున వదలెను. అందుచే గంగ జాహ్నవియయ్యెను. భగీరథుఁడు భూమినుండి గంగను రసాతలమునకుఁ గొంపోయి యా భస్మరాసులఁ దడిపించి సగరపుత్రుల స్వర్గప్రాప్తికిఁ గారణభూతుఁడయ్యె. ఇట్లు గంగ స్వర్గ మర్త్య పాతాళములం బ్రవహించుటచేఁ ద్రిపథగయనంబడును. చతుర్ముఖుఁడు మున్నెన్నఁడు కనివిని యెఱుంగని మహాద్భుత కార్యము నిర్వర్తించిన భగీరథుని యనేకవిధముల నుతించెను. రామా! ఇట్టి పరమ పవిత్రమగు గంగావతరణకథను వినువారు సకల పాపములనుండి విడివడి సకల శుభంబులందుదు" రని చెప్పెను.

## అహల్యావృత్తాంతము.

విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులతో విశాలాపురము సేరి సుమతియను నారాజుచేఁ బూజితుండయ్యె. ఆ రాజును రామలక్ష్మణుల నతి యాదరంబున సత్కరించి గజగమనులును నరశార్దూలురును మహాతేజోవంతులును నశ్వినీదేవతలవలె నుండువారును రూపరేఖావిలాసములం దొకరికొకరు దీసిపోనివారును నగు వీరెవరనియడుగ విశ్వామిత్రుఁడు వారి వృత్తాంతమంతయుఁ జెప్పెను. ఆరాత్రి యెల్లరు సుమతిచే నతిథిసత్కారము పొంది మఱునా డుదయము మిథిలకు సమీపముననున్న యొక యాశ్రమము సూచి దీని విశేషమేమని రాముఁడడుగ మహర్షి యిట్లనియె. రామా! ఇది గౌతమముని యాశ్రమము. అతనిభార్య యహల్య మిక్కిలి రూపలావణ్యముచే వన్నెకెక్కినది.

[ పూర్వము బ్రహ్మదేవుఁడు సౌందర్యమే మూర్తీభవించి నట్టి యసమానరూపరేఖావిలాసములతో నొప్పు స్త్రీనిసృష్టించి అహల్యయని పేరిడి "ఈ భూమిని నతిశీఘ్రమున నెవరు చుట్టివత్తురో వారికీమెను భార్యగానొసంగెదనని చాటించెను. అంత దేవేంద్రుఁడు ఐరావతము నెక్కి భూప్రదక్షిణము చేయఁ బోయెను. ఇంతలో నారదుఁడు జపముచేయుచున్న గౌతమ మహర్షి వద్దకువచ్చి "అతిత్వరితముగ రమ్ము. ఇట నొకగోవు దూడవేయుచు ద్విముఖముగ నున్నది. దీనిని ప్రదక్షిణము చేయుము. ఇందువలన నీవు భూప్రదక్షిణము చేసినట్లే. బ్రహ్మదేవునికడకేగి యహల్యను నాకిచ్చి పెండ్లిచేయుము. నేను భూప్రదక్షిణముచేసివచ్చితి ననుము. అతఁడొకవేళ వివర మడిగిన జరిగిన విషయము చెప్పుము. తామసింపక బొమ్ము" నెను. గౌతముఁ డట్లేచేయఁగా నిది నారదుని ప్రేరేపణయని దెలిసి శాస్త్రమునకుఁ గట్టుపడి యహల్యను గౌతమునికిచ్చి వివాహముచేసెను. దేవేంద్రుఁడు భూప్రదక్షిణముచేసి బ్రహ్మవద్దకుఁ జని అహల్యనడుగ విరించి యప్పుడే గౌతమున కిచ్చితినని చెప్పఁగా నింద్రుఁడు మత్సరముఁగొని యామెతోఁ గ్రీడింప సమయము వేఁచియుండెనని చెప్పుట గలదు. ]

( ఇది వాల్మీకివచనము గాదు. )

ఆమె గౌతమముని పత్ని. ఒకసమయమున గౌతముఁడు వేకువజామున స్నానార్థము నదికరిగిన సమయముచూచి ఇంద్రుఁడు కాముకుఁడై గౌతమునివేసముపూని యాశ్రమము లోనికేగి 'నీయందు మరులుగొనియున్నాఁడను. నీతో రమింపఁ గోరుచున్నాఁడను. నీయందుఁ బుత్రోత్పత్తి గోరను. తామసిం

పకు' మనినంతనే యహల్య తన్ను దేవేంద్రుఁడు గోరుచున్నాడని తెలిసియుండినందున నతఁడేయని సమ్మతించి యతనితోఁ గ్రీడించెను. అంతనామె, "సురపతీ! నాకోరిక తీరినది. నీకును నాకును మేలగునట్లిచ్చోటువాసిపొమ్మనఁగా నతఁడును నాకు సంతృప్తికలిగినది. ఇదె పోవుచున్నానని పర్ణశాలనుండి వెడలు తఱి దర్భలను సమిధలను చేఁబూని తడిబట్టతో మహర్షి వచ్చి తనరూపముననున్న యింద్రునిచూచి "ఓరీనీచుడా! నీ వృషణము లూడిపోవుగాక" యనినంత నట్లే జరిగెను. ముని లోనికేగి భార్యనుజూచి "ఓసీ నీచురాలా! నీ విందే కలకాలము వాయుభక్షణముసేయుచు బూదిలో నెవరికంటి కగుపడక పడియుందువుగాక. శ్రీరాముఁ డీమార్గమునవచ్చునపుడు శాపవిముక్తి యేర్పడి యెప్పటియట్ల నన్నుగలిసికొందు"వని శపించి హిమాద్రిచెంతఁ దపముసేయఁబోయెను. కనుక రాఘవా! నాతో నచ్చోటికిరమ్మ' ని యటు గొంపోయెను. వెంటనే అహల్య తపస్సుచే నినుమడింపఁబడిన రూపముతోఁ గానఁబడినదయ్యె. రామలక్ష్మణు లా మునిపత్నికి నమస్కరింప నామెయు భర్తృవాక్యము స్మరించి వారి నతి భక్తితోఁ బూజించెను. ఇంతలో యోగబలమున గౌతమమునియుఁ దన యాశ్రమంబు సేరి తపసుచే దోషరహితయగు భార్యాసమేతుఁడై విశ్వామిత్ర రామలక్ష్మణుల కత్యంతాదరమునఁ బూజలుగావించె. అంత వారు మిథిలాపురమున కేగిరి. జనకమహారాజువారి రాక నెఱిఁగి పురోహితుండగు శతానందుని ముందిడుకొని యెదురేగి భక్తితో నర్ఘ్యపాద్యాదులొసఁగి వారిని యుక్తమగుచోట విడియంజేసి యుచితాసనంబులఁ నమరంజేసి కుశలంబులడిగె.

విశ్వామిత్రుఁడును జనకుని పలువిధములుగఁ గుశలంబులడిగి శతానందుని విచారించెను. జనకుఁడు కౌశికునిఁజూచి 'మునీంద్రా! యజ్ఞము సఫలమైనదని యెంచెద, ' తమ రాకచే ధన్యుఁడనైతిని. ఈ శుభాకారులగు బాలకు లెవరని యడుగ మునీంద్రుఁడు 'వారు దశరథపుత్రులు నా యజ్ఞము గావవచ్చి రాక్షసవధగావించి, యహల్యాశాప విముక్తిఁగావించి గౌతమ ముని యాతిథ్యముగొని నీ విల్లుచూడ నిచ్చటికేతెంచియున్నా' రనెను. ఇంతలో శతానందుఁడు మునివర్యా! నా తల్లి శాప విముక్తిచెందెనా? ఆమె మిమ్మందఱిని పూజించెనా? మా తండ్రి యామెను గలసికొనెనా? యని యడిగెను. జరిగిన దంతయు విశ్వామిత్రుఁ డతనికిం బూసగ్రుచ్చినట్లు చెప్ప శతానందుఁడు పరమానందముచెంది రామునితో నరోత్తమా! ఈ మహాముసిచరిత్రము వివరించెద.

## విశ్వామిత్రుని చరిత్రము.

బ్రహ్మదేవుని కుమారుఁడగు కుశుండను రాజు గలడు. అతని కుమారుఁడు కుశునాభుఁడు. ఆతనికి గాధిపుట్టె. గాధి నందనుఁడే విశ్వామిత్రమహర్షి. అతఁ డొకపర్యాయము చతురంగబలముతో నానాప్రదేశములు తిరిగి వసిష్ఠాశ్రమంబుసేరి యమ్మునిని దర్శింప నతఁడు "విశ్వామిత్రా! నీవు మాకు రాజవు. నీ విప్పు డతిథివైతివి. నిన్నుబూజించుట మా ధర్మము. నా యాతిథ్యము గైకొను" మనెను. అందులకు విశ్వామిత్రుఁడు "మహర్షీ! మీరు మాకుఁ బరమపూజ్యులరు. మీ యాదరము నాకు ముదంబుఁగూర్చె. నేనొకఁడఁగాను. చతురంగ

బలముతో నేతెంచినాఁడను. మీనుబోంట్లు మా పరివారమున కంతయు నాతిథ్యమియ్య నసాధ్యము. మన్నింపుడు. సెలవు పుచ్చుకొెందు" ననెను. అంత వసిష్ఠుఁడు "రాజా! నేను నీకును నీ పరివారమునకును విందుచేయఁదలంచితిని. తప్పక నా యా తిథ్య మంగీకరింపు"మని నిర్బంధింప విశ్వామిత్రుఁడు సమ్మతిం చెను. అంత వసిష్ఠుఁడు దనగోవును "శబళా! రమ్ము. నీ వీ రాజపరివారమున కంతయు నాఱురుచుల ననేక విధ భక్ష్య భోజ్యంబులతో మృష్టాన్న మిడవలెను. త్వరపడుము" మనెను. కామధేనువందుకు సమ్మతించి సకలవిధ యన్నములను వ్యంజనములను భక్ష్యాదులను క్షీరము, దధి, ఘృతము, పాయసము, ఫలవర్గములతో నపారముగ సృష్టించి విశ్వామిత్రుని పరివారము నంతయు సంతృప్తిపఱచెను. దీనింగని విశ్వామిత్రుఁడు వసిష్ఠునిజూచి "ఋషిశ్రేష్ఠా! నేను నీ కనేకలక్షలు శుభచిహ్నములుగల గోవుల నిత్తును. ఏనుఁగులు, గుఱ్ఱములు, రత్నములు, స్వర్ణము, విశాలధనము నెంతఁగావలెనన్నను నిచ్చెదను. నాకీయావునిమ్ము. నీయందెంతయుఁ గృతార్థుఁడనగుదు" నని పరిపరివిధముల నడిగినను వసిష్ఠుఁడు, "రాజా! నీవు రాజవు. ఇప్పు డతిథివి. నీవుకోరినదానినిచ్చి నిన్ను సంతృప్తుం జేయుట నావిధియని నేనెఱుఁగుదును గాని, తపోధనుఁడనగు నాకు సకల వైదిక లౌకిక కర్మలకును గావలసిన సకలవిధ వస్తువుల నియ్యఁదగిన దీయావే. ఇతరయావుల కట్టిశక్తి లేదు. నే నర్థపరుఁడనుగాను. భోగినికాను. నాకేల నీవీయఁదగినవస్తువులు నామాటలుగ్రహించి యాకోరికవిడువుమ"ని నంత విశ్వామిత్రుఁడు బలాత్కారముగ నాయావునుబట్టి లాగుకొనిపోవ

నది కట్టుతెంచుకొని వసిష్ఠునిసమీపించి యతనియాజ్ఞఁబొంది విశ్వామిత్రునిసైన్యము నెదుర్కొనఁదగు సైన్యముల సృష్టింప ఘోరయుద్ధము జరిగెను. తుదకు వసిష్ఠుని బ్రహ్మదండమున కేదియు నిలువలేకుండుట గుర్తించి విశ్వామిత్రుఁడు 'బ్రహ్మ బలమే గొప్ప — క్షత్రియబల మల్పమ' ని గుర్తించి తపస్సు చేసి రాజర్షి యయ్యెను.

ఇట్లుండ నిక్ష్వాకువంశస్థుఁడైన త్రిశంకుఁడను రాజు శరీరముతో స్వర్గమునకుఁబోవ నుపాయమేమని కులగురువగు వసిష్ఠునియడుగ నతఁడది యసాధ్యమనెను. రాజు గురుపుత్రులతోఁ దనకోర్కెఁ జెప్ప వారు "కులగురువుమాటలు పాటింపని నీవు చండాలుఁడవగుదుగాక" యని శపించిరి. తెల్లవారునప్పటికి త్రిశంకుఁడు చండాలుఁడయ్యె. అంత నతఁడు విశ్వామిత్రునాశ్రయింప నతఁ డంగీకరించి యతని శరీరముతో స్వర్గమున కేగుమని చెప్పెను. త్రిశంకుఁ డట్లే స్వర్గమునకుఁబోఁగా దేవత లతనిఁ ద్రోసి వేసిరి. త్రిశంకుఁడిట్లు తలక్రిందుగఁబడుచు "కావుకావు" మని వేఁడఁగా విశ్వామిత్రుఁడు "నిలునిలు"మని చెప్పి త్రిశంకున కొక స్వర్గము సృష్టించెదనని దక్షిణమునఁ గొన్నినక్షత్రములను సృష్టించెను. వేరొకయింద్రుని సృష్టించెద ననఁగా దేవత లతని సమీపించి "ఋషివర్యా! నీవన్నియు నెఱుఁగుదువు. నీమాటచొప్పున త్రిశంకుఁడు జ్యోతిస్స్వరూపమునఁ బ్రపంచమున్నంతదనుక నీనక్షత్రములతో వెలయుఁగాక నీవిఁక సృష్టికార్యముమానుమ"నిరి. విశ్వామిత్రుఁడు శాంతించి వల్లె యనెను.

## శునశ్శేపుని వృత్తాంతము.

అయోధ్యాధిపతియైన నంబరీషుఁ డొకయాగముసేయుచుండ నతనియజ్ఞపశువు నింద్రుఁడు దొంగిలించె. ఆయాగపశువునుగాని, యొకమనుష్యునైనను యాగపశువుగఁ గొనితెమ్మని పురోహితుఁడు చెప్పెను. అంత రాజు దేశదేశములు వెదకి యెచ్చటను దానిఁగానక ఋచికుఁడను ముని కొడుకులతోను భార్యతోను సుఖముగనుండుటఁజూచి "మహాత్మా! నీ కుమారులలో నొకనిని యాగపశువుగనిచ్చిన నీవుగోరినన్ని గోవుల నిచ్చెద" ననెను. అమ్ముని "నా జ్యేష్ఠపుత్రుని నేనీయ"ననెను. అతనిభార్య "కనిష్ఠుని నేనీయ" ననెను. ఆ మాటలు విని మధ్యముఁడగు శునశ్శేపుఁడు "రాజా! నన్నుగోరినవారు లేరు. నేనువచ్చెద" ననఁగా రాజు నూఱువేల గోవులనిచ్చి యతనిం దోడ్కొని పోవుచుండె. మార్గమునఁ దపస్సుచేయుచున్న విశ్వామిత్రునిఁజూచి శునశ్శేపుఁడు "మామా! నన్ను నాతల్లిదండ్రులు యజ్ఞపశువుగా నమ్మిరి. నన్ను విపత్తునుండి రక్షింప నీవేదిక్కు"ని చెప్పెను. అంత విశ్వామిత్రుఁడు దనకొడుకులలో నొకనిఁ బంపనెంచి వారినడుగ వారు పరిహసింప "మీరు వేయేండ్లు వసిష్ఠకుమారులట్లు కుక్కమాంసముతిని జీవింతురు గాక" యని శపించెను. అంత విశ్వామిత్రుఁడు రెండుమంత్రములుపదేశించి "శునశ్శేపా! నిన్ను యూపస్తంభమునకుఁ గట్టి యుండుతఱి యీమంత్రములఁ బఠింపుము. నీ యాపద తీరు" ననెను. అతఁడట్లేచేసి విష్ణుదేవుని స్తుతించినందున నింద్రుఁడు దృప్తుఁడై యంబరీషుని సంతోషింపఁజేసెను.

విశ్వామిత్రుఁడు వేయేండ్లు తపముసేయ బ్రహ్మ ప్రత్యక్షమై "ఇంతవఱకు రాజర్షివై యుంటివి. ఇఁక ఋషివైతి"వని చెప్పిపోయెను. అందుకుఁ దృప్తిచెందక విశ్వామిత్రుఁడు మరల తపమాచరింప దేవతలచేఁ బనుపఁబడిన మేనకయను నప్సరస యచ్చటికరుదేర ముని యామెనుమోహించి యామెతోఁ బదియేండ్లు గాపురముసేసి సిగ్గుపడి దేవతల మోసమున కుఁజిక్కి గామపరవశుఁడనై తినేయని చింతించి యామెనువిడిచి వేరొకచోట వేయేండ్లు తపముసేయ విధాతవిచ్చేసి "మహర్షీ! నీవు ఋషులలో మేటివైతి" వనెను. అప్పుడు కౌశికుఁడు "దేవా! నేను జితేంద్రియుఁడనైతినా? యని ప్రశ్నింపఁ జతురాననుఁడు "నీవింకను జితేంద్రియుఁడవుగావు. ఇంకను బ్రయత్నింపు"మనిచెప్పి దివముసేరె. మరల విశ్వామిత్రుఁడు దపము సేయ నింద్రుఁడు రంభకు ధైర్యముసెప్పి యతని తపము భంగముగావింపఁ బంపెను. దాని నెఱిఁగి ఋషి రంభను బదివేలేండ్లు శిలారూపముననుండి యొకబ్రాహ్మణునివలన శాపవిముక్తినొందెద వనినంత రంభ శిలారూపముదాల్చె. ఇట్టి కోపమునకుఁజిక్కితినేయని చింతించి విశ్వామిత్రుఁడు మరలఁ దపస్సు నారంభించి వేయేం డ్లుపవసించి పక్వాన్నముఁ దినఁ బోవునపు డింద్రుఁడు బ్రాహ్మణరూపమున దానిఁ బెట్టుమని యడుగ విశ్వామిత్రుఁ డలుగక దాని నా బ్రాహ్మణునకుఁ బెట్టి వేయేండ్లు శ్వాసము బంధించి తపముసేయ నతని శిరమునుండి పొగవచ్చుటంగని దేవదానవులెల్లరు బ్రహ్మ యొద్దకుంజని విశ్వామిత్రుని తపంబున ముల్లోకములు దగ్ధమగునని మొఱలిడ నద్దేవుఁడు విశ్వామిత్రునికడ కరుదెంచి

'బ్రహ్మర్షీ ! స్వాగతము. నీకు బ్రాహ్మణ్యముగలిగె. నీకు దీర్ఘాయువునొసంగెద' ననపుడు విశ్వామిత్రుఁడు 'దేవా! వందనంబు. శ్రోత్రియులగు బ్రాహ్మణులకుంగల సర్వాధికారములు నాకగునట్లనుగ్రహింపుము. బ్రహ్మమానసపుత్రుండగు వసిష్ఠుఁడు నన్ను బ్రహ్మర్షియనవలయుననిన 'వల్లె' యని చతుర్ముఖుఁడాతని సంతృప్తుంజేసి దివంబునకరిగె. విశ్వామిత్రుఁడు జితేంద్రియుఁడై వసిష్ఠునిఁ బూజించి యతనిచే బ్రహ్మర్షియని పిలువఁబడి లోకహితముసేయ నిన్నిచ్చటికిఁ గొనివచ్చినాఁడని శతానందుఁడు శ్రీరామునకు గురువుయొక్క మాహాత్మ్యంబుసెప్పె. ఇంతలో సాయంసమయమైనందున జనకుఁడు విశ్వామిత్రుని యనుజ్ఞఁబొంది శతానందునిఁగూడి నిజనివాసంబున కరిగె. విశ్వామిత్రుఁడును రామలక్ష్మణులతో నా రాత్రి విడిదిగృహంబున గడపె.

# 5. కల్యాణము

మఱునాఁ డుదయము జనకుఁడు ప్రాతఃకాల యనుష్ఠానములుచేసి విశ్వామిత్రుని రామలక్ష్మణులను రావించి మునికి మ్రొక్కి కర్తవ్యమేమనియడుగ మునివరు నాజ్ఞంగొని శివుని విల్లుఁదెండని మంత్రుల కనుజ్ఞయిచ్చె. ఇంతలో జనకుఁడా విల్లువృత్తాంతము నిట్లుచెప్పెను. "మున్ను దక్షయజ్ఞసందర్భమునఁ దనకు హవిర్భాగ మీయనందున శివుండలిగి దేవతల నీ ధనువుతో శిరములుఖండింతు ననవుడు వారతివినయముతో శరణువేడ నీశ్వరుఁడు గరుణించి యిద్దానిని దేవతలకొసఁగె. మావంశమునకు మూలపురుషుఁడగు నిమి యనునాతని కాఱవ తరమువాఁడు దేవరాతుఁడు. అతనియందలి ప్రీతిచే దేవతలద్దాని నతనికిల్లడగ నిచ్చిరి. దానిని నేను నిత్యముఁబూజించుచున్నాఁడను". సీత నాకెట్లు కూఁతురైనదని చెప్పెదను.

నేనొకపరి యజ్ఞముకొఱకు భూమిని దున్నితిని. నాఁగేటిచాలున నొకకన్నియ నాకు లభించినది నాఁగేటిచాలుకు సీతయని పేరు. అందుఁబుట్టినందున నేనామెను సీతయని పిలువఁ జొచ్చితిని. ఇట్లామె యయోనిజయగుట నామెను శక్తిసంపన్నన కియ్యనెంచి యీధనువు నెక్కువెట్టువాని కీమెనిచ్చి వివాహముగావింతునని చాటించితిని. అంత నానాదేశపురాజు లీ ధనువునుఁజూచి యెత్తనైనను లేకపోయినందున నామీఁద నలిగి యొక సంవత్సరము మిథిలను ముట్టడించిరి. అప్పుడు నేను దేవతల నారాధింప వారనుగ్రహించి నాకు చతురంగ బలము నిచ్చిరి. దానిసాయమున నేనారాజులఁ బాఱఁదోలితిని.

ఇట్టిమహాధనువును దశరథమహారాజుపుత్రుఁడగు రామచంద్రుడెక్కుపెట్టిన సీత నాతనికిచ్చి వివాహముచేసెద" నని చెప్పెను. ఆమాటవిని విశ్వామిత్రుఁడు శీఘ్రమున విల్లుఁదెప్పింపు మనెను. ఇంతలో నెనిమిదిచక్రములుగల యినుపమందసను బలవంతులగువీరు లైదువేవు రచ్చటికి లాగుకొనివచ్చిరి. జనకుఁడీవిషయము విశ్వామిత్రునితోఁ జెప్పెను. అంత మునివరుఁడు రామునిఁజూచి "వత్సా! రామా! ఈవింటిని చూడుమ"నియె. రాముఁడా మందసను దెఱచి వింటినిచూచి విశ్వామిత్రునివంకఁ జూచి "మహాత్మా! మీయాజ్ఞయగు నేని నేనిద్దాని నెత్తి యెక్కువెట్టెద"ననెను. "అట్లేచేయుమని" మునియు రాజును జెప్పఁగా ననేక వేలరాజులు చూచుచుండఁగా రాముఁడద్దాని నెత్తి మోపెట్టి యావింటినారి నాకర్ణాంతము లాగినంతనే యా పెనువిల్లు దిక్కులుపిక్కటిల్లు పిడుగువంటి శబ్దముతో నడుమవిఱిగె. ఆ శబ్దమునకు విశ్వామిత్రుఁడు, రామలక్ష్మణులు, జనకుఁడును దప్పఁ దక్కినవారెల్లరు మూర్ఛిల్లి నేలంబడిరి. జనకుఁడు వారందఱుఁ దెప్పిఱిలి లేచినంతనే విశ్వామిత్రునిఁజూచి "మహామునీ! ఈ యుర్వి నిర్వీర్యమైనదేమోయని శంకించి మిక్కిలి చింతాక్రాంతుడనై సీతకుందగినభర్త లభించునాయని తపించుచుంటిని. నాభాగ్యవశమున మీయనుగ్రహప్రభావమున దశరథాత్మజుఁడగు రామునివీర్యమిట్టిదని కన్నులారఁగాంచి యానందించితిని. నాకుఁ బ్రాణముకంటె నెక్కువయగు నా కూఁతురు సీత రాముని భర్తగఁబడసి నా జనకవంశము నుద్ధరింపఁగలదు. మీయాజ్ఞయైన నిప్పుడే దశరథునిఁబిలువ మంత్రులఁ బంపెదను" అన విశ్వామిత్రుఁడు 'వల్లె' యనినంత జనకుఁడు

పెండ్లిపత్రికయు, సందేశపత్రికయు నిచ్చి దూతల నుత్తమా శ్వముల నెక్కి శీఘ్రమునఁబోయి దశరథమహారాజును కుమారుల వివాహమునకు బయలుదేరి రమ్మని చెప్పి పంపెను.

దూతలు మూఁడు రాత్రులు మార్గమునఁ గడపి యయోధ్యఁజేరి ద్వారపాలకులమూలమున రాజాజ్ఞఁబొంది దేవేంద్రునివలెఁ దేజోవంతుఁడగు వృద్ధభూపతిని వినయముగ నమస్కరించి "దేవా! మిథిలానగరమునుండి జనకమహారాజుచేఁ బంపఁబడిన దూతలము. మారాజు మీకును మీ పురోహితులకును నమస్కార మందించమని యిట్లనెను. "మిత్ర వరేణ్యా! వీర్యమేయుంకువఁజేసి నాముద్దుకూఁతురగు సీతకుఁ బరిణయము చేయ నెంచిన విషయము దెలిసినదే. విశ్వామిత్రుని రక్షణమున నీకుమారులు రామలక్ష్మణులు మిథిల కేతెంచి యున్నవారు. వారిలో జ్యేష్ఠుఁడగు రాముఁడు వేలకొలఁది రాజులయెదుట నా శివధనువు నెక్కువెట్టి రెండుతునియలు చేసి నాప్రతిజ్ఞ సార్థకము చేసినాఁడు. రామునకు సీతనిచ్చి వివాహముచేయ నాతురపడుచున్నాను. సకల పురోహిత మంత్రి బాంధు మిత్ర యిష్టజనంబులతో వచ్చి యీ వివాహ శుభముహూర్తము జరిపించుభారము నీది. నేను నీవాఁడను. నాకార్యము నీకార్యమే. నీ యిరువురుపుత్రులు నా కుమారితలను బెండ్లిచేసికొను వైభవముచూచి యానందింప రమ్ము." ఇట్లు జనకమహారాజు విశ్వామిత్రుని, తన పురోహితుండగు శతానందుని యంగీకారముపొంది చెప్పి పంపెను' అనిరి. దశరథుఁ డానందముతో గురువసిష్ఠులతోను, సుమంత్రాది మంత్రులతోను, కౌసల్యాదులతోను గలిసి యాలోచించి మంత్రు

లతో "రేపు ప్రయనము. సర్వము సిద్ధముచేసి కోశాధ్యక్షుని కాపుదలతో ముందు పొమ్మనుము. వెనుక వసిష్ఠ, వామదేవ, జాబాలి, కాశ్యప, మార్కండేయాది మునులను వాహనములలోఁ బంపుము. చతురంగబలము నాయత్తకఁ అంపుము. నా రథము సిద్ధముచేయుము" మనెను.

అట్లే మఱునాఁడు దశరథుఁడు సపరివారముగ మిథిలకుఁ బయనమయ్యెను. ఈవార్తవిని జనకుఁడు సకలసన్నాహములుగావించి దశరథుని మిథిలానగరము వెలుపల నెదురువచ్చి యమితానందముతో నాహ్వానించుచు వసిష్ఠాది మునులకు నమస్కరించి కుశలంబులడిగి దశరథునిఁజూచి "ఇక్ష్వాకువంశముతో వియ్యమందుభాగ్య మబ్బుటచేఁ గృతార్థుఁడనైతిని. నా యజ్ఞము మూఁడునాలుగుదినములలో ముగియగనే వివాహము జరిపింపఁ బ్రార్థించెద"ననియె. దశరథుఁ డందుకు సంతసించి "దానము దాతవశము. నీవెప్పుడు దానముచేసిన నప్పుడు ప్రతిగ్రహింప సిద్ధముగనున్నా" ననెను. ఋషులు పరస్పర సంభాషణలు జరిపిరి. దశరథుఁడు పుత్రులఁజూచి యానందించెను. జనకుఁడు వారి నందఱిని తగువిధమున యుక్తమగు విడుదలం దమరఁజేసి తాను చేయవలసినకార్యములు చేయఁ బోయెను. ఆరాత్రి గడచెను.

ఉదయమున జనకుఁడు వైదికకర్మలఁజేసి శతానందునితో "సాంకాశ్యపురమున నాతమ్ముఁడు కుశధ్వజుఁ డున్నాఁడు. వాఁడు నాయందత్యంతవిశ్వాసముగలవాఁడు. వాఁడీమహోత్సవాదులలోఁ బాల్గొనవలె ననుచుండగనే మంత్రులురాఁగా రాజు వారి నాజ్ఞాపింప వా రతిరయమునఁ గుశధ్వజునిఁ

దోడ్కొనివచ్చెఁ. అతఁడు శతానందునకు మ్రొక్కి యన్నక నమస్కరించి యతనియాజ్ఞచొప్పున శుభాసనమునఁ గూర్చుఁడెను. జనకుఁడు సువాముఁడను మంత్రితో 'నీ వతిశీఘ్రముగ దశరథమహారాజును గుమారులను మంత్రులను నిచ్చటికిఁ గొనిరమ్ము' నిన నతం డేగి వినయముతో నీ వార్త చెప్పఁగ దశరథుఁడు వెంటనే వసిష్ఠాదులఁగూడి పుత్రులఁ దోడ్కొని జనకునిభవనమున కరుదెంచె. అంత జనకుఁడు వారల నుచిత రీతి సత్కరించి యాసీనులం జేయించె. అప్పుడు దశరథుఁడు లేచి " జనకమహారాజా! నా కులగురువగు వసిష్ఠుఁ డిప్పుడు మావంశావళిఁ జెప్పు ననవుడు వసిష్ఠుఁడు విష్ణుదేవుని మొదలు రామాదులవఱకు నిక్ష్వాకువంశమును వివరించెను. తోడనే జనకుఁడు దన వంశావళిఁ జెప్పఁదొడంగె. "కన్యాదానసమయమునఁ జేయవలసిన విధి ననుసరించి పవిత్రమగు నా వంశక్రమంబు సెప్పెద. ధర్మాత్ముఁడగు నిమి మాకు మూలపురుషుఁడు. అతనికి మిథి యను కుమారుఁడు పుట్టెను. అతఁడు గట్టినందున నీపురము మిథిలయైనది. అతఁడే తొలిజనకుఁడు. అందువలన మావంశము జనకవంశమని పేరుపొందినది. ఆఱవ తరమువాఁడు దేవరాతుఁడు. అతఁడే దేవతలవలన నీ శివ ధనువుఁ బొందినవాఁడు. ఈ వంశమున నిరువదిరెండవతరము వాఁడగు హ్రస్వరోమున కిరువురు పుత్రులు. వారిలోఁ బెద్ద వాఁడను నేను. కుశధ్వజుఁడు నా తమ్ముఁడు. బాలుఁడగు నాతమ్ముని రక్షింపుమని నాతండ్రి దివంబున కరిగె. నేను నా గారాబుతమ్ముని సంరక్షించితిని. ఇట్లుండ సాంకాశ్యపుర పాలకుఁడగు సుధన్వుఁడు శివధనువును సీతను దన కిమ్మని

యడుగ నే నీయనైతిని. అందుచే నతఁడు మిథిలపై దాడియెత్తి రాఁగా నే నాతనిఁజంపి నాతమ్ముని సాంకాశ్యమును బాలింప నియోగించితిని. మహాత్మా! నేను సంతోషముతో నా కూఁతుండ్రగు సీతను రామునకును ఊర్మిళను లక్ష్మణునకు నొసంగెదను. "దశరథా! నీవీయిరువుర నీకోడండ్రుగా నంగీకరింపుము. నేఁడు మఘానక్షత్రము. నేటికి మూఁడవదినము ఉత్తరఫల్గునీనక్షత్రమున వివాహము జరుగును. రామలక్ష్మణుల క్షేమార్థము జరుగవలసిన దానంబులు చేయుము"నెను. అంత విశ్వామిత్రుఁడు వసిష్ఠు ననుమతిఁగొని జనకునితో నిట్లనెను. "జనకా! సూర్యవంశమునకు జనకవంశమునకు సంబంధము సర్వశ్రేష్ఠము. సీతమ్ముఁడగు కుశధ్వజుని యిరువురుకన్యలను భరతశత్రుఘ్నుల కిత్తువేని మీ సంబంధము సంపూర్ణమగునని చెప్పినంతనే జనకుఁడు సమ్మతించి సంతోషముతో మునులకు మ్రొక్కి 'మహాత్ములారా! మీరిరువురు యీ యన్నదమ్ముల యొక్కయు దశరథునియొక్కయు క్షేమముగోరువార లగుటచే మేము, మా రాజ్యములు మీవేయని భావించి మమ్మాదరింపుఁడు. మేమెన్నఁడు మీదాసులమైయుందుమ"నెను. అంత దశరథుఁడు "జనకా! నీమాటలమృతతుల్యములు. నా నలుగురు పుత్రుల కేకకాలమున వివాహముచేయ నంగీకరించిన నీ వెంతయు నుతింపఁదగినవాఁడవు. నేను మావిడిదికిం బోయి వచ్చెదనని చెప్పి యచ్చోటఁజేరి నాందీశ్రాద్ధముచేసెను. మఱునాఁ డుదయమున గోదానాదుల ముగించె.

---

# సీ తా క ల్యా ణ ము .

దశరథుఁడు కుమారులకు సమావర్తనము జరిపిన నాఁడే కేకయరాజు కుమారుఁడును గైకేయి సోదరుఁడును దశరథుని బావమఱఁదియు భరతుని మేనమామయు నగు యుధాజిత్తు వచ్చి దశరథునిఁ జూచి "రాజచంద్రమా! మా తండ్రి మీక్షేమము విచారింపుమనెను. అతఁడు తన దౌహిత్రునిచూడఁ గోరుచున్నాఁడు. అందుచే భరతునిఁ దోడ్కొనిపోవ నయోధ్య కేగితిని. అచ్చట మీరెల్లరుఁ గుమారులవివాహములకై మిథిల కేగియున్నారనివిని యిందరు దెంచితిన" నెను. దశరథుఁడు దన కత్యంతఁ బ్రియాతిథియగు యుధాజిత్తును దగినరీతి సత్కరించెను. ఆరాత్రి గడచెను. మఱునాఁడుదయము దశరథుఁడు ప్రాతఃకాలకార్యములఁ దీర్చికొని ఋషులతోఁగూడి వివాహమండపంబున కరిగె. రామచంద్రుఁడు సర్వాలంకారభూషితుఁడై తమ్ములంగూడి విజయముఁగూర్చు శుభముహూర్త మెదురుచూచుచు యజ్ఞశాలకుం జని తండ్రి సమీపంబున గూరుచుండెను. అంత వసిష్ఠుఁడు జనకుని సమీపించి "రాజేంద్రా! దశరథుఁడు కంకణబద్ధులగు పుత్రులంగూడి సిద్ధముగ నున్నవాఁడు. తామసింపక కన్యాదానము చేసి ధన్యుఁడవుకమ్మ"నియె. అందులకు జనకుఁడు "మహాత్మా! మీయిల్లు. మీయింటిలో మీకు సర్వాధికారమున్నది. నా కూఁతులు సర్వాలంకారలై సిద్ధముగనున్నారు. జాగుసేయక జరుగవలసినఁగార్యములఁ జేయింపుఁడ" నెను. అందునకుసంతోషించి వసిష్ఠుఁడు విశ్వామిత్రుని శతానందుని ముందిడుకొని

వైదికకార్యములుచేయ నారంభించె. వివాహవేదిక గంధము, పుష్పము, ఫలములు, అక్షతలు, పేలాలు, మొలకలువచ్చిన నవధాన్యము, ఘృతము, హోమముసేయు సాధనములు, తాంబూలాదులు, కుంభములు, మూకుళ్ళు మొదలగువానితో నిండి తైలదీపములతో జ్వలించుచుండెను. వసిష్ఠుఁడు అగ్ని ప్రజ్వలింపఁజేసి దానిచుట్టు దర్భాస్తరణముల మంత్రయుక్త ముగఁబఱపి వైవాహికసంబంధ హోమాదుల నిర్వర్తించెను. జనకుఁడు సర్వాభరణభూషితయగు సీతను అగ్నికిముందట రాముని కెదురుగనిలిపి కౌసల్యానందవర్ధనుఁడగు రామునిఁజూచి "ఈసీత నాకూఁతురు. ఈమె నీ సహధర్మచారిణి. ఈమెను బాణిగ్రహణము చేసికొనుము. నీకు సకలశుభము లొనఁగూడును. 'ఈ' అనుటకర్థమేమి? లోకములోని కన్యలవలెఁగాక భూమియందుబుట్టిన సీత. భూదేవివలె యోర్పుగలది. ఏసీతను గూర్చి వినినప్పటినుండి నీవు కలవరించుచుంటివో యాసీత. నీవంటియోర్పుగలది. నీ వింద్రనీలమణివంటివాఁడవు. ఈమె బంగారువంటిది. ఎంతకాంతిగలమణియైనను బంగారులోఁబొదిగిననే యందమగును. అట్లు నీవీమెఁగూడి సీతారాముఁడైన నీమహిమ వెల్లడియగును. ఏసీతనుగూర్చి మిథిల ముట్టడింపఁబడి నేను చిక్కులుపడితినో, ఏసీతను జెట్టఁబట్టఁగలవీరుఁడీలోకమున లేఁడేమోయని భయపడితినో, ఏసీత పేరుచేతనే మానవగర్భమునఁ బుట్టలేదని తెలియుచున్నదో యామె కోరికలను జెప్పకొనుటకైనను దల్లిలేక నిన్నే యుండఁగనెంచునో, ఏలక్ష్మీదేవి నిన్నెప్పుడు విడిచియుండక నీరామావతారమున సీతయై నీ దుష్టశిక్షణ శిష్టరక్షణ మను ధర్మమును నిర్వర్తించు నిమి

త్తము నీభార్యకావలెనని దైవనిర్ణయమో లేక నీసంకల్పమో యట్టి యీసీత నా కూఁతురు.

'నా' యనుట మమకారముగాదా యందువా? నావంశ మాదినుండి సదాచారమునకు, సచ్ఛీలమునకు, ధర్మాచరణ మునకు సుప్రసిద్ధము. అట్టివంశస్థుఁడనగు నాచేఁ బెంచఁబడిన కతమున సీత నాకుఁ బ్రాణతుల్యయగును. నాచే సకలవిషయ ములు గ్రహించి సద్ధర్మాచరణమందే బుద్ధిగలది. సతీధర్మమును నాదర్శమగురీతి నాచరింపఁగలది. సంపదయందేగాక యెట్టి పరిస్థితియందును నీ నీడవలె నిన్ను బాయక వెన్నంటివచ్చునది. కేవలము భోగములనుభవింపఁ బుట్టినదిగాదు. విషమపరిస్థితి యందును నిన్ననవరతము ధ్యానించుచుండుస్వభావము గలది. నీ వేసమయమున నేమిచేయ నెంచినను నీకెల్ల విధములఁదోడ్పడు నట్టిది. కనుక నీ వీమెను పాణిగ్రహణము చేసికొనుము. నీ కందు వలన సకలశుభము లొనగూడును. ఈమెకుఁ దండ్రియగుటచే బరమపావనుఁడ నైతిని. ఇఁక నీ వీమెను నీకుఁ గన్యాదానము చేయుభాగ్య మబ్బినందున నాజన్మము తరించినదనియే నమ్మె దను" అని చెప్పి యుదకధారాపురస్సరముగ సీతాదేవిని రామ చంద్రునకు దానముచేసెను. వెంటనే పుష్పవృష్టిగురిసె. దేవ దుందుభులు మ్రోఁగె. జనకుఁడు "లక్ష్మణా! రమ్ము. ఈ నా కూఁతురగు ఊర్మిళను నీ కిచ్చుచున్నాను. నీ వంగీకరించి యామె హస్తమును బట్టుకొనుము" అనియె. తరువాత భర తునిఁజూచి "రాఘవా! నీవు నీహస్తముతో మాండవి హస్త మును బట్టుకొనుము" అని శత్రుఘ్నునివంకఁ దిరిగి "మహా బాహూ! శ్రుతకీర్తిని పాణిగ్రహణముచేసికొమ్ము" నెను. ఇట్లా

భ్రాతలు నలువురు వారివారి ధర్మపత్నులతో నగ్నికి ప్రదక్షిణము మువ్మాఱుచేసిరి. దేవదుందుభులు మ్రోఁగె. పూలవాన గురిసె. అప్సరసలాడిరి. గంధర్వులుపాడిరి. ఈరీతి శాస్త్రసమ్మతముగ రాజకుమారులు నలుగురు వివాహమాడి వసిష్ఠాది ఋషులకు దశరథుఁడు జనకుఁడు దల్లులు మున్నవారికందఱకు నమస్కారములు సేసి తమతమ భార్యలతో విడిదియిండ్లకుఁ బోయిరి.

మఱునాఁ డుదయమే విశ్వామిత్రుఁడు దశరథునిసమ్మతిఁ గొని రాజకుమారులఁ దగురీతిని దీవించి హిమాలయపర్వత ప్రాంతమున కేగె. జనకమహారాజు లక్షలాదిగోవులు, హిరణ్యము, రత్నములు, వాహనములు, వివిధాభరణములు, వస్త్రములు మొదలగునవి యవ్వారిగనిచ్చి చతురంగబలముల నొసఁగి దాసదాసీజనంబులనిచ్చి కూతుండ్రను అల్లుండ్రను సమ్మానించి దశరథమహారాజును బహువిధ మర్యాదలతో వీడ్కొలిపి కొంతదూర మేగి సెలవుఁగైకొని వసిష్ఠాదులకు నమస్కరించి మిథిల కేతెంచె.

దశరథుఁడు చతురంగబలంబులతోఁగూడి కొడుకులు గోడండ్రను వెంటఁగొని వసిష్ఠాదుల ముందిడుకొని యయోధ్యాపురాభిముఖుఁడై పోవుచు మార్గమున దుశ్శకునములఁ జూచి చకితుఁడయ్యె. ఇంతలోఁ బెనుగాలిచే దుమ్ములేచి యాకసమునిండఁగా నెదిరింపశక్యముగాని ప్రళయకాలరుద్రుని వంటి యాకారముతోఁ బరశురాముఁడడ్డుపడి "దశరథరామా! నీవు శివధనస్సును భంగముచేసిన వీరుఁడవట. ఈ నా విష్ణుధనువు నెక్కుఁబెట్టఁగలిగిన నాతో ద్వంద్వయుద్ధము సేయ

గలవ"నియె. దశరథుఁడు భయభ్రాంతుఁడై క్షత్రియవంశ మును మూఁడేడుపర్యాయములు నిర్మూలించినవానితో రాముఁ డెట్లు పోరఁగలఁడని దిగులుచెందె. అంత దశరథరాముఁడలిగి పరశురామునిచేతి విల్లునమ్ములను గైకొని యెక్కువెట్టి "భార్గవరామా! నీవు గర్వముచే మన్నుమిన్నుగానకున్నావు. నీవు బ్రాహ్మణుఁడవనియు, విశ్వామిత్రుని యప్పసెల్లెలి మన మఁడనియు నెంచి నీప్రాణము హరింపను. ఈ నాయమోఘ మగు బాణమునకు నీ గమనశక్తినిగాని నీవు తపంబుచే నార్జించినఁ బుణ్యచయమునుగాని యర్పింపక తప్పద" నెను. అందుకు భార్గవుఁడు "రామా! నేను మహేంద్రపర్వతమున కుం బోవలెను. ఈ ప్రదేశమూనంతయుఁ గాశ్యపున కిచ్చితిని. కనుక నా తపోమహిమను నీబాణమున కాహుతిచేయుమని" చెప్పెను. అంత శ్రీరాముఁ డట్లేచేయఁ బరశురాముఁడు శ్రీ రామునిఁ బ్రదక్షిణముచేసి "నీవు ముల్లోకనాథుఁడవని తెలిసి కొంటిని. నీకుశుభంబగుఁగాక"యనిదీవించి తనదారిఁబోయెను. అంత రామచంద్రుఁడు వరుణున కా విల్లును బాణము నిచ్చి వసిష్ఠాదులకు మ్రొక్కి భయభ్రాంతుఁడగు దండ్రిని శాంతుం జేసి సపరివారముగ నయోధ్యఁ జేరెను. వీరిరాక ముందే తెలిసి పౌరులు నగరము నెంతో సొగసుగ నలంకరించి రామా దుల వాద్యవిశేషంబులతో నెదుర్కొని మహావైభవంబున రాజగృహముఁ జేర్చిరి. రామాదులు వారివారి భార్యలతో సకలభోగభాగ్యంబు లనుభవించిరి. రాముఁడు సీతయొక్క రూపగుణశీలవృత్తముల కానందించి యెక్కువగ నామెను బ్రేమించెను. సీతయు జనకుని కూఁతురగుట మిక్కిలి బుద్ధి

సూక్ష్మముతో మెలఁగుచు రాముని యంతరంగము నెఱింగి పతిశుశ్రూష సలుపుచుండె.

ఇంతలో దశరథుఁడు భరతుని మేనమామయగు యుధాజిత్తుతోఁ బంపఁగా శత్రుఘ్నుఁడును భరతుని వెంబడించి పోయెను. రామలక్ష్మణులు దశరథుని తల్లులను భక్తితోఁ బూజించి సంతృప్తులం జేయుచుండిరి.

బాలకాండము సమాప్తము.



# 6. పట్టాభిషేకభంగము

భరతుఁడు రామభక్తిభరితుఁడు. భాగవతోత్తముఁడు. తన్నుఁగొలుచుటకంటెఁ దనభక్తులఁగొలుచుట భగవంతుని కత్యంత ప్రీతికరము. శత్రుఘ్నుఁడు భరతుని తన స్వామిగ భావించి యతని శుశ్రూషయే తనకుఁ బరమార్థమని తలఁచి లక్ష్మణుఁడు రాముని యెడ నెట్లు ప్రవర్తించునో తాను భరతుని యెడ నట్లే ప్రవర్తించుచుండుటంజేసి భరతుని మేనమామగను, భరతుని మాతామహుఁడగు కేకయరాజును దనకును దాతయనియే భావించుచుండెను. ఇందువలన భాగవతారాధనమహిమ వెల్లడియగుచున్నది. అయోధ్యకుఁ జాల దూరమునసుండు రాజగృహమను బట్టణముననుండినను భరతశత్రుఘ్నులు వృద్ధుఁడగు దశరథుని ముదిమినిఁగూర్చియుఁ రామునకు యౌవరాజ్యపట్టాభిషేకముఁచేసినఁ దండ్రికి మేలగుననియుఁదలఁచిరి. ఇచ్చట దశరథుఁడును భరతశత్రుఘ్నులను గూర్చి తలంచుచు వారి యెడఁబాటును సహింపలేకుండెను. రామలక్ష్మణులు దల్లిదండ్రులకు భక్తిశ్రద్ధలతో సకల శుశ్రూషలు చేయుచుండిరి. రామచంద్రుఁడు సర్వాంగసుందరుఁడు. అంతేగాదు. తన సుగుణములచేఁ దల్లిదండ్రుల సంతోషింపఁ జేయువాఁడు. అతఁడు శాంతస్వభావుఁడు. ఇతరులతో మృదువుగను మధురముగను మాటలాడును. ఇతరులొకవేళ పరుష వచనములు పలికినను నోర్పుగలిగి పరుషముగ బదులుసెప్పఁడు. తన కితరు లణుమాత్ర ముపకారముసేసినను దానితో సంతృప్తుఁడగును. తన కెంద ఱెన్నివిధముల నపకారము చేసి

నను మనసున నెంతమాత్రము దలఁపడు. ఇందుల కతఁ డాత్మ జ్ఞానముగలవాఁడగుటయే కారణము. సదాచారసంపన్నులతో నాచారవిషయసూక్ష్మములం బలుకును. మోక్షజ్ఞానసంపన్నులతో వేదాంతరహస్యములు చర్చించును. వయోవృద్ధులతో వంశాచారములగూర్చి మాటలాడును. అతఁడస్త్రవిద్య నభ్యసించునపుడును చర్చలు జరుపుచునేయుండును. గొప్పబుద్ధి గలిగి యుల్లులతోడను దానే ముందుగమాటలాడును. తనకు విరోధులు లేకున్నను దనయాశ్రితులవిరోధులను నిరసించువాఁడు. తన బలమును, సంపదను, పరాక్రమమును, విద్యను గుఱించి గర్వలేశము లేనివాఁడు. ఎట్టి పరిస్థితియందును బొంకనివాఁడు, ధర్మమునువిడువనివాఁడు, వృద్ధులఁబూజించువాఁడు. అతఁడు పండిత పామరులఁ బ్రేమతోఁజూచువాఁడు, ప్రజలయం దనురాగముగలవాఁడు. ఇతరులదుఃఖమును తనదిగనెంచి పరుల సంతోషమును దనదనియే భావించువాఁడు. బ్రహ్మజ్ఞానసంపన్నులతో నధ్యాత్మవిషయములు చర్చించువాఁడు. దీనులనుజూచి జాలిఁగొని దానముచేయువాఁడు. పరుల సొత్తును గన్నె త్తియైనను జూడఁడు. శ్రీరాముఁడు దయాదాక్షిణ్యములతో నిండినవాఁడు. దుష్టనిగ్రహ శిష్టపాలనముసేయు క్షత్రియధర్మమును జక్కఁగఁ బాటించువాఁడు. అసత్యఫలయం దనహ్యాముగలవాఁడు. శాస్త్రచర్చలయందు బృహస్పతివంటివాఁడు. రాముఁడు యువకుఁడు, ఆరోగ్యవంతుఁడు, దేహదార్ఢ్యముగలవాఁడు, ఏయేకాలమున నేయేకార్యముచేయవలెనో చక్కఁగఁ దెలిసినవాఁడు. అతఁడొకసారి యొకనినిజూచిన నతనిమనోభావమును జక్కఁగ నెఱుఁగువాఁడు. అతఁడెల్లప్పుడు

దైవభక్తి, యాచార్యభక్తి గలవాఁడు, స్థిరమగుజ్ఞానము గల వాఁడు, సదసద్వివేకముగలవాఁడు, చురుకుతనము, శాస్త్ర జ్ఞానముగలిగి యితరులఁదప్పులనేగాక తనదోషములను జక్కఁగ నెఱిఁగినవాఁడు. రామచంద్రుఁడు సత్పురుషుల సాంగత్యము గలిగి వారిని పాలించుటలో సమర్థుఁడు. అతనికి ధనార్జనచేయు విధానమును వ్యయముచేయు రీతియుఁ జక్కఁగఁ దెలియును. క్షత్రియుఁడగుటచే రథగజతురగారోహణములయందతి సమర్థుఁడు. ఇట్లు శ్రీరాముఁడు స్త్రీలకు, పురుషులకు, బాలురకు యువకులకు, వృద్ధులకు మిక్కిలి ప్రియముగూర్చుచుఁ గిరణములతోఁ బ్రకాశించు సూర్యునివలె సకల కల్యాణగుణములతో నిండి మానవోత్తముఁడుగఁ బ్రకాశించుచుండెను.

ఇట్లుండ దశరథుఁడు తన ముదిమినిగూర్చియు, రాముని సకల సద్గుణములనుబట్టియు నాలోచించి తానుండఁగనే రామునకు యౌవరాజ్యాభిషేకము చేసి యానందింపఁగోరి మంత్రులతోను వసిష్ఠాదులతోడను దనయభీష్టము దెలిపి వారియంగీకారముతో నానాదేశ సామంతులను, పౌరశ్రేష్ఠులను, సర్వవర్ణ ప్రముఖులను నాహ్వానించి యెల్లఱను దగురీతుల సత్కరించి గొప్పసభచేర్చి యం దిట్లనెను. "ప్రభువులారా! మహాజనులారా! విస్తారమగు నారాజ్యము సూర్యవంశపురాజులచేఁ బరిపాలింపఁబడి మహోన్నతదశయందుండుట మీకుఁ దెలియును. నేనింతకాలము మీయెల్లరక్షేమముగోరి శక్తివంచన లేక పాలనముసాగించితిని. ఇప్పుడు వయోధిక్యముచే విశ్రాంతిఁ గోరుచున్నాను. నాజ్యేష్ఠకుమారుఁడు రామచంద్రుఁడు సకల సద్గుణములతో నిండి మీ యెల్లఱ మనంబుల నాకర్షించి

యున్నవాఁడు. వాఁడన్నివిధములను నాకంటెను సమర్థుఁడు. వానికి యౌవరాజ్యాభిషేకము చేయఁగోరి మీయెల్లర యభిప్రాయముల నడుగుచున్నాఁడను". అనినంతనే మేలుమేలని సభలోనివారందఱు ఘోషింప నా శబ్దము మిన్నుముట్టెను. వసిష్ఠాది మునులును, సామంతులును, పౌరజానపదులును గలిసి తమతమ యభిప్రాయముల నొకరికొకరు తెలిపికొని యేకాభిప్రాయముగ నిట్లనిరి. "రాజా! నీవు దీర్ఘకాలము ధర్మయుక్తముగఁ బాలనసేసి గొప్ప ఖ్యాతిపొందితివి. నీవు విశ్రాంతిగోరుట యుక్తమే. రాముని కల్యాణగుణములు మమ్మాత్మనిదాసులుగఁ జేసినవి. ఎన్నఁడు పట్టపుటేనుఁగుమీఁద శ్వేతచ్ఛత్రముతోఁ బ్రకాశించు రామచంద్రుని దర్శింతుమా యని యువ్విళ్ళూరుచుందుము మాకోరిక సఫలముచేసి నీతోడ మమ్ము నానందసాగరమున ముంచుము".

అంత దశరథుఁడు "రాజులారా! మహాజనులారా! రాముని పట్టాభిషేకప్రశంస నానోటరాఁగానే మీరిట్లనుటచే నాకు సందియము దోచుచున్నది. నా పాలనమున మీ రనేకవిధములుగ బాధలుపడినట్లు తెలియుచున్నది. లేకున్న ముందు వెనుక లాలోచించుటకేనియు నవకాశము పుచ్చుకొనక రాముని పట్టాభిషేకమందిట్టి యపూర్వసంతోషము గనఁబఱచుచున్నారేల?" యనియె. అందులకు జనులు "రాజోత్తమా! రాముఁడు సుగుణాభిరాముఁడు. చంద్రునివలెఁ బ్రియదర్శనుఁడు, విద్యావినయసంపన్నుఁడు, జ్ఞానవయోశీలవృద్ధుల సేవించువాఁడు, సాటిలేని పరాక్రమవంతుఁడు, దీనజనులపాలిటి కల్పతరువు, ప్రజల శుభాశుభములను దనవిగ భావించి దయా

పూర్ణుఁడై, తల్లి తండ్రి బంధు మిత్రులవలె నెల్లప్పుడు ప్రజల క్షేమము గోరువాఁడు. కనుక మేమందఱము రాముని క్షేమము కొఱకు సాయంప్రాతః దేవతలకు మ్రొక్కువారము. శ్రీరాముఁడు నీ వంశగౌరవమును దన పాలనచే వేయిరెట్లెక్కువ చేయఁగలఁడు. కనుక నిస్సంశయముగ శీఘ్రముగ నతని రాజ్యాభిషిక్తునిఁజేయుట సర్వజనసమ్మతమ"నిరి. అప్పుడు శ్రీరామున కిరువదినాలుగు వత్సరములు పూర్తియైనవి. ఇరువదియైదవది ప్రారంభము. అది చైత్రమాసము.

దశరథుఁడు వసిష్ఠాదులతో సకల సన్నాహములు గావించి శీఘ్రమునఁ బట్టాభిషేకము జరుగవలె ననినంతనే వసిష్ఠుఁడు రాజకార్యనిర్వాహకులతో "రేపుసూర్యోదయమునకు స్వస్తివాచనము జరుగును. బంగారము, రత్నములు, తెల్లని పుష్పములు, పేలాలు, వేఱువేఱుపాత్రలలో పాలు, పెరుగు, నెయ్యి, తేనె, ఫలములు, చందన తాంబూలములు, తెల్లని గొడుగులు, చామరములు, అలంకరించిన ఏనుఁగు బంగారుతో నలంకరింపఁబడిన వృషభములు, గోవులు మొదలగు వానిని సిద్ధముచేయింపుఁడ"నెను. అంత రాజోద్యోగులు పట్టణమును బహువిధముల నలంకరించి సకలసంభారములు సేకరించి సర్వసన్నాహములు గావించిరి. దశరథుఁడు సుమంత్రునిఁబంపి రామునిద్దోడ్కొనిరమ్మనె. రాముఁడురాఁగా నమస్కరించు తనపుత్రునెత్తికౌఁగిలించి యుత్తమాసనమునఁగూర్చుండ నియోగించి "రామచంద్రా! నేను వేనవేలేండ్లు రాజ్యము పాలించి యజ్ఞాదులుసేసి వృద్ధుఁడనైతిని. ప్రజలు నిన్ను రాజుగఁ గోరుచున్నారు. నాకు స్వప్నములో దుశ్శకునము

లగుపడుచున్నవి. కావున వెంటనే నీకు యౌవరాజ్యపట్టంబు గట్ట నిశ్చయించితిని. నేఁడు పునర్వసునక్షత్రము. రేపు పుష్య నక్షత్రమునం దభిషేకము జరుగును. వసిష్ఠులవా రానతిచ్చు నట్లు చేయుమనెను. రాముఁడు తండ్రికి నమస్కరించి కౌసల్య యంతఃపురముచేరెను. అచ్చట నామె దేవపూజసేయుచుండె ను. ఈ శుభవార్తవిని యామె యానందించుచు రాముని క్షే మార్థ మిష్టదేవతార్చనము చేయుచుండ సుమిత్ర యచ్చటికి వచ్చెను. ఇంతలో లక్ష్మణుఁడచ్చటికేతెంచెను. రాముఁ డత నితో "లక్ష్మణా! నీవు నాతో నీరాజ్యము నేలుము. నీవు నా వెలిప్రాణము. నీకొఱకే నేనీరాజ్యమును, భోగమును బ్రాణ మునయినను గోరుదును. ఇంతలో సీతయు నచ్చటికి వచ్చెను. రాముఁడు తల్లినిఁజూచి "అమ్మా! నేఁటిరాత్రి, నేనును సీత యు నుపవాస ముండవలయునఁట"యనెను. ఇంతలో వసిష్ఠుఁ డును రామునికడకువచ్చి సీతారాముల నుపవసింపుమని కొన్ని నియమములు సెప్పిపోయెను. రామచంద్రుఁ డారాత్రి సీతతో నుపవసించి విష్ణుదేవాలయమున నిద్రించి వేకువలేచి స్నానము చేసి పూజలుముగించెను. బ్రాహ్మణులు పుణ్యాహవాచనము చేసిరి. మంగళవాద్యఘోషములు దశదిశలు నిండెను.

## మంథర కైకేయికి దుర్బోధనలుసేయుట.

కైకేయికి మంథరయను దాసిగలదు. అది కైకేయి కాపురమునకు వచ్చినప్పుడే వచ్చినది. కైకేయియం దెక్కువ ప్రీతిగలది. అది మేడపైనుండి యయోధ్యాపుర మలంకరింపఁ

బడి వాద్యఘోషములతో నిండి జనుల సంతోష కోలాహల ములు విని కౌసల్యచేయుచున్న దానంబులఁజూచి కౌసల్య యొక్క దాసిమూలమున శ్రీరామపట్టాభిషేకవార్తవిని కడు పుబ్బి కైకేయితో "అయ్యో! తెలివిలేనిదానా! చాలు నీ ముచ్చట. రాజు నాయం దత్యంతప్రేమగలవాఁడని గర్వించు చుంటివే. ఇప్పుడు తెలిసినది నీరాజుప్రేమ" యనినంతనే కైకే యి "మంథరా! ఏమినీకిట్టికోపము! ఎన్నఁడాడనిమాట లాడు చున్నావే. ఏమికారణమ"ని యడిగెను. "నీకుఁగలిగిన యాప దకు దుఃఖిచుటచే నిట్లనుచున్నాను. రేపు రాజు రామునకు యౌవరాజ్యాభిషేకముసేయును. ఇఁకనీగతియేమగునోచూడు ము. నోట తియ్యనిమాటలాడి నిన్ను మోసపుచ్చి కౌసల్య కొడుకునురాజుగఁజేయును. నీవు కౌసల్యకుదాసివేయగుదువు. నీకు గోరంతదుఃఖముగలిగిన నాకుఁగొండంతదుఃఖముగనెంచు దానను నేను. చిన్నప్పటినుండి నిన్నుబెంచి నీతోనుండినదాన ను. నీనష్టము నానష్టముగనెంచెద" ననియె. అంత సంతోష ముతో నద్దేవి "మంథరా! ఆహా! ఎట్టి శుభసమాచారము దెచ్చితివి! ఈ యాభరణము గైకొమ్ము. రాముఁడు రాజు నకు జ్యేష్ఠకుమారుఁడు. సుగుణవంతుఁడు. నాయం దత్యంత ప్రేమగలవాఁడు. నాకు భరతునికంటె రాముఁడు దక్కువ వాఁడుగాఁడు. వాఁడు రాజగునను శుభసమాచారము చెప్పి నాకుఁ బ్రియముచేసితి" వనెను.

మంథర తనమాట ఫలించనందున నింకను దీవ్రముగఁ బలుకఁజొచ్చెను. "కైకేయాదేవీ! నీకు జరుగనున్న యనర్థము దెలియకున్నది. రాముఁడు భరతుని సేవకునివలె భావించును.

రాముఁడు యుక్తిశాలి. భరతుఁడమాయకుఁడు. రాముని మాటకు బదులుసెప్పఁడు. ఇఁక వాని కెట్టిగౌరవమును గలుగదు. నీ విన్నిదినములు సవతులిద్దరికంటె మిన్నగనుంటివి. కౌసల్య సమయము వేచియుండినది. ఇప్పుడు నిన్ను దాసీజనములకంటె నీచముగఁజూచును. నీయిష్టమనుమాటయేటిది? ఆమె గీచిన గీటు దాటఁగలవా?" అప్పటికిని కైకేయి నవ్వుచు "మంథరా! రాముఁడు ధర్మజ్ఞుఁడు, సత్యసంధుఁడు, రాజునకు జ్యేష్ఠకుమారుఁడు. అతఁడే యౌవరాజ్యమునకుం దగినవాఁడు. భరతాదులయం దత్యం తాదరమునుజూపునట్టి రామునకుఁ బట్టాభిషేకమని విని చూచి యానందించక చింతించుట తగదు. నీకింకేమికావలెనో యడుగు మిచ్చెద" ననెను.

రోగముకుదరకున్న వైద్యుఁడు ఘాటుగ నౌషధమిచ్చునట్లు కైకేయి తనదారికి రానందున నాగూని దుర్బుద్ధిగలది "అయ్యో! నీవంటివెఱ్ఱివా రెవరున్నారు! ఇన్నియేండ్లుబ్రతికి కేకయరాజు గడుపునఁబుట్టి, రాజపత్నివై మేలుకీళ్ళ నెఱుఁగజాలని నిన్నేమనవలయు? సవతులమత్సర మిట్టిదని యెఱుఁగలేవే. చెట్లుచేమలుసహితము సమీపమున నుండిననే ప్రేమించును. సాయముచేయును. అట్లుండ మానవులగూర్చి యేమని చెప్పవలెను? దశరథుఁడెట్టివంచనాపరుఁడు! భరతుని యేదో సాకుపెట్టి దూరదేశమునకుఁబంపి తన కెట్టి యభ్యంతరము లేకుండు సమయము సదుపాయము వెదకి తటాలునఁ దలఁచుకొన్నట్లు నటించి రాముని యువరాజుగఁ జేయుచున్నాఁడే. ఇంతకంటె మోసముగలదా? రాముని యనంతరము భరతుఁడు రాజగునందువా? దీర్ఘకాలము రాముఁడు పాలించిన

తరువాత నతని కుమారుఁడు రాజగునేగాని భరతుఁ డెన్నటి కైనను రాజుకాఁగలఁడా? సకలైశ్వర్యముతో నిండిన భూమండలమును రాముఁడేలుచుండఁగా నీకుమారుఁడును నీవును దారిద్ర్యముపొంది కుంది యవమాన మొందవలసిన గతి పట్టినది. ఇప్పుడైనను మేలుకొనుము. నామాటవినుము. నేనొక యుపాయము చెప్పెదను. దాని ననుసరించిన నిప్పటికిని నీ సకలైశ్వర్యములు నిన్నువీడవు. జాగుసేయకు” మనెను.

## కైకేయి లొంగుట.

మంథరమంత్రము తలకెక్కినది. కైకేయి “మంథరా! నీవిట్టిపట్టుతో నా మేలుగోరి నాకుఁ జేయనెంచిన యుపదేశమేది? ఏరీతిని భరతుఁడు రాజ్యము పడయఁగలఁడు? చెప్పుము నీమాట పాటింతు ననెను. గూనివారు బుద్ధిగలవారని వినియున్నాను. నీ వట్టివారిలో మేటివి. వాతమువలన నేర్పడినది నీగూను. అందుచే నీయందము చెడలేదు. నా కార్యము సిద్ధించెనా నీగూనుపై బంగారుదండ నుంచెదను. నీవు నాకేమి యుపాయము చెప్పెదవో చెప్పు'' మనెను. అంత మంథర “దేవీ! పున్నొకపరి దశరథుఁడు నిన్ను వెంటఁగొని దండకారణ్యముననున్న వైజయంతమనుపురమునకుఁబోయెను. అందు శంబరుఁడను రాక్షసుఁడు మాయావియై దేవతలనోడింపనుండ దశరథుఁడు రాత్రికాలమున రాక్షసులతోఁబోరి గాయములచే బాధపడుచుండెను. నీ వతనికి సారథ్యముచేయుచు రథమును దూరముగఁగొనిపోయి నీభర్తకు శుశ్రూషలుచేసితివి. ఆ యసురు లచ్చటికిరాఁగా నీవారథమును మఱొకచోటికిఁ

గొంపోయి మరల నాతని రక్షించితివి. అందులకు సంతసించి నీభర్త నిన్ను రెండువరములు వేఁడుమనెను. కావలసినపు డడిగెద నంటివి. ఆవరము లిప్పుడడుగుము. భరతునకుఁబట్టము గట్టవలెననుట యొకటి. రాముని పదునాలుగేం డ్లరణ్యవాసము చేయుమనుట రెండవది.

ఇఁక వాని నడుగవలసిన విధము దెలిపెదను. కోపగృహమున నీవు మాసినచీరఁగట్టుకొని రిత్తనేలఁబరుండి దుఃఖముతో నుండుము. దశరథుఁడు నిన్నుఁజూడ వచ్చును. ఇచ్చకములాడును. వివిధాభరణములనిత్తు ననును. అతఁ డేమిచెప్పినను మాటాడకుము. నీవరము లిచ్చునంతవఱ కేమిచెప్పినను వినకుము, బదులుసెప్పకుము. రాజు నీయం దభిమానముగలవాఁడు. నిన్ను మెప్పింపఁ బ్రాణములనైన నిచ్చును. అట్లతఁడు సమ్మతించి సత్యముపాటించునని తెలిసికొని భరతునకుఁబట్టము గట్టవలెను. రామునిచే పదునాలుగేండ్లరణ్యవాసముచేయించవలెనని దృఢముగఁజెప్పుము. పదునాలుగేండ్లు భరతుఁడు పాలించిన రాజ్యములోని జను లతనినే కోరుదురు. కైకా! నీవిచ్చు స్వర్ణాభరణము నాకక్కరలేదు. నీ సామర్థ్య మిందుఁ దెలియఁగలదు" అనెను. అంతఁ గైకేయి యట్లే గావించెను.

## దశరథుని రాక.

దశరథుఁడు రాముని పట్టాభిషేకవార్తఁ దనప్రియురాలగు కైకేయికిఁజెప్పుటకై వచ్చెను. ద్వారపాలకులు 'ప్రభూ! రాణిగారు కోపగృహమునయున్నా' రనిరి. ఆశ్చర్యముతో దశ

రథుఁడు గోపగృహంబున కాతురముతోఁబోయి యచ్చట నేలఁబడి వాడియున్న తీగవంటిదియు, నాట్యమాడి యలసిపడి యున్న కిన్నరస్త్రీవలెనుండు కైకనుజూచి "ప్రియా! ఎల్లప్పుడు నిండుచందురునివంటి మోముతో నన్నాహ్వానించు నీవు నేఁడేలకో మాసినచీరఁగట్టి యలంకార రహితవై శోక కోపములు పెనఁగొన నాకు సహింపరానిరీతిని రిత్తనేలఁ బవ్వళించియున్నదానవు. అలివేణీ! నన్నేల కన్నెత్తియైనఁజూడవు? నా మాటలువినవేల? నీయారోగ్యముదప్పెనా? వైద్యులరప్పింతును. నీకెవరేని కీడుచేసియున్న వారి నిప్పుడే దండింతును. నీయలుక నీశోకము నాకెంతమాత్రము సహింప వీలులేకున్న ద"ని చెప్పుచు నామెశిరము నొడియందుంచుకొని "ప్రాణప్రియా! నీకోరిక యెట్టిదైనను దప్పక నిర్వర్తింతును. నామాట వమ్ముగాదు. నాప్రాణమునైన నీకర్పించి నిన్నుఁ బ్రసన్నురాలుగ జేసికొనుటకంటె నాకుఁ గర్తవ్యమేమికలదు? ఎంతమాత్రము జంకక నీయభీష్టమెఱింగింపుము. తామసింపకుము. నన్నుపేక్షింపకుము" మనెను.

ఇట్లు కామవశంబునఁ జిక్కియున్న రాజును జూచి యింకను ధృఢముగు ప్రతిజ్ఞ చేయునంతదనుక మాటలాడరాదని యెంచి కైకేయి యూరకుండెను. మఱల దశరథుఁడు "కల్యాణీ! నే నెన్నడైన సత్యముదప్పితినా? నీ కప్రియముసేసితినా? నా పత్నులలో నిన్నుఁ బ్రేమించునట్లు నే నెవ్వతెనైనఁ బ్రేమించితినా? పురుషులలో శ్రేష్ఠుఁడును నాపుత్రులలో జ్యేష్ఠుఁడునగు రామునికంటె నాకుఁ బ్రియముఁగూర్చువారు లేరుకదా.

అట్టి నా ప్రాణమునకంటె నా కత్యంత ప్రేమపాత్రుఁడగు రాముని మీఁదయాన వెట్టి నీకోరికఁదీర్తునని ప్రతిజ్ఞ చేయుచున్నాఁడను. నీవుదుఃఖించిన నిన్నుఁజూచి దుఃఖింపకుండఁగలనా? నీ మనసు కలఁతనొందిన నామనసు గుదుటఁబడునా? నా దుఃఖమును బోఁద్రోలుము. నన్నుఁ గాపాడుము. నీ కోరిక యెట్టిదైనను దప్పకఁతీర్తునని ముమ్మాటికి శపథముచేయుచున్నాఁడను. నీకుఁ గోరఁదగినది కోరుమ" నియె. ఇఁక భయములేదనితలంచి కైకేయి "నాథా! ఇప్పుడు నీవు చెప్పినమాటలు, చేసిన శపథములు దేవతలు, దిక్పాలురు, సూర్యచంద్రులు, సర్వభూతములును, గ్రహనక్షత్రములును, సకల ప్రాణులును, విని సాక్షులుగ నుందురుగాక. నీవు రాజులలో మిన్నవు. సత్కులంబునఁ బుట్టినవాఁడవు. ధర్మమనుష్ఠించువాఁడవు. సత్యసంధుఁడవు. నీవెన్నఁడు నాడితప్పవు. కనుక నా మాటలు వినుము. తొల్లి దేవాసురయుద్ధమున నేఁజేసినయుపకారమునకై నీవప్పుడిచ్చిన రెండువరములు జ్ఞప్తికిఁదెచ్చికొనుము. ఆ వరములను వలసినపు డడిగెద నంటినిగదా. నాని నిప్పు డిమ్ము. రాముని పట్టాభిషేకమునకై సమకూర్చిన వస్తువుల నుపయోగించి భరతునకుఁ బట్టముగట్టుము, ఇదియొకటి. రాముని బదునాలుగేం డ్లరణ్యవాసముచేయుచు మునివృత్తి ననుసరింపఁజేయుము. ఇది రెండవది. ఇప్పుడే యీవరము లిచ్చి రాము నడవులకుఁ బంపుము. తామసింపకుము. నీవు సత్యసంధుఁడవని చాటుట కిదియే తగిన సమయము. లోకము సత్యముమీఁద నిలుచును. ధర్మము సత్యముమీఁద నాధారపడియున్నది. మునుపు నాకిచ్చినవరముల నడిగితినిగాని క్రొత్త

వరము లడిగినదానఁగాను. ఉత్తమోత్తమమగు సత్యప్రతిజ్ఞ నెఱవేర్చి కీర్తిఁగాంచుము” నియె.

ఆ పిడుగువంటిమాటలు వినినంతనే దశరథుఁడు మూర్ఛిల్లెను. కొంతసేపటికి తెలివిరాఁగా రాజు “పాపాత్మురాలా! పయోముఖవిషకుంభమువంటిదానవని యెఱుఁగనైతి. భరతునికంటె నీయం దెక్కువభక్తిగల రాముని, యెట్టి యకృత్యమెన్నఁడుచేయని సుగుణమణిని, నాప్రాణముకంటె నాకెక్కువ ప్రీతిఁగూర్చు నా ముద్దులపట్టిని ద్వేషించు దుర్బుద్ధి యెవరు పుట్టించిరి? ఇది నీసైజగుణముకాదు. నీయం దావేశించిన దుస్సాంగత్యదోషమునం బుట్టిన ద్వేషము. జ్యేష్ఠకుమారుఁడు రాజగుట నీపుట్టినింటియాచారముగాదా? నా యుత్తమవంశమును నాశమొందించు నీచురాలా! వరముగోరు నెపమున రాజ్యమపహరించి రాముని యడవులపాలుసేసి నా మరణమునకుఁ గారణభూతురాలవైతివి. విషసర్పమునకుఁ బాలుపోసిన ట్లిన్నినాళ్ళు ప్రేమతోఁ బోషించి తుదకు ముప్పుఁదెచ్చుకొంటిని. ఆహా! ఎంతద్రోహబుద్ధి! సుకుమారుఁడై సకలభోగము లనుభవింపఁ బుట్టిన రామచంద్రుని క్రూరమృగములతోఁ నిండిన యడవికిఁ బంపుటకు నీకెట్లు మనసొప్పె? కైకేయీ! నేఁడో రేపో చావనున్న నన్నీ దుఃఖసముద్రములో ముంచి నీ వానందసాగరమున మునుఁగనెంచితివా? సకల భూమండలాధిపత్యము నీకిచ్చెదను గాని రామునిఁబాసి యొకక్షణమైనను జీవింపఁజాలను. నీ పాదములంటి వేఁడికొందును. రాముని యరణ్యవాసము గోరకుము. దయతలంచుము” అని మూర్ఛిల్లి నేలఁబడి పొర్లుచున్న రాజును చూచియు మనస

మెత్తపడక తెలివినొందిన ముదుసలిరాజును గోపముతోఁ జూచుచు "రాజా! రామునిమీఁద యానపెట్టి యడిగిన దిత్తు నంటివా లేదా? ఆడినమాటలుతప్పుట నీ వంశమునకుఁ బాడి యా? రాజశ్రేష్ఠుఁడవగు నీవే సత్యముతప్పి ధర్మవిరుద్ధముగఁ బ్రవర్తించినచో రాజులు బొంకువారేయను నపకీర్తి లోకమున నిండిపోవును. నీ వంశమున శిబిచక్రవర్తి వృత్తాంతము స్మరింపుము. పూర్వము దేవేంద్రుఁడు డేగరూపము దాల్చెను. అగ్ని పావురమయ్యెను. ఆడేగ పావురమును దఱుముచుపోఁగా నది శిబిచక్రవర్తిపాదముల నాశ్రయించెను. అతఁడద్దాని కభయ మిచ్చెను. ఇంతలో డేగ "రాజా! నా యాహారమును దాచియుంచుట ధర్మముగాదు. నా కాహారముకావలె" ననెను. అంత శిబి తన శరీరమునుండి మాంసముకోసి డేగ కిచ్చి తన్నాశ్రయించిన పావురమును గాపాడ లేదా? అట్టివంశమునఁ బుట్టి యాడితప్పుట నీ కెంతమాత్రము తగదు. ఇట్లే యలర్కుఁడను రాజర్షి తనకన్నులనడిగిన బ్రాహ్మణునకుఁ గన్నుల నిచ్చెను. సత్యముదప్పిన ధర్మము నశించును. నీవు ప్రతిజ్ఞఁ బాటింపక రాముని యువరాజుగఁ జేసితివేని విషముద్రాగి నీముందటఁ బ్రాణమువిడుతు" ననియె. అంత దశరథుఁడు "మహాపాపీ! నీవిఁక నాభార్యవుగావు. నేను నీకు భర్తనుగాను. నీతో నీ పుత్రుని విడిచిపుచ్చెదను. రాముఁ డరణ్యమునకుఁ బోయిన నేను మరణింతును. నీవును నీకుమారుఁడును నాకు సలిల క్రియలు సేయరాద" నెను. వెంటనే కైకేయి చాల కోపించి "రాజా! ఈ రిత్తమాటలేల? రాము నిప్పుడే యిచ్చోటికిఁ

బిలువనంపుము. నాముందట యరణ్యమునకు బయలుదేరు మనుము" అని గద్దించి పలికెను.

ఇంతలో రాత్రిగడచినది. వేకువజామున మంగళవాద్య ఘోషములు మ్రోగుచుండెను. వసిష్ఠాదులు సకల సన్నాహములుగావించి ముహూర్త మెదురుచూచుచున్నారు. వసిష్ఠుని యానతిచొప్పున సుమంత్రుఁడు కైకేయిగృహంబుఁ జొచ్చి "రాజేంద్రా! రామాభిషేకమునకు వేళయైనది. వసిష్ఠ భగవానుని యాజ్ఞచొప్పున వచ్చియున్నాను. శీఘ్రముగ వచ్చి రామాభిషేకముగావింపు"మనెను.

రాజు దుఃఖ మినుమడింప "రామా, రామా" యని పలువరించుచుండ మాయలాడికైక "సుమంత్రా! రాజు రాముని చ్చటికిఁ దోడ్కొనిరమ్మనుచున్నాఁడు. త్వరపడు" మనెను. సుమంత్రుఁడది రాజాజ్ఞయని తలంచి వెడలిపోయి రామున కావార్తఁ దెలిపెను. వెంటనే రామచంద్రుఁడు సకల శుభవస్త్రా భరణములతో గుంపులుకూడియున్న పౌరులంజూచి వారి మన్ననలఁబొందుచుఁ గైకేయి యంతఃపురముసేరి కళావిహీనుఁడైన తండ్రికిమ్రొక్కి కైకేయికి నమస్కరించెను. దశరథుఁడు "రామా! రామా!" యని నిట్టూర్పు విడుచుచుఁ గన్నీరుగార్చుచుండుటఁజూచి తన్నుజూచినంతనే యానందించి కౌఁగిలించి శిరముమూర్కొనునట్టి తండ్రి ఖిన్నుఁడైయుండుటచే దుఃఖముతోఁ గైకేయికిమ్రొక్కి "తల్లీ! నే నేమరుపాటున నెట్టియపరాధమునైనఁ జేసితినా? నాయందమిత వాత్సల్యము గల నాతండ్రి నాతోఁ బలుకకుండుట కేమి కారణము?

దూరదేశముననున్న భరతుఁడు, శత్రుఘ్నుఁడు క్షేమముగ
నున్నారుకదా! నాకుఁ బ్రత్యక్షదైవమగు నాతండ్రి నాయెడ
దయతప్పియుండుట కేమి కారణము?" అని పరిపరి విధముల
నడుగ సిగ్గుకూడ వదలిన కైక రామునిఁజూచి "రామా!
రాజున కెట్టికోపము లేదుగాని నాకు మున్నిచ్చిన రెండువరముల
నడిగితిని. అందొకటి నిన్ను బదునాలుగేండ్లరణ్యమున ముని
వృత్తినుండఁ బంపుమనుట. రెండవది భరతునకుఁ బట్టము
గట్టుమనుట. నీ వేమికోరిన నిత్తునని రాజు ప్రతిజ్ఞచేయఁగా
నే నీవరముల నడిగితిని. పశ్చాత్తాపముచే రాజు మాఱుమా
టాటలేక సత్యమునకుఁ గట్టువడి ధర్మవిరుద్ధముగ నడచుకొన
నిష్టములేక నోరెత్తి నీతో నీవిషయముసెప్పలేక దుఃఖించుచు
న్నాఁడు. నీవు సత్యసంధుఁడవు. ధర్మబద్ధుఁడవు. నీతండ్రి
మాట వమ్ముగావింపవు. అతని ప్రతిజ్ఞ నెఱవేర్తువని నేనే
రాజునకుమాఱుగాఁ జెప్పుచున్నా"ననెను. అందులకు రామచం
ద్రుఁడు "తల్లీ! రాజాజ్ఞఁగొని యగ్నిలోదూకుదును. విషము
ద్రాగుదును. సముద్రమున మునుంగుదును. రాజు నాకు
తండ్రి, గురుఁడు. అతనియాజ్ఞఁ బాటించుటకంటె ధర్మమొండు
లేదు. అతని యభిమతమని తెలిసియుండిన సీతను భరతున
కిచ్చియుందును, రాజ్యమున్నిత్తును, సకలైశ్వర్యముల నిత్తును.
నాప్రాణమునైన నిత్తును. భరతునిఁ దోడ్కొనివచ్చుటకై
దూతలు వేగమెపోవలె" ననెను. ఇంతలో భాతృభక్తిగల
భరతుఁడువచ్చిన రాముని యడవికిఁ బోనీయఁడని తెలిసి కైక
రామునిజూచి "రామా! నీ వడవికిపోవ నిశ్చయించితివి. ఇఁక
తామసము చేయరాదు. నీవు వెంటనే బయలుదేరకున్న

నీతండ్రి స్నానముచేయఁడు, భోజనముచేయఁడ"నెను. వెంటనే రాముఁడు "తల్లీ నీకిదె నమస్కారము. నాకు రాజ్యకాంక్ష లేదు. భోగభాగ్యములు నా కక్కరలేదు. నే నర్థపరుఁడను గాను. నన్ను వైరాగ్యముగల ఋషివంటివాఁడనని తెలిసికొనుము. తండ్రియాజ్ఞ లేకున్నను నీయాజ్ఞయైనను చాలును. నాతల్లికిని, సీతకును జెప్పి వారిసెలవుపుచ్చుకొనునంతసేపు అనుమతింపుము చాలు"ననెను. ఆమాటవిని దశరథుఁ డేడ్చి మూర్ఛిల్లెను.

రాముఁడు కైకేయికిమ్రొక్కి కొంచెమైనను పట్టాభిషేక భంగమునకు వగవక లాభాలాభములను జయాపజయములను సమముగ నెంచి మట్టి, ఱాయి, బంగారు తుల్యమని యెంచు సమచిత్తుఁడును స్థిరప్రజ్ఞుఁడు నగు రామచంద్రుఁడు కౌసల్య యంతఃపురము సేరెను.

***

# 7. అరణ్యగమనము

రామచంద్రుఁడు అంతఃపురస్త్రీలు బిగ్గఱగ నేడ్చినను నెట్టి మనోవికారములేక హాలాహలముమ్రింగిన శివునివలె దుఃఖముదిగమ్రింగి మహాయోగివలె మార్గమునఁ గలిసికొనిన లక్ష్మణునిఁగూడి కౌసల్యనుజూచెను. ఆసాధ్వి రామునిక్షేమముఁ గోరి బ్రాహ్మణులచే హోమముసేయించుచుండి రామునిఁజూచి నంతనె యెదురువచ్చి యతనికౌఁగిలించి శిరముమూర్కొని రత్నమయాసనమునొసంగె. అంత రాముఁడు 'తల్లీ! నేను చెప్పఁబోవుమాట నీకును లక్ష్మణునకును సీతకును దుఃఖము గలిగించును. అయినను చెప్పెదను. నేను మునివేషముదాల్చి పదునాలుగేండ్లరణ్యవాసముచేయునట్లును భరతుఁడు రాజ్యమేలునట్లును తండ్రియాజ్ఞయైనది' నినంతనే కౌసల్య మూర్ఛిల్లెను. రాముఁడామె కుపచారములుచేయ నామె ప్రజ్ఞఁబొందెను. ఆమె 'కుమారా! నీవుపుట్టకున్నఁ బుత్రుఁడులేనిచింతతోనుందునే, వేయిదేవతలకుమ్రొక్కి వ్రతములుసలిపి నిన్నుఁ గంటినే, నీ కీడురాఁగా నీకు యౌవరాజ్యాభిషేకముజరుగునని కొండంతయాశతోనుంటినే, బూరుగఁగాచిన చిలుకనైతినే, ఆహా! సవతిచే నవమానముసిద్ధించెనే! కైకేయియొక్క దాసీజనులకంటె హీనముగఁజూడఁబడుదునే, నా ప్రాణసమానుఁడవగు నిన్నువిడిచి క్షణమైననుండనోపని నేను బదునాలుగేండ్లు నీయెడఁబాటు సహింతునా? ఇఁక మరణమైనను మేలు. అకాలమరణమును సంభవింపదే. దూడను వెన్నంటుగోవువలె నీ వెంటవచ్చెదను' అని దుఃఖించుచుండఁజూచి సహింపలేని

లక్ష్మణుఁడు 'తల్లీ ! తండ్రి వృద్ధుఁడు, మిక్కిలి కాముకుఁడు, కేవల మాఁడుదానిమాటలువిని పరమపవిత్రుఁడును రూపు దాల్చిన ధర్మమనఁదగు రాముని కానలకుఁబొమ్మనుటకంటెఁ బాపమొండుగలదా? ఇట్టి యధర్మయుక్తమగు మాటల నే పుత్రుఁడు పాటించును? 'అన్నా! అధర్మమువాటించి భరతుని పక్షముచేరి మనలనెదిరింప నీ యయోధ్యయందలి జనులెల్ల రు వచ్చినను నిన్నెదిరింప వీలుగాదు. తండ్రియైనను ధర్మము తప్పినఁ జంపఁదగినవాఁడే' యని చెప్పెను. అంతఁ గౌసల్య రామా! నీవు ధర్మముదెలిసినవాఁడవు. తల్లియే తొలిదైవము. కావున నిచ్చటనుండి నాకు శుశ్రూషలుసేయుము. తండ్రి నీ కెంతపూజ్యుఁడో నేనునంతఁబూజ్యురాలనే. నీవులేకున్న నే నాహారాదులుమాని ప్రాణమువిడుతును. నాసమ్మతిలేక నీవు పోరాద' నెను. అంత రామచంద్రుఁడు 'అమ్మా! నీమాట సత్యమే. అయినను నొక ధర్మసూక్ష్మముగలదు. తల్లియాజ్ఞ కంటెఁ దండ్రియాజ్ఞ బలీయము. జమదగ్నికుమారుఁడగు పరశురాముఁడు తండ్రియాజ్ఞచేఁ దల్లియగు రేణుకను జంపెను. ధర్మాత్ముఁడును బండితుఁడునగు కండుమహర్షి తండ్రియాజ్ఞచే గోవునువధించెను. ఇందువలనఁ బితృవాక్యపరిపాలనమే మాతృ వాక్యపాలనముకంటె నుత్తమమని తెలియుచున్నది. 'లక్ష్మణా! నీవు నాయందత్యంత భక్తిగలవాఁడవు. పరాక్రమవంతుఁడవు. ధైర్యశాలివి. కాని ధర్మమునే యాచరింపవలెనను నా యభి ప్రాయ మెఱుఁగకున్నావు. పురుషార్థములు నాలుగు. ధర్మము, అర్థము, కామము, మోక్షము ఈ నాలుగింటిలో ధర్మము తక్కినవానిని ఫలములుగఁగలది. ధర్మమనుష్ఠించువాఁడే

తక్కినపురుషార్థములకర్హుఁడు. ధర్మబాహ్యుఁడు సుఖలేశముఁ బొందఁజాలఁడు. అర్థపరుఁడు లోకనిందకుఁ బాల్పడును. కామాతురుఁడు నీచుఁడుగ నెన్నఁబడును. తండ్రి మన జన్మమునకు కారకుఁడు, ఆచార్యుఁడు, రాజు, వయసుచెల్లినవాఁడు. అతఁడేకారణముచే నాజ్ఞాసించినను దానిని శిరసా వహించుట పుత్రధర్మము. తండ్రి నన్ను భరతుని నాతల్లిని యాజ్ఞాపింపఁదగినవాఁడు. కౌసల్య భర్తననుసరించుట విధి. అతని మాట నామె పాటింపకఁ దప్పదు. భర్తయే యామెపాలిటి దైవము. అతఁడు జీవించియుండ నతని విడిచి కుమారునితో నుండుట తగదు. అని తల్లివంకఁజూచి "అమ్మా! నీ కిహపరములకు భర్తయే గతి. అతని శుశ్రూషకంటెఁ జేయఁదగినదేదియు నీకు లేదు. కావున నిండుమనసుతో నన్నాశీర్వదించి పంపుము" అని చెప్పెను.

అంత రాముఁడు లక్ష్మణునివంకఁదిరిగి "లక్ష్మణా! పట్టాభిషేకభంగమువలన నీకుఁగలుగు దుఃఖము నాకుఁదెలియుచున్నది. అభిషేకమునకు సంభారములు కూర్చినట్లే నావనవాసమునకుం దగినవస్తువుల సిద్ధముచేయుము. ఇప్పుడు నా యభిషేకమునకుఁ బురుషప్రయత్నములో లోపముగలదా? అట్లయిన దాని భంగపాటునకుఁ గారణమేమి? దైవమే కారణము. నా యం దత్యంతప్రీతిగల కైకేయీదేవి కిట్లు బుద్ధిమాఱవలసిన కారణము దైవమే. అజ్ఞానులు నింద నామెపై మోపుదురు. దైవనిర్ణయమునకు విరుద్ధముగ నెన్నఁడు జరుగదు. లాభాలాభములు, జయాపజయములు, కష్టసుఖములు, శాంతిక్రోధములు దైవమువలనఁ గలుగువియే. అప్పుడు జరిగినవిషయ

ములకుఁ బినతల్లి కైకేయి కారకురాలను బుద్ధిమార్చుకొని దైవమే కారణమని తెలిసికొనుము.

ఆ మాటలు వినిన లక్ష్మణుఁడు 'అన్నా! నీవు తండ్రి మాటఁ బాటింపకున్న లోకులు నవ్వేచేయుదురను భావముతో నిట్లుచేయ నెంచితివి. దైవమును నిగ్రహించు శక్తిగలవాఁడవు నీవు క్షత్రియులలో నుత్తముఁడవు. నీవు దైవము నింతఁగ బొగడుటచే నీకు భ్రాంతిపుట్టినదనియే చెప్పవలసియున్నది. పౌరుషము గలవానికి దైవమాటంకమగునా! పౌరుషహీనులకు బలములేనివారికి దైవము గొప్పగఁదోఁచునుకాని నీవంటి ప్రతాపశాలికి పౌరుషమే దైవముకంటె మిక్కిలి గొప్పది. కేవలము కామములో మునిఁగి తండ్రి పాపియగు కైకవలలోఁ బడి మోహాంధుఁడై ధర్మముతప్పి నడచుకొనఁగానట్టివాని మాటను బాటింప నెంచెద వేల? ఇందువలన నీవు భ్రమచెందితి వనియే చెప్పవలసియున్నది. ఇట్టిస్థితిలో నేనూరకుందునా? ఇప్పుడే మదపుటేనుఁగునుసమర్థుఁడగు మావటీఁడు లోఁబఱచు కొనునట్లు దైవమును నా పౌరుషముచే జయించి పౌరుషమే దైవముకంటె బలీయమని చాటించెదను. నీవు రాజ్యము దీర్ఘ కాలము పాలించి నీ పుత్రునకు రాజ్యమునిచ్చి వానప్రస్థము ననుసరించి వనమునకుఁబోయి తపముసేయుట న్యాయ్యము. దేవతలు దేవేంద్రుని ముందిడుకొనివచ్చినను నేను హతమొం దించి యీరాజ్యము నిష్కంటకముగ నీకిచ్చెదను. నాబాహు వులు, విల్లు. బాణములు, ఖడ్గము నాకలంకారమునకై యుండు నవికావు. నీవు నాకు జ్యేష్ఠుఁడవు. నా పాలిఁటిదేవుఁడవు. నీ యాజ్ఞ నెదురుచూచెదను. అనుజ్ఞ యిమ్ము. అని యావేశము

తో లక్ష్మణుఁడనినమాటలు విని హిమవంతునివలె స్థిరమగు చిత్తముగల రామచంద్రుఁడు లక్ష్మణునిఁజూచి "తమ్ముఁడా! ఇది నీయుద్రేకమువలనవచ్చినమాటలు. నాయందలి ప్రీత్యతిశయముచే గ్రుడ్డివానివలె ధర్మమిదియని తెలియక నిరాకరింప వీలుగాని దైవమును పౌరుషముకంటె హీనమనియు దేవత లెదురైనను జయింతుననియుఁ జెప్పుచున్నావు. మనసు దిటవు చేసికొనుము. ఇంద్రియముల జయింపుము. సుఖింపుము. నన్ననుసరించి నాపనులుసేయు'మని చల్లనిమాటలతో లక్ష్మణుని శాంతచిత్తునిఁ జేసె.

అంత రాముఁడు కౌసల్యనుజూచి "తల్లీ! ఈ యైదుం డ్రేండ్లు దేశ ప్లతిశీఘ్రముగఁ గడపి నీ పాదసేవచేయ వత్తును. తండ్రి వృద్ధుఁడు. పుత్రశోకముతోనున్నవాఁడు. అతనిశుశ్రూష చేయుచు నా రాఁకఁ గోరుచు సంకటము చాలించియుండుము. నాధర్మము నేను నిర్వర్తింపవలెను. నన్నాశీర్వదించి పంపు మని వేఁడ రామునిదృఢసంకల్పము నెదురాడనలేక "కుమారా! నీధర్మబుద్ధి నిన్నురక్షించును. సకలదేవతలు, దిక్పాలురు, భూతప్రేతపిశాచములు, సూర్యచంద్రులు, దిక్కులు, భూమ్యాకాశములు, ఋషులు నిన్నెల్లప్పుడు రక్షించుచుందురుగాక. వృత్రాసురునిఁ జంపిన దేవేంద్రునకును, త్రివిక్రముఁడై మూఁ డడుగుల నిడునప్పుడు హరికిని, యే మంగళముకలిగెనో యా మంగళము నీ కగుఁగాక" యని చెప్పుచుఁ గన్నీరు గార్చుచు నతని క్షేమము గోరుచు మాటిమాటి కతని కౌఁగిలించెను. రాముఁడును దల్లి యడుగులు మాటిమాటికిఁ బట్టుకొని మ్రొక్కెను.

## రాముఁడు సీతకడకుఁ బోవుట.

తల్లియాశీర్వాదములుపొంది రామచంద్రుఁడు సీతకీ సమాచారము తెలుప నిజగృహంబుచొచ్చె. అచ్చట నా సాధ్వి భర్తయొక్క క్షేమముఁగోరి పూజలుసేయుచు ఛత్రచామరాది రాజచిహ్నములతో రాముఁడు వచ్చునని యెదురుచూచుచుండెను. అందుచే రాముఁడు నిరానందుఁడై యెట్టియాడంబరము లేక వచ్చుటనుజూచి మిక్కిలి చింతించి 'నాథా! తెల్లని గొడుగు వింజామరలు వాద్యవిశేషములు బ్రాహ్మణుల వేద ఘోషములతో వత్తువని యెంచితినే. ఎన్నఁడులేని చింత నిన్నావరించియున్న దేల? ఎదురుచూడనిప్రమాద మేమిజరిగినదో చెప్పు'మనియె. అంత రాముఁడు చెప్పరానిదుఃఖమువచ్చినను దాని నణఁచికొని 'జానకీ! నీవు పవిత్రుఁడగు జనకరాజు కూఁతురవు. సకలధర్మములు దెలిసి యనుష్ఠించుదానవు. ఎట్టి విపత్సమయమునను మనస్సు దిటవుచేసికొనఁగలవు. మునుపు నా పినతల్లి కైకేయీదేవికి మా తండ్రి రెండువరములిచ్చెనట. వాని నిప్పుడడిగినది. భరతునకుఁ బట్టముగట్టవలెననుట యొకటి. నేను బదునాలుగేండ్లరణ్యవాసముచేయవలెననుట రెండవది. విధిలేక మా తండ్రి సత్యమునకుఁ గట్టువడి యందులకు సమ్మతించి యాజ్ఞాపించెను. అతనియాజ్ఞ దాఁటరానిది. నీవు దుఃఖింపకుము. నా తమ్ముఁడు భరతుఁడు నాయందు భక్తిగలవాఁడు. శాంతస్వభావుఁడు. నిన్ను గౌరవించును. నీవు నాతని యిష్టముచొప్పున వర్తింపుము. ప్రతిదినము వేకువను లేచి దేవతా పూజలుసేసి నాయందనురాగముగలిగియుండుము. నిన్ను బాసి యుండలేక తపించుచుండు నా తండ్రికిని తల్లికిని శుశ్రూ

పలుచేసి వారి నోదార్పుము. భరతశత్రుఘ్నులను నీతోఁ బుట్టువుగను గుమారుఁడుగను భావింపుము. భయంకరమగు వనమునందు వసింప నీకుఁదగదు. కనుక నాయాజ్ఞగ నీవిచ్చట నుండు'మని హితముచెప్పెను.

సీత రామునిఁజూచి 'రామా! ఎన్నఁడు నన్నువిడిచి యుండుట కిష్టపడని నీవు నేఁడిట్లుపలుకుట వింతగనున్నది. నీ తండ్రి నిన్నరణ్యమునవసింప నాజ్ఞాపించెనంటివి. నేను నీ యర్ధాంగినిగదా, ఆ యాజ్ఞ నాకుమాత్ర మన్వయింపదా? నన్నును వనవాసముచేయుమని యాజ్ఞాపించినట్లే. స్త్రీలకు తల్లి, తండ్రి, కొడుకు, చెలులు ముఖ్యులుగారు. ఇహాపర సుఖముల నీయఁగల భర్తయే పరమగతియగును. బాల్య మునసే నా తల్లిదండ్రులు సతీధర్మమును నాకు బోధించి యున్నారు. సుఖమునందు భర్తననుసరించి కష్టకాలమున వీడి యుండుట సతీధర్మముగాదు. ధర్మమునందును, అర్థమునందును, గామమునందును బతినియనుసరించుట సతీధర్మము. కనుక నన్ను నీవెంటఁ గొనిపొ'మ్మనెను.

అందులకు శ్రీరాముఁడు సీతతో 'ప్రియా! నీ వాడిన మాటలు ధర్మయుక్తమైనవి. కాని యరణ్యమున విఁట్టుపల్ల ములు నానా విధకంటకములు, దట్టమైన వృక్షములు, తీగలు, పొదరిండ్లు చొరరానివై యుండును. కోమలములగు నీ యవ యవములకవి యెంతమాత్రము తగినవికావు. నీవు సుఖముగ జీవించినదానవు. అరణ్యమున సింహములు, పెద్దపులులు, తోడేళ్లు, ఎలుగుబంట్లు, మదపుటేనుఁగులు, కొండచిలువలు, వివిధములగు పాములు, కొండత్రుచ్చులు గలవు. క్రూర

రాక్షసులుగలరు. నదులలో మొసళ్లుగలవు. కొండలు, గుట్టలు, లోయలు, జలపాతములు, లోతైన నదులుగలవు. నీవట్టి కాఱడవులలో సంచరింపలేవు. కాయలు, గడ్డలు, ఫలములు తిని యేటినీరుత్రాగవలెను. ఎండ, గాలి, వానల బాధలకుఁ దాళఁజాలవు. కనుక నీవు నాతోవచ్చుటకు నేను సమ్మతింపననెను.

రామునిమాటలు వినినంత సీత కన్నీరుగార్చుచు 'నాథా! నీతోనుండిన ఘోరనరకము నాకు స్వర్గతుల్యమగును. నీవు లేనిచోటు స్వర్గమేయైనను నాకు నరకమేయగును. నీవు వివరించినకష్టములన్నియు నీ యెడబాటుకంటెఁ గష్టమనియెంచను. నేను నీతో నరణ్యముననున్నను నా తండ్రియింటనున్నట్లే భావింతును. నాకు వనవాసముకలదని జ్యోస్యులుచెప్పియున్నారు. సాముద్రికలక్షణములుదెలిసిన బ్రాహ్మణులును నాకు వనవాసప్రాప్తిగలదని చెప్పియున్నారు. నాకును దపోవనప్రాంతముల వసింపవలెనను కోరికకలదు. నీవు నన్ను దిగవిడిచిపోయినచో విషముద్రాగియో అగ్నిలోఁబ్రవేశించియో నీటమునిఁగియో ప్రాణములోల్పోయెదను' అని చెప్పెను.

రాముఁడామాటలువినియు నామె ననేకవిధములుగ నూరడించెను. కాని సీతాదేవి "రామా! శక్తిహీనుఁడు నీచుఁడు ధనభార్య నింకొకనిస్వాధీనముచేసిపోవును. లోకనాథుఁడగు నీకిదితగునా? ముల్లోకములఁ గాపాడ శక్తుఁడవగు నీవు నన్నుఁగాపాడుకొనలేవా? నాతండ్రి యేమనును? పురుషుని యాకారముగల రాముఁడను స్త్రీకి సీతనిచ్చితినే యని దుఃఖచును. అంతకంటె నవమానము నీకెద్దికలదు? అనినంతనే రామచంద్రుఁడు "మైథిలీ! ఇప్పుడు నీ మనసెట్టిదని చక్కఁగ

నెఱిఁగితిని నీవు నాతో వనవాసముచేయవలెననియే దేవుఁడు నిన్ను సృష్టించియుండవలెను. నీకొఱకు నేను నా పితృవాక్య పరిపాలనాధర్మము వీడను. వేయిదేవతలకు మ్రొక్కుటకంటె కంటికగుపడు తల్లి, తండ్రి. గురువులను బూజించినఁ జాలును. వీరి ననాదరణముసేసిన దేవుఁడు మనపూజల నెంతమాత్ర మంగీకరింపఁడు. కనుక నేననుష్ఠించు పితృవాక్యపాలనావ్రత మున నీవును బాల్గొనుట నా కెంతయు సంతసముగనున్నది. వివాహకాలమున నీ తండ్రి "రామా! ఈ నా కూఁతురు నీ సహధర్మచారిణి. నీడవలె నిన్నెల్లప్పుడును వర్తించున"ని చెప్పినమాట నిజమైనది "నీవిఁక బ్రాహ్మణులకు భృత్యులకును బంధుమిత్రులకును యాత్రాదానముచేసి సిద్ధముగనుండుమ"ని సంత నామె యట్ల గావించెను.

లక్ష్మణుఁడు కౌసల్యామందిరమునుండియు రాముని వెంటనే వచ్చినవాఁడు. అతఁడు రాముఁడు సీతను వెంటగొని పోవుట కెన్ని యాక్షేపణలుసేసెనో చూచినందున పురుష కారముచేయవలెననికోరునట్లు సీతనుజూచి రాముని పాదముల పై సాష్టాంగముగఁ బడి శరణాగతిచేసెను. అప్పుడు రామ చంద్రుఁ డతని లేవనెత్తి కౌఁగిలించి శిరమువాసూర్కొని 'లక్ష్మ ణా! నీవు శైశవమునుండి నన్ను విడువనివాఁడవు, బుద్ధిమంతుఁ డవు, పరాక్రమశాలివి. నీవు నేనులేనిసమయమునఁ దల్లిదం డ్రులకు శుశ్రూషలుచేయుచుండుము. అందుచే నాకు సకల విధోపచారములుచేసినట్లగున'నెను. అంత రామానుజుఁడు 'అన్నా! నీ ప్రభావముచే భరతుఁడు కౌసల్యాసుమిత్రలను దండ్రిని సర్వవిధముల నాదరించును. కౌశల్యాదేవి మహిమ

యపారమైనది. ఆమె సుమిత్రనేగాదు, వేయిమందిని సంరక్షింపఁగలుగును. నేను నిన్నువిడిచి యొక్కక్షణమేని జీవింపలేను. నీదర్శనము నీసేవ నాకు జీవనాధారములు. నీ కరణ్యమున సకలవిధ శుశ్రూషలుచేసి నిన్ను సీతాదేవిని కంటిరెప్పవలెఁ గాచియుండుటకంటె నాకేమికావలసియున్న'దనెను. వెంటనే రాముఁడు 'లక్ష్మణా! నీకోరిక నీడేర్చెద. నీవు నా వెంటరమ్ము. ఇప్పుడు వసిష్ఠపుత్రుఁడగు సుయజ్ఞుని బిలిచిరమ్మ'నెను. సుయజ్ఞుఁడు వచ్చినతోడనె రామచంద్రుఁ డతనికి నమస్కరించి సీతతోఁగూడి ప్రదక్షిణముచేసి తన యాభరణములనిచ్చి యేనుఁగుల ననేకములనిచ్చెను. మఱల లక్ష్మణుని బంపి యగస్త్యపుత్రుని. విశ్వామిత్రుని కుమారుని, రావించి వీ రిరువుర కనేక గొప్పదానములుచేసెను. తనతల్లి కౌసల్యకు సకల వైదికకర్మలఁజేయించు బ్రాహ్మణునకును దండ్రి కత్యంత ప్రీతుఁడగు చిత్రరథుఁడను సారథికిని విలువగల వస్త్రాభరణములిచ్చెను. ఒక బీదబ్రాహ్మణుఁడు 'నేను బహుపుత్రకుఁడను బీదవాఁడ'ననినంత రామచంద్రుఁడా బ్రాహ్మణుని చేతికొక కఱ్ఱనిచ్చి దీనిని విసరివేయుము. అది యెంతదూరమునఁబడునో యంతవఱకుఁగల గోవులనిచ్చెదననినంత నా బ్రాహ్మణుఁడు వేసిన కఱ్ఱ సరయూతీరమునఁబడెను. రాముఁ డంతవఱకుఁగల గోవులసమూహము నాతనికిచ్చి వేడుకకై తానుచేసిన కార్యమునకు క్షమింపవేఁడి పంపెను. బ్రాహ్మణులేగాక తన్నాశ్రయించినవారికందఱికిని భిక్షుకులనందఱిని రావించి యెల్లఱకు సంతోషముగలుగునంత దానములిచ్చి యెల్లఱచే వేనోళ్లఁ బొగడఁబడెను.

## దశరథుని యనుజ్ఞ

సీతారామలక్ష్మణులతో రామచంద్రుఁడు సుమంత్రుని మూలమునఁ దండ్రి యంగీకారముపొంది దశరథుని సందర్శించెను. రామాదులు నమస్కరించుచుండ దశరథుఁడు మూర్ఛిల్లి నేలంబడెను. రామలక్ష్మణు లాతని లేవనెత్తిరి. అంత రాముఁడు 'మహారాజా! నేను లక్ష్మణుఁడు సీతయు వనమునకుంబోవ సిద్ధముగనున్నారము. నీవు మా కందఱకు ననుజ్ఞయిచ్చి యాశీర్వదించిపంపుమ'నెను. రాజు 'రామా! నేను కైకకు వరమిచ్చుటచే మోసపోయితిని నీవు నామాట నిరాకరించి యిచ్చటనేయుండుమ'నెను. రాముఁడుధర్మదేవత. కనుక నతఁడు చేమోడ్చి "తండ్రీ! దుఃఖింపవలదు. నీవు వేనవేలేండ్లు ధర్మపాలనముసేసి ఖ్యాతిపొందితివి. నీవు సత్యసంధుఁడవు. కైకేయికి నీవిచ్చినవరమువృథా కారాదు. పదునాలుగేండ్లవలీఁలగఁ గడపి తిరిగివచ్చి నీ పాదసేవచేయుదును. నిన్ను సత్యప్రతిజ్ఞుని జేయుటకంటె నాకుఁ జేయఁదగినకార్యమొండులేదు. చింతలేక నా కనుజ్ఞయిమ్ము"నిన రాజుచేయునదిలేక "రామా! నీవు సత్యవ్రతుఁడవు. ధర్మముదప్పనివాఁడవు. నీ దృఢసంకల్పము మరల్పరానిది. అట్లే పోయిరమ్ము. కాని నేఁడిచ్చటనుండి పొమ్ము. నాకు నీతోఁ గొంతకాలముండుభాగ్యమబ్బు"ననెను. రామచంద్రుఁడు చేమోడ్చి "తండ్రీ! ప్రత్యక్షదైవమవగు నిన్ను వేఁడుచున్నాను. ఇఁక నొక్కక్షణమేని యుండఁదగదు. నా కనుజ్ఞయిచ్చిపంపు"మనెను. అంత దశరథుఁడు "రామా! సకల దేవతలు నిన్ను రక్షింతురుగాక యని కొడుకును గౌఁగి

లించుకొని మూర్ఛిల్లెను. కైకయొక్కతె తప్పఁ దక్కిన రాజపత్నులెల్లరు రోదనముచేసిరి.

## సుమిత్రుఁడు కైకను దూఱుట.

అచ్చట నుండిన సుమంత్రుఁ డమితకోపముచెంది 'కైకేయీదేవీ! నీవు రాజకులమునఁ బుట్టినదానవు. లోకోత్తరుఁడగు దశరథుని భార్యవు ధర్మమునకుఁ బ్రసిద్ధిఁజెందిన యిక్ష్వాకువంశగౌరవము నాశనముచేయఁబూనితివి. వృద్ధుఁడై జ్యేష్ఠకుమారునకు యౌవరాజ్య మీయఁదలఁచిన రాజును వరమను నెపమునఁ గట్టివైచితివి. జ్యేష్ఠుఁ డుండఁగఁ గనిష్ఠుని రాజుగఁజేయు నధర్మము నెలకొల్ప నెంచితివి. నీ తల్లివంటిబుద్ధి నీకున్నది. మహాత్ముఁడగు నీ తండ్రి యొక యుత్తమబ్రాహ్మణునివలన నొక వరముఁ బొందెను. అందుచే నతఁడు సకలజీవుల భాషల నెఱింగెను. ఒకనాఁ డతఁడు తన పడకక్రిందనుండిన చీమ పలికినమాటవిని నవ్వెను. నీతల్లి నెంటనే తన్ను భర్త పరిహాసముచేసినవ్వెనని తలఁచి పతితో 'రాజా! నీవిప్పుడు నవ్విన కారణమేమ'ని యడిగెను. అంత నతఁడు దానినిచెప్పిన నా ప్రాణముపోవు ననెను. వెంటనే నీతల్లి 'నీప్రాణమున్నను బోయినను చెప్పితీరవలెన'నెను. నీతండ్రి యా వరమొసఁగిన బ్రాహ్మణుని యడుగ నతఁడు 'రాజా! నీచావునకు వెఱువని భార్య యున్ననేమి లేకున్ననేమి' యనినంత రాజామెకు బదులుచెప్పక నామెను ద్రోసిపుచ్చెను. అట్టి కఠినాత్మురాలి కూఁతురవగు నీకిట్టి బుద్ధిపుట్టినది. లోకమున "తండ్రిగుణము కుమారునకును, దల్లిగుణము కూఁతునకును వచ్చుననుట నిజమైనది. ఇట్టి విపరీత

బుద్ధిచే నీవడిగిన వరములచేఁ గలిగిన యనర్థములకు నిన్ను లోకము నిందించుచున్నది. ఇప్పుడైనను నీబుద్ధిని మార్చుకొను మని చెప్పెను. కైక జాలిగొన్నదికాదు.

దశరథుఁడు రాముని వెంట చతురంగబలమును విరివిగ వస్తువాహనములును ధనధాన్యములును బోవలెనని నంత కైకేయి "రాముఁడు ఋషివలెఁ బోవలయున"నెను. సిద్ధార్థుఁ డను వృద్ధమంత్రి బుద్ధిచెప్పెను. ఎవరేమిచెప్పినను కైకేయి చలించినదికాదు.

వెంటనే రామచంద్రుఁడు వినయముతో "మహారాజా! సర్వసంగత్యాగముచేయు నాకు సైన్యముతో నక్కఱలేదు. ధనధాన్యము లక్కఱలేదు. నారచీరలు గందమూలములు త్రవ్వుకొన గుద్దలియుఁ బుటికయు దెప్పింపుమ"నెను. వెంటనే కైకేయి నారచీరలు రామునకిచ్చెను. రామలక్ష్మణులు దమ వస్త్రాభరణములఁదీసి నారచీరలు ధరించిరి. సీతాదేవి నారచీర కట్టుకొనఁజాలక నొకటిమెడపై వైచుకొని యింకొకటిచేతఁ బట్టుకొనియుండ రాముఁడామెకాచీరగట్టఁబోయెను. అచ్చట నుండినవారంద ఱేడ్వసాగిరి. అంత వసిష్ఠుఁడు సీత నారచీర కట్టుకొనవలదని వారించి కైకవంకఁదిరిగి "కైకేయీ! చాలు నీయాగడము. రాజును మోసముచేసినదానవు. సీతాదేవి యడ వికిఁబోవ నగత్యములేదు. ఆమె సింహాసనమెక్కి పాలింప నగును. అట్లుగాదేని మేమందఱము రామునితో నరణ్యమునకుఁ బోయెదము. అయోధ్యలో జనులెవ్వరు నుండరు. ఇఁక భర తుఁడు రామభక్తుఁడే. నీకోరిక యీడేరదు పశుపక్షులును

రాముని వెంటబోవును. నీవు రామునిమాత్రె మడవికిఁబోవఁ గోరితివి. సీతనుగాదు, ఆమెకు సకల వస్త్రాభరణములిచ్చి పంపుమ"నెను.

ప య న ము.

దశరథుఁడు శోకించి మూర్ఛిల్లి తెలివిపొంది "సుమంత్రా! రథము నాయత్తపఱపుము. సీతకుఁ బదునాలుగేండ్లకు వలసిన వస్త్రాభరణములనిచ్చి గంగానదివఱకుఁ గొనిపొమ్మ"నెను. సుమంత్రుఁడు రాజాజ్ఞ నెఱవేర్చెను. కౌసల్య సీతను కౌఁగిలించి లోకమున స్త్రీలు భర్తలు దమకిష్టమగు వస్తువుల నిచ్చి వారి యిష్టానుసారము నడచుకొనినవారినిఁ బ్రేమింతురు. వారికొకింత యప్రీతిగాని యసౌఖ్యముగాని కలిగించినంతనే భర్తలఁదూషింతురు. స్త్రీలు చంచలమనస్కలు. అర్థపరులు. సుఖమునే వాంఛింతురు. సీతా! నీవిట్లు ధర్మముతప్పక సంపదయందును దారిద్ర్యమునందును భర్తను దైవముగ నెంచి యుండుట నాకానందమిచ్చుచున్నది. ఈబుద్ధి నీకు మాఱకుండుఁగాక"యనెను. అంత సీతాదేవి యత్తకుమ్రొక్కి "తల్లీ! మీయాజ్ఞఁ బాటింతును. లోకమున స్త్రీలకు భర్తకంటె వేఱొండుదైవము లేదు. ఏదేవతను బూజింపకున్నను భర్తను భక్తితోఁగొలిచిన నిహపరములుగలుగునని యెఱుంగుదును" అనెను. రాముఁడు రాజపత్నులకును రాజునకును వసిష్ఠాదులకును నంజలిగీలించి కౌసల్యనుజూచి "తల్లీ! శీఘ్రముననె వనవాసముగడపివత్తును. నీవు తండ్రిని జాగరూకతతోఁ జూచుకొను"మని చెప్పి మున్నూటయేఁబదిమందితల్లులకు నమస్కరించి సెలవుపుచ్చుకొనెను. వెంటనే లక్ష్మణుఁడు కౌసల్యకు

మ్రొక్కి తన తల్లియగు సుమిత్రపాదములంబట్టికొని నమస్కరించెను. సుమిత్రయుఁ గొంత దుఃఖించి "పుత్రకా! నీవు నన్నుఁ గూర్చిగాని తండ్రినిగూర్చిగాని యయోధ్యనుగూర్చిగాని దుఃఖింపరాదు. రాముఁడుండుచోటే యయోధ్యయనియు రాముఁడే తండ్రియనియు సీతయే నేననియు భావించి సీతారాముల నేమఱక రక్షించుచుండుము. నీకు రాముఁడేగతియని నమ్ముము. సుఖముగఁబోయిర"మ్మని యాశీర్వదించెను.

ఇంతలో సుమంత్రుఁడు ప్రార్థించి సీత వస్త్రాభరణములతో రథమెక్కెను. రామలక్ష్మణులును రథము నారోహించిరి. సుమంత్రుఁడు ధనువులను బాణములను తూణీరములను గుద్దలిని పుటికను రథముననుంచెను. సుమంత్రుఁడు సారథ్యము చేయుచు రథమునడపెను. పురజనులెల్లరు సీతారామలక్ష్మణుల వనవాసముగూర్చి బిగ్గఱగ నేడ్చిరి. వారెల్లరు రథము వెంటఁబోయిరి. అయోధ్య జనశూన్యంబయ్యె. మృగములు పక్షులు నాదిన మాహారముచాలించి చింతలోమునిఁగెను. ఇఁక కౌసల్యాదశరథుల దుఃఖాతిశయములఁగూర్చి చెప్పనేల! అనేక దుశ్శకునము లగుపడినవి. పరిపరివిధముల రామునిఁ దలఁచి యేడ్చుచున్న కౌసల్యనుజూచి సుమిత్ర ఆర్యా! నీ పుత్రుఁడు ధర్మనిధి, సత్యసంధుఁడు. పితృవాక్యపరిపాలనము చేసి ధన్యుఁడయినవాఁడు. ఆశను జయించినవాఁడు. జితేంద్రియుఁడు. సకలప్రాణులకు హితమేచేయువాఁడు. సూర్యుఁడతనికిఁ దాపముగలిగింపఁడు. చంద్రుఁడతనిదుఃఖముపోగొట్టును. వాయుతవని కనుకూలముగ వీచును. భూతపిశాచాదులతని దరిఁజేరవు. దిక్పాలురతని రక్షింతురు. దేవతలతనిఁ

గాపాడుదురు. సీత లక్ష్మివంటి యుత్తమురాలు. మహాపతివ్రత. భర్తయొక్క ధర్మమును దా ననుష్ఠించునది. హాయిగ వనవాసముగడపి వారు మరలివత్తురు. దుఃఖింపకుమనెను.

రాముఁడు తమసానదీతీరమున మొదటిరాత్రి గడిపెను. మఱునాఁడుదయమున వేకువ లేచి అయోధ్యాపురముజనులు నిద్రించుచుండఁగా సుమంత్రునిరథము పురమువైపు కొంత దూరముపోనిచ్చి మరల్చితెమ్మని యందుఁగూర్చుండి వెడలి పోయెను. ప్రజలు రాముఁ డయోధ్యకుఁబోయెనని తలఁచి పురముసేరిరి. రాముఁడు వేదశ్రుతిగోమతులనెడు నదులను దాఁటి కోసలదేశముగడచి గంగాతీరముసేరెను. ఆ నది విష్ణుదేవునిపాదమునఁబుట్టినది. శివుని జటాజూటమునుండి వెలువడి నది. భగీరథుని తపఃప్రభావమున భూలోకమునఁబారి సముద్రునిచేరినది. ఆ నదియొక్క గాంభీర్యమునుజూచి సంతోషించి సీతకు నా ప్రదేశసౌకర్యములఁజూపుచు నొక గొప్ప గారచెట్టు వద్ద దిగి గుఱ్ఱముల విడిపించి రాముఁడు గూర్చుండియుండెను. ఇంతలో నాదేశపురాజు బోయజాతివాఁడు గుహుఁడు రాముని రాకవిని తనమంత్రులతో వచ్చుటఁజూచి రాముఁడు లక్ష్మణునిఁ గూడి యతని నెదురొక్కనెను. గుహుఁడు రాముని మునివేషమునుజూచి చాల దుఃఖించి రాముని కౌఁగిలించి "రామా! నా పట్టణము నీ కయోధ్యవంటిదని భావించి నీవిచ్చట నేయుండి వనవాసదినములు గడిపి పొమ్మ"నెను. రాముఁడతని యాలింగనముచేసికొని "గుహా! నీవు నాయందుఁ గనబఱచు ప్రేమయే చాలును. నీవు నీమంత్రులతో సుఖముగ రాజ్యపాలనము చేయుచున్నావా? నీ బంధుమిత్రులును నీ దేశపు ప్రజలును

సుఖముగనున్నారా? నేనిప్పుడు తండ్రియాజ్ఞచొప్పున నియమముపాటింపవలసియుండుటచే నీవు తెచ్చినభక్ష్యభోజ్యలేహ్యాదులఁ గైకొన వీలులేదు. గుఱ్ఱములకు గడ్డినిమ్ము" అని చెప్పి సంధ్యాకాల ఆహ్నికములుముగించి యాచమించి లక్ష్మణుఁడు తెచ్చిన గంగాజలము పానముచేసి సీతాదేవితో నేలపైఁబరుండెను. గుహుఁడును లక్ష్మణుఁడును సుమంత్రుఁడును విల్లునంబులు ధరించి సీతారాముల రక్షించుచుండ గుహుఁడు లక్ష్మణునిఁజూచి "ఆర్యా! నీవు సుకుమారుఁడవు. నిద్రపొమ్ము. నేనును నావారును మీకుఁ గాపుండెద"మనెను. లక్ష్మణుఁడు గుహునితో "అనఘా! రామునియెడ నీకుంగల నెయ్య మసారమైనది. మా తండ్రి యజ్ఞములుసేసి వ్రతములుసలిపి దేవతలకు మ్రొక్కి-పడసిన మా యన్న సకలలోకముల నేలంజాలువాఁడు కటిక నేలఁబరుండియున్నాఁడు. మిక్కిలి సుకుమారియగు సీతాదేవి నేలఁబవ్వళించియున్నది. తల్లిదండ్రులను బంధుమిత్రులను రక్షకభటులను వదలివచ్చిన రామచంద్రునకు సేవచేయుట కంటె నిద్రముఖ్యమా"యనినంత గుహుఁడు లక్ష్మణుని భ్రాతృభక్తి కాశ్చర్యపడెను. గుహుఁడు రామునికోరికచొప్పున గొప్ప ఓడను సిద్ధపఱచెను. రాముఁడు సుమంత్రునిఁజూచి "మిత్రమా! మా వంశమునకు నీకంటె నాప్తులు మఱియెవ్వరు గలరు? నీ స్వామిభక్తి నాకుఁదెలియును. నీవు నాతోవచ్చుట తగదు. నాకు మాఱుగ నా తల్లిదండ్రులకు హితముచెప్పి వారి నోదార్చి రక్షించుభారము నీది"యని మరలిపొమ్మనెను. అంత సుమంత్రుఁడు చాల దుఃఖించి రథముతోలుకొనిపోయెను.

# 8. పాదుకాపట్టాభిషేకము.

ఇంతలో గుహునిఁజూచి "గుహా! నీ నెయ్యము మఱువరానిది. ఇప్పుడు నేను తండ్రిమాట పాటించి యడవులలో నుండవలెను. మఱ్ఱిపాలు తెమ్మ"నెను. అతఁడట్లేచేయ రామలక్ష్మణులు జడలుదాల్చిరి. రాముఁడు గుహుని సుమంత్రుని వీడుకొలిపి సీతాలక్ష్మణులఁగూడి యోడనెక్కిపోవుచు గంగాదేవిని సురక్షితముగ వనవాసముగడపివచ్చున ట్లనుగ్రహింప వేఁడెను. దక్షిణతీరముసేరి యోడదిగి రాముఁడు నావికుల ననుగ్రహించి లక్ష్మణుఁడు ముందుగను సీత మధ్యగనుండునట్లు చెప్పి తాను వారిరువుర వెనుకఁజనుచు "లక్ష్మణా! మనమిప్పుడు మనుష్యసంచారములేని యరణ్యమునఁ బోవుచున్నారము. మెలకువతో మెలఁగవలె"ననెను. వారు వత్సదేశముచేరి డస్సి యొకవృక్షముక్రింద నారాత్రిఁ గడిపిరి. రాముఁడు "లక్ష్మణా! తండ్రి కామాతురుఁడై నన్నడవికిఁబంపి మిక్కిలి దుఃఖించుచుండును. కౌసల్య నన్నువిడిచియుండనేరక బహువిధముల దుఃఖించుచుండును. నీవు నాకుమాఱుగా నామెకు శుశ్రూషలు చేయుచుండుటకై పొమ్ము" అనెను. అంత లక్ష్మణుఁడు "అన్నా! సీతాదేవివలె నేనును నిన్నువిడిచి యొక్కక్షణమైనను జీవించియుండలేను. స్వర్గమైనను నీవులేనిచో నేనొల్ల"ననియె. రాముఁడామాటలువిని తృప్తుఁడై సీతాలక్ష్మణులఁగూడి యారాత్రి గడపి మఱునాఁ డుదయము బయలుదేరి గంగా యమునా సంగమస్థలము సమీపించి భరద్వాజాశ్రమముచేరెను. మహర్షి సీతారామలక్ష్మణుల నత్యాదరమునఁ బూజించెను. జనసంచారములేక వాసయోగ్యమగు స్థలమేది యని రాముఁడడుగ

మునీంద్రుఁడు "పదిక్రోసుల దూరమున చిత్రకూట పర్వత మున్నది. అది మిక్కిలి రమణీయమై సీతవసతిగలిగి బహువిధ ఫలవృక్షములతో నిండియున్నది. ఆ ప్రాంతమున ఋషులనేకులు వసించుచున్నారని చెప్పెను. ఆరాత్రి యచ్చటగడపి రామచంద్రుఁడు మునికిమ్రొక్కి యతనియనుజ్ఞఁబొంది మఱునాఁడుదయము ఋషియానతిచ్చినగుర్తుల ననుసరించి పయనముచేసి యమునానదిని దాఁటి శ్యామంబను మఱ్ఱిచెట్టును చూచెను. ఆరాత్రి యచ్చటనిద్రించి మఱునాఁడుదయమున బయలుదేరి చిత్రకూటముఁజేరి వాల్మీక్యాశ్రమముసొచ్చి యమ్మునికిమ్రొక్కి యతని దీవనలఁబడసి యొక సమప్రదేశమునఁ బర్ణశాల నిర్మించుకొనిరి. రాముఁడు శాస్త్రప్రకారము భూతశాంతిచేయఁగా వారా యాకుటింటిలోఁ గాపురముసేసిరి.

గుహుఁడు రాముఁడు దక్షిణపుఁగట్టు చేరునంతదనుక చూచుచుండి సుమంత్రునితో శృంగిబేరపురమునకుఁబోయెను. అతఁడు చారులమూలమున రాముఁడు చిత్రకూటముచేరెనని వినెను. సుమంత్రుఁడు గుహుని వీడ్కొని మూఁడవనాటి సాయంకాల మయోధ్యఁజేరెను. పాడుపడినట్లుతోఁచు నగరము కళావిహీనమైయుండెను. జనులు రాముని గుణములను బొగడుచు నతని యరణ్యవాసముగూర్చి చింతిల్లుచుండుటఁ గని సుమంత్రుఁడు దశరథునిమందిరమునకుఁ బోయెను. సుమంత్రునిఁ జూచినవెంటనే దశరథుఁడు దుఃఖముచే మూర్ఛిల్లెను. అంతఃపురస్త్రీలందఱు రోదనముసేసిరి. మఱల నతఁడు ప్రజ్ఞఁ బొంది "సుమంత్రా! నా యనుంగుపుత్రుఁడు రాముఁ డెచ్చట నున్నాఁడు? అతఁ డేమితినుచున్నాఁడు? ఎచ్చట నిద్రించు

చున్నాడు? నాతో నేమిచెప్పుమనెను?" అని యడుగ సుమంత్రుడు నమస్కరించి "ప్రభువరేణ్యా! రాముడు నీ పాదములంటి నమస్కరించె"ననెను. అతడిట్లు చెప్పెను. "సూతా! నాతండ్రి కడు వృద్ధుడు. నావియోగముచే గుందు చుండును. నేనిచ్చట సౌఖ్యముగనున్నాను. సీతాలక్ష్మణులును నాతో సుఖముగనున్నారు. శీఘ్రమున నే నరణ్యవాసముతీర్చి యతని పాదసేవచేతును" కౌసల్యనుజూచి సుమంత్రుడు రామచంద్రుడు నీకు నమస్కరించి యిట్లనెను. "తల్లీ! నీవు నాయెడబాటును ధైర్యముతో నోర్చికొనుము. నీ భర్తయగు నా తండ్రిని యనాదరణముచేయకుము. అతని కన్నివిధముల శుశ్రూషలుచేసి యతనిదుఃఖమును బోగొట్టుము. నేను పదు నాలుగేండ్లుగడపి నీ పాదసేవచేయ వచ్చెద"ననెను. అతడు భరతునితో "భరతా! నీవు నా తల్లియెడ బ్రీతిగలవాడవు. నీ తల్లివలెనే నా తల్లినిభావించి ప్రేమించి నాకుమారుగా నామె కుపచారములుచేసి యామెదుఃఖము పోగొట్టు"మనెను. అతడు సుమిత్రకు దన నమస్కారములు చెల్లింపుమనెను. నేను రథముగొనివచ్చునపుడు సీతారామలక్ష్మణులు చింతిల్లి నన్నేకవిధములుగ నోదార్చిరనెను. అంత గౌసల్య మిక్కిలి శోకింప సుమంత్రు డామెనోదార్చెను. కౌసల్య రాము నడవికి బంపినందున దశరథుని కొంచెము పరుషవచనములాడి పదంపడి తానుచేసిన యపరాధమును మన్నింప రాజును వేడెను.

## దశరథుని మరణము.

అంత దశరథుఁడు దనకుఁగలిగిన ముని శాపమును కౌసల్యకుఁజెప్పెను. "కౌసల్యా! నేను యౌవనమునందు కాలమున వేటకై వనమునకేగి రాత్రిపూట శబ్దమునుబట్టి బాణముతో జంతువుల జంపుచుండ నొకచోట నేనుఁగు నీరు ద్రాగుచుండునట్లు శబ్దమురాఁగా వెంటనే బాణమువదలితిని. అది నీరుముంచుకొనుచున్న నొక్క మునికుమారుని రొమ్ము నొచ్చినది. అతఁడు "ఆహా! నన్నెవ్వఁడో నిష్కారణముగఁ గొట్టెనే యని యఱచెను. తోడనే నే నచ్చోటికిఁబోయితిని. అతఁడు నన్నుజూచి "రాజా! ఎట్టిపాపముసేయని నన్నిట్లు చంపుట న్యాయమా? ముదుసలులును గ్రుడ్డివారునగు నా జననీజనకులు దప్పిగొని నీరుతెమ్మనిచెప్ప నే నిచ్చటికివచ్చితి. నా ప్రాణముపోవుటకై నే నెంతమాత్రము చింతింపను. నా మరణవార్తవినినంతనె వా రిరువురు తప్పక నసువులువాయుట నిజము. నీవీ బాణము దీసివైచి యీ నీరుగొనిపోయి చెంత నున్న నా తల్లిదండ్రులకిచ్చి నా వృత్తాంతము వారికిఁజెప్పి వారిక్షమాపణఁగోరుము" అనినంతనే నాయమ్ము నతని శరీరము నుండి తీసివైచితిని. అతఁడంత మరణించెను. భయముచేతను దుఃఖముచేతను బీడింపఁబడినవాఁడనై నే నా జలకుంభము నెత్తికొని యా మునిదంపతులున్నయెడకుం బోయితిని. నా చప్పుడువిని వారు "నాయనా! ఇంతతడవేలయైనది? మా మీఁద నీకేమి యలుక? మాకు మిక్కిలి దప్పిగయున్నదే. రమ్ము. తీర్థమునిమ్మ"ని చెప్పిరి. నేను మనసు దిటవుచేసి కొని "మునీశ్వరా! నేను దశరథుఁడను. శబ్దవేదియగుట

యేనుఁగు నీరుద్రావుచున్నదని యెంచి బాణము వేయ నదితగిలి మీ పుత్రుఁడు మీ సంగతిచెప్పి బాణము తీసి వేయుమనెను. నేనట్లుచేసినతోడనే మరణించెను. ఇట్లు తెలియక మీపుత్రుని ప్రమాదవశమున వధించిన నన్నుక్షమింపుఁడని వేఁడితిని. వారు దుఃఖముతో మూర్ఛిల్లి కొంత వడికి తెలివొంది పుత్రునికడకు దమ్ము గొంపోవునట్లు కోరిరి. నే నట్లేచేసితిని. వారా బాలుని శవమునుదాకి పలువిధములుగఁ బనవి పనవియేడ్చిరి. వారు నన్నుజూచి "రాజా! నీవు తెలియకచేసితివి. అయినను మావలె నీవిట్టి దుఃఖము నీజన్మముననే యనుభవింతు"వని శపించి యగ్నిప్రవేశముచేసిరి. కౌసల్యా! ఆ శాపఫలము నన్నిట్లుచేసినది. నా కిప్పుడు గన్నులగుపడవు. ప్రాణముపోవుచున్నది. నీవు నీచేతితో నన్నుదాకుమనుచు దశరథుఁడు మరణించెను. కౌసల్యాది రాజపత్నులెల్లను శోకసాగరమున మునిఁగిరి. వసిష్ఠాది మునులయాజ్ఞఁగొని మంత్రులు దశరథుని కళేబరమును తైలద్రోణియందునిచిరి. ఆ రాత్రి గడచెను.

## భరతుని రాక.

---

మఱునాఁడుదయము మార్కండేయుఁడు, మౌద్గల్యుఁడు, వామదేవుఁడు, కాశ్యపుఁడు, కాత్యాయనుఁడు, గౌతముఁడు జాబాలియను ఋషిపుంగవులు వసిష్ఠునిచూచి "బ్రహ్మర్షీ! రాజులేని రాజ్యము క్షీణించును. ధర్మ మడుగంటును. ప్రజలు వారివారిపనులఁ జేయరు. పెద్దలమాట పిన్నలు పాటింపరు. భర్తమాట భార్యవినదు. గురువుమాట శిష్యులు వినరు. ఒకరిసొత్తు నొకరపహరింతురు. జనులు నీతినియమ

ములు, సదాచారములు, కులధర్మములు పాటింపరు. అట్టిదేశ మున ఋతుధర్మములు తప్పిపోవును. వర్షముకురియదు. పైరు పంటలు క్షీణించును. జను లన్నపానములు లేక తపింతురు. చోరులబాధ హెచ్చును. మీనములవలె బలవంతులు బల హీనులఁజంపుదురు. దేవతాపూజలుజరుగవు కనుక నిక్ష్వాకు వంశమునఁ బట్టినవాని నొకనిని రాజుగా నియమింపు"మని ప్రార్థించిరి.

అంత వసిష్ఠుఁడు మంత్రులతో "మీరు కేకయరాజ పట్టణమగు రాజగృహమున మేనమామయింటనున్న భరతుని తో 'వసిష్ఠులవారు వెంటనేరమ్మనిరి. అత్యావసరమగు పని యున్నదఁట' యని మాత్రము సెప్పుడు. మీ ముఖముల నెంత మాత్రము దుఃఖ మగుపడరాదు. భరతునితో రాజుమరణముఁ గూర్చిగాని రామలక్ష్మణుల వనవాసముఁగూర్చిగాని పలుక రాదు" అని చెప్పఁగా నా మంత్రులు వెంటనే వడిగలగుఱ్ఱముల నెక్కి బయలుదేరిరి. వారెప్పటివలెఁ గేకయరాజునకును భర తునకును మేలగు వస్త్రభూషణములు గొనిపోయిరి. శ్రమము నెంతమాత్రము పాటింపని దూతలా రాత్రియే రాజగృహము సేరి మఱునాఁడుదయము భరతునిదర్శించి వారా యూరు సేరిన రాత్రి భరతుఁడు దుస్స్వప్నముఁగని మఱునాఁడుదయము స్నే హితులతోఁ దన స్వప్నవృత్తాంతము సెప్పుచుండఁగా దూతలు వచ్చిరి. వారు భరతునకు నమస్కరించి "అగత్యమగు కార్య మున్నదఁట. వసిష్ఠులవారు వెంటనే మిమ్ముఁదోడ్కొనిరమ్మని యానతిచ్చి"రనిరి. అంత భరతుఁడు దూతలు తెచ్చిన వస్త్రా భరణాదులను మామకును దాతకు నిచ్చి దూతలు తెచ్చిన

సందేశమును దెలిపి వారిచ్చిన వస్త్రభూషణ ధనకనక వస్తు వాహనముల గ్రహించి యయోధ్యాపురమునకు బయలు దేరెను. మార్గమున ననేక పర్వతములను నదులను వనములను దాఁటి తన రాజ్యముయొక్క పొలిమేరఁ జేరినంతఁ బరివార మును శత్రుఘ్నువశముచేసి తాను వడిగలగుఱ్ఱముల నెక్కి ముందుగఁ బయనమై రాజగృహము వదలిన నెనిమిదవదిన మయోధ్యఁ జేరెను. ఆ నగరము కళావిహీనమై మార్గములు నిర్జనమై యుద్యానవనములు మనుష్యసంచారము లేకుండుటను జనులు దుఃఖముతో నుండుటనుగాంచి బహువిధములఁ జింతిం చుచు దశరథునిగృహమునకుఁ బోయెను. అతఁ డచ్చట లేనం దునఁ దల్లియింటి కేగెను.

## భరతుని దుఃఖము.

భరతుఁడు కైకేయికి సాష్టాంగముగ బ్రమొక్కెను. దూరదేశమునుండివచ్చిన పుత్రునిజూచి యామె దిగ్గునలేచి కౌఁగిలించి శిరమునూర్కొని యొడిలోఁగూర్చుండఁబెట్టికొని "నాయనా! తాతగారును మామయు క్షేమముగనున్నారా?" యని యడిగెను. అంత భరతుఁడు "తల్లీ! తాతయు మామ యును సుఖముగనున్నారు. వారు నాకిచ్చిన వస్తువాహనములు వచ్చుచున్నవి. దూతలు త్వరపఱచుటచే నేను ముందుగవచ్చి తిని. తండ్రి యెచ్చటనున్నాఁడు? నేనాతనికి నమస్కరింప వలెను. నీతో నిచ్చటనున్నాఁడనుకొంటి నే"యనెను. కైకేయి "కుమారా! ప్రపంచములోఁబుట్టిన ప్రాణులన్నియుఁ జేరవల సినచోటు చేరినాఁడు"అనెను. ఆమాటవినినతోడనే భరతుఁడు

నేలఁబడి మూర్ఛిల్లెను. కొంతసేపటికి తతఁడు తెప్పిఱిల్లి "అయ్యో! తండ్రి రామునకుఁ బట్టముఁగట్టనెంచి రమ్మనెనో, యజ్ఞముచేయనెంచెనో యని తలఁచితినిగాని యిట్టి శోకసమాచారము విందుననుకొనలేదే. నాకింక దిక్కెవరు? నన్ను గారాముగఁజూచుతండ్రి గతించెనే, నన్నిఁక యాదరముతోఁ బిలుచువారెవ్వరు? అమ్మా! తండ్రి యేమిచెప్పిపోయెనో వినఁగోరెద"ననెను. నీతండ్రి "హా రామా! హా సీతా! హా లక్ష్మణా! మిమ్ము మరలివచ్చినఁబిదపఁజూచు భాగ్యము లేక పోయెనే యని చెప్పుచు మరణించె"ననెను. వ్రణమును సూదితోఁ బొడిచినట్లయ్యెను. గోరుచుట్టుమీఁద రోకటిపోటుపడినట్లయ్యెను. తండ్రి మరణముచే దుఃఖములో మునుఁగుచుండు వానికి రాముఁడు, సీత, లక్ష్మణుఁడు లేరని వినఁగా మితిమించిన దుఃఖముకలిగెను. అతఁడు "తల్లీ! తండ్రిమరణము చాలక సీతారామలక్ష్మణులు లేరనుచున్నావే వారెచ్చటికిఁబోయిరో యేలబోయిరో చెప్పు"మనెను. కైకేయి "పుత్రకా! రాముఁడెట్టియకృత్యముఁజేయలేదు. రాజతనికిఁ బట్టాభిషేకముసేయఁ బూవ నేను మీతండ్రిని రెండువరములడిగితిని. నీకు బట్టము గట్టవలెననుట యొకటి. రాముఁడు పదునాలుగేండ్లరణ్యమున వసింపవలెననుట రెండవది. ఇంతకుముందు రాజు నాకిచ్చిన వరముల నిప్పుడడిగితిని గాని వేఱొండుగాదు. నీవు శీఘ్రమున నీతండ్రి కుత్తరక్రియలుసేసి పట్టముఁగట్టుకొ"మ్మనెను.

పిడుగువంటి యామాటలు వినఁగానే భరతుఁడు పట్టరాని దుఃఖముతో "అయ్యో, దైవమా! నేనెంతటిపాపాత్ముఁడను. తండ్రినిగోల్పోయి తండ్రికిసమానుఁడగు నా సోదరు

నడవిపాలుసేసి జీవించు టెట్లు? ఓ పాపాత్మురాలా! ధర్మమునకుఁ బ్రసిద్ధమగు మాపవిత్ర వంశగౌరవము నాశ మొందింప వచ్చిన దయ్యమా! రాముని యందు గౌరవముచే నిన్నుఁ జంపకున్నాను. నీ తల్లివలె నీవును రాజ్యభ్రష్టవుకమ్ము. ఇఁక నీవఱకు నేను చచ్చినట్లే. నీమాటవిందునా? రాజ్యము గైకొందునా? రాముని గొనివచ్చి పట్టముగట్టి నే నడవుల నుందును. సకల కల్యాణగుణములతో నిండిన ధర్మమూర్తిని యడవులకుఁ బంప నీకెట్లు మనసొప్పె? ఎంతో నాయందనురాగముగల నాయన్నకు నాయందప్రీతి గలిగించితివే, నాకంటె నిన్ను గౌరవించు రాముని యందిట్టి ద్రోహముతలఁచిన నిన్నేమిచేసినను దోషములేదు. తొల్లి యాకసమునఁబోవుచున్న కామధేనువు యొక్క కన్నీరు తనమీఁదఁబడినంత దేవేంద్రుఁ డామెను నీ దుఃఖమునకుఁ గారణమేమని యడిగెను. అందుల కామె "దేవేంద్రా! నా బిడ్డలగు రెండెడ్లను కర్షకుఁడు మండుటెండలో బాధించుచున్నాఁడు. దానిని జూచి సహింపలేక దుఃఖించుచున్నా"ననెను. లోకములో లెక్కలేని పశువులుండగా రెండెడ్లకు బాధగలిగినందున నంత దుఃఖముచెందెఁగదా కామధేనువు. తల్లికిఁ బుత్రునందుఁగల ప్రేమ యట్టిది. అట్టుండ నొక్కఁడేపుత్రుఁడగు రామునిఁ బదునాలుగేండ్లరణ్యమున బాధలు పడుటను జూచుట కేతల్లి యొప్పుకొనును? నిన్ను చెల్లెలని భావించిన రామునితల్లియగు కౌసల్యను దుఃఖసముద్రములో ముంచితివే. నీకుమారుఁడని చెప్పుకొని లోకమునఁ దలయెత్తి తిరుగఁగలనా? నే నరణ్యముననుండి రామునకుఁ బట్టాభిషేకముచేయించి దోషము పోఁగొట్టుకొనఁగలను. నీ

పాపమున కేమి పరిహారము? నీ వడవిపాలగుటయో, ప్రాణము విడుటయో తప్ప చేయఁదగినదేమియు లేదు." అనిచెప్పి నేలఁ బడి మూర్ఛిల్లెను.

## భరతుని శపథములు.

చాలసేపటికి భరతుఁడు తెలివిపొంది శత్రుఘ్నునిఁ గూడి కౌసల్యవద్దకేగి యామె చరణములకు మ్రొక్కి నిలుచుండ నామె దుఃఖాతిశయముచే "రాజ్యము లభించునాయని యాతురపడుచుంటివే. కైకేయి నీకొఱకు రాజ్యము సంపాదించియున్నది. నా ప్రాణసమానుఁడగు రాముని యరణ్యములకుఁ బొమ్మనుటేల? నేను సుమిత్రఁగూడి భర్తశవము నెత్తుకొని రాముఁడున్నచోటికిఁ బోయెదను. సకలైశ్వర్యములతో నిండిన రాజ్యసుఖ మనుభవింపు"మనెను. ఇట్టి యప్రియవచనములు వినినంతనే భరతుఁడు మూర్ఛిల్లెను. కొంతసేపటికిఁ దెప్పిఱి భరతుఁడు కౌసల్యపాదములకు మ్రొక్కి చేమోడ్చి "తల్లీ! నాకు రామునియందుగల భక్తి నీకుఁదెలియదా? నన్నిట్లు నిందింపఁదగునా? న్యాయముగ రాముఁడే రాజుకావలెనను ధర్మము నాకుఁదెలియదా? రాముని యరణ్యవాసమునకు సమ్మతించియుంటినేని గురువుచే నుపదేశింపఁబడిన విద్యలు నాకు స్ఫురింపకుండుగాక. రాముని యరణ్యవాసమున కొప్పుకొనియుందునేని సూర్యుని కెదురుగ మలమూత్రములు విసర్జించువాని కెట్టిపాపముగలుగునో నా కట్టి పాపము కలుగుగాక. రాము నరణ్యవాసమున కంగీకరించియుంటినేని సేవకులచేఁ బనులు సేయించుకొని వారికి వేతనములీయనివాఁడు పొందు

పాపము ననుభవింతునుగాక. రాముఁ డరణ్యమునకుఁబోవ సమ్మతించియుంటినేని ప్రజలను గన్నబిడ్డలవలెఁ బాలించు రాజునకు ద్రోహముచేసినవాని పాప మనుభవింతునుగాక. రాము నరణ్యవాసమునకు సమ్మతించియుంటినేని యుద్ధభూమి నుండి పాఱిపోయినవాని పాప మనుభవింతునుగాక. రామ చంద్రుని యరణ్యవాసమున కనుమతించియుంటినేని తల్లిదండ్రు లను పెద్దలను గౌరవింపనివాని పాప మనుభవింతునుగాక. రాముని యరణ్యవాసమున కంగీకరించియుంటినేని మిత్రద్రో హులు, గురునిందసేయువారు, పరోపకార రహితులు, కృత ఘ్నులు, కల్లరులు, జూదగాండ్రు, స్త్రీలోలురు, బహుపుత్రకు లగు దరిద్రులు, అన్నపానము లుండియు నాఁకలి దప్పులచేఁ బీడింపఁబడినవారి కిడనివారు, సకల నీచకార్యములు సేయు వారు పొందు పాపము లనుభవింతునుగాక" యని పరిపరివిధ ముల శపథములుచేసి మూర్ఛిల్లెను. కౌసల్య యతని కుపచార ములుసేసి యోదార్చెను. రాత్రి గడచెను.

## దశరథుని యంత్యక్రియలు.

మఱునాఁడు వసిష్ఠుఁడు భరతునకు ధైర్యముచెప్పి తై లమునుండి దశరథునిశవము నెత్తించి యలంకారములుచేయిం చెను. భరతుఁడు "తండ్రీ! దూరదేశమునుండి వచ్చిన నన్ను జూడవా? నేనులేనితఱి సీతారామలక్ష్మణుల నరణ్యమునకుఁ బంపి నీవు స్వర్గస్థుఁడవయితివే. నామీఁద నీకేమి కోపమా? తెలిసి నీయందెట్టియపరాధముచేసినవాఁడఁగానే. ఇఁక నన్నా దరించి నీవలె బుజ్జగించువా రెవరు? నీ కడపటిమాటలు విను

భాగ్యమైనను లేదాయెనే. అయ్యో! నే నెంతపాపాత్ముఁడను" అని యనేకవిధములుగ శోకింప వసిష్ఠాదులూరటఁజెప్పి యగ్ని సంస్కారాదులఁ జేయించిరి, శత్రుఘ్నుఁడును భరతునియట్ల శోకించి పితృకార్యములు జేసెను. పదిదినములుగడచినవి. పదునొకండవదినము శ్రాద్ధకర్మములు జరిగినవి. అనేకవిధ దానములుసేసిరి. పదుమూఁడవదిన మస్థిసంచయనమునకై భరతుఁడు స్మశానమునకుఁ బోయి తండ్రినిగూర్చి మిక్కిలి శోకించెను. అప్పుడు వసిష్ఠుఁడు "భరతా! నీవు తెలివిపరుఁడవు. ఆఁకలిదప్పులు, శోకమోహములు, జరామరణములు సకల ప్రాణులకు సహజమే. వానిని జయించుట యుత్తమలక్షణము కావునఁ జరుగవలసినఁ గార్యములు చేయుమని క్రియాదులను పూర్తిచేయించెను.

భరతశత్రుఘ్నులు గృహమునకుఁబోయిరి. చిత్రవిచిత్రముగ నలంకరించుకొనిన మంథర యటుఁబోవుచుండ ద్వారపాలకులు శత్రుఘ్నునితో నామెయే రాముని యరణ్యవాసమునకును రాజు మరణమునకును మూలకారణంబని చెప్ప శత్రుఘ్నుఁడు కోపావేశముతో మంథరను జుట్టుపట్టుకొనితన్ని నేలఁ బడఁద్రోసి కొట్టఁగా నాగూని పెడబొబ్బలు పెట్టెను. అంత భరతుఁడు స్త్రీవధ పాతకమనియు, రాముఁ డలుగుననియుఁ జెప్ప శత్రుఘ్నుఁడు మంథర నంతటితో వదలిపెట్టెను.

## భరతుఁడు రాముని ప్రార్థింప నేగుట.

---

పదునాల్గవదినము రాచకార్య నిర్వాహకులు భరతుని పట్టముగట్టుకొనఁ బ్రోత్సహింప నతఁడు రామునిఁ దోడ్తెాని

వచ్చుట యొక్కలే సాధ్యమనియు నందునిమిత్తము సకలవిధ సన్నాహములుగావింప సుమంత్రున కాజ్ఞాపించెను. వెంటనే మార్గములు చక్కఁబెట్టుట, యచ్చటచ్చట విడియుటకుం దగిన యేర్పాటులుసేయుట మున్నగుకార్యము లతి తీవ్రముగ జరుగుచుండెను. ఇంతలో వసిష్ఠుఁడు భరతశత్రుఘ్నులను మంత్రులను సామంతులను బౌరులను సభకురప్పించి 'భరతా! దశరథుఁడు కాలధర్మము నొందినందునను రాముఁ డరణ్యము నకుఁ బోయినందునను రాజ్యభారము నీవు వహింపవలెనని చెప్పఁగా భరతుఁడు సభలో నేడ్చి "గురూత్తమా! జ్యేష్ఠుఁడే రాజగుట ధర్మమార్గమైయుండ నన్నందులకు నియమింప నగునా? నేనెన్నఁడైన నట్టి యధర్మమున కీయకొందునా? రాముని తోడ్కొనివచ్చి పట్టాభిషేకముచేయుటయే యుత్తమ మని నిస్సందేహముగఁబలికి సుమంత్రునితో రథ గజ తురగ పదా దులను సకల బంధు మిత్రులతోడను బయలుదేరవలెనని యాజ్ఞాపింప నన్నియు సిద్ధమయ్యెను. కౌసల్యాది తల్లులను, వసిష్ఠాది మునులను బురప్రముఖులను వెంటఁబెట్టికొని భర తుఁడు శత్రుఘ్నునిఁగూడి బయలువెడలెను.

భరతాదులు గంగాతీరము సేరిరి. గుహుఁడు వచ్చు చుండు గొప్పసైన్యమును కోవిదార ధ్వజమునుజూచి తన మంత్రులతో "భరతుఁడు సైన్యముతో రామునిమీఁదికి యుద్ధమునకుఁ బోవుచున్నాఁడు. మన సైన్యమాయుధముల తో సిద్ధముగ గంగాతీరముననుండి భరతునిసైన్యము నడ్డగింప వలె"నని చెప్పెను. సుమంత్రుఁడు గుహునిసాయమున గంగను దాఁటి భరద్వాజాశ్రమము సేరవచ్చునవెను. భరతుఁ డట్లే

గుహుని తోడి తెమ్మనెను. గుహుఁడు రాజమర్యాదలుగావించి భక్ష్యాదులు సమర్పించి "రాజకుమారా! సకలవిధ మాంస ఫలాహారములు సిద్ధముగనున్నవి. నీవును, నీ పరివారమును మా యాతిథ్యము గైకొనవలె" ననెను. భరతుఁడు గుహుని తో "మిత్రమా! నీమాటలు నాకు సంతృప్తిగలిగించినవి. ఇంత పరివారమునకు నీ వాతిథ్యమిచ్చుట యెట్లనెను. గుహుఁ డందులకు "నా కంతమాత్రము శక్తియున్నది. కాని నీ వింత గొప్పసైన్యముతో బయలుదేరినందున రామున కపకారము చేయఁదలఁచితి వేమోయని సందేహముగలుగుచున్న" దనెను. భరతుఁడు "గుహా! తండ్రివంటి నాయన్నను మరలిరమ్మని రాజ్యమేలుమని ప్రార్థింపఁబోవుచున్నాను. నామాటనమ్ముము. నాకు భరద్వాజాశ్రమమునకు మార్గముచూపు" మనెను.

ఆరాత్రి భరతుఁడు గుహుని యాతిథ్యముఁ గైకొని యతనిచే రాముఁడు సీతతో నెచ్చటఁ బరుండెనో, లక్ష్మణుఁ డెట్లు నిద్రింపక రామునిగుణములఁబొగడుచు రాత్రిఁగడపెనో తెలిపినంత భరతుఁడు చింతించి గుహునితో నారాత్రి గడపి, జడలు, నారచీరలుదాల్చి మఱునాఁడు భరద్వాజాశ్రమము సేరెను. ఆ ముని వసిష్ఠుని భరత శత్రుఘ్నులను సత్కరించి కుశలంబులడిగిన యనంతరము వీరును భరద్వాజుని యాశ్రమ వాసులను క్షేమమడిగిరి. అంత భరద్వాజుఁడు "భరతా! తల్లి చేసినదిచాలక నీవును రాముని బాధింపనెంచి సైన్యముతో వచ్చితివా?" యనినంతనే భరతుఁడు చాలదుఃఖించి "ఋషి తిలకా! మీకుఁదెలియని దేమున్నది? రాముని మరలిరమ్మని ప్రార్థింపఁబోవుచున్నా"ననెను. అంత ముని చాల సంతోషించి

భరతునకు సపరివారముగ విందొసఁగెను. ఒక్కముహూర్త మునఁ బురము సృష్టింపఁబడెను. దేవతాస్త్రీలవంటివారు వచ్చినవారల కందఱికి సకలోపచారములు చేసిరి. పలువిధ ముల పిండివంటలు, భక్ష్యభోజ్యములు, నేయి, పాలు, పెరుగు, ద్రాక్షారసము, తేనె మొదలగునవి సమృద్ధముగ నుండినవి. సర్వులు భుజించి దేవలోకములో నున్నామనియే భావించిరి. ఆరాత్రి యట్లుగడచెను. మఱునాఁడు భరతుఁడు భరద్వాజుని దర్శించి "మునిపుంగవా! నాకనుజ్ఞయిమ్ము నా యన్నయగు రామచంద్రుఁడున్నస్థలమునకు మార్గముదెలుపవలె"నని కోరెను. అప్పుడు తల్లులు మఱగుఱును మునికి నమస్కరించుచుండ వీరిలో నెవ రెవరితల్లియో తెలుపమనెను. భరతుఁడు మహా పుణ్యముచేసి రామునిఁగన్న కౌసల్య యీమె, రత్నములవంటి లక్ష్మణశత్రుఘ్నులఁగన్న పూజ్యురాలు సుమిత్రాదేవి యీమె యని, తనతల్లినిచూచి "ఎవతెగర్భమునఁ బుట్టిన పాపముచే నపకీర్తిపాలైతినో, తండ్రిని పోగొట్టుకొంటినో, అన్నదమ్ములను వనముపాలుసేసి కడు క్రుంగుచున్నానో యట్టి మహాపాపిష్ఠు రాలగు కైకేయి యీమెయే యని చెప్పెను. అంత భరద్వా జుఁడు "భరతా! లోకమున నీవంటి భ్రాతృవత్సలుఁడెవ్వఁ డున్నాఁడు. నీకీర్తి వ్యాపింప నిట్టుచేసితి నని రాముఁడు చిత్రకూటముననున్నాఁడనియు నందులకు మార్గమిదియనియుఁ జెప్పి యనుజ్ఞ యొసంగి వసిష్ఠాదులను వీడ్కొలిపెను. భర తుఁడు చిత్రకూటపర్వతప్రాంతముసేరి సైన్యము నొకచోట నిలిపి వసిష్ఠుని సుమంత్రుని తోడుకొని పోగయగుపడు దిక్కు గఁ బోయెను.

---

## రాముని దర్శించుట.

అట రామచంద్రుఁడు చిత్రకూటపర్వతపు సొగసును మందాకినీనదియొక్క గాంభీర్యమును వన రామణీయకతను సీతకుం జెప్పుచు భరతుని సైన్యము వచ్చు గొప్ప ధ్వని విని "లక్ష్మణా! అడవిమృగములు భయఁపడి దిక్కులు తెలియక పరుగిడుచున్నవే ఈ పెనుశబ్ద మెందులకుఁ గలిగెనో చూడు" మనెను. లక్ష్మణుఁడొక చెట్టు నెక్కి చూచి "అన్నా! కోవిదార ధ్వజము గనఁబడుచున్నది. కైకేయివరమువలన రాజ్యము పొందియుఁ దృప్తిఁజెందక పాపాత్ముఁడగు భరతుఁడు గొప్ప సైన్యముతో మనమీఁదికి వచ్చుచున్నాఁడు. నీ యనుజ్ఞ యైనచో నే నాయుధములు ధరించి భరతుని సైన్యముతోఁగూడ నాశ మొందించెద" ననెను. అంత రాముఁడు "లక్ష్మణా! ఏల నీకింతకోపము? భరతుఁడు నాయందు నీయంతభక్తి గలవాఁడు. నా కెన్నఁడు హాని చేయఁడు. నన్నుం గొనిపోయి పట్టముగట్ట నెంచియే వచ్చుచున్నాఁడని నాకుఁ దోఁచుచున్నద" నెను.

భరతుఁడు తన తల్లులను దోడ్కొనిరమ్మని వసిష్ఠునితోఁ జెప్పి సుమంత్రుని గుహుని వెంటఁగొని నారచీరలుగట్టి యున్న పర్ణశాలన్ నగ్నివలెఁ బ్రకాశించుచుండు రాముని సీతను లక్ష్మణుని చూచి రామలక్ష్మణుల జడలను నారచీరలను గని మిక్కిలి శోకించుచు రాముని ముందర సాష్టాంగముగఁబడి మ్రొక్కెను. జడలు నారచీరలు దాల్చియున్న భరతునిఁ జూచి రాముఁ డాశ్చర్యముతో నతనిఁ జేరఁదీసి కౌఁగిలించి కొని శిరము మూర్కొని "భరతా! నీవు రాజ్యపాలనము

సేయక నిచ్చటి కేల వచ్చితివి? తండ్రియనుమతిఁబొంది వచ్చితివా? ప్రతిదినము తల్లికి, తండ్రికి, గురువునకు నమస్కరించుచున్నావా? దేవతలను అతిథులను బూజించుచున్నావా? మన యుపాధ్యాయుఁడగు సుధన్వుని భక్తితోఁ బూజింతువు కదా? మంత్రులు నీకుఁదగినహితములు సెప్పుచున్నారా? నీవు నీబుద్ధి నుపయోగించి ప్రజాక్షేమమెఱిఁగి పాలించుచున్నావా? బంధుమిత్రుల నాదరింతువుగదా? కౌసల్యా సుమిత్రలను నీ తల్లినిఁబోలెఁ బూజింతువా? భృత్యులకుఁ గాలముదప్పక జీతము లిచ్చుచున్నావా? అర్ధరాత్రమున నిద్రచాలించి ధనసంపాదననుగూర్చి యాలోచింతువా? నీవు నీయాలోచనలను కార్యపూర్తియగునంతవఱకు నితరుల కెఱుకపఱచవుగదా? పది వేవురు మూర్ఖులకంటెఁ బండితుఁ డొకఁడు చాలును. సమయమునకుఁ దగిన యాలోచనము సెప్పఁగలవాఁడును బరుల మనోభావము లెఱుఁగఁగలవాఁడును బుద్ధిమంతుఁడును గార్యశూరుఁడు నగు మంత్రి సామాన్యరాజును సైతము ధనవంతునిఁ జేయఁగలఁడు. నీవు నేరములను బక్షపాతములేక విచారించి తగురీతిని నేరగాండ్రను దగినంతమాత్రమే దండింతువుగదా? నీ వెన్నఁడు నకృత్యములుచేసి ధన మన్యాయముగ నార్జింపవుగదా? సేనాధిపతులు త్రికరణశుద్ధిగలిగి వర్తింతురా? నీవు వారిని సమయమెఱిఁగి సత్కరించి వారిమనంబుల నాకర్షింతువుగదా? నీ వితరదేశములకుఁబంపు దూతలు బుద్ధిమంతులై సమర్థులై కార్యంబుల నిర్వర్తింతురుగదా? నీ యుద్యోగస్థులు లంచగొండులుకారుగదా? యోగ్యతల ననుసరించి యుద్యోగము లిత్తువుగదా? ఆదాయ వ్యయముల నెఱిఁగి

యు క్తమగుపన్నులు మాత్రము విధించి ప్రజల నొప్పింపక వారి క్షేమముఁగోరి బహుజనోపయోగకార్యములు సేయుచుందువు గదా? సామదానభేదదండోపాయముల సమయమెఱిఁగి యుపయోగింతువుగదా! మన పూర్వీకులవలె నుత్తమమార్గముననే నడచుచున్నావా? ధర్మార్థకామములలో ధర్మమునకే ప్రాముఖ్య మిత్తువుగదా? అట్లుసేయకున్నఁ బ్రజలుసేయుపాపము రాజును జేరి యతనికి నరకవాసము గలిగించును. "యథారాజా తథా ప్రజాః" అనునట్లు మార్గదర్శకుఁడగు రాజెట్టి నడవడిగలిగి యున్నఁ బ్రజల కట్టి నడవడియె యొనఁగూడును" అని సకల రాజధర్మములను వివరించునట్లు ప్రశ్న లడిగెను.

అందులకు భరతుఁడు "అన్నా! నీవంటి రాజోత్తమున కుండవలసిన ధర్మములు రాజ్యమునే యధర్మముగఁ బొందిన నావంటి నీచున కెట్లు సాధ్యము? మన వంశములో జ్యేష్ఠుఁ డుండఁగాఁ దమ్ముఁడు రాజగుట యెన్నఁడైన నుండెనా? అట్టి దుర్గతి నాకుఁగదా పట్టినది. స్వయముగ ధర్మమనుష్ఠింపని వాఁ డితరుల ధర్మమార్గమున నడచున ట్లెట్లు చేయఁగలఁడు? కావున నీవు మన పూర్వాచారము ననుసరించి రాజ్యభారమువహించి నీవు వివరించినధర్మముల ననుష్ఠించి శాశ్వతయశముఁగాంచుము. నీ విట్లురాఁగా మనతండ్రి నీయెడఁబాటు సహింపలేక నిన్ను దలంచుచుఁ బ్రాణము వదలెనఁట. నాకు వార్తవచ్చి నేను వచ్చుసరికి నీవును రాజునులేని యయోధ్య పాడుపడినట్లుండెను. ఇప్పుడు నీవును లక్ష్మణుఁడును దండ్రికిఁ దిలోదకము లీయవలె" ననెను.

పిడుగువంటి తండ్రిమరణవార్త వినినంతనే రామచంద్రుఁడు దుఃఖసాగరమున మునిఁగి "అయ్యో! నావంటి పాపి యెవ్వఁడుండును? తపముసేసి నన్నుగన్నతండ్రికి ప్రేతకార్యములుచేసి పిండోదకములీయని నాజన్మమేమిటికి? భరతా! నీవును శత్రుఘ్నుఁడును బుణ్యముచేసినవార లనవచ్చును. పదునాలుగేండ్లుగడచినను నే నయోధ్యకురానేల? నే నడవులలోనే జీవితముగడపు టుచితము" అని పెద్దగొంతెత్తి రోదనము చేసి "లక్ష్మణా! నీకిఁక తండ్రిలేఁడు. సీతా! నీకిక మామలేఁడు. మీరును నావలెఁ బాపముచేసినవారలైతి" రని పలవిపనవి శోకింప భరతశత్రుఘ్నులు 'అన్నా! నీవెంత యేడ్చినను మరణించినతండ్రి మరలఁ బ్రతికివచ్చునా? లెమ్ము. తర్పణాదులు చేసి పితృఋణము దీర్చుకొమ్మ'' నిరి. రామచంద్రుఁ డంత సీతాలక్ష్మణులఁగూడి మందాకినీనదిలో స్నానముచేసి తనకున్నగారపిండిని పిండముగ నొసంగెను. ఎవని కేది యాహారమో యదియే దేవున కారగింపుచేయవచ్చునను న్యాయము ననుసరించెను. వారందఱు పర్ణశాలకువచ్చి మరల బిగ్గఱగ నేడ్చిరి. ఈ శబ్దము విని కౌసల్యాదులు వసిష్ఠాదు లందఱు వచ్చిరి. బంధుమిత్రులును పౌరశ్రేష్ఠులును వచ్చి రామచంద్రునిఁజూచి యోదార్చి యతనిచే సంతోషపఱుపఁబడిరి.

కౌసల్య సీతారామలక్ష్మణులఁజూచి వారి కిట్టి దుర్గతి ప్రాప్తమయ్యెనే యని పలువిధములుగ సుమిత్రతోఁ జెప్పుకొని యేడ్చి యామెచే నోదార్పుఁబొందెను. రాముఁడు కౌసల్యాదేవిపాదముల నంటి నమస్కరించి సుమిత్రాకైకలకును వసిష్ఠాదులకును నమస్కరించెను. మఱల రామచంద్రుఁడు

"భరతా! నీవు జటావల్కలములు ధరించినందుల కేమికారణ మని"యడిగెను. భరతుఁడు వినయముతో "అన్నా! కోరరాని వరముగోరి నాతల్లి నిన్నరణ్యమునకుఁబంపి భర్తనుగోల్పోయి నది. నాకుఁ దీరని యపకీర్తి గలిగించినది. అందులకుఁ బ్రాయ శ్చిత్తముగ నే నీరీతి నీవలె నీ పదునాలుగేండ్లు గడుప నిశ్చ యించితిని. నీవు నాయొక్కయు మంత్రులయొక్కయుఁ బౌరుల యొక్కయుఁ గోరికఁ జొప్పున నయోధ్యకేతెంచి పట్టాభిషిక్తుఁ డవుకమ్ము" అని సవినయముగఁ బ్రార్థించెను.

రామచంద్రుఁడు భరతుని యుగ్రప్రతిజ్ఞ కచ్చెరువొంది "భరతా! నీ నడవడి లోకమున కొక యాదర్శమార్గమగును. మనము సద్వంశమునఁ బుట్టినవారము. సత్యముతప్పము. ధర్మ ము నతిక్రమింపము. తల్లిని, తండ్రిని, గురువుల దేవతలుగఁ బూ జింతుము. తండ్రివాక్యము పాటించుటకంటె నుత్తమమగుధర్మ మింకేది గలదు? తండ్రి మరణించినంత నే యాతని నసత్యవంతు నిగఁ జేయుట నాపనిగాదు. అతనియాజ్ఞ దాఁటరానిది. అతఁడు నిన్ను బురమును బాలింపుమనట్లును, నన్ను వనమును బాలించు మనియు విభాగము లేర్పఱచినాఁడు. అది జరిగి తీరవలెను. అనినంత భరతుఁడు "అన్నా! నీమాటచొప్పున రాజ్యమిప్పుడు నాదిగదా. నేను నీదాసుఁడ నగుటచే నాసొత్తు నీసొత్తే యగును. నీ వరణ్యమునందుండిన నీవలనిలాభములను జనులు పడయలేరు. నీ వాదర్శపురుషుఁడవు. నీవు లోకము నుద్ధరింపఁ బుట్టినవాఁ డవు. నీ సుగుణగణంబులు లోకుల నాకర్షించినవి. నీపాలనచే వారికిఁ గలుగఁగల యానందము లేనందున వారెల్లరు దుఃఖిం

తురే. నీవు దయాస్వరూపుఁడవే నీకుఁ దెలియనివి లేవుగదా! కనుక నా ప్రార్థనము నంగీకరింపు" మనెను.

భరతుని యుత్తమవాక్యముల కానందించియు దృఢవ్రతుఁడగు నా రాముఁడు "సోదరా! నా వనవాసమునకుఁ గై కేయీదశరథులే గారణభూతులని భావించుచున్నావు. భగవంతుఁడు ప్రతివ్యక్తియొక్క హృదయమున నుండి కాలానుగుణముగ నా యా కార్యములకుం దగినబుద్ధినిచ్చి పనులం జేయించును. నాకీవనవాసము ప్రాప్తముగనుక నిట్లుజరిగినది. ఇందులకు నీవెంతమాత్రము చింతింపరాదు. ఇఁక తండ్రి మరణమునుగూర్చి యేమందునా? పక్వమైన ఫలము నేలరాలుట సహజమే. పుట్టినవారు గిట్టకతప్పదు. రాత్రి సముద్రములోఁ బ్రవహించిన గంగాజలమును మరల కావలెనన్న వచ్చునా? ఋతుధర్మములుమారుట, బాల్య యౌవన కౌమార వార్ధక్యములు వచ్చుటఁ బోవుట సహజమే, సముద్రమున రెండు కొయ్యతుండ్లు కొట్టుకొనివచ్చి యొకటిగఁజేరి కొంతసేపటికి సంబంధములేక వీడిపోవును. అట్లే ప్రపంచమునఁ దల్లియని దండ్రియని సోదరులని బంధువులని మిత్రులని కలయికలు గలుగుటయు మరణాదులచే వియోగము సంభవించుటయు జరుగుచునే యుండును. ఇందునిమిత్తము వగచుట యుక్తము గాదు." అని బోధించెను.

భరతుఁ డందులకు "అన్నా! నేను తండ్రిమరణమును గూర్చి మిక్కిలిచింతనొంద లేదు. నీ యరణ్యవాసమునుగూర్చియు నా యపకీర్తినిగూర్చియు దుఃఖించుచున్నాను. నీ వట్లు రాకున్న నేను నీతోనుండుటకైన నంగీకరింపుము" అని వేఁడు

కొనెను. రాముఁడు "భరతా! నీకు నాయందున్న గౌరవభావము నే నెఱుఁగుదును. కాని వేనవేలేండ్లు సత్యము, ధర్మము, దప్పక ననేక యజ్ఞములుచేసి గొప్పకీర్తిగడించిన మన తండ్రి యొక్క సత్యప్రతిజ్ఞను నెఱవేర్చుటొక్కటే నాకు ముఖ్యము. నీకు నేను జ్యేష్ఠుఁడగుటచే నామాట నెఱవేర్చుటయు నీకు ధర్మమేయగు ననుట మఱువకుము" అనెను.

అంతలో జాబాలియను బ్రాహ్మణుఁడు "రామా! తండ్రియెవడు? తల్లియెవతె? బాటసారి మార్గమధ్యమున నొక సత్రముననో చావడియందో దిగి యచ్చటఁ గొందఱితోనుండియు మఱలఁ దానొకఁడే తనదారినిఁబోవునట్లు తాత్కాలికముగఁ దల్లి, తండ్రి, సోదరులు, బంధు మిత్రులతో నుండుము గాని మరణించునపుడు తండ్రి వెంటవచ్చునా? తల్లి వెంట వచ్చునా? ఎవరును రారు. తండ్రియుండినపు డతనిమాట. చచ్చిన నంతటితో వారిసంబంధము తెగినట్లే అతనిమాటను పాటింప నీ వరణ్యావాసముండుట యనవసరము. శరీరమునకుఁ బలువిధ కష్టముల నిచ్చునట్టిదియు మనసునకు సంకటమిచ్చునట్టిదియు నగు వనవాసము చాలించి ధన ధాన్యాది సంపదలతో నిండిన రాజ్యసుఖ మనుభవింపుము. కంటికగుపడుదానిని వదలి ఎక్కడనో యున్నదని ఎచ్చటనో యున్నారని ఎప్పుడో యెచ్చటో సుఖమో దుఃఖమో గలుగునను మాటలు నమ్మరాదు. ఒకఁడు దారినడచుచున్నాఁడు. వాని బంధువు లింట నుండి సుఖముగుభోజన మొకని కిడినంత, మార్గమునఁ బోవు వాని కది యాఁకలితీర్చునా? అట్లే యీలోకమున నితరుల కిచ్చిన యన్నము దేవతలకు, పితృదేవతలకుఁ బ్రీతియగు

ననుట నిజముకాదు. కనుక మరణించినవారిమాటను గౌరవించి నీ వీ వనవాసము చేయనక్కరలేదు. అయోధ్యకు రమ్ము. రాజ్యము గైకొమ్ము. భరతునేగాక మమ్మందఱిని సంతోషపఱుపు" మనెను.

జాబాలియాడినమాటలకు రాముఁడలిగి, "సకలశాస్త్రములుచదివిన బ్రాహ్మణుఁడవగు నీ వీరీతి నిరీశ్వరవాదముసేసి కంటికగుపడుదానినినమ్మినఁ జాలుననుట యుచితమా? మన కన్నెట్టిది? నిజము నెఱుఁగునా? సూర్యుఁడు తూర్పునుండి పడమరకుఁ బోవునట్లు కంటి కగపడుచున్నదే, నిజముగఁ జలించునది భూమియేకదా. మనశరీరములోనుండు మనయాత్మయైనను మనకంటి కగుపడునా? అంతమాత్రమున నాత్మ లేదనవచ్చునా? ఎంతబుద్ధిమంతు లెన్నియాలోచనలుచేసి యెన్నిప్రయత్నములుచేసినను గొన్నిపనులు జరుగకుండుట కేమికారణము? దైవమేకదా. అట్టిదైవము కంటికగుపడునా? లేనందున దైవము లేదనుట యుక్తమా? ప్రపంచమున స్థూలముగ నుండు వాని కెల్ల ముఖ్యాధారము సూక్ష్మమేయగును. కంటికగుపడు శరీరమునకు దృగ్గోచరముకాని గాలియే ప్రాణాధారము. ఈ లోకముననుండు సకల ప్రాణుల బాగోగులకు కోట్లకొలఁది మైళ్ళ దూరముననున్న గ్రహ నక్షత్రముల చలనమే కారణమని యొప్పుకొనుచున్నాముగదా. తండ్రి మరణించినంత నే యతనితో సంబంధముపోవునంటివి. ఇది మానవలక్షణమా? తండ్రి జీవించియున్నను మరణించినను దైవస్వరూపుఁడే. అతనితోఁ బ్రతిజ్ఞచేసి యతఁడు పరలోకగతుఁడైనంత సత్యము తప్పుదునా? అట్లుచేసిన లోకులు నన్నేమని తలఁతురు? నా

మాట కెట్టివిలువయునుండదు. సత్యముననే లక్ష్మియుండును. సత్యముమీఁదనే ధర్మ మాధారపడియుండును. మనస్సు, వాక్కు, కర్మలచే సత్యము ననుష్ఠించువాని కీలోకమునఁ గీర్తియుఁ బరలోకసుఖమును గలదు. సత్యముదప్పినవాని కిహపరములు రెండును లేవు. కనుక నీవిట్టి విపరీతమతమును బోధించి నాచే నధర్మముఁ జేయింపఁ బూనిన నిన్ను నా తండ్రి యెట్లు దగ్గఱఁ జేర్చెనో నాకు బోధపడ లేదు. సత్యము, దయ, జపము, తపము, దానము మున్నగునవి మోక్షమార్గములు. వాని నతిక్రమింపఁ బురికొల్పుటఁ గడునీచమని వేఱుగఁ జెప్పనేల” యని మందలించెను. అందులకు జాబాలి “రామచంద్రా! నేను నాస్తికుఁడనుగాను. అధర్మముచేయఁ బ్రోత్సహింపను. కాని నిన్ను బురమునకు మరలిరమ్మనుటకై యిట్లు పలికితి” ననెను.

ఇంతలో వసిష్ఠుఁడు “రామా! జాబాలి మూర్ఖుఁడని యెంచకుము. నీయందలి యనురాగముచే నిన్ను బురమునకు మరల్ప నెంచి యట్లు పలికెను. నీ వతనియందు శాంతచిత్తుఁడవుగమ్ము. నీకీ ప్రపంచసృష్టిక్రమము జెప్పెదను. ఈబ్రహ్మాండమంతయు జలమయమైయుండెను. అంత భూమి సృష్టింపఁబడెను. పరబ్రహ్మముచే బ్రహ్మాదిదేవతలు గలిగిరి. భూమి నీట మునుగుచుండఁగా విష్ణుదేవుఁ డాదివరాహరూపమున దానినెత్తెను. బ్రహ్మ తన పుత్రులగు మరీచ్యాదులఁగూడి జగమునంతయుఁ బూర్తిగ సృష్టించెను. బ్రహ్మకు మరీచి పుట్టెను. అతనికిఁ గశ్యపుఁ డుదయించెను. కశ్యపునకు సూర్యుఁడుపుట్టెను. అతనికి వైవస్వతమనువు పుట్టెను. వైవస్వతునికుమారుఁ డిక్ష్వాకుఁడు. అతఁడే యీ యయోధ్యను

బాలించిన మొదటిరాజు. ఆ వంశమునఁబుట్టినవాఁడవే నీవు. నీవంశమున జ్యేష్ఠుఁడే రాజగుట యాచారము. దాని ననుస రించి నీవు రాజ్యముపాలించుట ధర్మము. నేను నీ తండ్రికిని నీకు నాచార్యుఁడను. నీవు నామాటఁబాటించుట యుక్తము. నీవు సత్యము వీడనివాఁడవు. ధర్మము నాచరించువాఁడవు. భరతుఁడు నిన్నాశ్రయించి తండ్రిచేఁ దన కీయఁబడిన రాజ్య మును నీకిచ్చుటం జేసి నీకు వ్రతభంగము కానేరదనియుఁ జెప్పె ను. కాని రామచంద్రుఁడు, "ఆచార్యా! నాయందు నీకుఁగల యనుగ్రహము నే నెఱుఁగుదును. లోకమునఁ దల్లిదండ్రులకు వెనుక గురువు ముఖ్యుఁడు. వా రిరువురలోను దండ్రియాజ్ఞ దప్పరానిది. దానిం ద్రోసిపుచ్చి తల్లిమాటను దమ్ముని మాట ను బాటింపనొల్ల" ననియె. అంత భరతుఁడు పర్ణశాల ముం దర దర్భలుపఱచి పరుండెను. పౌరజానపదులును "భరతా! రాముఁడు దృఢసంకల్పుఁడుగ నున్నవాఁడు. కాన మే మతని మరల్పలే"మనిరి. అప్పుడు రామచంద్రుఁడు "భరతా! నీ విట్లుచేయుటఁ దగదు. దానిం బోగొట్టుకొన నన్నుదాఁకి జల మును స్పృశింపుము. తండ్రిమాట వమ్ముగాకుండునట్లు వర్తిం చుట మన యిరువురకు ధర్మమగు" ననెను. భరతుఁ డంతఁ జేయునదిలేక బంగారుపాదుకల నుంచి ప్రార్థింప రామచంద్రుఁ డా పాదుకలం దొడిగికొని వదలెను. భరతుఁడు వానిని శిర మున ధరించి రామునకు మ్రొక్కి సీతాలక్ష్మణుల వీడుకోలు పొందెను. రామచంద్రుఁడు భరతశత్రుఘ్నుల నాలింగనము సేసికొని "భరతా! తల్లిని దూరకుము. నామీఁదను సీత మీఁదను ఒట్టుపెట్టియున్నాను. జాగ్రత" యనెను. రాముఁడు

తల్లులకు మ్రొక్కి వారిదీవనలనొంది సాఖ్య మతిశయింపఁ బర్ణ శాలలోనికిఁబోవ, భరతుఁడు " అన్నా ! పదునైదవయేఁటి తొలిదినము నీవు రాకున్న నగ్నిప్రవేశముచేతు " నని ప్రతిజ్ఞ చేసి మఱలెను. అతఁడు చిత్రకూటపర్వతమునకుఁ బ్రదక్షిణ ముచేసి పాదుకలను శత్రుంజయమను పట్టపుటేనుఁగుమీఁద నుంచి తల్లులతోడను వసిష్ఠాదులతోడను బరివారముతోడను మఱలి వచ్చుచు భరద్వాజాశ్రమమున మునికి మ్రొక్కి జరిగిన వృత్తాంతముఁ దెలిపి శృంగిబేరపురముఁ జేరి గుహుని వీడ్కొని యయోధ్యఁజేరి తండ్రిగృహంబుసొచ్చి నందిగ్రామమున నే రాముఁడు మరలివచ్చునంతదనుక నుండ నిశ్చయించి యచ్చటికిం బోయి సింహాసనమునఁ బాదుకలనుంచి పట్టాభిషేకముగావించి మిక్కిలి నియమముతో నా పాదుకలఁ బూజించుచు సకలవిష యములను వానికి నివేదించి రాజ్యపాలనము సేయుచుండెను.

సీతారామలక్ష్మణులు చిత్రకూటమునఁ గొన్నిదినము లుండి భరతాదుల రాకను మాటిమాటికి జ్ఞప్తికిఁ దెచ్చునట్టి యా ప్రదేశమువదలి యత్రిమహాముని యాశ్రమంబు సేరిరి. వా రా మునికి భక్తితో నమస్కరింప నమ్మునియు వారలఁ దగురీతి సత్కరించి "రామా! నాధర్మపత్ని వృద్ధురాలు. వేన వేలేండ్లు తపస్సుచేసి గొప్ప మహిమలుగలది. ఒకప్పు డనా వృష్టిగలుగగా వర్షము కురిపించినది. దేవతల మేలునెంచి పది రాత్రు లొకరాత్రిగఁ జేసినది. లోకమున మిక్కిలి నింద్య మగు అసూయ యణుమాత్రము లేనందున ననసూయ యని పిలువఁబడుచున్నది. సీత నామెకు మ్రొక్కుమను మనెను. అంత రాముఁడు చెప్పినంత నే సీత వయసుచేనిండిన ననసూయకు

మ్రొక్కెను. అంత నామె కడు ముదంబున సీత కనేక వస్త్రాభరణములిచ్చి యలంకరింపఁజేసి "సీతా! నీ పాతివ్రత్యము లోకమున మిక్కిలి గొనియాడఁదగినది. స్త్రీలకు భర్తయే దైవమనుట ననుష్ఠించిచూపితివి. నీవు నీవృత్తాంతమునంతయుఁ జెప్పుమనినంత సీత జనకరాజునకుఁ దాను నాఁగేటిచాలున లభించినప్పటినుండి యీ యాశ్రమము చేరినంతవఱకుఁ గల సకలవిషయముల నామెకుఁ బూసఁగ్రుచ్చినట్లు చెప్పి యామె దీవనలు వడసెను. వారా రాత్రి యచ్చటనుండిరి. మఱునాఁ డుదయము ప్రాతఃకాలకృత్యములఁ దీర్చుకొని రాముఁ డత్రి మునికి మ్రొక్కి యతనిమూలమున నా ప్రాంతపు రాక్షసుల బాధనుగూర్చి విని యతని యనుజ్ఞఁబొంది దండకారణ్యము ప్రవేశించెను.

అయోధ్యాకాండము సమాప్తము.

చిత్తూరు శ్రీ వెంకటేశ్వర ముద్రాక్షరశాలయందు ముద్రితము.

2

శ్రీ

# రామాయణరత్నాకరము

గ్రంథకర్త

వంగీపురం రంగస్వామయ్యంగారు

పాకాల

హక్కులు మా యధీనము ]

[ వెల 12 అణాలు

# విషయసూచిక.


| | | పుట |
|---|---|---|
| 9. ఖరదూషణాదుల వధ | ... ... | 2 |
| రాముఁ డగస్త్యాదుల దర్శించుట... | ... | 4 |
| శూర్పణఖ వచ్చుట | ... ... | 7 |
| ఖర వధ | ... ... | 9 |
| 10. సీతాపహరణము | ... ... | 11 |
| శూర్పణఖ రావణుని సందర్శించుట | ... | 12 |
| రావణుఁడు మారీచునొద్ద కేగుట | ... | 13 |
| మాయామృగము | ... ... | 16 |
| సీతయొక్క నిష్ఠురోక్తులు | ... ... | 18 |
| రావణుని రాక | ... ... | 19 |
| 11. సుగ్రీవ సఖ్యము | ... ... | 24 |
| కబంధవధ | ... ... | 28 |
| శబరికి మోక్షమిచ్చుట | ... ... | 31 |
| రాముఁడు సీతనుగూర్చి చింతించుట | ... | 32 |
| 12. వాలివధ | ... ... | 37 |
| వాలితో వైర కారణము | ... ... | 38 |
| వాలి దుందుభుల యుద్ధము | ... ... | 40 |
| వాలి రాముని నిందించుట | ... ... | 44 |
| రాముఁడు వాలికి సమాధానముచెప్పుట | ... | 45 |
| తార విలపించుట హనుమంతుఁడు తార నోదార్చుట | | 47 |
| రాముఁడు తారాంగద సుగ్రీవుల నోదార్చుట | ... | 50 |
| 13. సీతాన్వేషణము | ... ... | 52 |
| రాముఁడు లక్ష్మణునిఁ బంపుట ... | .. | 53 |
| సుగ్రీవుఁడు వానరవీరులను నలుదిక్కులకుఁ బంపుట ... | | 56 |
| హనుమదాదులు స్వయంప్రభను దర్శించుట | ... | 59 |
| వానరులు ప్రాయోపవేశముచేయుట | ... | 61 |
| సంపాతి సీత లంకలో నున్నదనుట | ... | 62 |
| వానరులు సముద్రతీరముసేరుట ... | ... | 63 |

హనుమంతుఁడు సముద్రము దాఁట నెంచుట ... 65
హనుమంతుఁడు సముద్రమును దాఁటుట ... 66
విఘ్నములు ... ... 57
హనుమంతుఁడు లంకను ప్రవేశించుట ... 69
హనుమంతుఁడు సీతను వెదకుట ... ... 71
రావణాంతఃపురము ... ... 72
సీతాదర్శనము ... ... 76
రావణుఁడు సీతనుజూడవచ్చుట ... ... 78
సీత రావణునకు హితము బోధించుట ... 80
సీత ప్రాణము విడువ నెంచుట ... 83
త్రిజట తన స్వప్నవిషయముఁ జెప్పుట ... 84
మరణింప సిద్ధమగు సీతకు శుభసూచనలు గనఁబడుట 85
హనుమంతుని యాలోచన ... ... 86
సంభాషణ ... ... 89
అంగుళీయకము నిచ్చుట ... ... 92

14. లంకాదహనము ... ... 94

చూడామణి నిచ్చుట ... ... 96
హనుమంతుని యభయప్రదానము ... 98
అశోకవన భంగము ... ... 99
రాక్షసులతో యుద్ధము ... ... 101
అక్షకుమారుఁడు హతుఁడగుట ... ... 103
ఇంద్రజిత్తు హనుమంతుని బంధించుట ... 104
రావణ హనుమంతుల సంభాషణము ... 105
హనుమంతుని వాలముఁ గాల్చుట ... 108
లంకాదహనము ... ... 110

15. చూడామణి నిచ్చుట ... ... 111

సీత దహింపఁబడకుండుట ... ... 111
హనుమంతుఁడు చూడామణి నిచ్చుట ... 116

శ్రీ

# రామాయణరత్నాకరము

## 9. ఖర దూషణాదుల వధ

రామచంద్రుఁడు సీతాలక్ష్మణులఁగూడి మున్యాశ్రమములకుం బోవుచు వారి యతిథిసత్కారముల నందుకొనుచుండ వారు రాముని యవతారరహస్యము లెఱింగి రాఘవా! మేము తపోధనులము. జితేంద్రియులము. కోపమును జయించినవారము. కనుక రాక్షసులు మమ్ము సులభముగ వధించుచున్నారు. నీవు రాజవు. నగరముననున్నను వనముననున్నను నీ రాజాధికారము నీ కున్నది. మేము నీ రాజ్యములోనివారమగుటచే మమ్ము రక్షించుభారము నీమీఁదనున్నది. మా ప్రార్థనముః లంగీకరించి నీ దుష్టశిక్షణ శిష్టరక్షణ యను ధర్మమును నిర్వర్తింపు మనిరి. రాముఁ డందుల కంగీకరించి వారకభయమిచ్చి వనమునఁబోవుచుండ భయంకరాకారముతో గొప్పశబ్దముచేయుచు విరాధుఁడను రక్కసుఁడు శూలము ధరించివచ్చి సీతను జంకఁబెట్టికొని రామలక్ష్మణులఁ జూచి "మీ వేషమునకును మీ యాయుధములకును సంబంధ మగుపడలేదు. నేను విరాధుఁడను. మిమ్ము చంపి యీమెను భార్యగఁ జేసికొందు" ననియె.

అంత రాముఁడు "లక్ష్మణా! జనకుని కూఁతురును నా ధర్మపత్నియు నగు సీత రాక్షసునిచేఁ జిక్కియున్నది. అహా!

CENTR... STATE

కైకేయి కోరినవరమునకుఁ బూర్ణఫలమిదియె కాఁబోలు. సీత భయపడుచున్నది. వీనిని వధింతు" మని బాణమువదలెను. విరాధుఁడు భయంకరమగు శూలమునుగొని రామలక్ష్మణుల మీఁదికిరాఁగా రాముఁ డద్దాని ఖండించెను. విరాధుఁ డంత సీతను విడిచి రామలక్ష్మణుల భుజముల నెత్తుకొనిపోవ సీత చాలదుఃఖించెను. రాముఁడు వానికుడిచేతిని తుండింప లక్ష్మణుఁ డెడమచేతిని ఖండించెను. రాక్షసుఁడు నేలఁబడినంత నే రామలక్ష్మణులు వానిని చేతులతోను పాదములతోను నజ్జుగుజ్జు కావించిరి. వాఁడు తెలివొంది "నీవుపురుషోత్తముఁడవు. నేను కుబేరునిశాపముచే రాక్షసుఁడనైతిని. నీచే నీజన్మముతొలఁగినది. ఇచ్చటికొకటిన్నర యామడదూరమునఁ దపోనిధియగు శరభంగుఁ డున్నవాఁడు. అతనిదర్శనము నీకు మేలొనఁగూర్చును. నన్నుమాత్రము పల్లముత్రవ్వి పూడ్చుమని" కోరెను. అంత లక్ష్మణుఁడు విరాధుని శరీరముప్రక్కనొక పెద్దపల్లము త్రవ్వెను. రామలక్ష్మణులు వానివానిపల్లమునఁద్రోసి పూడ్చిరి.

రాముఁడు సంతోషముతో సీతను గాఁగిలించి ధైర్యము చెప్పి లక్ష్మణునిఁగూడి శరభంగుని యాశ్రమము సేరెను. అట దేవేంద్రుఁడు దేవతలతో సూర్యకాంతితోఁ బ్రకాశించురథము డిగ్గి శరభంగునితో మాట్లాడుచుండ రాముఁడు "లక్ష్మణా! దేవేంద్రుఁని యతనిరథమును దేవతలనుజూడు" మనియె. ఇంద్రుఁడు దూరమునుండి రాముని గౌరవించి వెడలిపోయెను. శరభంగముని రాము నెదుర్కొనివచ్చి వారల కుచితరీతి సత్కారముచేసి "రామా! దేవేంద్రుఁడు నన్ను బ్రహ్మలోకమునకుఁగొంపోవ రాఁగా సమీపమున నీవు వచ్చుచున్నావని

కని నిన్ను దర్శింపక బ్రహ్మలోకమునకుఁబోవ నిష్టపడక నీ రాక నెదురుచూచుచున్నాఁడను. నేను తపముచేఁ బొందిన సకలలోక పుణ్యములను నీకర్పణసేయుచున్నాఁడను, స్వీకరింపు మనిన రాముఁ డట్లే స్వీకరించెను. రామునియనుజ్ఞఁబొంది శర భంగుఁ డగ్నిప్రవేశముచేసి బ్రహ్మలోకము సేరెను. అంతకు ముందే శరభంగుఁడు "రామా! నీవు సుతీక్ష్ణముని దర్శింపు" మని చెప్పియుండెను.

ఇంతలో నచ్చటి మునులందఱు వచ్చి చేతులుజోడించి నమస్కరించి "రామా! నీవు ధర్మస్వభావుఁడవు. ఆశ్రిత రక్ష కుఁడవు. రాజు ప్రజలవద్దనుండి యాఱవపాలు పన్నుగ్రహించి వారిని కన్నబిడ్డలవలెఁ బాలింపవలెను. అట్లే తపోధనులమగు మా తపఃఫలమున నాఱవవంతు రాజునకుఁ జేరును. రాక్షసుల బాధ తాళఁజాలకున్నాము. మమ్ము రక్షించుభారము నీయం దున్న"దని శరణాగతిసేసిరి. రాముఁడు వారల కభయమిచ్చి దుష్టశిక్షణముచేసి వారలఁ గాపాడునట్లు వాక్రుచ్చెను. సీతా రామలక్ష్మణులు దారినడచి సుతీక్ష్ణముని యాశ్రమము సేరి తేజోనిధియగు నమ్మునికి సవినయముగ మ్రొక్కిరి. అంత నమ్ముని రామునిఁ గౌఁగిలించి " రామా! చిత్రకూటమునకు వచ్చినావని తెలిసినప్పటినుండి నీరాక నెదురుచూచుచున్నాను. ధన్యుఁడనైతిని. నా యాశ్రమము పవిత్రమైనది. నీవు నా యాతిథ్యముగైకొనుమనినంత రాముఁడా రాత్రి యచ్చటఁగడపి జంతువులబాధను నివారించునట్లమ్మునికిఁ జెప్పి రాక్షసులఁబరి మార్చునట్లు ప్రతిజ్ఞఁ జేసెను.

సీతాదేవి "రామా! నీ సకలసద్గుణముల నే నెఱుంగు దును. నీ ధర్మాచరణము సత్యసంధత్వము సువిదితము. కాని నీవు రాక్షసవధ చేయునట్లు మునులకు మాటయిచ్చితివి. నీయం దపరాధము చేసినవారిని దండింప నగునుగాని రాక్షసుల నంద ఱిని చంపుదుననుట ధర్మమా?" యనెను. అంత రామచం ద్రుండు 'సీతా! నిన్నుగాని లక్ష్మణునిగాని విడుతునుగాని మునులకిచ్చిన వాక్కునుదప్పుట కీయకొన' ననెను.

అంత నా యరణ్యమున రాముఁడు ముందునడువ సీత యతని వెన్నంటుట లక్ష్మణుఁడు వారి ఱువుర వెంబడించుట అకార ఉకార మకారములఁగూడిన ప్రణవార్థమును జాటు చున్నది. అకారము విష్ణువును సూచించును. ఉకారము పర మాత్మ నాశ్రయించు జీవులవిషయమై పురుషకారముచేయు లక్ష్మీదేవిని సూచించును. మకారము జీవాత్మను సూచించును.

## రాముఁడగస్త్యాదుల దర్శించుట.

రాముఁడు దన వెంటవచ్చిన ధర్మభృతుండను మునివలన "మాండకర్ణి ఘోరతపముచేయ దేవత లద్దాని భంగపఱుప నైదుగు రప్సరల నియోగించిరి. అమ్ముని యొక తటాకమున నప్సరలఁగూడి యొకగృహమున నివసించుచుండెను. అందుచే నది పంచాప్సరమనఁబడియె. ఆ యప్సరల గానము వినఁబడు చున్న" దని తెలిసికొనెను.

పదంపడి రాముఁడు మునుల దర్శించుచు నందందు మాసములు వత్సరములు గడపుచుండ నరణ్యవాస కాలములోఁ

బడి సంవత్సరములు గడచినవి. రెండవపర్యాయము రాముఁడు సుతీక్ష్ణమునిని దర్శించి యతనివలన మార్గము దెలిసికొని యగస్త్యుని సందర్శింపఁ బోవుచు మార్గమున నగస్త్యభ్రాతయగు సుదర్శనుని యాశ్రమము సమీపించుచుండ లక్ష్మణునితో నిట్లనెను. "సౌమిత్రీ! పూర్వ మిల్వలుఁడు, వాతాపి యను రాక్షససోదరులుండిరి. ఇల్వలుఁడు బ్రాహ్మణరూపముదాల్చి తనయింట శ్రాద్ధమని నిమంత్రణమునకు బ్రాహ్మణులఁ బిలుచును. మేకరూపముదాల్చు తన తమ్ముఁడగు వాతాపిని వండి బ్రాహ్మణులకుఁ బెట్టును. వారు భుజించినతర్వాత 'వాతాపీ' యని పిలువఁగా వాఁడు బ్రాహ్మణుల యుదరముఁజీల్చి యందుండి వెలువడును. అప్పుడా యన్నదమ్ములు వారినిఁ జంపి తిందురు. ఇట్లుండ దేవతలప్రార్థనము నంగీకరించి యగస్త్యుఁడా యిల్వలునింట నిమంత్రణమూఁడి వాతాపిని భుజించెను. ఇల్వలుఁడు 'వాతాపీ'యని పిలువ నగస్త్యుఁడు 'ఇంక వాతాపి యాశవదలుము. వాఁడు నా యుదరమునఁ జీర్ణమై యమసదనము సేరె' ననినంత నిల్వలుఁడలిగి యగస్త్యునిమీఁదికి రాఁగా నమ్ముని చూపుచే నాతని భస్మము చేసివైచి యీప్రాంతమును రాక్షసులబాధ లేకుండునట్లు చేసెను" అని చెప్పి యగస్త్యభ్రాత యాశ్రమము సేరి యమ్మునిచేఁ బూజితుండై రాత్రి యచ్చటఁ గడపెను. మఱునాఁ డుదయము స్నానసంధ్యలుదీర్చి యమ్మునికిమ్రొక్కి యతనియనుజ్ఞఁబొంది సుతీక్ష్ణుని చెప్పినదారిఁబట్టి యదివఱ కెన్నఁడు చూడని వృక్ష లతాదులతోడను వైరము లేక సంచరించు మృగ పక్షిజాలములతోఁగూడిన యగస్త్యమునియాశ్రమంబు సేరి తనరాక నెఱిఁగింప లక్ష్మణుని పంపెను.

లక్ష్మణుఁడా యాశ్రమముననున్న శిష్యునొక్కనిఁజూచి యయోధ్యనుండి సీతారాము లిచ్చటి కరుదెంచి యున్నారని యగస్త్యునకుఁ దెలుపు మనెను. ఆ సమాచారముఁ దెలిసిన నగస్త్యుఁడు రామున కెదురువచ్చి సత్కరించెను. రామచంద్రుఁడు సీతాలక్ష్మణులఁ గూడి మునిశ్రేష్ఠునకుఁ బ్రమొక్కెను. అమ్ముని వారల నర్ఘ్యాదుల సత్కారముతోఁ బూజించి కుశలంబులడిగి రాముని యవతారరహస్య మెఱిఁగినవాఁడగుటఁ దనకు విష్ణుదేవుఁడు బ్రహ్మదేవుఁ డిచ్చిన యమోఘమగు ధనువును బాణములను ఖడ్గమును తూణీరమును రామున కిచ్చెను. మఱియు నమ్ముని " రామచంద్రా ! నీవు ధర్మముస్థాపింపఁ దమ్మునితోడను నెట్టికష్టమున కేనియుఁ దగని మహాసుకుమారియగు సీతతోడను వచ్చి నాకు నమస్కరించినందున కెంతయు సంతసము గలుగుచున్నది. లోకమున నైశ్వర్యమున్నంతకాలము భర్తను బూజించి దారిద్ర్యాది క్లేశము సంభవించినంత ననాదరించుట సర్వసాధారణమైయుండ వనములో ననేక కష్టములకోర్చి నీకుఁ బరిచర్యఁ జేయవచ్చిన సీత నేమని పొగడవచ్చు" ననెను.

అంత రామచంద్రుఁడు మునికి నమస్కరించి స్థలరామణీయకము జలరామణీయకము గలిగి వాసయోగ్యమైన స్థలమేదియో నెఱిఁగింపవలెనని కోర నగస్త్యుఁడు "రామా! రెండు యోజనముల దూరమునఁ బంచవటియను గడు రమ్యమగు స్థలము నీకుఁ దగినచోటు" అనిచెప్పి దారి నెఱిఁగింప రామచంద్రుఁడు సీతా లక్ష్మణసహితుఁడై మునికి మ్రొక్కి యతని యనుజ్ఞఁ బొంది పంచవటికిఁ బోవుమార్గమున నడచుచుండెను. మార్గమున నొక మఱ్ఱిచెట్టుమీఁద నొక పెద్దగృధ్రపక్షిని

రాముఁడు చూచి "నీ వెవ్వఁడవు" అని యడిగెను. అందులకా పక్షి "రాఘవా! నేను నీతండ్రికి బరమమిత్రుఁడను. నా పేరు జటాయువు. నీ వెప్పుడైన లక్ష్మణునిఁగూడి యెచ్చటికైనను బోవునట్లు తటస్థించిన నేను సీతను రక్షించెదను. మీకు నా వలన నుపయోగముండు" నని చెప్పెను.

అంత రాముఁడు "లక్ష్మణా! ఈప్రదేశమున సమమగు చోటునొక యాకుటిల్లు నిర్మింపు" మనెను. అతఁడు రాముని మనసు నెఱిఁగినవాఁడగుటచే నతిశీఘ్రముగ రమ్యమగు నొక్క పర్ణశాల నిర్మించెను. దానిఁజూచి రామచంద్రుఁడు చాల సంతోషించి, "సుమిత్రానందనా! నాకుఁదండ్రివంటిహితుఁడు నీవంటివాఁ డుండఁగా నేను తండ్రి చచ్చినవాఁడనుగాను. నీ తోడి సంబంధమే నా కన్నివిధముల నానంద మిచ్చుచున్నది" అని శ్లాఘించి సీతాలక్ష్మణులతో నా పర్ణశాలయందు సుఖముగఁ గొన్నిదినములు వసించియుండెను.

## శూర్పణఖ వచ్చుట.

---

సీతారామలక్ష్మణులు పంచవటియందు సుఖంబుగ వసించుచుండ నొకనాఁడు శూర్పణఖయను రాక్షసి యచ్చోటికి వచ్చి రాముని యాకారముఁజూచి యతనియందు మోహమతిశయింప "నేను శూర్పణఖయను రాక్షసిని. జనస్థానమున నుండు పరాక్రమశాలియగు ఖరుఁడును లంకేశ్వరుఁడగు రావణ కుంభకర్ణ విభీషణులును నా సోదరులు. నేను నిన్ను భర్తగఁ బడయఁగోరి వచ్చియున్నదానను. నీవు నావలన

ననేకసుఖము లనుభవింపఁగలవు. నే నెట్టి రూపమునైనను బొందఁగలను. నీయందు మోహముగలదానను. నన్ను నీ భార్యగ సంగీకరింపుము. నీవీరీతి తాపస వేషమున నడవుల సంచరింపనేల" యనెను. అంత రామచంద్రుఁడు కపటము లేనివాఁడగుట తన వృత్తాంత మంతయుఁజెప్పి యా రాక్షసిని చూచి 'నీవతిసుందరమగురూపముగలదానవు. నాకు భార్య యున్నది. నా తమ్ముఁడగు లక్ష్మణుఁ డందగాఁడు. భార్యలేక నొక్కఁడై యున్నాఁడు. నీ వతనిఁబెండ్లాడుట యుక్త'మనెను.

శూర్పణఖ లక్ష్మణునిసమీపించి 'నన్ను నీవు భార్యగఁ జేసికొని నావలన ననేకసుఖము లనుభవింపు' మనెను. అంత లక్ష్మణుఁడు 'నేను నాయన్నకు దాసుఁడను. నేనెల్లప్పుడతనికి సేవచేయుచుందును. ఇట్టి సేవకునిభార్యగనుండుట నీకుఁదగదు. మాయన్ననే భర్తగ వరింపు' మనెను. మఱల శూర్పణఖ రామునియొద్దకు నాతఁ డిష్టపడకుండుటకు సీతయే కారణమని యామెను మ్రింగఁబోవ రాముఁ డలిగి లక్ష్మణునకు సైగఁ జేసెను. వెంటనే లక్ష్మణుఁడద్దాని ముక్కుచెవులు గోసివైచెను. అంతనా రాక్షసి పిడుగువంటిశబ్దముతో రోదనముసేయుచు ఖరునితోఁ దన కేర్పడినబాధను, మిక్కిలి రూపవంతురాలగు భార్యతోడను తమ్మునితోడను రాముఁడు పంచవటిలోనుండుటయుఁ జెప్పెను. ఖరుఁడు మిక్కిలి కోపావేశములో గొప్ప వీరుల పదుగురనుబిలిచి 'మీరు శూర్పణఖఁతోఁబోయి సీతారామలక్ష్మణులనునరులఁ జంపితెండు. నాచెల్లె వారిరక్తముఁ ద్రాగును. వేగముగఁబొండ' నెను. వారంత శూర్పణఖ వెంటఁ

బోయి క్రమక్రమముగా నాయుధములు రామునిపై వేయ నతఁడు బాణములతో వానినిఖండించి యా పదునలుగురను బరిమార్చెను.

శూర్పణఖ వేగముగఁబోయి ఖరునితో "అన్నా! నీవు రాముఁడు సామాన్యమానవుఁడని తలఁచితివి నీ సకలసైన్యములతోఁబోయినను రాముని జయింపగలవాయని సందియము పొడముచున్నది. జాగుసేయక సకల సైన్యములతోఁ బోయి రామాదుల వధింపు" మనెను.

## ఖ ర వ ధ .

ఖరుఁడు రోషావేశముతోఁ గవచము తొడిగికొని బహువిధాయుధములనెత్తికొని గొప్పరథమునెక్కి పదునాల్గువేల రాక్షసుల వెంటఁబెట్టికొని యట్టహాసముతోఁ బోవుచుండ నపశకునములు గలిగినవి. ఇట్టి రాక్షససైన్యము యుద్ధమునకు వచ్చుచున్నదని తెలిసి రామచంద్రుఁడు "లక్ష్మణా! నీవు పరాక్రమవంతుఁడవు. ఈ రాక్షససైన్యమును జయింపఁగలవు. కాని నీవిప్పుడు ధనుర్బాణములుగొని సీతను గుహయందుంచి యామెను రక్షింపుము. నే నిప్పుడే యీ రాక్షసతండము నిర్మూలింతు" నని చెప్పెను.

ఇంతలో ఖరుఁడు సైన్యముతోవచ్చి యొంటరిగనున్న రామునిపై బాణవర్షము గురిపించెను. రాముఁ డవలీలఁగ నా బాణములఁ జెదరఁగొట్టి సైనికులను గుఱ్ఱములను గజములను వాడిబాణములచే ధ్వంసముసేయ మహాబలుఁడగు దూషణుఁడు కోపముతోఁ బిడుగులవంటి బాణములు రామునిపై బడవైచెను. అంత రాముఁడా దూషణుని రథమును గుఱ్ఱములను

సారథిని జంపి దూషణునిఁ బరిమార్చెను. అంత ఖరుఁడు క్రోధ మినుమడింప సేనాధ్యక్షుల నందఱ నొక్కపర్యాయము రామునిమీఁదికిఁ బంపెను. రాముఁడు నిజపరాక్రమము మెఱయ త్రిశిరుఁడు మున్నగు సేనానాయకు లందఱిని పదునాలుగు వేలమందిని హతమొందించుటఁజూచి ఖరుఁడు రోషావేశముతో రామునిపై బాణవర్షముఁ గురిపించెను. రాముఁడా బాణముల నాశమొందించి ఖరుని రథమును గుఱ్ఱములను సారథిని గూలనేయ ఖరుఁడు గదచేతఁబూని నేలమీఁద నిలుచుండ రాముఁడతనిఁజూచి "రాక్షసా! ఇట్టిసైన్యముఁగొని గర్వపడుచు మునులను హింసించుచుఁ గాలము గడపుచుంటివి. ఇప్పుడు నీ కంత్యకాలము సమీపించినది. దేవతలును మునులును సంతోషించు సమయము వచ్చినది. తాటిపండువలె నీ తల భూమిమీఁదఁ బడఁగల" దనెను. వాఁడు రాముని వేవిధముల దూషించి యనేకవిధ బాణములను గదాతోమరములను శిలావర్షమును గురిపించి రాముని జంపనెంచెనుగాని రాముఁడవక్రపరాక్రముండగుట జేసియు నగస్త్యమునివలనఁ బొందిన బాణముచే ఖరుని నేలఁగూల్చెను. అంతరిక్షమున దేవతలు, సిద్ధులు, గంధర్వులు, రాముని స్తుతించిరి. రాముఁ డొక్కఁడే ఖర దూషణ త్రిశిరాది పదునాల్గు వేల రాక్షసులఁ బరిమార్చుటఁ గన్నులారఁగాంచి యానందించి రాముని పరాక్రమముఁజూచిన సీతాదేవి రామునిఁ గౌఁగిలించెను. లక్ష్మణుఁడును రామునిఁ బ్రస్తుతించెను.

# 10. సీతాపహరణము

అకంపనుఁడను రావణుని గూఢచారి యెట్లో తప్పించుకొని రావణునికడకేగి "రాక్షసేంద్రా! అయోధ్యాపురమునుండివచ్చిన రాముఁడఁట. మానవుఁడయ్యు దేవతలకు రాక్షసులకు జయింపరాని పరాక్రమవంతుఁడు. ఖరదూషణ త్రిశిరాదుల నెల్లఱ జనస్థానవాసులను రాక్షసులనందఱిని హతము చేసినాఁడు. అతని కన్నివిధముల నొప్పియుండు లక్ష్మణుఁడను తమ్ముఁడు గలఁడు. లోకమునఁ గని వినియుండని యందకత్తె యగు సీత రామునిభార్య. నీవు సీత నపహరించితివేని రాముఁ డామె యెడఁబాటు తాళలేక మరణించు" ననెను.

అకంపనుని మాటలు విని సీత నపహరింపనెంచి రావణుఁడు తాటకాపుత్రుఁడగు మారీచునొద్దకుఁబోయి తన మనోరథము నెఱిఁగించెను. అంత మారీచుఁడు "రాక్షసేశ్వరా! నీకును నీ బంధుమిత్రాదులకును కుశలమా? నీవింతదయగలిగి యిచ్చటికరుదెంచిన నిమిత్తమే"మని యడిగెను. రావణుఁడు "మారీచా! అయోధ్యనుండి రాముఁడు సీతతోడను లక్ష్మణునితోడను వచ్చి జనస్థానములోని మనరాక్షసుల నందఱినిఁ బరిమార్చెనఁట. అతనిభార్య నపహరింప నాకు నీవు సాయపడవలె" ననెను. ఆమాటవిని మారీచుఁడు "రాజా! మిత్రునివలె నటించి నీకిట్టి యనర్థముగలిగింప నెంచిన దురాత్ముఁ డెవఁడు? రాముఁడు సామాన్యమానవుఁడుగాఁడు. అతని పరాక్రమము సాటిలేనిది. అతనిజయింప నెవ్వరికిఁదరముగాదు. రాముఁడను కాళసర్పముతో సహవాసము నీకుఁ దగదు. నీవు సకల శుభములతో నిండినవాఁడవు. ఏ క్రూరాత్ముఁడు నీ వైభవము

మూడనోర్వక నీకిట్టిబుద్ధిపుట్టించెను? నామాటవిని లంక కేగుము. సుఖముగ బహుకాలము జీవింపుము, పొమ్మనినంత రావణుఁడు లంకకు మఱలెను.

## శూర్పణఖ రావణుని సందర్శించుట.

జనస్థానమున ఖర దూషణ త్రిశిరులాదిగఁ బదునాలు వేవురు రాక్షసుల రాముఁడొకఁడే సంహరించుటను జూచిన శూర్పణఖ దుఃఖము కోపము గలసినదై లంకలో రావణుని సభ కరిగెను. దేవేంద్రునివలె జ్వలించుచుండు లంకాధిపుని జూచి "అన్నా! నీవు స్త్రీలోలుఁడవై మత్తిల్లి రాజధర్మమును బాటింపక రాజ్యము గోలుపోవనున్నావు. బుద్ధిమంతులగు గూఢచారులఁబంపి యేయేదిక్కున నేయేవిశేషములు జరుగు చున్నవో తెలిసికొనవు. అయోధ్యనుండి రామలక్ష్మణు లను క్షత్రియసోదరులు వచ్చియున్నారు. వారి రూపరేఖావిలాస ములు, పౌరుషప్రతాపములు, ధనుర్విద్యానైపుణ్యము, ధైర్య సాహసములు వర్ణింపనలవికానివి. రాముని భార్యయఁట సీత యను సర్వాంగసుందరి. ముల్లోకములలో నామెకు సాటివా రెవ్వరును లేరు. నీ వామెను భార్యగాఁబడయ నెంచిన నిప్పుడే తగు ప్రయత్నము సేయుము. రాముఁడు సామాన్య మానవ యువకుఁడని యెంచి వాని నెదుర్కొనుటలో నలక్ష్యభావ ముంచకుము. ఖరదూషణ త్రిశిరాదుల నెల్లరఁజంపిన రాముని యూరకఁబోవిడువ నీకెట్లుబుద్ధిపుట్టె? అందులకుఁదగిన శాస్తి చేయలెమ్మ్ము" అనినంతనే రావణునకు రోషముపుట్టె.

## రావణుఁడు మారీచునొద్ద కేఁగుట.

అతఁడు వెంటనే సభనుండిలేచి యంతఃపురముచేరి యాలోచించి దివ్యమగు రథము నెక్కి నానాదేశములఁ దాఁటి సముద్రము నవ్వలితీరముననొక రమణీయస్థలముననున్న మారీచుని యాశ్రమము చేరెను. అంత మారీచుఁ డతిభక్తితో రావణున కతిథిసత్కారములుగావించి "లంకాధిపా ! లంకలో నీ బంధుమిత్రాదులు క్షేమముగనున్నారా? నీవిట్లు మఱల నొంటరిగవచ్చుట కేమికారణ" మని యడిగెను. అందులకు రావణుఁడు "మారీచా! నామాటలు శ్రద్ధతో వినుము. నరాధముఁడగు రాముఁడు నాచెల్లెలు శూర్పణఖను ముక్కుసెవులు గోయించి నాతమ్ములగు బహుపరాక్రమశాలురైన ఖరుని దూషణుని త్రిశిరుని పదునాల్గువేవురు రాక్షసవీరుల నొక్కఁడే వధించినాఁడఁట. నీచుఁడును ధర్మముదప్పినవాఁడును మూర్ఖుఁడు నగు రాముని భార్యయైన సీతను గొనిరావలెనని నిశ్చయించితిని. ఇందులకు నీకంటె నాకుఁదోడ్పడఁజాలువా రెవ్వరును లేరు. నీవు మిక్కిలి బుద్ధిమంతుఁడవు. సమయస్ఫూర్తిగలవాఁడవు. నీవు వెండిచుక్కలుగలిగి చిత్రవిచిత్రవర్ణములతో నొకబంగారు లేడిరూపముదాల్చి యాసీతారాములముందట సంచరింపుము. సీత దానిఁజూచి "నాకీ జింకనుబట్టియిండని" యడిగినంతనే రామలక్ష్మణులు దానివెంబడిపోవుదురు. నేనప్పుడు సీత నెత్తుకొనివచ్చెద" ననెను.

తెలివిపరుఁడును మాటలనేర్పరియు నగు మారీచుఁడు "ప్రభువరేణ్యా! యజమానుని కాపద సంభవించునపుడు మొగ

మోటములేక మంచిచెడుగు లాలోచించి యప్పటి కప్రియమై నను వెనుక సుఖమునిచ్చు హితవు మాటలాడువా రుందురు. తమతమలాభము నభిలషించి ప్రభువును లేనిపోని స్తోత్రములు చేసి మెప్పించి తుదకుఁ దీఱనిదుఃఖమునముంచు నీచులే యగుచుందురు. నా మాటలు నీకిప్పు డప్రియముగనున్నను హితమగునవియని నమ్ముము. నీవు పొరఁబడుచున్నావు. రాముఁడరణ్యమునకుఁ దఱుమఁబడినవాఁడంటివి. కారణమేమని యెఱుఁగవైతివి. తండ్రిని సత్యసంధునిగాఁ జేయ నడవికివచ్చి యున్నవాఁడు. రాముఁడు నీచుఁడంటివి. అతఁడే గొప్పవాఁడు. తనజోలికి రానివాని కపకారముసేయఁడు. కేవలము ధర్మమునే యాచరించును. అధర్మమెన్నఁడుసేయఁడు. చేతికందినరాజ్యమునువదలి తండ్రిమాట కెదురాడక వెంటనే విరాగియై సకల కష్టములకోర్చి యరణ్యవాసము చేయ వచ్చిన యుత్తముఁడు. అతనిధర్మపత్నియగుసీతాదేవి మహాపతివ్రత. కాకున్న ఘోరారణ్యమునను భర్తనువిడనాడక నీడవలె వెన్నంటివచ్చునా? లక్ష్మణుఁడు పరాక్రమమున రామున కెంతమాత్రము దీసిపోవువాఁడుగాఁడు. అధర్మమును సకల రాక్షసలోక వినాశకరము నగు పనికిఁ బూనుకొనకుము. నీపరాక్రమము నాకుఁ దెలియనిదికాదు. నాకు రాముని పరాక్రమముగూడ బాగుగఁ దెలియును. కావున ముమ్మాటికి రామునితో యుద్ధము మానుకొమ్మని ప్రార్థించుచున్నాను.

మున్ను విశ్వామిత్రుఁడు యజ్ఞముచేయ నెంచెను. అతఁడు నాయొక్కయు సుబాహువుయొక్కయు మాయలఁదలఁచి మాబాధలుపడకుండుటకై దశరథుని యాచించి రామలక్ష్మ

ములఁగొనివచ్చి యాజ్ఞము ప్రారంభించెను. నేనును సుబాహు వును గలిసి కుండములు సేయఁ బ్రారంభింపఁబోఁగా రాముఁడు సుబాహువును సంహరించి నన్ను సముద్రమునఁ ద్రోయించెను. రావణా! నీకు ముల్లోకములలో మిక్కిలి యందకత్తెలగు భార్యలు పెక్కండ్రు గలరు. వారితో రమించు టుచితము. సీతను గామించుట గొప్ప యధర్మము. పరదారాభిగమనము మహాపాతకము. అందువలన వంశనాశమగును. ఎంత విద్య గడించినను స్వానుభవజ్ఞాన ముత్తమము. రాముని యద్వితీయ పరాక్రమము చవిఁజూచిన నాకిప్పుడు చెట్టుచెట్టున రాముఁడు గన్పడుచున్నాఁడు. జగమంతయు నాకు రామమయముగ నగుపడుచున్నది. ఎవరేని రకారముతో నారంభించు రత్నము, రథమని పలికినంతనే నాకు దిగులుపుట్టుచుండును. నా మాటల కీయకొనకున్న నీవతనితో యుద్ధముసేయఁబొమ్ము. నన్ను గొంతకాలము బ్రతుకనిత్తువేని రామునితోడి జోలి నా కంట గట్టకుము. శూర్పణఖ సీతను మ్రింగఁబోఁగా రాముఁ డామె ముక్కుచెవులు గోయింపఁజేసెను. దానిమాటలువిని యుద్ధమునకుఁబోయి ఖరాదులు మడిసిరి. నీవామార్గముపట్టకుండుట శ్రేయము. సత్యమును హితమును బలుకుచున్నాను. నా మాట నాలకింపుము సుఖింపు" మనెను.

అంత రావణుఁడు "మారీచా! నిన్నిప్పుడు మంచిచెడుగుల విమర్శింపఁ గోరలేదు. మేలో కీడో నేనాలోచించుకొందును. చెప్పినట్లుచేయుట నీవిధి" యనినంతనే మారీచుఁడు "రాజా! ఇట్టి నీవిపరీతబుద్ధిని మార్చుటకు నీమంత్రులు మిత్రులు పుత్రులు సోదరులు భార్యలు పూనుకొనలేదా? రాజు

ధర్మముదప్పి యకృత్యముచేసిన రాజుచెడుటమాత్రముగాదు, రాజ్యములోని వారందఱు వంతలపాలగుదురు. రామునిచూచి నంతనే నేను మరణింతును సీతను దెచ్చినంతనే లంక నాశ మొందును. ఇష్టుడైన నామాటను విమర్శించిచూడు" మనెను. అంత రావణుఁడు 'మారీచా! వేయిమాటలేల? నా మాటఁ బాటింపకున్న నిన్ను నేను వధింతు' ననెను. అందులకు మారీ చుఁడు 'రావణా! రామునిప్రభావము నెఱిఁగిననాఁటినుండి యోగాభ్యాసముచేయుచున్న నన్ను నీవు బలాత్కారముగఁ బాపకార్యమున నియోగించుచున్నావు. నీమాటఁదప్పిన వధింతువు. నీచేఁజచ్చుటకంటె నా రామునిచేఁజచ్చుట మేలు. నీవు చెప్పినట్లు చేయుదు' ననినంతనే రావణుఁడు సంతోషించి "మారీచా! నీవు బంగారు లేడిరూపము నెత్తుకొని సీతారాముల ముందఱ సంచరింపుము. సీత 'నాకా మృగమునుబట్టి తెమ్ము' నును. రాముఁడు నిన్ను వెంబడించును. నీ వతనిచేతికిఁ జిక్క కుము. రాముఁడు బాణమువేయును. అప్పుడు నీవు రాముని కంఠస్వరముతో "సీతా, లక్ష్మణా"యని పిలువుము. లక్ష్మణుఁ డు రాముని వెదకుచుఁబోవును. అప్పుడు నేను సీత నెత్తుకొని పోయెద" నని రథమున మారీచుని గొంపోయి రాముని పర్ణ శాలకుఁ గొంతదూరమున వదలెను.

## మాయామృగము.

---

రావణుఁడు వచ్చినకార్యముచేయుమనిచెప్పినంతనే మారీ చుఁడు నీలమణివంటి కొమ్ములును తెలుపునలుపుచారలుగల ముఖమును నీలిరంగు చెవులును కొంచె మెత్తయినమెడయును

తెల్లని కడుపును ఇప్పపూవులవంటి ప్రక్కలును వైడూర్యములఁబోలు గిట్టలును ఇంద్రధనువువలెఁ బలురంగులుగల తోఁకయును వెండిచుక్కలును గలిగి బంగారుజింకరూపము దాల్చి చెంగుచెంగుమని యెగురుచు నటునిటు పరుగులిడుచు మేయుచు నలుదిక్కులు చూచుచు సీతాదేవి పూలుగోయుచుండినచోటికి సమీపమునఁ దిరుగుచుండెను. దానించూచిన సీత గొంతెత్తి రామలక్ష్మణులఁబిలిచి యామృగమును జూపి దానిని బట్టియిమ్మని యడిగెను. లక్ష్మణుఁడు దానింజూచి నంతనే సందేహించి "అన్నా! ఇది రాక్షసమాయ. మహామాయావియగు మారీచుఁడు మునుల వంచించి చంపిటను వాడుక. ఇప్పుడు మనల వంచింపవచ్చినాఁ"డనెను.

అంత సీత భర్తనుజూచి "నాథా! నేననేక జింకలను నానావిధములగు దుప్పులను నితర మృగవిశేషములఁ జూచి యున్నానుగాని యీ మృగము నా మనము నాకర్షించినది. దీనిని సజీవముగఁ బట్టియిమ్ము. ఇచ్చట నుండునపుడు దీనితో నాడుకొందును. వనవాసముదీరినతరువాత పురమునకుఁబోవు నపుడును దీనిఁ గొంపోయి భరతాదులకును మీ తల్లులకును జూపుద"మనెను. రామచంద్రుఁడు "లక్ష్మణా! నీమాట నిజముగ నుండవచ్చునుగాని యిట్టి చిత్రవర్ణములుగల జింక నిదివఱకెన్నఁడు నెచ్చటఁ జూచి యెఱుఁగము. సీత చాల యాశపడుచున్నది. నీ విచ్చటనే సీతను గాపాడుచుండుము. నేను దీనినిబట్టితెచ్చెద"నని చెప్పి యా మృగము వెంట ధనుర్బాణములతోఁ బోయెను. ఆ మాయామృగము పట్టువడినట్లుండి చెంగుమని చమికి దూరముగఁ బోయెను. నిలిచినట్లుండి తటాలునఁ

బైకిలేచెను. మఱి వేగముగఁ బరుగిడెను, ఇట్లుచేయుచుండ విసుగుచెంది రాముఁ డొక్క బాణము వేయ నది తొలుత నాతని మృగశరీరమును భేదించి మరల నిజశరీరమును భేదింప వాఁ డొక తాటిచెట్టంతపొడవెగిరి నేలఁబడి రాముని కంఠము ననుకరించి "హా సీతా! లక్ష్మణా!" యని యఱచుచుఁ జచ్చెను. బంగారుహారములు భుజకీర్తులు కోఱలుగల రాక్షసుఁడు పడియుండుటఁజూచి రామచంద్రుఁడు "ఆహా! లక్ష్మణునిమాట నిజమే. మారీచుఁడే వీఁడు. నా గొంతెత్తి యఱచెనే సీతా లక్ష్మణులు భయపడి లక్ష్మణుఁడువచ్చిన సీతగతి యేమగునో యని సందేహించి మరలెను.

## సీత యొక్క నిష్ఠురోక్తులు.

రాముని యఱపు వినినంతనే సీత "లక్ష్మణా! పొమ్ము. మీయన్న కేమో యాపద కలిగినది. జాగుచేయకఁ బొమ్ము. రాముఁ డొంటరిగ రాక్షసునిచేఁ జిక్కి సంకటపడుచుండుటఁ దెలిసియు నీవాతని చెంతకుఁ బోకున్నావేల? ఇప్పుడైనను నా మాటఁ బాటించిలెమ్ము పొమ్ము" అనెను. అంత లక్ష్మణుఁడు "తల్లీ! దేవదానవు లెత్తివచ్చినను రాము నెదుర్కొనఁజాలరు. ముల్లోకములలో మాయన్నను జయించువాఁడు లేడని నమ్ముము. నిన్నిచ్చట సంరక్షించుమనట్లాజ్ఞాపించియున్నాఁడు. అతనిమాటఁ బాటింపకుండుటెట్లు? నీవు భయపడకుము" అని చెప్పెను.

అప్పుడు సీత "ఓహో! నీబుద్ధి యిట్టిదని యిప్పుడెఱుఁగుచున్నదానను. అన్నయందు మైత్రియున్నట్లు నటించి యతని కాపద సంభవించినందులకు సంతోషించుచున్నావు. నన్నుఁ

బడ్డి సింహాసనముఁజూచెదవు. నీ వెవనినిమిత్తమిచ్చటికి కేతెంచితివి? అన్నకు నాయము చేయవచ్చినవాఁ డన్న కాపదగలుగ నతని చెంతకైనను బోకుండుట కర్థమేమి? నీ కుటిలస్వభావ మిప్పు డు తెలిసినది. నీకైతోడబుట్టినబుద్ధియా? భరతుఁడు చెప్పిపంపిన యుపాయమా? ఎట్లయిన మీయుపాయము ఫలింపదు. రాముఁడు లేక నేనొక్క క్షణమైనను జీవించియుండను. గోదావరిలోఁ బడి చత్తును. విషమునైనను ద్రాగుదును. నిప్పులో నురికెదను. ఉరి వేసికొందును. ఎట్లయినను బ్రాణమువిడుతును గాని పరపురుషుని స్మరింతునా?" అని కఠోరముగఁ బలికినంత నే లక్ష్మణుఁడు చెవులు మూసికొని యుండకుండ నంజలిగీలించి "అమ్మా! ఇట్లు పలుకుట నీకిష్టమగునా? స్త్రీస్వభావమట్టిది. స్త్రీలు చంచలమనస్కులు. ఎట్టిస్నేహితుల నైనను విడిచియుందురు. ఇఁక నేనిచ్చట నుండలేను. నిన్ను దేవతలు రక్షింతురుగాక. నాకిప్పుడు దుశ్శకునము లగుపడుచున్నవి. నేను రాముఁడుండు చోటికిఁ బోయెదను" అని చెప్పి యంజలిచేసి మాటిమాటికి నామెవైపు చూచుచుఁ జింతతోఁ బోయెను.

## రావణుని రాక.

---

ఇట్లు లక్ష్మణుఁడు వెడలిపోఁగా దురాత్ముండగు రావణుఁడు కావివస్త్రముధరించి త్రిదండము కమండలము చేఁబూని జుట్టుగలిగి ఛత్రముపట్టుకొని పావలుదొడిగి సన్న్యాసిరూపమున సీతను సమీపించెను. అంత నామె యర్ఘ్యపాద్యంబు లిచ్చి యాసనము నిచ్చెను. భోజ్యపదార్థము లిచ్చెను గాని యా కపటసన్న్యాసి "ఓసుందరీ! నీ వెవ్వతవు? నీవులక్ష్మివా?

భూదేవివా? క్షత్రివా? నీముఖకాంతియుఁ గన్నులచందమును నీయవయవసౌందర్యమునుజూడ నీవు రతీదేవివో భువన మోహినివో యనందగియున్నావు. నీ వృత్తాంతమేమి" యని యడుగ సీత "నేను జనకరాజు కూఁతురను. శివధనుర్భంగము జేసిన శ్రీరాముని పెండ్లాడి పండ్రెండేండ్లతనితో నయోధ్యలో నుండి యతని పినతల్లి కోరిన వరముచేత వనవాసముచేయున ట్లేర్పడిన" దనెను. అంత రావణుఁడు "సీతా! దేవతలు దానవులు నన్నుజూచి భయపడుదురు. నన్నుజయించువారు లేరు. సకలలోకములలోని సర్వసంపదలు నాకుగలవు. నీవు నాకుఁ బట్టపురాణిగనుండుము. నీవు సకలలోకేశ్వరివగుదువు. సకల విధభోగము లనుభవింతువు. నీకీ యరణ్యావాసముదగదు. నా వెంటరమ్ము. నన్ను భర్తగ వరింపు" మనియె. సీత యతని మాట నెంతమాత్రము లక్ష్యపెట్టక "సత్యసంధుఁడును ధర్మవ్రతుఁడును జితేంద్రియుఁడు నగు రామునిఁదప్ప నన్యుని మనమునసైనం గోరను. సింహముపాలిఁటిసొమ్ము గోమాయువు గోరుచందమున రామునిదానసైన నన్ను నీవుగోరం దగదు. ఈఁగ బియ్యపుగింజయని యెంచి వజ్రపుముక్కను మ్రింగిన జీర్ణమగునా? మరణమే గలుగును" అని బదులిడియె. అనఁగా రావణుఁడు తనవలన మరణముపొందుట నిజమని భావము.

ఇట్లు సీత చెప్పినంతనే రావణుఁడు "సుందరీ! నీ వజ్ఞానముతోఁ బలుకుచున్నావు. నేను నా సవతితల్లికుమారుఁడగు ధనాధిపతియైనఁ గుబేరునిజయించి లంకాపట్టణమును బుష్పక విమానమును బొందినవాఁడను. జ్యేష్ఠుఁడయ్యు రాజ్యమునకుఁ దగనివాఁడని రాజ్యమునుండి వెడలఁగొట్టఁబడినవాఁడను

పౌరుషహీనుఁడును దుర్బలుఁడును దరిద్రుఁడును దుఃఖమున మునిఁగినవాఁడు నగు సామాన్యమానవుఁడైన రామునిసంబంధము వీడుము. నన్నుఁబొంది యితరుల కసాధ్యంబులగు భోగంబు లనుభవింపుము. నన్నిప్పుడవజ్ఞఁజేసి వెనుకఁజింతిల్లకుము' అనెను. అందులకు సీత 'కుబేరునితమ్ముఁడనిచెప్పుచు నీచకార్యమున కొడిగట్టనేల? ఇట్టి యింద్రియపరవశుఁడై నీతి నియమములుపాటింపని నిన్ను రాజుగఁబొందిన రాజ్యములోని ప్రజలెట్లు సుఖింపఁగలరు? నన్ను బలాత్కరించిన నీకుఁ జావు తప్ప' దనెను.

అప్పుడు రావణుఁడు నిజరూపముదాల్చి మఱల సీతను బలువిధములఁ బ్రోత్సహించియు విఫలుఁడై సీతనెత్తి రథమునం దుంచికొని యాకాశమార్గమునఁ బోవుచుండెను. అంత సీత "అయ్యో! నాథా! నీవులేనిసమయముచూచి యీ పాపాత్ముఁడు నన్నుగొంపోవుచున్నాఁడే. లక్ష్మణా! నిన్ను నిష్కారణముగఁ దూలనాడిన ఫల మనుభవించుచున్నాను. మాయలేడిని చూచినవెంటనే మారీచునిమోసమంటివే. వాని యెలుఁగు వినినప్పుడు మారీచునిమోసమే రాముని కాపద రాదంటివే. బలాత్కారముగ నిన్ను బొమ్మంటినే. ఓ గోదావరీ! నీవైన నన్నుగాపాడుము. లేకున్న రామునకీవార్తఁదెలుపుము. వృక్షములారా! పర్వతములారా! మృగములారా! ఖగములారా! మీ రెవ్వరైన నీ సంగతి రామున కందఁజేయుఁడు' అనుచు నొకచెట్టుపై గృధ్రరాజగు జటాయువుంగని 'పక్షిరాజా! నన్నీ పాపాత్ముఁడగురావణుఁ డిట్లు బలాత్కారముగఁ గొంపోవుచున్నాఁడు. నాకు సాయముచేయు' మని యేడ్చెను.

జటాయువా రోదనము విని "రావణా! గొప్పవంశమునఁ బుట్టితివి. విద్యలనెల్ల నభ్యసించితివి. ఎదురులేని పరాక్రమవంతుఁడవు. రాక్షసలోకమునకుఁ బ్రభుఁడవు. రాజే సత్యమునకు ధర్మమునకు నర్థకామములకు సంరక్షకుఁడు. కల్ల పైరు మేయునట్లు ధర్మరక్షకుఁడగు రాజట్టి యధర్మము సేసినఁ బ్రజ లెట్టి యధర్మము చేయరు? పరదారాభిగమనము మహాపాతకము. వంశనాశకరము. సీత రాముని ధర్మపత్ని. మహాపతివ్రత. ఆమెను దల్లిగనెంచి పూజింపఁదగును. నా మాట లాలకించి పాపము పోగొట్టుకొనుము. లేనియెడ నా మేనఁ బ్రాణముండఁగా నిన్ను బోనీయను" అనెను. రావణుఁడంత నలిగి జటాయువు నెదిరింప నా పక్షిరాజు వానిని ముక్కుతోఁ బొడిచియుఁ గాలిగోళ్ళతోఁ జీరియు రక్తగాయములు గలిగించెను. రావణుఁడును బాణములతో జటాయువును బహువిధముల నొప్పించెను. జటాయువతని గుఱ్ఱములఁ జంపి రథమును విఱిచి రావణుని కిరీటముఁ దన్నెను. అంత రోషావేశముతో నా రక్కసుఁడు ఖడ్గముతో జటాయువు ఱెక్కలఁ ద్రుంచెను. సీత దుఃఖముతో జటాయువు శరీరమును గౌఁగిలించి రోదనము సేయుచుండ రావణుఁ డామెను కేశముల నొకచేతితోను మోకాళ్ళ క్రింద నొకచేఁ బట్టి యెత్తుకొని యాకాశమార్గమున నదులను బర్వతములను బల్లెలను బట్టణములను దాటిపోవుచుండ సీత యనేకవిధములుగ నతని నిందించుచు దేవతలకు మ్రొక్కుచు నొక పర్వతశిఖరమున నైదుగురు వానరు లగుపడినంతనే తన చీర కొంగు చించి కొన్ని యాభరణములందు మూటగట్టి పడవైచెను.

రావణుఁడు సీతను దీసికొని సముద్రము దాటి లంకానగరమునకు జేరి యంతఃపురమున సీతనుంచి యామె కోరినదానినెల్ల నిచ్చునట్లాజ్ఞాపించెను. తా నామెకు వివిధ వస్తువులఁజూపి యామెమనసు మార్చుకొనఁ బ్రయత్నించెను. అతఁ డెనమండ్రు ఘోర రాక్షసవీరులను సకలాయుధములతో జనస్థానమునకుండి రామునిగూర్చిన సకల విషయముల నప్పటికప్పుడే గమనించి తనకుఁ దెలుపునట్లాజ్ఞాపించెను. అతఁ డనేకవిధములుగ సీత తన్ను వలచునట్లు ప్రయత్నించెను గాని యామె గడ్డిపోచను తనకును రావణునకును మధ్య నుంచికొని తలవంచి దానిఁ జూచుచు "రావణా! పవిత్ర యుత్తమవంశమునఁ బుట్టి యింతటి వైభవముతోనుండి లోకైకవీరుఁడగు రాముని ధర్మపత్నినగు నన్ను బాధించుట నీ కనర్థదాయకము. రామునిఁ దప్ప నన్యుని నే నెన్నఁడు స్మరింప" ననెను. అంత రావణుఁడు కుపితుఁడై భయంకరాకారులగు రాక్షసస్త్రీలతో "సీతను అశోకవనమునకుఁ గొంపోయి రేయింబవలు జాగరూకతతోఁ గావలియుండవలెను. నయమునను భయమునను సీత నన్ను వలచునట్లు సేయవలెను" అనినంత వారు సీత నశోకవనమున నొక శింశుపావృక్షముక్రింద నుంచిరి.

# 11. సుగ్రీవ సఖ్యము

రాముఁడు మారీచుని వధించి తన యాశ్రమమునకు వచ్చుచుండఁగా దుర్నిమిత్తములు గానవచ్చెను. అంత రాముఁడు "నక్కయఱచుచున్నది. సీతకెట్టియాపద వాటిల్లెనో? మారీచుఁడు నాగొంతుతో నఱచెను. సీతయేమిచెప్పెనో? లక్ష్మణుఁడేమిచేసెనో"యని శంకించుచుండ లక్ష్మణుఁడు చింతతో వచ్చుటనుజూచి "లక్ష్మణా! నీ వేలవచ్చితివి? సీత నొంటరిగ విడిచి వచ్చితివే. మాయావులగు రాక్షసు లేమిచేసిరోగదా? సీతను గానకున్న నేనాశ్రమమునకు రాను. ప్రాణమువిడుతును. నాకేమో యశుభముగలిగినదనియే తోఁచుచున్న"దనుచు వచ్చి పర్ణశాల శూన్యముగనుండుటఁగని దుఃఖ మతిశయింప నన్ని దిక్కులను వెదకి సీతనుగానక "లక్ష్మణా! నీవేల సీతను వదలి వచ్చితి"వని యడుగ రామానుజుఁడు "అన్నా, హా! సీతా! లక్ష్మణా! యను నీ కంఠస్వరము వినినంతనే సీత దుఃఖముతో నిండి నన్ను బొమ్మని యెంతబలవంతముజేసినను నేను కదలనైతిని. అంతనామె, ఆహా! అన్నమరణింప నన్ను బొందవచ్చెనని యెంచితివా? భరతుఁడేమైన దుర్బోధనజేసిపంపెనా? రాముఁడు మరణించియుండిన నీముందరనిప్పుడే ప్రాణమువిడుతును గాని నీకోర్కె యీడేరునా?' యనినంతనే సహింపలేక వచ్చితి"ననెను. అంత రాముఁడు శోకాక్రాంతుఁడై "సౌమిత్రీ! స్త్రీబుద్ధి చంచలమని యెఱుఁగవా? పరుషముగమాటలాడినంతనే యరణ్యప్రదేశమున నొక్క స్త్రీని యొంటరిగ విడిచి రావచ్చునా? మాయావులగురాక్షసులతో వైరమేర్పడెనే! ఆపద

వచ్చునని తలంపవయితివే. కొంతయోపిక లేనందుల కెట్టి విపరీతఫలముగలిగెనో చూచితివా? యని కొంత మందలించెను.

రామునిశోకము మేరమీఱినది. మతిచెడినవానివలెఁ బరుగిడుచు " గోదావరీ! నీవు సీతనుజూచితివా? పర్వతమా! నాప్రియురా లెటుపోయినది? మృగములారా! కమలాక్షియగు నాభార్యనుజూచితిరా? పక్షులారా! నన్నుపేక్షించిపోవుచున్నారే. సీత యెచ్చటికిఁబోయినది? లక్ష్మణా! నే నేమిచేయుదును? ఘోరారణ్యములకు నన్నుఁగూడివచ్చిన నాప్రాణప్రియను బోఁగొట్టుకొంటినే. అయ్యో! సీతా! నిండుచందురుఁబోలు నీమోము చూచుటెట్లు? హా ప్రాణప్రియా! ఏ పాపాత్ముఁడు దయమాలి నిన్నుభక్షించెనో! గోదావరిలో స్నానముచేయఁబోయి పడి మరణించితివా? నిన్నువిడిచి నేనెట్లుబ్రతుకఁగలను? లక్ష్మణా! సీతతోఁగూడి వచ్చిన నేను సీతలేక మరలివత్తునా? భార్యనుగాపాడుకొనలేనివాఁడొక పురుషుఁడా యని లోకులు నన్నునిందింతురే. జనకుఁడు సీతయెక్కడయనియడుగ నేమని బదులు సెప్పుదును? లక్ష్మణా! నీవిఁక నిచ్చట యుండనేల? అయోధ్యకుఁబోయి భరతునితోను దల్లులతోను నా వినాశమునుగూర్చి చెప్పి వారి నోదార్చి భరతుని యవిరళముగ రాజ్యము పాలింపుమనుము. లక్ష్మణా! రాజ్యముపోఁగొట్టుకొనుట, తండ్రిమరణించుట, బంధువుల నెడఁబాయుట, తల్లిని విడిచి వచ్చుట నా కెంతమాత్రము చింతఁ బుట్టింపలేదుగాని సీతావియోగదుఃఖము భరింప నాతరముగాదు. స్వర్గమైనను సీతలేకున్న నేనొల్లను. ఓసూర్యుఁడా! లోకబాంధవుఁడవే. నాకుమాత్రము బంధువుకాకపోవుదువా? నాప్రియురా లేమైనది?

వాయుదేవా! నీవు సంచరింపనిచోటు లేదు. సీత యెచ్చట నున్నది?" అని యున్మత్తునివలెఁ బ్రలాపించు రామునిఁజూచి లక్ష్మణుఁడు దుఃఖసాగరమున మునిఁగియు ధైర్యము దెచ్చుకొని "అన్నా! నీవు ధైర్యవంతుఁడవే. నీకిట్టియధైర్యమేల? విధిబల ము దాఁటరానిది. ఓర్చుకొనుము. సీతాదేవి యెచ్చటనున్నదో వెదకుదము. మనసు దిటవుచేసికొమ్ము. జరుగవలసిన కార్య మునకుఁ బూనుకొనుము" అని పరిపరివిధములుగ నన్న నోదార్చెను.

కాని రాముఁడు "లక్ష్మణా! లోకమున మెత్తనిమనసు గలవాని నెవ్వరు గణింపరు. కావున దేవతలు, సూర్యాగ్ని వాయువరుణాదులుగాని భూతప్రేతపిశాచములుగాని నాకు సాయముచేయనందున నేనిప్పుడే నా బాణపరంపరలచే భూ మ్యాకాశములను దిక్కులనుగప్పి లోకమునంతయు నాశ మొం దించెద"ననియె. అంత లక్ష్మణుఁడు 'అన్నా! నీవు జగదేకవీరుఁ డవు. నీ కసాధ్యమేదియు లేదు. కాని నీ కపకారముచేసినవా రినిమాత్రము దండింపనగునుగాని సాధువులనుగూడ హింసిం చుట యుక్తముగాదు. నీ దుఃఖాతిశయమున నీకట్లు దోఁచు చున్నది. సామమునను దానమునను భేదమునను గాకున్న దండముతోఁ బనుల సాధింపనగునుగాని ప్రారంభముననే దండోపాయము ననుష్ఠింపవలదు.

ఇష్టానిష్టములు లోకమున సహజము. కాల మెట్టివారి నేని నొప్పించును. మనతండ్రికినిగురువగు వసిష్ఠునిపుత్రులు నూర్గు రొక్కదినమున విశ్వామిత్రునిచే హతులైరి. స్థిరమని యెన్నఁ బడు భూదేవికి చలనముగలదు. సూర్యచంద్రులకును గ్రహణ

బాధలుపడ్డవు. కనుక దైవవశమున సీతకెట్టి విపరీతము సంభవించియున్నను నీవు కలంకక లాభాలాభముల సుఖదుఃఖముల నొకరీతిఁ జూచు స్థితప్రజ్ఞుఁడవు గమ్ము. ఈవిషయములు నాకు నీవు బోధించినవే. దుఃఖాంబుధి మునింగియున్న నీ కిప్పుడు జ్ఞాపించుచున్నాను" అని శాంతింపఁజేసెను.

అంత రామచంద్రుఁడు లక్ష్మణునిబుద్ధికి మెచ్చి సారమగు నతనిమాటలు గ్రహించి దుఃఖ ముడిగి మృగములు పక్షులు దారిఁ జూపుచు నైఋతిదిక్కుగాఁ బోవుచు నొక పెద్ద గృధ్రమును జూచి రాముఁడు "ఈ రాక్షసుఁడే సీతను భక్షించి యుండెనో యని యతని సమీపింపఁ బక్షిరాజగు జటాయువు నెత్తుటఁ దోఁగుచు "రామా! రావణుఁడు నీ ప్రాణప్రియను నా ప్రాణమును హరించినాఁడు. వాఁడు నీ భార్య నెత్తుకొనిపోవుచుండ నే నతని నెదుర్కొని రథమును గుఱ్ఱములను వింటిని కవచములను నాశము చేయఁగా వాఁడు నా పక్షములు ఖండించి కొట్టాపికతో నన్ను విడిచి సీత నెత్తుకొని దక్షిణముగఁ బోయినాఁడు. రావణుఁడు సీతను విందమను ముహూర్తమున నెత్తుకొనిపోయినందున నష్టద్రవ్యలాభమగును. అనఁగా నీవు యుద్ధమున నతనిజయించి సీతతోఁ గూడిసుఖింపఁగల" వనుచుఁ బ్రాణములు విడిచెను. రామలక్ష్మణులు గొంతసే పతనికొఱకేడ్చిరి. రాముఁడా జటాయువును గౌఁగిలించి లక్ష్మణుఁడు చితిపేర్చఁగా రాముఁడతనికి మంత్రపూర్వకముగ దహనక్రియలు చేయుచుఁ "పంచాగ్నిమధ్య తపముచేసినవారికిని వానప్రస్థులకును సన్న్యాసులకు నేలోకము ప్రాప్తమో నాచే సంస్కరింపఁబడినవాఁ డాలోకము పొందునుగాక" యని యాపక్షిరాజునకుఁ

బిండప్రదానముచేసి గోదావరినదిలో స్నానమాచరించి గృధ్ర
రాజునకు జలతర్పణముచేసెను. లక్ష్మణుఁడును జేసెను. ఆహా!
వేనవేలేండ్లు యజ్ఞములుచేసి వ్రతములుసలిపి నోములునోచి
సకలదేవతలఁబూజించి పుత్రునిఁబడసిన దశరథునకుఁ బ్రాప్త
ముకాని యంత్యక్రియలు మునుపు కనివిని యెఱుఁగని యడవి
లోని పక్షికి సంప్రాప్తమయ్యె ననుటకంటె దైవసంకల్పమును
జాటువిషయ మెద్ది గలదు?

## కబంధవధ.

రామలక్ష్మణులు సీతను వెదకుచు నరణ్యమున సంచ
రించుచుండ నయోముఖియను నొకరక్కసి వికృతరూపము
తోవచ్చి లక్ష్మణునెత్తుకొని "నా భాగ్యవశమున నీవు లభించి
తివి. నన్ను భార్యగఁ జేసికొమ్ము. నాతో నానాప్రదేశముల
రమించి సుఖింపు"మనినంత లక్ష్మణుఁడు దాని ముక్కు-సెవులు
స్తనమును ఖండింప నది పెనుశబ్దముతో రోదనముసేయుచు
వెడలిపోయెను. రామలక్ష్మణులు మఱికొంతదూరముపోఁగా
దీర్ఘబాహువులుగలిగి తలయుమెడయులేక మొండెమునఁ బెద్ద
నోరుగలిగి బాహువులుచాచి పట్టువడిన సింహవ్యాఘ్రభల్లూ
కాదుల భక్షించుచు దారికడ్డుపడిన కబంధునిఁజూచిరి. వాఁడు
భయంకరశబ్దముతో రామలక్ష్మణుల నిరువురను బట్టుకొన
లక్ష్మణుఁడు దీనుఁడై "అన్నా! నన్ను వీనికి బలియిచ్చి నీ
వెట్లయినను దప్పించుకొని సీతను వెదకి కనుఁగొని యామెఁ
గూడి సుఖింపు"మనెను. రాముఁడంత "లక్ష్మణా! దిగులుచెం
దకుము. ధైర్యముపూను" మనెను. ఇంతలో నారాక్షసుఁడు

"మీరెవ్వరు? నాచేఁజిక్కి ప్రాణములతోఁ బోవలే" రనినంత రాముఁడు లక్ష్మణునితో "శత్రుసూదనా! కాలమహిమ నేమన వచ్చును? కష్టములు వరుసగవచ్చుటచే బలపరాక్రమము లున్నను మనము వ్యసనములకుఁజిక్కి ధైర్యమువిడుచుచున్నాము. అది తగ"దనెను.

ఇంతలోఁ గబంధుఁడు వారిని మ్రింగయత్నింప రామ లక్ష్మణులు వాని రెండుభుజములను ఖడ్గములతో ఛేదించిరి. ఆరాక్షసుఁడు ఘోరమగు శబ్దముతో గర్జించుచు 'మీరెవ్వ' రని యడిగెను. అంత లక్ష్మణుఁడు "ఇతఁడు ఇక్ష్వాకువంశస్థుఁడగు దశరథుని పుత్రుఁడు. ఇతనిని రాముఁడందురు. నే నతని తమ్ముఁడను. నాపేరు లక్ష్మణుఁడు. మేము వనవాసముచేయ వచ్చితిమి. మాయన్నభార్య నెవ్వరో యపహరింప నామెను వెదకుచు నిచ్చటి కేతెంచితిమి. నీ వెవ్వఁడవని" యడిగెను. కబంధుఁ డిట్లు చెప్పెను.

"తొల్లి నేనతి సుందరాకారము గలిగియుండియు నిట్టి రూపముగొని మునులను హింసించుచుంటిని. ఇట్టిరూపమే నీకెల్లప్పుడుండుగాకయని యొకఋషి శపింప శాపవిమోచన మనుగ్రహింపుమని ప్రార్థింప నతఁడు రామచంద్రుఁ డీప్రాంత మునవచ్చి నీ బాహువుల ఖండించి నిన్ను దహించిన నీవు నీ రూపముదాల్తు" వనెను. కబంధాకృతి యెట్లువచ్చె నందువా? నేను ఘోరతపముసేసి యింద్రునిమీఁదికి యుద్ధమునకుఁబోవ నతఁడు వజ్రాయుధముతోఁగొట్టి నాకిట్టిరూపము గల్పించెను. నన్నుదహించి శాపవిముక్తి కలిగింపు" మనెను. అంత రాముఁడు "సీత నెవరెత్తుకొని యేదిక్కునకుఁబోయిరో చెప్పు"మనినఁ

కబంధుఁడు "రామచంద్రా! నాకు దివ్యజ్ఞానము లేదు. నన్ను దహించిన నా స్వరూపము పొంది మీకు హితము సెప్పఁగల" ననెను. రామలక్ష్మణు లతని కగ్నిసంస్కారము చేసిరి. కబంధుఁడు నిజరూపము పొంది ధగధగ మెఱయు రథమునుండి "రామచంద్రా! ఇంద్రతనయుఁడగు వాలిచే రాజ్యమునుండి వెడలఁగొట్టఁబడిన యతనితమ్ముఁడగు సుగ్రీవుఁడు పంపాసరస్సుగల ప్రదేశముననున్న ఋశ్యమూక పర్వతమున నున్నవాఁడు. నీవలె సహాయ మపేక్షించువాఁడు. కనుక నీ వాతనితో నగ్నిసాక్షికముగను శస్త్రసాక్షికముగను స్నేహముపొంది నీధర్మపత్ని యేలోకమున నున్నను బొంది సుఖింతు" వనెను. దశరథునికి ప్రాప్తము లేని రామునిచేతి యగ్నిసంస్కారము ఘోరరాక్షసుఁడగు కబంధునకు సంప్రాప్తమగుట దైవనిర్ణయమే జరుగుననుటకు చక్కని నిదర్శనము.

సీతను బొందు నుపాయము చెప్పఁగోరి కబంధుఁడు 'రామా! పడమటిదిక్కున ననేక ఫలవృక్షములు గలవు. మీకీ మార్గమునఁ బొండు. కొంతదూరమున బహువిధ పుష్పఫలములతో నిండి స్వచ్ఛమైన నీటితోను ఎఱ్ఱని తామరపువ్వులతోను హంసలు మొదలుగాఁగల జలపక్షులతోను నిండిన పంపాసరోవరప్రాంతము గలదు. అచ్చట తొల్లి మహాతపస్సంపన్నులగు మతంగశిష్యులుండిరి. వారు స్వర్గస్థులైరి. వారి పరిచారకసన్న్యాసినియగు శబరి భక్తితో నిన్ను బూజింపఁగోరుచున్నది. నీవామె నను గ్రహింపుము. పంపాసరస్సున కెదుట ఋశ్యమూకపర్వతమున్నది. ఆపర్వతమునఁ బరుండిన పురుషుఁడు కలలోఁగనిన ధనము మేల్కొన్న వెంటనే పొందును. పాపాత్ములా పర్వతము

నెక్కు లేదు. ఎక్కినట్టివారు నిద్రించునప్పుడు రాక్షసులు వారిని చంపుదురు. ఆపర్వతమున సుగ్రీవుఁడు నలుగురు వానరులతో నున్నవాఁడు. నీ వతని స్నేహముచేసికొనుమని" కబంధుఁడు రాముని యనుజ్ఞఁబొంది దివ్యతేజస్సుతో దివంబుసేరె.

## శబరికి మోక్షమిచ్చుట.

రామలక్ష్మణులు కబంధుఁడుచెప్పినమార్గము ననుసరించి పోవుచు పంపాసరోవరప్రాంతముసేరిరి. సమీపమున నానా ద్రుమ లతాదులతో విలసిల్లు శబర్యాశ్రమ మగుపడెను. వారందుఁ బ్రవేశించి శబరినిచూచిరి. ఆ వృద్ధతపస్విని వారిపాదములకుమ్రొక్కి యర్ఘ్యపాద్యాదులచే వారిఁబూజించి యంజలిఁ గీలించియుండ రాముఁడు "తపోధనురాలా! నీతపము నిర్విఘ్నముగ సాగుచున్నదా? కామక్రోధలోభములు నిన్నంటవుగదా! నీ యనన్యమగు గురుభక్తి సఫలమేకదా?" యని యడిగెను. అందులకా శబరి "రామచంద్రా! నాగురుశుశ్రూషాఫలితము, నా తపఃఫలము నీదర్శనముచే నేఁడు గంటిని. భగవంతుని దర్శనమే సకలతపంబులకు ఫలము. నా గురువాక్యము ననుసరించి నీరాక నెదురుచూచుచుంటిని. నీవలన నాకు మోక్షము సిద్ధము. నీకొఱకు నేనుసేకరించియున్న మధురమగు ఫలముల నారగించి నన్ననుగ్రహింపు" మనెను.

అంత రాముఁడు "శబరీ! నీగురుమహిమనుగూర్చి కబంధుఁడు పొగడెను. నాకా ప్రభావముఁజూపు"మనెను. ఆ తపస్విని "రామచంద్రా! రమ్ము. నా గురువులు దేవపూజలుసేసిన స్థలమిది. వారుగట్టిననారచీరలు దడియారకున్నవి చూడుము.

వారు పూజచేసినపుష్పము లిప్పటికిని వాడకుండుటఁజూడుము. నీ దర్శనముచే ధన్యురాలనైతిని. నా గురువులుండు స్థానము చేరునట్లనుగ్రహింపు" మనియడుగ రామచంద్రుఁడు 'సాధు చరితా! నీయాతిథ్యముచేఁ దృప్తుఁడనయితిని. నీవు నీకోరిక చొప్పున మోక్షమునకుఁబొమ్ము" అనినంత శబరి యోగబల ముచే దివ్యతేజముతో నుత్తమలోకము సేరెను.

శరభంగాదులకు రాముని రాక ముందుగఁ దెలిసియు వారలప్పుడు లభించిన ఫలమూలాదులిచ్చిరి. శబరి యంతకుఁ బూర్వమునుండి మిక్కిలి భక్తితో ననేకవిధ మధురఫలముల సేకరించియుండినది. ఆమె బోయజాతికిఁ జేరినదయ్యు, మతంగ శిష్యులకు శుశ్రూషలుచేసి గురుభక్తిచే రామునిదర్శనము పొంది తన్మూలమున మోక్షముపొందెను.

(అరణ్యకాండము పూర్తియయ్యెను).

---

## రాముఁడు సీతనుగూర్చి చింతించుట.

---

రామలక్ష్మణులు శబరియాశ్రమమునుండి పంపాసరో వరమునకుఁబోయిరి. ఆ ప్రదేశము నానావిధ పుష్ప ఫలభరి తములగు వృక్షములతోనిండి ప్రకృతిసౌందర్యమును వెదఁజల్లు చుండెను. రాముఁ డా సరోవరతీర్థమును వికసించిన తామర పువ్వులను హంసలు మొదలగు జలపక్షులను గోకిలల మధుర గానమును మదించి మధుపునుఁగ్రోలి ఝుంకారముచేయు తుమ్మె దలను మామిడి మొదలగు లేఁజిగుళ్ళను రత్నకంబళము పఱ చినట్లుండు పచ్చికనేలనుజూచి సీతనుదలఁచి విరహతాపము

తాళఁజాలక "లక్ష్మణా! చూచితివా యీ వసంతాగమన చిహ్నములు. ఏయేవస్తువులు సీతతోనుండునప్పుడు నా కానందమును గూర్చినవో యట్టివిప్పుడు నాసీతావియోగదుఃఖమును వృద్ధిచేయుచున్నవి. తమ్ముఁడా! నిండుచంద్రునివంటిమోమును తుమ్మెదలవంటి ముంగురులును దామరరేకులవంటికన్నులును బింబఫలమువంటి పెదవులును మల్లెమొగ్గలవంటి దంతపంక్తులును శిరీషపుష్పమువంటి మృదువగు శరీరమును బహుకాంతుల వెదఁజల్లు చిరునగవును గలిగి నాయం దత్యంతానురాగము గలసీత నెప్పుడు చూతునో? నాయిల్లాలి ముద్దుమాటలు విను భాగ్యముకలుగునా? వనవాసముతీరి పురముసేరిన నా తల్లి సీతయెక్కడయని యడుగ నేమిచెప్పుదును? లక్ష్మణా! సీతను విడిచి జీవించలే"నని చెప్పఁగా, సౌమిత్రి "అన్నా! నీవు బుద్ధిమంతులలో మేటివి. సకలధర్మములు దెలిసినవాఁడవు. చాలనికాలముననిట్టి యిష్టజనవియోగముగలిగినది. మనసుదిటవుచేసికొమ్ము. ధైర్యముడుగుము. పాతాళముననున్నను రావణుని వదలరాదు. సీతను వెదకి తెచ్చుకొనునంతవఱకు సకలప్రయత్నములుచేయవలెను. శోకమోహములు బుద్ధిని కలఁతఁబెట్టును. ఉత్సాహమును నశింపఁజేయును. కనుక సర్వకార్యసిద్ధికి మూలమగు ధైర్య మవలంబించి కార్యమునకుఁ బూనుకొను" మనెను.

అంత రామచంద్రుఁడు లక్ష్మణునిఁగూడి నదీప్రాంతములను గుహలను జూచుచు సీతను వెదకుచు ఋశ్యమూకపర్వతప్రాంతము సేరెను. అన్నయగు వాలిచేఁ దఱుమఁబడి యా

పర్వతమున నలువురు సహచరులతో నివసించుచుండు సుగ్రీవుఁడు రామలక్ష్మణుల ఋషివేషమును ధనుర్బాణములను జూచి వాలి పంపునఁ దన్ను హింసింపవచ్చిరేమోయని సందేహించి వారివృత్తాంతము నెఱిఁగి రమ్మని బుద్ధిమంతుఁడగు హనుమంతునిఁ బంపెను.

మహాప్రాజ్ఞుఁడగు హనుమంతుఁడు సన్న్యాసి వేషముఁ దాల్చి రామలక్ష్మణులున్న యెడకుఁజని మిక్కిలి వినయముతో వారికి మ్రొక్కి "మహాత్ములారా! సకల శుభచిహ్నములఁగూడి యాజానుబాహువులు రాజలక్షణములు గలిగి బలపరాక్రమముల నతిశయించుచు మునివేషధారులై ఖిన్నులై యీపంపాతీరప్రదేశమున సంచరించుచున్నారేల? మీరలెవరో యెందులకీ యరణ్యమునఁ దిరుగుచున్నారో తెలుపఁగోరెదను. నేను హనుమంతుఁడను వానరుఁడను. సుగ్రీవుఁడను వానరపుంగవుఁడు వాలియను భ్రాతచే రాజ్యమునుండి తఱుమఁగొట్టఁబడి యీ ఋశ్యమూక పర్వతమున నున్నవాఁడు. నేనతని మంత్రిని. సుగ్రీవుఁడు మీ స్నేహము గోరుచున్నాఁడు" అనెను. అంత రాముని యనుమతంబున లక్ష్మణుఁడు "ఇతఁడయోధ్యాపురాధీశ్వరుఁడగు దశరథుని పుత్రుఁడు రాముఁడు. కొన్ని కారణములచే నితఁడరణ్యవాసము చేయరాఁగా నతని ధర్మపత్నియగు సీతాదేవియు వచ్చెను. నేనతని తమ్ముఁడను. నాపేరు లక్ష్మణుఁడు. మేమిరువురము లేని సమయము చూచి సీతను రావణుఁడను రాక్షసుఁ డెత్తుకొనిపోయినాఁడు. మేమామెను వెదకుచున్నాము. కబంధుని మాటచొప్పున మేము సుగ్రీవుని సఖ్యముఁ గోరి వచ్చు

చున్నా మనెను. లక్ష్మణునిమాటలకు సంతసించి హనుమంతుఁడు "సుగ్రీవుఁడు సూర్యపుత్రుఁడు. అతఁడన్నచే వంచింపఁబడి భార్య యన్నవశమున నుండ రాజ్యభ్రష్టుఁడై యిబ్బందులకు నున్నాఁడు. అతఁడు మా సహాయమున మీకు సీతను వెదకుటకు మిక్కిలి తోడ్పడఁగలఁడ" నెను. అప్పుడు లక్ష్మణుఁడు "అన్నా! ఇతఁడు నిజము పలుకుచున్నాఁడు. సుగ్రీవుని యొక్కయు హనుమంతుని యొక్కయు సాయము మనకు లభించును". అని నంత హనుమంతుఁడు రామలక్ష్మణుల నిరుభుజముల నెక్కించుకొని సుగ్రీవుని చెంతకుఁ గొంపోయెను.

అంత హనుమంతుఁడు సుగ్రీవునింజూచి 'ఇక్ష్వాకువంశ చక్రవర్తియగు దశరథుని జ్యేష్ఠకుమారుఁడగు రామచంద్రుఁడు తమ్ముఁడగు లక్ష్మణునిఁగూడి వచ్చియున్నాఁడు. అతఁడు మహాప్రాజ్ఞుఁడు. తండ్రియాజ్ఞ చొప్పున నరణ్యవాసముచేయ వచ్చెను. అతని ధర్మపత్నిని రావణుఁ డెత్తుకొనిపోయెనట. అతఁడిప్పుడు నీస్నేహముఁగోరి వచ్చియున్నాఁడ' నెను. అప్పుడు సుగ్రీవుఁడు భయముడిగి రామునిఁజూచి "మహాత్మా! నేనొక వానరుఁడను. నీస్నేహముఁగోరి నేనురావలసియుండఁగా, నీవు నాయొద్దకే తెంచుట నాభాగ్యవిశేషమే. ఇదిగో నాచేయి చాఁచితిని. నీవు దానినిగ్రహించి శాశ్వతమగుస్నేహము పాటింపు' మనినంత రాముఁడు సుగ్రీవుని బిగియఁ గౌఁగిలించెను. హనుమంతుఁ డింతలో నగ్నిఁ బుట్టించ రామసుగ్రీవు లగ్నికిఁ బ్రదక్షిణము సేసిరి. సుగ్రీవుఁడు రామునిఁజూచి "రామచంద్రా!

ఈక్షణమునుండి నీక్షేమమే నాక్షేమము. నీదుఃఖమే నా దుః ఖము.. నాయన్న నాభార్య నపహరించి నన్నుఁ దఱిమివేయ నేను దీనుఁడనై నిన్నాశ్రయించుచున్నాను. నన్నుఁ గాపాడు భారము నీదనియెంచుము. నీసాయమున నేను నా భార్యను రాజ్యమును బొందవలె' ననిన రాముఁడు నవ్వుచు "భయపడ కుము. నేను వాలిని వధించెదను'' అని చెప్పెను. ఆ సమయ మున నట సీతకు వామనేత్ర మదరెను. రావణునకును వాలికి వలెనే యెడమకన్నదరినది. ఇందువలన సీతకు మేలగుననియు రావణునకు వాలికిఁ గీడుకలుగుననియు సూచింపఁబడినది.

# 12. వాలివధ

సుగ్రీవుఁడు మహాతేజోవంతుఁడగు రాముని సఖ్యము కుదిరినందున మహోత్సాహమున "రామా! నీవును లక్ష్మణుఁడును లేనిసమయముచూచి దురాత్ముఁడగు రావణుఁడు సీత నెత్తుకొని పోవుచుండఁగా నేమో "రామా! రామా! లక్ష్మణా! యని కేకలు వేయుచు నొక స్త్రీ తనచీరకొంగుచించి కొన్నియాభరణముల మూటఁగట్టి యీపర్వతశిఖరమునను౦డిన మాముందఱఁ బడవైచెను. నేనామూటను పదిలపఱచియున్నాను" అనినంత రాముఁడు 'సుగ్రీవా! ఆలస్యమేల? మూటను దెమ్మ'నెను. సుగ్రీవుఁడొకగుహనుండి మూటను దెచ్చి రాముని ముందటఁ బెట్టెను. రాముఁ డందలి యాభరణములఁ జూచి కన్నీరుగార్చుచు వానిని రొమ్మునఁ జేర్చి చింతించి లక్ష్మణునిఁ జూచి 'తమ్ముఁడా! ఇవి నీవదినవేమో చెప్పు'మనఁగా లక్ష్మణుఁడు 'అన్నా! నాకామె భుజకీర్తులుగాని కుండలములుగాని తెలియవు. నిత్యమామె పాదపద్మములకు నమస్కరించుటచే నామె యందెలు మాత్రము తెలియు' ననుచు వాని నెత్తియిచ్చెను. ఉత్తమపురుషునిలక్షణమట్టిదికదా! రాముఁడాయాభరణములను సీతవిగా నిశ్చయించి మిగుల దుఃఖింప సుగ్రీవుఁడు "రామచంద్రా! శోకముడుగుము. కాలము బలీయము. ఎట్టివానినైన కలంచివేయును. స్నేహభావమున నామాట విని ధైర్యము వహింపుము. శోకము కార్యహానిఁ గలిగించును. జరుగవలసిన కార్యమును గూర్చి యాలోచింపుము. రావణుఁడు సీత నెచ్చట దాచి యుంచినను వానిఁజంపి సీతను నీసన్నిధానముచేర్తును. సందియము వలదు. నేను వానరుఁడను. అయినను భార్యావియో

గమునుగూర్చి యెక్కువ దుఃఖింపను. నీవు సకలశాస్త్ర కోవిదుఁడవు. సత్పురుషులతో మెలఁగి పెద్దలచే సుశిక్షితుఁడవు. ధైర్యవంతుఁడు ధననాశనమువలనను బంధుమిత్రాదుల వియోగమువలనను ప్రాణాపాయమువలనను గంది కుందక సాధక బాధకముల విమర్శించి కార్యము సాధించును. రామచంద్రా! నీయందలి ప్రేమాతిశయముచే నిట్లనుచున్నానుగాని నీకు బోధించునంతటివాఁడను గాను. క్షమింపు"మని వేఁడ రాముఁడు "సుగ్రీవా! నీ సౌజన్యము నే నెఱుఁగుదును. స్నేహ మనిన ధనధాన్యాదులందును సుఖదుఃఖములందును సమత్వము భావించి యొకరివి మఱియొకరివిగ నెన్నుటయే. నీప్రేమ సాటిలేనిది. నీ యోర్పు నాకుత్సాహము గలిగించినది. వాలిని తప్పక చంపెదను. నామాట నమ్ముము. సత్యముమీఁద నే శపథము చేయుచున్నాను. నీ యోగక్షేమము నాది" యనెను. అంత సుగ్రీవుఁడును దక్కిన వానరులును సుగ్రీవుని కార్యము సఫలమైనట్లే సంతోషించిరి.

## వాలితో వైరకారణము.

సుగ్రీవుఁడు రామునిఁజూచి 'అనఘా! నీతోడి సఖ్యము నాకు సర్వశ్రేయము. మిత్రులు వెండి, బంగారు, వస్త్రములు, నగలు మొదలగువానిని యివినీవి యవి నావియని యనరు. అన్నిఁటిని సమముగ ననుభవింతురు. నాకు వాలితో వైర మేల కలిగెనో వివరించెదను.

మున్ను మా తండ్రి గతించినందున వాలి కిష్కింధా రాజ్యమునకు రాజయ్యెను. నేనతనికణఁగి సేవ చేయుచుంటిని.

ఇట్లుండ వాలికిని మాయావియను రాక్షసునకును స్త్రీవిషయమై వైరమేర్పడినది. మాయావి యొకనాఁ డర్ధరాత్రమునవచ్చి బిగ్గఱగ నఱచుచు వాలిని యుద్ధమునకుఁ బిలిచెను. నిద్రించుచుండినవాలి మేమెల్లఱ మెంత వారించినను వినక వానిఁ దఱుముచుఁ బోయెను. నేను నతనిని వెంబడించితిని. మాయావి యొక బిలముఁజొచ్చెను. వాలియు నా బిలము ప్రవేశించుచు నన్నచ్చటఁ గావలియుండుమ నట్లాజ్ఞాపించెను. ఇట్లొక సంవత్సరము గడచినది. ఒకనాఁడొక పెద్దశబ్దముతో నెత్తురు ప్రవహించెను. వాలియే మరణించెనని తలఁచి నే నా బిలము నొక పెనుబండతో మూసివైచి పురముసేరితిని. మంత్రులు మున్నగువారు రాజులేని రాజ్యము క్షీణించునని నన్ను రాజుగఁ జేసిరి. నేను క్రమముగఁ బాలించుచుంటిని.

అంత నొకనాఁడు వాలి యాబిలద్వారపు ఱాతి నవలఁ ద్రోసి రోషముతో వచ్చి నన్ను దూషించి జనులతో నామోసపుబుద్ధి నెఱిగించి నేనెన్నివిధముల నతని పాదములంటి క్షమింప వేఁడినను నాభ్రాతృద్రోహమును వెల్లడిచేసి నాభార్య నపహరించి నన్ను రాజ్యమునుండి వెడలఁగొట్టెను. నే ననేక స్థలములుచూచి తుదకు వాలి రాఁగూడని ఋశ్యమూకపర్వతము సేరితిని. నా యీ నలువురుమంత్రులు నాకనేకవిధముల సాయము చేయుచు నన్నుఁ గాపాడుచున్నారు. వారివలన నే నింతమట్టునకు జీవింపగలిగియున్నాను. నిన్నుఁ జూచి వాలిపంపఁగా నన్ను హింసింప వచ్చియుందువని భయపడి నిజము నెఱుఁగ హనుమంతునిఁ బంపితిని. రామచంద్రా! నీవే నాపాలిఁటిదేవుఁడవు. నన్ను రక్షించుభారము నీయందేయున్నది" యనెను.

అందులకు రాముఁడు "సుగ్రీవా! నీభార్య నపహరించిన మహా పాపిని తప్పక వధించెదను. దుఃఖసముద్రమునుండి నిన్నుద్ధరించెద" ననెను. సుగ్రీవుఁ డా మాటలకు సంతసించి రామునిఁ బొగడెను.

## వాలి దుందుభుల యుద్ధము.

సుగ్రీవుఁడు వాలియొక్క పరాక్రమమును బూర్తిగ రామున కెఱిఁగింపఁదలంచి "రాఘవా! వాలి వేకువజామునలేచి నాలుగు సముద్రములలో ననుష్ఠానములుచేసి వచ్చును. దుందుభియను మహాబలుఁడగు రాక్షసుఁడు వరబలగర్వమున సముద్రుని యుద్ధమునకుఁ బిలువ నతఁడు హిమవంతునియొద్దకుఁ బొమ్మని చెప్ప మహిషరూపముఁదాల్చిన రక్కసుఁడు హిమాలయమునకుఁ బోయి యుద్ధమునకుఁబిలువ నా పర్వత రాజు నీకుందగినవాఁడు మహావీరుఁడగు వాలియే, నీవతనితో యుద్ధముచేసి కీర్తిగడించుమని చెప్పెను. అంత నా రాక్షసుఁడు కిష్కింధలో దూరి పెనుబొబ్బలిడి యర్భాటముసేయ వాలి తొలుత సామవచనములాడి పొమ్మనెను. దుందుభి రోషము తిశయింప 'వానరా! స్త్రీలముందట ముచ్చటలాడుటఁ దగదు. రమ్ము నాతోయుద్ధముసేయుము. నీవు కాముకుఁడవు గనుక నుదయమువఱకు గడువిచ్చెదను. భోగమనుభవింపుము నీకు బదులు రాజొకని నియమించి బంధుమిత్రులసెలవుపొంది యమ పురంబునకుంబోవ సిద్ధముగ రమ్ము. మద్యముద్రావియున్న వానిని యేమఱుపాటుననున్నవానిని నిరాయుధుఁడగువానిని వధింపరాదని తెలియును. కనుక నీకు గడువిచ్చితి" ననెను.

అంత వాలి కుపితుఁడై శత్రుంజయమునిచ్చు కాంచన మాలను ధరించి పర్వతాకారుఁడగు మహిషరూపముననున్న దుందుభిని కొమ్ములుపట్టి గిరగిరఁద్రిప్పి నేలఁబడవైచెను. వాఁడును గడురోషముతో వాలిని నొప్పించెను. ఇరువురకు ఘోర యుద్ధము జరిగెను. తుదకు వాలి వానినెత్తి నేలమీఁదఁబడఁ గొట్టి చంపి యా కళేబరమును విసరివేయ నది దూరమునఁ బడెను. ఆరక్తము మతంగముని యాశ్రమమునఁబడెను. అప్పు డా ఋషి యలిగి దివ్యదృష్టిచే వాలి దోషియని యెఱిఁగి "వాలికి సంబంధించిన వానరుఁడెవ్వఁడు నా యాశ్రమమున నుండ రాదు, అట్లుండినవాఁడు పర్వతమై వేలకొలఁదియేండ్లేయుండవలె"నని శపించెను. అందలి వానరులందఱు కిష్కింధ సేరఁగా వాలి కారణ మెఱిఁగి మతంగమునికి మ్రొక్కి శాపవిముక్తి కోరెనుగాని ముని ప్రసన్నుఁడు కాలేదు. అందువలన నతనిశత్రువగు నే నిచ్చట వసించుచున్నాను. ఆ దుందుభికాయ మిప్పు డెండి శల్యముమాత్రమున్నది. రామచంద్రా! ఇదిగో యేడు సాలవృక్షముల వరుస, వాలి యొకదానిమూలముగ నేయుబాణ మింకొకదానికిఁ దగులును. అట్టివాలి నెట్లుజయింతు" వనెను.

అంత లక్ష్మణుఁడు సుగ్రీవునిజూచి "ఏపనిచేసిన రాముఁడు వాలినిజయించునను నమ్మిక నీకుఁ గలుగు" ననిన సుగ్రీవుఁడు "లక్ష్మణా! రాముఁ డీ సాలవృక్షములలో నొక్కదానిని బాణముతోఁజీల్చి దుందుభికాయము నొంటికాలితో నిన్నూఱు విండ్లపట్లదూరమునకుఁ బోనిచ్చిన నాకు నమ్మికకలుగు"ననెను. లక్ష్మణుఁ డీసంగతి రామునకెఱిఁగించెను. అంత రామచంద్రుఁ డా దుందుభికాయమును బదియామడలదూరమునకుఁ గాలి

బాటనప్రవేలితో విసరికొట్టెను. ఒక్క బాణముతో సప్తసాల ముల భేదించెను. సుగ్రీవుడప్పుడు రామునకు సాష్టాంగప్రణామ మాచరించెను. మఱల జేమోడ్చి "రాఘవా! నాకు బరమ శత్రువగు వాలిని వెంటనే వధింపవలె"నని కోరగా రామచంద్రుడు "సుగ్రీవా! నీవు ముందుగ గిష్కింధకుబోయి వాలిని యుద్ధమునకు బిలువుము. ఇంతలో మేమువచ్చెద"మని చెప్పిపంపెను.

సుగ్రీవు డుత్సాహముతో గిష్కింధ ప్రవేశించి వాలిని యుద్ధమునకురమ్మని గంభీరముగ నఱచెను. వాలి యాశబ్దము విని కోపముతోవచ్చి సుగ్రీవు నెదుర్కొనెను. వా రిరువురకు పెద్దయుద్ధముజరుగుచుండ రామలక్ష్మణులు వృక్షములచాటుగ నుండి చూచుచుండిరి. వాలిసుగ్రీవు లన్నివిధముల నొక్క రూపుగలిగియుండినందున రామచంద్రునకు వాలియెవరు సుగ్రీవు డెవరని సందేహము దోచెను. తొందరపడి బాణము వేసిన నది సుగ్రీవునకే తగిలిన బ్రమాదమగునని తలచి యూరకుండెను. వాలి రోషావేశముతో సుగ్రీవునిగొట్టి తఱుముచుండ నతడు మతంగాశ్రమము సొచ్చినందున వాలి మఱలిపోయెను. రాముడు సుగ్రీవునిచూచి "మిత్రమా! వాలికిని నీకును భేద మెంతమాత్రము దెలియనందున బాణము వేయనైతిని. కోపింపకుము. ఈ యరణ్యమున నీవే మాకు దిక్కు. నిన్ను జంపుకొనిన మేమేమిచేయగలము. ఈ పర్యాయము నీ వేదేని గుర్తుతోబొమ్ము. ఒకేబాణమున వాలిని వధించెదను. సందేహింపకు"మనెను. లక్ష్మణుడు తోడనే గజపుష్పమను తీగను సుగ్రీవున కొక హారమువలె వేసెను.

అంతట రామలక్ష్మణులును సుగ్రీవాది వానరులును రమ్యములగు వనవృక్షములను బహ్వాకరములను జూచుచు కిష్కింధాపురము చేరిరి. రామలక్ష్మణులు వనవృక్షముల చాటున ధనుర్బాణములఁ దాల్చియుండిరి. హనుమదాదులును నలుగుస్థలమున నుండిరి. సుగ్రీవుఁడు నూతనోత్సాహముతో మేఘగర్జనమువంటిశబ్దముతో సింహనాదముచేసి వాలిని యుద్ధమునకురమ్మని పిలిచెను. మహావీరుఁడగువాలి యాశబ్దము విని సహింపఁజాలక యుద్ధమున కుద్యుక్తుఁడగుటంజూచి తార "నాథా! ఇంతకుముందే కొట్టువడి పాఱిపోయినసుగ్రీవుఁ డింతలో యుద్ధమునకై వచ్చుటలో రహస్యమున్నది. అంగదుఁ డరణ్యమున సంచరించుచు రామలక్ష్మణు లను మహాపరాక్రమశాలురను జూచెనఁట. వారు సహాయముచేయఁగా సుగ్రీవుఁడు యుద్ధమునకు వచ్చినాఁడు. రాముఁడు విరాధాది రాక్షసులను వధించినవాఁడు. అతని జయించువా రెవరును లేరు. అతఁడు దీనులకు రక్షకుఁడు. ఆపదలోనివారిని తప్పక కాపాడును. అతఁడు సకలశాస్త్రములు దెలిసినవాఁడు. ధర్మము ననుష్ఠించువాఁడు. సుగ్రీవుని యువరాజుగాఁ జేసి ధనకనకాదులనిచ్చి యాతనియెడ వైరమువిడిచి స్నేహముఁ బాటించిన నీకు క్షేమము గలుగును. రామునితో యుద్ధము నీకుఁదగదు. ఇదివఱకెన్నఁడు నిట్టిమాటలాడినదానఁగాను. నేఁడు నామాటలువినుట యుక్త"మని భర్తకనేకవిధములుగ యుద్ధము మానుకొమ్మని హితోక్తులాడెను.

వాలి తారనుజూచి "ప్రాణప్రియా! నీవు మధురముగ మాటలాడుదానవు. నాకెన్నఁ డప్రీతికలిగింపవు. నేఁడేమో

భయపడియున్నావు. రాముఁడు ధర్మపరుఁడు. నా కతనితో వైరమేమియు లేదు. అతనితో నాకు యుద్ధము సంభవింపదు. కండకావరమెక్కిన సుగ్రీవుని యోడించివచ్చెదను. నాకును వానిం జంప నిష్టము లేదు. కాని వానితిరస్కారము సహింపఁ జాలను. వాని నోడించి వచ్చెదను. నీవు నీ చెలులతో నుండుము. నాకు జయముగలుగఁగోరుము" అనఁ దార మనసునఁ జింతించుచు భర్తకు శుభముగలుగవలెనని కోరుచుండెను.

వాలి యఱచుచు సుగ్రీవునిమీఁది కుఱికి ముష్టిఘాతములతోను నఖదంష్ట్రములతోను సుగ్రీవుని నొప్పించెను. వాఁడును సాలవృక్షము నెత్తి వాలిని నొప్పించెను. ఘోరయుద్ధము జరుగుచుండ సుగ్రీవునిబలము తగ్గుచుండుటంజూచిన రామచంద్రుఁడు తీక్ష్ణమగు బాణమును బ్రయోగింప నది వాలి యురమునఁ గ్రుచ్చుకొనినంత వాఁడు నేలఁబడెను. కాంచనమాల ధరించియుండినందున వాలి మరణింపలేదు.

## వాలి రాముని నిందించుట.

---

ఇంతలో రామలక్ష్మణులు, హనుమదాదులు వాలిపడియుండు స్థలమునకు వచ్చిరి. వాలి రామునిఁజూచి "రామా! తారమాటలువినక యుద్ధమునకు వచ్చితిని. నీవు క్షత్రియుఁడవు. రాజవు. ధర్మమనుష్ఠింపఁదగినవాఁడవు. లోకము నిన్ను ధర్మస్వభావుఁడని మెచ్చియున్నది. నీవు నిజముగ నట్టివాఁడవుగాఁ దోఁచుట లేదు. నీకును నాకును సంబంధమేమి? నీవు మానవుఁడవు. నేను వానరుఁడను. నీకు నారాజ్యమక్కర లేదు. నామాంసము నీ కుపయోగపడదు. నాచర్మముగాని

గోమముగాని యెమ్ములుగాని నీకెంతమాత్ర ముపయోగమైనవి కావు. నీకు నేనెట్టి యపకారము చేసి యెఱుఁగను. ధనకనక వస్తువాహనాదులలో నీకును నాకును వైరములేదు. నిన్ను నేనెఱుఁగను. నన్ను నీవెఱుంగవు. నీవు కేవలము కాముకుఁడవు. భార్యను బొందుటకై లేనిపోని యకృత్యములు సేయుచున్నావు. నాతో నొక్కమాట చెప్పియుండిన నా రావణుని సంహరించి సీతను నీసముఖమునఁ జేర్చియుందునే. రామా! నాయెదుటనిలిచి యుద్ధము చేసితివా? ఇతరునితో యుద్ధము చేయు నన్ను వధించితివే. ఇట్టి యధర్మము చేసినందుల కేమి సమాధాన"మనుచు నోరెండిపోవుటచే నూరకుండెను.

రాముఁడు వాలికి సమాధానముచెప్పుట.

---

రామచంద్రుఁడు "వాలీ! నీవు ధర్మము, అర్థము, కామము, మోక్షము అను పురుషార్థముల స్వరూపము నెఱుఁగక నన్ను నిందించుచున్నావు. ఈభూమియంతయు నిక్ష్వాకువంశ రాజుల పాలనములోనిది. ఇప్పుడు ధర్మస్వరూపుఁడగు భరతుఁడు పాలించుచున్నాఁడు. అతనియాజ్ఞఁబొంది మేమీప్రాంతమున వసించుచు దుష్టశిక్షణ శిష్టరక్షణ చేయుచుందుము. కన్నతండ్రియు నన్నయు గురువును తండ్రితో సమానులు. అట్లే కుమారుఁడు తమ్ముఁడు శిష్యుడు మువ్వురును కొడుకులవంటి వారే. తమ్మునిభార్య నీకుఁ గోడలివంటిదే. అట్లుండ నీవు తమ్ముని వంచించి యతనిభార్య నపహరించుటకంటె నధర్మమేమిగలదు? ఇట్లు నీచే మోసముచేయఁబడి రాజ్యభ్రష్టుఁడై దీనుఁడై యున్న నీతమ్ముఁడు సుగ్రీవుఁ డగ్నిసాక్షికముగ నాతో

స్నేహముచేసికొనినవాఁడు. నన్నాశ్రయించి నారక్షణము గోరి నందున నతనిక్షేమముఁగోరి యధర్మమార్గమునను సరించిన నిన్ను వధింపవలసిన న్యాయము నాకున్నది. నాకు విరోధులైనను నన్నుశరణుఁజొచ్చినవారి విరోధులైనను నాచే వధింప నర్హులగుదురు. బలహీనులు బలవంతులసాయ మపేక్షించుట యుక్తమే. బలవంతులు బలహీనుల నొప్పించుట యధర్మమే. పాపముచేసినవాఁడు దండులకుఁదగిన ప్రాయశ్చిత్తము లేక రాజదండనంబొందిన నతనిపాపముపోవుటయేగాక వాఁడు స్వర్గము చేరును. అధర్మముచేసినవానిని దండింపకున్నచో రాజే వాని పాపఫల మనుభవింపవలెనని శాస్త్రము. మఱియు నొక కారణముగలదు. రాజులు వేఁటాడునపుడు మృగములను పక్షులను వలవేసియు బాణములతోఁగొట్టియుఁ జంపుట సహజమే. నీవు శాఖామృగమవే కావున నిన్ను చాటుననుండి గొట్టుట దోషముగాదు. కనుక ధర్మము నేయనుష్ఠించు నన్ను నీవిట్లు నిందింపఁదగవు" అనెను.

అప్పుడు వాలి చేమోడ్చి "పురుషోత్తమా! అజ్ఞానముచే నిన్ను దూషించితిని. నీ మాట సత్యమే. నేను సుగ్రీవుని పట్ల చేసిన యపరాధమును మన్నింపుము. నా పశ్చాత్తాపమే యందులకుఁ దగిన ప్రాయశ్చిత్తము. నిన్ను దూషించినందులకు నన్నుక్షమించుము. నా ప్రాణతుల్యుఁడగు నంగదుని నీస్నేహితుఁడగు సుగ్రీవునితో సమానముగ నెంచుము. ఇఁక వారియుభ క్షేమము నీ యధీనము. తారను గౌరవించునట్లు సుగ్రీవునితోఁ జెప్పుము. నన్ను నీవు క్షమించు"మని యూరకుండెను. రాముఁడు వాలినిఁజూచి "వాలీ! నీ పశ్చాత్తాపమువలనను

నా దండనవలనను నీ పాపములెల్లను నశించినవి. ఇఁక నీ పుత్రుఁ డంగదుని, సుగ్రీవుని యోగక్షేమముల నేను వహింతును. తారను గౌరవించుటయు సుగ్రీవుని ధర్మమగును. నీవు శోకవ్యామోహభయాదుల విడిచి శాంతింపు"మనియె.

## తార విలపించుట.

వాలి హతుఁడయ్యెనను వార్త వినినంతనే యతని ధర్మపత్నియగు తార వాలిపడియున్న స్థలమునకు వచ్చి శోకసముద్రమున మునిఁగి యతని సమీపించి "నాథా! నేను యుద్ధము వలదని వారించితినే. నామాట వినకుంటివే. నన్ను జూడవా? నాతోఁ బలుకవా? ఇదిగో నీ యనుంగుపుత్రుఁ డంగదుఁడు దుఃఖించుచున్నాఁడే. మా యిరువురను విడిచిపోవ నెట్లు మనసొప్పెను? నన్ను విడిచి యంగదునివదలి స్వర్గముననైన నీ కెట్లు సుఖముగలుగును? కిష్కింధను వదలిపోయెదవా? నీ బంధుమిత్రులు నీ యెడబాటు సహింపలేక శోకించుచున్నారే. నీవు తమ్ముఁడగు సుగ్రీవుని భార్య నపహరించితివి. అతనిని పురము వెడలఁగొట్టితివి. ఆ పాపఫల మిప్పు డనుభవించితివి. నాకుఁ బుత్రునికంటె నీవే ప్రియుఁడవు. నిన్ను విడిచి నేనుండలేను. నీతోఁ బరలోకమునకు వత్తు"నని యతనిప్రక్కఁ బడియుండెను.

## హనుమంతుఁడు తార నోదార్చుట.

అంత హనుమంతుఁడు "తారా! నీవు పండితురాలవు. నీకుఁ దెలియనివిషయములు లేవు. నీవు వీరపత్నివి. వీరస్వర్గము నొందిన నీ నాథునిగూర్చి యింతఁ జింతింపనగునా? లోక

మునుబుట్టిన ప్రాణులెల్ల మరణింపక తప్పదు. మరణమనఁగా శరీరము నశించుట. శరీరము నీటిబుగ్గవంటిది. ఉన్నట్లేయుండి రూపుమాసిపోవును. ఆత్మ నాశరహితము. అదినిత్యము. నీ నాథునియాత్మ రామునికృపచేఁ బరమాత్మనుజేరినది. అందులకై నీవు వగవఁబనిలేదు. ఇఁక జరుగవలసినదేమని యోచింపుము. పసివాఁడైన యంగదునకు ధైర్యముసెప్పి యోదార్చి పితృకైంకర్యముసేయింపుము" అనెను. అంత తార "కపితిలకా! నీమాట నేనెట్లు పాటింతును? తండ్రికివెనుకఁ బినతండ్రియగు సుగ్రీవుఁడే సకలభారము లందుకొనవలెను. నన్నును నా పుత్రుని పోషించుభార మతనిదే"యనెను.

చచ్చినట్లే స్మరణలేకుండిన వాలి తెలివివచ్చినందునఁ గన్నులు తెఱచిచూచి "సుగ్రీవా! నాతప్పును గమనింపకుము. నీ కిష్కింధను బాలింపుము. అంగదుని నీకుమారుఁడనియే భావింపుము. వాఁడు పరాక్రమశాలి. బుద్ధిమంతుఁడు. సుషేణుని కూఁతురగు తార రాగలయాపదలకుందగిన యాలోచన చెప్పునట్టిది. దానిమాటను జవదాటకుము. నీకు క్షేమము గలుగును. నా కాంచనమాలను గైకొనుము. నాకుఁ బ్రాణము పోయినవెంటనె దానికాంతి క్షీణించును" అనెను.

వాలి యంగదునిఁజూచి "నాయనా! నా వెనుక నీ పినతండ్రియే నీతండ్రియని భావింపుము. అతనిమాట నెన్నఁడు మీరకుము" అనెను. ఇంతలో సుగ్రీవుఁడు వాలిమెడలోని కాంచనమాలను దీసివేసెను. వాలి మరణించెను. కిష్కింధ పాడుపడినట్లుండెను. తార భర్తృవియోగము తాళలేక

"నాథా! అపజయమెఱుఁగని నీకు యుద్ధభూమిలో మరణము గలుగునని యెన్నఁడు నూహింపనైతిని. ఆహా! రామచంద్రుని బాణమొక్కటే నిన్ను గూలనేసెనే!" యనెను.

ఇంతలో సుగ్రీవుఁడు తారాంగదుల దుఃఖమునుచూచి రామునిసమీపించి "ఇనకులతిలకా! బుద్ధిహీనుఁడనై సోదరుని జంపుకొంటిని. తార, అంగదుఁడు, కిష్కింధాపుర పౌరులు వాలిమరణముచే దుఃఖసాగరమున మునిఁగిరి. వారిక బ్రతుకుటయు సందియమేయగును. వారిని నా బంధుమిత్రాదులను బోఁగొట్టుకొని నేనుపొందఁబోవు సుఖము నా కెంతమాత్రము వలదు. ఇందఱి శోకముతోఁ బొందవలసిన రాజ్యము నేనెంత మాత్రము నొల్లను. నా కనుజ్ఞయిమ్ము, నేను నగ్నిప్రవేశము చేసెదను" అనెను. తార భర్తశవము నాలింగనముసేసికొని రోదనము సేయుచుండ రామచంద్రుఁ డచ్చటికి వచ్చినంతనే తార కోపముతో నాతని దూషింపనెంచెను గాని రాముని చూచినంతనే శాంతించి "రామా! నీవుసాటిలేనివాఁడవు. నిన్నెవ్వ రెదుర్కొనలేరు. నీవు జితేంద్రియుఁడవు. ధర్మమునే యాచరింతువు. దుష్టసంహారముకొఱకే నీవీరీతి మానవుఁడవై యవతరించితివి. నీవు చక్కఁగఁబూచిన పువ్వులను బక్వముగ నుండు ఫలములను జూచునపుడెల్ల సీతనుదలంచుచు నేడ్చెదవే. నానాథుఁడట్లే నన్నుగూర్చితపింపఁడా? నేను వాలియొక్క యర్ధాంగిని. నన్నుజంపిననే నీవు వాలిని పూర్తిగ వధించినట్లు. నన్ను నీబాణముతో వధించి స్వర్గమున నా భర్తతోఁ గలిసి యుండున ట్లనుగ్రహింపుము" అనెను. రాముఁడామాటలువిని "వీరపత్నీ! నీవు మహావీరుఁడగు వాలిభార్యయయ్యు నిట్టి విప

రీతబుద్ధిగలిగియుండుటం దగదు. బ్రహ్మదేవునియాజ్ఞ నతిక్ర మింప నెవ్వరికిని సాధ్యముకాదు. ముల్లోకములు సృష్టించిన యాతనివిధి తప్పరానిది. దానిననుసరించి వాలిమృతుండయ్యె. అందువలన నీవును మరణించుట యుక్తముగాదు.” అని హితము బలెకెను.

## రాముండు తారాంగద సుగ్రీవుల నోదార్చుట.

రాముండు తారాంగద సుగ్రీవులంజూచి “ఎంతకాలము దుఃఖించినను మరణించినవారు రారు. లోకమున కీశ్వరుండే కర్త. అతని సంకల్పమాత్రమున సకలము సృష్టియగును. సర్వ రక్షకుం డతండే. జీవుండు పరతంత్రుండు. ఈశ్వరునియాజ్ఞ ననుసరించువాండు. సర్వశక్తుండీశ్వరుండు. అతండు సకలప్రాణు లకును బూర్వజన్మకర్మముల ననుసరించి ఫలము నొసంగును. పరమాత్ముని కార్యములు దురూహ్యములు. ఒక్కత్రుటిలో నేమిజరుగునో చెప్ప నసాధ్యము. ఈశ్వరాజ్ఞ ననుసరించి వాలి నాచే హతుండయ్యె. ఇంక నతనికిం జేయవలసిన సంస్కారములు గావింపు”డనియె. లక్ష్మణునిప్రేరేపణచే సుగ్రీవుండు తారాం గదులంగూడి వాలి కగ్నిసంస్కారాదులు గావించెను.

తరువాత హనుమంతుండు వినయముతో “ రాఘవా! సుగ్రీవుని కిష్కింధకు రాజుగా నభిషేకింపు ” మని యడుగ ధర్మముదప్పని రామచంద్రుండు ‘మారుతీ! నేను తండ్రి యా జ్ఞానుసారము పురప్రవేశముచేయరా’ దని చెప్పి సుగ్రీవునితో ‘నీ విపుడు పురమునకుం బోయి నీ బంధుమిత్రాదులంగూడి పట్టాభిషేకము చేసికొమ్ము. అంగదుని యౌవరాజ్యమునం

నభిషేకింపుము. ఇప్పుడు వర్షాకాలము. కార్తికమాసమున సీతాన్వేషణాది కార్యములు సేయవచ్చునని యనుజ్ఞ యిచ్చి పంపెను. కిష్కింధలోని వానరులెల్ల రానందముతో సుగ్రీవ పట్టాభిషేకము సేసిరి. తారయు నంగదుని యువరాజుగఁ జేసి నందులకు సంతోషించి సుగ్రీవునిఁగూడి సుఖముగ నుండెను. సుగ్రీవుఁడు దన భార్యయగు రుమనుబొంది సకల భోగంబులనుభవించుచుండె.

# 13. సీతాన్వేషణము

సుగ్రీవున కభిషేకమైనవెంటనే రామలక్ష్మణులు ప్రస్ర వణపర్వతమున నొక విశాలమైన గుహాలో వసించుచుండిరి. రాముఁడు పర్వతమున నుండు రకరకముల తాళ్ళను, మద్ది, జేల, సంపెఁగ, మామిడి, ప్రబ్బలి, చీఁకటి, పొగడ, పనస మొద లగు నానావిధ వృక్షములను, సెలయేళ్ళను, పలురంగులపక్షు లను, హంసలు, నీటికోళ్ళు, బాతులు మున్నగు జలపక్షులను తామర, కలువపూలతోనిండిన సరస్సులనుజూచి సంతోషిం చుచు లక్ష్మణునితో ముచ్చటించుచుండెను. ఒకొ్కకప్పుడు లక్ష్మణునిఁ జూచి "ఇట్టి ఋతువున సుగ్రీవుఁడు మఱలఁ దన భార్యనుబొంది రాజ్యము స్వీకరించి యానందించుచున్నాఁడు. నేనిట్లు సీతనువిడిచి దిక్కుతోఁచక మిక్కిలి కుందుచున్నాను. వర్షాకాలము గడచినది. శరత్కాలము వచ్చినది. ఆకసము నిర్మలముగ నున్నది. ఇది సీతను వెదక నారంభింపఁదగిన కాల ము. సుగ్రీవుఁడు నన్ననాదరణసేయుచున్నాఁడు. తనకార్యము సఫలమైనందున భోగము లనుభవించుచు నన్నుమఱచెనేమో' యనిన లక్ష్మణుఁడు 'అన్నా! సుగ్రీవుఁడు నిన్న సడ్డచేయఁడు. తప్పక నీకార్యము నిర్వర్తించు' ననెను.

ఇంతలో హనుమంతుఁడు మిక్కిలి బుద్ధిమంతుడగుటచే కామాతురుఁడై కర్తవ్యముమఱచిన సుగ్రీవుని మెల్లగ సమీ పించిప్రసన్నునిఁజేసికొని "రాజా! నీయాపదనుబోఁగొట్టి నిన్ని రాజ్యము నకంటకముగఁబాలించునట్లును నీధర్మపత్నిని మఱ లఁ బొందునట్లును గావించిన రామచంద్రునికార్యము నిర్వర్తిం చుట ధర్మము. రాముని పరాక్రమము నీకుఁదెలియనిదికాదు.

అతఁ డలిగిన మనకుఁ జేటువాటిల్లును. హెచ్చరికతోఁ బనులు గావించుట శ్రేయ" మనెను. అంత సుగ్రీవుఁడు హనుమంతుని తో "వీరా! నా యాజ్ఞగ నింకఁ బదునైదుదినములలో సకల వానర ఋషభ సైన్యములును నా సమక్షమునకు రాకున్న మరణదండన విధింపఁబడునని యంగద జాంబవంతుల కెఱుఁగించి యితర సేనాపతులకాజ్ఞఁ బంపుము' అని చెప్పి యంతఃపురము సేరె.

## రాముఁడు లక్ష్మణునిఁ బంపుట.

సుగ్రీవుఁడు తనయొద్దకు రానందున రాముఁ డలిగి 'లక్ష్మణా! ఇంతకాల మెట్లో సీతనువిడిచియుంటిని. ఇఁక నా ప్రాణప్రియనుబొందుట కుపాయము వెదకుసమయమువచ్చినది. తామసింప వీలులేదు. "రాముఁడు దేశాంతరమువచ్చినవాఁడు. దిక్కులేక నన్నాశ్రయించియున్నాఁడు. నాసహాయము లేకున్న నేమిసేయగలఁడని సుగ్రీవుఁడు తలంచినట్లున్నది. వాలినిజంపినబాణమున్నది. ఆమార్గమింకను నాశమొందలేదు అనిచెప్పుము పొమ్ము" అనెను.

అన్నయొక్క దుఃఖాతిశయమును సీతావిరహవేదనను సుగ్రీవుని కృతఘ్నతను జూచి లక్ష్మణుఁడు ధనుర్బాణతూణీరముల ధరించి కోపముతోఁ గిష్కింధలోఁ బ్రవేశింపఁగనే వానరులెల్లరు భయపడిరి. లక్ష్మణుఁ డంగదునిచూచి "నాయనా! రామునితమ్ముఁడు లక్ష్మణుఁడువచ్చియున్నాఁడని సుగ్రీవునితోఁ జెప్పు" మనెను. అంగదుఁడు సుగ్రీవునకును తల్లికిని

రుమకును నమస్కరించి లక్ష్మణుని యాగమనవార్తఁ దెలియఁ జేసెను. సుగ్రీవుఁడు మధుపానముచే మత్తుగలిగి ప్రజ్ఞ లేకుండ పరుండియుండెను. అంతఁ దార భూషణముల గల్లుగల్లుమను శబ్దముతో మెల్లగనడచుచు వచ్చి “లక్ష్మణా! తపోధనులగు ఋషులును కామమోహితులగుట సహజమైయుండ వానర వీరునిమాట చెప్పనేల? అట్లున్నను సుగ్రీవుఁడు లక్షలకొలఁది వానరులను రప్పించియున్నవాఁడు. శాంతింపుము, మన్నింపుము, లోనికి రమ్మనినంత లక్ష్మణుఁ డంతఃపుర స్త్రీలమధ్య రుమతో శయ్యపై గూర్చుండియుండిన సుగ్రీవునిఁ జూచెను. సూర్యునివంటి తేజస్సుగల రామానుజుని చూచినంతనే సుగ్రీవుఁడు రుమ మొదలగు స్త్రీలమధ్య చేమోడ్చి లక్ష్మణుని ముందట నిలుచుండెను. అంత లక్ష్మణుఁడు “ఉపకారికి ప్రత్యుపకారముచేయు రాజు కీర్తి పొందును. నమ్మినమిత్రునకుఁ బ్రత్యుపకారముచేయని రాజు గొప్ప పాపియగును. ఒక గుఱ్ఱమునకై బొంకినవాఁడు నూఱుగుఱ్ఱములనుజంపినపాప మనుభవించును. ఒకయావునుగూర్చి యసత్యమాడిన వందగోవులను వధించిన పాపము గలుగును. ఒకపురుషునివిషయమై బొంకిన నాత్మహత్యచేసినపాప మనుభవించును. ఒకనిచే నొకపని చేయించుకొని ప్రత్యుపకారము గోరినను చేయనివాఁ డధమాధముఁడు. మున్ను స్వాయంభువమనువు ‘బ్రహ్మహత్యచేసినవానికి, సురాపానముచేసినవానికి, స్వర్ణము నపహరించినవానికి, గురుపత్నియెడ నీతిఁదప్పినడచుకొన్నవానికిని ప్రాయశ్చిత్తమున్నదిగాని చేసెననని చెప్పి తప్పిపోయిన కృతఘ్నున కెట్టిమార్గము లేదని చెప్పెను. మాయన్నవంటి లోకోత్తరపురుషుని గుణగణముల

నెంచక గ్రామ్యసుఖములలో మునిఁగి మైమఱచియున్న నిన్ను కృతఘ్నుఁడని వేఱుగఁ జెప్పనేల' యనెను.

తార లక్ష్మణునిఁజూచి "రామానుజా! సుగ్రీవుఁడు మాటతప్పఁడు. తప్పక సీతను వెదకి తెచ్చియిచ్చును. విశ్వామిత్రునివంటి ఋషిపుంగవుఁడే కామమోహితుఁడై వేలకొలఁది యేండ్లు చేసిన తపముయొక్క ఫలమును బోఁగొట్టుకొనెను గదా. చపలుఁడగు వానరుని విషయమున కామమోహితుఁడగుట గొప్పయధర్మమని కోపించరాదు. రామునివిషయమై ప్రయత్నముచేసియేయున్నాఁడు. శాంతించి జరుగవలసినకార్యము నాలోచింపు' మనెను. ఇంతలో సుగ్రీవుఁడు "లక్ష్మణా! నాయపరాధము క్షమింపుము. మీయన్నయొక్క పరాక్రమ ఫలితమగు నీ రాజ్యసుఖమును కామోపభోగములను గొంచెము మితిమీఱి యనుభవించి యాలస్యముజేసినందులకు నన్ను క్షమింపు" మనెను. లక్ష్మణుఁడు సుగ్రీవునిమాటలకు సంతోషించి "మిత్రమా! నీవువచ్చి సీతావియోగదుఃఖములోనున్న మాయన్ననోదార్పుము" అనెను. వెంటనే సుగ్రీవుఁడు ప్రక్కనున్న హనుమంతునితో "సకల వానరసైన్యముల పదిదినములలో నిచ్చటికివచ్చున ట్లేర్పాటుచేయు" మనిచెప్పి లక్ష్మణుని వెంట రాముని సందర్శింప బంగారుపల్లకినెక్కిపోయెను. వానరు లనేకులు వెంటఁబోయిరి. సుగ్రీవుఁడు పల్లకి దిగి రాముని సమీపించి సాష్టాంగముగ మ్రొక్కెను. అంత రాముఁడు ప్రసన్నుఁడై సుగ్రీవునికౌఁగిలించి సుగ్రీవా! ధర్మార్థకామములకుఁ దగిన కాలదేశవర్తమానముల ననుసరించు రాజే యుత్తముఁడని చెప్పఁగా సుగ్రీవుఁడు "రామచంద్రా! క్షమింపుము. లెక్క

లేనివానరవీరు లిప్పుడే వచ్చి సీత నెట్లయినను నీకు లభింపఁ జేతు" రనెను. అంత రాముఁడు సంతోషించెను.

సుగ్రీవుఁడు వానరవీరులను నలుదిక్కులకుఁ బంపుట.

ఇట్లుండ నాకాశమువఱకు ధూళిరేఁగెను. తార తండ్రి యగు సుషేణుఁడు, రుమయొక్క తండ్రియగు తారుడు, పరాక్రమశాలియగు శతవలి, హనుమంతుని తండ్రియగు కేసరి, భీమబలుఁడగు గవాక్షుఁడు, పగవారి నడంచునట్టి ధూమ్రుఁడు పనసుఁడు, నీలుఁడు, దరీముఖుఁడు, అశ్వినీదేవతలకుమారులగు మైంద ద్వివిదులు, గజుఁడు, గంధమాదనుఁడు, తండ్రివంటి పరాక్రమవంతుఁడైన యంగదుఁడు, నలుఁడు, దధిముఖుఁడు, శరభుఁడు, కుముదుఁడు మున్నగు మహాబలవంతులగు వానర వీరులు కోట్లకొలఁది భయంకరాకారులును, కామరూపులును, గొప్పకీర్తిగడించినవారునగు గోలాంగూలసైన్యములతో వచ్చిరి. జాంబవంతుఁడు లెక్కలేని యెలుఁగుబంట్ల సైన్యముతో వచ్చి సుగ్రీవునిముందఱ నిలిచెను.

సుగ్రీవుఁడు నేలయీనినచందంబునఁదోఁచు వానర సైన్యమును రామచంద్రునకుఁజూపి "రామా! వీరందఱు నీ యాజ్ఞ నిరీక్షించుచున్నారు. నీకార్యము నిర్వహింప సిద్ధముగ నున్నా"రనెను. అంత రాముఁడు సుగ్రీవుని కౌఁగిలించి 'నీవు లక్ష్మణునివలె నాకత్యంతాప్తుఁడవు, బుద్ధిమంతుఁడవు, సమయస్ఫూర్తిగలవాఁడవు. నామనసును నాకార్యమును జక్కగ నెఱింగినవాఁడవు. నీవే వారికి నియామకుఁడవు. ఈ కార్య

సాధనసామర్థ్యము నీయం దున్నదని యెఱుఁగుదును. నీవే వారి
వారికిఁదగిన యాజ్ఞ లొసఁగు" మనెను.

వెంటనే సుగ్రీవుఁడు వినతునిఁజూచి "వీరాగ్రణీ! నీవు
చంద్రసూర్యపుత్రులగు వానరులంగూడి పర్వతనదీవనప్రదేశ
ముల సీతాదేవిని రావణుని వెదకుచుఁ దూర్పుదిక్కునకుఁ బొమ్ము.
జంబూ ప్లక్ష శాల్మలి క్రౌంచ కుశద్వీపములలోను సంచరించి
వెదకవలెను. ఉదయపర్వతప్రాంతములను వెదకిచూడవలెను.
ఒకమాసకాలమునకు మఱలి రావలె" నని చెప్పెను.

సుగ్రీవుఁడు వానరవీరుల శక్తిసామర్థ్యములు చక్కఁగ
నెఱిఁగియుండుటచే నగ్నిపుత్రుఁడగు నీలుని, యంజనాదేవి
తనయుఁడగు నాంజనేయుని, బ్రహ్మపుత్రుఁడగు జాంబవంతుని
వాలిసుతుఁడగు నంగదుని, నలుని, సుషేణుని, గజుని, గవా
క్షుని, గవయుని, మైందద్వివిదులను, ఋషభుని యింక ననేక
మహాబలపరాక్రమసంపన్నులగు వీరులను దక్షిణదిక్కునకుఁ
బొండనుచు "మీరు వింధ్యపర్వతప్రాంతమును వంగ కళింగ
కాశీదేశంబులను దండకారణ్యమును, గోదావరి కృష్ణానదీ
ప్రాంతములను, ఆంధ్ర పుండ్ర చోళ కేరళ దేశంబులందును,
తామ్రపర్ణీనదీతీరంబునను, మలయమహేంద్రపర్వతవనంబుల
ను, లంకాద్వీపమునను, దానికిదక్షిణమున సముద్రమధ్యమున
నితర ద్వీపములందును సీతాదేవిని వెదకివచ్చి 'చూచితిసీతను'
అనవలెను. ఆమాటచెప్పువాఁడే నాకత్యంత ప్రియుఁడు. ఒక
నెలదినములలోఁ గార్యముసాధించుకొనిరండు" అని చెప్పెను.

మఱల సుగ్రీవుఁడు తనమామయగు సుషేణునకు నమ
స్కరించి "వీరాగ్రణీ! తేజశ్శాలియు బుద్ధిమంతుఁడు నగు మ

చి మహాముని జ్యేష్ఠపుత్రుఁడగు మారీచుని, యతనితమ్ములు మారీచు లనువారిని, వెంటఁగొని సురాష్ట్ర, బాహ్లీక దేశములను హేమగిరియను పర్వత ప్రాంతమునను బహువిధ వృక్షములతో నెరసి బెరసియున్న సముద్రతీర ప్రదేశములను గలయ వెదకి సీతాదేవియునికి నెఱింగి నెలదినములకు మించకఁ బశ్చిమ దిక్కంతయు వెదకి శుభసమాచారము తెమ్మనెను.

మఱల సుగ్రీవుఁడు వానరశ్రేష్ఠుఁడగు శతవలిని జూచి "నీవు యమపుత్రులగు నీ మంత్రులఁగూడి యుత్తరదిక్కునకుఁ బోయి సీతాదేవిని వెదకుము. నీవు కార్యసాధకుఁడవు. నీవలన నేను రామునకుఁ బ్రత్యుపకారము చేసినవాఁడనగుదును. మన మెల్లఱము ధన్యులమగుదుము. నీవు పుళింద, శూరసేన, ఇంద్రప్రస్థ, దక్షిణకురు, మద్ర, టంకణ, చీనదేశంబులును హిమవత్పర్వతప్రాంతమును కైలాస మానససరోవరప్రాంతములఁ దిరిగి సీతాదేవిని వెదకి నా కామెయునికి నెఱుకపఱచవలెను. నెల దినములకు మించక మఱలి రావలె" ననెను.

ఇట్లు సుగ్రీవుఁడు నలుదిక్కులకుఁ దగిన వానరవీరుల నియమించి హనుమంతుఁడే కార్యసాధకుఁడగునని యెంచి "ఆంజనేయా! నీవే యీ రామకార్యము నిర్వర్తింపఁగలవను పూర్ణవిశ్వాసము నాకున్నది. బుద్ధియందును, వేగమునందును, సమయస్ఫూర్తియందును, ధైర్యసాహసములందును నిన్ను మించినవారు లేరు" అనెను. అంత రామచంద్రుఁ డామాటలు విని సుగ్రీవుని విశ్వాసమునుబట్టియుఁ దాను దొలుత సంధించిననాటినుండియు హనుమంతుఁడు సర్వవిధముల సమర్థుఁడని నిశ్చయించి "వానరోత్తమా! నీవీ యుంగరము నానవాలుగా

గొనిపోయెను. దీనినిజూచినంతనే సీత నీయందలి యనుమానమునువీడి సీత నావద్దకు నీవు వచ్చితివని దృఢముగ నెఱింగి నీతో నిశ్శంకముగ మాటలాడును. సుగ్రీవుఁడు నీతో మాటలాడిన రీతినింజూడ నీవు కార్యసాఫల్యముగలవాఁడ వగుదువని నమ్ముచున్నా" ననెను. హనుమంతుఁడా యుంగరము నతి భక్తితోఁ గైకొని శిరమున నుంచుకొని చేమోడ్చి రాముని పాదపద్మములకు మ్రొక్కి బయలువెడలెను. రాముఁడు మఱల "హనుమంతా! శుభమగుఁగాక" అని యాశీర్వదించెను.

## హనుమదాదులు స్వయంప్రభను దర్శించుట.

సుగ్రీవుని పంపున వానరులెల్లరు నన్ని దిక్కులలోని పట్టణములు, పల్లెలు, పర్వతములు, నదులు, వనములు, సముద్రములు, ద్వీపములు గలయఁదిరిగి యెందును సీతాదేవిని గానక గడువుదీఱకమున్నె సుగ్రీవునికడకువచ్చి సీతకానరాలేదని చెప్పి "దక్షిణదిక్కునకుఁ బోయిన హనుమంతుఁడు మున్నగువారే సఫలు లగుదు"రనిరి.

అట్లే హనుమదాదులు నానా పర్వత నదీ వన ప్రాంతములు చుట్టి వెదకి వింధ్యపర్వతప్రాంతమున నొక బిలముఁజొచ్చిరి. దానిలో గాఢాంధకారము. ఎంతదూరముపోయినను ముగింపు లేకుండెను. వానరు లొకరినొకరు పట్టుకొని మెల్లగఁబోవుచు నాఁకటిబాధచేఁ గ్రుంగుచుండ జలపక్షులుగొన్ని వచ్చుటఁగని ధైర్యము దెచ్చుకొని కొంతదూరముపోయి యొక విశాలమైన రమ్యప్రదేశము గాంచిరి. అందు నానావిధ ఫలవృక్షములును రకరకములగు పువ్వులును స్వచ్ఛమైన నీరుగల సరస్సులును

చూచియున్న దామరలును గనఁబడినవి. అచ్చట బంగారు, రత్నమాలతో నిర్మింపఁబడిన సొగసైన భవనము లుండెను. నవరత్నములు రాసులుగఁ బోసియుండెను. అందొక వృద్ధస్త్రీ నారచీరలు ధరించి కాంతితోఁ దపస్సు చేయుచుండుటఁ గనిరి. హనుమంతుఁ డామెకు నమస్కరించి 'తల్లీ! నీ వెవ్వతెవు? ఇందేల యున్నదానవు? ఈభవనము, ఇందలి యమూల్యరత్నము లెవరివి?" యనియడుగ నామె "మున్ను మయుఁడను దానవుఁడు వరబలప్రభావముచే శుక్రునిచే రచియింపఁబడిన శిల్పశాస్త్రమున నిపుణుఁడై యిచ్చోటు నిర్మించి హేమయను నప్సరసం గూడియుండ దేవేంద్రుఁడు వానిని వధించెను. బ్రహ్మ యిచ్చోటును హేమ కొసంగె. నేను మేరుసావర్ణి కూఁతురను. హేమ నా చెలికత్తె. ఆమె నన్నివ్వ రెదిరింపని వరమునిచ్చి పోఁగా నే నీప్రదేశమును రక్షించుచున్నాను. మీరెవ్వరు? మీ రిచ్చటికే తెంచిన పని యేమి?" యనియడుగ హనుమంతుఁ డామెతో "తల్లీ! ధర్మపాలనంబు సేయుచుండిన నయోధ్యాధిపతియగు రాముఁడు తండ్రిపంపున జనకరాజపుత్రియుఁ దనకు భార్యయునైన సీతాదేవితోడను దమ్ముఁడగు లక్ష్మణునితోడను నరణ్యమున వసించుచుండ రావణుఁ డామెను బలవంతముగ వారు లేనిసమయమున నెత్తుకొనిపోయెను. అతని స్నేహితుఁడగు సుగ్రీవుఁడు మారాజు. అతనియాజ్ఞచే మేము సీతాదేవిని వెదకుచు నీబిలము సొచ్చి నీదర్శనము గాంచు భాగ్యము పొందితిమి" యనెను. అంతనామె వారికి ధనములిచ్చి కన్నులు మూసికొనునట్లుచేసి బిలమునుండి వెలువరించి వారిని వీడ్కొని బిలము సొచ్చెను.

## వానరులు ప్రాయోపవేశము చేయుట.

సుగ్రీవుఁడిచ్చిన గడువు మించినది. అతని యాజ్ఞఁ దాట రానిది. కార్యము సాధింపక నతనిముంగటకుఁబోవ వీలులేదు. కనుక వానరులెల్లరు ఖిన్నులైరి. అంత యువరాజగు అంగదుఁడు "మీలో వయోవృద్ధులు, జ్ఞానవృద్ధులు, శీలవృద్ధులును గలరు. నేను బాలుఁడను. అయిన నిప్పుడు నా యభిప్రాయము దెలిపెదను. సుగ్రీవుఁడు స్వభావముతోఁ గఠినుఁడు. ఆజ్ఞతప్పిన మరణము దప్పదు. కనుక మన మీ ఋక్షబిలమున నుండుట యుత్తమ"మనెను. తారుఁడు నతని మతము ననుసరించుట యుక్తమనెను.

అంత హనుమంతుఁడు "అంగదా! నీవు బాలుఁడవు. అనుభవము లేనివాఁడవు. సుగ్రీవుఁడు ధర్మపరుఁడు. అధర్మము చేసినందున నీతండ్రిని చంపుటకు రాముని స్నేహము పొందెను. వాలి మరణించినందున సుగ్రీవుఁడు ఖిన్నుఁడై నిన్నే వంశవృద్ధికరుఁడుగ నెంచియున్నాఁడు. నీ తల్లియు నాతని ప్రీతికిఁ బాత్రురాలైనది. నీవు మఱలిపోయిన నిన్నతఁడేమియుసేయఁడ"నెను.

మఱల నంగదుఁడు "మిత్రులారా! సుగ్రీవుఁడు తీక్ష్ణస్వభావముగలవాఁడే. విధిలేక నన్ను యువరాజుగఁ జేసినాఁడు. గడువుతప్పి కార్యము విఫలము చేసికొనివచ్చినందుకు నన్ను జంపుటఁ దప్పదు. కిష్కింధకుఁబోయి యట్టిమరణము పొందుట కంటె నిచ్చట నాహారపానీయములు వదలి ప్రాణము విడుచుట మేలని చెప్పి సముద్రమున కుత్తరతీరమున దక్షిణాగ్రముగ ద

ర్భలుపఱచి ప్రాణమువదలునట్లు తీర్మానించుకొని పడుండెను. ఇతరవానరులు నట్లేచేసిరి.

సంపాతి సీత లంకలోనున్న దనుట.

---

వానరులు విచారముతో బిగ్గఱగా "అహా! రావణుఁడు రామునిధర్మపత్నియగు సీతనెత్తుకొనిపోవుట, జటాయువను గృధ్రరాజు అతనితో యుద్ధముచేసి మరణించుట. రామసుగ్రీవుల సఖ్యము, వాలివధ, సుగ్రీవపట్టాభిషేకము, వానరులు నలుదిక్కుల సీతను వెదకుట, తాము దక్షిణపుదిక్కున వచ్చి ఋక్షబిలము సొచ్చి స్వయంప్రభవలన బిలము వెలువడుట, సుగ్రీవుని గడువు మించుట. రావణునిచేఁ గొంపోఁబడిన సీత యెచ్చటనున్నదో తెలియనందున మఱలిపోనేరక ప్రాయోపవేశముఁజేయుట యను విషయములఁ జెప్పుకొనుచుండ, వింధ్యపర్వతగుహలోనుండి వచ్చి శిఖరమునఁ గూర్చుండి వానరులం జూచి సంపాతియను గృధ్రరాజు మాటలువిని "అహో! నా తమ్ముఁడు జటాయువు రావణునిచేఁ జంపఁబడెనా?" యనుచు "వానరులారా! నాకు ఱెక్కలు లేవు. నన్ను దింపి మీరున్నచోటికిఁ గొనిపొండు. నా తమ్ముఁడగు జటాయువు మరణమును గూర్చి వివరించిచెప్పుఁడ"నెను. అంగదుఁడట్లే సంపాతిని కొండ శిఖరమునుండి దింపి జరిగినవిషయములనెల్ల వివరించిచెప్పెను. సంపాతి జటాయువునకు తర్పణాదులు సేసెను.

పిదప సంపాతి వానరులనుజూచి 'మున్ను నేనును నా తమ్ముఁడగు జటాయువును సూర్యమండలమువఱకు నెగసిపోవ యత్నించినందున నా ఱెక్కలు కాలిపోఁగా నేను వింధ్యపర్వత

ప్రదేశమునఁ బడితిని. అంత నేను పర్వతమునుండి పడి ప్రాణ త్యాగముచేసికొనఁగనని చెప్పఁగా నిశాకరుఁడను ముని 'సంపాతీ కొంతకాలమునకు రామచంద్రుఁడు భార్యయగు సీతతో వన మునకేతెంచును. అతని భార్యను రావణుఁడెత్తుకొనిపోవును. అతనికి సుగ్రీవునితో స్నేహమేర్పడును. సీతను వెదకుచు వానరులు వత్తురు. వారికి సీతను రావణుఁడెత్తుకొనిపోయి యెచ్చట నుంచియుండునది తెలిపినంత నీకు ఱెక్కలువచ్చు' ననెను. నేఁడు మీరు లంకలో సీతయున్నదని నామాటనమ్మి యచ్చోటు చేరి యామెను జూడఁగలరు. ఇప్పుడు మీతో మాట్లాడుచుండ గనే నాకు మునుపటియట్లు ఱెక్కలువచ్చినవి. ఇదియే నిశా కరముని చెప్పినమాట నిజమనుటకు తార్కాణము. ఇందువలన మీకార్యము సఫలమగునని దృఢముగఁ దెలిసికొనుఁ డనెను.

## వానరులు సముద్రతీరము సేరుట.

అభిజిన్ముహూర్తమున వానరులు సముద్రతీరము సేరిరి. కొండలవంటి యలలతోను పెద్దవోళ్ళను బెలచుకొని సంచ రించు గొప్పజంతువులతోను నిండి యగాధమై భయంకరముగ నుండు సముద్రమును జూచిరి. అంత నంగదుఁడు "నూఱు యోజనములుగల సముద్రమును లంఘించి లంకాపురమున సీతాదేవి యునికి నెఱిఁగిరాఁగలవా రెవరో తెలిసికొనఁ గోరె దను" అనెను.

అప్పుడు గజుఁడు "నేను బదియోజనములు దాఁటఁగల" ననెను. గవాక్షుఁ డిరువది యోజనములును, గవయుఁడు ముప్పదియోజనములును, శరభుఁడు నలుబదియోజనములును

గంధమాదనుఁ డేబది యోజనములును, మైందుఁ డఱువది యోజనములును, ద్వివిదుఁడు డెబ్బది యోజనములును, సుషేణుఁ డెనుబది యోజనములును, వయోవృద్ధుఁడగు జాంబవంతుఁడు తొంబది యోజనములును దాఁటగలమని చెప్పిరి. అంత నంగదుఁడు "నేను నూఱుయోజనములు దాఁటిపోఁగలనుగాని మఱలి రాలేనని తోఁచుచున్నద" నెను. అందులకు జాంబవంతుఁడు "శత్రుసూదనా! నీవు రెండువందల యోజనములు గూడ దాఁటఁగలవుగాని నీవు మాకు స్వామివి. నిన్నిట్టికార్యమునకుఁ బంపుట పాడిగాదు. నీవు మాకు రక్షింపఁదగినవాఁడవు, పూజింపఁదగినవాఁడవు. నీయాజ్ఞఁ బాటించుట భృత్యులమగు మాకు ధర్మము. నీ కిట్టికార్యము సెప్పుట మాకుఁ దగదు" అనెను.

అంత జాంబవంతుఁడు దూరమున నేమియుఁ బలుకకుండు హనుమంతునిఁ జూచి "మహాబలా! ఊరకున్నావేమి? పరాక్రమమున సుగ్రీవునకును రామలక్ష్మణులకు సాటియనందగుదువు. వేగమున గరుత్మంతుఁడు నీ సముఁడు. నిన్ను నీ వెఱుఁగవా? పుంజికస్థలయను నప్సరస సాటిలేని సౌందర్యముగలది. ఆమె శాపమువలనఁ గుంజరుఁడను వానరునకుఁ గూఁతురయ్యె. ఆమె యంజనయను పేరుతోఁ గేసరియనువానరుని పెండ్లాడెను. ఒక సమయమున నామె మానవరూపముతో దివ్యాలంకారభూషితయై యంజనాద్రియందుండ వాయుదేవుఁ డామెను మోహించి యనుగ్రహింప నామెకు జనించినవాఁ డగుటచే నాంజనేయుఁ డనఁబడితివి. పుట్టినప్పుడే యుదయించుచుండిన సూర్యుని పండని భావించి పట్టుకొన నాకాశమున కెగసితివి. అందువలన

లోకమున కాపదసంభవించునని తలఁచి దేవేంద్రుఁడు వజ్రాయుధముతోఁ గొట్టినంతనే యెడమచెంప సొట్టపడినందున హనుమంతుఁ డనఁబరగుచున్నావు. నీ వప్పుడు మూర్ఛిల్లినందున వాయుదేవుఁడలిగి ముల్లోకముల నెచ్చటను సంచరింపక స్తబ్ధుఁడాయెను. లోకము దల్లడిల్లినది. దేవతలు మొఱలు పెట్టిరి. బ్రహ్మ నీకు బ్రహ్మాస్త్రముచేతను మరణము లేదనియుఁ గోరినప్పుడే మరణముగలుగుననియు వరము లిచ్చెను. అట్టి నీవు రామకార్యార్థము సముద్రముదాఁటి లంకలోఁబ్రవేశించి సీతాన్వేషణముసేసి సుగ్రీవుని సత్యప్రతిజ్ఞుఁగావించి మమ్మెల్లర నుద్ధరింపు" మనెను.

## హనుమంతుఁడు సముద్రముదాఁటనెంచుట.

---

రామకార్యనిర్వాహకుండగు హనుమంతుఁడు సముద్రము దాఁటుటకై శరీరము ననేకరెట్లు పెంచెను. వానరులెల్లఱు సంతోషించిరి. మారుతి వానరులఁజూచి "మిత్రులారా! నేను గరుత్మంతుని వాయుదేవుని వేగముతో నాకాశమున సంచరింతును. సూర్యుఁ డుదయించునప్పుఁ డతనితోఁ బయలుదేఱి యస్తమయము లోపలఁ బడమటిదిక్కు సేరి మఱల మధ్యమార్గమున సూర్యునిఁ గలసికొందును. మహామేఘమువలె నంతరిక్షమున నెగురుచుందును. పర్వతముల గడగడ వణకించెదను. త్రివిక్రముని యాకారమువంటి యాకారముతో సముద్రమును లంఘింతును. నా కుడిభుజమును కుడికన్ను నదరుచున్నవి. ఇది మంచిసూచన. నేను తప్పక సీతాదేవిని చూఁతును" అనెను.

అంత జాంబవంతుఁడు "వాయుపుత్రా! నీవు మహాబలుఁడవు. నీమాటలే మా కమృతముగనున్నవి. నీవు మాయెల్లఱ చింతలఁబాపితివి. దైవానుగ్రహమున నీకు జయమగుఁగాక. మాయెల్లఱప్రాణము నీచేతిలోనున్నది. 'నీకు శుభమగుగాక' యని దీవించెను. నూఱుయోజనములుదాఁటవలసియుండుటచే హనుమంతుఁ డున్నతమగు మహేంద్రపర్వతము నారోహించెను. అతఁడు మనసుతో లంకాపురముసేరినట్లే భావించెను.

కిష్కింధాకాండను సమాప్తము.

## హనుమంతుఁడు సముద్రమును దాటుట.

సీతను వెదక నుత్సహించు హనుమంతుఁడు దేవ గంధర్వాదులు సంచరించు నాకాశమార్గమునఁబోయి లంకఁ జేరనెంచి మహేంద్రపర్వతముమీఁదఁ బెద్దశరీరముతో మదించిన వృషభమువలె ప్రకాశించెను. అతఁడు మెడనుదలను పైకెత్తి పైకెగయఁ బాదములతో నాపర్వతమును ద్రొక్కినంతనే గైరికధాతువులు మెఱసెను. పర్వతపార్శ్వములనుండి స్రవించు జలమునుజూడ గజములగండభాగములనుండి మదజలముకాఱుచుండునట్లు దోఁచెను. ఆంజనేయుఁడు దాను బూనుకొనిన ఘనకార్యము సఫలమగుటకై ఇంద్రుఁడు, సూర్యుఁడు, బ్రహ్మ వాయువు మున్నగు దేవతలను రామలక్ష్మణులకును నదులకు సముద్రమునకును భక్తితో మ్రొక్కి బాహువులుసాచి వాలము పైకెత్తి మహేంద్రపర్వతమునుండి యాకసమున కెగిరెను.

అతని తాడనవేగమునకు వృక్షములనుండిరాలిన పుష్పములు కొంతదూర మతనితోఁబోయి సముద్రమునఁ బడెను. దానిని జూడ ప్రయాణమునకై బయలుదేరునపుడు బంధువులు కొంత దూరము వెంటవచ్చి దారి విడుచునట్లుండెను. ఆ పుష్పములు రాలినందున సముద్రము నక్షత్రములతోఁగూడిన యాకసము వలె నుండెను. అంతరిక్షమున దేవతలు గంధర్వులు హనుమంతుని స్తుతించిరి. హనుమంతుఁడు "మిత్రులారా! రాముని చేతి బాణముపోవునట్లుపోయి సీతను వెదకెదను. అచ్చట నామె కానరాకున్న స్వర్గమునకుంబోయెద. లేకున్న లంకను పెకలించి తెచ్చెద" ననెను. అట్లాకాశమార్గమునఁబోవు హనుమంతునితోఁక గరుడుఁ డెత్తుకొనిపోవు సర్పమువలె నుండెను. హనుమంతుఁడు తోఁకచుక్కవలెఁ దోఁచెను. మేఘములలో మఱుగుపడుచు వెలువడుచు చంద్రునివలెఁ దోఁచెను.

## విఘ్నములు.

హనుమంతుఁడిట్లు పోవుచుండ మార్గమున సముద్రము నుండి లేచిన బంగారుశిఖరములుగల గిరిని చూచి విఘ్నమని తలఁచి దాని నురముతోఁ ద్రోసివేయ మైనాకుఁడను పర్వత రాజు గిరిశిఖరమున మానవరూపముతోనుండి "వానరోత్తమా! సీతండ్రిచేసిన మహోపకారమునకుఁ బ్రత్యుపకృతిగ నిన్నిచోట విశ్రమింపఁజేయ నెంచితి. మున్ను దేవేంద్రుఁడు పర్వతముల రెక్కలను వజ్రాయుధముతోఁ దెగఁగొట్టెను. అప్పుడు మీతండ్రి నన్ను సముద్రములోఁ జేర్చెను. ఆ యుపకారము నేనెన్నఁడు మఱువ"ననెను. అందులకు హనుమంతుఁ

డా పర్వతమును దాకి యాతిథ్యముఁ గైకొన్నట్లు భావింపు మని వెడలిపోయెను.

కొంతదూరముపోయినతర్వాత దేవతలప్రేరణచే సురస యను నాగకన్యక ఘోరరాక్షసిరూపముఁదాల్చి పెద్దదిగ నోరు దెఱచెను. హనుమంతుఁడు నమస్కరించి "తల్లీ! నేను రామకార్యార్థము తొందఱగఁ బోవలసిన సమయము. నేను రామపత్నియగు సీతనుజూచి నీనోటఁబడెద"నని చెప్పెను. అందులకా రక్కసి "వానరా! నానోటఁజొరక పోరాదు" అనిచెప్పి నోరు తెఱచెను. ఆంజనేయుఁడంతకు మించి శరీరము పెంచెను. సురస యంతకంటె విశాలముగ నోరు దెఱచెను. ఇట్లిరువురు గొంతసేపుచేయఁగా సమయస్ఫూర్తిగల మారుతి తటాలున నంగుష్ఠమాత్రరూపముతో నామెనోటిలోఁబ్రవేశించి వెలువడి "సురసా! బ్రహ్మవరముచొప్పున నీ వక్త్రింబుసొచ్చి వెలువడి నీకిదే నమస్కరించుచున్నాఁడను. నన్ననుగ్రహింపు" మన నామె నిజరూపముదాల్చి "వానరోత్తమా! సుఖముగఁబోయి రమ్ము. సీతను రామునితోఁ జేర్పుము" అనెను. సకలభూతము లాంజనేయుని కొనియాడినవి.

ఇట్లాతఁడు గగనమార్గమున గరుడునివలెఁ బోవుచుండ సింహికయను రాక్షసి కామరూపిణియగుటచే సముద్రమున నీడవంటి రూపముదాల్చి యాంజనేయుని క్రిందికి లాగెను. అకస్మాత్తుగఁ దనశక్తి క్షీణించుటఁగని హనుమంతుఁడు నలుదిక్కులుచూచి తుదకు సముద్రమునఁ బెద్దనీడనుగాంచి మున్ను సుగ్రీవునిమాట జ్ఞప్తికిఁదెచ్చుకొని యామెఛాయాగ్రాహిణియగు సింహికయని యెఱుంగ నామె ఘోరరూపముతోఁ బెద్ద నోరు

జెలఁచి యతనినిమీఁది కెడరినంత హనుమంతుఁడు సూక్ష్మ రూపమున నామెనోటం బ్రవేశించి యామె నోరుమూయునంతలో నామె మర్మములఁజీల్చి వెలువడి యామెను గూలఁజేసెను. ఆకాశమార్గమున సంచరించువారెల్లరు హనుమంతుని స్తుతించిరి.

ఆంజనేయుఁ డతివేగముతో నాకాశమార్గమునఁబోయి లంకానగరముఁజేరి త్రివిక్రముఁడు మఱల వామనుఁడైనట్లు తనరూపము సూక్ష్మముగఁ జేసికొని త్రికూటపర్వతాగ్రమున నున్న లంకాతీరమున వ్రాలి దేవేంద్రుని యమరావతివంటి లంకనుజూచెను.

## హనుమంతుఁడు లంకను బ్రవేశించుట.

---

హనుమంతుఁడు రత్నకంబళము పఱచినట్లుండు పచ్చిక బయళ్లను, వికసించిన పుష్పాలతో నిండిన ఖర్జూరంబులు కొండ గోఁగులు సరళంబులు ప్రేంకణములు నిమ్మలు నేరేడుల యరఁటులు మోరటులు మొదలగు చెట్లతో నిండిన ప్రదేశములను, నానావిధములైన రంగులతో పువ్వులుగలతీగెలను, దామరలతోను గలువలతోను నిండిన సరస్సులను జూచుచుఁ దెల్లని గచ్చు గోడలతో నాకాశమంటునట్టి మేడలతోను, నెత్తయిన ప్రాకారగోపురములును, సింహద్వారములును గల లంకానగరము సమీపించి యొకచోటఁ గూర్చుండి యిట్లాలోచించెను. "నే నిప్పుడు మిక్కిలి జాగరూకతతో మెలఁగవలెను. ఏంతమాత్రము పొరపాటు చేసినను నా బుద్ధిహీనతవలన నా స్వామియగు రామచంద్రుని కార్యము చెడును. నేను శత్రువుల నగరమున

నాసహాజరూపమునఁ బ్రవేశింతునేని క్రూరకర్ములగు రాక్ష సులు నన్ను హింసింతురు. కనుక రాత్రిపూట సూక్ష్మరూప మునఁ బ్రవేశించి సీతను వెదకుట మేలు.

సూర్యుఁడ స్తమించెను. అది శుక్లత్రయోదశి. సరస్సున సంచరించు హంసమువలె చంద్రుఁడు నిర్మలాకాశమున నతిశయమగు కాంతితోఁ బ్రకాశించుచుండెను. ప్రదోషసమయమున హనుమంతుఁడు పిల్లియంత చిన్నరూపమునఁ బ్రవేశింప నా లంకాధిదేవత నిజరూపమున ద్వారమువద్ద నడ్డుపడి "ఓరీవానరా! నీవెవ్వఁడవు? నాచేరక్షింపఁబడు నీనగరము నెట్లు ప్రవేశింతువు?" అనెను. అంత హనుమంతుఁడు లంకాదేవినిఁ "నీవెవ్వతెవు? ఇట్టి భయంకరాకారముతో నిచ్చట నుండుట కేమికారణ"మని యడిగెను. అప్పుడా లంక "నేను లంకా నగరమును రక్షించుదానను. రావణునియాజ్ఞఁబాటించి యిందున్నా" ననెను. హనుమంతుఁడామెనుజూచి "లంకా! నేనీ లంకనుజూచి వెడలిపోయెదను. నన్నాటంకపఱచకు"మనెను. అంత లంక యలిగి హనుమంతుని యఱచేతితోఁ గొట్టెను. వెంటనే మారుతి దాని నెడమపిడికిలితో నొకపోటుపొడిచెను. అదియా పోటుకుఁదాళలేక నేలఁబడి "కపిశ్రేష్ఠా! నీవు మహాబలుఁడవు. ఇదివఱ కెన్నఁడు జయింపఁబడని నన్ను జయించితివి. ఇందులకుఁగారణమున్నది. మున్ను బ్రహ్మదేవుఁడు "ఎప్పుడు నీవొక వానరునిచే జయింపఁబడుదువో అప్పుడే లంకకు వినాశకాలము వచ్చినదని యెఱుఁగు" మని చెప్పెను. కావున నీవు సీతాదేవిని వెదకి నీకార్యము సాధించుకొను"మనెను.

అంత హనుమంతుఁడు శత్రునగరమును ద్వారము మూలమునఁ జొరరాదనియు, కుడికాలుపెట్టి ప్రవేశింపరాదనియు నెఱింగి ప్రాకారము నెక్కి యెడమకాలూని లంకానగరమును బ్రవేశించెను. నూతనగృహప్రవేశసమయమునను భర్తయింటికిఁ దొలుతఁబోవునప్పుడును గుడిపాదము పెట్టి ప్రవేశింపవలెనని నెఱుఁగవలెను.

## హనుమంతుఁడు సీతను వెదకుట.

లంకానగరమున నేడంతస్థుల మేడలును విశాలమగు వీథులును చలువరాతి కట్టడములును ఉద్యానవనములును జూచెను. అందలి ప్రజలలోఁ బొడగరులు, వామనులు, సొగసుగాండ్రు, వికృతరూపులు గలరు. ఆజానుబాహులు, దీర్ఘకర్ణులు, లంబకర్ణులు, హ్రస్వకర్ణులు, లంబోదరులు, దీర్ఘదంష్ట్రిలు, వికృతనేత్రులు, విశాలాక్షులు గలరు. అచ్చటచ్చట వీణామృదంగాది వాద్యముల ధ్వనులును వినవచ్చెను. శూలపాణులు, గదాయుధధారులు, ధనుర్బాణధరులు, కూటముద్గరపాణులు గలరు. హనుమంతుఁడు ప్రతి గృహంబునను బ్రవేశించి సంగీతముపాడువారిని హాస్యముచేయువారిని, నృత్యము చేయువారిని, రథారూఢులను, గజారూఢులను, అశ్వారూఢులను, మద్యపానముచేసి మత్తుచే మైమఱచియుండువారిని, చందనాది లేపముల నలందికొని సువాసనలు గుబాళించు శయ్యాగృహమున శృంగారరస పానముచేయువారిని, మగలం గూడి సంతోషముతో నుండువారిని, నాటకముచూచువారిని, కథాశ్రవణముచేయువారిని, ప్రసవించి చంటిబిడ్డల నెత్తికొని

యుండువారిని, చూచెను. ఎచ్చటను రాముని యందే మనసు దవిలి యనుక్షణ మాతనిఁదలంచుచు వేడికన్నీరుఁగార్చు సీతా దేవిని గానక శోకించెను.

## రావణాంతఃపురము.

హనుమంతుఁడు గొంతసేపాలోచించి రావణుని గృహము ప్రవేశించెను. అది యున్నతమగు ప్రాకారములు, ఉద్యాన వనములు, బంగారు రత్నములతో నిర్మింపఁబడిన భవనములు, రథశాలలు, గజశాలలు, అశ్వశాలలు, నానావిధ వాహనములు, మణిమయమంటపములు, చాల దొట్టికట్లుగల సౌధ రాజములు బంగారుమయమైన యుత్తమాసనములు నానావిధ శుకపికశారికాది పక్షిజాలములు, వివిధవాద్యఘోషములతో నిండి యాయుధపాణులగు భటులచే సంరక్షింపఁబడియుండెను. రావణునిగృహము ఒకయోజనము నిడివియు, నరయోజనము వెడల్పును గలిగియుండెను. దేవేంద్రునకు, కుబేరునకుగల సంపదలన్నియుఁజేరి రావణునిగృహమున నుండెను. ఆ గృహమధ్యమునఁ బుష్పకవిమాన ముండెను. మున్ను దేవశిల్పియగు విశ్వకర్మ బ్రహ్మకొఱకా విమానము నిర్మించెను. తపముచేసి కుబేరుఁడద్దానిఁబొందెను. అతని నోడించి రావణుఁడా పుష్పకమునుబొందెను. ఆపుష్పకవిమానము మణిమయమగు సోపానములుగలది. నేలపటికపు రాలతో నిర్మింపఁబడినది. బంగారు వెండి, రత్నములచేఁ బ్రకాశించు స్తంభములు గలిగి బంగారు కిటికీలు, చిత్రవిచిత్ర శిల్పచాతుర్యమును బ్రకటించుఁ గల్పితో ద్యానవనములు, మృగపక్షిసమూహములుగలిగి యున్నతాస

నములతో నాశ్చర్యకరముగఁ బ్రకాశించుచుండెను. హనుమంతుఁ డతి విశాలము ననేకవిధభాగములు గలిగినఁ బుష్పక విమానమును జూచెను. దానియందంతటను సీతాదేవి యున్న చేమోయని వెదకిచూచెను. అందెందు నామెనుజూడనందున రావణుని యంతఃపురము సొచ్చెను. అయ్యది యొకచోట యగరుధూపములచేఁ బొగవన్నె గలిగియుండెను. మఱియొక చో హంసవటి తెలుపుగ నుండెను. వేరొకచోఁ బుష్పములచేఁ జిత్రవర్ణములుగలిగి మఱియొకస్థలమున శబలవర్ణముగలిగియుండెను. అందలివస్తువులెల్లను మణిమయఖచితమైనవి. అందలి యాసనములు బంగారుమయమై రంగారుచుండెను. అచ్చట నానావిధభోజ్యపదార్థములును నానావిధమద్యములును నిండి యుండెను. మెల్లని చల్లగాలి వీచుచుండెను.

రావణుఁడు బలాత్కారమునఁ దెచ్చిన దేవ విద్యాధర కిన్నరాంగనలు చిత్రాలంకారములతో నలరారుచుండిరి. అతనిని వలఁచివచ్చిన స్త్రీలనేకు లిష్టోపభోగము లతనిఁగూడి యనుభవించుచుండిరి. కొందఱుస్త్రీలు మద్యముద్రావి మత్తున వళ్లే యొఱిగియుండిరి. కొందఱు వీణల నాలింగనముచేసికొని నిద్రించిరి. మఱికొందఱుచెలులు నురమున శిరములుంచి నిద్రించిరి. కొందఱివస్త్రములు గొంతఁ దొలఁగియుండెను. మృదంగాది వాద్యములను పిల్లనగ్రోవిని వాయించుచు నట్లే నిద్రించినవారు కొందఱు. హనుమంతుఁ డిట్టివారల నెల్లంజూచి యందెందు సీతనుగానక రావణునిశయ్యను సమీపించె. అతని నిశ్వాసము మేలిమద్యపువాసనఁగూడి గుహాముఖమునుండి వెలువడు గాలిచందంబుననుండెను. అతఁడు నిద్రించుచున్న

మందరపర్వతమో, ఇనుపరాశియో, కాఱుమేఘమో యను నట్లుండెను. అతని బాహువు లేనుఁగుతొండములవలెను నతని యాభరణములు మెఱుపువలెఁ బ్రకాశించెను. అతనిచుట్టు ననేక సుందరాంగనలు మేలుచీరలు భూషణములు దాల్చి మైమఱచి తారుమాఱుగ నిద్రించుచుండిరి. అతని సమీపమున నొకస్త్రీ యగుపడెను. ఆమె సకల శుభలక్షణములుగలిగి యితరులకంటె మేలుబంతిగనగుపడెను. హనుమంతుఁడామెను జూచి "ఈమెయే సీతాదేవి" యనితలఁచి సంతోష మతిశయింప వాలమును ముద్దిడుకొనెను. పాడెను, ఆడెను, ఎగిరెను, దూకెను, అఱచెను.

కొంతవడికిఁ దాలోచించి "ఆహా! నేనెంతయు బుద్ధిహీనుఁడను. రామపత్నియగు సీత చింతలేక యొరునిసమీపమున సుఖముగ నిద్రించునా? ఎంతపొరఁబడితిని" అనుకొనుచు పానభూమికేగెను. అచ్చట నానావిధములగు పాత్రలలో రకరకములమద్యము కొన్నింట నిండుగను, గొన్నింట సగముగను నుండెను. రకరకముల మాంసము లందందు సగము తినఁబడియు, సగము పరిహరింపఁబడియు సువాసనలతోఁ గూడియుండెను. అందలి స్త్రీలు క్రమముదప్పి తారుమాఱుగఁబడి నిద్రించుచుండిరి. హనుమంతుఁ డచ్చట సీతాదేవిని చూడలేక చింతించెను. మఱల నచ్చటనుండి యంతఃపురమునకుఁబోయి వెదకి విసిఁగి "అయ్యో! నే ననేక స్త్రీలు శయ్యాగృహములఁ దమ యిష్టానుసారము శృంగార మనుభవించుచు మైమఱచియుండఁగాఁ జూచితినే. నిత్యబ్రహ్మచారినే. నాకిట్టిపాపముగలిగెనే" యని యొకింతఖిన్నుఁడై మఱల మనసుచెడిననే దోషముగలు

సును. నామనస్సు పరిశుద్ధముగనున్నది. నా మన స్సెన్నఁడు నింద్రియములవైపు పోదు. కనుక రామకార్యార్థము నే నభ్యాంతరస్థలములం బ్రవేశింపవలసివచ్చెను గాని నా మనసు విషయములవైపు మఱలునది గాదనుచుఁ గొంతదూరమున నగుపడిన యశోకవనముఁజూచి యందు సీతను వెదుక నిశ్చ యించుకొనెను.

## సీతాదర్శనము.

రావణుని గృహమునుండి యశోకవన ప్రాకారమునకు వచ్చిన హనుమంతుఁ డిట్లుదలంచెను. "నేను సంపాతిమాటల చొప్పున రావణునిగృహము నంతయుఁ గలయవెదకితిని గాని సీతాదేవిని గానలేనైతిని. రావణుఁ డామెను దెచ్చునపుఁ డామె క్రిందఁబడెనో? సముద్రములోని యలలనుజూచి భయపడి యందుఁబడెనో? రావణుఁ డామెను దెచ్చునపు డాతని భుజ ములమొత్తిడికి నలిగిపోయెనో? రామునే ధ్యానించుచుఁ దన్ను వలవనికారణమున రావణుఁడామెను జంపెనో? సవతిమత్సర మని దలఁచి రావణునిభార్య లామెను భక్షించిరో? ఇఁక రా మునిసంయోగము లభింపదనియెంచి సీత ప్రాణత్యాగముచేసి కొనెనో? ఏమిచేతును? రామునితో సీతనుజూడలేదని చెప్ప కున్న స్వామిద్రోహముచేసినవాఁడ నగుదును. చెప్పినంతట రాముఁడు దుఃఖాతిశయమునఁ బ్రాణమువిడుచును. అంత లక్ష్మణుఁడు మరణించును. రామలక్ష్మణుల మరణవార్త విని భరతుఁడు జీవించియుండఁడు. అతఁడు మరణించిన శత్రు ఘ్నుఁడప్పుడే ప్రాణమువదలును. పుత్రులమరణమువిని శోక

మునుఁ దల్లులు మున్గుగ చనిపోవుదురు. ఇట రామలక్ష్మణులు మరణించుటచే సుగ్రీవుఁడు ప్రాణము విడుచును. అందువలన రుమయు, తారయు నసువులఁ బాయుదురు. తల్లిదండ్రుల మరణశోకమువలన నంగదుఁడు ప్రాణము గోల్పోవును. ఈ విధమున నిక్ష్వాకువంశమును వానరవంశమును నాశమొందు నట్లు చేయనగునా? కనుక నేనిచ్చట నొకచెట్టుక్రింద వసించి యాహారముమాని క్రమముగఁ బ్రాణము విడుతును. లేకున్న లంకలో నన్నిచోట్ల సీతను వెదకెదను" అని చెప్పి యశోకవన మునకుఁబోవ నెంచి రుద్రునకు, ఇంద్రునకు, యమునకు, వాయు వునకు, సూర్యచంద్రులకు నమస్కరించి యశోకవనములోనికిఁ బోయెను. అచ్చట పుష్పఫలములతో నిండిన సంపెంగ, పొన్న మామిడి, మోదుగ, మద్ది, యశోకవృక్షములును, వివిధము లగు తీగెలును, తేఁటనీరు గలిగి పూచిన తామరలు గలువలు గలిగిన సరస్సులును పలురకములపక్షులతో నిండి చైత్రరథము నోడించునట్టి యతి మనోహరమైన వనమును జూచి యందందు సీతను వెదకుచు నొకచోఁ బర్వతమునుండి స్రవించునది కడ్డముగ వృక్షశాఖలు వ్రాలియుండుటచే నందలినీ రడ్డగింపఁబడి ముం దుకుఁ బ్రవహింపక వెనుకమఱలుటఁ జూడఁగాఁ బ్రియునియొడి నుండి కోపించి నేలకుదిగి వెడలిపోవు కోడలిని బంధువులు ప్రియ వచనములతో వారింప నాయువతి మఱలి యింటిలోనికి వచ్చు నట్లు తోఁచెను. ఒకచో వేయిస్తంభములుగల తెల్లని సౌధ మొకటి బౌద్ధాలయమువలె నగుపడెను. దానికిఁ బగడములచే నిర్మింపఁబడి మెట్లును బంగారుమయములగు నరుగులును గలవు.

ఆ వనమున నొక శింశుపావృక్షము (ఇరుగుడుచెట్టు)

క్రింద మాసినచీర గలదియు, రాక్షసస్త్రీలచేఁ జుట్టఁబడినదియు, శోకాతిశయమున మాటిమాటికి నిట్టూర్పు విడుచునదియు, సుఖమునకే దగినదయ్యుఁ దుఃఖము ననుభవించునదియు, స్వజనుల వీడి క్రూర రాక్షసస్త్రీలమధ్య కుక్కలమధ్యఁ జిక్కిన యాఁడు లేడివలె దీనమగు చూపులుగలదియు, నిండుచంద్రునివంటి మోమును దొండపండువంటి పెదవులును గలిగి, చక్కని కనుబొమలును నల్లని యందమగు కన్నులుగలదియు మన్మథుని భార్యయగు రతీదేవియో యనఁదగినదియు స్త్రీరత్నమును జూచి "ఈమె సీతాదేవి గనుండవచ్చు"నని తలంచెను.

రామచంద్రుఁడే యేయంగములలో నేయే యాభరణముండునని నో వానినన్నిఁటి నామె ధరింపలేదు. సీతాదేవి పరమసాధ్వియగుటచే భోగార్థమగు భూషణములను వృక్షశాఖకు గట్టియుండెను. ఆమె చెవులలోఁ గుండలములును గర్ణపార్శ్వ భూషణములును జేతులలో మణిమయమైన పగడములు చెక్కఁబడిన హస్తాభరణములును మాత్రమే ధరించియుండెను. పసుపురంగుగలిగి బంగారువలె మెఱయు చీరకొంగునఁ గొన్ని యాభరణముల మూఁటగట్టి ఋష్యమూకమున వానరుల మధ్యఁ బడవైచెనే. ఆచీరయే గట్టుకొనియుండినది. మాటిమాటికి రామా! రఘునందనా! నాథా! యని భర్తృవిరహముచే దుఃఖించుచుండెను. రాముని యంగాంగములవలె శోభిల్లునట్టి యంగప్రత్యంగములు గలిగియుండెను. కనుక రాముని యర్ధాంగియే యీమె. రాముఁ డీమెనుగూర్చి కారుణ్యము, అనురాగత్వము, శోకము, మన్మథబాధ యను నాలుగు గలిగి దుఃఖించుచున్నాఁడు. ఇట్టి యనురూపయగు నుత్తమస్త్రీని

పత్నిగాఁబొంది యామెను విడిచియు జీవించియుండుటచే రాముఁడతి దుష్కరకార్యముచేయుచున్నాఁడని పలుమారు చెప్ప వచ్చును" అనెను. అంత హనుమంతుఁడా శింశుపావృక్షములో నొకకొమ్మమీఁదఁగూర్చుండి యాకులమధ్య మఱుఁగుగనుండి సీతా దేవిని చూచుచుండెను.

ఆమెచుట్టును నిమదకోటులును వికృతరూపములు గల వారునగు రాక్షసస్త్రీలుండిరి. వారిలో నొంటికన్నుగలవారు, నొక్కచెవిగలవారు, కంబళివంటి వెండ్రుకలుగలవారు, వెండ్రుకలే లేనివారు, వ్రేలెడుకడుపు పెదవులుగలవారు, పులిముఖము ఎనుబోఁతుముఖము, నక్కముఖము, పందిముఖము, గోముఖము గలవారును, ఏనుఁగుపాదములు, ఒంటెపాదములుగలవారును, ఏనుఁగుచెవులు, ఆవుచెవులు, కోఁతిచెవులు గలవారును గలరు. ఇట్టి క్రూరరాక్షసులమధ్యనుండు సీతనుజూడఁ గ్రూరగ్రహములతోనుండు రోహిణివలె నుండెను.

## రావణుఁడు సీతనుజూడవచ్చుట.

హనుమంతుఁ డాకుల మఱుఁగున నశోకవృక్షమునఁ గూర్చుండియుండెను. వేకువజామున బ్రాహ్మణరాక్షసులు వేదపారాయణముసేసిరి. మంగళవాద్యములు ఘోషించినవి. రావణుఁడు మేలుకొని మన్మథపరవశుఁడై సకలాభరణములు మేలిదుస్తులుధరించి నూఱుగురు స్త్రీలతోఁగూడి యశోకవనమునకు వచ్చెను. కొందఱు స్త్రీలు చామరములు దెచ్చిరి. కొంద ఱుత్తమాసనములు దెచ్చిరి. కొందఱువీవనలుదెచ్చిరి. కొందఱు బంగారుదండములు ధరించియుండిరి. కొందఱు మేలు

మధువుగలపాత్రములు దెచ్చిరి. ఒకతె తెల్లనిగొడుగుపట్టెను. ఈవిధముగ రావణుఁడువచ్చి సీతనుసమీపించెను. అంత నా సాధ్వి తొడలతో నుదరమును బాహువులతో రొమ్మును మూసికొని జోరునవీచు గాలికిఁ గదలునట్టి యరఁటిచెట్టువలె గడగడ వడంకెను. ఆమె శరీరముతో నాథుని సన్నిధానము చేరలేకున్నను సంకల్పము లను గుఱ్ఱములుగల మనస్సను రథమునెక్కి భర్తవద్ద కేగెను. ఆమె బురదచేఁ గప్పఁబడిన తామరపూవువలెను, మఱలమఱల మనసునకుఁ దెచ్చుకొనని విద్యవలెను, రాహువుచేఁ బీడింపఁబడు చంద్రునివలెను, నర ణ్యమున మగయేనుఁగుచే విడువఁబడి వేఁటగాండ్రచేఁజిక్కిన యాడుగజమువలెను శోకించుచుండెను.

రావణుఁ డామెనుజూచి "సీతా! ఏనుఁగుతొండము వంటి తొడలుగలదానా! నీవేల చింతించెదవు? భువనమోహిని వైన నిన్నుఁ గామించుచున్నాను. అయ్యో! నీ రూపమునకుం దగిన వస్త్రాభరణములిచ్చి నీకాంతి నినుమడింపజేయుదును. నీ జవ్వనము వృథాకారాదు. సముద్రములోఁ గలసిపోయిన జలమును రమ్మనిన వచ్చునా? కాల మతిక్రమించిన నీయౌవ నము విఫలమగును. నన్ను భర్తగ వరింపుము. సకల భోగం బుల నిరివిగ ననుభవింపుము. ఇఁక నా సంపదలు, రాజ్యము నీవియనియెంచుము. నేను నీదాసుఁడుగ నుందును. నేను నీ యంగాంగములలో దేనినిచూచినను నాకన్నులు దానిమీఁద నే నిలచిపోవుచున్నవి. నీకొఱకనేకనగరపట్టణములతో వెల యు భూమినంతయు జయించి నీతండ్రి జనకునకిచ్చెదను నీవు నాతో భోగంబు లనుభవించుటను జూచి నీ బంధువు లెల్లను

సంతోషింతురు. రాజ్యభ్రష్టుఁడై సంపదను బోఁగొట్టుకొని దీనుఁడై నేలఁ బరుండుచు నడవియందు సంచరించు రాముని మీఁది యాశను వదలి నన్ను భర్తగఁ జేసికొని సకలసుఖము లనుభవింపుము. ఇష్టమువచ్చినట్లు భుజించి మద్యపానముచేసి నాతోఁ గ్రీడింపుము. కుబేరుని ధనకనకవస్తువులును దేవేంద్రుని అష్టైశ్వర్యములను నావలనఁ బొంది నాపట్టమహిషివై నన్నేలు కొమ్ము. మున్ను హిరణ్యకశిపుఁడు దేవేంద్రునిచేఁ జిక్కిన తన భార్యను నారదునిమూలమునఁ బొందెను. కాని నా స్వాధీన ములోనున్న నిన్నుబొంద నెవరికిసాధ్యమగును? ఇఁక రాము నియం దాశవిడువుము. నన్నుఁబొందిసుఖించుట నీకుఁదగును” అనెను.

## సీత రావణునకు హితము బోధించుట.

ఇట్లుపలికిన రావణునిమాటలువిని సీతాదేవి మిక్కిలి దుఃఖించుచుఁ బరపురుషునితో నేరుగ మాటలాడరాదను న్యాయము ననుసరించి తనకును రావణునకును మధ్య నొక గడ్డిపోచనుంచి దానినిజూచుచు ‘నాయందు మనసుంచుట నీ కెంతమాత్రము తగదు. నీ భార్యలయందు ప్రేమయుంచుట ధర్మము. నీకు నీభార్యయెట్లో పరులకు నట్లేయనిభావింపుము. పరస్త్రీలవిషయమై మనసుఁబోనిచ్చుట యధర్మము నవమాన కరము నగును. ఇచ్చట సత్పురుషులు లేరా? ఒకవేళ యున్నను వారు నిన్ను నివారించినను వారిమాటఁ బాటింపవేమో? శిష్టులమార్గము ననుసరింపని వాఁడవు కాఁబోలు. తెలివిమాలి యధర్మము ననుష్ఠించువాఁడు రాజయినచో రాజ్యములోని

జనుల కనర్థము వాటిల్లును. నీవొక్కని దుష్ప్రవర్తనమువలన సకలైశ్వర్యములతోఁ దులతూగు లంక వినాశమొందును. పాపకర్ముని వినాశనమునకు లోకము సంతోషించును. నీవు ధనకనక వస్తువాహనాదులతోను పట్టమహిషి పదవి నిచ్చెద ననియు నన్ను వంచింపఁజూతువు. ఇది మిక్కిలి పొరపాటు. సూర్యునివద్దనుండి యాతని కిరణములను వేఱుపఱుప నగునా? అట్లే రాఘవునిసొత్తగు నన్ను అతనివద్దనుండి వీడునట్లుచేయ సాధ్యమా? నీవు ప్రాణముతో నుండఁగోరెదవేని నన్ను శీఘ్రముగ నతని కర్పింపుము. రాముఁడు శరణాగతవత్సలుఁడు. చంపఁదగినశత్రువునైనను శరణనినంత నే రక్షించువాఁడు. నేను నతనితో నిన్ను మన్నించునట్లు వేఁడెదను. నీ కత్యంత హితము సెప్పు నామాటలు పెడచెవినిబెట్టకుము. ఇట్టిహితముఁగైకొనకున్నచోఁ బిడుగువంటి రామబాణము నీ ప్రాణమును హరించును. జనస్థానమునఁ బదునాలుగు వేల రాక్షసుల నొక్కఁడే సంహరించెను. అతని పరాక్రమము సాటిలేనిది. నీ వతఁడు లేనిసమయము గనిపెట్టి దొంగతనముగ నన్ను దెచ్చితివి. పెద్దపులి యునికివాసనచేఁ గనుఁగొని పరుగిడు కుక్కవలె రామలక్ష్మణుల దర్శనమాత్రమున పలాయితుఁడవు కావలసినవాఁడవే. నీవు కుబేరునిపట్టణము చేరినను సముద్రపు టడుగున వరుణాలయము సొచ్చినను రాముని బారినుండి తప్పించుకొనలేవు. పిడుగువలనఁ గూలు పెనువృక్షముపగిది నీవు కూలుదువు" అనెను.

సీత చెప్పినమాటలువిని రావణుఁడు కోపించి "నీయుందు కామమోహితుఁడనై నందున నిన్ను మన్నించియున్నాను.

లేకున్న నీమాటలకు నిన్నెప్పుడో వధించియుందును. నీకిచ్చిన సంవత్సరపు గడువులో రెండుమాసములు మిగిలియున్నవి. ఇంతలో నీవు నాకు భార్యకాకుంటివా గడువుగడచినమఱునాఁడుదయభోజనమునకు నిన్నుపయోగించెద. బుద్ధిగలిగి బ్రతుకు తెలుపుచూచికొమ్ము" అనెను.

అంత సీతాదేవి "రాక్షసాధమా! నీకు మేలుచెప్పువారు లేరు. దేవేంద్రునకు శచీదేవి యెట్లో రాముని కట్టి ధర్మపత్ని నగు నన్నిట్లు చెప్పినంతనే నీ నాలుక తెగిపడకున్నదేఁ? భర్త యనుజ్ఞ లేక శపింపరాదని యూరకున్నాను. లేకున్న నిన్నిప్పుడే బూదికుప్పచేసియుందు" ననెను. రావణుఁడు వికృత రూపులగు రాక్షసస్త్రీలనుజూచి 'మీ రేయుపాయముననైన సీత నన్ను వలఁచునట్లు సేయవలెనని'నంతనే ధాన్యమాలిని యను రక్కసి రావణుని కౌఁగిలించి "నాథా! నేనుండ నీ సీత నేల బ్రతిమాలెదవనిన రావణుఁడు నవ్వుచు నిజనివాసమున కేఁగెను.

రాక్షసస్త్రీలు సీతను పలువిధములుగ "సీతా! నీ వెంతటి తెలివిమాలినదానవే! ముల్లోకముల నేలఁగల రావణేశ్వరుని వరించి యలవిలేనిసుఖము లనుభవింపక దరిద్రుఁడగు రాముని, బలహీనుని, మానవమాత్రుని విడువననుచున్నావే. చాలు నీబుద్ధిహీనత. ఇఁకనైన మా మాటలువిని సమ్మతి దెలుపుము. మే మిప్పుడే రాజున కెఱింగించెద"మనిరి. జానకి యా మాటలకు రోసి "మీ రేమన్నను నామనసు చలింపదు. సువర్చల సూర్యుని, శచీదేవి యింద్రుని, అరుంధతి వసిష్ఠుని, రోహిణి చంద్రుని, లోపాముద్ర యగస్త్యుని, సుకన్య చ్యవనుని, కేశిని

సగరుని, దమయంతి నలుని, సావిత్రి సత్యవంతుని ప్రేమించినట్లు నేను రామచంద్రుని ప్రేమించి యతనియందే మనసునిలిపి యుందు"ననియె. అంత రాక్షసస్త్రీలు వేవిధముల నయమున భయమున సీతను తమవశముచేసికొనఁజూచిరిగాని వీరి ప్రయత్నమంతయు విఫలమయ్యెను.

### సీత ప్రాణము విడువ నెంచుట.

---

ఇట్లు రాక్షసస్త్రీలు కోఱలతోను, శూలములతోను నన్ను చంపెదమనుచుండ సీత దుఃఖమతిశయింప "హారామా! హాలక్ష్మణా! హాకౌసల్యా! హాసుమిత్రా! నేనిట్లు రామునిఁ బాసి క్రూరరాక్షసస్త్రీల బారింబడి కంది కుందుచున్నానే. ఆహా! ఎవరికైనను దైవనిర్ణయము లేకున్న మరణముగలుగదు. అదృష్టహీననుగావునఁ గమలాక్షుఁడగు రాముని యెడఁబాసి యున్నదానను. ప్రాణమువిడుచుటకైనను నాకధికారములేదు. మానవత్వమే నింద్యము. అందున నొకరికి లోఁబడియుండుటయు నొక బ్రతుకగునా? ఓ రాక్షసాంగనలారా! మీరేమిచెప్పిన నేమి? నేను రామునిఁదప్ప నన్యుని మనసుతోనైన స్మరింపను. దీనుఁడైనను రాజ్యహీనుఁడైనను దరిద్రుఁడైనను వనమున నున్నను భర్తయే దైవమని నమ్మినదానను. ఎట్టి యైశ్వర్యములున్నను రావణుని యెడమకాలితోనైనఁ దాకను. అందుచే మీరు నన్ను చంపుడు. భక్షింపుడు. మరణింప నిశ్చయించిననాకు మీవలనిభయమేల? సత్యవ్రతుఁడును ధర్మము దప్పనివాఁడును కొంచె ముపకారముచేసినను కొండంతగ భావించువాఁడును దీనుల నెప్పుడు రక్షించువాఁడు నగు రామ

చంద్రునకు నామీఁద దయతప్పిన కారణ మేమైయుండును? అతనికి నేనిచ్చటనుండుట తెలియదేమో. ఎవరు చెప్పియుండురు? నన్ను రావణుఁడెత్తికొనివచ్చునపుడు చూచిన జటాయువును మరణించినాఁడు. దైవగతిగ నేనిచ్చటనున్నానని తెలిసినంతనే రాముఁడు బాణపరంపరలచే లంకను నిర్మూలము చేయును. అటుగాకున్న గడువుగడచినంతనే రావణుఁడు నన్ను భక్షించును. నా దౌర్భాగ్యమే రామునకు నాయునికిఁదెలియకుండఁ జేసినది. ప్రాణప్రియుండగు రాముని వదలియుండుట కన్న మరణించుట మే"లనెను.

## త్రిజట తన స్వప్నవిషయముఁ జెప్పుట.

రాక్షసస్త్రీలు సీతను పలువిధములుగ భయపఱచుటయు సీత మరణింప నెంచుటయును జూచిన ముసలిరాక్షసియగు త్రిజట వారలఁజూచి "పాపాత్ములారా! జనకుని కూఁతురును దశరథుని కోడలునగు సీతను భక్షింపనేల? నేనొక కలఁగంటిని. అందువలన నామెకు మేలుగలుగునని యెంచెద"ననెను. అప్పుడా రాక్షసస్త్రీలు "స్వప్నమున నేమిచూచితి"వని యడుగ త్రిజట "రాముఁడు తెల్లనిపూలమాలధరించి దంతముతోఁ జేయఁబడిన పల్లకినెక్కి లక్ష్మణునిఁగూడి లంకకువచ్చెను. సీతాదేవి తెల్లనిచీరఁగట్టుకొని తెల్లనికొండపైనుండెను. మఱల రామలక్ష్మణులు తెల్లనియేనుఁగునెక్కి రాఁగా సీతయుఁ దానినెక్కి రామునిఁగలసికొనెను. మఱియొకపఱి సీతారామలక్ష్మణు లెనిమిది తెల్లయెద్దులు పూన్చిన రథమునవచ్చుటఁ గంటిని. రావణుఁ డన్ననో యెఱ్ఱగన్నేరుపూలమాల ధరించి దేహమంతయు

నూనెఁబూసికొని నూనెఁద్రాగుచు నెఱ్ఱనివస్త్రములు ధరించి నేలఁబడినట్లు గంటిని. రెండవసారి రావణుఁడు బోడితలతో నల్లనిబట్టగట్టుకొని పుష్పకమునుండి పడి యొక స్త్రీచే నీడ్వఁబడినట్లు గంటిని. మూఁడవసారి రావణుఁడు గాడిదనెక్కి ఎఱ్ఱనిపూలమాలధరించి దక్షిణదిక్కుగఁ బోవుచు నేలఁ బడినట్లును మలపంకమునఁబడి తబ్బిబ్బుచెందినట్లును జూచితిని. ఇంద్రజిత్తు మొసలిని, కుంభకర్ణుఁ డొంటెనెక్కి దక్షిణముగఁ బోయినట్లును, విభీషణుఁడు తెల్లనిగొడుగుతో మంత్రులు గొలువఁ దెల్లనివస్త్రములతో వాద్యఘోషములతో నుత్తమ గజము నెక్కిపోవఁ గంటిని. ఓ చెలులారా! సీతకు మేలుగలుగు ననుట కెంతమాత్రము సందేహములేదు. రామునకు జయమును రావణున కపజయమును గలుగునని తోఁచుచున్నది. రామునివలన మీకెల్లఱకు గొప్పదండనలు లేకుండుట కొక్క యుపాయమున్నది. అదేమనిన సీతాదేవిని శరణుజొచ్చి క్షమింప వేఁడుటయే. సీతాదేవికి యెడమకన్ను భుజము తొడయు నదరుచున్నది. ఇవి శుభసూచకములు. పింగళిపక్షి యఱపులు చూడ బంధువులరాకఁ దెలుపుచున్న" దనెను.

## మరణింప సిద్ధమగు సీతకు శుభసూచనలు గనఁబడుట.

---

రావణుని గడువును రాక్షసస్త్రీల బెదరింపులను జూచి శోకసాగరమున మునిఁగినదై సీతాదేవి రామునివియోగముచే "నాగుండె వేయిముక్కలు గాకున్నదే. ఆతిగుండెగల దానను. రెండునెలలలో రాముఁడు నన్నురక్షింపకున్న దురాత్ముఁ డగు రావణుఁడు గర్భమునుండి వెలువడని శిశువును గర్భము

లోనే ఖండించుమనట్లు నన్ను ఖండించి భక్షించును. హా రామ చంద్రా! హా ప్రాణనాథా! నీ యొడిలోఁ గూర్చుండు భాగ్య మింక నాకు లేదుకదా. నిన్ను దైవమని తలంచుచున్నదాననే. నిన్ను విడిచి యొకనిముసమైననుండ లేక నిన్ను వెన్నంటివచ్చి తినే. అనాథవలె దిక్కులేనిదాననైతినే. నీకంటె నాకు రక్షకు లెవరు? అయ్యో! నావ్రతములు ఫలింపలేదే. నాపాతివ్రత్య ము విఫలమయ్యెనే. రామా! నీవు తండ్రియాజ్ఞఁ బాటించి యయోధ్యఁజేరి సుందరాంగనలఁగూడి సుఖింతువని తలఁచె దను. నాజన్మ మింతటితో వృథయని నిశ్చయించుకొంటిని. ఇఁక నేనొకక్షణమైన జీవించియుండ నెంచను. నాకిప్పుడు విష మునైన నిచ్చువారులేరు. వాఁడియాయుధ మెవరిత్తురు?" అని తలజడను మెడకుఁగట్టుకొని పూచియున్న శింశుపావృక్షము సమీపించి యొకకొమ్మఁబట్టుకొని "అహా! ఇట్టి దుర్మరణము గలుగవలసివచ్చినదా?" యని దుఃఖించుచుండెను.

## హనుమంతుని యాలోచన.

---

శింశుపావృక్షమున నాకులమరుగునఁ దాఁగియుండిన హనుమంతుఁడు సీతతో రావణుఁడు సంభాషించిన రీతి, త్రిజట స్వప్నవృత్తాంతము, రాక్షసస్త్రీలు సీతను బెదరించిన విధము, సీత మరణింప సిద్ధపడుటను జూచి యిట్లాలోచించెను. "ఎవ రిని వెదకుటకై నలుదిక్కులకు లక్షలకొలఁది వానరులు పంపఁ బడిరో యట్టి సీతాదేవి నిచ్చటఁగంటిని. ఈపట్టణము, పుష్పక విమానము, జనులతీరు, రావణుని ప్రభావము, రాక్షసస్త్రీల యాగడములు, సీతాదేవిదుఃఖము కనులారఁగాంచితిని. భర్తను

బొందఁగోరు సీత నూరడించుట ముఖ్యము అందుల కామెకు రాముని వృత్తాంతము చెప్పి యొప్పించి ప్రాణరక్షణ చేసిననే నా ధర్మము నిర్వర్తించినవాఁడ నగుదును. ఆమెతో సంభాషింపకున్న నామె ప్రాణమువిడుచును. ఆమెసందేశముఁ గొని పోకున్న రామచంద్రున కూఱటఁగలుగదు. కనుక నామెతో సంభాషించి తీరవలెను. రాక్షసస్త్రీలు కావలియున్నారు. వారికిఁ దెలియనివిధమున సాధారణ మానవభాషలో మాట్లాడెదను. అల్పవానరరూపమునందు నన్ను రాక్షసస్త్రీలు గమనింపరు. ఒకవేళ సీత వానరుఁడనగు నేను మానవభాషలో మాట్లాడుటవిని రావణునిమాయయనితలఁచి భయపడి యఱచిన రాక్షసస్త్రీలు నన్ను హింసింపఁజూతురు. అప్పుడు రాముఁడు చెప్పిపంపిన విషయములు సీతకుఁజెప్పలేకపోదును. అంతియ కాక రాక్షసు లెప్పుడు పరులఁ బీడించుటలో సంతసించువారలగుటచే నామీఁది కోపముచే సీతను జంపుదురేమో. అట్టియెడ సముద్రమునుదాఁటి యిచ్చటికివచ్చి సీతయునికిఁ దెలిసికొనగలవారెవరు లేరే. ఇట్టి సాధకబాధకముల వివరించి కార్యము చేయని దూత మూర్ఖుఁడుగదా. తానే విద్వాంసుఁడని భావించి కాలదేశవర్తమానముల విచారించి కార్యముచేయని దూతవలన యజమానుని కార్యము చెడును. కనుక యుక్తమగునట్లు సీతాదేవికి నమ్మక మేర్పడువిధమున రాముని వృత్తాంతము చెప్పెద"నని నిశ్చయించెను.

అంత మిక్కిలి బుద్ధిమంతుఁడగు హనుమంతుఁడు చెట్టున సీతాదేవికి సమీపమునందు కొమ్మపైఁ గూర్చుండి యామెకు మాత్రము వినునంత ధ్వనితో మృదు మధురముగ

" ఇక్ష్వాకువంశస్థులలో నొకఁడగు దశరథచక్రవర్తి యయోధ్యను బాలించెను. అతఁడు ధర్మాత్ముఁడు. అతనికుమారులలో జ్యేష్ఠుఁడగు రామచంద్రుఁడు పితృవాక్యమునను సరించి భార్యయగు సీతా దేవితోడను తమ్ముఁడగు లక్ష్మణునితోడను వనవాసము చేయుచుండెను. అతఁ డనేక క్రూరరాక్షసుల వధించెను. జనస్థానమున ఖర దూషణ త్రిశిరు లను వారిని గొప్ప సైన్యముతో నొక్కఁడే సంహరించెను. ఆమాటవిని లంకాధిపతి రావణుఁడు మాయలేడినిగొని రాముని మోసపుచ్చి సీత నెత్తుకొనిపోయెను. మార్గమున గృధ్రరాజగు జటాయు వతని నడ్డగించి మరణించెను. సీతా దేవి కొన్నియాభరణముల మూఁటగట్టి పర్వతశిఖరమున నుండిన వానరులమధ్యఁ బడవైచెను. రామలక్ష్మణులు సీతను వెదకుచు రాఁగా వానరరాజగు సుగ్రీవునితో స్నేహముకుదిరెను. అతని యన్నయగు వాలిని జంపి కిష్కింధకు సుగ్రీవు నభిషేకించెను. అందుచే సుగ్రీవుఁడు వానరులను నలుదిక్కులకు సీతను వెదకఁబంపెను. అట్లువచ్చిన హనుమంతుఁడనువాఁడను నేను. రాముఁడు సీతను వర్ణించిన విధమునుజూడ నీవెయే సీతయని తెలిసికొనుచున్నా" ననెను. అంత సీత రామునివృత్తాంతము విని యానందించి నలుదిక్కులఁ జూచుచుఁ దుదకు హనుమంతుని జూచెను.

అంత సీత భయపడి 'అయ్యో! రావణుఁ డీరూపమున వచ్చినవాఁడేమో? లేకున్న నేను నిదురించితినా? దుఃఖసాగరమున మునిఁగిన నాకెక్కడిది నిద్ర? ఒక వేళ నేను కలగంటినని తలంచెద. కలలో వానరుని చూడరాదందురే. నేనుజూచితినే. ఇందువలన నాకెట్టి యశుభముగలుగనున్నదో? ఏమిచేతును?

ఎందుఁబోయెను? రాముని వృత్తాంతము విన్నంతనే నాప్రాణము పైకి వచ్చిన దనవచ్చును. కాని నిరంతరము రామునే స్మరించుచుండు నామనోరథమే వానరరూపముఁ దోఁపఁ జేసెనా? ఆహా! చింతలో మునిఁగినవారిగతి యిట్టిదని నే నెఱుఁగుచున్నాను. నిజముగ నాకు రాముని క్షేమముఁ దెలుపవచ్చిన హితుఁడనియే తలంచెదను. ఇంద్రాగ్ని గురు బ్రహ్మలకు నమస్కరించెదను. ఇతని మాటలు నిజముగుగాక" యనెను.

## సంభాషణ.

అంత హనుమంతుఁడు చెట్టుదిగి శిరముపై చేమోడ్చి వినయముతో "తల్లీ! నీవు దేవతవా? ఖేచరులలో నొకతెవా? నిండుచంద్రునివంటి నీమోమును కమలములవంటి నీ నేత్రములును నీ సకల శుభలక్షణములనుజూడ నీవు రామచంద్రుని ధర్మపత్నివనియే తోఁచుచున్నది. నీ వెవరికొఱకు దుఃఖించెదవు? నీ కన్నీ ళ్ళెవరి వినాశమునకుఁ గారణమగును? నీవు భర్తను విడిచియుండుటకు దుఃఖించెదవా? తండ్రినిగూర్చి నీకు శోకముగలిగెనా? సోదరుని యాపద నిన్నిట్లు బాధించుచున్నదా? నీవృత్తాంతము విశదముగ నాకుఁ దెలుపు"మని యడిగెను. అతఁడు దనకు హితుఁడని యెంచి సీత "నేను దశరథమహారాజునకుఁ గోడలను, జనకునకుఁ గూఁతురను. ధర్మస్వరూపుఁడగు రాముని భార్యను. దశరథుఁడు రామునకుఁ బట్టముగట్ట సకల సంభారములు సేకరించి ముహూర్తమెదురుచూచుతఱి యతని కనిష్ఠభార్యయగు కైకేయి తన కుమారుఁడగు భరతునకుఁ బట్టముగట్టవలెననియు, నాభర్తయగు రామునిఁ బదునాలుగేం

ష్లరణ్యవాసముచేయవలె ననియు వరములు పొంది రాముఁ డరణ్యమునకుఁ బోవునంతదనుక భుజింపనని పట్టుపట్టెను. అంత నా భర్తను వెన్నంటి వచ్చితిని. జనస్థానమున నుండ మాయలేడిని చూచి పట్టియిమ్మని యడుగ రాముఁడు దానిని వెంబడించెను. అది రామబాణముచేఁ జచ్చునపుడు రాముని గొంతుతో నఱచెను. నేను లక్ష్మణుని నతని సహాయముగఁ బంపితిని. ఆసమయమున రావణుఁడు సన్న్యాసి వేషమునవచ్చి బలాత్కారముగ నన్నెత్తికొనిపోవుచుండ నేను కొన్నియాభరణముల వానరులున్నయెడఁ బడవైచితిని. రావణుఁడు నన్నేకపాట్లు పెట్టించుచు నిచ్చట నుంచియున్నాఁడు. నీవు నిజముగ వానరుఁడేనా? లేక నేను కలగనుచున్నానా? రావణుఁడిట్లు మాయారూపముదాల్చి నన్ను మోసపుచ్చుచున్నాఁడా?" యని దిగులుచెందెను.

అప్పుడు హనుమంతుఁడు "తల్లీ! భయపడకుము. నేను నిజముగ వానరుఁడనే. నా పేరు హనుమంతుఁడు. నేను వాయుపుత్రుఁడను, సుగ్రీవుని మంత్రిని. రామసుగ్రీవుల స్నేహముచే రామునికొఱకు సుగ్రీవునిచే దక్షిణదిక్కున నిన్ను వెదకుటకు పంపఁబడిన రామబంటును. నన్ను సందేహింపకుము" అనెను. అంత సీత సంతోషించి "వానరోత్తమా! అట్లయిన నీవు రామలక్ష్మణుల యాకృతిని వర్ణింపుము. నరులకును వానరులకును ఎట్లు స్నేహముకుదిరెనో వివరింపు" మనెను.

హనుమంతుఁడు సంతోషముతో "జానకీ! రాముఁడు సర్వాంగసౌందర్యముగలవాఁడు. దయాదాక్షిణ్యము మున్నగు మేలుగుణములుగలవాఁడు. ఓర్పున భూమితో సమానుఁడు.

ధైర్యమున హిమవంతుని కుది. బుద్ధియందు బృహస్పతి తుల్యుఁడు. కీర్తియందు దేవేంద్రునకు సాటి. జీవలోకమును రక్షించువాఁడు. నీతినియమములు చక్కఁగఁ బాటించువాఁడు. వేదవేదాంగ శాస్త్రములలోఁ బండితుఁడు. దుష్టజనశిక్షకుఁడు, శిష్టజన రక్షకుఁడు. ధర్మార్థకామములఁ బూర్వాహ్ణ మధ్యాహ్న సాయాహ్నములందుఁ గ్రమముగ ననుష్ఠించువాఁడు. ఇఁక నతనితో మాకు సఖ్యమేర్పడిన విధము దెలిపెదను.

నిన్ను దుర్మార్గుఁడగు రావణుఁ డపహరించిన పిదప రామలక్ష్మణులు నిన్ను వెదకుచు ఋశ్యమూకప్రాంతముచేరిరి. అన్నయగు వాలిచే రాజ్యభ్రష్టుఁడైన సుగ్రీవుఁడను వానరోత్తముఁడు నలువురు మిత్రులతో నాపర్వతముననుండెను. అతఁడు రామలక్ష్మణులఁ జూచి వాలిచేఁ దన్ను హింసింపవచ్చినవారేమో యని భయపడి నన్ను బంపెను. నే నతి వినయముగ వారితో సంభాషించి వారి సుగుణములకుఁ గట్టుపడి వారిని మూఁపునఁగొని సుగ్రీవునిసన్నిధిఁ జేర్చి వారివృత్తాంతముచెప్పితిని. సుగ్రీవుఁడు రామునితో తనకష్టములుచెప్పి యతనిసహాయముపొంది తాను రామునకు సాయమొనర్చునట్లు ప్రతిజ్ఞ చేసి యగ్నిసాక్షికముగ రాముని స్నేహము సంపాదించెను. మాటప్రొప్పున రామచంద్రుఁడు వాలిని వధించి సుగ్రీవుని కిష్కింధకు రాజుగ నభిషేకించి యతని సాయమున వానరుల నలుదిక్కుల నిన్ను వెదుకఁబంపెను. దక్షిణదిక్కుగ వచ్చినవారిలో నే నీ సముద్రము దాఁటి లంకనంతయుఁ గలయవెదకి తుదకిచ్చట నిన్నుగంటిని. ఇట్టి నాభాగ్యముగొప్పది" అనెను.

## అంగుళీయకము నిచ్చుట.

ఆ మాటలు విని సీతాదేవి శోక మోహములు వదలి హనుమంతుని రామభక్తుఁడని నిశ్చయించుకొని "రాముఁడు నన్ను మఱచినాఁడా? నన్ను విడిచి యొక్కక్షణమైన నుండని వాఁడే. ఇప్పుడు నాయెడఁబాటు నెట్లుసహించుచున్నాఁడని" యడిగెను. అందుల కాంజనేయుఁడు "తల్లీ! రామచంద్రుఁడు పువ్వునుజూచిన ఫలమునుజూచిన 'హాసీతా! హాప్రాణప్రియా! నీ వనుభవింపని పుష్పఫలములు నాకేల' యనును. మాటి మాటికి నిన్నుదలఁచి నిట్టూర్పులు విడుచుచుండును. నిద్రపోవు చున్నను నిద్రచాలించి 'హాజానకీ!' యని కలవరించును. ఉన్మత్తునివలెఁ గొన్నిసమయములం దేమియడిగినను బదులుసెప్పఁడు. నిన్నుబొందనెంచి సకలవిధయత్నములుగావించుచున్నాఁడు. మూఁడుదిక్కులకు వానరులఁ బంపి నన్ను దక్షిణముగఁ బంపునపుడు సుగ్రీవుఁ డాడినమాటలు విని నాయందు పరిపూర్ణమగు నమ్మకముంచి "హనుమంతా! నీవే కార్యసాధకుఁడవని తలఁచుచున్నాను. నీవీ యుంగరముఁగొని సీతకిచ్చినఁగాని యాసాధ్వి నిన్నునమ్మఁజాలదు. నిన్నుజూచియు రావణుని మోసమనియే భావించును. కనుక నీచేతి కీయూనవాలిచ్చెదను" అని చెప్పి యీరామనామముగల యంగుళీయకము నిచ్చెను. తల్లీ! దీనిని గైకొమ్మ"ని రాముఁడిచ్చిన యంగుళీయకమును సీతకిచ్చె.

అంత సీతాదేవి యానందబాష్పములుగాఱఁగా భర్తను జూచినట్లె తలఁచి యా యుంగరముఁ గంటికద్దుకొని రొమ్మునఁ జేర్చి మాటిమాటికి "హాప్రాణనాథా! నిన్నువిడిచియు నుండు

న క్లేర్పడెనే" యనుచు హనుమంతుని రాకకు సంతోషించి "మారుతీ! నీవు సామాన్యుఁడవుగావు. నీ శక్తిసామర్థ్యము లపారములు. నీ బుద్ధికుశలత సాటిలేనిది. నీవుదప్ప నన్యుఁ డెవఁడు నూఱుయోజనములుగల సముద్రమును గోవుపాదము వలె నెంచి దాఁటఁగలఁడు? ఉత్తమబుద్ధిమంతుఁడగు రామ చంద్రుఁడు సామాన్యు నిట్టికార్యమున కెన్నఁడును బంపఁడు. నా భాగ్యవశమున నీమూలమున రామలక్ష్మణులు సేమముగ నున్నారని తెలిసికొంటిని. ఇఁక నేను రాముని జేరఁగలనని ధైర్యమువహించి బ్రతికియుండఁనోపుదును" అని చెప్పి మధుర మైనఁ బ్రియునివిషయము విన్ఁగోరి సీత యూరకుండెను. అంత హనుమంతుఁడు నమస్కరించి "అంబుజాక్షీ! రామచంద్రునకు నీయునికిఁ దెలియనందున నిన్ను విడిచియున్నాఁడు. నామాటలు వినినంతనే రాముఁడు నిన్ను అనుహ్లాత్మునివశమున నున్న శచీ దేవిని దేవేంద్రుఁడు పొందిన ట్లతిశీఘ్రమున వానర ఋషభ సైన్యములతో వచ్చి శత్రునిర్మూలనముచేసి నిన్ను పొందఁ గలఁడని నమ్ముము. నీకొఱకతఁడు సర్వసన్నాహములు గావించుచున్నాఁడు. భయఁపడకు" మనెను. సీతయుఁ గొంత ధైర్యముదెచ్చికొనెను.

# 14. లంకాదహనము

నిండుచంద్రునివంటి ముఖముగల సీతాదేవి ధర్మయుక్తము నర్థయుక్తమగు మాటలతో "వానరపుంగవా! నీమాటలమృతతుల్యముగను వినయయుక్తముగను గూడ నున్నవి. రాముఁడు నా జ్ఞాపకము గలిగియుండుట సంతోషమే. నా విరహము సహింపలేక దుఃఖించుచున్నాఁడనుటచే శోకకారణమగుచున్నది మానవుఁడస్వతంత్రుఁడు. సుఖమునను భయంకరమగు దుఃఖమునను దేవుఁడు మనుష్యుని యీడ్చుచుండును. దైవనిర్ణయ మనివార్యము. ఇది నిజము. రామలక్ష్మణులును నేనును శోకసాగరమున మునుఁగుచున్నాముగదా. సముద్రమున నోడ ముక్కలై విఱిగినందున వలలోఁదగులొక్కని గట్టు చేర యత్నించువానివలె రాముఁడీ శోకసముద్రము నుండి యెట్లు గట్టుచేరఁగలఁడు? ఈలంకానగరమును నాశమొందించి రాముఁడెన్నఁడు నన్నుఁ జేరఁగలఁడు? రావణుఁడిచ్చిన సంవత్సరపుగడువునఁ బదియవనెల జరుగుచున్నది. ఇంకను రెండు నెలలలో రాముఁడు నన్నుబొందకున్న రావణుఁడు నన్ను చంపుట నిజము. అతనితమ్ముఁడగు విభీషణుఁడు నన్ను రామునికిచ్చివేయుమని యెంతచెప్పినను రావణుఁడు మృత్యువుచేఁ బ్రేరేపింపఁబడి సమ్మతింపకున్నాఁడు. విభీషణుని పెద్దకూఁతురగు నల నాకు మేలుగలుగునని చెప్పినది. నేను నట్లే తలఁచెదను. రాముఁడొక్కఁడే జనస్థానమునఁ బదునాల్గువేల రాక్షసులను వధించుటను జూచితిని. అతని పరాక్రమ మిట్టిదని యెఱుఁగుదును. కనుక రాముఁడు శత్రువులగు రాక్షసుల నవలీలగఁ జంపఁగలఁడనెను. అంత హనుమంతుఁడు "నేను నీ

వృత్తాంతము చెప్పినవెంటనే రాముఁడిచ్చటికి లెక్కలేని వానర భల్లూకసైన్యములతో వచ్చి రావణుని వధించి నిన్ను బొందును. కాదేని నావీఁపునఁ గూర్చుండుము. నిన్నతిశీఘ్రమున రామునిసన్నిధిఁ జేర్తుననెను. అంత సీత నవ్వి ఆంజనేయా! నీకపిత్వము గొంత వెల్లడించెదవే. నీ రూపమేమి? నీబలమేమి? ఇచ్చటికిని రాముఁడుండు స్థలమునకును బహుదూరము గలదు. నీ వెట్లు నన్ను సురక్షితముగఁ గొంపోవఁగలవు? అనెను. హనుమంతుఁడు కొంచెము లజ్జించి తన నిజస్వరూపముసూపి "తల్లీ! రావణునితోఁగూడ నీ లంకాపురమునైన మోయఁగలవాఁడనని నమ్ముము. ఒక్క క్షణములో నిన్ను నీ నాథునియొద్దకుఁ గొంపోయెద" ననెను.

అప్పుడు సీత సంతోషించి "కపిసత్తమా! నీశక్తి యిట్టిదని యిప్పుడు తెలిసినది. నీ వతి వేగముగఁ గొంపోవునప్పుడు నేను సముద్రమునఁబడి మరణింపవచ్చును. నన్నుజూచి రాక్షసులు యుద్ధముచేసిన నన్నుమోయుచు వారితో నెట్లు యుద్ధము చేయుదువు? నన్ను దించితివేని వారు నా కాపదగలిగింతురు. అట్లుగాకున్నను యుద్ధమున వారు గెలిచిన నాగతి యేమి? ఈ కారణములట్లుండనిమ్ము. నేను రామునితప్ప నన్యునిఁదాఁకను. రావణుఁడు తాఁకలేదా యందువా? అనాథనై దుఃఖపరవశనైయుండ నన్నుదెచ్చినాఁడు. అది నాతప్పుగాదు. ఇంతియగాక రామునివంటి పరాక్రమవంతుఁడు యుద్ధమున శత్రునాశమొనర్చి నన్నుబొందిననే శాశ్వతకీర్తికలుగును. కనుక నీవు వారి నతిశీఘ్రమున నిచ్చటికే తెంచునట్లుచేయు"మనెను.

## చూడామణి నిచ్చుట.

హనుమంతుఁడామెమాటల కానందించి "పావనీ! నీ వాడినమాటలు నీ సద్వంశమును సతీత్వమును జూటుచున్నవి. నేను నిన్నుజూచినందు కొకగుర్తునిమ్ము. రామచంద్రునకు నేను నిన్నుజూచితినని నమ్మకమును సంతోషమును గలుగును" అనెను. అంత సీతాదేవి "కపివరా! ఏకాంతమున జరిగిన విషయ మొకటిచెప్పెదను. నామాటగా రామునితో నిట్లనుము. "చిత్రకూటమున నొకదినము పువ్వులఁగోసి యలసి నీయొడిలోఁ గూర్చుండియుంటిని. ఒక కాకి నారొమ్మును బొడుచుచుండ నేను లేచి దానిని తఱుమఁజొచ్చితినిగాని యది మఱల నన్నట్లే బాధింపవచ్చెను. నేను నీతొడమీఁదఁ దలనిడుకొని నిద్రించి కొంతసేపటికి లేచితిని. అప్పుడు నీవు నాతొడపయి తలనిడి నిదురించితివి. ఆకాకి మరలవచ్చి నా స్తనములఁ బొడిచి గాయముచేయ రక్తబిందువులు నీమీఁదఁబడినవి. నేను బాధ తాళఁజాలక నిన్ను మేలుకొలిపితిని. నీవు దర్భముక్క నెత్తి బ్రహ్మాస్త్రమంత్రము పఠించితివి. అప్పుడొక పెనుమంట లేచి యాకాకిని తఱుముచుఁబోయెను. ఆకాకి దేవేంద్రుని కొడుకగు జయంతుఁడనువాఁడట. కాకిరూపముతో వచ్చి యిట్లుచేసినందున నామంట యతని వెంబడింప నతఁడు ముల్లోకములలోఁ గాచువారులేక మఱలివచ్చి నీశరణు వేఁడెను. చంపఁదగినను నీవాకాకినివధింపక దానికుడికంటిని యస్త్రమునకుపాయనము గావించి ప్రాణము రక్షించితివి. ఇట్లు నీ శరణాగత రక్షణము దెలిసికొంటిని. అల్పప్రాణియగు కాకివిషయమై బ్రహ్మాస్త్రము

ప్రయోగించినసీవు నీవులేనిసమయమున దొంగతనముగ నన్ను దెచ్చి పడరానిపాట్లుపెట్టించిన దురాత్మునివిషయమై జాగు సేయనేల? దయ జపతపములకంటెను యాగయజ్ఞాదులకంటె ను సకల దానంబులకంటెను నుత్తమంబగు ధర్మమని నీవే చెప్పి యున్నావే. అట్టిదయ నాయందేల నీకుఁ గలుగదయ్యె?" అని చెప్పుమ నెను.

మఱియు సీతాదేవి హనుమంతునిజూచి "కపితిలకా! లోకనాథుఁడగు నానాథుని నాకుగాను దలవంచి నమస్కరిం పుము. అన్నయందలి భక్తిచే సకలైశ్వర్యములను భోగంబు లను బత్నిని విడిచి యరణ్యవాసముచేయ తానై సంకల్పించు కొని వచ్చియున్నాఁడు లక్ష్మణుఁడు. అతఁడు రాముని తండ్రి గను నన్నుదల్లిగను భావించువాఁడు. అతని త్యాగము చెప్ప తరముగానిది. అట్టి సుమిత్రయొక్క సుపుత్రుఁడగు లక్ష్మణుని నేను చాల విచారించితినని ము. అట్టి పరమ సుహృదుఁడగు తమ్ముఁడుండుటచే రాముఁడు తండ్రిలేనివాఁడుకాఁడనియే చెప్ప వచ్చును. మున్ను దేవేంద్రుఁడు వృత్రాసురుని వధించి పొం దిన బ్రహ్మహత్యాదోషముచే నలిగి యతనిలక్ష్మి పాతాళము చేరఁగా దేవతల వేఁడికోలు ననుసరించి విష్ణువా లక్ష్మిని యింద్రున కిప్పించి పూర్వస్థితికిఁ దెచ్చెను. అట్లే రాముఁడు రావణునిచెఱయందున్న నన్ను విడిపించికొనిపోవుగాక. ఇట్టి నాప్రార్థనను రామునికి మాటిమాటికిఁదెలుపుము" అనిచెప్పుచు కొంగున ముడివైచియున్న రత్నమయమగు చూడామణిని హనుమంతున కిచ్చెను. అప్పుడతఁడు తొల్లింటి చిన్నరూపము నెత్తుకొనినందున చూడామణిని వ్రేలికిఁ దొడుగుకొనెను.

అతఁడు వినయముతో సీతాదేవికిఁ బ్రదక్షిణనమస్కారములు సేసి నిలుచుండెను.

హనుమంతుని యభయప్రదానము.

సీత హనుమంతునితో "మారుతీ! ఈచూడామణి వివాహకాలమున నాతల్లిచే నాకీయఁబడినది. అప్పుడు దశరథుఁ డుండినందున రాముఁనకు దీనిని చూచినంతనే నాతల్లియు దశరథుఁడును, నేనును జ్ఞప్తికివత్తుము. ఆంజనేయా! ఎట్లయినను రాముఁడు నన్ను శీఘ్రమునఁబొందుట కెట్టి యుపాయము చేయవలెనో యది నీభారము. ఈ నాదుఃఖమునుఁబోఁగొట్ట సమర్థుఁడవునీవే. నిన్నుదప్ప నొరునిసహాయము నేనుగోర లేను" అనెను. అంత హనుమంతుఁడు "తల్లీ! నీయాజ్ఞ శిరసా వహింతును. తప్పక నీశోకము పోఁగొట్టుదును. రామలక్ష్మణులు యుద్ధమున నింద్రుని దిక్పాలురను సకలదేవతలను జయింతురు. అట్టివారికీ రాక్షసు లెంతమాత్రము? భయపడకు" మనెను.

మఱల సీత "వీరా! ఒకదినముండి పొమ్ము. నీవుండఁగా నాకెంతయు సంతసముగనున్నది. నీవిచ్చటినుండి పోయిన వెంటనే నేను మఱల దుఃఖసముద్రములోఁ బడుదును. మఱియు నాకొక సందేహము. వానరులును భల్లూకములును ఘోరసముద్రమును దాఁటుటెట్లు? నీకు లంకకువచ్చుటకే గాక రావణాదులెల్లర సంహరింప సర్వశక్తులున్నవి. నిన్ను గూడి రామలక్ష్మణులు యుద్ధమున రావణసంహారముచేసిననే నాకును రామునకును కీర్తికరము. అట్టి నాకోరిక నీడేర్పఁదగినవాఁడవు నీవే"యనెను.

అంత హనుమంతుఁడు "తల్లీ! సుగ్రీవుఁడను వానరరాజు మహాబలపరాక్రమముగలవాఁడు. అతని యధీనమున నుండు వారందఱు నాకంటెను బలపరాక్రమముగలవారు. కొందఱు నాకు సములుగాని నాకంటెఁ దక్కువవా రెవ్వరును లేరు గనుక నీకెట్టి సందేహ మక్కఱలేదు. ఏరాజును మొట్ట మొదట యల్పభటులను బంపును. తుదకు మహాబలులను బంపును దానువచ్చును. కనుక రాముఁ డతిశీఘ్రమున వారి సహాయముతో యుద్ధమున జయముఁగాంచి నిన్నుఁదోడొకొని యయోధ్యకుఁ బోవును. ధైర్యము దెచ్చికొనుము. నేను నీ స్థితిని రామున కెఱిఁగించునంతవఱకు నోర్చుకొను"మనెను.

## అశోకవన భంగము.

---

హనుమంతుని హితమగుమాటలు విని సీత "వాయుపుత్రా! నీరాకవలనను నీమాటలవలనను సగమెండినట్టిపైరు మంచివర్షముగురిసిన మఱలఁ గళకళలాడునట్లు దుఃఖసముద్రమున మునుఁగనున్న నేను గొంత ధైర్యము దెచ్చికొంటిని. నాకు రామునితో సంయోగముగలుగు ప్రయత్నము నీవే చేయవలెను. మఱియొక విషయము జ్ఞప్తికి తెచ్చుకొనుచున్నాను. ఒక సమయమున నా నుదుట బొట్టుగలఁగిపోవఁగా రాముఁడు నా యందత్యంతాదరముగలిగి మణిశిలను బొట్టుగాఁ జేసియుంచెను. ఇదియునొక యానవాలుగఁ జెప్పుము. రావణుని గడువు దినములు, రాక్షసస్త్రీలు నన్నుఁ బెట్టించు పాట్లు, నా నిర్భర శోకము గన్నులారఁగాంచిన నీకు నే నేమిచెప్పవలెను. నిన్నే నాప్రాణదాతగ నమ్మియున్నా"ననెను.

అంత నాంజనేయుఁ డామెకు సాష్టాంగముగ మ్రొక్కి యుత్తరదిక్కునకుఁ బ్రయాణము చేయనెంచినవాఁడై యిట్లని తనలో ననుకొనెను. "నేను సముద్రమునుదాఁటి లంకలోఁ బ్రవేశించి యందలి ప్రదేశములను బ్రజలను జూచితిని. రావణుని నిద్రించునపుడును సీతను బెదరించునపుడును గంటిని. శత్రుబల మెంతమాత్రమని యెఱుంగవలయును. అందుల కుపాయమేమని యాలోచింపవలెను. నేను రావణుని యుద్యానవనమగు నీ యశోకవనమును ధ్వంసముచేసితినేని నన్ను రావణుఁడు సంహరింప యత్నించును. అప్పుడు నాబలమిట్టిదని వారు గ్రహింతురు. ఏపురుషుఁడు తన్నొకపనికి నియమించిన దానియందలి సాధకబాధకములను విమర్శించి కార్యహాని గలుగనివిధమున దానింజేసి యింక ననేకములం జేయునో వాఁడే బుద్ధిమంతుఁడు. రావణుఁడు దుర్మార్గుఁడు. కనుక నతనిపట్ల సామోపాయము చెల్లదు. అతఁ డైశ్వర్యవంతుఁడగుట దానమిచ్చుటయుఁ బనికిరాదు. బలముచే నుదించినవానిని భేదముచే నోడింప వీలుగాదు. కనుక దండోపాయముచే రావణుని సాధించవలెను. అతఁడు బలవంతుఁడే. పరాక్రమవంతుఁడే. అయినను నేనతని ముఖ్యసేనానులను వధింతునేని తక్కినవారు మెత్తపడి జంకుదురు. వానరవీరులు వారల నెదిరింపఁగలరు. రామలక్ష్మణులేమో యద్వితీయ బలసంపన్నులు. కనుక యుద్ధమున జయము తప్పకకలుగును. అందులకు నాంది నాచే నీనాఁడు జరుగునని చెప్పి శరీరమును భయంకరముగఁ బెంచి కడురమ్యముగనుండెడి యశోకవనములోని చెట్లను తీగెలను ధ్వంసముచేయఁగా రాక్షసస్త్రీలు కోపముతో సీతనుజూచి

"సీతతో మాటలాడినవాఁడెవఁడు? కొంచెమైనను భయములేక వనమును నాశ మొనర్చుచున్నాఁడు. ఇప్పుడే యీవార్త రావణున కెఱింగించెద" మని పలికిడి రావణునకు వినయముతో నమస్కరించి "రాజోత్తమా! భయంకరాకారుఁడగు వానరుఁ డొకఁడు సీతతో మాటలాడుచుండి నీ యుద్యానవనమును బొత్తిగ నాశము చేసినాఁడు. సీతయుండునట్టి యశోకవృక్ష మొక్కటిమాత్ర మున్నది. మేమావానరుని సమీపింప లేము. మేటియుద్ధవీరులఁబంపుము. వాఁడింద్రునిపంపున వచ్చినాఁడో లేక కుబేరునియాజ్ఞఁగొని వచ్చినవాఁడో లేనంతట రామునిచే సీతను వెదకుటకై పంపఁబడినవాఁడో యని సందేహము గలుగుచున్నది" అనిరి.

## రాక్షసులతో యుద్ధము.

ఆమాటలు విన్నంతనే రావణుఁడు కోపమునఁ గన్నులనుండి నిప్పులు రాలునట్టి చూపులతో బలపరాక్రమమునఁ బ్రసిద్ధులగు కింకరు లను మహావీరుల నెనిమిది వేలమందిని హనుమంతుని హతముచేయఁ బంపెను. ఆ రాక్షసులు నానావిధాయుధములు ధరించి సింహనాదములుచేయుచు నొక ప్రవాహమువలె వచ్చి హనుమంతు నెదుర్కొనిరి. అంత నాంజనేయుఁడుగ్రుఁడై గోసలాధిపతియగు రాముఁడును నతనితమ్ముఁడు లక్ష్మణుఁడును జయశీలురుగ నున్నారు. నేను రాముని దాసుఁడను. నేను వాయుపుత్రుఁడనగు హనుమంతుఁడను. వేయుమంది రావణు లెత్తివచ్చినను నన్ను జయింపలేరు" అని బిగ్గఱగ నఱచుచు వెలుపలి ద్వారమువద్దనున్న నినుపగుది

యంగొని యీరాక్షసుల సందఱిని హతమొందించి ద్వార మునఁ గూర్చుండెను.

ఈవార్తవిని రావణుఁడు మిక్కిలి కోపముగొని ప్రహ స్తుని కుమారుఁడగు జంబుమాలిని గొప్పసైన్యముతోఁ బంపె ను. పెద్దశరీరమును గుండలములును గొప్పవిల్లును గలిగి యుద్ధములో నెదిరింప వీలుగానివాఁడునైన జంబుమాలి గాడి దలుపూన్చిన రథము నెక్కి వచ్చుటనుజూచి హనుమంతుఁ డు త్సాహముపొంది సింహనాదముసేసెను. జంబుమాలి యతని పై బాణములువేయ నాంజనేయుఁడొక పెద్దబండను వానిపై వేసెనుగాని వాఁడద్దానిని బాణములతో ముక్కలుచేసెను. హనుమంతుఁ డొక నాలవృక్షముతో వాని నెదుర్కొనెను. వాఁడు బాణసమూహములతో దానిని నాశముచేసెను. అంత హనుమంతుఁడు ద్వారమువద్దనున్న నినుపగుదియతో వానిం గూలనేసెను.

రావణునకీ సమాచారము దెలిసినంత నతఁడు మంత్రి కుమారు లేడుగురిని పెనుసైన్యముతోఁ బంపెను. వారిలో నొక్కొక్కఁడును దానే హనుమంతుని చంపవలెననుగోరికతో వచ్చినఁ గని హనుమంతుఁడు పిడికిటంబొడిచియు, గోళ్ళతోఁ జీల్చియుఁ జంపఁగా మంత్రిపుత్రులు మడిసిరి. హనుమంతుఁడు ద్వారముచేరెను. ఈ వృత్తాంతముదెలిసి రావణుఁడు మనసు లో జంకుగలుగ విరూపాక్షుఁడు, యూపాక్షుఁడు, దుర్ధరుఁడు, ప్రఘసుఁడు, భాసకర్ణుఁడను నైదుగురిని గొప్ప సైన్యముతోఁ బంపెను. వారిలో దుర్ధరుఁడు బాణములతో నొప్పింప హను మంతుఁడు శరీరముపెంచి కొండమీఁదఁ బిడుగుపడునట్లా రథ

ము మీఁదికి దూకి దానిని నాశముచేసి దుర్ధరుని చంపెను. విరూపాక్ష యూపాక్షులు దనమీఁదికి రాఁగా హనుమంతుఁ డొక మద్దిచెట్టుతో వారిరువురను గూల్చెను. అంత ప్రఘసుఁ డును, భాసకర్ణుఁడును దీక్ష్ణములైన నాయుధములతోఁ దన్ను నొప్పింప హనుమంతుఁడు పర్వతశిఖర మొకదానిఁగొని వా రలఁజంపి ద్వారము సేరెను.

---

## అక్షకుమారుఁడు హతుఁడగుట.

---

ఈ వృత్తాంతమువినిన రావణుఁడు ముందటనున్న తన కుమారుఁడగు అక్షకుమారుని చూచినంతనే వాఁడు తపము చేఁ బొందిన దివ్యరథము నెక్కి యాయుధములు ధరించి వేగ ముగ వచ్చి హనుమంతు నెదురొ్కనెను. ఘోరయుద్ధము జరి గెను. యుద్ధమునందు నిపుణుఁడగు రావణపుత్రుఁడు బాణ ములనేసి యాంజనేయుని నొప్పించెను. అంత హనుమంతుఁ డలిగి బిగ్గఱగ నఱచుచు నొక వృక్షము చేఁబూని యుద్ధము చేయ నక్షకుమాఁడద్దాని నిర్మూలముచేసెను. హనుమంతుఁ డక్షకుమారుని యుద్ధనైపుణ్యముఁజూచి యిఁక ఁదామసింప రాదనియెంచి రథమును గుఱ్ఱములను నాశముచేసెను. అక్షుఁ డాకాశమున నతితీవ్రముగ సంచరింప హనుమంతుండు వాని కాళ్ళఁబట్టుకొని గిరగిర త్రిప్పి నేలఁబడగొట్టి చంపి మఱల ద్వారమునకుఁ బోయెను.

---

## ఇంద్రజిత్తు హనుమంతుని బంధించుట.

రావణుడు అక్షకుమారుని మరణవార్త చెవిసోఁకినంతనే యతఁడు మిక్కిలి శోకించి మఱల ధైర్యముదెచ్చికొని యింద్రజిత్తుఁజూచి “కుమారా! నీవు బలపరాక్రమమున దేవేంద్రునకు సాటివి. నీవు వరబలముచే నితరుల కజేయుఁడవు. నీ కీర్తి ముల్లోకములు వ్యాపించినది. మంత్రికుమారులును జంబుమాలియు నక్షకుమారుఁడును హతులయిరి. నీవు దప్ప నన్యుఁ డెవ్వఁడీ పెనుభూతమగు వానరుని జయింపలేఁడు. కావున దివ్యాయుధములఁగొనిపోయి యానీచుని రూపుమాపిర”మ్మని చెప్పెను. తండ్రిమాటలు విని రోషావేశముతో నింద్రజిత్తు దివ్యరథము నెక్కి యుత్తమాయుధముల ధరించి బయలు వెడలెను. అంతరిక్షమున దేవతలు, గంధర్వులు, యక్షులు యుద్ధముఁ జూడవచ్చిరి. అసాధారణవైభవముతో నొప్పారు ఇంద్రజిత్తునుజూచినంతనే హనుమంతుఁడు మేను బెంచి భయంకరాకారముతో నుండెను. ఇంద్రజిత్తు బాణవర్షముగురియించి యాంజనేయుని పెక్కువిధముల నొప్పించెను. హనుమంతుఁడును వాయువేగమునఁ జిత్రగతుల నాకాశమున నెగిరి రాళ్లు వృక్షములు, బండలుగొని నైపుణ్యముతో యుద్ధముచేయఁగా నతనిఁజంప వీలుగాదనియెఱిఁగి సకలాస్త్రకోవిదుఁడగు నింద్రజిత్తు బ్రహ్మాస్త్రముతో నతని బంధించెను. పుట్టినప్పుడు తాను సూర్యుని పట్టుకొనఁబోయినపుడు బ్రహ్మదేవుఁ డొసఁగిచ్చిన ట్లొక ఘడియసేపు బ్రహ్మాస్త్రముచేఁ గట్టుబడవలయునను విషయము జ్ఞప్తికి రాఁగా హనుమంతుఁ డూరకుండెను. అతఁడు

దనలో నిట్లుదలఁచెను. 'ఇదియు నొక మేలేయగును. రావణునితో సంభాషింప నవకాశముగల్గును. అతని మాటలచే నతనిమనసుఁ బరీక్షించెద.'

రాక్షసులకు బ్రహ్మాస్త్రము ఇతరవస్తువుల సంబంధముచే విఫలమగునని తెలియనందున జనుపనారను నారచీరలను దెచ్చి హనుమంతుని గట్టినందున హనుమంతుఁడు బ్రహ్మాస్త్రమునుండి విడివడినను దానిని బాటింపక రాక్షసులు దన్ను రావణునొద్దకుఁ గొంపోవుట కియ్యకొని యూరకుండెను. రాక్షసులు బలవంతుఁడగువైరి చేఁజిక్కినందున నుబ్బి యాంజనేయుని కఱ్ఱలతోను, పిడికిళ్ళతోను గొట్టుచు రావణునిసమక్షమునకుఁ గొంపోయిరి. రాక్షసులు "వీఁడెవరు? వనధ్వంసము చేసిన పాతకుఁడా? వేలకొలఁది వీరులజంపిన నీచుఁడా? చంపుఁడు, కొట్టుఁడు, తన్నుఁడు" అని యఱచిరి.

హనుమంతుఁడు రావణుని తేజమును ముఖముల గాంభీర్యమును వైభవమును జూచి యాశ్చర్యపడి యతని సభలో నున్న మంత్రులను సేనాపతులను "ఆహా! రావణుని ప్రభావము సామాన్యముగాదని" యెంచెను.

### రావణ హనుమంతుల సంభాషణము.

---

రావణుఁడు నల్లనిమేఘమువలె గొప్పయాకారముఁగలిగి, మెఱుమువలెఁ బ్రకాశించు బంగారుతోఁ జేయఁబడి రత్నములు పొదుగఁబడిన హారములతోడను, బాహుపురులతోను, ధగధగ మెఱయు కిరీటకుండలములతోను, మేలుపట్టువస్త్రములతోను ఎఱ్ఱని మైపూతతోడను దేవేంద్రునివలెఁ గనుపట్టెను. అతనికి

రాజనీతికోవిదులగు దుర్ధరుఁడు ప్రహస్తుఁడు, మహాపార్శ్వుఁడు, నికుంభుఁడు అను నలుగురు మంత్రులుండిరి. హనుమంతుఁడు రావణునిఁజూచి "ఆహా! ఏమిరూపము! ఏమిబలము! ఏమి పరాక్రమము! ఎట్టివైభవము! అని యాశ్చర్యపడెను.

క్రోధపూరితుఁడగు రావణుఁడు మంత్రిసత్తముఁడగు ప్రహస్తునిఁజూచి "ఈ వానరుఁడెవరు? ఎవరు పంపఁగా వచ్చినాఁడు? ఏల వనధ్వంసముచేసినాఁడు? రాక్షసస్త్రీల నేల బెదరించినాఁడు అని అడుగుము" అనెను. ప్రహస్తుఁడు హనుమంతునిఁజూచి "వానరుఁడా! భయపడకుము. నీ వెవరు? ఎందుండి వచ్చితివి? నిన్నెవరుపంపిరి? నీవేల వనధ్వంసముచేసితివి? ఉన్నదున్నట్లుచెప్పిన మన్నింతుము. లేకున్న వధింతు" మనెను.

అంత హనుమంతుఁడు ప్రహస్తుని లక్ష్యపెట్టక రావణునిఁజూచి "నేను దేవేంద్రుఁడు. కుబేరుఁడు. యముఁడు పంపఁగా వచ్చినవాఁడఁగాను. విష్ణువు నన్నిచ్చటికిఁ బంపలేదు. రాక్షసరాజవగు నిన్ను దర్శింప నశోకవనమును నాశముచేసితిని. రాక్షసులు యుద్ధమునకువచ్చినందున వారిఁ జంపితిని. నన్ను దేవతలుగాని, యసురులుగాని యే యాయుధముఁగాని చంపలేరు. నేను రాముని బంటును. వాయుపుత్రుఁడగు హనుమంతుఁడను. నేను నీకిప్పుడు హితముసెప్పెదను. నా మాట లాదరముతో వినుము.

"రాక్షసాధిపా! నీవు సత్కుల సంజాతుఁడవు. సకల వేదశాస్త్రపారీణుఁడవు. బుద్ధిమంతులలో మేటివి. పరమశివుని భక్తుఁడవు. సామగానముచేయువాఁడవు. అయోధ్యానగరాధీశుఁడగు దశరథుని జ్యేష్ఠపుత్రుఁడగు రామచంద్రుఁడు తండ్రి

మాటచొప్పున నరణ్యావాసముచేయ భార్యతోడను తమ్మునితోడను వచ్చెను. అతఁడు జనస్థానమునఁ బదునాలుగువేవురు రాక్షసుల నొకరుఁడే చంపెను. రాముఁడు తన యాశ్రమమునఁ దానులేనిసమయమున తనభార్య నెవరో యపహరించిరని వెదకుచు రాఁగా వాలిచే రాజ్యభ్రష్టుఁడు గావింపఁబడి నలుగు రనుచరులతో ఋశ్యమూకముననుండిన సుగ్రీవుఁ డతనితో సఖ్యముచేసికొని తన సంకటముఁదీర్ప వాలినిఁ జంపినఁ దాను సీతను వెదకుటకు సాయపడునట్లు ప్రతిజ్ఞచేసెను. రాముఁ డొక్కబాణమున వాలిని గూలనేసి సుగ్రీవుని కిష్కింధ కభిషేకించెను. తరువాత వానరులను నలుదిక్కుల సీతను వెదుకబంపెను. దక్షిణముగ వచ్చినవారిలో నే నొకరుఁడను. సుగ్రీవుఁడు నీ క్షేమమడుగ నట్లాజ్ఞాపించియున్నాఁడు. నీవు ధర్మముతప్పినందున నధర్మఫలము శీఘ్రమున ననుభవింతువు. రాముని కేవల మానవమాత్రుఁడని భావించి యతని ధర్మపత్నిని యపహరించి యతనివిరోధము సంపాదించుకొంటివి. అది గొప్ప యధర్మము. దానిని సవరించుకొను నుపాయము చెప్పెదను. ధర్మాత్ముఁడును సాధుజన రక్షకుఁడును శరణాగతులఁ గాపాడువాఁడునగు రామునియందలి మానవభావము నీకుఁదగదు. రాముఁడు నరరూపముననున్న విష్ణువే అతని భార్యను నీవు సామాన్యస్త్రీయని కేవలమందక త్రైయని యామెను పొందవచ్చునని భ్రమపడుచున్నావు. అట్లెన్నటికిని జరుగదు. నే నొకరుఁడనే నిన్నిచ్చట నీ బంధుమిత్ర దేశసహితముగ నాశ మొనర్పఁగలను. అయిన నది నామతముగాదు. చాలనికాలమగుట నీవు సీతయను కాలపాశమును మెడకుఁ

గట్టుకొంటివి. దేవదానవ గంధర్వ యక్షకిన్నరాదులు ప్రత్యే కముగ వచ్చినను నొక్క సమూహముగ వచ్చినను రాముని నోడింపలేరు. వృత్రాసురునివధించిన ఇంద్రుఁడుగాని ప్రళయ కాలమునఁగోపించు రుద్రుఁడుగాని నలుమొగంబులవాఁడగు బ్రహ్మదేవుండుగాని యుద్ధమున రామునిచే వధ్యుఁడగువానిని రక్షింప వీలులేదు. కనుక రాముని ధర్మపత్నియగు సీతాదేవి నతనికి సమర్పించి నిన్ను, నీబంధువులను, నీరాజ్యమును గాపాడు కొనుము" అనెను. హనుమంతునిమాటలు వినినంతనే కోపా వేశమున రావణుఁడు వానరుని వధించునట్లు ఆజ్ఞాపించెను.

## హనుమంతుని వాలముఁ గాల్చుట.

పుట్టుకచే రాక్షసుఁడయ్యు స్వభావముచేతను చేష్టల చేతను ధర్మము ననుష్ఠించువాఁడును వినయవివేకములు గల వాఁడు నగు విభీషణుఁడు హితకరుఁడగుటచే నణకువతో "అన్నా! నీవు సకలశాస్త్రములు పూర్ణముగఁ దెలిసినవాఁడవు. బుద్ధిమంతులలో మేటివి. రాజనీతిపరుఁడవు. దిగంత కీర్తి నార్జించితివి. కోపము గ్రుడ్డితనముఁ దెచ్చును. అందువలన మంచిచెడుగుల నరయలేకపోదుము. శాంతింపుము. ఏకాలము నను ఏదేశముననుదూతనుజంపుట ధర్మవిరుద్ధము. దూతను దండించువిధములున్నవి. ముండనముచేసి పంపవచ్చును. అంగ విహీన మొనర్పవచ్చును. చబుకుతోఁ గొట్టవచ్చు. ఎవరితనిని పంపిరో వారితో వైరముతగును. వారుచెప్పినంతచేయువాఁడే దూత. అదియునుగాక యితనిని వధించిన సముద్రమును దాఁటి వచ్చువా రెవరును లేరు. నీవు యుద్ధప్రియుఁడవు. నీకెట్లు

యుద్ధము సిద్ధించును? ఇతనిని విడిచిపుచ్చి సైన్యముతోఁ బగవారిమీఁదికిఁ బోవచ్చు" నని యె. మృదువుగను హితముగను బలికిన తమ్ముని మాటలు విని శాంతించి రావణుఁడు "వానరమునకుఁ దోఁక ముఖ్యము. దానికి నిప్పంటించి తోఁక మండుచుండఁగా పురమంతయు ద్రిప్పుఁడు" అనియె. అంత రాక్షసులు మితిమీఱిన సంతోషముతో హనుమంతుని నాలమునకు గుడ్డపేలికలు గావలసినంతచుట్టి నూనెలోఁదడిపి నిప్పంటించిరి. రాక్షసులు గుంపులుగూడి హనుమంతుని వీధులవెంటఁ బట్టుకొనిపోయిరి. రాక్షసులు భేరులు, డప్పులు వాయించుచు హనుమంతుని వెంట నుత్సాహముతో నడిగిరి.

రాక్షసస్త్రీలు సంతోషముతో "సీతా! నీతో మాటలాడుచుండిన వానరుని తోఁకకు నిప్పంటించి వీధులవెంబడి వాద్యఘోషములతోఁ గొనిపోవుచున్నా" రనిరి. అంత సీతాదేవి మిక్కిలి చింతించి "అగ్నిదేవా! నేను రామునియం దచంచల భక్తిగలిగి పతిశుశ్రూషలు చేసియుంటి నేని నీవు హనుమంతున కెంతమాత్ర ముష్ణబాధఁగలిగింపరాదు. రాముఁడు నన్ను పొందుటకు సుగ్రీవుఁడు రామునిపట్ల నిశ్చలమనస్సుతో తగినసాయము చేయనెంచుట నిజమగుచో హనుమంతునకుఁ జల్లదనము గలిగింపుము" అని ప్రార్థించెను.

అంత హనుమంతుఁడు తనలో "ఆహా! ఏమి యాశ్చర్యము! సముద్రమధ్యమున మైనాకపర్వతము గనిపించుట, నా తోఁకయందలి నిప్పు చల్లగనుండుట మున్నగునవి రామచంద్రునకును సీతాదేవికిని నాతండ్రికిని నాయందుగల యనుగ్రహమే కారణ"మనుకొని యానందించెను.

## లంకాదహనము.

బుద్ధిశాలియగు హనుమంతుఁడు "ఇఁక నా కర్తవ్య మేమి? ఇదివఱలో సీతనుజూచితిని, అశోకవన ధ్వంసముచేసితిని, కొందఱ రాక్షసుల వధించితిని, రావణుని దర్శించితిని, విభీషణునిబుద్ధి నెఱిఁగితిని. ఇచ్చటి దుర్గములను గొంత నాశనముచేసిన నాయత్నము సఫలమగును" అనెను. అతఁడు తన వాలముననుండు పెనుమంటతో మహాపార్శ్వుని, వజ్రదంష్ట్రుని, శుకుని, సారణుని, ఇంద్రజిత్తుని, కుంభకర్ణుని, విద్యుజ్జిహ్వుని మొదలగు రాక్షసవీరులిండ్లనుగాల్చుచు విభీషణునింటిని గాల్చకుండెను. లంకాపురములోని వీధులలో నిండ్లన్నియు రంగు రంగులజ్వాలలతో మండుచు రకరకముల శబ్దములతో నేలఁ గూలుచుండెను. రాక్షస స్త్రీలు, బాలురు, వృద్ధులు, యువకులు, చాలమంది చచ్చిరి. కొందఱు "అయ్యో సోదరా! యనియుఁ గొందఱు అయ్యో కుమారా! యనియు, పిల్లలు అయ్యో అమ్మా! అయ్యో అబ్బా!" యనియుఁ జచ్చినవారిని గూర్చి హాహాకారములు సేసిరి. లంకాపురములోని రాక్షసులు గుంపులుగుంపులుగాఁ జేరి హనుమంతుని భయంకరకృత్యమును జూచి "ఇతఁడు త్రిపురములుగాల్చిన రుద్రుఁడో? వృత్రాసురునిఁజంపిన దేవేంద్రుఁడో? యమధర్మరాజో? వరుణుఁడో? వాయువో? అగ్నియో? కుబేరుఁడో? వానరరూపమునవచ్చిన దేవతయేగాని సామాన్యవానరుఁడుగాఁడ" నుకొనుచుండిరి. అంతరిక్షమున దేవతలు, గంధర్వులు, విద్యాధరులు, మునులు దుష్టుఁడగు రావణుని పురము మండినందున సంతోషించిరి.

# 15. చూడామణి నిచ్చుట

సీత దహింపఁబడకుండుట.

హనుమంతుఁడు లంకాపురమునుగాల్చి సముద్రమునఁ దనతోఁకను జల్లార్చుకొని తనలో "ఆహా! నేనెట్టిమూఢుఁడను. లంకనుగాల్చితినని సంతోషించుచున్నానే. కాలనిచోటగుపడ లేదే. సీతయు భస్మమైయుండునే. స్వామికార్య వినాశకుఁడ నయితినే. కోపము నన్నుఁజెఱచినది. పాడుకోపమునకుసాటి శత్రువెద్ది? కోపముపూనినవాఁడు గ్రుడ్డివాఁడు. అట్టివాఁడు మేలుకీళ్ళ నెఱుఁగునా? కోపిచేయని యకార్య మేదిగలదు? కోపి గురువునయినను జంపును. చేయరానిపనులఁ జేయును. ఆడరానిమాటలాడును. ఎట్టివారినేని కఠినముగ మాటలాడును. కోపికి వివేకముండదు. అవివేకి కార్యఘాతకుఁడే. నిప్పును నీటితోనార్పునట్లు కోపము నోర్పుతో నణచుకొను మహానీయు లుత్తములు. కోపమునకు వశుఁడగువాఁడు మానవత్వము గోల్పోవును. పశుతుల్యుఁడగును. నేను మహాపాపిని, బుద్ధిహీనుఁడను, నీచుఁడను. ఎవనినిమిత్త మిచ్చటికివచ్చితినో, ఇన్ని పనులుచేసితినో యట్టి రామపత్నియగు సీత మంటలోఁ గాలియుండిన నేను బ్రతికియుండి ప్రయోజనము లేదు. ఈవిషయము దెలిసిన రామలక్ష్మణులు ప్రాణములు విడుతురు. నా కోఁతిబుద్ధిని ముల్లోకములు దూలనాడును. సుగ్రీవుఁడు నన్నెట్లు మన్నించును? అని కొంతసేపాలోచించి మఱల నిట్లనుకొనెను "సముద్రమునఁ గొండ లేచినది. నాతోఁక మండినను నాకు బాధకలుగలేదు. ఇట్టి యద్భుతములు రామునియొక్క-యు

సీతాదేవియొక్కయుఁ బ్రభావమును జాటుచున్నవి. అట్టి వారి ప్రభావము సీతను సంరక్షింపదా? రక్షించియే యుండును. భరతలక్ష్మణశత్రుఘ్నులకు దేవతయు రాముని ధర్మపత్నియు మహాపతివ్రతయు నగు సీతాదేవి యగ్నిని గాల్చఁగలదే. ఆమె నగ్ని గాల్చునా ?" అని పరిపరివిధముల నాలోచించుచుండ చారణులు "ఆహా! లంకలో నన్నిచోట్లు దగ్ధమై బూదికాఁగా సీతాదేవి కెట్టి యాపదలేక సురక్షితముగ నుండుట మిక్కిలి యాశ్చర్యమే" యనుచుండుటను హనుమంతుఁడు విని యూరటఁ బొందెను.

అయినను తాను సీతను ప్రత్యక్షమునఁజూచిపోవలెనని యెంచి శింశుపావృక్షముక్రిందనున్న సీతాదేవినిగాంచి 'తల్లీ! నాభాగ్య మేమనవచ్చును ? పావనమూర్తీ! నీమహిమచే నే నగ్నిబాధఁ బొందనైతిని గాని నీ కెట్టియాపద సంభవించినదో యని భయపడితిని. మఱల నిన్నిప్పుడు చూచి సంతోషించు చున్నాను. అమ్మా! అనుజ్ఞ యిమ్ము. త్వరలో నిన్ను రామ చంద్రుఁడు బొందునట్టి కార్యమును చేయుదును. నీవు ధైర్యము వహింపుము. నీకిఁక మేలుగలుగు"నని చెప్పి యద్దేవికి నమస్క రించి రామునిచూచు తమకంబున నరిష్టపర్వతము నారోహించె ను. అతఁ డుత్తరతీరము సేర నెంచి శరీరమును బెంచెను. అతని యొత్తిడికి పర్వతము క్రుంగి గైరికధాతువులు స్రవించెను. నానావిధ జంతుజాలములు పక్షులు బెదరినవి. అందలి విద్యా ధరులు గంధర్వులును నాకాశమార్గమున నెగిరిపోయిరి.

అంత హనుమంతుఁడు సముద్రమును దాటుచు మధ్య మైనాకపర్వతమును దాఁకి పీడొక్కని రివ్వున బాణవేగమున

మహేంద్రపర్వతమును సమీపించి గొప్ప ధ్వనితో సింహనాదముసేసెను. ఆధ్వని వినిన నంగద జాంబవంతాదులు సంతోషముతో హనుమంతుఁ డగుపడినంతనే జయజయధ్వనులతో నతని నాహ్వానించిరి. అతఁడు గరుత్మంతునివలె మహేంద్ర పర్వత శిఖరమున వ్రాలెను. హనుమంతుఁడు జాంబవంతుఁడు మున్నగు గురువులకును యువరాజగు నంగదునకును నమస్కరించెను. వారు తన్నుఁ బూజింప "చూచితిసీతను"అని సంక్షేపముగఁ జెప్పెను. వానరులెల్ల రతనిని "మహాబాహూ! నీస్వామిభక్తిని పట్టుదలను పరాక్రమమును సూక్ష్మబుద్ధిని గొనియాడఁ దరమా"! యని బహువిధముల నతనిస్తుతించి యుక్తరీతి నుపచరించి యెల్లఱు బండలమీఁదఁ గూర్చుండి తమ్ము విడిచినప్పటి నుండి మఱలఁ దమ్ముఁ గూడుకొనినంతవఱకు జరిగిన విషయములనెల్లఁ జెప్పవలెనని కోరఁగా హనుమంతుఁడు సీతను ధ్యానించి "మిమ్ము వీడ్కొని సముద్రము దాఁటుచుండ బంగారు శిఖరములతో మైనాక పర్వత మడ్డుపడి యాతిథ్యము సేయనెంచిన దానిని దాఁకి నామార్గమునఁ బోవుచుండ సురసయను నాగమాత రూపముఁ బెంచికొని యోజనముల విస్తీర్ణముగ నోరుదెఱచుచుండ నేను నట్లుచేయుచుఁ దటాలున సూక్ష్మ రూపమున నామెనోటిలోఁ బ్రవేశించి యామెను మెప్పించి యామెయనుజ్ఞఁ బొంది పోవుచుండ సింహికయను రాక్షసి ఛాయారూపమున నన్నుఁ గ్రిందికి లాగి భక్షించెదనని నోరు తెఱువఁగా నేనందుఁ బ్రవేశించి యామె ప్రేవులఁ జీల్చి చంపి లంకాపురము ప్రవేశింపఁబోవ లంకాదేవి నన్నడ్డగించినది. నేనామె నెడమ చేతితోఁ గ్రుద్ది సంధ్యాకాలమునఁ బిల్లియంతరూపమున

లంకలోఁ బ్రవేశించి రాత్రియంతయు వీథులలోను యిండ్ల యందును రాజాంతఃపురములందును బుష్పకవిమానమునందును వెదకి సీతాదేవిని గానక విసిగి మఱల యశోకవనమునఁ గ్రూరరాక్షసస్త్రీలమధ్య గృశించి దుఃఖముతోనుండు సీతాదేవిని దర్శించితిని. రావణుఁడామెను భయపఱచినవిధమును జూచితిని. ఆమెకు రామునివృత్తాంతమంతయుఁ జెప్పి యంగుళీయకము నిచ్చి యొప్పించి వీఁపునకొనిపోయెద నంటిని. ఆమె నాబలమును సందేహింప నారూపముఁజూపితిని. కాని యామె రామచంద్రుఁడీ లంకను నాశముచేసి నన్నుఁ గొంపోవలెననియుఁ బరపురుషుని దాకననియుఁ జెప్పినందున నామెచూడామణిని తీసికొని అశోకవనధ్వంసముచేసి కొందఱురాక్షసవీరులఁ జంపి ఇంద్రజిత్తుయొక్క బ్రహ్మాస్త్రమునకుఁ గొంత కట్టువడి రావణునిముందటఁ గొంపోబడితిని. వాఁడు నీ వెవఁడవని యడుగ రామునిబంటుననియు సుగ్రీవునిపంపునవచ్చిన రామదూత నంటిని. అప్పుడు వాఁడు నన్నుఁ జంపునట్లాజ్ఞాపింప నతనితమ్ముఁడు విభీషణుఁడు దూతనుజంపరాదని వారించినంత రావణుఁడు నాతోఁకను గాల్చునట్లాజ్ఞాపించెను. అప్పుడు రాక్షసులు గుడ్డలుచుట్టి నాతోఁకనుగాల్చిరి. నేను లంకను భస్మముచేసితిని. సీత దహింపఁబడెనేమోయని శంకించి మఱల నామెను జూచి యామెయనుజ్ఞఁ బొంది మిమ్ముఁ గలసికొంటిని. ఇఁక జరుగవలసిన కార్యమును గూర్చి యాలోచింపుఁడ" నెను.

మఱల హనుమంతుఁడు "సీతాదేవి పరమపతివ్రత. సదా రామునే స్మరించుచున్నది. ఆమె యొకేవస్త్రమును

ధరించి మలినమైన శరీరముతో నేకవేణియై శోకసాగరమున మునుఁగుచు మహాతపస్వినియైయున్నది. అట్టి మహాసాధ్విని గొనిపోయి రామునిసన్నిధానముచేర్చుటకంటె నుత్తమకార్య మేమున్నది? మీయెల్లర యనుజ్ఞయైనచో నేను మఱల లంక కుఁబోయి యాసాధ్విని గొనివత్తును. నేనొక్కఁడే రావణుని సపరివారముగఁ గూల్తును. జాంబవంతుని కదలింపఁగలవా రెవరు? మన యువరాజగు నంగదునిపరాక్రమము సాటిలేనిది. పనసుని, నీలుని, మైందద్వివిదుల పరాక్రమంబులు తులలేనివి. రావణుని నీచంపు మాటలకు సీతాదేవి యిచ్చినట్టి యుత్తరములు మిక్కిలి పొగడఁగినవి. ఆబిడ భర్తయందలి గౌరవముచే నూరకున్నదిగాని క్షణములో నా రావణుని నీఱుఁజేయఁగలదు. ఆమెశోకమున కంతముగలుగు మార్గమెద్ది?" యనెను. అంగదుఁడును హనుమంతునివలె మఱల లంకకుఁబోయి సీతాదేవిని గొనివచ్చి రాముని సన్నిధానమున చేర్చవలె" ననెను. అంత జాంబవంతుఁడు "రాజకుమారా! నీమాటలు మాకు నచ్చినవిగాని రాముని సంకల్ప మట్లుగాదు. దానిని జవదాటరాదని నామత" మనెను.

అంతనా వానరులు రాముని సందర్శించు నుత్సాహముతో నాకాశమున వేగముగఁబోయి సుగ్రీవుని మేనమామయగు దధిముఖుని యధీనములోనున్న మధువనముఁజొచ్చిరి. వానరు లంగదునిఁజూచి "తేనియఁద్రావ ననుజ్ఞయి"మ్మనిరి. అతఁడు జాంబవదాది వృద్ధులనడిగి యనుజ్ఞయిచ్చెను.

వెంటనే వానరులు తేనెను వారివారి యిష్టానుసారము పానముచేసి మత్తిల్లి యొడలుమఱచి యొకరినొకరు త్రోయు

ట, ఈడ్చుట, పరుగెత్తుట, దుముకుట, చెట్టుపై కెక్కి నేలకు దూకుట, యొండొరులఁబట్టికొని పాడుట, యాడుట, నాట్యమాడుట, నవ్వుట, ఒకరితోఁక నొకరు పట్టుకొని చెట్టుపై కెక్కుట, ఒకరినిచూచి యొక రేడ్చునట్లు నటించుట మున్నగు పెక్కుచేష్టలుచేసి చెట్లకొమ్మలు విఱిచి చిందరవందరఁ జేయ దధిముఖుఁడు వారిని వారించెను. అప్పుడు వానరు లతనిఁ గొట్టి తిట్టి పలుపాట్లు పెట్టించిరి. అంత నతఁడు దుఃఖముతోఁ బోయి సుగ్రీవునిపాదముల నాశ్రయించి మధువనమును అంగదునియాజ్ఞఁగొని వానరులు ధ్వంసముచేయుచుండ, వారించినందునఁ దన్ను హింసించిరని మొఱఁబెట్టికొనెను. వెంటనే సుగ్రీవుఁడు సంతోషించి వానరులు సీతాదేవిని కనుగొని వచ్చిరని లక్ష్మణునితోఁ జెప్పెను. అతఁడు వానరుల నతిశీఘ్రముగ రమ్మని దధిముఖునితోఁ జెప్పి పంపెను. సుగ్రీవుఁ డతిముదంబున లక్ష్మణునిఁ జూచి "హనుమంతుఁడే సీతాదేవిని చూచివచ్చియుండును. వేఱొకనికది యసాధ్యము. అట్టిసంతోషములేకున్న బ్రహ్మదేవునిచే నాతండ్రి కొసఁగఁబడిన దివ్యమగు మధువనమును ప్రవేశింప సాహసింపరు" అనెను. ఆ మాటలు రామచంద్రుఁడును విని సంతసించెను.

## హనుమంతుఁడు చూడామణి నిచ్చుట.

దధిముఖుఁడు వేగముగ మరలివచ్చి యంగదునిఁజూచి "ప్రభూ! నీవు యువరాజవు. నిన్ను గౌరవింపలేదని కోపింపకుము. నీపినతండ్రి నామాటలువినియుఁ గోపింపక " వానరు

లను శీఘ్రముగరమ్మను" మనెను. అంత నంగదుఁడు "మిత్రులారా! సుగ్రీవునాజ్ఞయైనది. రాముఁనకు నీవృత్తాంతము దెలిసి యుండును. మనమిఁక తామసింపరాదని తోఁచుచున్నది. మీ రిప్పుడు కార్యము సాధించినవార లగుటచే నేను మిమ్మాజ్ఞాపింపరాదు. మీయిష్టము ననుసరించుట నాకుధర్మ"మనెను. అందులకు వానరు లతని మెచ్చుకొని బయలుదేరిరి. వారు వాయుమార్గమున వాయువేగమున సుగ్రీవుని సన్నిధిఁ జేరిరి. అంత హనుమంతుఁడు సుగ్రీవునకు శిరము నేలసోఁక నమస్కరించి రామునకు నఖ్లేచేసి "పతివ్రతానియమముతో సీతాదేవి సుఖముగనున్న"దని చెప్పెను. రామలక్ష్మణులు సీతాదేవి క్షేమసమాచారమువిని సంతోషించిరి. రామచంద్రుఁ డామె వృత్తాంతము విశదముగ వినఁగోరెను. అంత హనుమంతుఁడు "రామచంద్రా! దక్షిణసముద్రమునుదాఁటి లంకనుబ్రవేశించి రావణునియుద్యానవనమగు నశోకవనమున రాక్షసస్త్రీలమధ్య నీయెడఁబాటుచే మాటిమాటికి నిట్టూర్పువిడుచుచు శోకపరాయణయగు నీధర్మపత్ని సీతాదేవిని చూచితిని. ఆమె నీయందే మనసుగలిగినదై రావణుని బెదరింపులకు నిశ్చలమనస్సుతోఁ దన పాతివ్రత్యనియమమును జెప్పినది. వాఁడిచ్చిన గడువు లోపల నీరాక నెదురుచూచుచున్నది. ఆమె యానవాలుగ నిచ్చిన చూడామణిని భద్రముగఁ దెచ్చితిని. ఆమెకొఱ కిదే యామెయాజ్ఞచొప్పున శిరమునేలసోఁక నమస్కరించుచున్నాను. ఆమెయిట్లు చెప్పెను. "ఒకదినము నానొసట తిలకముగనఁబడకయుండ నీవు మణిశిలను బొట్టుగాఁ బెట్టితివి. దీనిని జ్ఞప్తికిఁ దెచ్చికొమ్ము. చిత్రకూటమునఁ గాకాసురుని బ్రహ్మాస్త్ర

ప్రయోగమున దండింపనెంచి శరణాగతుఁడగుట రక్షించితి వే. ఇఁక నెలదినములుగడువు. అంతలో నీవునన్ను గొనిపొమ్ము".

రామచంద్రుఁడు చూడామణిని ఱొమ్మున నుంచికొని లక్ష్మణునిఁగూడి దుఃఖించి "లక్ష్మణా! వివాహకాలమున జనకుఁడు దీనిని సీతకిచ్చెను. దీనినిచూచినంతనే సీతయొక్క తల్లి మనతండ్రిదశరథుఁడు సీత ముగ్గురనుచూచినట్లున్నది. లక్ష్మణా! సీతలేక నాకీయాభరణముచూచిన దుఃఖమేగాని సంతోషము లేకున్నది. దీనిని శిరమునధరించిన సీత నాయొద్దనుండిన నాకెంతసంతోషము గలుగును."

మఱల రాముఁడు హనుమంతునిఁ జూచి "సీతచెప్పిన మాటలనన్నిఁటిని విశదముగఁ జెప్పు" మనియె. అంత హనుమంతుఁడు "రామచంద్రా! చిత్రకూటమున నొకసమయము నీవును సీతయు నిద్రించితిరి. సీత ముందు లేచెను. అప్పుడొక కాకి యామె స్తనమును బొడిచెను. నీవామెతొడపై తల నిడుకొని నిదురించితివి. ఆకాకి మఱల నామె స్తనమును బొడిచెను. అప్పుడు రక్తబిందువు పడుటచే నీవులేచి కారణముదెలిసికొని దర్భాసనమునుండి దర్భముక్కనుదీసి బ్రహ్మాస్త్రముమంత్రించి ప్రయోగించితివి. అది మండుచు నింద్రతనయుఁడగు కాకిని తఱిమెను. దానిని తల్లి, తండ్రి, ఋషులు, దేవతలందఱు రక్షింపరైరి. అది తుదకు నిన్నే శరణుజొచ్చెను. శరణాగతరక్షకుఁడవగు నీవద్దాని కుడికన్ను నా బ్రహ్మాస్త్రమునకర్పించి దానిని గాపాడితివి. అప్పుడది నీకు నమస్కరించి తనస్థానముచేరెను" అనెను. నాకొక యానవాలిమ్మని నేనడుగ నామె తన చీర

కొంగున ముడివైచికొనియున్న చూడామణి నిచ్చెను. నేను పయనమునకు నా యాకారము పెంచుచుండ నామె దుఃఖించి మాటిమాటికి "ఆంజనేయా! నన్నీ దుఃఖసముద్రమునుండి దాటించి గట్టుచేర్చువాఁడు నీవేయని నమ్మియున్నాను. అతి శీఘ్రమున నా నాథునితోఁ జేరుటకుఁ దగిన యుపాయము వెదకు"మని చెప్పినది. ఆమె సుఖముగనున్న" దనెను.

మఱల హనుమంతుఁడు "రాఘవా! పయనమగు నన్నుజూచి సీత "వానరా! ఒక్కదినముండిపొమ్ము. నీరాకచే నేను శోకమువిడిచినదాననైతిని. నా కిప్పటిదిక్కు నీవే. ఈ దాఁటరాని సముద్రమును వానరులు దాఁటి యెట్లు వత్తురు? ఈ రావణాది రాక్షసులతోఁ బోరి నన్ను రాముఁ డెట్లు పొందు"నని యడుగ నేను "జానకీ! భయపడకుము. నేను నీ విషయమునంతయు రామున కెఱిఁగించిన వెంటనే లెక్కలేని వానర భల్లూకసైన్యములతో సుగ్రీవుని సాయమున రామ లక్ష్మణు లిచ్చటికివచ్చి రావణాది సకలరాక్షసులను నిర్మూ లముచేసి నీ దుఃఖముపోగొట్టుదురు. రాముఁడు వనవాసకాల ము తీరినంతనే నిన్ను వెంటఁగొని యయోధ్యకుఁబోయి పట్టాభిషేకముచేసికొని నీతో సుఖముగనుండి రాజ్యమును పాలించి కీర్తిపొందు" నంటిని. అప్పు డామెకు సంతోషము గలిగినది" యనెను.

సుందరకాండము సమాప్తము.

శ్రీ

# రామాయణరత్నాకరము

గ్రంథకర్త

వంగీపురం రంగస్వామయ్యంగారు

పాకాల

హక్కులు మా యధీనము ]

[ వెల ఒక రూపాయి.

# విషయసూచిక.


| | | | పుట |
|---|---|---|---|
| 16. విభీషణ శరణాగతి | ... | ... | 1 |
| రామాదులు సముద్రతీరము సేరుట | | ... | 1 |
| రావణుఁడు మంత్రులతో నాలోచించుట | | ... | 4 |
| విభీషణుఁడు మంచి హితము చెప్పుట | | ... | 8 |
| విభీషణుఁడు రావణుని వీడిపోవుట | | ... | 9 |
| రామ విభీషణ సమాగమము | ... | ... | 11 |
| విభీషణుఁడు రాముని శరణుఁజొచ్చుట | | ... | 12 |
| రామ విభీషణ సమాగమము | ... | ... | 21 |
| 17. నాగపాశ బంధము | ... | ... | 24 |
| సేతువుగట్టుట | ... | ... | 24 |
| యుద్ధసన్నాహములు | ... | ... | 25 |
| రాముని మాయాశిరమును సీతకుఁజూపుట | | ... | 28 |
| సరమ సీత నోదార్చుట | ... | ... | 30 |
| రాముఁడు లంకనుజూచుట | ... | ... | 33 |
| రావణ సుగ్రీవుల ద్వంద్వయుద్ధము | | ... | 34 |
| అంగద రాయబారము | ... | ... | 35 |
| సీత దుఃఖించుట | ... | ... | 38 |
| రాముఁడు చింతించుట | ... | ... | 40 |
| 18. కుంభకర్ణవధ | ... | ... | 43 |
| ధూమ్రాక్షుఁడు | ... | ... | 43 |
| వజ్రదంష్ట్రుఁడు | ... | ... | 44 |
| అకంపనుఁడు | ... | ... | 45 |
| ప్రహస్తుఁడు | ... | ... | 46 |
| రావణుఁడు యుద్ధమునకు వచ్చుట | | ... | 47 |
| కుంభకర్ణుని మేలుకొలుపుట | ... | ... | 51 |
| రావణ కుంభకర్ణుల యాలోచనలు | | ... | 53 |
| కుంభకర్ణుఁడు యుద్ధముచేయుట | | ... | 55 |
| 19. లక్ష్మణుఁ డింద్రజిత్తును వధించుట | | ... | 61 |

| | | | |
|---|---|---|---|
| | త్రిశిరాదులు యుద్ధమునకు వచ్చుట | ... | 61 |
| | అతికాయ వధ ... | ... | 62 |
| | రామలక్ష్మణుల మూర్ఛ ... | ... | 63 |
| | మకరాక్షుని రాముఁడు వధించుట | ... | 69 |
| | ఇంద్రజిత్తు యుద్ధమునకు వచ్చుట | ... | 70 |
| | రామలక్ష్మణులు సీతనుగూర్చి దుఃఖించుట | ... | 72 |
| | రాముఁ డింద్రజిత్తును వధింప లక్ష్మణునిఁ బంపుట | ... | 75 |
| | లక్ష్మణుఁ డింద్రజిత్తుతో యుద్ధము చేయుట | ... | 76 |
| | సీతను వధింపరాదని రావణునితో సుపార్శ్వుఁడు చెప్పుట | | 82 |
| 20. | రామ రావణ యుద్ధము ... | ... | 84 |
| | మూలబల ధ్వంసము ... | ... | 84 |
| | మహోదర మహాపార్శ్వ విరూపాక్షుల వధ | ... | 85 |
| | రావణుఁడు యుద్ధము చేయుట ... | ... | 86 |
| | రావణ వధ ... | ... | 90 |
| | విభీషణ విలాపము ... | ... | 91 |
| | మండోదరి విలపించుట ... | ... | 92 |
| 21. | శ్రీరామ పట్టాభిషేకము ... | ... | 100 |
| | విభీషణ పట్టాభిషేకము ... | ... | 100 |
| | హనుమంతుఁడు సీతను దర్శించుట | ... | 101 |
| | అగ్నిప్రవేశము ... | ... | 105 |
| | రాముఁడు సీతను స్వీకరించుట ... | ... | 111 |
| | ఈశ్వరుఁడు రాము ననుగ్రహించుట | ... | 112 |
| | అయోధ్యకుఁ బయనమగుట ... | ... | 115 |
| | భరద్వాజాశ్రమము ... | ... | 118 |
| | హనుమంతుని భరతునొద్దకుఁ బంపుట | ... | 120 |
| | రామ భరత సమాగమము ... | ... | 123 |
| | శ్రీరామ పట్టాభిషేకము ... | ... | 126 |
| | అభిషేకము ... | ... | 130 |
| | శ్రీరాముని పరిపాలనము ... | ... | 133 |


——:0:——

శ్రీ

# రామాయణరత్నాకరము

## 16. విభీషణశరణాగతి

### రామాదులు సముద్రతీరముసేరుట.

సీతాదేవినిగూర్చి హనుమంతుఁడు చెప్పిన మనోహరములగు వాక్యముల కొనాదించి రామచంద్రుఁడు సుగ్రీవాదులం జూచి " ఆహా! గరుత్మంతుఁడును వాయుదేవుఁడును గలసి చేయఁగల కార్యమును హనుమంతుఁ డా సముద్రమును దాఁటుటచేఁ జేసినవాఁడయ్యె. ఇట్టి యద్భుతకార్య మెవరు నింతకు ముం దెన్నఁడు చేసియుండలేదు. హనుమంతుని శక్తిసామర్థ్యములు వర్ణింప నశక్యము. యజమానుని యాజ్ఞ ననుసరించి కార్యము సాధించుటయేగాక దాని కనుగుణముగ నంతకంటె నెక్కువగఁ జేసినభృత్యుఁ డుత్తముఁడు. యజమానుఁడు చెప్పి నంతమాత్రమే చక్కఁగఁ జేయువాఁడు మధ్యమ భృత్యుఁడు. యజమానుఁడు చెప్పియుఁ జేయనివాఁ డధముఁడగును. హనుమంతుఁడు సముద్రమునుదాఁటి, చొరనలవిగాని లంకలోఁ బ్రవేశించి యెదిరింప వీలుగాని రాక్షసులబారినుండి తప్పించుకొని యశోకవనధ్వంసముచేసి రాక్షసవీరులఁ బరిమార్చి రావణునకు హితముసెప్పి సామోపాయము నుపయోగించి విఫలుఁడై లంకనుదహించి సీతనుజూచి యానవాలిచ్చి యానవాలు గైకొని సురక్షితముగ మనలఁ గూడిన విధమునుజూడ

హనుమంతుని ప్రభావము మిక్కిలి పొగడఁదగినదగుట నందుల కతని కీయఁదగిన బహుమాన ముత్తమమైనదిగ నుండవలెను. అట్టిది నా పరిష్వంగమే" యని హనుమంతుని కౌఁగిలించెను. ఇట్టి యసాధారణ గౌరవమునకు హనుమంతుఁ డెంతయుఁ దగినవాఁడని యిఁకముందు జరుగబోవు విషయములవలన స్పష్టమగును.

భయంకరమగు సముద్రమును వానరులెల్ల రెట్లు దాఁటగలరని రాముఁడు ఖిన్నుఁడై యుండ సుహృన్మఁడగు సుగ్రీవుఁడు "రఘువీరా! రాబోవువిషయములఁ దెలిసిన నీవు సామాన్యునివలె శోకింపఁదగదు. సీతయున్నచోటు తెలిసినది. ఈవానరులు కామరూపులు, కామగమనులు. వీరి నందఱిని దక్షిణతీరము చేర్చుభారము నాది. శోకమువలన నుత్సాహము చెడును. అందువలన దైన్యముగలుగును. దానివలన నర్థము నశించును. అందువలన నాపద సంభవించును. కనుక శోకమువిడువుము. ధైర్యమువహింపుము. ఉత్సాహముతోఁ గార్యమునకుఁ గడంగుము. క్షత్రియునకు ధర్మయుద్ధము కర్తవ్యము. కోపముపూనకున్నఁ బౌరుషముసున్నయగును. కనుక రామచంద్రా! నీకేజయముగలుగును. కొన్ని మంచిశకునము లును గలుగుచున్నవి" యనెను.

సుగ్రీవుని హితవచనములువిని శోకముడిఁగి రాముఁడు హనుమంతునితో "ఆ లంకానగరదుర్గప్రాకారము లెటులున్న వో వివరింపు" మనెను. అంత మాటలపొందునెఱిఁగిన హనుమంతుఁడు "రాఘవా! లంకానగరము త్రికూటపర్వతముమీఁద నున్నతమగు ప్రాకారములతోను, లోతైన యగడ్తలతోను

శత్రువుల నిరోధింపఁదగు సాధనములతోను గూడి యజేయ ముగనున్నది. రావణుని బలపరాక్రమము, తపఃప్రభావము, కుబేరాదుల జయించి తెచ్చిన పుష్పకవిమాన మద్భుతములు. అతనియైశ్వర్యము సాటిలేనిది. అతఁడు రథగజతురగపదాదుల నాయాచోట్లనుంచి పురద్వారముల సంరక్షణకుం దగిన బలముల నందం దునిచి గూఢచారులమూలమున శత్రువుల గుట్టుమట్టులు తెలిసికొనుచు శాస్త్రకోవిదులును మంత్రనిపుణులును బలపరాక్రమములుగల మంత్రులతోను మహాబలులగు కుంభకర్ణ నికుంభాదులతోను దేవేంద్రుని జయించిన మహాశూరుఁడగు తనకుమారుఁడింద్రజిత్తుతోనుగూడి శత్రువు లెదిరింప వీలుగాని తేజముతో వెలయుచున్నాఁడు. నేనిప్పటి కతని సైన్యములో నాలవవంతు నాశముచేసితిని. మనలో నంగదుఁడు, ద్వివిదుఁడు, మైందుఁడు, జాంబవంతుఁడు, నలుఁడు నీలుఁడు, పనసుఁడను వీరశిఖామణు లా నగరమును సమూలముగ నిర్మూలింపఁగలవారు. వారి కతిశీఘ్రమున నాజ్ఞయిమ్మ" నెను.

హనుమంతుఁడిట్లుచెప్పినంత రామచంద్రుఁడు సుగ్రీవుని జూచి "ఇప్పుడు సూర్యుఁడు మధ్యాకాశమున నున్నవాఁడు. ఇది యభిజిన్ముహూర్తము. ఇది జయముగలిగించును. ఇప్పుడే బయలుదేరుదము. నాకు నేఁడు సాధనతారయగును. నా కుడికన్నదరుచున్నది. ఇది మంచిశకున"మని చెప్పి సర్వసేనాని యగు నీలునిఁజూచి "నీలా! గజుఁడు, గవాక్షుఁడు, గవయుఁడు గొప్పసేనలతో ముందు నడువవలెను. ఋషభుఁడు కుడివైపునను, గంధమాదనుఁ డెడమవైపునను సైన్యములతో

వత్తురుగాక. నేను హనుమంతు నెక్కి సైన్యమధ్యమునవత్తును. లక్ష్మణుఁ డంగదు నారోహించి వచ్చును. జాంబవంతుఁడు, వేగదర్శి, సుషేణుడు, ధూమ్రుఁడు వెనుకభాగమున వత్తురు గాక”యని యాజ్ఞాపించెను. వానరసైన్యములు నదులు, గిరులు, వనములు, పట్టణములు, పల్లెలు గడచి సింహనాదములు సేయుచు నమితోత్సాహముతోఁ బోవుచుండెను. ఆ సైన్యములో వానరులొకవైపు, కొండముచ్చులొకతట్టు, భల్లూకములొకవైపునను సేనాపతుల నాజ్ఞల ననుసరించి యాకాశము వన్నెగల సముద్రపుగట్టు చేరిరి. నీలుఁడు వానరయూథపతులకుఁ దగిన కట్టుదిట్టములు చేసెను.

ఇట్లుండ రాముఁ డా సముద్రమునుజూచి లక్ష్మణుని వైపు తిరిగి “సౌమ్యా! కాలక్రమమున శోకము తగ్గునుగదా. నాకది హెచ్చుచున్నది. సీతావియోగదుఃఖము నాకు భరింపరానిదిగనున్న”దని చెప్పి “ఓవాయుదేవా! నీవు సీతనుదాకి నన్నుఁదాకుము. అందుచేనైనను సీతనుదాకినసుఖము నే నను భవింతును.” నేనీ భూమిపైఁ బఱుండిన సీతయు నేలమీఁద నుండుటచే నొకేభూమి మా యిరువురకు శయ్యగనుండుటచే నేనామెతోనున్నాననియే భావించెద” ననిన లక్ష్మణుఁ డోదార్చ శాంతించి సంధ్యావందన మర్పించెను.

## రావణుఁడు మంత్రులతో నాలోచించుట.

అఁట లంకలో రావణుఁడు సభయందలి మంత్రులఁజూచి “మతిమంతులారా! ఒక్క హనుమంతుఁడుచేసిన కార్యములను జూడ మనకు హానికలుగనున్నదని తెలియుచున్నది. రాజెట్టి

బుద్ధిమంతుఁడైనను నీతికోవిదులగు మంత్రులతో మంచిచెడుగు లాలోచించి వారి యెల్లరి యామోదముతోఁ బనులుచేయునో వాఁడే జయముపొందును. కావున రామునివలనఁ గలుగఁగల యాపద నెట్లు తప్పించుకొని నా కోరికఁ దీర్చుకొనఁగలనో యాలోచించి మీమీ యభిప్రాయములఁ జెప్పు"డనెను.

వెంటనే నీతినియమములుగాని సాధకబాధకములుగాని తెలియని రాక్షసులు "మహారాజా! ఈశ్వరుని చెలికాఁడును మహాబలుఁడును యక్షుల కధిపతియునగు కుబేరుని జయించితివి. నాగులను దానవులను బ్రాణాంతకుఁడగు యముని సకల దిక్పాలురను దేవేంద్రుని జయించిన నీకు సామాన్యమానవుఁడగు రాముఁడెంత?" యనిరి.

సేనాపతియగు ప్రహస్తుఁడు లేచి 'ప్రభువరేణ్యా! దేవ దానవ నాగ యక్ష గంధర్వులు నీకు బానిస లగుదురు. ఈ యల్పవానరు లేమిచేయఁగలరు? ఆజ్ఞాపింపుము. ప్రపంచమున వానరశబ్దము లేకుండునట్లు చేసివత్తు" ననెను. దుర్ముఖుఁడను వాఁడు "ఒక్కవానరుఁడువచ్చి మనమిందఱుండ లంకజొచ్చి కాల్చి వీరు లనేకుల వధించెనే. ఆజ్ఞాపించిన ముల్లోకములలో వానరులు లేకుండఁ జేసివత్తు" ననెను. వజ్రదంష్ట్రుఁడు లేచి "రాజా! నేనుమాత్రమేపోయి రామలక్ష్మణులను సుగ్రీవుని హతముచేసి వానరులఁ ద్రుంచి వత్తును. మనలోఁ గొందఱు మానవరూపమునఁబోయి "రామచంద్రా! మేము భరతుఁడు పంపఁగా వచ్చితిమి. నిన్ను గొనిరమ్మని పంపెనని చెప్పిన రాముఁడు వారితోఁ బోవును. అప్పుడు మేమా వానరసైన్యము నాశముచేతు" మనెను. కుంభకర్ణుని కుమారుఁడు నికుంభుఁడు

లేచి "మీరంత యిచ్చట మహారాజుతోనుండుఁడు. నేనొకఁడనే రామలక్ష్మణులను సుగ్రీవ హనుమదాది వానరులను జంపివత్తు" ననెను.

అప్పుడు నికుంభుఁడు, రభసుఁడు, సూర్యశత్రుఁడు, మహాపార్శ్వుఁడు, మహోదరుఁడు, ఇంద్రజిత్తు మున్నగువారెల్లరు తీక్ష్ణములగు నాయుధములతో రావణునిజూచి "ప్రభూ! ఆజ్ఞయిమ్ము. ఇప్పుడే మేమందఱము పోయి శత్రువుల నిర్మూలము చేసివత్తు"మనిరి. అంత విభీషణుఁడు వారినెల్లఁ గూర్చుండఁజేసి నమస్కరించి "అన్నా! తొందరపడి చేయుపనులు సఫలముగావు. శత్రుబల మెట్టిదని యాలోచించుట యుక్తము. రాముఁడు బలహీనుఁడుగాఁడు. ఖరదూషణాదులఁ బదునాల్గువేవుర నొకఁడే వధించెను. అందుచే నతఁడు క్రూరుడందురా? తొలుత నతనిమీఁది కెత్తిపోయినవారలు రాక్షసులే. హనుమంతుఁ డల్పబలుఁడనుట నిజముగాదు. సముద్రమును దాఁటుట సామాన్యమా? నీవుపంపిన సైన్యము నంతయు నొక్కఁడే హతముసేసెనే. లంకాపురము సకలైశ్వర్యములతోఁ దులతూగుచున్నది. నీవు మహోన్నతదశయందున్నావు. ఇట్టి రాజ్యమును నిన్ను నీకీర్తిని గాపాడుకొనుము. నేను ప్రియముపలుకువాఁడనుగాను. హితమునే పలుకుచున్నాను. నీక్షేమమే నా క్షేమము. నీయైశ్వర్యమే నాయైశ్వర్యము. నీవుచెడుటనుజూచి యోర్వను. రామునిధర్మపత్నిని పరమపతివ్రతను సీతాదేవిని రామునకొసఁగుము. రాముఁడు తనపట్ల యపరాధముచేసిన వానినిగూడ క్షమించును. సీత నిచ్చివేయుము. సుఖింపు" మనెను. రావణుఁడు సభచాలించి స్వగృహము చేరెను.

విభీషణుఁడు మఱునాఁడుదయము రావణునిగృహము నకుంబోయి హితవాక్యము లెన్ని జెప్పినను రావణుఁడు వినక నతనివీడ్కొలిపి సభామంటపమునకుఁబోయెను. అచ్చట దశ కంఠుఁడు ప్రహస్తునిఁజేరఁదీసి "ప్రహస్తా! సీతనుగొని తెచ్చిన నాఁటినుండియు నా మనసు చెడియున్నది. ఎన్నిదినములుగ నెన్నియుపాయము లుపయోగించినను నన్ను వలవదే. ఆమె రూపలావణ్యములను జూడఁజూడ నాకు మోహము మించు చున్నది. రామాదులను వధించినఁగాని సీత నన్ను బ్రేమింప దని తోఁచుచున్నది"యనెను. అంత సేనాధిపతియగు ప్రహ స్తుఁడు "మహారాజా! కష్టపడి కాననమునుండి తెచ్చిన తేనెను పానముచేయనివానివలె జనస్థానమునుండి కష్టపడి తెచ్చిన సీతతో సుఖింపకుండుటఁ దగదు. బలాత్కారమునకైన నామెను వశపఱచుకొనుము. నేనుండ నీ కెంతమాత్రము సందేహ మక్కఱలేదు. రామాదుల ససైన్యముగఁ దునుమాడుదును" అనెను. అంత రావణుఁడు "మున్నొకపరి పుంజికస్థలయను నప్సరస బ్రహ్మదేవునొద్దకుఁబోవుచుండ నామెను బలాత్కార మునఁ జేపట్టినందున బ్రహ్మదేవుఁడలిగి "నీవెన్నఁడైనఁ బరస్త్రీని బలాత్కరించిన నీతల ముక్కలగు"నని శపించెను. గనుక సీతను దాఁక వెఱతును. రాముఁడు నాపరాక్రమ మెఱుఁగక యుద్ధమునకు వచ్చుచున్నాఁడు. అతనిగతి మీరెల్లఱుచూతురు గాక" యనెను. కుంభకర్ణుఁడు గంభీరధ్వనితో "అన్నా! నీవు మందాలోచన లేనివాఁడవు. సీతను దెచ్చునాఁడు ముందుగ మాతో నాలోచింపనిదోషము నీకిట్టియిక్కట్టు దెచ్చినది. అయి నను నేను శత్రువులజయించి నీకు మేలుచేసెద" ననెను.

## విభీషణుఁడు మఱల హితముసెప్పుట.

---

వీరిమాటలు విని ధర్మస్వభావుఁడగు విభీషణుఁడు నమస్కరించి "రాజా! సీత నీపాలిటి కాళసర్పమని యెంచుము. ఆమె స్త్రీరూపముననున్న నీ మృత్యుదేవతయే. ఆమెను రామునకిచ్చినఁగాని నీకుఁ బ్రాణము దక్కదు. ఈ ప్రహస్తుఁడు, మహాపార్శ్వుఁడు, ఇంద్రజిత్తు మఱియెవ్వరేని యుద్ధమున రామబాణమునుండి తప్పించుకొనలేరు. నీవు దేవేంద్రుని మఱుఁగు జొచ్చినను మృత్యుదేవతవశముననున్నను పాతాళమునకుఁ బోయినను రాముఁడు తప్పక వధించును. ఆపదలో రాఁబోవు వినాశము నెఱుఁగక లేనిపోని గర్వంపుమాటలాడు వీరిని నమ్మకుము. నేను నీకు హితమునుగోరి నీకును లంకకును క్షేమమగుమార్గముఁ జూపుదును. యజమానుని శ్రేయముగోరక పొగడుట తగ"దనెను.

ఇంద్రజిత్తామాటలువిని రోషముతో "పినతండ్రీ! ఆహా! ఆశ్చర్యము! పులస్త్యవంశమునఁబుట్టి యిట్టి పిఱికితనమా? నీ భయము నీతో నుంచనిమ్ము. మా కంటఁగట్టకుము. పౌరుషమునకును బరాక్రమమునకును బ్రసిద్ధులమగు మమ్ముఁ దూలనాడెదవా? దిక్పాలురును దేవేంద్రుఁడును మాచే నోడింపఁబడుట నీకుఁ దెలియదా? మాముందట నీయిట్టిమాట చెల్లునా?" యనెను. విభీషణుఁడామాటలువిని "నాయనా! నీవు బాలుఁడవు. అనుభవములేనివాఁడవు. పరాక్రమవంతుఁడవే కాని శత్రువుయొక్క బలమునుగూర్చి నీకెంతమాత్రముఁ దెలియదు. దానినెఱుఁగక యుద్ధసమయమున నాలోచనఁ జెప్పఁబూనుట

సాహసము. ప్రహస్తుఁడొక దుష్టుఁడు. వానిని మించినదుష్టుఁడు మహాపార్శ్వుఁడు. వా రిరువురిని మించినవాఁడవు నీవు. చాలు నీ యాగడములు" అని యన్నవైపు తిరిగి "మహాబాహో! ధన కనక రత్నములతో సీతను రామున కర్పించి ధన్యుఁడవగుటమాత్రమే నీకు మేలగు" ననెను.

## విభీషణుఁడు రావణుని వీడిపోవుట.

---

కేవలము చెవుల కింపుగనుండుటయేగాక అర్థముతోఁ గూడి గొప్ప మేలునుగలిగింపఁదగిన విభీషణునిమాటలు విని యానందించి బుద్ధిని మార్చుకొని యధర్మము విడిచి శాంతము పొంది విభీషణుని మహోపకారమును వేనోళ్ళఁగొనియాడుటకు మాఱు మృత్యువుచేఁ బ్రేరితుఁడైన దుష్టుఁడగు రావణుఁడు కోపముతోఁ బరుషముగ విభీషణునితో "పామున్న యింటిలోఁ గాపురముండవచ్చునుగాని మేకతోలు గప్పుకొనిన తోడేలువలెను, పాలవలె నగపడుచుండు విషకుంభమువలెను, వెలికి మేలుసేయువానివలె నటించి శత్రుపక్షమున నభిమానముగల తోఁబుట్టువుతో సహవాస మెన్నఁటికిఁదగదు. లోకములో దాయాదుల నసవడి నెఱుఁగుదుముగదా. ఒకఁడు విద్యయందును, గుణమునందును, నైశ్వర్యమునందును, పదవియందును, కీర్తియందును గొప్పగనుండిన నతని దాయాదు లసూయాపరులై యాతనిదూషింతురు. మున్ను పద్మవనమను పేరుగల యరణ్యమున నేనుఁగులగుంపు తమ్ముఁ బట్టవచ్చినవారిని చూషఁగాఁ దమలోఁదామిట్లు చెప్పుకొన్నవఁట. "మనకు వేఁటగానివలనఁగాని, తీక్ష్ణమగు నాయుధములవలనఁగాని, పాశము

వలనఁగాని భయములేదుగాని మనలఁబట్టవచ్చువారితోనున్న మనదాయాదివలన భయముగలుగుచున్నది. ఏలన నవి మన గుట్టుమట్టు లరసి మనలఁబట్టికొనఁ దోడ్పడుచున్నవి. గోవులున్నచోట సంపదయు, బ్రాహ్మణులయెడ నింద్రియజయమును, స్త్రీలయెడ చపలబుద్ధియు, జ్ఞాతులవలన భయమును గలవందురు. నీటిలో మొలిచిన తామరాకుపై నీటిబిందువులు పడిన నవి విడివిడిగనుండునట్లు జ్ఞాతులెంతకాలము కూడ వసించినను వారిమనసు గలిసియుండదు. తేనెటీగలు మకరందమును బొందినంతనే యాపువ్వును విడిచిపోవును. అట్లే విభీషణా! నీ విన్నిదినములు నావలన ననేకసుఖము లనుభవించి యిప్పుడు శత్రుపక్షపాతివైతివి. దుష్టులస్వభావ మిట్టిదేయగును. కాకున్న నన్ను గౌరవించక నాకీర్తి నాశమొందువిధముగ మాటలాడుదువా? నీవు గనుక నూరకుంటినిగాని వేఱొకఁడై యుండిన నిప్పుడే చంపియుందును. ఛీ! చాలు నీమాటలు, పాపాత్మావల" యనెను.

ఈవిధమగు తిరస్కారము సహింపలేక విభీషణుఁడు నలువు రనుచరులతో గదలుచేతఁబూని యంతరిక్షమున కెగసి యప్పటికిని యన్నకు హితముచేయనెంచి "రాజా! నీవు జ్యేష్ఠుఁడవు, తండ్రికి సమానుఁడవు. నీమాట కెదురాడను. కాని నీవు నీతిదప్పి యధర్మమార్గమునఁ బోవుచుండుటఁ జూచుచు నూరకుండుటెట్లు? నీవు రాజవు. నీకిట్టిబుద్ధితగదు. మేలుకీళ్ళ నాలోచింపుము. నిన్ను నీ వేరీతినైన రక్షించుకొనుము. నీవు నాపుత్రుఁడని, తమ్ముఁడని, మంత్రియని, సేనానియని, నా బంధువులని నామిత్రులని యెవరెవరిని నమ్ముచున్నావో వారెల్లఱు నీవు

నన్ను దూషించినట్టి దోషముగలవారు. నీమేలునుగోరువారౌ కారు. ఇప్పుడు చెడియుండు నీబుద్ధి యింకను జెడిపి నిన్ను నరకమునకుఁబోనీయ సిద్ధముగనున్నవారని తెలిసికొని యిప్పుడైనను నిన్ను విధిలేకవిడిచిపోవు హితంకరుఁడనగు నామాటవినిసుఖింపు"మని వెడలిపోయెను.

## రామ విభీషణ సమాగమము.

---

రావణునిచే నవమానింపఁబడి యిఁకఁ దన కిచ్చట చోటులేదని తలఁచి తనశరీరములో నొకభాగము వ్రణముచేఁ గ్రుళ్ళినచో దుష్టాంగమును ఖండించి శేషాంగమునకుఁ జికిత్స చేసి రక్షించుకొనుట ధర్మమను న్యాయముననుసరించి, యెన్ని విధముల నెన్ని దినము లెన్నిపర్యాయములు హితముచెప్పినను నధర్మమార్గమును వీడిరానని ధిక్కరించినవాఁ డన్నయైనను విడువకఁ దప్పదని తీర్మానించి శీఘ్రమున విభీషణుఁడు రామలక్ష్మణులుండు సముద్రపుటుత్తరతీరముసేరి సుగ్రీవాది వానరులేమి యపకారముసేయుదురోయని భయఁపడుచు నంతరిక్షమున గదాధరులగు నలువురనుచరులతో నిలుచుండెను.

ఇంతలో సుగ్రీవుఁడు వీరినిచూచి సందేహించి హనుమదాదులఁజూచి "ఆయుధధరుఁడై నలుగురుతోడుగొనివచ్చిన నీశాత్రవుఁడు తప్పక మనకు హానిచేయు"ననినంతనే వానరులు వృక్షములను కొండల నెత్తికొని వారినిచంప ననుజ్ఞ యిమ్మని సుగ్రీవుని గోరిరి. వీరిట్లు మాటలాడుటఁజూచియు నుత్తమోపాయము దెలిసిన విభీషణుఁడు పెద్దగొంతెత్తి "నేను దుర్మార్గుఁడగు రావణుని తమ్ముఁడను విభీషణుఁడను పేరుగలవాఁడను.

ఆ దురాత్ముఁడు నీతినియమములేక జనస్థానమున నొంటరిగ నున్న రామపత్నియగు సీతాదేవినిగొని తెచ్చుచు మార్గమునఁ దన్నడ్డగించిన వృద్ధగృధ్రమగు జటాయువునుజంపి సీతను గటికకావలితో నశోకవనమునఁ జెఱఁబెట్టినాఁడు. ఎట్టి పాప మెఱుఁగని రామునిధర్మపత్ని నతనికిచ్చి రామునిమైత్రిఁగోరుమని నే నెన్నివిధముల బోధించినను మరణముసమీపించినవాని కౌషధము పట్టనట్లు నాహితవచనములు రావణునిమతి కెక్క-లేదు. అతఁడు నన్ను సేవకునివలె నీచముగ నవమానించెను. అంత దానిని సహింపలేక నాఁబిడ్డలవదలి సకలలోకరక్షకుఁ డగు రఘుకులతిలకుఁడగు రాముని శరణువేఁడుమన్నానని యమ్మహాత్ముని కెఱిగింపుఁ" డనెను.

### విభీషణుఁడు రాముని శరణుఁజొచ్చుట.

---

అంత బుద్ధిమంతుఁడగు సుగ్రీవుఁడు లక్ష్మణునిముందట వానరులమధ్య రామునితో "ఈ విభీషణుఁడు రాక్షసుఁడు. పైగా రావణునితమ్ముఁడు. నలువురఁగూడివచ్చినాఁడు. ఆయుధము లున్నవి. శత్రుపక్షపువాఁడు. ఇది యుద్ధసమయము. ఇప్పుడొకవేళ మనకు సహాయముగావలసియుండిన నడవి మనుష్యులుగాని, జీతములిచ్చిగాని భృత్యులఁజేర్చుకొనవచ్చును. శత్రుపక్షపువారి నెన్నఁడును నమ్మి చేయనీయరాదు. వాఁడు శరణాగతుఁడందువా? నీవు శరణాగతరక్షకుఁడని తెలిసినవాఁడు. అందువలన నిన్నుమోసపుచ్చుటకై నీకిష్టముగలుగునట్లు చెప్పినాఁడు. అందెంతమాత్రము సత్యములేదు. రావణుఁడు మన గుట్టుమట్టుల నెఱింగిరమ్మని పంపఁగా వచ్చిన

వాఁడే. సమయముచూచి మనలఁజంపును. రాక్షసులు కామరూపులు, మాయావులు, మఱియుఁ గ్రూరులు. వానిని నమ్మరాదు. కనుక విభీషణుని చేరనీయరా" దనెను. అంత రామచంద్రుఁడు దక్షిణవానరులఁజూచి "మిారాజగు సుగ్రీవుఁడు నాహితముఁగోరి నాకు మేలగువిధమును జెప్పినాఁడు. ఇప్పుడు మిాలో నెవరెవరి కెట్టియభిప్రాయము లుండినవు దాచకఁ జెప్పుట సత్పురుషుల లక్షణము" అనెను. అంత వానరులు "రాఘవా! ముల్లోకములలో నీకుఁ దెలియనివిషయము లేదు. నీవు సత్యసంధుఁడవు, ధర్మాత్ముఁడవు, బుద్ధిమంతులలో మేటివి, మహాశూరుఁడవు, దృఢసంకల్పుఁడవు. నీకన్నియుఁ దెలిసియుండినను వానరులైనను సుహృదులమగుట మమ్ము గౌరవించుటకు నిట్లు మాయభిప్రాయముల నడుగుచున్నావు. మేమును నీయందలి గౌరవభావముచే నీకుఁ దెలిసియున్నను మాయభిప్రాయముల నీయాజ్ఞఁ బాటించి తెలిపెదము" అనిరి. అంత యువరాజును బుద్ధిమంతుఁడు నగు నంగదుఁడు "విభీషణుఁడు శత్రుపక్షమునుండి వచ్చినందున సందేహింపఁదగినవాఁడే. వెంటనే యతనిమాటలను నమ్మరాదు. కుటిలబుద్ధిగలవారెన్నఁడు నిజముపలుకరు. వారితలంపు నితరులకుఁ దెలియనీయక మంచివారివలె నటించి నయముగమాటలాడి నమ్మించి కలసి మెలఁగుచు సమయముఁజూచి కీడుచేయుదురు. ఇతఁడు మన మేమఱుపాటునందునపుడు మనలఁజంపును. లోకములో నొక్కొక్కనియందును గుణదోషము కలిసియేయుండును. గుణము లెక్కువయున్న గ్రహింపవలెను. దోషములెక్కువయున్నఁ ద్యజింపవలెను. కనుకఁ బరీక్షించుట మేల"నెను. శరభుఁడు

లేచి "పురుషసింహా! ఒకచారునిఁబంపి యితనిగుట్టు దెలిసికొని సందేహము తొలగినపిదపఁ జేర్చుకొనవచ్చు"ననెను. వయో వృద్ధుఁడును జ్ఞానవృద్ధుఁడునగు జాంబవంతుఁడు "ఇతఁడు శత్రు పక్షమునుండి వచ్చినవాఁడు. ఇతఁడు వచ్చిన కాలదేశములు యుక్తములుగావు. కనుక నితనిఁజేర్చుట యుక్తముగా" దనె ను. న్యాయాన్యాయములు దెలిసినవాడగు మైందుఁడు లేచి "నరోత్తమా! బుద్ధిమంతు నొకనిఁబంపి మృదుమధురముగ నతనితో మాటలాడి రావణుఁ డేమిచెప్పుచున్నాఁడని యడిగి యుత్తరయుత్తరములవలన సాధువో దుష్టుఁడో తెలిసికొని చేర్చ వచ్చు" ననెను. అంత బుద్ధిమంతుఁడును గొప్పసంస్కారము గలవాఁడును మంత్రిసత్తముఁడునగు హనుమంతుఁడు "నేను బుద్ధిగలవాఁడననియు, మాటలనేర్పరిననియు, రాజనీతిజ్ఞుఁడన నియు ననుభవముగలవాఁడననియు భావించి హితముచెప్ప సాహసింపలేదు. రామునియందలి గౌరవభావ మొక్కటి దానిని పురస్కరించుకొని చెప్పెదను. "మతిమంతులలో నుత్తముఁ డవగు రామచంద్రా! అంగదాదుల వాదములలోని లోపముల నెత్తిచెప్పెదను. నీవందలి యథార్థమును విమర్శించి నీ యిష్టము-చొప్పునఁ జేయుము.

విభీషణుఁడు శత్రుపక్షమునుండివచ్చినాఁడనుట మొదటి వాదము. వచ్చిననేమి? అతఁడు కుచ్ఛితబుద్ధితో వచ్చినవాఁ డనుట చెల్లదు. అట్లుండిన మనకెల్లరకుఁ దెలియునట్లు బహి రంగముగ వచ్చియుండఁడు. చారునిపంపి యతనిగుట్టు తెలిసి కొనుటయు నయుక్తమే. దూరమున మఱుఁగున నుండువాని విషయమునఁ జారులఁ బంపుట. ఎదుటనున్న వానివిషయ

మునఁ జారులఁబంపుట నవసరము. బుద్ధిమంతులగు క్రొత్త వారినిఁబంపి రావణుని యభిప్రాయములు, మాటలెట్టివని యడుగవలెననుటఁ బొసగదు. ఏలనఁ గ్రొత్తగ వచ్చినవానిని తొలుదొలుత నట్లడిగిన నతఁడు చెప్పునా? తప్పు శంకించుచున్నారని తలఁచి వెడలిపోవును. ఇతఁడు వచ్చిన దేశకాలములు యుక్తములుగావనుటయుఁ బొసగదు. ఇతఁడు వచ్చిన సమయమును కాలమును సర్వవిధముల నొప్పియున్నవి. మఱల నాయభిప్రాయముల నిట్లు సంగ్రహించెదను.

రావణుని తమ్ముఁడైనంతమాత్రముననే విభీషణుఁడు నింద్యుఁడుగాఁడు. అన్నదమ్ములలో భిన్నగుణములుగలవారు లేరా? రాక్షసుఁడనుటయా? రాక్షసులలోను మంచివారు గలరు. విభీషణుఁడు రాక్షసచేష్టితములు గలవాఁడుగాఁడు. ధర్మాత్ముఁడు. నీతితప్పనివాఁడు. ఎట్లందురా? రావణుఁడు లంకలో నన్ను జంపున ట్లాజ్ఞాపింప దూతనుజంపుట ధర్మము గాదని యంగవిహీనమో యవమానమో గలిగించినఁ జాలుననినవాఁడు విభీషణుఁడు. మోసబుద్ధితో వచ్చినాఁడందురా? ఎవఁడెంత సమర్థుఁడయినను మనసునందుండు కుచ్ఛితమును కనఁబడనీయక దాఁచలేఁడు. ముఖము అద్దమువంటిది. మనసులోని భావమును జాటకమానదు. విభీషణునిముఖ మెట్టిశంకయు లేకున్నది. ఇతని మాటలయం దెంతమాత్రము తొట్రుపాటులేదు. వానరులెల్లరు వృక్షములను బర్వతముల నెత్తుకొని యుద్ధమునకుసిద్ధపడినను గొంకుజంకు లేక విభీషణుఁడు గంభీరధ్వనితో మాటలాడుచున్నాఁడు. ఇతఁడు వచ్చిన కాలదేశములు యుక్తములే. అక్రమముగఁ బరునిభార్య నపహరించిన

యన్న కనేకవిధములుఁగ ననేక పర్యాయములు తన్నితరు లధి
క్షేపించినను సరకుగొనక హితముసెప్పి విఫలమొంది నిండు
సభలో భృత్యునివలె నవమానపఱుపఁబడు నంతవఱకుఁ దోఁ
బుట్టువుతో వాదించి గత్యంతరములేక సర్వలోక శరణ్యుఁడ
వగు నిన్ను శరణుఁజొచ్చినవాఁడు. ఇచ్చోటి కతఁడు వచ్చుట
యుఁ బొసగియున్నది. దుష్టస్వభావులగు తన బంధుమిత్రులు
నాశమొందుట నిశ్చయమని యెంచి యుద్ధమునకు మనమిచ్చట
సిద్ధముగనుండుటచే శిష్టసహవాసముగోరి ఖరదూషణవధాది
సుగ్రీవపట్టాభిషేక పర్యంతము జరిగిన వృత్తాంతములచే నీ
ధర్మబుద్ధిని యసమాన పరాక్రమమును దెలిసి యధర్మవర్తి
యగు సోదరుని వినాశమును దనకు రాజ్యలాభమునుగోరి
యిప్పు డిచ్చోటికి వచ్చియున్నాఁడు. నిన్ను శరణుఁజొచ్చిన
వాఁడు. కనుక నీయనుగ్రహమునకుఁ బాత్రుఁడేయని నా యభి
ప్రాయము దెలిపితిని. ఇఁకఁ గార్యాకార్య నిపుణుఁడవగు నీవు
నీయిష్టముచొప్పున వర్తింపు" మనెను.

ఇట్లు చెప్పిన హనుమంతుని మాటలు విని రాముఁడు
సుగ్రీవాదుల మాటలచేఁ గలఁతఁజెందియు వసిష్ఠునిమూలమున
వినిన యుపాఖ్యానములు జ్ఞప్తికిరాఁగా వానరులంజూచి "మీ
రెల్లరు నాయందలి యాదరాతిశయమున నా క్షేమముగోరి
చెప్పినమాటలు వినినఁబిదప నాయభిప్రాయము నెఱిఁగించెదను.
'ఎట్టివాఁడయినను స్నేహబుద్ధితో నన్నాశ్రయించిన నేనతనిని
విడువను. అతనివలన నా కెట్టియాపద సంభవించినను సంభ
వించుఁగాక' యనెను. అంత సుగ్రీవుఁడు స్వామిసేవాయణుఁడై
"ఈ రాక్షసుఁ డెట్టివాఁడైన నేమి? దుష్టుఁడైనను సరే. శిష్టుఁ

డైననుసరే. ఇతనితో మనకేమికావలసియున్నది? ఇతఁడెట్టి వాఁడనిమాత్ర మాలోచించినఁ జాలును. స్వర్గసమానమగు మాతృదేశమును వదలి యాలుబిడ్డల విడిచి తోఁబుట్టువును యుద్ధసమయమున విడిచి శత్రుపక్షముచేరినవాఁడెట్టి నీతిపరుఁ డగును? ఇతని కృతఘ్నతాదోషమొక్కటే యితఁడు మనకు మేలుచేయువాఁడుగాఁడని తెలుపుచున్నది. కనుక నతనికి తావిచ్చుట యుక్తముగా" దనెను.

అంత రామచంద్రుఁడు సుగ్రీవుని యభిప్రాయ మెఱిఁగి "ఆహా! సుగ్రీవుఁడు రాజనీతిజ్ఞుఁడు. కాకున్న నిట్టిమాటలు చెప్పునా? అయినను విభీషణుఁడు క్రూరుఁడేయగుఁగాక. ఇతఁడు నన్నేమిచేయఁగలఁడు? నాకపకారముచేయ నెంతమాత్రము సమర్థుఁడుగాఁడు. రాక్షసులేగాదు. దేవ దానవ రాక్షస భూత ప్రేత పిశాచము లాదిగా నొక్కుమ్మడి నామీఁదికి వచ్చినను నా వ్రేలికొనతో వారెల్లర నాశముగావింతును. సుగ్రీవా! నీ వందుల కెంతమాత్రము సందేహింపకుము. సత్పురుషులకు శరణాగతరక్షణము నివారింపరానిది. శరణాగతుని రక్షింపని వాఁడు గొప్పపాపముచేసినవాఁడై నరకము నేపొందును. పూర్వమొకప్పుడొక బోయవాఁడు వనమున నొకచెట్టుమీఁద వసించుచుండినఁ బావురములజంటలో నాఁడుదానిని చంపెను. అప్పుడొక గాలివానలేచినందున వాఁడు చలిబాధచే వణకుచు నా చెట్టుక్రిందికిరాఁగా మగపావురము తనముందటఁ దనభార్యను జంపిన ప్రత్యక్షశత్రువగువాఁడు తనచెట్టువద్దకు వచ్చినంతమాత్రమునఁ దన్ను వాఁడు శరణుఁజొచ్చినట్లెభావించి వాని కగ్నిచేఁ జలిబాధఁబోఁగొట్టి యాఁకలిదీర్పనిమిత్తము దానా యగ్ని

లోఁ బడి ప్రాణముఁగోల్పోయెను. కేవల మొక పక్షి శరణాగత రక్షణ ధర్మము నారీతిని పాటించినది. అట్లుండ మానవుఁడెట్లు పాటించవలెను? అందులో క్షత్రియుఁడనై యుండి శరణాగతుఁడు తనదేశమును గుటుంబమును జ్యేష్ఠభ్రాతను ధనధాన్యములను సర్వముఁద్యజించి నేనుంకుచోటికివచ్చి నేను నీ శరణుఁ జొచ్చుచున్నాను" అనిపలికిన నేనెట్లూరకుండఁగలను?

పూర్వము కణ్వమహర్షి పుత్రుఁడగు కండుమహర్షి యిట్లుచెప్పెను. "శరణువేఁడినవాఁడెట్టి క్రూరుఁడైనను వానిని వధింపరాదు". శత్రుపక్షమునుండి యొకపగవాఁడు కుటిల బుద్ధితో శరణాగతిచేసినను ధర్మశాస్త్రముదెలిసినవాఁడు దన కుఁ బ్రాణహానిగలిగినను దప్పక రక్షించితీరవలెను. దేహబలము బుద్ధిబలము నైపుణ్యముగలిగినవాఁడు 'శరణని' వేఁడిన వానిని ఏకారణముచేనయినను రక్షింపకున్న నతఁడు నరకమునఁ బడును. కనుక "సుగ్రీవా! ఒకఁడొక పర్యాయము "నేను నీవాఁడను, నన్నుగాపాడుభారము నీయదియే. నేను నిన్ను శరణుఁజొచ్చితిని" అనినచో నేనట్టివానిని సకలప్రాణుల నుండి తప్పించి తప్పక సంరక్షింతును. ఇది నా దృఢమైన వ్రతము. దీనికెదు రేదియుఁ గలుగదు".

[ ఇట్టి యుత్తమోత్తమమగు శరణాగతిశాస్త్రమును గొంత వివరింతము. ఈ శాస్త్రమున కాఱంగములు గలవు. 1. చెడుగునువదలుట. 2. మంచినిచేఁబట్టుట. 3. కాపాడునను నమ్మకముగ్గలిగియుండుట. 4. నన్నుగాపాడుమని యడుగుట. 5. ఆత్మను సమర్పించుట. 6. నేను శక్తిహీనుఁడననుకొనుట. విభీషణుఁడీ యాఱంగములతో శరణుఁజొచ్చెనాయని విమర్శిం

త్రము. 1. ధర్మమునుదప్పినయన్నను వదలుటఁ జెడుగును వద లుట యగును. 2. రాము నాశ్రయించుటచే మంచిని చేఁబట్టి ననవలెను. 3. రాముఁడు వాలిని వధించినందున రావణుని వధించి తన్ను గాపాడగలఁడను నమ్మకముగలిగియుండుట యగును. 4. నేను దుష్టుఁడగు రావణుని తమ్ముఁడను. అతనిచే నవమానింపఁబడి నీవేదికఁ-నివచ్చితిననుటఁ దన్ను గాపాడుమని యడుగుట యగును. 5. ఇఁక నేను నీవాఁడనని తనయాత్మను రామునకర్పించుట యైనది. 6. సకలలోకరక్షకుఁడగు రాఘవుని శరణుఁజొచ్చుచున్నాననుటచేఁ దాను దన్నుద్ధరించుకొన లేఁడని తన శక్తిహీనతను జెప్పుకొని యొప్పుకొన్నట్లయినది. ఇట్లు విభీషణుఁడు చేసిన శరణాగతి పరిపూర్ణమైనదనియు నట్టి శరణాగతుని సంరక్షించుట సర్వశక్తుఁడగు రామచంద్రునకుఁ దగిన ధర్మమని తెలియుచున్నది].

సుగ్రీవా! అయినను నీసందేహములను దీర్చెదను. మనము రాక్షసులముగాము. లంకారాజ్యము నపేక్షింపము. ఎట్లన వాలినిఁజంపితినని తెలిసి రావణునిఁజంపఁగలనని నమ్మి వచ్చి నట్లే, నేను కిష్కింధారాజ్యము నపేక్షింపక నీకిచ్చినట్లే రావణునిఁజంపి లంకారాజ్యమును దన కిత్తుననినమ్మి వచ్చినవాఁడే యగును. అదియునుగాక మన కెట్టి యపకారమునేని చేసినఁ దనకు రాజ్యము లభింపదని యెంచుఁగును. మఱియొక ప్రబల కారణమున్నది. ఇతని కంఠధ్వనిలో రావణునివలన భయము గలదని తోఁచుచున్నది. వేయేల? రావణుని తమ్ముఁడుగదా విభీషణుఁడు? నాభార్య నపహరించిన నా ప్రత్యక్షశత్రువగు రావణుఁడే స్వయముగవచ్చినను నేనతని కభయమిచ్చి రక్షిం

తును. కండుమహార్షి చెప్పినట్లును కపోతము చేసినట్లును నేను విభీషణుని శరణాగతి నంగీకరించితిని. ఇంకను నీవొకయాక్షేపము చేయవచ్చును, సోదరుని దిగవిడిచినాఁడని. దుష్టుఁడైనను భ్రాంతి ననుసరింపవలెనని చెప్పుదువేమో. సుగ్రీవా! లోకమునఁ దోఁబుట్టువులందఱు భరతునివలెను, పుత్రులందఱు నావలెను, మిత్రులందఱు నీవలెను నుందురనుకొంటివా? అది యట్లుండె. రావణుఁడు జ్యేష్ఠభ్రాతగదా. తమ్మునకు దారి చూపవలసినవాఁడే. రాజగుటచేఁ బ్రజలకాదర్శప్రాయుఁడుగ నుండవలయునే. పలుమారు పలువిధములుగ ధర్మమును హితమును వివరించియుఁగైకొనక నిండుసభలో నవమానించి "ఛీపొమ్ము" అనినతరువాత నతనితో నుండుట కెట్లువీలగునో యోచింపుము. కనుక నన్నివిధములుగ నాలోచించినను శరణాగత రక్షణము చేసితీరవలెను. అతఁడు నిన్ను నీపరివారమును జూచి తనరాక నాకెఱిఁగింప వేఁడినందునఁ బురుషకారము (సిఫారసు) చేయునట్లు నిన్నడిగెను. కనుక నీవే యతనిని నా వద్దకుఁ గొనిరమ్ము"ని యానతిచ్చెను.

అంత సుగ్రీవుఁడు రామచంద్రుని యుక్తియుక్తములును శాస్త్రసమ్మతమును భావగాంభీర్యమును రావణునివంటి శత్రుని పట్ల గల సౌహార్దమును సూచించు మృదుమధురవాక్కులకానందించి మహాత్మా! హనుమంతునియొక్కయు, నీయొక్కయు సహేతుకములగుమాటలు వినినంతనే నీధర్మతత్పరతయు సత్యసంధత్వమును, సాటిలేని సౌహార్దమును దుష్టశిక్షణ శిష్టరక్షణ సంకల్పమును, శరణాగతరక్షణదీక్షయుఁజూచి యానందించుచున్నాను. నీయాజ్ఞఁ బాటించెదను. నీవు విభీషణుని

మాకుసాటిగ నెంచి మాకుమైత్రినిగలిగింతువుగాక" యనిచెప్పి రామునిమాటగ నభయమీయఁబడెనని చెప్పి గరుత్మంతుఁడు దేవేంద్రునిఁ బిలిచికొనివచ్చునట్లు విభీషణుని గొనివచ్చి రామునిసన్నిధానమున విడిచెను.

## రామ విభీషణ సమాగమము.

ఆనందపరవశుఁడైన విభీషణుఁడు మిక్కిలివినయముతో ననుచరులంగూడి వానరులమధ్య రామునిపాదములపైఁబడి సాష్టాంగముగ నమస్కరించి "నేను రావణుని తమ్ముఁడను. విభీషణుఁడను పేరుగలవాఁడను. అతనిచే నవమానింపఁబడి సకలప్రాణులను రక్షకుండవగు నిన్ను శరణుఁజొచ్చుచున్నాఁడను. నేను లంకను, రత్నములను, ధనమును, దారాపుత్రాదులను విడిచి నీపాదములనాశ్రయించి నాయాత్మను నీపాదములయందు సమర్పించినవాఁడను. నేను నాకుఁజేరిన సకల చేతనాచేతనవస్తువులను నీకర్పణముచేసి నీదాసుఁడనై ప్రాణముతోడ నీస్వాధీనమయ్యెదను. నన్ను నీవేరీతినైన నుపయోగింపవచ్చును" అనెను. అంత రామచంద్రుఁడు కరుణామృతదృష్టితో విభీషణునిఁజూచి "రావణుని సేనాబలమునుగూర్చి వివరించి చెప్పు" మనెను.

విభీషణుఁడు చేమోడ్చి "రాజపుత్రా! రావణుఁడు బ్రహ్మదేవుని వరబలమున దేవ దానవ యక్ష గంధర్వాదులకైన నజేయుఁడైయున్నవాఁడు. అతనితమ్ముఁడును నా కన్న యునగువాఁడు కుంభకర్ణుఁడను పెద్దశరీరముగలవాఁడు దేవేంద్రునంతటి పరాక్రమవంతుఁడు. కైలాసమునఁ గుబేరుని సేనా

పతియగు మాణిభద్రునోడించిన బ్రహస్తుఁడతని సేనాధిపతి. అంగుళిత్రాణములధరించి ధనుర్బాణములు చేఁబట్టి నంతరిక్షమున నదృశ్యుఁడై చిత్రగతుల యుద్ధముచేయఁగల మహాశూరుడింద్రజిత్తతని కుమారుఁడు. మహోదరుఁడు మహాపార్శ్వుఁడు అకంపనుఁ డనువారును సేనాపతులే. వీరు కామరూపులై మాంసభక్షణముసేయుచు రూపములుమార్చుకొని యుద్ధము చేయఁగలవారు. వీరిసహాయమున రావణుఁ డెదురులేకున్నాఁ" డనెను.

అంత రామచంద్రుఁడు "విభీషణా! రావణుఁ డిదివఱకెట్టి విజయములుపొందియున్నను నాతో వైరముపూనినందున స్వర్గమర్త్యపాతాళములలోఁగాని తనకు వరమిచ్చిన బ్రహ్మలోకమునఁగాని దాఁగినను నన్ను తప్పించుకొనలేఁడు. బంధుమిత్ర సహితముగ సేనతని వధించి నిన్ను లంకానగరమునకు నిష్కంటకముగ నభిషేకింతునని చెప్పి "లక్ష్మణా! సముద్రజలముఁదెచ్చి యిప్పుడే యిచ్చటే లంకారాజ్యమున కితని నభిషేకింపు"మనెను. భ్రాతృభక్తిగల లక్ష్మణుఁడట్లే వానరులమధ్య సముద్రజలముతో విభీషణుని లంకకు రాజుగా నభిషేకించెను. వానరులందఱు సంతోషించిరి. సముద్రమునుదాఁటుట కెట్టి యుపాయముదోఁచ లేదని లక్ష్మణుఁడును సుగ్రీవుఁడునుచెప్పఁగా విని విభీషణుఁడు రామచంద్రుఁడు సముద్రునిశరణుజొచ్చుటే యుపాయమనెను. ఈ మువ్వురి యభిప్రాయముచొప్పున సముద్రతీరమున దర్భలుపఱచి రామచంద్రుఁడు శయనించెను.

ఇట్లుండ శార్దూలుఁడను రాక్షసుఁడు సుగ్రీవుని కాపుననున్న వానరసైన్యమునుజూచి రావణునితోఁజెప్పఁగా నతఁడు

శుకుఁడనువానింజూచి "నీవు సుగ్రీవునితో మెత్తనిమాటలచే నామాటగా నిట్లుచెప్పుము. ఓ వానరరాజా! నీవు బ్రహ్మవంశంబునఁ బుట్టినందున నాబంధుఁడవు. నాస్నేహితుని తమ్ముఁడవగుటచేఁ దోఁబుట్టువగుదువు. నీకునునాకు నెట్టివైరములేదు. నీకు మానవుఁడగు రామునితోఁ బనియేమి? అతని భార్యను నే నపహరించిన నీకు నష్టమేమి? నాతో నిష్కారణముగ వైరముపెట్టుకొనక మఱలిపొమ్ము" అనిచెప్పుము. అనినంత వాఁడు పక్షిరూపమున నవచ్చి యామాటలు చెప్పినంతనే వానరులు పట్టుకొని ఱెక్క లూడఁదీయఁగా రాముఁడు జాలినొంది చంపకుఁడనెను. సుగ్రీవుఁడు బదులుగ "రావణా! నీవు నా శత్రువగు వాలికి స్నేహితుఁడవగుటచే నాకును శత్రుఁడవే. నా మిత్రుఁడగు రాముని శత్రుఁడవగుటచేతను నాకు శత్రుఁడవే యగుదువు. వానరసైన్యముతోవచ్చి లంకను నిన్ను నాశము చేసెద" ననెను.

# 17. నాగపాశబంధము

## సేతువు కట్టుట.

---

సుఖమున కర్హుఁడగు రామచంద్రుఁడు తూర్పు మొగంబై సముద్రమున కభిముఖంబుగఁ బరుండి సముద్రుని శరణుఁజొచ్చి మూఁడుదినములుండియు సముద్రుఁడు ప్రసన్నుఁడు కాకుండుట కాగ్రహించి "ధనువునెత్తి బాణముసంధించి బ్రహ్మాస్త్రమంత్రము జపించి సముద్రములోని జలమునంతయు శోషింపఁజేసిన వానరులు పాదచారులై లంకఁజేరగలరని" లక్ష్మణునితోఁ జెప్పి, మఱల "లక్ష్మణా! సత్పురుషులయెడ సామోపాయము ఫలించును. గుణహీనులు సామమును లక్ష్యపెట్టరు. అసమర్థతగ భావింతురు. వారికి సమర్థులెవరనిన నక్రమముచేయువారు, దయావిహీనులు, వంచనచేయువారు. వారు సాధువసాధువుల నెఱుఁగక దండోపాయము పాటించువారినే గౌరవింతురు. కనుక నేను దండోపాయముననే సముద్రుని వశపఱచుకొనవలెనని కోపముతో ధనువునెత్తగా లక్ష్మణుఁడు ధనువును పట్టుకొనెను. మఱల రాముఁడు ధనువున బాణము తొడిగి బ్రహ్మాస్త్రమంత్రము పఠించెను. ఇంతలోఁ జీకట్లు క్రమ్మెను. ఆకాశమున నుత్పాతము లగుపడినవి. వాయువు బోరునవీచెను. సముద్ర మల్లకల్లోల మయ్యెను. సముద్రుఁడు ప్రత్యక్షమై యంజలిబద్ధుఁడై "రామచంద్రా! పంచభూతము లోక స్థిరత్వము వహింపవలయునను న్యాయముచే నేనిదివఱకు రాకుంటిని. నన్ను క్షమింపుము. సముద్రములో ననంతము లగు జీవకోట్లున్నవి. వానికి హింసకలుగనివిధమున నీవు గట్టు

సేతువున కనుకూలముగఁ బ్రవర్తించెదను" అనినంత రామచంద్రుఁడు "సముద్రా! ఈ బాణ మమోఘమైనది. దీని కొకచోటుచూపు" మనెను. అంత సముద్రుఁడు "సౌమ్యా! దీనిని ద్రుమకుల్యమను ప్రదేశమున వదలుమనినంత రాముఁడట్లే చేసెను. ఆ ప్రదేశమున జల మాకాశమువఱకుఁ బైకెగసెను అచ్చటినీరు వట్టిపోవుటచే నది మరుకాంతార మయ్యెను.

సముద్రుఁడు రామునితో "ఈనలుడు విశ్వకర్మ కుమారుఁడు. ఇతఁడు శిల్పవిద్యలందు విశ్వకర్మకు సాటి. ఇతని మూలమున సేతువుఁ గట్టింపు" మని చెప్పి రాముని వీడ్కొని సముద్రుఁడు మాయమయ్యెను. అంత రాముని యాజ్ఞ ననుసరించి నలుఁడు వానర భల్లూకాదుల సాయమున వృక్షములు పర్వతములు పడవైచి సువేలపర్వతమువఱకు నైదు దినములలో నూఱుయోజనములు నిడివిగల సేతువుఁ గట్టెను.

అంత సుగ్రీవుఁడు చెప్పినట్లు రాముఁడు హనుమంతు నారోహింప లక్ష్మణుఁ డంగదు నారోహించెను. రాముఁడు లక్ష్మణుని సుగ్రీవునిఁగూడి సైన్యముముందటఁబోయెను. వానరులు వారివారి సేనాపతులయాజ్ఞలఁ బాటించుచు సముద్రము దాఁటి సముద్రపు దక్షిణపుతీరముచేరి విశాలముగ బహుఫలవృక్షములుగలచోట విడిసిరి.

## యుద్ధసన్నాహములు.

రాజున కరిష్టములగు దుశ్శకునములు గలిగినందున రావణున కంత్యకాలము సమీపించినదని రాముఁడు సంతోషించి లక్ష్మణుని కౌఁగిలించి తన సైన్యమును గరుడవ్యూహ

ముగఁ బన్నెను. అతఁ డంగదుని నీలుని వారివారి సైన్యములతో సేనయొక్క రొమ్ముభాగమున నుండునట్లును, ఋషభుఁడు దక్షిణప్రక్కనుండునట్లును, గంధమాదనుఁడు కుడివైపునను, జాంబవంతుఁడు, సుషేణుఁడు, వేగదర్శి కడుపుభాగమునను, వరుణుఁడు పశ్చిమమునను, వానరరాజగు సుగ్రీవుఁడు తోఁకవైపునను, తానును లక్ష్మణుఁడును తలభాగమున నుండునట్లు నియమించెను. పిదప రామునాజ్ఞఁగొని సుగ్రీవుఁడు రావణుని దూతయగు శుకుని విడిచిపెట్టెనంత వాఁడు దశకంఠునొద్దకేఁగి తాను పడినపాట్లను జెప్పి సీతను రామునకిచ్చివేయుము. లేకున్న యుద్ధమునకు సిద్ధముచేసికొనకు''మనెను. ఆ మాటవిని రావణుఁడు "రాముఁడు నా పరాక్రమ మెఱుఁగఁడు. శీఘ్రముననే నేనతని సైన్యమును నాశ మొందించెద" ననెను.

ఇట్లు వానరసైన్యముతో రాముఁడు దక్షిణతీరము సేరెనని వినినంతనే రావణుఁడు తన మంత్రులగు శుక సారణులం జూచి "రాముఁడు వానరుల సహాయమున సముద్రమునకు వంతెనగట్టినమాట నేనునమ్మఁజాలను. మీరిరువురునుబోయి రామునిసైన్యములోని వీరులెవరు, వా రేయేచోటనున్నారని యాసైన్యమునుగూర్చి సకల విషయములు దెలిసికొని రావలె నని పంపెను. వా రిరువురు వానరరూపములుదాల్చి వానర సైన్యములో సంచరించుచుండ విభీషణుఁడు వారలఁబట్టి రామునొద్దకుఁగొంపోయి "వీరు రావణునిమంత్రులగు శుకసారణులు. వీరు రావణునిపంపున నిచ్చటి సేనలవిషయములఁ దెలిసికొనఁ గోరి మాయావానరులై వచ్చియున్నా"రనెను. అంత రాముఁడు "మీరువచ్చినపని పూర్తిచేసికొనిపొండు. మీరాజుతో నిట్లు

చెప్పుడు. "ఏ ధైర్యముతో సీత నపహరించితివో ఆ ధైర్య మిప్పుడు చూపుము. రేపు తెల్లవారి లంకనుముట్టడించి నీతో యుద్ధ మారంభింతుము. సిద్ధముగనుండుము." వీరు దూతలు. వీరిని చంపరాదు. విడిచిపెట్టుమనిన విభీషణుఁడు వారిని విడిచి నంత వారు వేగముగఁబోయి "రాజా! విభీషణుఁడు మమ్ముఁ బట్టుకొనిపోయి రామునకప్పగించెను. అతఁడు ధర్మాత్ముఁడు. మాతను జంపరాదనెను. అతఁడు రేపు లంకను ముట్టడించి యుద్ధముసేయునఁట. సీతాదేవి నతని కిచ్చివేయుము. అతని పరాక్రమము చెప్పతరముగానిది. అతని తమ్ముఁడు లక్ష్మణుఁ డతనిసాటివాఁడు. సుగ్రీవుఁడు, అంగదుడు, జాంబవంతుఁడు, నలుఁడు, నీలుఁడు, ఋషభుఁడు, గంధమాదనుఁడు, సుషేణుఁ డు, కేసరి, హనుమంతుఁడు మన్నగువారు దేవతాంశమునఁ బుట్టిన మహాబలులు, వారిఁగూడినరామునితో యుద్ధముచేయ రాదు. సీత నతని కిచ్చివేయు" మనిరి.

అంత రావణుఁ డొక యున్నతమగు మేడమీఁది కెక్కి వారిరువురను వెంటఁగొని వారిలో సారణునిఁజూచి "సారణా! వారిలో ఎవ రెచ్చటనున్నారో నాకుఁజూపు"మనెను. సారణుఁడు రామలక్ష్మణులను, సుగ్రీవుని, యితర వానరముఖ్యులను జూపుచు వారినిఁబేర్కొని వారి శక్తిసామర్థ్యములఁజెప్పి యట్టివారితో యుద్ధము వినాశహేతువనెను. మఱల శుకుఁడు సారణుఁడుచెప్పకవదలినవారినిఁజూపి వారి వృత్తాంతములను జెప్పి యుద్ధములో జయమెట్లుగలుగునో యనెను.

శుకసారణులమాటలువిని కోపించి రావణుఁడు వారికి భృత్యలక్షణములు దెలియవనియు, శత్రువులఁ బొగడుటయుఁ

దన్ను నిందించుటయుఁ దగదని వారిని భయపెట్టి పంపెను. అంత రావణుఁడు సమర్థుఁడగు శార్దూలుని కొందఱుచారులఁ గూడిపోయి శత్రుసైన్యములోని రహస్యముల నెఱింగిరమ్మని పంపెను. వాఁడు తన యనుచరులతో మాఱువేషముపూని సువేలపర్వతమున సుగ్రీవ విభీషణులతోనున్న రామలక్ష్మణులఁ జూచుచుండఁగా విభీషణుఁడు శార్దూలునొక్కనిమాత్రము పట్టియిచ్చినంత వానరులు వానిని చిత్రవధ గావించుచుండ రాముఁడు వారించి విడిపించెను. శార్దూలాదులు రావణుని కడకువచ్చి తాముపడిన పాట్లెల్లఁజెప్పి రామలక్ష్మణుల ప్రభావమును సుగ్రీవాది వానరుల బలపరాక్రమములను విశదీకరించి "రేపు ప్రాతఃకాలము లంకానగర ప్రాకారముల నాక్రమింతు" రనిరి.

## రామునిమాయాశిరమును సీతకుఁజూపుట.

చారులవలన రామునిసైన్యమునుగూర్చి వినిన రావణుఁడు క్రూరకర్ముఁడగుటచే మంత్రులతో నాలోచించి మాయలయందు నేర్పరియగు విద్యుజ్జిహ్వునిఁబిలిచి "నీవు మాయచే రాముని శిరమును, ధనువును, బాణమును జేసి తెమ్మ"ని యతనికొక విలువగల యాభరణమునిచ్చి పంపెను.

రావణుఁ డటుతరువాత సీతనుజూడఁగోరి యశోకవనమునకుఁబోయి రాక్షసస్త్రీలమధ్య రాము నెడబాసినశోకమున మునుంగుచుండు రామపత్నినిఁజూచి సంతోషవార్తఁ దెచ్చి నట్లు తోపఁజేసి "సీతా! నన్నుప్రేమింపకపోతివే. ఇప్పు డేమి చేయఁగలవు? ఇఁక నెక్కడిరాముఁడు? వానరులతో సముద

తీరమునకు వచ్చినాడట. రాత్రి ప్రహస్తుఁడు రామునిశిరము ఖండించి తెచ్చెను. విభీషణుఁడు పట్టుపడెను. లక్ష్మణుఁడును వానరులును పలాయితులైరి. సుగ్రీవునిచంపిరి. హనుమంతుఁడు చచ్చెను. జాంబవంతుఁడు హతుఁడయ్యె. అంగదునిఁ బరిమార్చిరి. వానరవీరుల నెల్లఱను వధించి వానర సైన్యములఁ జెల్లాచెదరుచేసిరి. ఇఁక నైనను బుద్ధితెచ్చికొమ్ము. ఇఁక నీ యిష్టమేమున్నది? నీవే నన్ను గోరవలసినకాలము వచ్చినది. నాభార్యవుకమ్ము. నిన్ను బట్టపురాణిగఁ జేతును. నామాటలు నమ్మవేని చూడుము" అనిచెప్పి ప్రక్కనున్న రాక్షసి నొకర్తెఁ బిలిచి "నీవుపోయి యుద్ధభూమినుండి రామునిశిరముఁ దెచ్చిన విద్యుజ్జిహ్వుని గొనిరమ్ము" అనెను. అంతనా రాక్షసి యతనిని గొని తెచ్చెను. వాఁడు రాముని శిరమును ధనస్సును తెచ్చెను. అంత రావణుఁడు "విద్యుజ్జిహ్వా! ఆ తలను సీతముందట నుంచుము. సీత నామాటలోని సత్యము నెఱుఁగు" ననెను. వాఁడట్లుచేయ రావణుఁడు ధనువునుదీసికొని "సీతా! ఇదిగో! రాముని ధనువు. ఇంకను నీకేల సందేహము? ఇఁక రాముఁడు లేఁడు. నాభార్యవుకమ్ము" అనెను.

సీత హనుమంతుఁడు వర్ణించినట్లే కేశము లుండుటను చూడామణినిఁ జూచి దుఃఖసాగరములో మునిఁగినదై "హా! కైకేయీ! నాకిట్టి సంకటములుగలుగుటకు నీవేగదా కారణము! అయ్యో! రాముఁడు నీకేమి యపకారముచేసినాఁడు? అని మూర్ఛిల్లెను. కొంతవడికి లేచి "హానాథా! నాపాతివ్రత్యమిట్టిదాయెనా? అయ్యో! నిన్నువిడిచి క్షణమేనియు నుండలేక నీతో వనమునకు వచ్చితినే. నీవు సత్యసంధుఁడవే! ధర్మ

మూర్తివే! సాధురక్షకుఁడవే! వీరాధివీరుఁడవే! నాముందటఁ బదునాల్గువేవుర రాక్షసుల నొక్కఁడవే త్రుటిలో వధించితివే. అట్టి నీ పరాక్రమమును మించినవాఁ డెవఁడు? నానోము లేమాయె? నావ్రతములు మంటఁగలిసెనే! నాయుపవాసము లప్రయోజనము లయ్యెనే. నా దేవతాపూజలు ఫలింపవా? నాకు వైధవ్యముకలుగునని కలలోనైనఁ దలఁచి యెఱుఁగనే. హాతవిధీ! నీవు దీర్ఘాయుష్మంతుఁడవని చెప్పిన జ్యోతిష్కుల మాటలు వ్యర్థమా? నిత్యసత్యవ్రతుఁడును, ధర్మవ్రతుఁడును, సకలభూతములందు సమత్వబుద్ధిగలవాఁడును దమము శమము గలవాఁడును లోకోత్తరుఁడగు భర్తను బోఁగొట్టుకొనిన నాకింకేమిగతి?" యని పనవిపనవి యేడ్చుచుండ సీతను రావణుఁడు చూచుచుండ నొకసేవకుఁడు వేవేగవచ్చి నమస్కరించి వినయముతో "రాజోత్తమా! మంత్రులందఱితోఁ బ్రహస్తుఁడు మీ దర్శనముఁగోరి వచ్చియున్నవాఁడు. అత్యంతవసరమగుకార్యమున్నదఁట. దర్శనమీయఁ గోరుచున్నాఁ"డనెను. అంత రావణుఁ డచ్చోటుఁ బాసిపోయె. అంతనా మాయాశిరమును ధనువును మాయమయ్యెను.

## సరమ సీతనోదార్చుట.

విభీషణునిభార్య సరమ సీతకుఁ గావలివాండ్రలో నొకతె. ఆమె సీతయం దనురాగముగలది. ఆమె సీతనుజూచి "అమ్మా! దుఃఖింపకుము. నేను రావణుఁడు వచ్చినపు డొక వృక్షరంధ్రమున నుండి జరిగినదంతయుఁ జూచితిని. వింటిని. రావణుఁడు నీకుఁజూపిన తల రామునిదని యెంచకుము. ఇది

మోసము, నిన్ను లోఁబఱచుకొనఁ జేసిన నుపాయము. నీ భర్త ధర్మస్వభావుఁడు. అతని కెట్టి యపాయము రాదు. శీఘ్రమున నతఁడు నిన్నుఁ గలసికొనును. నీ వతని యొడిలోనుండుటను నేచూతువు. రాముఁడు యుద్ధమునకు సిద్ధముగనున్నవాఁడు. లంకలో యుద్ధసన్నాహములు జరుగుచున్నవి. గజముల నలంకరించుచున్నారు. గుఱ్ఱములు సకిలించుచున్నవి. రథములశబ్దము వినఁబడుచున్నది. సకలవిధాయుధములు సిద్ధముచేసికొనుచున్నారు. నీవంగీకరించిన నేనిప్పుడే రామునితో నీ క్షేమసమాచారము చెప్పి యతఁడు నీకుఁ జెప్పఁగల విషయమును కనుఁగొనెద" ననెను. అంత సీత రావణుఁ డేమి చెప్పుచున్నాఁడో యెట్టియాలోచనలు వినుచున్నాడో తెలిసి కొనిరమ్మ" నెను.

వెంటనే సరమ రావణాంతఃపురమునకుఁ బోయి యందందు రావణుఁడెవరితో మాట్లాడునో, ఎవరెవ రెట్టి యాలోచనలు చెప్పుదురో వినవలెనను కుతూహలముతో విషయముల నెల్లను గ్రహించి మఱలివచ్చి సీతతో నిట్లనెను. 'సీతా! వినుము. రావణుని తల్లి కైకేసియు మంత్రివృద్ధుఁడగు నవిద్ధుఁడును రామునితో వైరముడిగి సీతను రామునకిచ్చి సుఖింపుమని యెంత బోధించినను రావణుఁ డిష్టపడలేదు. రావణుని తల్లికిఁ బినతండ్రియుఁ బ్రజ్ఞావంతుఁడును వయోవృద్ధుఁడు నగు మాల్యవంతుఁ డిట్లు చెప్పెను. "రాజా! నామాటలు వినుము. రాజు నీతిశాస్త్రము ననుసరించి నడచుకొనవలెను. అతఁడు జాగరూకుఁడుగ నుండవలెను. దేశకాలములను దెలిసి ప్రవర్తించవలెను. ఒకరాజు తనకంటె శత్రువు బలిష్ఠుఁడుగనున్నను, సమబలుఁ

డుగ నుండినను సంధిచేసికొనవలెను. అట్లుగాక తనబలము కంటె నెదిరిబలము తక్కువగ నుండునపుడు శత్రువు బలహీనుఁడుగదాయని యుపేక్షింపక నతని జయించవలెను. ఇప్పుడు రాముఁడు నీకంటె బలియుఁడు. ఎట్లందువా? దైవసృష్టిలో ధర్మము, అధర్మము రెండునుగలవు. దేవతలు ధర్మము నవలంభింతురు. అసురు లధర్మము ననుసరింతురు. నీవు దిగ్విజయయాత్రచేయ నారంభించిననాఁటినుండియు పరస్త్రీగ్రహణము మొదలుగాఁగల విపరీతచర్యలచే దేవవిరోధివైతివి. ఈ రాముఁడు ధర్మసంస్థాపనముచేయఁ బుట్టిన విష్ణుదేవుఁడే. కనుక నీ వతనితో సంధిచేసికొనవలెను. ందుకు దానమీయవలెను. నీ వపహరించిన సతనిసొత్తగు సీతాదేవి నిచ్చుటే దానమగును. ఇట్లుచేసిన నీకు మేలగు" ననెను. ఇంతఁ జెప్పియు రావణునిబుద్ధి మార్పుచెందలేదు" అనెను.

ఇట్లుండ రావణుఁడు మాల్యవంతుని శత్రుపక్షపాతియని దూషింప నతఁడు రావణునకు జయముగలుగుగాకయని యాశీర్వదించి వెడలిపోయెను. అంత రావణుఁడు మంత్రులతో నాలోచించి లంకకు తూర్పుద్వారమునఁ బ్రహస్తుని, దక్షిణద్వారమున మహోదర, మహాపార్శ్వలను, పడమటివాకిలి వద్ద మహాపరాక్రమవంతుఁడైన నింద్రజిత్తును, నుత్తరద్వారమున శుకసారణుల నుండునట్లు నియమించి తాను నచ్చటనే యుండెను. విరూపాక్షుని పట్టణ మధ్యభాగమున నుండునట్లు నియోగించెను.

## రాముఁడు లంకనుజూచుట.

రామలక్ష్మణులు, సుగ్రీవాది వానరప్రముఖులును, విభీషణుఁడును, జాంబవంతుఁడును లంకానగరమును జూచి హనుమంతుఁడు చెప్పినవిధమును జ్ఞప్తికిఁదెచ్చికొని జరుగవలసిన కార్యమునుగూర్చి యాలోచించుచుండ విభీషణుఁ డిట్లనెను. "అనలుఁడు, శరభుఁడు, సంపాతి, ప్రఘసుఁడను నా మంత్రులు పక్షిరూపమున లంకలోఁ బ్రవేశించి రావణుఁడు లంకారక్షణమునకై కావించిన యేర్పాటులు వివరించిరి. "ప్రహస్తుఁడు తూర్పుద్వారమునను, మహోదర మహాపార్శ్వులు దక్షిణమునను, ఇంద్రజిత్తు పడమట, రావణుఁ డుత్తరమున, విరూపాక్షుఁడు మధ్య నున్నారఁట" అనినంత రామచంద్రుఁడు నీలుఁడు తూర్పునఁ బ్రహస్తునితోను, అంగదుఁడు దక్షిణమున మహోదర మహాపార్శ్వులతోను, హనుమంతుఁ డింద్రజిత్తుతోను, నేనును లక్ష్మణుఁడును రావణునితోను యుద్ధముచేయవలెను. సుగ్రీవుఁడు, జాంబవంతుఁడు, విభీషణుఁడు మీరు మువ్వురు పశ్చిమమునకును ఉత్తరమునకును మధ్యనుండి యుద్ధము చేయుదురుగాక. వానరులిఁక మానవరూపముచాలించి వానరులుగనే యుండవలెను. నేను, లక్ష్మణుఁడు, విభీషణుఁడు, అతనిమంత్రులు నలువురుమాత్రము మానవరూపమున నుండి యుద్ధముచేసెదము" అనెను. రామలక్ష్మణులు, సుగ్రీవుఁడు, విభీషణుఁడు అతనిమంత్రులు, హనుమదంగద జాంబవదాదులును పెక్కువానరులఁగూడి సువేలపర్వతమునెక్కి యారాత్రి యచ్చట గడపిరి. నిండువెన్నెల యగుటఁ ద్రికూటపర్వతము

మీఁది లంకానగరము మిక్కిలి ప్రకాశించెను. రాముఁడు సపరివారముగ నద్దానిఁజూచి యాశ్చర్యపడెను.

## రావణ సుగ్రీవుల ద్వంద్వయుద్ధము.

లంకాపుర ప్రాకారములఁ గోటడులందు రాక్షసు లసంఖ్యాకులుండ నల్లని మఱియొక ప్రాకారమో యనఁదగియుండెను. రావణుఁ డున్నతసౌధోపరిభాగమునఁ శ్వేతచ్ఛత్రముతోను వింజామరలతోను గూడి రామునిసైన్యమును జూచు చుండెను. రాముని సమీపమునను౦డిన సుగ్రీవుఁడు రోషముతో నెగిరి రావణునిచెంగటఁ గొంతసే పూరకుండి తటాలున నెగిరి యతని కిరీటములను బడఁద్రోసెను. అంత రావణుఁడు సుగ్రీవునిఁ బట్టుకొనెను. ఇరువురు నొకరినొకరు విడువకఁ ద్రోయుచు, దొర్లుచుఁ బడుచు లేచుచు ముందుకులాగుచు వెనుకకుఁ ద్రోయుచు నొకరినొకరు తూలనాడుచు సింహానాదములుచేయుచు ద్వంద్వయుద్ధము సేసిరి. ఇరువు రొకింతసే పూరకుండి మఱల నొకరినొకరు లాగుచు నిరువురు నగ డ్తలోఁబడి చమత్కారమున గాయములేక పైకెగసి యొండొరులఁ బట్టికొని చాలసేపు యుద్ధముచేసినతరువాత సుగ్రీవుఁ డంతరిక్షమునఁ బైకిలేచి "ఓరీ! రాక్షసాధమా! నాస్వామియగు రామచంద్రునిముందట నీ రాజచిహ్నములఁ జూపెదవా? అతని చేతులార వధింపవలెనను నతనికోరిక నుద్దేశించి నిన్ను నేఁడు వదలిపెట్టితిని. లేకున్న నిన్నిప్పుడే చంపియుందును" అని చెప్పి వానరసైన్యముతోఁ గలసికొనెను.

## అంగద రాయబారము.

రాముఁడు సుగ్రీవునిఁజూచి "వీరాగ్రణీ! ఇట్టిసాహసము చేయఁదగునా"యని కౌఁగిలించి మఱల "రాజు యుద్ధమున మునుముందుగఁబోయి ప్రాణము గోల్పోయినఁ బ్రజలగతి యేమి? తటాలున యుద్ధమునకుఁ బూనుకొంటివే. నీవురాకున్న నిన్ను నమ్మిన మాయెల్ల అగతియేమి? ఎట్లయినను శరణాగతుని రక్షించి తీరవలెను గనుక యుద్ధమున రావణు నోడించి విభీషణుని మాటచొప్పున లంక కభిషేకించి సీతఁగూడి యయోధ్యకుంబోయి భరతు నభిషేకించి ప్రాణమువిడువ నెంచితిని. ఇఁక నెన్నఁడిట్టి సాహసకార్యము సేయకు" మనెను.

ప్రాతఃకాలమున రామచంద్రుఁడు మున్ను తాను నిర్ణయించినట్లు వానరవీరుల నాయాస్థానములందుంచి రాజధర్మము ననుసరించి తొలుత సామోపాయము నుపయోగింప నెంచి విభీషణు ననుమతంబున నంగదుని రావణునొద్దకు రాయబారిగఁ బంపుచు "అంగదా! నీవు నామాటగ రావణునితో నిట్లనుము. "రాక్షసా! మాయచే మారీచుని మృగరూపముతో మోసపుచ్చునట్లుచేసి నేను లేనిసమయమున నా భార్యయగు సీత నపహరించిన పాపివి. ఒరునిభార్య నపహరించుటకంటెఁ బెద్దపాపమేదిగలదు? వరబలముచేతనో బాహుబలముచేతనో గర్వపడి యవినీతిమార్గముఁ ద్రొక్కితివి. ఇప్పుడైనను బశ్చాత్తాపముగలిగి సీతను నాకిచ్చితివా ప్రాణము దక్కును. రాజ్యము నాశముగాకుండును. విభీషణుఁడు నన్ను శరణుచొచ్చినందున లంకారాజ్యము నతనికిచ్చునట్లు ప్రతిజ్ఞచేసియున్నాను.

లేనిచో నాబాణములచేఁ బ్రాణముపోఁగొట్టుకొని పాపము దొలగించుకొందువు. ఇఁక నీ వేలోకమునకుఁ బోయినను బ్రాణముదక్కదని యెఱుఁగుము" అనెను.

అంత నంగదుఁ డవలీలఁగఁబోయి రావణుఁడు మంత్రులతోఁ గూడియుండఁజూచి "నేను రాముని దూతను. వాలి పుత్త్రుఁడను. అంగదుఁడను పేరుగలవాఁడను. రాముఁడీ సందేశము పంపెను. "రావణా! నీవు గొప్పకులమునఁ బుట్టియుఁ గడు నీచపుపనిచేసితివి. నాభార్యను నేను లేనిసమయమునఁ దెచ్చిన పాపాత్ముఁడవు. నీ వరబల భుజబల గర్వముల నశించెదను. రారమ్ము, పురము వెడలివచ్చి యుద్ధముచేసి యమపురికిఁబొమ్ము. తెలివియున్న సీతనిచ్చి ప్రాణముగాపాడుకొమ్ము. లంకకు విభీషణుఁడే రాజగును".

ఇట్లంగదుఁడు చెప్పిన మాటలు విని కుపితుఁడై రావణుఁడు "మంత్రులారా! వీనినిబట్టికొని వధింపుఁడు, వధింపుఁడు" అనెను. అంత నలువురురాక్షసులు వానిఁ బట్టికొనిరి. అంగదుఁడు వారితోఁ బ్రాసాదశిఖరమున కెగిరి రాక్షసులఁ బడఁద్రోసి యా ప్రాసాదశిఖరమును భగ్నము చేసిపోయెను.

ఈవృత్తాంతము దెలిసినంతనే వానరులు లంకానగర ప్రాకారప్రదేశము లెల్లెడలఁ జుట్టుకొనిరి. రాక్షసులకును వానరులకును యుద్ధమారంభమాయెను. కోట్లకొలఁది వానరులు లంకానగరద్వారములవద్ద నాయా సేనాపతుల నాజ్ఞల ననుసరించి వృక్షములతోడను, పర్వతశిఖరములతోడను, నఖములతోడను, దంష్ట్రలతోడను రాక్షసులతో ఘోరముగ యుద్ధము చేసిరి. వానరులు "కోసలరాజగు రాముఁడు లక్ష్మణునితో

సర్వోత్కృష్టుఁడుగనున్నాఁడు. వానరరాజగు సుగ్రీవుఁడు రామునితో జయశీలుఁడుగ నున్నాఁడు" అని సింహనాదములు సేయుచు రాక్షసులను వధించుచుండిరి. రాక్షసులును బాణములు, శూలములు, గొడ్డండ్రు, కరవాలములు, తోమరములు భిండివాలములు మున్నగు నాయుధములు గొని వానరులతోఁ బోరుచుండిరి.

ఇట్లంత నింద్రజిత్తంగదునితోను, హనుమంతుఁడు జంబుమాలితోను, విభీషణుఁడు మిత్రఘ్నునితోను, నీలుఁడు నికుంభునితోను, సుగ్రీవుఁడు ప్రఘసునితోను, లక్ష్మణుఁడు విరూపాక్షునితోను, అగ్నికేతుఁడు, రశ్మికేతుఁడు, సుప్తఘ్నుఁడు రామునితోను యుద్ధముచేసిరి. అంగదుఁడు ఇంద్రజిత్తు రథమును గుఱ్ఱములను సారథితోసహా నాశముచేసెను. నీలుఁడు నికుంభుని రథచక్రమునేగొని సారథిని జంపెను. ఇట్లు జరిగిన దొమ్మియుద్ధమువలన యుద్ధభూమియంతయు రాక్షసుల వానరుల శరీరములతోను ప్రత్యేకాంగములతోను రక్తము పాఱుచుండఁగా రొంపియయ్యెను.

ఇంతలో రాత్రికాఁగా రాక్షసులకు మేలయ్యెను. వారు భేరీ మృదంగ పణవ శంఖ శబ్దములతో నుత్సాహముగఁ బోరిరి. రామలక్ష్మణులును వెనుదీయక తీక్ష్ణబాణములతో రాక్షసుల నొప్పించిరి. అంగదుఁ డింద్రజిత్తును జంపనెంచి వానితో ఘోరముగ యుద్ధముచేసి రథమును ముక్కలుగావించి గుఱ్ఱములను సారథిని గూల్చెను. అప్పుడు రామలక్ష్మణులును, సుగ్రీవుఁడు, విభీషణుఁడు మున్నగువారును సంతోషించిరి. అంత నింద్రజిత్తు ఎవరికినిగానక మాయాయుద్ధ మారంభించి రామా

దులమీఁద బాణవర్షము కురిపించి యంతటితోఁ దృప్తిచెందక బాణరూపములగు సర్పములచే రామలక్ష్మణుల బంధించి "అదృశ్యుఁడనై యుద్ధముచేయఁగా నన్నెదురొడ్డనువా రెవ్వరు లేరు. నా కోపము వృథగా నేరదు" అని బంగారుపింజలుగల వివిధ బాణములచే వా రిరువురను మిక్కిలి నొప్పింప వారు మూర్ఛితులయిరి. హనుమంతుఁడు, నీలుఁడు, సుషేణుఁడు, మైందుఁడు, అంగదుఁడు మున్నగువారు రామలక్ష్మణులఁజూచి చాల దుఃఖించిరి. ఇంద్రజిత్తు మిగుల సంతసించి "రాక్షసులారా! చూచితిరిగదా ఖరదూషణాదుల జయించిన వీరుల గతి" యనుచుఁ బురము ప్రవేశించెను. సుగ్రీవుఁడు మిక్కిలి చింతింప విభీషణుఁడతనినోదార్చి "సుగ్రీవా! యుద్ధమన నిట్టిదే. జయాపజయములు నిలుకడగ నుండవు. రామలక్ష్మణులకుఁ బ్రాణభయములేదు. వారి ముఖములలోఁ గాంతియున్నది" యనెను.

అట ఇంద్రజిత్తు రావణునితో "తండ్రీ! రామలక్ష్మణులను నాగపాశబద్ధులఁగావించి కూల్చితిని. ఇఁక సంతోషముగ నుండుము" అనెను. ఆమాటవినినంతనే రావణుఁ డాసనము డిగ్గి తనయునిఁగౌఁగిలించి శిరముమూర్కొని వానిని స్తుతించెను.

## సీత దుఃఖించుట.

అంత రావణుఁడు పురమును పతాకములతోను తోరణములతోను నలంకరింపఁజేసి ఇంద్రజిత్తు రామలక్ష్మణులఁ జంపెనని చాటించి యానందమగ్నుఁ డయ్యెను. రాక్షసేశ్వరుఁడు రాక్షసస్త్రీలనుబిలిచి "మీరు పుష్పకమున సీతనుగొని

పోయి యుద్ధరంగమునఁ బ్రాణములుగోల్పోయిన రామలక్ష్మణుల నామెకుఁజూపుఁ" డనెను. అంత వారట్లేచేసిరి. వారిలో నొకతె త్రిజట. సీత యుద్ధభూమిలోఁ బడియున్న రామలక్ష్మణులను మరణించిరని యెంచి "అయ్యో! సకలాస్త్రకోవిదులగు రామలక్ష్మణుల జయించువారు లేరనుకొంటినే. సాముద్రిక లక్షణములు దెలిసినవారు నాకు వైధవ్యముగలుగునని యెన్నఁడు చెప్పలేదే. గొప్పసామ్రాజ్యాధిపతికి సతివగుదువనిరే. లక్ష్మివంటి శుభచిహ్నములుగలదానవని యనేక జ్యోతిష్కులు చెప్పిరే. నేను భాగ్యహీననైతినే. నాతల్లి యీసంగతివిని యెంత దుఃఖించునో! అంతకంటె ననేకరెట్లు నాయత్త కౌసల్య దుఃఖించునే. పదునాల్గు వత్సరములు గడపి కుమారుఁడు భార్యను తమ్మునిఁగూడి మఱలివచ్చి రాజ్యాభిషేకము చేసికొనునని కొండంత యాశతో దినములు లెక్కించుచుండునే. తండ్రియని రాముని, తల్లియని నన్ను భావించు సుగుణవంతుఁడగు లక్ష్మణుఁడును మరణించి పరలోకమునను జ్యేష్ఠుని సేవించుచుండును. అట్టిభాగ్యము నాకు లేదయ్యెనే" యని యేడ్చుచుండఁ ద్రిజట "సీతా! దుఃఖింపకుము. రామలక్ష్మణులు మరణింపలేదు. వారు మూర్ఛిల్లియున్నారు. లేకున్న నీ పుష్పకవిమానము నిన్ను వహించియుండదు. వీరి ముఖములందెట్టి వికార మగుపడలేదు. వారికాంతి తఱుగలేదు. వారుత్తమ ధార్మికులు. వారి పరాక్రమ మెదురులేనిది. వారు ప్రాణముతో నున్నారనుమాట నమ్ము శోకము నుడుగు"మనెను. అంత సీత త్రిజటకు మ్రొక్కి "అమ్మా! నీవే నాపాలిటి దైవమవు. నీ మాటలు నాప్రాణముఁ గాపాడుచున్నవి. నీవుచెప్పినట్లేయగు

గాక" యనెను. అంత నాపుష్పకము వారిని లంకానగరమున కుఁ గొంపోయెను. రాక్షసస్త్రీలు సీత నశోకవనమునకుఁ గొంపోయిరి. ఆమె చింతలో మునిఁగియుండెను.

## రాముఁడు చింతించుట.

సుగ్రీవాది వానరులెల్లఱు చాల దుఃఖముతోనుండ రాముఁడు ప్రజ్ఞఁబొంది లక్ష్మణుని దురవస్థనుజూచి దుఃఖము సహింపలేక "లక్ష్మణా! బాల్యమునుండి యొకక్షణమేనియు నన్ను విడిచియుండినవాఁడవుగావు నీవులేకున్న నావెలిప్రాణము పోయినట్లే. నేనిఁక జీవచ్ఛవముగాకేమి? ఏ సీతకొఱకు నీవు ప్రాణములర్పించితివో యా సీతవంటి భార్యను పొందినను పొందవచ్చునుగాని నీవంటితమ్ముని యెందుఁగందును. వేయి చేతులుగల కార్తవీర్యుఁడొకేసమయమున నైదువందల బాణములు విడువఁగలిగితే నీవంతకంటె నెక్కువబాణము లొకక్కసారిగాఁ గురిపింతువే ఇఁక నీసహాయము నాకెద్ది? అయోధ్యకు నీవులేక నేనెట్లుపోదును? పోయినచోఁ గౌసల్యకు, కైకేయికి నాయందత్యంత వాత్సల్యముగల నీ తల్లి సుమిత్రాదేవి కేమని బదులుచెప్పుదును. లోకులు నన్నేమని తలఁతురు? నాకుమాత్ర మేర్పడిన వనవాసము నీకును విధిప్రాప్తమని యెంచి భార్యను, సకల భోగములను వదలి నిద్రాహారములు మాని నాసేవయే ముఖ్యమని యెంచి నా వెంటవచ్చిన త్యాగశీలుఁడవే. నీవులేకున్న నాకీ సీతయేల? రాజ్యమేల? ప్రాణమేల? నీతో నేనును మరణించెదను" అని పలువిధములఁ బనవివనవి యేడ్చుచు సుగ్రీవునివంకఁదిరిగి "సుగ్రీవా! నీవును

సుహృదుఁడు చేయఁదగినంతయు శ్రమపడి నాకొఱకుఁ బ్రాణము నైనఁ ద్యజింప నిశ్చయించి హనుమంతుఁడు, అంగదుఁడు, జాంబవంతుఁడు మొదలగు వానరవీరులతోడను భల్లూకవీరుల తోడను సకలవిధ సహాయముచేసితివి. నేను లేకున్న రావణుఁడు నిన్ను హింసించును. కనుక నీవిఁక సకలసేనలతోఁ గిష్కింధకుఁబొమ్ము" అనినంతనే వానరులెల్లరు రోదనము సేసిరి. రామలక్ష్మణులు శరీరమంతయు బాణములు గ్రుచ్చుకొనియుండ విభీషణుఁడు వచ్చి వారినిఁజూచి నీరు తెచ్చి రామలక్ష్మణుల కన్నులఁదుడిచి "అయ్యో! నేనెట్టి మందభాగ్యుఁడను. ఎవరి శరణుఁజొచ్చి సుఖింపనెంచితినో యట్టి రామలక్ష్మణులు దీర్ఘ నిద్రపోయిరే. ఇఁక రాజ్యాభిలాష నాకు లేదు. దుష్టుఁడగు నాశత్రువు రావణుఁడు సఫలమనోరథుఁడయ్యె. నేనిఁక జీవించి యుండలేను" అనెను.

చెంతనున్న సుగ్రీవుఁడు విభీషణునిఁ గౌఁగిలించి "సౌమ్యా! దుఃఖింపకుము. రామలక్ష్మణులు మూర్ఛచెందియున్నారు. వారు మరణింపలేదు. వారు శీఘ్రముగలేచి నీకోర్కెఁ దీర్ప గల"రనెను. మఱల సుగ్రీవుఁడు మామయగు సుషేణునిఁ జూచి "రామలక్ష్మణులు తెలివిపొందిన తర్వాత వారినిఁ దోడ్కొని కొందఱు వానరులఁగూడి కిష్కింధకుఁ బొమ్ము. నేను రావణుని వధించి సీతను గొనివచ్చెద" ననియె.

అంత సుషేణుఁడు "క్షీరసముద్రమునందు చంద్రమనియు, ద్రోణమనియు రెండు పర్వతములున్నవి. వానియం దోషధులున్నవి. వానికి సంజీవకరణి, విశల్యకరణియని పేరు. హనుమంతుఁడు వానిని తెచ్చుగాక" యనెను. ఇంతలో నొక

పెనుగాలి వీచెను. గొప్పకాంతితో గరుత్మంతుఁడు వచ్చెను. అంత బాణరూపమున రామలక్ష్మణుల బంధించిన సర్పములు పాఱిపోయినవి. గరుత్మంతుఁడు రామలక్ష్మణుల ముఖమును శరీరమును రెండుచేతులతోఁ దడవెను. వెంటనే రామలక్ష్మణులు మునుపటికంటె నెక్కువ తేజముతోను బలపరాక్రమంబులతోను నిండినవారైరి. రాముఁ డతనిఁజూచి "మహాత్మా! మీ యనుగ్రహమున నీయాపదనుండి విముక్తులమైతిమి. మీ దర్శనమువలన మాతండ్రి తాతలను జూచినంత సంతోషము కలుగుచున్నది. మీ రెవరో తెలియఁగోరెద" మనెను. అంతలకు గరుత్మంతుఁడు "రామచంద్రా! నేను మీ ప్రాణసఖుఁడను. గరుత్మంతుఁడను పేరుగలవాఁడను. ఇంద్రజిత్తువలన మీ కేర్పడిన బాధను తొలగింప వచ్చితిని. రాక్షసులు మాయావులు. వారిని నమ్మరాదు. నీవు రావణాదుల వధించి సీతను బొందఁగల" వనిచెప్పి రామలక్ష్మణులకుఁ బ్రదక్షిణము చేసి కౌఁగిలించి వారిని వీడ్కొని వాయువేగమున నెగిరిపోయెను. రామలక్ష్మణులును సుగ్రీవ విభీషణాదులును సంతోషించిరి. వానరులు శంఖధ్వానముచేసి సింహనాదములు గావింపఁ దుములధ్వని మిన్నుముట్టెను.

* * *

# 18. కుంభకర్ణవధ

## ధూమ్రాక్షుఁడు.

---

మధ్యరాత్రమున రామలక్ష్మణులు నాగపాశబద్ధులై యుండ దుఃఖసముద్రమున మునిఁగిన వానరులు తటాలున మితిమించిన సంతోషముతో వాద్యములు మ్రోయించి సింహనాదములు సేయుట విని రావణుఁ డాశ్చర్యముచెంది రాక్షసులఁ బనిపి రామలక్ష్మణులు బంధవిముక్తులగుటయు, వానరుల కోలాహలమును దెలిసికొని మిక్కిలి చింతించి ధూమ్రాక్షుని యుద్ధమునకు సకలసన్నాహములతోఁ బంపెను. వాఁడు హనుమంతుఁడున్న పడమటిద్వారమునకుఁ బోయెను. రథము మీఁద గ్రద్ద వ్రాలినది. పీనుఁగులం దిను వికారమగు పక్షులు ధ్వజముపై వ్రాలినవి. ఇవి యరిష్టసూచకములు.

ఇట్లు ధూమ్రాక్షుఁడు యుద్ధమునకు వచ్చుటఁజూచి వానరు లుత్సాహపూరితులై వృక్షములనుగొని రాక్షసుల నెదుర్కొనిరి. రాక్షసులు కత్తులు బాణములు శూలములు మొదలగు నాయుధములతో వానరులఁ జంపిరి. అంత వానరులు చెలరేగి గొప్పవృక్షములను గొప్పశిఖరములను బడవైచి రాక్షసుల హతమొందించుచుండిరి. ధూమ్రాక్షుఁడు వికారముగ నవ్వుచు వచ్చుచుండ హనుమంతుఁ డొక పెద్దశిల నతనిపై వేయ ధూమ్రాక్షుఁడు గదచేతఁబూని రథమునుండి నేలకుదూఁకెను. అంతనాశిలచే రథముముక్కలయ్యెను. గుఱ్ఱములు చచ్చినవి. సారథియు హతుఁడయ్యెను. ధూమ్రాక్షుఁడు కోపముతో హనుమంతునిఁపై బడి గదచేఁగొట్టగా వాయుపుత్త్రుఁడా దెబ్బకును వెనుదీయక నొకపర్వతశిఖరముచే వానిఁజంపె.

## వజ్రదంష్ట్రుఁడు.

ధూమ్రాక్షుఁడు హతుండగుటను విని రావణుఁడు తోఁకత్రొక్కినత్రాచువలె నాగ్రహించి మహాబలుఁడగు వజ్రదంష్ట్రుని యుద్ధమునకుఁ బంపెను. వాఁడు తళతళ మెఱయు బంగారుతోఁ బ్రకాశించు రథము నెక్కి వీరవాద్యఘోషముల తో గజతురగారోహణులగు రాక్షసవీరులతో నాడంబరముగ దక్షిణద్వారమున వెడలుచు నంగదు నెదుర్కొనెను. దుర్నిమిత్తము లగుపడినను వజ్రదంష్ట్రుఁడు లక్ష్యముచేయకఁ బ్రళయ కాలరుద్రునివలె నుగ్రముగఁ బోరుసాగించెను. వానరు లుత్సాహముతో వృక్షములతోడను శిలలతోడను నఖములతోడను గోళ్ళతోను యుద్ధముచేసి రాక్షసులం దునుమాడిరి. రాక్షసులును నానావిధాయుధములతో వానరులం ద్రుంచి తమతమ పరాక్రమంబులుసూపుచు యుద్ధముచేసిరి. వానరులు రాక్షసుల యురవడికిఁ దాళలేక నంగదు నాశ్రయించిరి, అంత వాలిపుత్రుఁడు తన్ను బాణసమూహములతో నొప్పించిన వజ్రదంష్ట్రునిపై నొక పర్వతము పడవైచెను. వాఁ డొక ప్రక్కకు తొలఁగి తప్పించుకొనెను గాని వానిరథము గుఱ్ఱములు సారథి నాశము గావింపఁబడెను. వజ్రదంష్ట్రుఁడు గదతో నంగదుని రొమ్మునఁ గొట్టెను. రోషావేశముతో నంగదుఁడొక ఖడ్గము నెత్తి వజ్రదంష్ట్రుని రెండుతునియలుగఁ దెగవేసెను. రాక్షసులు పాఱిపోయిరి. వానరులు సంతోషముతో నంగదుని గొనియాడిరి.

## అకంపనుఁడు.

---

ఈవార్త విని నంతనే రావణుఁడు కోపముచే మండిపడి బలాఢ్యుఁడగు ప్రహస్తునిఁజూచి "సాటిలేని పరాక్రమవంతుఁడగు నకంపనుని గొప్పసైన్యముతోఁ బంపు" మనెను. వెంటనే ప్రహస్తుఁడు మహావీరులగు రాక్షసుల ననేకుల సహాయమిచ్చి యకంపనుని యుద్ధమునకుఁ బొమ్మనెను. వాఁడొక గొప్పరథమెక్కి కాంతులీను కుండలములను ధరించి మహోగ్రుఁడై బయలువెడలెను గుఱ్ఱములు జంకి వెనుకకుఁ బోయినవి. అకంపనుని యెడమకన్నదరెను. సుడిగాలిలేచి దుమ్ముచే నలుదిక్కులు నిండెను. వెంటనే రాక్షసులకును వానరులకును దొమ్మియుద్ధము జరిగెను. దుమ్ముచేఁ జీకటిక్రమ్మినందున రాక్షసులు రాక్షసులను వానరులు వానరులను గొంతసేపు కొట్టుకొనిరి. వానరులు రాక్షసుల నెక్కువ నొప్పించుచుండ రాక్షసులు బెదరి చెదరిపోవుటఁ గని యకంపనుఁడు రథము నచ్చోటికిఁబోనిచ్చి రోషావేశమున వానరులఁ గుప్పలు కుప్పలుగఁ గూల్చెను. అంత హనుమంతుఁ డచ్చోటుచేరి పర్వతము నెత్తి యకంపనునిమీఁద వేయఁగా వాఁడద్దానిని బాణపరంపరలచే నుగ్గుచేసె. హనుమంతుఁడొక మద్దిమ్రానునెత్తి గిరగిరఁద్రిప్పుచుఁబోవ నకంపనుఁ డాతనిఁ బదునాల్గుబాణములేసి నొప్పించెను. హనుమంతుఁడా బాణములతోఁ జెట్లుమొలచిన కొండవలెఁ జూపట్టెను. మఱల హనుమంతుఁడు రోషంబు మీఱ మఱియొకవృక్షముతో వాని శిరంబునుగొట్టినంత నకంపనుఁడు మృతుఁడై నేలఁగూలెను. రాక్షసులు భయపడి

లంకకుఁ బాఱిపోయిరి. వానరులు, రామలక్ష్మణులు, విభీష ణుఁడు హనుమంతుని మిక్కిలి శ్లాఘించిరి.

## ప్రహస్తుఁడు.

అకంపనుని మరణవార్త చెవిసోకినంతనే రావణుఁడు మనసు కలఁతచెంది లంకాపురమునంతయుఁ జుట్టిచూచి వానరులు లంకను ముట్టడించిన విధమును గని కళవళముజెంది ప్రహస్తునితో "వీరా! నీవు, నికుంభుఁడు, కుంభకర్ణుఁడు, ఇంద్రజిత్తు లంకను సంరక్షింప సమర్థులు. ఇప్పుడు యుద్ధముచేయఁ బొమ్ము. నీసింహనాదమువినినంతనే వానరులు చెల్లాచెదరగుదురు. రామలక్ష్మణులు దీనులై మనకు లొంగుదురు. ఇప్పుడేది కర్తవ్యమో యోచింపుము. యుద్ధముచేయకున్న శత్రువులు లోఁబడరు. చేసిన జయాపజయములు సందేహాస్పదములు. కనుక యుద్ధముచేయవలెనని నా యభిప్రాయము. నీవేమందువు?" అనెను.

ఇట్లుచెప్పిన రావణునిమాటలు విని ప్రహస్తుఁడు "రాజా! కాలము మించినది. యుద్ధము వలదనినందున విభీషణు నవమానించి వెడలనడచునట్లుచేసితివి. నేను నీవలన బహుమతుల నెన్నియో గైకొన్నవాఁడనగుట నీకొఱకుఁ బ్రాణము నర్పించెద"నని గొప్ప సైన్యము వెంటఁబెట్టుకొని భేరీమృదంగాది వాద్యములు మ్రోయ బయలువెడలి తూర్పుద్వారము చేరెను. పక్షులాకాశమున వికారముగుకూతలతో రథమునకు ప్రదక్షిణముగఁ బోయెను. నక్కలు వికారముగ నఱచినవి. సారథి చేతిలోని మునికోల నేలఁబడెను. ఇట్లుండ వానరులు పెడబొబ్బ

లిడుచు రాక్షసుల నెదుర్కొనిరి. వానరులు శిలావర్షము గురిపించిరి. రాక్షసులు బాణవర్షముకురిపించిరి. యుద్ధము ఘోరమయ్యెను. నరాంతకుఁడు, కుంభహనుఁడు, మహానాదుఁడు, సమున్నతుఁడను నలుగురు మంత్రులు ప్రహస్తుని ప్రతాపముచే నుత్సాహముపొంది వానరుల ననేకులఁ జంపిరి. జాంబవంతుఁడు మహానాదుని తారుఁడు కుంభహనుని, ద్వివిదుఁడు నరాంతకుని, దుర్ముఖుఁడు సమున్నతుని వధించిరి. అంత మంత్రుల మరణముచుజూచి ప్రహస్తుఁడు కాలాంతకునివలె నాగ్రహాపూరితుఁడై నీలునిమీఁద ననేక బాణములఁ బ్రయోగించి నొప్పించెను. అంత రోషమతిశయించిన నీలుఁడు వృక్షము నెత్తికొని వాని రథమును నశ్వములను సారథిని నాశమొందించెను. అప్పుడు ప్రహస్తుఁడు నీలుని లలాటమున ముసలముతోఁ బెనుగాయముగలిగించెను. నీలుఁడు వెంటనే పెద్ద శిలనెత్తి ప్రహస్తునితలను బెక్కువ్రయ్యలుగావించెను. రాక్షసులు ప్రాణభీతిచేఁ బరుగిడిపోయిరి. నీలుఁడు రామలక్ష్మణులఁ గూడి సంతోషించెను.

## రావణుఁడు యుద్ధమునకువచ్చుట.

ప్రహస్తుఁడును మరణించెనని వినినతోడనే రావణుఁడు స్వయముగ యుద్ధభూమికిఁబోవనెంచి, కాంతితో నతిశయించు గొప్ప రథము నారోహించి, శంఖభేరీపణవమృదంగాది వాద్యఘోషములు చెలంగ, సముద్రము పొంగివచ్చునట్లు గొప్ప రాక్షససైన్యముతో జ్వలించు కిరీటకుండలములతో నగ్నివలెఁ బ్రకాశించు నయనములతో యుద్ధభూమిఁ జేరెను. అంత రాముఁ

డెవరెవరు వచ్చుచున్నారని యడిగినందున విభీషణుఁడు "ఎఱ్ఱనిముఖముతోఁ బెనుకాయముగలిగి యేనుఁగుమూఁపునఁ గూర్చుండివచ్చెడివాఁడు రావణుని కుమారుఁ డకంపనుఁడను వాఁడు. రథమునెక్కి సింహధ్వజముతోఁ గోఱపండ్లుగలిగి వచ్చువాఁడే బ్రహ్మచే వరముపొందిన యింద్రజిత్తు. పర్వతాకారముతో రథమెక్కి వచ్చువాఁడే యతికాయుఁడు. ఎఱ్ఱని కండ్లుగలిగి యేనుఁగుమీఁదవచ్చువాఁడు మహోదరుఁడు. నానా విధ జంతువుల ముఖములుగలిగి భూతములచేఁ జుట్టఁబడి పదితలలుగలిగి వివిధాభరణములతో జ్వలించుచుండువాఁడే దేవవైరియగు రావణుఁడు" అని వివరించిచెప్పెను. అంత రాముఁడు విభీషణునితో "ఆహా! ఏమిరూపము! ఏమి తేజము! నా భార్య నపహరించిన శత్రువు నిప్పుడు కాంచితిని. ఇఁకఁ జూపెద నా ప్రతాప"మనెను.

రావణుఁడు రాక్షసవీరులఁ జూచి యెల్లరిచ్చటనుండు సమయముఁగని పెట్టి వానరులు లంకలోఁ బ్రవేశింతురు. కావున మీరెల్ల రాయా సంరక్షకస్థానములందుండి లంకను గాఁచి యుండుఁడని వారిని వీడ్కొలిపి తాను యుద్ధమారంభించెను. వానరరాజగు సుగ్రీవుఁడు పర్వతశిఖరము నతనిపై విసరివైచెను. రావణుఁడద్దానిని బాణములచే ముక్కలుచేసెను. వెంటనే రావణుఁ డొక వాడియమ్మును సుగ్రీవునిపై వేయ సుగ్రీవుఁడు బాధచే నేలఁబడెను. అంత వానరులు రావణుని బాణపరంపరలచే మిక్కిలి గాసినొంది భీతులై రాముని శరణువేఁడిరి. రాముఁడు ధనుర్ధరుఁడై బయలుదేరుటఁగాంచి లక్ష్మణుఁడు చేమోడ్చి "అన్నా! పరంపరాపహారకుఁడగు మహాపాపితో

నీవు యుద్ధముచేయనేల? నేనిప్పుడే వానిని యమపురికిఁ బంపి వచ్చెద. నాకనుజ్ఞ యిమ్మ"నెను. అప్పుడు రాముఁడు "లక్ష్మణా! జాగరూకతతో నుండుము. వాఁడు మోసపుచ్చును. ఒక బాణము నెత్తి మఱియొకటి ప్రయోగించి నొప్పించును" అనెను. అంత లక్ష్మణుఁడు రాముని కౌఁగలించి ప్రదక్షిణనమస్కారములుచేసి ధనుర్బాణములంగొనిపోయి, వానరుల హతమొందించుచుండు రావణునిఁజూచెను. ఇంతలో హనుమంతుఁడు "భృత్యుఁడనగు నేనుండ నీవేలరావలె"నని రావణునిరథము నెక్కి "ఓరీ! దేవతలను జయించితివిగదా. వానరునిదెబ్బకిప్పుడు చత్తువు చూడు" మనెను. అంత రావణుఁడు కుపితుఁడై "ఓరీ, వానరా! నీకింతగర్వమా! యని యఱచేతితో హనుమంతుని రొమ్మునఁగొట్టెను. ఆ దెబ్బ కాంజనేయుఁ డొకింత జంకి రావణుని యఱచేతితోఁగొట్టెను. రావణుఁడా దెబ్బకుఁ జకితుఁడయ్యె. మఱలఁ దెప్పిఱిలి నాకుఁ దగినవైరివే యని మఱలఁగొట్టెను. హనుమంతుఁడు గొంచెముమూర్ఛిల్లగా రావణుఁడు నీలునిపై దూకెను. రావణుని సాహసమున కచ్చెరువొంది నీలుఁడతనిపై వృక్షములను విసరివైచెను. రావణుఁడు వానిని బాణములచే ముక్కలుచేయుచుండ నీలుఁడు తన రూపమును చిన్నదిగావించుకొని రావణుని ధ్వజముమీఁదికిని ధనస్సుమీఁదికిని కిరీటముమీఁదికిని మార్చిమార్చి దూకుచుండ రావణుఁ డలిగి యాగ్నేయాస్త్రము ప్రయోగింప నీలుఁడు ధ్వజమునుండి నేలఁబడెను. రావణుడు సుగ్రీవాదుల నొప్పించెను. ఇట్లుండ లక్ష్మణుఁడు రావణునితో యుద్ధముచేయ నారంభించి తీక్ష్ణబాణముల వానిమీఁదఁ బ్రయోగించెను. అంత రావణుఁ

డలిగి "ఓరీ! నీవు యమపురికిఁబోవ దారి వెదకుచున్నా"వనెను. లక్ష్మణుఁ డందులకు "ఓరీ! మహాపాపీ! నీవు మోసముచేసి సీత నపహరించిన నీచుఁడవు. ఇప్పుడు నాచేఁజత్తు" వనెను.

రావణుఁడంత మిక్కిలి రోషముతో బాణపరంపరలచే లక్ష్మణునినొప్పింప లక్ష్మణుఁడును నతనిపై బాణవర్షము కురిపించెను. రావణుఁడు వేసిన బాణములను లక్ష్మణుఁడు మధ్యమార్గముననే ఖండించుటఁజూచి రావణుఁడాశ్చర్యపడి బ్రహ్మచే నొసఁగఁబడిన దివ్యబాణమును బ్రయోగింప లక్ష్మణుఁడొకింత మూర్ఛిల్లి లేచి బాణప్రయోగములచే రావణుని చాపముఁ ద్రుంచెను. అంత నాక్రూరుఁడు శక్తియను ఘోరమగు నాయుధమును లక్ష్మణుని రొమ్మున నేయ దానితాకునకు లక్ష్మణుఁడు స్పృహతప్పి నేలఁబడెను. రావణుఁడంత లక్ష్మణుని నెత్తుకొనఁబ్రయత్నించి విఫలుఁడయ్యెను. అందుల కేమి కారణమనిన లక్ష్మణుఁడు విష్ణువుసంశమున జనించినవాఁడగుటయే. కనుక నెంతబలవంతుఁడైనను విష్ణువునకు శత్రువగుటచే రావణుఁడు చేతఁగానివాఁడయ్యెను.

వెంటనే హనుమంతుఁ డచ్చోటికేగుదెంచి తన పిడికిటం గ్రుద్దినంత రావణుఁడు నెత్తురుఁగ్రక్కుచు రథమునఁబడి మూర్ఛిల్లెను. హనుమంతుఁడు విష్ణుభక్తుఁడగుటచే యుద్ధమునఁ బడియున్న లక్ష్మణు నెత్తికొని రాముని యొద్దకుఁజనెను. కొంత సేపటికి శక్తి లక్ష్మణునివదలి రావణునివద్దకుఁబోయిచేరెను. లక్ష్మణుఁడు దన విష్ణ్వంశమును ధ్యానింప బాధలుడిగి ధనుర్బాణముల నెత్తికొనెను. ఇంతలో రావణుఁడును మూర్ఛదేఱి యుద్ధముచేయనారంభింప వానరులు భీతులై పరుగిడఁగా

రామచంద్రుఁడు హనుమంతుని యభిమతంబున నతని నారో హించి దివ్యధనుర్బాణములతో రావణుఁడుండు స్థలముచేరి "ఓరీ! రాక్షసాధమా! నీవుచేసినపాపఫల మనుభవింప రమ్ము. నిన్నువధించి యమపురంబునకుఁ బంపెద" నని దివ్యమగు బాణములచే రావణుని రథమును గుఱ్ఱములను సారథిని నాశ ము గావించి, రావణునిరొమ్మున వజ్రతుల్యమగు బాణము నేసెను. అతఁడా దెబ్బకు మూర్ఛిల్లి ధనువును దిగవిడిచెను. అంత రాముఁడొక యర్ధచంద్రబాణముతో రావణుని కిరీటము లను బడఁద్రోసి భంగపఱచి "ఓరీ! రాక్షసరాజా! నీ విప్పుడు దీనుఁడవైతివి. నీవు మఱలిపోయి విశ్రాంతిపుచ్చుకొని రథము నెక్కి ధనుర్బాణములతో రమ్ము. అప్పుడు నాపరాక్రమము చూపెద. ఇట్టి దీనావస్థలో నధర్మయుద్ధముచేసి గెలుపొందు వాఁడనుగాను" అనెను. అంతఁ గడు లజ్జితుఁడై రావణుఁడు దుఃఖముతో లంకకేగెను. రామలక్ష్మణులు యుద్ధరంగమునఁ బడియున్న వానరుల శరీరములలోని బాణంబులఁదీసి బాధలు పోఁగొట్టిరి. వానరులు మిక్కిలి సంతోషించిరి.

## కుంభకర్ణుని మేలుకొలుపుట.

---

రామునిచేఁ బరాజితుఁడైన రావణుఁ డేకాంతమున నుండి "ఆహా! మహేంద్రపర్వతమువలెఁ జలింపఁజేయ వీలు గాని నన్ను మానవమాత్రుఁడైన రాముఁడు పరాభవించెనే! ఇఁక నాజన్మమేల? ఇంతకాలము నేను గడించినఖ్యాతి నేఁడు మంటఁగలిసెనే. ఎంతటి బలపరాక్రమసంపన్నుఁడనైన నేమి? విధిబలము గొప్పది. మున్నొకపర్యాయము అనరణ్యుఁడను

నిక్ష్వాకువంశరాజును నేనువధించుచుండ నతఁడు "ఓరీ!నీచా! నిన్ను నావంశపువాఁడొకఁడు పుత్రమిత్ర బంధుసహితముగఁ జంపు"ననెను. ఆమాట ఫలించునట్లున్నదే. నా గర్వమును జూచి యోర్వలేక బ్రహ్మ "నీవొక మానవమాత్రునిచే వధింపఁబడుదు"వని శపించెను. బ్రహ్మవాక్కు వ్యర్థముగానిది. మున్ను నేను పరమపతివ్రతయగు వేదవతిని తిరస్కరింప నామె 'నేను స్త్రీరూపముననే వేరొకజన్మమున నీ నాశమునకుఁ గారణభూతురాలనయ్యెద'ననెను. ఆమెవాక్కు ఫలించినది. పార్వతి, నందీశ్వరుఁడు, పుంజికస్థల, ఋషులు నన్ను నా దుశ్చరితమునకు శపించిరి. వారిమాటలు ఫలితమునకువచ్చినవి" అని తనమనసులో నిదివఱకుఁ దానుచేసిన యత్క్రమముల జ్ఞప్తికిఁ దెచ్చికొని ఖిన్నుఁడై మఱలఁదన యనుచరులఁబిలిచి 'మీరిఁక జాగుసేయక నిద్రించుచున్న నాతమ్ముఁడు కుంభకర్ణుని మేలుకొలుపుఁడు' అని యాజ్ఞాపించెను.

అంత రాక్షసులు వేలకొలఁదిమంది యొకటిన్నర యామడ విస్తీర్ణముగలిగి గుహాకారముగనుండు కుంభకర్ణుని మందిరముసొచ్చి శంఖ భేరీ మృదంగ పటహాకాహళాది వాద్యముల ప్రయోగించి యెల్ల ఱొక్కుమ్మడి సింహనాదములుచేసి, ఏనుఁగులు, గుఱ్ఱములు, ఒంటెలు మున్నగు జంతుజాలముల నతని యొడలిపై నడిపించి వివిధాయుధములతో నతని నొప్పించి లెక్కలేని కడవలనీరు చెవులలోఁబోసి యెట్టకేలకతని మేల్కొలిపి వేలకొలఁది కడవల మద్యమునిచ్చి కొండలవంటి రాసుల మాంసంబు తిననిచ్చి రావణుని సందర్శింప నగత్యముగలిగినదని రావణునాజ్ఞయని చెప్పిరి.

కుంభకర్ణుఁడు మేలుదుస్తులు తొడిగికొని కిరీటాభర ణాదులతో మెఱుముతోఁగూడిన మేఘముఁబోలె రావణుని మందిరమునకుఁజనుచుండ వానరులాయాకారముఁజూచి భయ పడి పరుగిడిరి.

రాముఁడా పర్వతాకారమునుజూచి వీడెవఁడనియడుగ విభీషణుఁడు "రామచంద్రా! వీఁడే విశ్రవసుని కుమారుఁడగు కుంభకర్ణుఁడు. సాటిలేని యాకారమును బలమును గలవాఁడు. వీఁడు పుట్టుకతోఁడనే బలవంతుఁడగుటచేఁ బ్రాణుల నధికముగ బట్టి భక్షించుచుండ దేవేంద్రుఁ డతనిని వజ్రాయుధముతోఁ గొట్టెను. అంత వాఁ డైరావతము దంతముతో దేవేంద్రుని బాడిచెను. ఇంద్రాది దేవతలు బ్రహ్మయొద్ద కేగి "కుంభకర్ణుఁడు మితిలేక బ్రాహ్మణులనుబట్టి భక్షించుచు దేవతలను ఋషు లను స్త్రీలను విశేషముగ బాధించుచున్నాఁ" డనిరి. అంత బ్రహ్మ కుంభకర్ణునిఁజూచి "నీఁవిక నిద్రముచ్చువగుదువుగాక" యని శపింప రావణుఁడు శాపవిముక్తియడుగ విరించి "వీఁ డాఱు నెలలకుఁ దక్కువ లేక నిద్రించి యొకఁ-దినము మేల్కొని కావలసినంత యాహారముదిని మఱల నిద్రించు"ననియె. అంత రామచంద్రుఁడు నీలునిఁజూచి "అగ్నితనయా! నీ విప్పుడు సైన్యమును వ్యూహములుగాఁ దీర్చి లంకాద్వారములను సంరక్షించుచు జాగరూకుఁడవై యుండు" మనెను. నీలుఁ డట్లే చేసెను.

## రావణ కుంభకర్ణుల యాలోచనలు.

---

కుంభకర్ణుఁడు రావణునిగృహములోనికిఁ బ్రవేశించినంతనే

రావణుఁ డాసనమునుండి దిగి కుంభకర్ణుని తనయాసనము వద్దనున్న కనకాసనమున కూర్చుండ నియోగించి తా నాసన మలంకరించెను. కుంభకర్ణుఁ డన్నకు నమస్కరించెను. వెంటనే రావణుఁడతనిఁ గౌఁగిలించెను. కుంభకర్ణుఁడు "రాజోత్తమా! నన్ను నిద్రనుండిలేపినందుల కేమికారణమో తెలుపఁగోరెద" ననెను. అంత రావణుఁడు "మహాబలా! ఇప్పటికి నీవు నిద్ర బోయి తొమ్మిదిదినములయినవి. రామునివలన నాకుఁగలిగిన నష్టకష్టములు చెప్పరానివి. లంక ముప్పాతికభాగము నాశ మయ్యెను. మహావీరులు మరణించిరి. నేనును భంగపడి ప్రాణముతో మఱలివచ్చితిని. ఇప్పుడీ లంకారాజ్యము నీ యాపదనుండి తప్పించుభారము నీమీఁదనున్నది. నీ సహాయ ము లేకున్న నాకీయాపద తీర"దనెను.

రావణుఁడిట్లు దీనముగబలికినమాటలువిని కుంభకర్ణుఁ డు నవ్వి "కాలదేశములకుఁ దగిన యాలోచనలుచేయుట ధర్మము. ప్రాతఃకాలమున ధర్మమును మధ్యాహ్నమున అర్థ మును సాయంకాలమున కామమును ననుసరించువాఁడే నీతి పరుఁడు, అట్టి నీతిపరునకే జయముచేకూరును, కీర్తికలుగును. కేవలము కామమునేగోరి ధర్మార్థముల విడనాడిన సుఖమెన్న టికిని గలుగదు. పశువులకును మానవులకును దక్కంగల వారికిని యాహారనిద్రాదులలో భేదములేదు. యుక్తాయుక్త ముల నెఱిఁగి నీతినియమములఁబాటించి శాస్త్రజ్ఞానము నను ష్ఠానపర్యంత ముపయోగించువారే యుత్తములు. బుద్ధిమంతు లగు మంత్రులతో నొకవిషయమును బూర్తిగ సహేతుకముగ చర్చించి దానివలనగాఁబోవుఫలితములను ముందుగనూహించి

పరిహారముల నిర్ణయించుకొని కార్యమునకుఁ గడంగవలయును. తొలుత మేముచెప్పిన హితమును గైకొనక దుర్మంత్రుల దురాలోచనకు లోనయినందున నిట్టిదురవస్థకు గుఱియైతి' వనెను.

అంత రావణుఁడు కుపితుఁడై "ఓరీ! నీకు జ్యేష్ఠుఁడనగు నాకు నీవు నీతులుఁగఱపుచున్నావా? నీతి ననుసరింపవలసిన కాలము గడచినది. గతమునకు వగచుట వెఱ్ఱితనము. ఇఁక నేమిచేసిన మేలుగలుగునో యాలోచించి చేసిన శుభము గలుగును. చెప్పినమాటలే చెప్పినందున నేమి ప్రయోజనము? ఆప్తులైన బంధువులుగాని మిత్రులుగాని యాపత్కాలమున సాయమొనర్చి యాపదఁ బాపుట ముఖ్య" మనెను.

వెంటనే కుంభకర్ణుఁడు 'రాజపుంగవా! చెప్పవలసిన న్యాయము ననుసరించి యిట్లు చెప్పితిని. నిన్ను తిరస్కరింపఁ గాదు. నీతమ్ముఁడగుట నీ క్షేమముఁగోరి యిప్పుడే యుద్ధము చేసి రాముని తలను దెచ్చి నీకిచ్చెదను. దేవతలుగాని యముఁడుగాని, కుబేరుఁడుగాని మఱెవ్వఁడుగాని నన్నెదిరించి బ్రతుకఁడని నమ్ముము. నీవిఁక శోకముడిగి మద్యముఁద్రావి సీతను వశము చేసికొమ్ము" మనెను.

## కుంభకర్ణుఁడు యుద్ధముచేయుట.

అంత మహోదరుఁడు "కుంభకర్ణా! బాల్యమున నను భవముండదు. కనుక నీవిట్లుపలుకుచున్నావు. రాజు నీతి తెలియనివాఁడంటివి. కేవలము కామమునే యనుష్ఠించుచున్నాఁడంటివి. పుణ్యమునకుఁ బుణ్యఫలమును బాపమునకుఁ బాపఫలమును గలుగునంటివి. కామమునే యనుష్ఠించువారును

సుఖపడుచున్నారు. ధర్మార్థముల ననుష్ఠించువారు కష్టపడుటయుఁగలదు. కనుక మనరాజు కామమువలన సుఖముపొందఁగోరెను. కాన నీవతని దూషించుటఁ దగదు. నీవిప్పుడు జనస్థానమున ఖరదూషణాది పదునాలుగువేల రాక్షసులఁ జంపిన రాముని పరాక్రమమునుగూర్చి వినియు నొంటరిగ యుద్ధము సేయఁబూనుట యుక్తముగా" దనెను. మఱల నతఁడు రావణునిఁజూచి "రాజోత్తమా! నేనును, ద్విజిహ్వుఁడు, సంహ్రాదియు, కుంభకర్ణుఁడును, వితర్దనుండును రాము నోడించి వత్తుము. లేకున్న రామనామాంకిత బాణములు శరీరము నిండి యుండునట్లు మఱలివత్తుము. నీవు రామలక్ష్మణులు వీరైదుగురిచేఁ జంపబడిరని చాటి సీతకు మమ్ముఁజూపింతువేని యామె శోకమునమునిఁగి స్త్రీయగుటచేఁ జాపల్యమున నీ రైశ్వర్యములను బ్రతాపమునుజూచి తానై నిన్ను వలఁచును. ఇది యుద్ధమునకు నీవుపోకుండ సీతను వశపఱచుకొను నుపాయ" మనెను.

కుంభకర్ణుఁడీమాటలువిని మహోదరుని బెదరించి 'ఓరీ! మీవంటి దుర్మంత్రులు దుర్బోధనలుచేసి రాజు నధర్మమార్గమున నడువం బురికొల్పి లంకలో రాజొక్కఁడే మిగులునట్టి దుస్థితిఁ దెచ్చిపెట్టితిరి. చాలు నీమాటలు. ఇఁక వదరఁబోకు' మనెను. అంత రావణుఁడు "కుంభకర్ణా! నీ వొంటరిగ యుద్ధమునకుఁబోకుము. నానావిధాయుధధారులగు రాక్షసవీరుల వెంటఁగొనిపొమ్ము. నీకు జయమగుగాక!" యనిచెప్పి రావణుఁడు కుంభకర్ణున కనేకాభరణములఁ దొడిగెను. మహాబలుఁడగు కుంభకర్ణుఁ డన్నను కౌఁగిలించి యతనికిఁ బ్రదక్షిణ

నమస్కారములుచేసి దీవనలుపొంది బయలువెడలెను. పర్వతాకారుఁడగు కుంభకర్ణుఁడు బయలుదేరఁగా రాక్షసులు శంఖ దుందుభి మృదంగ కాహళాది వాద్యఘోషములతో నమితోత్సాహమున నానావిధాయుధములు ధరించి యుద్ధభూమికిఁ బోయిరి. లంకలోనివారు మేడలనుండి కుంభకర్ణునిమీఁద పుష్పవర్షము కురిపించిరి. శూలధారియగు నా రాక్షసుఁడు కాలాంతకునివలెఁ జూపట్టెను. అతఁడు ప్రాకారమును దాఁటి యుద్ధరంగముసొచ్చి "ఈ యల్పబలులగు వానరులతో నాకేమి లెక్క. లంకనుముట్టడించిన రామలక్ష్మణులను జంపిన యుద్ధము ముగిసినట్లే" యనెను.

ఆ పెనుభూతమువంటి యాకారమును భయంకరమగు నతనిమాటలు వినినంత వానరులు భయపడి దిక్కులకుఁ బరుగిడఁజొచ్చిరి. అంగదుఁడు వారినిఁజూచి "వానరులారా! ఏల భయపడెదరు? ఎట్టివాఁడైనను రామునిబారినుండి తప్పించుకొనలేఁడు. మీ రింతకాలము గడించిన కీర్తిని పోఁగొట్టుకొందురా? యుద్ధభూమినుండి పలాయితులయినచో మీభార్యలు పిఱికిపందలగు మిమ్మవమానింతురు. అంతకంటె నింద్య మేమి గలదు? నిలిచి యుద్ధముచేసి గెలుపొందుఁడు. లేకున్న మరణించి వీరస్వర్గముచేరుఁడ" నిన వానరులు నిలిచి వృక్షములను కొండల నెత్తికొని యుద్ధముచేసిరి. కుంభకర్ణుఁడు వానరులను నోటవేసికొని నమలుచు సింహనాదముచేయుచుఁ బ్రళయకాలరుద్రునివలె నెదురులేక సంచరించుచుండెను.

హనుమంతుఁ డతనిపై వృక్షములను కొండశిలలను వర్షించుచుండ వాఁ డెంతమాత్రము జంకక వాని నన్నిఁటిని

చూర్ణముచేసివైచెను. కుంభకర్ణుఁడు శూలమును గిరగిరఁ ద్రిప్పి హనుమంతుని రొమ్మునఁగొట్టెను. అంత నాంజనేయుఁడు నోట నెత్తురు గ్రక్కుచు మిక్కిలి బాధపడుటను గాంచి వానరులు మఱల దిక్కులకుఁ బాఱిపోవుచుండిరి. నీలుఁడు వారికి ధైర్యముచెప్పి యొక్క పర్వతశిఖరమును కుంభకర్ణుని తలమీఁద వేయఁగా వాఁడద్దానిఁ దన పిడికిలిచేఁ దట్టివైచెను. ఋషభుఁడు, శరభుఁడు, నీలుఁడు, గంధమాదనుఁడు, గవాక్షుఁడు మున్నగువారందఱు వానిశరీరముపై కెక్కి కోరలతోఁ గఱచియుఁ, బిడికిళ్ళతోఁ గ్రుద్దియు, మోకాళ్ళతో మోదియు, నఱచేతులతోఁ జఱచియు నొప్పించిరిగాని వాఁడెంతమాత్రము లక్ష్యముచేసినవాఁడుగాఁడు. అప్పుడంగదుఁడు వాని నఱచేతితో రొమ్మునఁగొట్టెను. కుంభకర్ణుఁ డాదెబ్బకు మూర్ఛిల్లెను గాని కొంతసేపటికి మూర్ఛదేఱి పిడికిలితో నంగదుని గ్రుద్దెను. వాఁడు మూర్ఛిల్లెను.

ఇంతలో సుగ్రీవుఁడు గొప్ప కొండశిఖరమును కుంభకర్ణునిపై విసరివేసెను. కుంభకర్ణుఁ డద్దానిఁ జూర్ణముఁగావించి శూలముతో సుగ్రీవునిఁ జంపఁబోవ హనుమంతుఁడా శూలమును భగ్నముసేసెను. అంత నా రాక్షసుఁడు క్రోధముతో నొక కొండశిఖరమును సుగ్రీవునిపై వేయ నా వానరరాజు మూర్ఛిల్లి పడెను. కుంభకర్ణుఁడు సుగ్రీవునెత్తికొని జయప్రసుఁడై లంకాపురవీథులలోఁ బోవుచుండ జనులు మేడలనుండి యతనిపై పుష్పములను బన్నీటిని చల్లి శైత్యోపచారములుచేయ సుగ్రీవుఁడు ప్రజ్ఞఁబొంది యాలోచించి కుంభకర్ణుని చెవులఁగోసి ముక్కునుగొఱికి డొక్కలుచీల్చెను అప్పుడు కుంభకర్ణుఁడు

మిక్కిలియాగ్రహముపొంది సుగ్రీవుని నేలఁబడవైచి నలిపెను. సుగ్రీవుఁడు దటాలున నింగికెగసి రామునిసన్నిధానము చేరెను.

కుంభకర్ణుఁడు ముక్కునుండియుఁ జెవులనుండియు డొక్కలనుండియు రక్తము పర్వతమునుండి సెలయేళ్ళవలె దూకుచుండ మహారౌద్రముతోఁ బరుగిడి యుద్ధభూమినిఁ జేరి వానరులనుబట్టి యిష్టానుసారము దినుచుండ వానరులు రామునాశ్రయించిరి. అంత లక్ష్మణుఁడా రాక్షసుని బాణములతో నొప్పించినను వాఁడు లక్ష్యపెట్టక రామునిమీఁది కురవడించెను. రాముని బాణముల దెబ్బలచేఁ గుంభకర్ణుఁడు తబ్బిబ్బుపడ నతని చేతిగద జాఱిపడెను. నిరాయుధుఁడైన నా రాక్షసుఁడు కుపితుండై పర్వతశిఖరమునెత్తి రామునిపయి నేయ నతఁడద్దాని బాణములచే నుగ్గుచేసెను. అంత రాముఁడు "ఓరీ! కుంభకర్ణా! ఇంద్రునిజయించినగర్వ ముడుగుము. నేనే రాముఁడను. నిన్నిప్పుడే యమలోకమునకు చేర్చెద" ననెను. కుంభకర్ణుఁ డంత "రామా! నేను ఖరుఁడనుగాను, విరాధుఁడనుగాను, కబంధుఁడనుగాను, వాలినిగాను. వారిని వధించితినను గర్వము వీడుము. నీపాలిటి మృత్యుదేవతనగు కుంభకర్ణుఁడను. నాచేతి ముద్గరమున కెరయయ్యెద"వని చెప్పి రామునిమీఁద ముద్గరమును బ్రయోగించెను. అంత రాముని వాయవ్యాస్త్ర మతని చేతిని ముద్గరముతో ఖండించివైచెను. ఆరాక్షసుఁ డప్పుడొక సాలవృక్షము గొని రామునిమీఁదికి రాఁగా రాముఁ డైంద్రాస్త్రముచే వృక్షసహితముగ నా బాహువును ఖండించెను. అప్పటికిని వెనుదీయక వాఁడు తనమీఁదికి వచ్చుటఁజూచి రామచంద్రుఁ డర్ధచంద్రబాణములతో నతనిపాదములఁ ద్రుం

చెను. ఇంకను గదలుచున్న కుంభకర్ణునిఁజూచి రామచంద్రుఁడైంద్రాస్త్రము నేసి వానిశిరమును ఖండింప నది పడుటచేఁ గొన్ని గృహంబులును లంకాద్వారములును ప్రాకారమును విఱిగి నేలఁగూలెను. రాక్షసులు పలాయితులయిరి. రామచంద్రుని యసాధారణ పరాక్రమమునకు సుగ్రీవాది వానరులాశ్చర్యానందము నొందిరి. దేవ ఋషి గంధర్వ గణంబులు సంతోషించెను.

పిడుగువంటి కుంభకర్ణుని మరణవార్త చెవినిబడినంతనే రావణుఁడు నేలఁబడి మూర్ఛిల్లెను. రాక్షసు రెల్ల జేడ్చిరి. కొంతవడికి రావణుఁడు మూర్ఛదేఱి "కుంభకర్ణా! నీవలనఁ గడతేర నెంచితినే. ఇంద్రాదులను జయించిన నిన్నుమించిన వీరుఁడు లేఁడని ధైర్యముతోనుంటినే! కలలోనైన నీవు యుద్ధమున మరణింతువని తలఁచినవాఁడఁ గానే. ఆహా! ఆ శ్రీమంతుఁడగు విభీషణుని హితమును గైకొనక నతని నవమానించి తఱిమివేసినందుల కిట్టిఫల మనుభవించుచున్నాను. ముందు జన్మమునఁ జేసిన కర్మఫలము నీజన్మమున ననుభవింతు మందురే. నా కిప్పటికర్మఫల మిప్పుడే లభించుచున్నదే. ఇఁక నాకు సీతమాట యేల? నేనిఁక జీవించియుండ నేరను. కుంభకర్ణుని పోఁగొట్టుకొని బ్రతుకు టెట్లు?"అని నేలఁబడి రోదనము సేయుచుండెను.

# 19. లక్ష్మణుఁ డింద్రజిత్తును వధించుట.

## త్రిశిరాదులు యుద్ధమునకు వచ్చుట.

---

రావణుఁడిట్లు విలపించుచుండఁగా నతనికుమారుఁడగు త్రిశిరుఁడు తండ్రినోదార్చి రథము నెక్కి యుద్ధమునకుఁ బోవు నపు డతనిసోదరుఁడగు నతికాయుఁడును మేలైనరథము నెక్కి యతని వెంబడించెను. అంత దేవాంతకుఁడు, నరాంతకుఁడు, మహోదరుఁడు, మహాపార్శ్వుఁడను రాక్షసవీరులును వారి వారి వాహనముల నెక్కి దివ్యాయుధములుదాల్చి సైన్యసమేతులై యుద్ధమునకుఁ బోయిరి. వీరిని జూచినంతనే వానరులుత్సాహముతో వృక్షములను పర్వతశిఖరముల నెత్తికొని వీరి నెదుర్కొనిరి. యుద్ధము తీవ్రముగ జరుగ నారంభించెను. వానరులు రాక్షసులయాయుధముల గ్రహించి వారినేవధించిరి. రాక్షసులు వృక్షాదులను వానరులవద్దనుండి గ్రహించి వారినే వధించిరి. నరాంతకుఁడు వానరులను వందలకొలఁది హతము సేయుచుండ సుగ్రీవునియానతిగొని యంగదుఁ డతనిచేఁగొట్టు వడియుఁ దుదకుఁ దన పిడికిటిపోటుచే వానిఁ గూలనేసెను. అంత రాముఁ డతనిని శ్లాఘించెను.

త్రిశిరుఁడు, దేవాంతకుఁడు, మహోదరుఁడు గలిసి యంగదు నెదుర్కొనిరి. అంగదుఁడు త్రిశిరునిపై వృక్షములను విసరివేయ నా రక్కసుఁడు వానిఁ జెదరఁగొట్టెను. దేవాంతకుఁడును బరిఘముతో నంగదుని నొప్పించెను. మహోదరుఁడు తనగజము నంగదునిమీఁదికిఁ దోల నంగదుఁడు దాని నఱచేతితోఁ జఱచి కండ్లూడఁ జేసి దానిదంతము నూడఁబెఱికి దాని

తో దేవాంతకునిఁ గొట్టెను. వాఁడొకింత మూర్ఛిల్లి మఱలఁ దెలివొంది పరిఘముచే నంగదునిఁగొట్టెను. కొంతసేపటి కంగదుఁడు లేచినంత వానిపయికి వచ్చుచున్న దేవాంతకుని హనుమంతుఁడు పిడికిటిపోటుచేఁ దలఁబగులఁగొట్టి చంపెను. ఇంతలోఁ దనమీఁదికెత్తివచ్చు మహోదరుని నీలుఁడు పర్వతముతోఁ గూల్చెను. అప్పుడు తనపినతండ్రి మరణించుటచేఁ గోపముగలిగిన త్రిశిరుఁడు హనుమంతునితో తీవ్రముగ యుద్ధము చేసెను గాని హనుమంతుని యఱచేతిదెబ్బకు నేలఁబడెను. వెంటనే హనుమంతుఁడు త్రిశిరుని ఖడ్గముతో వాని మూఁడు శిరములను ఖండించివైచెను. తన యనుచరులెల్లఱు వధింపఁబడిరను గోపముతో మహాపార్శ్వుడు తనకెదుటనుండిన ఋషభునిపయికిఁబోవ నా వానరోత్తముఁడు తటాలున వానిగదను బెఱికికొని దానితోనే మహాపార్శ్వుని హతమొనర్చెను.

## అతికాయ వధ.

ఇట్లు తన సోదరులును బినతండ్రులును హతమొందింపఁబడుటచే కోపావేశముతో రావణుని పుత్రుఁడగు నతికాయుఁడు వేయిగుఱ్ఱములు పూన్పఁబడి సూర్యకాంతితోఁ బ్రకాశించు పెద్దరథము నెక్కి వచ్చుచుండ రామచంద్రుఁడు చూచి విభీషణునితో "ఇప్పుడు వచ్చుచుండువాఁ డెవఁ"డని యడుగ విభీషణుఁడు "వీఁడు రావణునకు ధాన్యమాలినివలనఁబుట్టిన పుత్రుఁడు. వీని నతికాయుఁ డందురు. వీఁడు పెద్దలసేవించి విద్యానిపుణుఁడయ్యెను. ఇతఁడు సకలాస్త్రములు దెలిసినవాఁడు. యుద్ధమున రావణునంతటివాఁడు. ఇతఁడు బ్రహ్మ

దేవునిగూర్చి తపస్సుచేసి యీ దివ్యరథమును గవచమును దివ్యాస్త్రములను బొందినవాఁడు. ఇతని నుపేక్షింపక శీఘ్రమునఁ జంపు నుపాయము వెదకవలె" ననెను.

ఇంతలోఁ గుముదుఁడు, మైందుడు, ద్వివిదుఁడు, నీలుఁడు, శరభుఁ డను వారు వృక్షములను పర్వతశిఖములఁ గొని యుద్ధము చేసిరి. కాని యతికాయుఁడు రాముఁడున్న యెడకు వచ్చి "నే నల్పులతో యుద్ధముచేయను. నాతో యుద్ధము చేయ సమర్థుఁ డెవ్వఁడయినను రావచ్చు"ననెను. అప్పుడు లక్ష్మణుఁ డామాటలు విన్నంతనే రోషముగలుగఁ దన వింటినెత్తి యల్లెత్రాటి శబ్దముగలిగింప నతికాయుఁడు సంతసించి "లక్ష్మణా! పసివాఁడవు. నీపాలిటియముఁడనగు నాతో యుద్ధముచేసిన మరణముదప్పద"నెను. అంత లక్ష్మణుఁడు "ఓరీ! మాటలేల. రమ్ము నామహిమనుజూతు"వని బాణములు ప్రయోగించెను. అతికాయుఁడును బాణపరంపరలచే లక్ష్మణుని బాణములను తుత్తునియలుచేసెను. చాలసేపు యుద్ధముజరిగినతరువాత లక్ష్మణుఁడు బ్రహ్మాస్త్రము ప్రయోగించి వానిశిరమును బడవైచెను. వానరు లమితానందము నొందిరి. మిగిలిన రాక్షసులు పరుగిడిరి.

## రామలక్ష్మణుల మూర్ఛ.

యుద్ధభూమినుండి ప్రాణముతోఁ బోయిన రాక్షసుల మూలమున లక్ష్మణునిచే నతికాయుఁడు వధింపఁబడెనని విని రావణుఁడు దుఃఖసాగరమున మునిఁగి "ఆహా! ఏమిచిత్రము! సామాన్యమానవులని నేను భావించిన రామలక్ష్మణులు శ్రీ

మన్నా రాయణు వంశముతో జనించినవారనియే తోఁచుచున్న ది. లేకున్న ఖరదూషణాదులను, దేవతలకేని యజేయుఁడగు కుంభకర్ణుని, వరబలప్రభావముగల నతికాయుని గూడ వధించిరే. ఇప్పుడు నేనేమిచేయఁగలను" అని దీర్ఘాలోచనలోనుండ నితనికుమారుఁడగు నింద్రజిత్తువచ్చి "తండ్రీ! నామేనఁ బ్రాణ ముండునంతవఱకు నీవిట్లు దైన్యమునొందఁదగదు. ఎవరి నోడించియున్న నేమి? నేనిప్పుడే రామలక్ష్మణులను బాణపరంపరలచే నేలఁగూల్చి వారు హతులై యుండుటను నీకుఁ జూపగలనని సూటిగ యుద్ధభూమికిఁబోయి రాక్షసులను గట్టుదిట్టములతోఁ గావలియుంచి అగ్ని వేల్చి దివ్యరథమును బడయు నిమిత్తము మంత్రయుక్తముగ హోమముచేయ నారంభించెను. అగ్నిహోత్రుఁడే స్వయముగ దివ్యాభరణ భూషితుఁడయి వెలుపడి యింద్రజిత్తుచే నొసంగఁబడిన హవిస్సును గ్రహించెను. అంత మహాప్రభావశాలియగు నింద్రజిత్తు కోరఁగా దివ్యమగు రథమును, అశ్వములును సారథియు ఖడ్గమును నగ్నినుండి వెలువడ నింద్రజిత్తు వానిని గ్రహించి బ్రహ్మాస్త్రము నాహ్వానించెను. ఆ యస్త్రమునుబొంది వెంటనే ఇంద్రజిత్తు వానరులతో యుద్ధము గావించునట్లు రాక్షసుల కాజ్ఞయిచ్చి తా నదృశ్యుఁడై మాయాయుద్ధ మారంభించెను. రాక్షసు లింద్రజిత్తుపైఁగల గౌరవ నమ్మకములంబట్టి శక్తి తోమర శూల ఖడ్గ భిండివాలాది యాయుధములతో వానరులను వధింప నారంభించిరి. వానరులును వృక్షములతోను పర్వతశిఖరములతోను రోషావేశమున యుద్ధముసాగించిరిగని ఇంద్రజిత్తు ప్రయోగించు బాణసమూహములచే హనుమంతుఁడు, సుగ్రీ

వుఁడు, నీలుఁడు, సుషేణుఁడు, మైందుఁడు, ద్వివిదుఁడు, అంగదుఁడు మొదలగు వానరవీరు లందఱును జాంబవంతుఁడును మూర్ఛితులై నేలఁబడిరి. రామలక్ష్మణు లెంత నేర్పుతోఁ బోరినను వా రింద్రజిత్తుయొక్క బాణవర్షముచే మిక్కిలి పీడితులై మూర్ఛిల్లి నేలఁబడియుండిరి. కొంతసేపటికి మూర్ఛదేఱిన సుగ్రీవ హనుమ దంగద జాంబవదాదులను జూచి విభీషణుఁడు "మీరు భయపడవలదు. రామలక్ష్మణులకుఁ బ్రాణభయము గలుగదు. వారు మూర్ఛిల్లియున్నారు. వారు బ్రహ్మాస్త్రమును గౌరవించునిమిత్త మద్దానికిఁ గొంతకాలము కట్టువడియున్నార" నెను.

అంత విభీషణుఁడును హనుమంతుఁడును కొఱవికట్టులఁ జేకొని యుద్ధభూమిలో స్పృహతప్పిపడియున్న వానరులఁజూచి వారి కుపచారములు చేసి తెలివిపొందిన వారల నోదార్చి జాంబవంతుని సమీపించి "వీరాగ్రేసరా! నీవు ప్రాణముతో నున్నావుగదా" యనియడుగ జాంబవంతుఁడు హీనస్వరముతో "హనుమంతుఁడు ప్రాణముతో నున్నాఁడా" యని యడిగెను. అంత విభీషణుఁ డితనితో 'అయ్యా! మొట్టమొదట రామలక్ష్మణుల సేమము విచారింపక ఆంజనేయునిగూర్చి యడుగ నేల?' యనెను. అప్పుడు జాంబవంతుఁడు 'నాయనా! నీ గొంతునుబట్టి నీవు విభీషణుఁడవని తెలిసికొనుచున్నాను. హనుమంతుఁడొక్కఁడు ప్రాణముతో నుండినఁ దక్కినవా రెందఱెట్లున్న నేమి? హనుమంతుఁడు చచ్చినవారిని బ్రతికింపఁగల శక్తిసంపన్నుఁడు. కనుక మనపాలిటి ముఖ్యప్రాణదేవుఁడని చెప్పఁగలవాఁ డతఁడేయని దెలిసి యట్లడిగితి' ననెను. వెంటనే

హనుమంతుఁడు జాంబవంతునకు నమస్కరించి "నేనే హను మంతుఁడను. మీయాజ్ఞ నెదురుచూచుచున్నా"ననెను.

జాంబవంతుఁడు సంతోషించి 'నాయనా! హనుమంతా! రామలక్ష్మణులను, వానర భల్లూకాదు లెల్ల ఱను గాపాడఁగల వాఁడవు నీవే. మఱియొకనికిట్టి సామర్థ్యములేదు. నీవు వెంటనే సముద్రమునుదాఁటి హిమవత్పర్వతప్రాంతమున ఋషభపర్వత మునకును కైలాసమునకును నడుమఁ దేజోరాశియగు నోషధి పర్వతముసేరి యచ్చటచ్చట నున్న మృతసంజీవనియు (మర ణించినవారిని బ్రతికించునది) విశల్యకరణియు (ప్రాణమువచ్చి న తరువాత సంచరించుటకు వీలగునట్లుచేయునది) సావర్ణ్య కరణి (గాయముతగిలినచోట నేర్పడు వివర్ణతను బోగొట్టునది) సంధానకరణి (తెగినచర్మమును కూడునట్లుచేయునది) యను మూలికలనెత్తికొని తీవ్రముగ రావలె' ననెను.

అంత హనుమంతుఁడు త్రికూటపర్వతము నెక్కి యం దుండి లంకామలయపర్వతమునకువచ్చి మేనుబెంచి బిగ్గఱగ సింహనాదముచేయ లంకానగర మంతయు భూకంపముచేఁ గదలునట్లు చలింప రాక్షసులు దిగులుచెందిరి. ఆంజనేయుఁ డు రామునకు నమస్కరించి గరుత్మంతునివలె వాయుమార్గ మున బయలుదెడలెను. శీఘ్రమున నతఁడావలిగట్టుసేరి యతి త్వరితముగ నుత్తరదిక్కుగఁబోయి హిమవత్పర్వతప్రాంతమున నుండు నోషధిపర్వతముచేరి యోషధులను కనుగొనలేక కుపితుఁడై యా పర్వతశిఖరమును పెకలించి యెత్తికొని యా కాశమార్గమున నతివేగముగ లంకఁజేరెను. అతఁడు త్రికూట పర్వతమునవ్రాలి వానరులకు నమస్కరించి విభీషణుని యా

లింగనము చేసికొని రామలక్ష్మణులుండు స్థలము చేరెను. ఆ యోషధుల వాసనచే రామలక్ష్మణులు వెంటనే బాధ లుడిగి లేచి తేజోవంతులయి యుండిరి. వానరు లనేకులు నిద్రనుండి లేచినట్లు పునర్జీవితులయిరి. యుద్ధములో మరణించిన రాక్షసుల నప్పుడప్పుడే సముద్రమునఁ బడవేయుచుండినను కొందఱు యుద్ధభూమిలోఁ జచ్చిపడియుండువారును పునర్జీవితులైరి. వాయుపుత్రుండగు హనుమంతుఁడా పర్వతమువలన ననుకూల మేర్పడినందున దానిని మఱల హిమవత్పర్వతప్రాంతమునఁ జేర్చి రామునిసన్నిధానమునకు వచ్చి చేరెను.

సుగ్రీవు నాజ్ఞంగొని మేటివానరులు ప్రాకారముదాఁటి లంకలోఁబ్రవేశించి కొఱవులంగొని మేడలు మిద్దెలు వసతిగృహములు మొదలగువానిఁ గాల్చిరి. వస్త్రములు, భూషణములు, ఆయుధాలయములు, అశ్వశాలలు గజశాలలు మున్నగునవి దగ్ధములయ్యెను. రాక్షసులు లక్షలకొలఁది మంది దహింపఁబడిరి. రోదనధ్వనులు మిన్నుముట్టెను. స్త్రీలు, పురుషులు, వృద్ధులు, పిల్లలు ప్రాణముగాపాడుకొన నటు నిటు పరుగిడిరి. ఇట్లా రాత్రి లంకలోఁ బ్రళయకాలరాత్రియయ్యెను. సుగ్రీవుఁడు వానరవీరులను రావణాంతఃపురద్వారమున యుద్ధముసేయున ట్లాజ్ఞాపింప రావణుఁడలిగి కుంభ నికుంభులను, యూపాక్ష విరూపాక్షులను, ప్రజంఘుని, కంపనుని యుద్ధమునకుఁ బంపెను. అంత వానరులు వృక్షములను పర్వతశిఖరములను గొని చెలరేగి శూల పట్టస తోమర ఖడ్గాద్యాయుధధారులగు రాక్షసులతో వీరావేశమున యుద్ధము గావించిరి. అంగదుఁడు కంపనునిచేఁ గొట్టుబడి కలతచెంది మఱల

నొక పర్వతశిఖరముచేఁ గంపనుని గూల్చెను. శోణితాక్షుఁ డంగదుని నానావిధ బాణములతో నొప్పించెను గాని మహా వీరుఁ డంగదుఁడు వానిఖడ్గమును బెఱికికొని జందెమువేసికొను లాగున వానిని ఛేదించెనుగాని వాఁడు చావఁడయ్యె.

మహాప్రతాపశాలియగు ప్రజంఘుఁ డుగ్రుఁడై తన మీఁదికివచ్చుటఁజూచి యంగదుఁడు వానిని మద్దిచెట్టుతోఁ గొట్టి వానిచేతిఖడ్గము నేలఁబడ దానితో వానిశిరమును ఖండించెను. ద్వివిదుఁడు శోణితాక్షుని పిసికి ముద్దచేసి చంపెను. మైందుఁడు యూపాక్షుని నలిపి చంపెను కుంభుఁడను రాక్షసుఁడు పరాక్రమము మెఱయ మైందద్వివిదుల బాణములతో నొప్పించి నేలఁబడద్రోసెను రోషముతో నంగదుఁడు కుంభునిపై వృక్షములను విసరివేయ వాఁడు వాని నెగురఁగొట్టెను. అంతేగాక యంగదుని మూర్ఛిల్లఁజేసెను. కొంతసేపటి కంగదుఁడులేచి యుద్ధముచేసి మఱల రక్తగాయముచే నేలఁబడెను. జాంబవంతుఁడు, సుషేణుఁడు, వేగదర్శి యనువారు కుంభునితో యుద్ధముచేసిరిగాని వాఁడెంతమాత్రము జడిసినవాఁడు గాడయ్యె. అంత సుగ్రీవుఁ డెన్నియో వృక్షములను బర్వత శిఖరములను వేసెనుగాని కుంభుఁడన్నిటిని బాణపరంపరలచే నెగురఁగొట్ట సుగ్రీవుఁడు వానిఁజూచి "కుంభా! నీపరాక్రమము సాటిలేనిది. నీవు బుద్ధిమంతుఁడవు నీవు ధనుర్విద్యయం దింద్రజిత్తునకును పరాక్రమమున నీపెదతండ్రి రావణునకును సమానుఁడవు. నీ వలసియున్నాఁడవు. కొంత విశ్రాంతిపుచ్చుకొని వచ్చి నాతో యుద్ధముచేయు"మనెను. కుంభుఁడామాటలువిని రోషావేశముతో సుగ్రీవునిఁ బట్టుకొనెను. వా రిరువురును

నొకరినొకరు ద్రోయుచు లాగుచుండ సుగ్రీవుఁడు వానిని విసరి సముద్రమునఁ బడవైచెను. కుంభుఁడు వెంటనే వచ్చి పిడికిటి పోటుచే సుగ్రీవునిరొమ్మును గాయపఱచెను. అంత సుగ్రీవుఁడు వజ్రఘాతమువంటి పిడికిటిపోటుతోఁ గుంభునిఁ జంపెను.

కుంభుఁ డిట్లు సుగ్రీవునిచే హతుండగుటఁ జూచి వాని తమ్ముఁడగు నికుంభుఁడు భయంకరముగ పరిఘము నెత్తికొని యాభరణములు మెఱయ రోషముతో వచ్చుచుండ హనుమంతుఁ డతనికడ్డముగనిలచి తనరొమ్మునుజూపెను. నికుంభుఁ డాతని రొమ్మున నా పరిఘముతోఁగొట్టెను గాని యది వజ్రమువంటి హనుమంతుని రొమ్మునకుఁ దగిలి కాంతితో ముక్కలై నేలఁ బడెను. హనుమంతుఁడు వాని రొమ్మున నొక పిడికిటిపోటు వేయ వాఁడొకింత చలించి మఱల హనుమంతునిమీఁది కడరెను. వాఁడు హనుమంతునిఁ బయికెత్తెను. కొంతసేపటికి హనుమంతుఁడు విడిపించుకొని శ్రమపడి నికుంభుని నేలమీఁద బడవైచి పిసికి మెడనుద్రిప్పి వానిశిరమును ద్రుంచివేసెను.

## మకరాక్షుని రాముఁడు వధించుట.

కుంభ నికుంభుల మరణవార్త వినినంతనే రావణుఁడు కోపము, శోకము పొంది ఖరుని కుమారుఁడగు మకరాక్షుని యుద్ధమునకుఁ బొమ్మనెను. వాఁడు దివ్యమైన రథమునఁగూర్చుండి శంఖ భేరీ నినాదములతో బయలు వెడలెను. రాక్షసులమిత్రోత్సాహముతో గదాశూలాద్యనేకాయుధములఁ దాల్చి దుర్నిమిత్తములు గానవచ్చినను సరకుచేయక యుద్ధమునకుఁబోయిరి. వానరులకును రాక్షసులకును యుద్ధ మతిఘోర

ముగ జరిగెను. వానరులు వృక్షములను శిలల నవ్వారిగ నుప యోగించినను రాక్షసుల శూల పట్టిస భిండివాల ముద్గరా ద్యాయుధముల దెబ్బలకుఁ దాళలేక భయపడి పాఱుటఁజూచి రాక్షసులు సంతోషించి సింహనాదములు చేసిరి. మకరాక్షుఁ డు రాముని సమీపించి "రామా! జనస్థానమున నాతండ్రి ఖరుని వధించినపుడు నాకంటఁబడవైతివి. నేఁడు నీ కాయువు దీరినది. నీ కేయాయుధముఁ బరిచయమున్నదో రమ్ము. నిన్నిప్పుడే యముని మందిరమునకుఁ బంపెద" ననెను. అంత రామచం ద్రుఁడు "ఓరీ! వేయిమాటలేల? నాతో యుద్ధముచేసి ప్రాణము దక్కించుకొను" మనెను. మకరాక్షుఁడు బాణవర్షముచే నలు దిక్కులు నిండునట్లుచేయ రాముఁడు తన బాణములచే వాని నెగురఁగొట్టెను. వాఁడు మఱల రాముని బాణములతో నొ ప్పింప రాముఁడలిగి వాని వింటినిఁద్రుంచి రథమును గుఱ్ఱము లను సారథిని గూలనేసెను. మకరాక్షుఁడంతట తన శూలా యుధమును ప్రయోగింప రాముఁ డద్దానిని తునియలుచేసెను. అప్పుడా రాక్షసుఁడు పిడికిటితో రామునిఁ బొడువ నుంకింప రాముఁ డాగ్నేయాస్త్రమున వాని ప్రాణమును హరించెను. అంత రాక్షసులు దిక్కులేనివారై పరుగిడిరి.

## ఇంద్రజిత్తు యుద్ధమునకు వచ్చుట.

మకరాక్షుని మరణవార్తవిని రావణుఁడత్యంతకోపము గలుగ నింద్రజిత్తుచుజూచి "కుమారా! నీవు జయశీలుఁడవు. దేవదానవులెవ్వరు నిన్నెదుర్కొనజాలరు. నీవా రామలక్ష్మ ణులను వధించిరమ్మ"నెను. వెంటనే ఇంద్రజిత్తు తండ్రికి నమ

సహరించి యజ్ఞముచేయు స్థలమునకుఁ బోయి యగ్ని వ్రేల్చి హోమము సేయ నెంచి నల్లని మేకను ఛేదించెను. అగ్ని బంగారు వన్నెతో జ్వాలలుగలిగి మండెను. అగ్నిపురుషుఁడు మానవాకృతితో వచ్చి హవిస్సును గ్రహించెను. ఇంద్రజిత్తు హోమమువలన నదృశ్యమగు శక్తిగల రథమును నాలుగు గుఱ్ఱములను దివ్యమైన ధనువును బాణములను బ్రహ్మాస్త్రమును బొంది యుద్ధమునకు రాఁగా వానరులు వృక్షములతోను పర్వతశిఖరములతోను నెదురొడ్డిరి. యుద్ధ మతితీవ్రముగ జరుగ నారంభించెను. ఇంద్రజిత్తు మాయచే నంతర్ధానమై బాణవర్షముగురిపించి వానరులను రామలక్ష్మణులను మిక్కిలి నొప్పించెను. ధీరులగు రామలక్ష్మణులు వాని బాణములచేఁ బీడింపఁబడియు వెనుదీయక యుద్ధముచేసిరిగాని ఇంద్రజిత్తును కనుగొనలేరైరి. వానరులు కుప్పలు గూలుటనుజూచి లక్ష్మణుఁడు గోపించి "నేనిప్పుడే బ్రహ్మాస్త్రముఁ బ్రయోగించి రాక్షసశబ్దమైనను లేకుండఁ జేసెద"ననెను. అంత రామచంద్రుఁడు "సౌమిత్రీ! శాంతింపుము. ఒకనినిమిత్త మట్టి కార్యము చేయఁదగదు. ఇంద్రజిత్తునే వధింప యత్నించెద"మనెను.

ఆమాటవిని ఇంద్రజిత్తు తటాలున లంకలోనికేగి మఱల యుద్ధమునకు వచ్చుచు రామలక్ష్మణులను మోసపుచ్చ నెంచి మాయచే సీతను జేసి రథమునందుంచుకొని వానరులమధ్య వచ్చెను. అంత హనుమంతుఁడు పర్వతశిఖరముఁగొని వానిపై వేయ నెంచి సీతనుజూచినంతనే జాలినొంది దిగులుచెందెను. హనుమంతుఁ డింద్రజిత్తునుజూచి "ఓరీ దురాత్మా! సీతయొక్క వెండ్రుకలఁబట్టుకొంటివా? నీ కంత్యకాలము వచ్చినది. లేకున్న

నిట్టిదుర్బుద్ధి కలుగదు. జనకరాజు కూఁతురును రాముని ధర్మ
పత్నియు నగు సీతాదేవిని మా ముందఱఁ జంపనెంచితివా!
మహాపాపీ! నీవు స్త్రీహత్యచేయుటవలన లోకమునకే శత్రు
వైతి"వని చెప్పెను. అప్పుడింద్రజిత్తు "ఓరీ! వానరా! వినుము.
శత్రువునకేది దుఃఖకరమో దానిని చేయుట న్యాయమే. ఇప్పు
డీసీతను మీ ముందట వధించి మఱల రామలక్ష్మణులను హత
ముచేసి మీ యెల్లరను నాశమొందింతు" నని హనుమంతుని
ముందట ఖడ్గము నెత్తి జందెమువేసికొను వాటమున సీతను
తెగనఱికి రెండుతుండ్లుచేసెను. వానరులు భయపడి పరుగిడ
హనుమంతుఁడు వారికి ధైర్యము సెప్పెను.

## రామలక్ష్మణులు సీతనుగూర్చి దుఃఖించుట.

దూరమునసుండిన రామచంద్రుఁడు వానరుల యార్త
ధ్వని విని హనుమంతునకపాయముగలిగెనని యెంచి జాంబ
వంతుని సహాయముగఁ బంపెను. అట్లువచ్చుచుండు జాంబవం
తుని హనుమంతుఁడు మధ్యమార్గమునఁ గలసికొని జరిగిన
దానిని చెప్పి రాముని సమీపించి మిక్కిలి దుఃఖించుచు "శత్రు
సూదనా! యుద్ధభూమిలో మాముందట నింద్రజిత్తు సీతాదేవిని
రథమునఁ దెచ్చి ఖడ్గముతో నఱికి రెండుతుండ్లుచేసివైచె" ననెను.
పిడుగువంటి యామాటవినినంతనే రాముఁ డడుగునఱికినవృక్ష
మువలె నేలఁగూలి మూర్ఛిల్లెను. వానరులచ్చటికివచ్చి చల్లని
నీటిని దెచ్చి రామునికన్నులుదుడిచి యతని కుపచారములు
చేసిరి. అంతఁ గొంతసేపటికి రాముఁడు తెలివొందెను. లక్ష్మ
ణుఁ డన్నను కౌఁగిటఁ జేర్చి "ఆర్యా! చేతికబ్బిన రాజ్యమును

విడిచి యించుకైనను మనోవికారముచెందక వనవాసమున కీయకొని బయలువెడలి వచ్చినందున నీ జితేంద్రియత్వము వెల్లడియైనది. నీవు ధర్మము ననుష్ఠించువాఁడవు. లోకమున నెన్నఁడులేని కుందేటికొమ్మునుగూర్చి మాటమాత్ర ముండు నట్లు ధర్మము కేవలము వ్యవహారముననున్నదేగాని నిజముగ లేదనియే చెప్పవలెను. ఏలనంటువా? నీవు ధర్మము ననుష్ఠించు వాఁడవు. అందువలన నీకు శుభము గలుగుటే న్యాయము. రావణుఁ డధర్మమునే యనుష్ఠించుటచే నతని కశుభముగలుగ వలెను. ఇప్పుడట్లుజరుగ లేదు. విరుద్ధముగ నేర్పడినది. ధర్మమునకు ఫలమగు సుఖమనుభవించువాఁడు ధర్మముదప్పినవాఁడు. అధర్మమునకు ఫలమగు దుఃఖము ననుభవించువాఁడు ధర్మమునే యాచరించువాఁడు. జంగమ స్థావరములవలనఁ బ్రత్యక్షమనునది కలదందుము. ధర్మమట్లు కనఁబడువస్తువు గాదు. కనుక నది ప్రత్యక్షముగఁజూడ వీలుకానిది. అధర్మము నట్టిదే. సుఖదుఃఖములు ధర్మాధర్మములనుబట్టి నిర్ణయింప నసాధ్యము. అట్లే ధర్మాధర్మములను సుఖదుఃఖములఁ బట్టి నిర్ణయింపలేము. కనుక అనుమానముచేతను ధర్మాధర్మములను నిర్ణయింప వీలుకాదు. వేదాంతులు ధర్మము అధర్మము కర్మము అనుమూఁడును క్షణికములనును. అట్లయినచో ధర్మమువలనఁగలుగు సుఖమును, అధర్మమువలనఁ గలుగు దుఃఖమును, వానిననుసరించిచేయు కార్యమును క్షణములో నశించునవేగదా? కనుక ధర్మాధర్మములకును సుఖదుఃఖములకును క్రమముగ సంబంధముగలదను శాస్త్రప్రమాణమును చెల్లదు. పాపపుణ్యకర్మములచే నారాధింపఁబడు దైవము ఫలమిచ్చు

నందువా? వానివలన నేర్పడు సుఖదుఃఖములు దైవమును జేరునుగాని వాని నాచరించు పురుషుని జేరవు. ఎట్లన రాజు చేయించు పుణ్యపాపములఫలము రాజును చేరునేగాని భటుని చేరదు. కనుక నీవు పాపము చేసితివి. నీవు పుణ్యముచేసితి వని పురుషుని చెప్పుట యుక్తముగాదు. ధర్మము స్వయముగ ఫలితమీయలేనందున దానినే ముఖ్యముగ నాచరింపఁ దగదని నా యభిప్రాయము. అంతకంటెఁ బౌరుషము ననుసరించుట మేలని చెప్పెదను. పూర్వము దేవేంద్రుఁడు విశ్వరూపుఁడనుమునిని వధించి యాగముజేసెను. అందులో ధర్మాధర్మములు రెండును గలిసియున్నవి. యాగముచేయుట ధర్మమే. మునిని జంపుట యధర్మము. అప్పటి పరిస్థితికి ధర్మాధర్మములఁ గలిపి చేయవలసివచ్చినందునఁ గేవలము ధర్మమునుమాత్ర మనుష్ఠించుట హానికరమని తెలియుచున్నది. నీవు రాజ్యమును త్యజించినందున దానిమూలమునఁ బొందఁదగిన యర్థమును విడిచితివి. అర్థమే ధర్మమునకు మూలము. అర్థములేని ధర్మము వ్యర్థమే. ధనము సకలసుఖములనిచ్చును. ధనవంతుఁడు సుఖము లనుభవించుచుండి ధనహీనుఁడైనందున నాసుఖములు లేకుండునపుడా సుఖములఁగోరి యందు నిమిత్త మకృత్యములుచేయును. పాపముగలుగును. ధనముగలవానినే పురుషుఁడందురు. వానినే విద్వాంసుఁడందురు. కనుక నీవు రాజ్యమును వదలివచ్చినందున నీకిట్టిసంకటము లొకటివెంట నొకటి కలుగుచున్నవి. ఇప్పుడు నీప్రాణముకంటె నీకు హెచ్చగు సీతను బోఁగొట్టుకొంటివి. ఇంద్రజిత్తువలన నేర్పడిన దుఃఖసముద్రమును దాటఁక తీరదు. నీవు పరమాత్మవను భావము మఱచితివా? పామరులవలె

దుఃఖింపకుము లెమ్ము. ధైర్య మవలంబింపుము. నా కనుజ్ఞ యిమ్ము. నీ చరణసేవనిమిత్తము జన్మమెత్తిన నేనిప్పుడే నా పరాక్రమమున నీ లంకారాజ్యమును రావణాదుల సహితముగ నాశ మొందించెద" ననెను.

### రాముఁ డింద్రజిత్తును వధింప లక్ష్మణునిఁ బంపుట.

---

ఇట్లుండ నలుగురుమంత్రులతో విభీషణుఁ డచ్చటి కేతెంచి రామునిదుఃఖమునకుఁ గారణ మెఱిఁగి రామునితో 'పురుషోత్తమా! దైన్యముడుగుము. ఇంద్రజిత్తు సీతనువధించినది మాయ. సీతను నీకిచ్చి ప్రాణముల రక్షించుకొనునట్లు నే నెంతబ్రతిమాలినను రావణుఁ డామెనిచ్చుట కంగీకరించినవాఁడుగాఁడే. అట్టివాఁ డిందులకు సమ్మతించియుండుట యసంభవము. ఇంద్రజిత్తు యుద్ధమునకుముందు నికుంభిలయను దేవాలయమున హోమము సేయఁబోయియున్నాఁడు. ఆహోమము ముగిసినచో నతని జయింప దేవతలకేని తరముగాదు. ఇప్పుడే యచ్చటికిఁబోయి వానితో యుద్ధముచేయుటే యుపాయము. వాఁ డట్టివిఘ్నము గలుగునని యెంచి మాయాసీతను వధించి మిమ్మెల్లర మోసపుచ్చనెంచెను. రాఘవా! వెంటనే లక్ష్మణునిపంపుము. నేను నతనితోఁబోదును. ఇంద్రజిత్తును వధించు సమయ మిదియే' యనెను.

అంత రామచంద్రుఁడు "లక్ష్మణా! నీవు సుగ్రీవుఁడు హనుమంతుఁడు జాంబవంతుఁడు విభీషణుఁడు మొదలగు మహావీరులతోఁ బెద్దసైన్యముఁగూడి పోయి యా మాయావియు దేవశత్రువు నగు నింద్రజిత్తును వధించిర" మ్మనెను. వెంటనే

లక్ష్మణుఁడు కవచములు దొడిగి దివ్యమగు ఖడ్గమును ధనుర్బాణములఁగొని యన్నకుఁ బ్రదక్షిణనమస్కారములు జేసి యమితోత్సాహముతో రామచంద్రుని దీవనలుపొంది బయలు వెడలెను.

విభీషణుఁడును నంగదుఁడును హనుమంతుఁడును వెంట రాఁగా గొప్ప వానరసైన్యముతోను భల్లూకసైన్యముతోను లక్ష్మణుఁడు వేగముగఁబోయి నికుంభిలలోని ఇంద్రజిత్తును సంరక్షించుటకొఱకు సిద్ధముగనున్న రాక్షససైన్యమునఁ జొరబడెను. అంత వానరులు వృక్షములను పర్వతశిఖరములను విరివిగ రాక్షసులపై గురిపించిరి. రాక్షసు లాగ్రహముతో శక్తి తోమర శూల పట్టిస పరిఘ ఖడ్గాదులతో వానరులఁ దునుమాడిరి. కాని వానరు లమితోత్సాహముతో రాక్షసుల ననేకుల నవలీలగ వధించుటంగని హోమకార్యము సమాప్తము కాకమునుపే ఇంద్రజిత్తు తటాలున లేచి వృక్షముల మధ్య నుండివచ్చి రథము నెక్కి కోపముతోఁ గన్నులెఱ్ఱబాఱఁగా లాంతకునివలె నగుపడుచుండ హనుమంతుఁ డుగ్రుఁడై రాక్షసులను రూపుమాపుచుండెను. అంత నింద్రజిత్తు రథము నచ్చోటికిఁ గొంపోవునట్లుచేసి హనుమంతు ననేక బాణములతో నొప్పించెను. అప్పుడు విభీషణుఁడు "లక్ష్మణా! వాని నుపేక్షింపక వెంటనే సంహరింపు" మనెను.

## లక్ష్మణుఁ డింద్రజిత్తుతో యుద్ధముచేయుట.

విభీషణుని మాటలు విని లక్ష్మణుఁడు ధనుష్టంకారము చేసెను. అప్పుడు మఱల విభీషణుఁడు "లక్ష్మణా! ఇంద్రజిత్తు

హోమముచేయుస్థల మిది. అతఁ డాన్యగ్రోధవృక్షమును జేరక మునుపే వధింపకుంటివా ఇంద్రజిత్తు భూతబలియొసఁగి రథాశ్వ సహితుఁడై యదృశ్యుఁడగును. అప్పుడు వానితో యుద్ధము చేసి గెలుచుట యసాధ్యము. కనుక వేగిరపడు" మనెను. ఇంతలో నింద్రజిత్తు కవచములుదొడిగి తనగుట్టునుచెప్పిన విభీషణునిఁజూచి "విభీషణా! లంకలోఁబుట్టినవాఁడవు. మాతండ్రి కిఁదమ్ముఁడవు. నాకుఁబినతండ్రివి. సర్వవిధముల మాశ్రేయము గోరవలసినవాఁడవు. నీవు దేశద్రోహివి. భ్రాతృఘాతకుఁడవు. పుత్రద్రోహియు నయ్యెదవు. గుణహీనులైనను తనవారిని విడిచి యితరులఁజేరి తన కులనాశనమొనర్చుకొనునట్టి పరమ నీచుఁడవు. నీవుదప్ప నితరుఁడెవ్వఁ డిట్టి హీనకార్యముచేయు" డనెను.

అంత విభీషణుఁ డలిగి " ఓరీ! నీచుడా! కండకావరము చేతను బాహుబలముచేతను వరబలమువలనను గన్నుగానక నీ పినతండ్రియనియు నెంచక నన్నిట్లుదూఱెదవు. నా యన్న యు నీకుఁదండ్రియు నగు రావణుఁ డెట్టివాఁడు? ఎంత విద్య యున్న నేమి? ఎంత బలపరాక్రమంబులున్న నేమి? నీతిమాలిన వాఁడు. పరుల హింసించుట, పరధనమును పరునిభార్యను నపహరించుట మహాపాతకము. పరదారాపహరణ మహాపాత కుని విడువకుండుటెట్లు? పుత్రుఁడని పేరుపెట్టుకొనిన గర్వాంధుఁడవగు నీవును మదించి యొడలెఱుఁగని నీ నడిపితండ్రియుఁ బరమనీచులగు మంత్రి సేనానులును దుర్బోధనలుచేసి రావణుని యధర్మమార్గము ద్రొక్కునట్లు చేసితిరి. పుట్టుకచే మీ వలె రాక్షసుఁడనయినను స్వభావముచే నేను ధర్మమునమస

రించువాఁడను. నాకు మేలగునంత హితము మున్నాటికిఁ జెప్పితిని. నామాట వినకుండుటచేఁ గలుగఁగల యనర్థముల నెత్తి చెప్పితిని. సభలో "ఛీపొమ్మ"ని తిరస్కరించునంతవఱకును బిదపయును హితముచెప్పితిని. నాప్రయత్నము లన్నియు విఫలములయి వినాశముతప్పదనియెంచి యధర్మమున కీయకొనఁజాలక ధర్మస్వభావుఁడగు రాముని నాశ్రయించితిని. ఇందు నాతప్పిద మేమున్నది? శీఘ్రముననే నీవును నీతండ్రియు మిమ్మాశ్రయించురాక్షసు లెల్లఱును రూపుమాసిపోవలసివచ్చును. లక్ష్మణునితో యుద్ధముచేసి యమలోకము చేరుదువు. రమ్మ" అనెను.

ఇంద్రజిత్తా మాటలవిని రోషమునిండార రథమునెక్కి గొప్పధనువును వాఁడిబాణములను గ్రహించి వచ్చుచు హనుమంతు నారోహించియున్న లక్ష్మణునిఁజూచి "ఓరీ! నా యుద్ధనైపుణ్యముఁ జూతువు. వివిధబాణములఁ గొని నిన్ను హతమొందించెదను. రాత్రి యుద్ధమున నిన్ను మాయన్నను మూర్ఛిల్లఁజేసిన విషయము మఱచితివా? నీ కిప్పుడు మరణము సమీపించిన" దనెను.

అంత లక్ష్మణుఁడు "ఓరీ! దుర్బుద్ధీ! వేయిమాటలేల? మున్ను మాకంటికగుపడక మాయాయుద్ధముచేసితివి. ఇప్పుడు నాపరాక్రమమిట్టిదని చూతువుర"మ్మనెను. ఇంద్రజిత్తు భయంకరముగ నఱచి "లక్ష్మణా! నీవిప్పుడు కవచము విఱిగి తల నఱుకఁబడి పడియుండ రాముఁడు నీ మొండెముఁజూచుగాక" యనెను. లక్ష్మణుఁడు వెంటనే బాణములువేసి ఇంద్రజిత్తును నొప్పింప వాఁడును హస్తలాఘవమున లక్ష్మణుని బాణసమూ

హములచే నొప్పించెను. ఇరువురును యుద్ధవిశారదులగుట మదించిన యేనుఁగు లొండొంటితో డీకొనునట్లుండిరి. కొంత సేపటి కింద్రజిత్తు మూర్ఛిల్లెను. కొన్ని క్షణములలో వాఁడు తెలివొంది బాణవర్షముచే లక్ష్మణుని కవచమును భేదించెను. ధనుర్విద్యానిపుణులగు వీరిరువురు బాణవర్షములచే నంతరిక్షముఁ గప్పివేసిరి. వీరిలో నెవరికి జయముచేకూరునో నిర్ణయింప వీలులేక దేవతలును ఋషులును "లోకమునకు శుభమగుఁగాక" యనిరి.

ఇట్లుండ లక్ష్మణుఁడు వాఁడిబాణములచే నింద్రజిత్తు రథ సారథిని వధించెను. ఇంద్రజిత్తు తానే సారథ్యము చేయుచు బాణముల వేయుటం గని లక్ష్మణుఁ డాశ్చర్యపడెను. వానరులు విభీషణుని ప్రేరణంబున నుత్సాహముతో వృక్షములతోను కొండశిఖరములతోను రాక్షసులఁ బరిమార్చిరి. లక్ష్మణుఁ డింద్రజిత్తురథమును భగ్నముచేసెను. వాఁడు రాక్షసులకు జాగరూకతతోనుండునట్లుచెప్పి లంకకేగి దివ్యమగురథము నారోహించి మేటిబాణములను ధనువును వివిధాయుధములను గొని యుద్ధరంగమునకు వచ్చెను.

అంత విభీషణుఁడును వానరులును మందోదరీ పుత్రుఁడగు నింద్రజిత్తు తమకుఁ దెలియక లంక కేగి రథముఁ గొనివచ్చి నందువ నతని సామర్థ్యమున కచ్చెరువొంది యతని నెదిర్చిరి. ఇంద్రజిత్తు కోపావేశమున వానరుల ననేకుల నవలీలగ వధించుచుండ వానరులు భయపడి లక్ష్మణుని శరణుఁజొచ్చిరి. అంత లక్ష్మణుఁడు బాణప్రయోగముచే నింద్రజిత్తు ధనువును ఖండింప వాఁడు మఱియొకధనువు నెత్తికొనెను. లక్ష్మణుఁ డద్దానిని

గూడ ఖండించి వైచెను. వేఱొండు ధనువుచే నింద్రజిత్తు లక్ష్మణునిపై బాణవర్షము కురియించెను లక్ష్మణుఁడు వానిని మధ్యమార్గముననే ఖండించి సారథినిఁజంపి తన నైపుణ్యము వెల్లడిజేసెను. ఇంతలో విభీషణుఁ డింద్రజిత్తుని గుఱ్ఱములను గదతోఁ జంపెను. సారథియు గుఱ్ఱములును జచ్చినందున నింద్రజిత్తు రథముడిగ్గి యందలిశక్తిని విభీషణునిపైఁ బ్రయోగింప లక్ష్మణుఁ డద్దానిని బాణములచే ముక్కలుగావించె.

అంత నింద్రజిత్తు భయంకరమగు బాణములను బ్రయోగింప లక్ష్మణుఁ డందులకుఁ దగిన బాణములను వదలెను. వీరిరువుర బాణము లొండొంటితో డీకొని యా తాపిడిచే నగ్ని పుట్టి యాకాశమున గ్రహములవలెఁ జూపట్టినవి. లక్ష్మణుఁడు వారుణాస్త్ర ముపయోగింప నింద్రజిత్తద్దానిని రౌద్రాస్త్రముతో భగ్నముచేసెను. ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగ్నేయాస్త్రమును లక్ష్మణుఁడు సౌరాస్త్రముఁగొని వారించెను. ఇట్లీ యిరువురు తమతమ పరాక్రమంబులు వెలయఁజేసిన యుద్ధమును జూడవచ్చిన దేవతలు ఋషులు గంధర్వులును సకల భూతములును లక్ష్మణునకు జయము గలుగవలెనని భగవంతుని బ్రార్థించిరి. సకల శుభచిహ్నములుగల లక్ష్మణుఁడు బుద్ధిమంతుఁడగుట వెంటనే యెదురులేని బాణముదొడిగి యైంద్రాస్త్రమంత్రము జపించి "దశరథమహారాజుయొక్క పుత్రుఁడు రామచంద్రుఁడు ధర్మాత్ముఁడును సత్యసంధుఁడును సాటిలేని పౌరుషవంతుఁడు నగునేని ఓ బాణమా! నీవీ రావణపుత్రుఁడగు నింద్రజిత్తును వధింపు"మని చెప్పి యా బాణమును ప్రయోగింప నది సూటిగఁబోయి కిరీటకుండలములతోఁ బ్రకా

శించునట్టి ఇంద్రజిత్తుయొక్క శిరమును ఖండింప నా రాక్షసుఁ డసువులుబాసి నేలఁబడెను. అప్పుడు దేవ ఋషిగణంబులు సంతోషించె. వానరు లుబ్బుచే జయజయధ్వనులు సేసిరి. రాక్షసులు భయభ్రాంతులై దిక్కులకుఁబాఱిపోయిరి. పాప కర్ముఁడగు నింద్రజిత్తు మరణించినందున దేవతలు పుష్పవర్షము గురియించి లక్ష్మణునిఁ బ్రశంసించిరి. గంధర్వులు పాడిరి. అప్సరసలు నాట్యమాడిరి. ఋషులు మిక్కిలి సంతోషించిరి.

అంత లక్ష్మణుఁడును విభీషణుఁడును హనుమంతుఁడును జాంబవంతుఁడును వానరులఁగూడి సంతోషమున రాముని సన్నిధిఁ జేరిరి. లక్ష్మణుఁ డన్నకుఁ జేమోడ్చి ఇంద్రజిద్వధమును గూర్చి చెప్పెను. రామచంద్రుఁడు సంతోషముతో లక్ష్మివర్ధనుఁడగు లక్ష్మణుని యొడిలోఁ గూర్చుండఁబెట్టుకొని శిరము మూర్కొని యాలింగనముచేసి మేనంతయుఁదడవి "లక్ష్మణా! నీ పరాక్రమ మెంతయుఁ బొగడఁదగినది ఇదివఱకు మనము జయించిన రాక్షసవీరులు వీరులుగారు. ఇంద్రజిత్తునకు సాటివీరుఁడు రావణుఁడొక్కఁడే. వీని మరణవార్తవిని దశకంఠుఁడు దుఃఖములో మునిఁగి జీవచ్ఛవమేయగును. ఇఁక మనము రావణుని జయించి సీతనుబొందినట్లే యని నాకుఁ దోఁచుచున్నది. ఇట్టి యద్భుతయుద్ధముచేసి జయముపొందివచ్చిన నిన్నెంతయుఁ బ్రశంసింపఁదగును. ఇఁక రావణుని కుడిచేయి విఱిగినదని యే భావింపవలెనని సుషేణునిఁజూచి "సుషేణా! నీవిప్పుడు గాయములతో నొచ్చియున్న లక్ష్మణునకును విభీషణాదులకును

వానరులకును చికిత్సచేసి వారిబాధలఁ బోగొట్టు" మనెను. అప్పుడు సుషేణుఁ డొక మూలికను దెచ్చి లక్ష్మణుని దానిని మూర్కొనునట్లుచేయ లక్ష్మణుఁడు గాయములుమాని బాధల నుండి విడివడి యమితోత్సాహముతో నుండెను. సుషేణుఁడు విభీషణ హనుమదాది వానరు లెల్లఱ గాయములు మాన్పి వారిని విశల్యులఁజేసి రాముని మెప్పువడసె. రామచంద్రుఁడు మిక్కిలి సంతోషించి లక్ష్మణుని విజయమును శ్లాఘించెను.

## సీతను వధింపరాదని రావణునితో సుపార్శ్వుఁడు చెప్పుట.

---

మంత్రులమూలమున నింద్రజిత్తు లక్ష్మణునితో మూఁడహోరాత్రములు యుద్ధముచేసి మరణించెనను వార్త వినినంతనే రావణుఁడు దుఃఖసాగరమున మునిఁగి "హా పుత్రకా! దేవేంద్రుని జయించిన వీరుఁడవే. నాఁడు రామలక్ష్మణులను నాగపాశముతో బంధించినవాఁడవే. యుద్ధమున నీచే రామలక్ష్మణులు హతులగుదురని నమ్మియుంటినే. నీవలన యుద్ధమున జయముగాంతునని పూర్ణవిశ్వాసముగలిగియుంటినే. నీవు వీరులలో నగ్రగణ్యుఁడవు. నాకొఱకు నీప్రాణము నర్పించితివి. తండ్రికు త్తరక్రియలు తనయుఁడుసేయుట క్రమము. నీకు నే నిప్పుడట్టిక్రియలు సేయవలసివచ్చెనే" యని పరిపరి విధములఁ బనవిపనవి యేడ్చి మఱల పట్టరానికోపముగలుగ ఖడ్గము చేఁ బూని యశోకవనమునకుఁబోయి సీతనుజూచి "సీతా! నీవిప్పుడు నన్ను భర్తగవరింపకున్న నిన్నిప్పుడే వధించెద" నని కత్తినెత్తెను. అంత మంత్రియగు సుపార్శ్వుఁడు "రాజా! వేద

వేదాంగములఁ జదివినవాఁడవు. లోకమునఁ బరాక్రమవంతులలో మేటివి. నీవిప్పుడు సీతను వధించుటచే స్త్రీహత్యగావించితివను నపకీర్తిఁ బొందెదవు ఈ నీ కోపమును రామునిపట్ల చూపుము. నేఁడు కృష్ణచతుర్దశి. రేపమావాస్య. కనుక నేఁడే యుద్ధమునకుఁబోవుద' మని చెప్పి రావణుని శాంతుం జేసి యతని గృహమునకుఁ గొంపోయెను.

# 20. రామ రావణ యుద్ధము.

## మూలబల ధ్వంసము.

రావణుఁడు పుత్రశోకముతో సభామండపమునకువచ్చి సేనాధ్యక్షులఁజూచి "మీ రిప్పుడే మూలబలముంగొని యీ నరాధములగు రామలక్ష్మణుల వధించిరావలె"నని యాజ్ఞాపించెను. వెంటనే సేనాధిపతులు శూల పట్టిస పరిఘ తోమరాద్యాయుధములఁ దాల్చి చతురంగములతోఁ బెనుసేనంగొని సింహనాదములు సేయుచు బయలు వెడలి రామాదులున్న యెడకుఁజని యుద్ధము చేయ నారంభించిరి. వానరులు వృక్షములను గిరిశిఖములను గొని తీవ్రముగ యుద్ధముచేసిరి. రామచంద్రుఁడు ధనుర్బాణములు ధరించి చక్రగతులం దిరుగుచు బాణపరంపరలచే రాక్షసుల భ్రమింపఁజేసెను. వారు తమ కెచ్చటఁజూచినను రాముఁడే యగుపడునట్లు దలఁచి వారిలో నొకరినొకరు వధింప నారంభించిరి. ఏడుకోట్లయిరువదితొమ్మిది లక్షల రథములును, పదుమూఁడుకోట్ల పండ్రెండులక్షల ఇరువదివేలు గజములును, పదికోట్ల యిరువదిలక్షల యేబది వేలు గుఱ్ఱములును, నూటనలుబదియేనుకోట్ల యెనుబదిలక్షల కాల్బలములును గల మహామూలబలమును రాముఁడు మూఁడున్న ముప్పాతిక గడియలలో (1-30 గంటకాలములో) తా నొక్కఁడే హతముగావించెను. దేవతలు, గంధర్వులు, ఋషులు రాముని స్తుతించిరి. రాముఁడు చెంతనున్న సుగ్రీవ విభీషణ జాంబవ హనుమదాదులతో "ఇట్టి యస్త్రప్రయోగశక్తి నాకును బ్రళయకాల రుద్రునకును మాత్రము గల" దనెను. ఎల్లరు సంతోషించి రామునిఁ బొగడిరి.

## మహోదర మహాపార్శ్వ విరూపాక్షుల వధ.

ఇట్లు మూలబల వినాశమునుగూర్చి వినినంతనే రావణాంతఃపుర స్త్రీలు పుత్రులు మరణించిరని కొందఱు, భర్తలు మరణించిరని కొందఱు, సోదరులు చచ్చిరని మఱికొందఱు హాహాకారములు చేసిరి. వారు రాముని పరాక్రమము ననేక విధములుగ వర్ణించుచుఁ బనవిపనవియేడ్చి రావణుని యధర్మవర్తనమువలనఁ దమకుఁ గలిగిన దుఃఖపరంపరల వివరించుకొనుచుండిరి.

వారి రోదనధ్వనులు వినిన రావణుఁడు చింతించి మఱిలఁ గోపముగలుగ * మహోదర మహాపార్శ్వ విరూపాక్షులను మంత్రులఁజూచి "మీరిప్పుడే సకల సన్నాహములతోఁ బోయి రామలక్ష్మణాదుల నెల్లఱ వధించి యంతఃపురస్త్రీల దుఃఖముఁబాపవలె" ననెను. వారప్పుడే రావణునకు నమస్కరించి గొప్పసైన్యముతో నానావిధాయుధములు ధరించి యుద్ధమునకుఁబోయిరి. వానర రాక్షసులకుఁ బెద్ద యుద్ధముజరిగెను. వానరులు వృక్షములతోడను గొండశిఖరములతోడను నఖదంష్ట్రలతోడను రాక్షసులఁగూల్చిరి. రాక్షసులును వానరుల ననేకవిధ బాణములతోఁ బరిమార్చిరి. రావణుఁడును దివ్యమగు రథము నెక్కి చతురంగబల సమేతుఁడై రామలక్ష్మణులున్న యుత్తరద్వారముగుండ వెలువడెను. మహోగ్రుఁడైన రావణుఁ డంత వానరులను కుప్పలుకుప్పలుగఁ గూల్చెను. దానింగని సుగ్రీవుఁడు శిలావర్షముచే రాక్షసులఁ బాఱదోలఁ

* పూర్వము చెప్పిన మహోదర మహాపార్శ్వులు రావణుని సోదరులు.

జొచ్చెను. మహాబలుఁడగు విరూపాక్షుఁ డొకపెద్ద మదపుటేనుఁగునెక్కి సుగ్రీవునిమీఁది కరిగెను. సుగ్రీవుఁ డంత నొక శిలను వానిపైఁ బడవేసి వాఁడద్దానిని చూర్ణముగావించి సుగ్రీవుని మూర్ఛిల్లఁజేసెను. కొంతసేపటికి సుగ్రీవుఁడు మూర్ఛదేఱి విరూపాక్షుని నొసటి యెముకమీఁద నఱచేతితోఁగొట్టి వానిఁ జంపెను.

దానిఁజూచిన రావణుఁడు ప్రేరేపింప మహోదరుఁడు సుగ్రీవు నెదురొక్కెను. వానరరాజంతట నొక పరిఘముగొని రథాశ్వములకూల్చెను. మహోదరుఁడు సుగ్రీవునితో ద్వంద్వ యుద్ధముచేసినపిదప సుగ్రీవుఁడు ఖడ్గముతో మహోదరుని శిరమును ద్రుంచెను. రాక్షసులు భీతులయి పరుగిడిరి. వానరులు జయజయశబ్దములు గావించిరి. ఇంతలో మహాపార్శ్వుఁడాగ్రహముతోరాఁగా మహాపరాక్రమవంతుఁడగు వాలిపుత్రుడంగదుఁడు పిడికిటం బొడిచి వానిని జంపెను.

## రావణుఁడు యుద్ధముచేయుట.

ఇట్లు తనమంత్రులు హతులగుటంజూచి కోపము నిండార రావణుఁడు తామసాస్త్రముఁగొని వానరులను వందల కొలఁది వధించుచు "రాముఁడను మహావృక్షము నిప్పుడే కూల్చెద" ననుచు వచ్చుచుండ రామలక్ష్మణులుం మేటిధనువులంగొని సిద్ధపడిరి. ఎంతటి యాపత్సమయమునను గలంగక శాంతిమువహించు రాముఁడు ధనుష్టంకారముసేసి యిప్పటికైనను రావణుఁడు పశ్చాత్తాపపడి సమాధానమునకు వచ్చునేమోయని కొంత నిదానించెను. తొలుత లక్ష్మణుఁడే బాణ

ములను రావణునిపైఁ బ్రయోగింప వాఁడు వానినన్నిఁటి ననాయాసముగ ఖండించి రామునిమీఁదికివచ్చి బాణవర్షము గురిపించెను. అపరాక్రమముండగు రాముఁడు వానిని వారింప రావణుఁడు రౌద్రాస్త్రమును ప్రయోగించెను. రాముఁ డెంతమాత్రము చలింపఁడయ్యె. అంత రావణుఁ డాసురాస్త్రము ప్రయోగింప రాముఁడద్దాని నాగ్నేయాస్త్రముతో భగ్నము చేసెను. రాముఁడు రావణుని రౌద్రాస్త్రమును గాంధర్వాస్త్రముచేతను, సౌరాస్త్రమును గొన్ని దివ్యాస్త్రములచేతను ఖండించెను. ఇట్లు జయశీలుఁడగు రాముని రావణుఁడు నొప్పింపలేకపోయెను. రాముఁడు గొంతసేపు విశ్రాంతిపుచ్చుకొనెను. అప్పుడు లక్ష్మణుఁడు బాణపరంపరలచే రావణుని ధ్వజమును, సారథినిఁగూల్చెను. మఱల నతఁడు రావణుని ధనువును ద్రుంచెను. ఇంతలో విభీషణుఁడు గదతో నశ్వములను వధించెను. అంత రావణుఁడు తమ్మునిమీఁది కోపముచే నతనిఁజంప శక్తియను నాయుధమును ప్రయోగించెను. దానిని లక్ష్మణుఁడు మధ్యమార్గమున ఖండించివై చెను. ఇట్లు తమ్ముని సంరక్షించు లక్ష్మణునిఁజూచి కోపముతో రావణుఁడు భయంకరమగు శక్తిని లక్ష్మణునిపైఁ బ్రయోగింప నది యురముఁబడినందున లక్ష్మణుఁడు మూర్ఛిల్లెను. చెంతనున్న రాముఁడు తమ్ముఁడిట్లు పడియుండుటఁజూచి ఖిన్నుఁడై శక్తిని మెల్లఁగా వెడలిచి లక్ష్మణునిఁ గౌఁగిలించి సుగ్రీవాదులఁజూచి "వానరులారా! మీరిప్పుడు లక్ష్మణుని సంరక్షింపుఁడు. నేనా దురాత్ముఁడగు రావణుని వధించివచ్చెద" నని చెప్పి రావణునితో ఘోరయుద్ధముసేయుచు సుషేణునిఁజూచి "నా తమ్ముఁడిట్లు యుద్ధ

రంగమునఁ జచ్చిపడియుండ నాకేల యుద్ధము? నాకు రాజ్య మేల? దేశ దేశమున భార్య లెందఱయినను లభింతురు. బంధువులును గలుగుదురు. తోఁబుట్టు వే దేశమునను గానరాఁడు గదా!" యని దుఃఖించు రామచంద్రునిఁజూచి సుషేణుఁడు "రామచంద్రా! నీతమ్ముఁడు మరణమునొందినవాఁడుగాఁడు. మూర్ఛిల్లియున్నాఁడు. శోకింపకు" మని చెప్పి హనుమంతునిఁ జూచి "మహాబలా! నీ విప్పుడే యోషధిపర్వతమున నున్న విశల్యకరణి, సవర్ణకరణి, సంజీవకరణి, సంధానకరణి యను మూలికలం దెమ్ము. లక్ష్మణుని గాపాడవలె" ననెను. అంత హనుమంతుఁడు వాయువేగమునఁబోయి యాపర్వత శిఖరమున నామూలికలఁ దెలిసికొనలేక లక్ష్మణుని ప్రాణము గాపాడ నెంచి యా పర్వతశిఖరముఁ బెకలించి తీసికొనివచ్చెను. సుషేణుఁ డద్దానినుండి యోషధులగ్రహించి నలిపి లక్ష్మణునిముక్కునం బిండెను. వెంటనే లక్ష్మణుఁడు నిద్రించినవానిపగిది లేచెను. రాముఁ డతనిఁ గౌఁగిలించి "లక్ష్మణా! నీవు మరణించి పునర్జీవితుఁడవైతివి. అటుగాకున్న నాగతియేమి? నీవు లేకున్న నాకీ యుద్ధమేల? సీతయేల? రాజ్యమేల? ప్రాణమేల?" యనెను. లక్ష్మణుఁడు "అన్నా! దైన్యమేల? రావణుని వధించి విభీషణునకు లంకారాజ్యము నిత్తునంటివి. ఆప్రతిజ్ఞ నెఱవేర్పుము. శీఘ్రమున నీ దురాత్ముని వధింపు" మనెను.

ఇంతలో రావణుఁడు వేఱొకరథము నెక్కి రామునిమీఁదికి వచ్చుచుండెను. రావణుఁడు రథమునందుండియు, రాముఁడు నేలమీఁదనుండియు యుద్ధముచేయుట ధర్మముగాదని దేవత లనుకొనిరి. ఇంద్రునిపంపున నతనిసారథియగు మాతలి

దివ్యరథమును గొనివచ్చి దాని నారోహింప రాముని వేఁడెను. రామచంద్రుఁ డా రథమునకుఁ బ్రదక్షిణ నమస్కారములు చేసి దాని నారోహించి రావణునితో భయంకరముగ యుద్ధము చేసెను. రావణుఁడు బాణవర్షము గురిపించి రాముని రథమునందలి ధ్వజమును గొట్టి యశ్వములను నొప్పించి సారథిని బాధించెను. మఱల రావణుఁడు భయంకరమగు శూలము నెత్తి "రామా! ఇప్పు డీమాయాయుధము నీ ప్రాణము హరించును. నీవును నీతమ్ముఁడును హతులగుటను వానరు లిప్పుడు చూడఁగల" రనెను. నిప్పులు గుఱియుచుఁ దనమీఁదికి వచ్చు శూలమును రాముఁడు బాణములచే ఖండించి వైచెను.

అంత రావణుఁడు కుపితుఁడై బాణవర్షముచే రాముని నొప్పింప నాతఁడు వానినివారించి "ఓరీ! రావణా! పిఱికిపందవై మేము లేనిసమయముచూచి యబలయగు సీత నెత్తుకొని వచ్చితివి. నాకంటి కిదివఱకు గానరానందున యిన్ని దినములు బ్రతుకఁగలిగితివి. ఇప్పుడు నాకంటఁబడి ప్రాణముతో నెట్లు పోఁగలవు? ఇప్పు డిచ్చట నీశరీరమును గ్రద్దలు దినఁగల" వని బాణపరంపరలచే రావణుని మిక్కిలినొప్పింప వాఁ డేమియుఁ దోఁచక యూరకుండుటఁ జూచి యతని సారథి రథమును యుద్ధభూమినుండి యావలకుఁ గొంపోయెను. అంత రావణుఁ డలిగి సారథినిఁ జూచి "ఓరీ దుర్బుద్ధీ! యుద్ధరంగమునందుండి రథమును తోలఁగఁ దోలెదవా? నా బలము పౌరుషము ధైర్యము పరాక్రమము నీకుఁ దెలియదా? పిఱికివాఁడనని యెంచి యిట్లు చేసితివా? నాకీర్తి మంటఁగలిపితివి. చాలిఁక నీబుద్ధిహీనత. రథమును రాముని కభిముఖముగఁ దోలు" మని గద్దించెను. అంత

సారథి "త్రిభువనవరేణ్యా! సమయస్ఫూర్తి లేక సారథ్యము చేయ రాదు. నీ వలసిసొలసి ప్రభుండవై యుండ నే నట్లుచేసితినిగాని నీ కెట్టి యపకారము చేయ నెంచినవాఁడనుగా" నని రథమును రాముని కభిముఖముగఁ గొంపోయెను.

రామరావణ యుద్ధమును జూడవచ్చిన యగస్త్యమహర్షి రామునిశ్రమమును గుర్తించి "శ్రీరామా! విజయప్రదమగు నాదిత్యహృదయము నుపదేశించెదను. నీ వామంత్రము పఠించిన లోకబాంధవుఁడగు సూర్యుఁడు నిన్ననుగ్రహించి నీకు శ్రమ లేశములేక విజయముచేకూరున ట్లనుగ్రహించు" నని చెప్పి ఆదిత్యహృదయము నుపదేశించిపోయెను. రాముఁ డాచమనముచేసి మూఁడుపర్యాయములా మంత్రమును భక్తితోఁబఠింప సూర్యమండలమునుండి దేవుఁడు "రామచంద్రా! శీఘ్రముగ రావణుని వధింపు" మనెను.

## రావణవధ.

రామరావణు లనేక శుభాశుభనిమిత్తములఁ గాంచిరి. వా రిరువురు నొకరికొకరు దీటుపోని పరాక్రమము నెఱపుచు నొండొరుల నొప్పించుకొనుచుండిరి. రావణుఁడు రాముని రథధ్వజమును బడఁగొట్ట యత్నించియు నది సాగలేదు. రాముఁడు రావణునిరథధ్వజమును బడఁగొట్టఁగలిగెను. ఆకాశమున దేవతలు గంధర్వులు మొదలగువారు "రాముఁడు జయించుగాక! అందువలన లోకము సుఖించునుగాక! ఇట్టియుద్ధ మెన్నఁడును జరుగలేదు. ఆకాశమున కాకాశమే సాటి. సముద్రమునకు సముద్రమే తుల్యము. రామరావణయుద్ధమునకు రామరావణ

యుద్ధమే సాటి" యని శ్లాఘించిరి. రాముఁడు మేటిబాణములతో రావణునిశిరములఁ దెగవేయుచుండ నవి మఱలమఱల మొలచుచుండెను. ఇట్లు రాముఁడు నూటయొక్కమాఱులు రావణుని శిరములను ఖండించినను రావణుఁడు మరణింపనందుల కాశ్చర్యపడుచుండ సారథియగు మాతలి "రామచంద్రా! తెలియనివానివలె సామాన్యమగు నస్త్రములఁ బ్రయోగింపనేల? బ్రహ్మాస్త్రముచే వీనిని వధింపనగు" ననెను. వెంటనే రామచంద్రుఁడు మహాతేజుఁడగు నగస్త్యునిచే నీయఁబడిన నుత్తమమగు బ్రహ్మాస్త్రముసంధించి వేదవిధిననుసరించి యభిమంత్రించి రావణునివక్షమును జూచి ప్రయోగించెను. ఆ బాణము సూటిగ రావణునిరొమ్మునఁ బ్రవేశించి యతనిప్రాణము హరించి భూమినిఁజొచ్చి మఱల రామునిపొదికి వచ్చిచేరెను. మిగిలినరాక్షసులు దిక్కులకుఁ బరుగిడిరి. వానరులు సంతోషసాగరమున మునిఁగి సింహనాదములుసేసి జయజయశబ్దములు గావించిరి. దేవతలును గంధర్వ యక్ష సాధ్యులును మేలుమేలనిరి. దేవతలు పూలవాన గురిపించిరి. దేవదుందుభులు మ్రోగెను. సుగ్రీవ హనుమ దంగదాదులును విభీషణుండును జాంబవదాదులును సంతోషము నిండార రాముని సన్నిధిఁ జేరి యతని ననేకవిధములఁ బూజించి స్తుతించిరి. వానరమధ్యమున రాముఁడు దేవతలమధ్య నింద్రునివలెఁ బ్రకాశించెను.

## విభీషణ విలాపము.

ఇట్లు రామబాణముచేఁగొట్టుపడి మరణించినయన్నను జూచి విభీషణుఁడు దుఃఖాతిశయమున "వీరశేఖరా! పులస్త్య

వంశభూషణా! ఇంద్రాదుల నవలీలగ జయించిన మహావీరుఁడవే. వేదవేదాంగశాస్త్ర పారంగతుఁడవే. నీతితప్పి పరస్త్రీ నపహరించి మోహాంధుఁడవయి నా హితమును గైకొనక నీతిబాహ్యులగు ప్రహస్త కుంభకర్ణేంద్రజిదాదుల దుర్బోధనలచే నిట్టి వినాశము దెచ్చికొంటివి. ఎట్టి పరాక్రమమున్నను నెంతటి విద్వాంసుఁడయినను నీతిఁదప్పినంతట వినాశము పొందుట నిజమని చాటించితివి. నాఁడు సభలో నన్నవమానింప సహింపలేక నన్నిమారు లెన్నివిధముల హితము చెప్పినను వినకుండుటచే నిన్నువిడిచి ధర్మస్వరూపుఁడగు రామునిపక్షము సేరి నీకు వైరినయితిని. నీమరణమునకుఁ దోడ్పడితిని అయినను నిన్నిప్పుడిట్టి స్థితిలోఁ జూచుటచే నా భ్రాతృవాత్సల్యము నన్ను దుఃఖసాగరమున ముంచుచున్న"దని విలపించుచుండెను.

అంత రామచంద్రుఁడు "విభీషణా! రావణుఁడు శూరాగ్రేసరుఁడు. యుద్ధమునఁ బరాక్రమము వెలయఁజేసి వీరస్వర్గమును పొందినాఁడు. రణరంగమున మరణించినవారిఁగూర్చి మిక్కిలి చింతింపఁదగదు. అది శాస్త్రనిషిద్ధము. ఇఁక నగ్నిసంస్కారాదులు చేసి నీధర్మము నిర్వర్తించికొనుము". మరణపర్యంతమే శత్రుత్వము పాటింపనగును గాని మరణించిన యనంతరము వైరముడుగుట ధర్మము. తన యపరాధమునకు హతుండయిన రావణుఁడు నాకును దోఁబుట్టువేయగు"ననెను.

## మండోదరి విలపించుట.

రావణుని మరణవార్త వినినంతనే రావణభార్యలు శోకమున మునిఁగి వెండ్రుకలు విరియఁబోసికొని పరుగిడివచ్చి

రావణుని శవమును జుట్టుకొని రోదనము సేయ మొదలిడిరి. ఒక స్త్రీ రావణుని కౌఁగిలించి "నాథా! ఇంద్రాదులను జయించిన నీ కెన్నఁడు మరణము లేదని యెంచియుంటినే" యనెను. ఒక యువతి "అయ్యో! నీతోడి సాంగత్యము శాశ్వతమని సంతోషించుచుంటినే. నిన్నిప్పుడు వీడియుండవలసివచ్చెనే" యనెను. మఱియొక లతాంగి రావణునిపైఁబడి "అయ్యో! నీశరీరస్పర్శ మిఁక లేదాయెనే" యని విలపించెను. ఒకపడఁతి యతనిశిరము నొడిలోనుంచుకొని యతని ముఖమును దడవుచు "హా నాథా! ఇట్టి నీముఖదర్శన మిఁక నెన్నఁడు గలుగు" ననెను. ఒక నెలఁత "అయ్యో! నే నెంతటి పాపాత్మురాలను. ఇంద్రుని, కుబేరుని జయించిన భర్తను బోఁగొట్టుకొంటినే" యని రోదనము సేసెను. మఱియొక లలన "ప్రాణపతీ! విభీషణుని హితము చేకొనక సీతను రాముని కీయక మూర్ఖుఁడవై మాకిట్టి వైధవ్యము గలిగించితివి. దైవనిర్ణయమును కడ్డులేదు అది జరిగితీరవలె" నని శోకించెను.

ఇట్లుండ రావణుని పట్టమహిషియగు మండోదరి భర్త శవసమీపమునకు వచ్చెను. తక్కిన స్త్రీలందఱు దూరముగ నుండిరి. మండోదరి "హా! ప్రాణనాథా! దిక్పాలురను బంధించితివి. దేవేంద్రుని యోడించితివి. కుబేరుని జయించి లంకా రాజ్యమును పుష్పకవిమానమును బొందితివి. నీ తపంబునకు మెచ్చి బ్రహ్మ నీకువలసినవరము లొసంగెను. నీ పేరువినినంత నెట్టిశత్రువులయినను గడగడ వణఁకుదురు. అట్టి యసమాన పరాక్రమవంతుఁడగు నీవు బలహీనుఁడును మానవమాత్రుఁడును దీనుఁడును వనమున సంచరించువాఁడు నగు రామునిచే

వధింపఁబడుట నా కాశ్చర్యముగ లిగించుచున్నది. యోచించి చూడఁగా నితఁడు సామాన్యుఁడుగాఁడు. ఇతఁడు జనస్థానమున నీసోదరుఁడగు ఖరుని వధించెనని వినినప్పటినుండియు వాలిని వధించెనని వినినప్పటినుండియు నితని పరాక్రమము సాటిలేని దని యెంచితిని. ఎవరికిని సాధ్యపడని సముద్రమును హనుమంతుఁడు దాటివచ్చుటనుజూచి లంకకు విపరీతకాలము వచ్చిన దనియే భావించితిని. వానరులు సముద్రమునకు వంతెనఁ గట్టుట వినినంతనే రాముఁడు మానవమాత్రుఁడుగాఁడని నిశ్చయించితిని. ఒకవేళ యమధర్మరాజు రామరూపమున వచ్చియుండవచ్చును. నీ వినాశముఁగోరి మాయచే సీతరూపమున నొకస్త్రీని సృష్టించియుండును. దేవేంద్రుఁడు పగసాధింప వచ్చియుండనోఁపు. కాని నిన్ను కన్నెత్తియైనను జూడలేని వాఁడే, అతఁడెట్లువచ్చును? లోకరక్షణోపాయచింతతోఁగూడినవాఁడును, సహజముగనే జ్ఞానబలక్రియలంగలవాఁడును, జీవాత్మలకు నియామకుఁడగు పరమాత్మయును, సకలాత్మలకాత్మయగువాఁడును, పుట్టుట, పెరుగుట, బలియుట, చిక్కుట, ముదియుట, చచ్చుట యను షడ్వికారములు లేనివాఁడును, భూత భవిష్య ద్వర్తమానకాలములం దుండువాఁడును, ఆది మధ్యాంతములు లేనివాఁడును, స్వసంకల్పమాత్రమున నణువున కణువుగను మహత్తునకుమహత్తుగ నుండువాఁడును, నిత్యవిభూతియను నామాంతరముగల పరమపదమున వసించువాఁడును, స్వయముగ శత్రువులు లేనివాఁడయ్యు నాశ్రితులగు దీనులరక్షింప శంఖ చక్ర గదాదుల ధరించి దుష్టశిక్షణ శిష్టరక్షణ యను ధర్మసంస్థాపన చేయువాఁడును, రొమ్మునఁ గుడి

వైపు మత్స్యరూపమున నున్న శ్రీవత్సమను మచ్చను, నాశ్రితులకట్లు దయతలంచునట్లు పురుషకారముచేయు నవ్యాజకరుణానిధియగు లక్ష్మిని ధరించినవాఁడును. భక్తరక్షకత్వముఁ దప్ప నితరముల కవశుఁడగువాఁడును శరణాగతుల రక్షించుటయందు దృఢసంకల్పముగలవాఁడును, సకలలోకములకు నాథుఁడును, లోకక్షేమమే గోరి రాక్షసవినాశముకొఱకు వానరరూపులగు దేవతలఁగూడి రాముఁడను మానవాకారమున వచ్చిన నిత్యసత్య పరాక్రమవంతుఁడగు విష్ణుదేవుఁడే యని నిస్సంశయముగఁ జెప్పుచున్నాను.

పూర్వము నీ వింద్రియముల జయించినందున ముల్లోకముల జయించితివి. ఆయింద్రియములు సమయము నిరీక్షించుచుండి యిప్పుడు నీబుద్ధిని చెఱచి మోహముగల్పించి నిన్ను జయించినవి. ధర్మాత్ముఁడగు రామునితో వైరముమాని స్నేహము పొందుమని చెప్పిన నామాట విననందులకీ ఫలముగలిగినది. నిష్కారణముగ సీతనుమోహించి నీప్రాణమునకును ఐశ్వర్యమునకును బంధుమిత్రాదులకును వినాశము దెచ్చికొంటివి. వసిష్ఠుని ధర్మపత్నియగు నరుంధతికంటెను రోహిణికంటెను పరమపతివ్రతయగు సీతను మాతృభావముతోఁ జూడక మోహించుటచే మహాపరాధము జేసినవాఁడవైతివి. భూదేవికంటె నోర్పుగలదియు, లక్ష్మికంటె నైశ్వర్యముగలదియు. మహాపతివ్రతయు నగు సీతాదేవి నిన్నంగీకరింపకున్నను మారీచుని మాయవేషముచే మోసపుచ్చి యొంటరిగనున్నప్పు డపహరించి చెఱఁబెట్టితివే. ఆమెయొక్క పాతివ్రత్యమే నిన్ను మరణింపఁజేసినది. అప్పుడే నీవు భస్మముగాకుండినను నీ పాప

ఫలము నీ వనుభవింపకఁబోవ సాధ్యమా? సీతకంటెను రూప లావణ్యములుగల స్త్రీలు నీకు లేకపోయిరా? రూపలావణ్యము లందును విద్యాబుద్ధులందును నేను సీత కెంతమాత్రము తీసి పోవుదానను గాను కాని నీవ్యామోహమున నీవంధుఁడవై తివి.

విభీషణుఁడు నీకెన్ని విధములుగ శాస్త్రసమ్మతములును యుక్తియుక్తములును కీర్తిదాయకములు నగు హితముచెప్పె ను. నీకు దుర్బోధనలే మతికెక్కెనుగాని ధర్మస్వభావుఁడగు విభీషణుని పలుకులు ములుకులాయెనే. కారణము లేక కార్య ము జరుగదు. సీత పరునిభార్య. ఆమెనుమోహించుట యధ ర్మము. ఆమెను దెచ్చుటవలన దూరముగనున్న మృత్యువును సమీపమునకుఁ దెచ్చుకొన్నట్లాయెను. ఇఁకసీత భర్తనుగూడి సుఖించును. నీవుచేసిన యపరాధమునకు నేను విధవనైతిని. పుష్పకమున నిన్నుఁగూడి పర్వత వన నదీ సముద్రప్రాంతము లలో విహరించి సంతోషించుచుంటిని. ఇఁక నాకట్టిసుఖ మె క్కడిది? నీలమేఘమువంటి శరీరముతో మెఱుములవంటి భూ షణములతో మేలుమైపూతలఁ దనరు నీశరీరస్పర్శమిఁక నెక్క డిది? అహా! గర్వము భంగపడునను నార్యోక్తి నిజమే. నేను దానవరాజగు మయుని పుత్రికను, రాక్షసరాజగు రావణుని పత్నిని, దేవేంద్రుని జయించిన జయశీలుఁడగు నింద్రజిత్తును గన్నతల్లిని. నా కేమికొదవ యనుకొంటినే. నాకిట్టి దురవస్థ కలుగునని కలనైనఁ దలఁపనైతినే.

బాహుబలగర్వముచేతను వరబలప్రభావముచేతను దేవతలను, దిక్పాలురను, సకలభూతములను గడగడ వణఁకు నట్లుచేసి మదోన్మత్తుఁడవై తిరిగితివి. నందికేశ్వరుని పరిహసించి

శాపముపొందితివి. ఋషులను బాధించితివి. దేవకన్యలను గంధర్వకన్యలను యక్ష కిన్నర రాక్షస కన్యలను బలాత్కారముగఁ దెచ్చితివి. వారి యెల్లర చింత ని న్నిట్టిగతిపట్టించినది. అయ్యో! నాథా! నన్నేలఁ జూడవు. నాతోఁ బలుకవేల? నన్ను దయమాలివిడిచి మఱలిరాని స్థానమునకుఁ బోయితివే. కన్న కుమారునిఁ బోఁగొట్టుకొంటిని. ఆ దుఃఖము నోర్చితిని గాని నిన్నుఁబాసి యుండనోపను. నన్ను నీవెంటఁ గొనిపొమ్ము. అంతఃపురము వదలి ముసుఁగులేక బహిరంగప్రదేశమునకు వచ్చితినని యైనను గోపింపకున్నావే ఈ నీ భార్యలంద ఱట్లు చేసిరే నీవేల వారిని దండింపవు?

ప్రాణపతీ! నీవు మిక్కిలి పతివ్రతలును గురుశుశ్రూషాదులొనర్చి సన్మార్గవర్తినులగు కులస్త్రీలభర్తల వధించి వారికెల్లరకు వైధవ్యముగల్పించితివి. పతివ్రతలకన్నీరు నేలఁ బడిన మహానర్థముగలుగునను నార్యోక్తి నేఁడు నీపట్ల ఫలించినది. వారిశాపములఫలముననే నీకిట్టిమరణము సంభవించినది. సాధువులను పరమపతివ్రతలను పీడించి యిట్టి దురవస్థ చెందితివి. రాక్షస సమూహము నంతమొందింపఁ జేసితివి. మమ్ము దుఃఖసాగరమున ముంచితివి. మారీచుఁడు విభీషణుఁడు, కుంభకర్ణుఁడు, మాల్యవంతుఁడు చెప్పిన హితవచనములను వినవయితివి. ఎవరుచేసిన పుణ్యాపాపములఫలము వారనుభవింపక తీరునా? జయముండినంతకాలము భయములేక విహరించితివి. కాలవైపరీత్యములఁజూచి చిత్తము శుద్ధిచేసికొనవైతివి. యుద్ధమున జయాపజయములు నిర్ణయింపవీలులేదు. నీవు వీరస్వర్గమనుభవింపఁబోయితివి. కాని నేను నా నష్టకష్టముల ననుభ

వింపలేక నాసుఖము లంతరించెనేయని స్త్రీస్వభావము ననుస రించి శోకించుచున్నాను. ప్రియురాలినివలె నీవీయుద్ధభూమిని కౌఁగిలించుకొని పడియున్నావు. నిజముగ నీకుఁ బ్రియురాల నగు నన్నేల యుపేక్షించెదవు? నిన్నుఁబాసియు బ్రాణముతో నున్నానే. నాగుండె పగులకున్నదే"యని దుఃఖించుచు నల్లని మేఘమువలెనుండు రావణునిఱొమ్మమీఁద మెఱపుఁదీగవలె మూర్ఛిల్లి పడియున్నమండోదరిని సవతులు లేవనెత్తి కన్నులు దుడిచి మూర్ఛదేరినంత "దేవీ! రాజులవైభవము, యౌవన కౌమారములు క్షణికములని యెఱుఁగవా? అధర్మము నకుఁ బర్యవసానమిట్టిదే. నీవెంతయేడ్చినను నీనాథుఁడిఁక బ్రతుకఁడు గదా. చింతయుడుగు"మని యోదార్చినను మండోదరి రోద నముసేయుచుండ రామచంద్రుఁడు "విభీషణా! నీవిఁక తామ సింపక నీయన్నకు సంస్కారాదులు గావింపు" మనియె.

అంత విభీషణుఁడు వినయముతో "రామచంద్రా! నా కన్నయైనను రావణుఁడు ధర్మముదప్పినవాఁడు. పరస్త్రీగమ నముచేసిన మహాపాపి. నా తోఁబుట్టువైనను నడవడిచే నాకు శత్రువే. ఇట్టివానికి నాచేతులార సంస్కారము చేయఁదగదని తోఁచుచున్న" దనెను. అప్పుడు రాముఁడు "విభీషణా! ఈ రావణుఁ డసత్యమును నధర్మము ననుసరించినవాఁడే. లోకము నేడ్పించినందున రావణుఁడనుట యుక్తమే. ఇట్టి యవగుణము లితనియం దెన్నియున్నను సుగుణములు కొన్ని యుండుటను గుర్తించవలెను. ఇతఁడు విద్యావంతుఁడు, తపస్సంపన్నుఁడు, గొప్పవంశమునఁ బుట్టినవాఁడు, బలపరాక్రమములలో కీర్తి బొందినవాఁడు. కాని "నాకు శత్రువుగదా? నేనెట్లు సంస్కా

రముచేతు" నందువా వినుము. ఎట్టివానితోనైనను వైరము బ్రతికియున్నంతవఱకే. మరణించినతరువాత వైరము పాటింపరాదు. ఇతని మహాపరాధముల కితఁడు తనప్రాణము నర్పించి దోషములఁ బోగొట్టుకొనినాఁడు. నీవలె నితఁడును నాకు మిత్రుఁడే. కనుక నీతని కగ్నిసంస్కారములు శాస్త్రవిధిని జరుపు"మనెను.

అంత విభీషణుఁడు స్త్రీలనెల్లఁబంపివైచి రావణునకు బ్రహ్మమేధసంస్కారము శాస్త్రసమ్మతముగ వైభవోపేతముగ జరిపి స్నానమాచరించి ప్రేతప్రీతిగ నుదకదానముచేసి నమస్కరించి మఱల స్నానముచేసి స్త్రీలను పురముచేర్చి వచ్చి రామునిసమీపమున వినయముతో నిలుచుండెను.

# 21. శ్రీరామ పట్టాభిషేకము.

## విభీషణ పట్టాభిషేకము.

రామరావణ యుద్ధమును జూడవచ్చిన దేవతలు గంధర్వులు ఋషులు రాముని పరాక్రమమును లక్ష్మణుని భ్రాతృభక్తిని సుగ్రీవుని స్నేహభావమును గొనియాడుచుఁ దమతమ నెలవులకుం జనిరి. రామునాజ్ఞచే మాతలి దివ్యరథముఁ గొని దివి కేగెను. సుగ్రీవుని సహాయముచేఁ గలిగిన విజయమునకు సంతోషించి రాముఁ డతనిని కౌఁగిలించెను. అంత రాముఁడు లక్ష్మణునివంకఁ దిరిగి "సౌమిత్రీ! మనకింత సాయ మొనర్చిన ధర్మాత్ముఁడగు విభీషణునకు నేనుచేసిన ప్రతిజ్ఞచొప్పున నతనిని లంకారాజ్యమున కభిషిక్తునిఁ జేసిర"మ్మనెను.

అంత లక్ష్మణుఁ డాజ్ఞాపింప వానరులు బంగారు కలశములతో సముద్రములనుండి తీర్థము దెచ్చిరి. లక్ష్మణుఁడు రాక్షసులమధ్య రావణుని సింహాసనమున విభీషణునిఁ గూర్చుండబెట్టి యభిషేకముచేసెను. రావణానుజుఁడు మంత్రులతోఁ గూడి మిక్కిలి సంతోషింపఁ బౌరులతనికిఁ బుష్పములు, పేలాలు, కుడుములు, అక్షతలు నిచ్చిరి. విభీషణుఁడు రామలక్ష్మణులకొఱకు హరిద్రాది మంగళచూర్ణములుగొని రాముని సన్నిధానముఁ జేరి వానిని వారల కర్పింప వారు నతిముదంబున వానిం గైకొనిరి. వెంటనే రాముఁడు హనుమంతునిఁ జూచి "సౌమ్యా! నీవిప్పుడే విభీషణుని యనుమతింబొంది సీతకు నా విజయవార్త నందించి యామె సందేశముఁ గొనిర"మ్మని యాజ్ఞాపించెను.

## హనుమంతుఁడు సీతను దర్శించుట.

ఇట్లు రామచంద్రుని నియోగంబున నాంజనేయుఁడు రావణునిగృహమున నొకవృక్షముక్రింద మలినవస్త్రము ధరించి శోకముతో నుండి కాంతిహీనయగు సీతను దర్శించెను. ఆమె తొలుత నాతని గుర్తింపలేక మిగుల జ్ఞప్తికిఁ దెచ్చికొని హనుమంతుఁడని గుర్తించి యతని రాకకు సంతోషించెను. అంజనేయుఁడామెకు నమస్కరించి వినయముతో "సీతాదేవీ! రావణుని తమ్ముఁడగు విభీషణుని యానుకూల్యమునను సుగ్రీవుని స్నేహముచే లభించిన వానరుల సహాయమునను మతిమంతుఁడగు లక్ష్మణుని తోడ్పాటునను రామచంద్రప్రభువు రావణుని సంహరించెను. అతఁడు తనమాటగా నీతో నిట్లు చెప్పుమని యాజ్ఞాపించెను. 'దేవీ! నీ కత్యంత ప్రియమగు సమాచారము చెప్పెదను. నిన్నపహరించి నీకు నాతో నెడబాటుగలిగించి నిన్ను చెఱఁగొని యనేకరీతుల భయపెట్టి బాధించిన లంకాధిపతియగు రావణుని వధించితిని. నిన్నిప్పుడు శోకసముద్రమునుండి తరింపఁజేసితిని. సుగ్రీవాది వానరులు సేతువుఁగట్టి రాక్షసులతోఁబోరి మహోపకారము చేసినందునను విభీషణుని తోడ్పాటునను లక్ష్మణుని నిరంతర భ్రాతృభక్తిచేతను నీ లంకారాజ్యమును జయించి విభీషణున కిచ్చితిని. కనుక నీవిఁక నీ సొంతపట్టణమున నున్నానని యెంచుము. నీ వింతదనుక జీవించి యుండుట నా భాగ్యమే. నీవు మరణించియుండినచో నా శ్రమ యంతయు నిరర్థకమైయుండును. విభీషణుఁడును నిన్నుఁ జూడ వచ్చును. భయముడిగి సంతోషముగ నుండుము". ఇట్లు చెప్పి పంపిన భర్తకు నీసందేశ మేమి?" యనెను.

అంత సీతాదేవి మిక్కిలి సంతోషించి "వానరోత్తమా! నీమాటలపొందు నేమని చెప్పుదును. ముల్లోకముల నింతకంటె సంతోషమగుమాటలు చెప్పఁగలవా రెవరును లేరు. నా భర్త యొక్క విజయసందేశము గొనివచ్చిన నా ప్రబంధువగు నీకు నేనేమీయగలను? ధనకనక వస్తువాహనాదులుగాని త్రైలోక్యాధిపత్యమిచ్చినను నీమాటలకవి సాటిగావు. గ్రహించుట, ధరించుట, స్మరించుట, బోధించుట, ఊహించుట, అపూర్వము నూహించుకొనుట, అర్థమెఱుఁగుట, తత్త్వము నరయుట యను నెనిమిది లక్షణములతో నిండిన నీయమృతవాక్కు సాటిలేనిది. ఇట్టి మాటలాడుటకు నీవుదప్ప నన్యుఁడెవ్వఁడు సమర్థుఁడుగాఁడని చెప్పుచున్నాను. ఇందులకుఁ బ్రత్యుపకారమేమి చేయఁగల" ననెను.

హనుమంతుఁడు చేమోడ్చి "తల్లీ! రాముని విజయము కంటెను ప్రీతికరమగున దేదియు లేదు. అందువలన నీ వానందించుటను జూచుట నాకు ముల్లోకాధిపత్యముకంటె నెక్కువ" యనెను.

మఱల సీతాదేవి హనుమంతుని మహోపకారమును స్మరించి "సౌమ్యా! నీతండ్రి ప్రాణతుల్యుఁడగుట లోకవిదితము. నీవు నాపాలిటి ప్రాణదాతవు. నీయందు బలము, శౌర్యము, శాస్త్రజ్ఞానము, దృఢమనస్సు, సామర్థ్యము, ఇతరుల నోడించు తేజము, సాటిలేనియోర్పు, ధైర్యము, వినయము, నీతి, నియమము, ప్రభుభక్తి, కార్యదీక్ష, సమయస్ఫూర్తి మున్నగు సుగుణములన్నియు నిండియున్నవి" యనినంత నాంజనేయుఁడు వినయముతో నంజలిగీలించి సీతాదేవినిఁజూచి "తల్లీ! నీ వశోక

వనమునందుండినప్పుడు నిన్ననేకవిధముల బెదరించి భర్త నెడ
బాసిన దుఃఖమునకుఁ దోడు దుఃఖము నినుమడింపఁజేసిన నా
క్రూర రాక్షసస్త్రీలను నానావిధములుగ బాధించి వధింప ననుజ్ఞ
యిచ్చిన నది నామాటలకు నీ వీయఁదగిన వరమగు" ననెను.

అందులకు సీతాదేవి ధర్మయుక్తముగ నతనితో 'వాన
రోత్తమా! ఈ రాక్షసస్త్రీలు రావణునికొలువులోని దాసీజను
లుగదా! యజమానుని యాజ్ఞను బాటించి నన్ననేకవిధముల
బెదరించి బాధించిరి. వారికి స్వయముగ నాపై వైరమేమియు
లేదు. యజమానునియాజ్ఞ క్రూరమైనదైనను నెట్టిదయినను
నెఱవేర్పకున్న యజమానుఁడు దండించునను భయముతో
నన్ను బాధించిరి. అట్టి దాసవర్గమును యజమానుని తప్పిదము
నిమిత్త మెవ్వఁడు దండించును? వారు రావణుఁడు హతుఁ
డయినతరువాత నన్నింతమాత్రము పీడించుటలేదు. ఇట్టివారిచే
నిట్టిబాధ లనుభవింపవలసిన విధి నాకుండినందున నట్లు సంభ
వించినది. ఇదియెల్ల నాపూర్వజన్మకృత పాపఫలముగాని వారి
దోషమని నేనెంతమాత్ర మెంచను. నా కొక పురాణగాథ
జ్ఞప్తికివచ్చుచున్నది. దానినివినుము. పూర్వ మొక వేటకాఁడు
తన్నొక పులి తఱుముచువచ్చినందున నొక చెట్టెక్కెను. ఆ
చెట్టున నొక భల్లూకముండెను. వ్యాఘ్రి మద్దానిఁజూచి 'భ
ల్లూకా! వన్యమృగములమగు మనకు వీఁడు శత్రువు. కనుక
వీనిని త్రోసివేయు' మనెను. అంత నా యెలుఁగుబంటి 'వ్యా
ఘ్రిమా! నేనుండుస్థలమునకు వచ్చినవాఁడగుటచే వీఁడునన్ను
శరణుఁజొచ్చినట్లే. దీనుఁడగు శరణాగతుని రక్షించుట ధర్మ
ము. కనుక వానికి నేనట్టియపకారముచేయ' నని భల్లూకము

నిద్రించెను. అప్పుడాపులి వేటకానిఁజూచి 'మిత్రమా! నీ వా భల్లూకమును ద్రోసివేయుము. నేను దానిని తిని యాకలిదీర్చుకొని నీ కపకారముచేయక నాదారినిఁబోయెద' ననెను. అంతనా వేటకాఁడు భల్లూకమును బడఁద్రోసెను కాని యయ్యది సహజముగ మంచి పట్టుగలదగుటచే నొక కొమ్మనుపట్టుకొని పడకుండెను. అప్పుడా పులి 'భల్లూకా! చూచితివిగదా వీని కృతఘ్నత. ఇప్పుడయినను వానిని నా కాహారముగనిచ్చి నీపగ సాధించుకొను' మనెను. అందులకా యెలుఁగు 'మిత్రమా! అపకారముచేసినవారికయిన నుపకారమే చేయవలెనుగాని యపకార మెంతమాత్రము చేయఁదగదని పెద్దలందురు. మంచి నడవడియే సత్పురుషులకు భూషణము. ఇతరులవర్తన మెట్లున్నను తాము ధర్మమునే యాచరించవలె' ననెను. కనుక వానరోత్తమా! పాపకార్యములే చేసినవారైనను వారియెడను కరుణఁజూపుట యుత్తమధర్మము. అట్లుచేసిన నధర్మముచేసిన వారిని దండింపకుండుటయను దోషముగలుగునందువా? లోకమున నపరాధముసేయని వా రెవ్వరును లేరు. వీరు రాక్షసులు కామరూపులు. వా రితరుల బాధించుటే సహజముగ వినోదమని యెంచువారు. కనుక జాతిననుసరించిగాని, వారు సేవకులని గుర్తించిగాని వారిని దండింపకుండుటే ధర్మము. దేవేంద్రుని కుమారుఁడగు జయంతుఁడు నాపట్ల గావించిన గొప్ప యపకారమునకు వాఁడు సర్వవిధముల వధింపఁదగినవాఁడయినను రామచంద్రుఁడు దయతో వానిని మన్నించలేదా? అతని ధర్మపత్నినగు నాకును వీరినిమన్నించుట ధర్మమే" యని తన సహజకారుణ్యమును సీతాదేవి హనుమంతునకు ననుష్ఠించి

చూపినందున నతఁ డానందపరవశుఁడై "దేవీ! నా భాగ్యమే భాగ్యము. ధర్మమే వ్రతముగ ననుష్ఠించు రామచంద్రునకు నీవే యొప్పినధర్మపత్నివి. నా సంకుచితబుద్ధిని దిద్ది నాకు ప్రాదయ వైశాల్యముగలిగించు ధర్మమార్గము చూపిన మహోపకారిణివి. ఇట్టి నీ సదుపదేశము నెన్నటికీ మఱువను. రామున కేమిసందేశమిత్తు"వని యడిగెను. అంతనామె "కపికులతిలకా! నా ప్రాణనాథుఁడగు రామునిఁ గన్నులారఁ గాంచి యానందింపఁగోరెద" ననెను. ఆమాటవిని హనుమంతుఁడు "శత్రుసంహారముచేసిన దేవేంద్రుని శచీదేవి చూచియానందించినట్లు నీవు సకలశత్రువినాశముగావించిన నీభర్త నిప్పుడే చూచి యానందింపఁగల"వని యామెను వీడ్కొని రాముని సన్నిధానము చేరెను.

## అగ్నిప్రవేశము.

హనుమంతుఁడు రామునిముందట చేమోడ్చి "రాఘవా! ఏ సీతనుద్దేశించి మనము సేతుబంధనాది రావణవధపర్యంతము సకల ప్రయత్నములుచేసి జయముఁ గాంచితిమో యట్టి పరమ సాధ్వి నిన్నుఁ జూడఁగోరుచున్న" దనెను. అంత రాముని యానతిచొప్పున విభీషణుఁడు సీతకు మంగళస్నానముచేయించి సర్వదివ్యవస్త్రాభరణాదులతో నలంకరింపఁజేసి రాముని సన్నిధికిఁ గొనివచ్చెను. అప్పుడు వానరులు గుంపులుగూడి యచ్చోటఁ గిక్కిరిసియుండ భటులు వేత్రహస్తులై వారలఁ దొలఁగఁద్రోయుచుండ రాముఁడు వారించి "విభీషణా! నేనున్నా ననియు నెంచక నావారినిట్లు తొలఁగఁద్రోయనేల? స్త్రీల కావ

రణము, గృహము, వస్త్రము, ప్రాకారముగాదు. తన యాచారమే యావరణ్రశేష్ఠముగును గాని రాజసత్కారము నట్టిది కానేరదు. ఆపత్తుల మరణసమయమునను, యుద్ధసమయమునను, స్వయంవరకాలమునను, యజ్ఞముజరుగునప్పుడును, వివాహకాలమునను స్త్రీలు పరపురుషుల కంటఁబడుట దోషముగానేరదు. కనుక సీతను నా సమీపమునకుఁ గొనిర''మ్మనెను. అప్పుడు లక్ష్మణుఁడును, సుగ్రీవుఁడును, హనుమంతుఁడును రాముని కఠినంపుమాటలకుఁ జింతించిరి. విభీషణుఁడు వెన్నంటిరాఁగా సీత వస్త్రముతో ముఖమునుగప్పుకొని లజ్జతో రామునిసమీపించి "ఆర్యపుత్రా''యని సంబోధించి యేడ్చి మఱలఁ గొంతసేపటి కామె యాశ్చర్యమును, సంతోషమును, స్నేహమును నిండార నిండుచంద్రబింబమువంటి మోముగలదై భర్త ముఖమును జూచెను.

రాముఁడు మనసులోని కోపమును వెలిబుచ్చుచు 'సీతా! శత్రువుచేఁజిక్కిన నిన్ను పౌరుషముతో యుద్ధముచేసి జయము పొంది రక్షించితిని. దొంగతనముగ నా పరోక్షమున నిన్నపహరించిన దురాత్ముని సపరివారముగ వినాశమొందించి నా యపకీర్తినిఁ బోఁగొట్టుకొంటిని. ఇప్పుడు నేను స్వతంత్రుఁడనయితిని. దైవముచే నేర్పడిన యవమానమును పౌరుషముతో తొలఁగఁజేసితిని. హనుమంతుఁడు సముద్రమును దాఁటి లంకను గాల్చుట మొదలగు ఘనకార్యములుచేసినదాని ఫల మిప్పుడు కంటిని. సేతుబంధనము, సుగ్రీవుఁడు వానరసహితముగ యుద్ధమునఁ దోడ్పడుట, గుణహీనుఁడగు జ్యేష్ఠునివదలి విభీషణుఁడు నన్నాశ్రయించి నాకుఁదోడ్పడుట మున్నగు శ్రమల కన్నింటికి

ఫలము లభించినది. ఇల్వలవాతాపు లను రాక్షసులుండుటచే వసింప నసమర్థమని దుష్ప్రాప్యమగు దక్షిణదిక్కును తపోమహిమ చే నగస్త్యుడు సాధించినరీతిని రావణాదుల వధించి నిన్ను రక్షించితిని. కన్నులు చక్కగనుండునపుడు మిక్కిలి ప్రీతిదాయకముగనుండు వెలుతురు కంటిరోగముచే దాని కసహ్యమగునట్లు మున్ను నా కత్యంత ప్రియురాలవై యుండిన నీ విప్పుడు నా కత్యంత వెగటుగలిగించుచున్నదానవు. రావణుని యొడినుండి జారిన నిన్ను నేనొల్లను. పరునియింటనుండిన నిన్ను నే నెట్లంగీకరింపగలను? రావణునివంటివానిచే జిక్కిన నిన్ను నేను పరిగ్రహింప వీలులేదు. నీయిష్టమువచ్చినచోటికిబొమ్ము. లక్ష్మణునియందుగాని, భరతునియందుగాని, సుగ్రీవునియందుగాని, విభీషణునియందుగాని మనసుంచుము. లేక నీ కెట్లిష్టమో చేయుము. రావణుడు నిన్ను పేక్షించియుండడ" నెను.

అంత సీత రామునితో "వీరాధిపా! నీతో నే నెంతో సంతోషముగ నెంతకాలమో గడపియున్నదానను. ఎన్నడు నీనోట వెడలని పరుషోక్తులు నేడెట్లు వెడలెనో గదా. బలాత్కారముగ నబలనగు నన్ను రావణుడె త్తికొనివచ్చినదోషమున్నది. అది దైవనిర్ణయము. విధిని తప్పించుకొనలేకపోయితిని. నా మన సణుమాత్రము నిన్ను విడిచి యెన్నడితరులజేరదు. రావణుడు పలికిన మాటలకు నేనతని ననేకవిధముల నిందించితిని. హనుమంతుడు వచ్చిననాడే నన్ను విడిచిపెట్టితివని తెలిసి యుండిన నాడే నేను ప్రాణము నెట్లో విడిచియుందునే. నా కొఱకు నీ వింత శ్రమపడియుండ నక్కఱ లేదే. నీవు లోకము లోని సామాన్య స్త్రీలవలె నన్నుభావించి నా స్త్రీత్వమును

మాత్రము గుర్తించి నాయందు లేనిపోని శంకలుపొంది నన్ను నిందించుచున్నావుగాని నా శీలము నెంతమాత్రము గమనింప వైతివే" యని రోదనముచేయుచు దుఃఖాక్రాంతుఁడై యున్న లక్ష్మణునిఁజూచి "సౌమిత్రీ! ఇంతకాలము నా నడవడి తెలిసి యుండియు నన్నిట్లు సందేహింపవలసినకాలమువచ్చినది. నే నిఁక క్షణమైనను జీవించియుండనొల్లను. చితిఁబేర్పుము. అందుఁ బ్రవేశించి ప్రాణము విడిచెద" ననెను.

ఇంతలో రాముఁడును కనుసైగఁజేయ లక్ష్మణుఁడగ్ని ప్రజ్వరిల్లఁజేసెను. సీతాదేవి! రామునకుఁ బ్రదక్షిణము చేసి "ఓయగ్నిదేవా! నేను రామునియందే మనసుగలదాననైతినేని నీవు నన్ను రక్షింతువుగాక. ఓ బ్రహ్మాదిదేవతలారా! ఇంద్రాగ్ని యమ వరుణాదులారా! సూర్య చంద్ర తారా గ్రహాదులారా! నా పాతివ్రత్యమునకు భంగములేదేని మీరలే నన్ను రక్షింతురుగాక" యని యగ్నిలోఁ బ్రవేశించెను. అప్పుడు వానరులు రాక్షసులు హాహాకారములుచేసిరి. అంత రాముఁడొక్క ముహూర్తకాలము దుఃఖముతో ధ్యానముచేసెను. అప్పుడు కుబేరుఁడు, యముఁడు, దేవేంద్రుఁడు, వరుణుఁడు, ముక్కంటి, బ్రహ్మ మున్నగు దేవతలెల్ల రాకాశమునఁ విమానములలో వచ్చుటికివచ్చి తమ్ముఁజూచి యంజలిగీలించియున్న రామునిఁ గని కంకణాద్యాభరణములతో నలంకరింపఁబడిన బాహువులనెత్తి "నీవు సకలలోకములకుఁ గర్తవు. బుద్ధిమంతులలో మేటివి. ఇట్లగ్నియందుఁ జొచ్చుచున్న సీతను నీవేల యుపేక్షించితివి? సకల దేవతలలో నుత్తముఁడగు నీవు నిన్నేల యెఱుఁగకుంటివి? నీ వష్టవసువులలో ఋతుధాముఁడనువాఁ

డవు. నీవు ముల్లోకములలో నాదికర్తవు. నీవు సర్వస్వతం త్రుఁడవు. నీ వందఱిని శాసించువాఁడవు. నీకు నియామకుఁ డొకఁడు లేఁడు. నీ వేకాదశరుద్రులలో నష్టమరుద్రుఁడగు శంక రుఁడవు. నీవు సాధ్యులలో నైదవవాఁడవు. నీ కశ్వినీ దేవతలు చెవులు, సూర్యచంద్రులు కన్నులు. నీవు సృష్టికిపూర్వమును ప్రళయమునకు వెనుక నుండువాఁడవు నీవు సామాన్యమాన వునివలె సీత నుపేక్షించితివేల" యనిరి.

అంత రామచంద్రుఁడు దేవతలతో "నేను నన్ను సాధా రణ మానవుఁడనని దశరథపుత్రుఁడగు రాముఁడననియే భావిం చుచున్నాను. నే నెవ్వఁడనో యెందుండి వచ్చితినో తెలుప వేఁడెద" ననవుడు బ్రహ్మ 'రామా! సత్యపరాక్రమా! వినుము. నీవు నారాయణుఁడవు. నీవు లక్ష్మినిఁగూడి చక్రాయుధము ధరించినవాఁడవు. పూర్వ మేకశృంగముదాల్చి భూమి నుద్ధ రించిన నాదివరాహుఁడవు నీవే. నీ విదివఱకుండిన నిప్పుడున్న నికఁ నుండఁగల శత్రు సంహారకుఁడవు. నీ వక్షరుఁడవు. నీవే పరబ్రహ్మమవు. నీవే సత్యస్వరూపుఁడవు. నీ వాదిమధ్యాంత ములులేనివాఁడవు. నీవు లోకములకెల్ల సర్వస్వామివి. నీ వా శ్రితుల కనిష్టనివృత్తియు నిష్టప్రాప్తియుఁ గలిగింపఁ జతుర్భుజ ములు ధరించినవాఁడవు. నీవు శార్ఙ్గమను ధనువును నందక మను ఖడ్గమును ధరించినవాఁడవు. నీవు సకలేంద్రియ నియామ కుఁడవు. నీవు పురుషోత్తముఁడవు. నీవు జయింపఁదగనివాఁ డవు. నీవు భూభారమును దగ్గించువాఁడవు. నీ వీ జగమును ధరింపఁగలవాఁడవు. నీవు మహాబలుఁడవు. నీవు ముల్లోకము లకు సర్వసేనానివి. నీవే సకలలోకపాలకుండవు. నీవే బుద్ధి

మంతుఁడవు, క్షమాస్వరూపుఁడవు, అంతరింద్రియ బాహ్యేం ద్రియ జయముగలవాఁడవు. నీవే ప్రభుఁడవు, ఉపేంద్రుఁడవు, మధువను రాక్షసుని వధించినవాఁడవు. నీవు వృత్రాసురుని హతమొందించిన దేవేంద్రునివంటి వ్యాపారముగలవాఁడవు. నీవు సకలైశ్వర్యసంపన్నుఁడవు. నీవు పద్మనాభుఁడవు, రణ మున కంతముగల్పించువాఁడవు, మహర్షులు నీవే శరణ్యుఁడవని శరణుజొత్తురు. నీవే యజ్ఞస్వరూపుఁడవు, యజ్ఞభోక్తవు. నీవే యోంకార స్వరూపుఁడవు, ప్రణవార్థము నిన్నే దెలుపును. సృష్టిస్థితిలయముల కెల్ల కారణభూతుఁడవు నీవే. నీ వెవఁడవని ఋషులుసైత మెఱుగరు. నీవు సకల భూతములందును దిక్కు లందును పంచభూతములందును నిండియుండువాఁడవు. నీవు వేలకొలఁది తలలు, పాదములు, భుజములు, నేత్రములు, చెవులు గలవాఁడవు. నేను నీహృదయమగుదును. నీ నాలుకయే సరస్వతి. నీ రోమములే సకల దేవగణములును. వేయేల నీవే విరాట్పురుషుఁడవు. నీవలననే రేయింబవళ్ళు సకల ఋతుధర్మములును గలుగుచున్నవి. నీపలుకులే వేదములు. నీవు లేని దేదియులేదు. ఈజగమంతయు నీశరీరమే. ఈ భూతలమే నీస్థైర్యము. అగ్నియే నీకోపము. నీయనుగ్రహమే చంద్రకాంతి. శ్రీవత్సమనెడు మచ్చయే నీగుర్తు. మున్ను త్రివిక్రమావతారమున ముల్లోకములనాక్రమించి బలిని జయించినవాఁడవు నీవే. అట్లుచేసి రాజ్యభ్రష్టుఁడయిన దేవేంద్రుని మరల నతవిపదవి యం దుంచినవాఁడవు నీవే. నీవు రావణ సంహారముకొఱకు మానవావతారమెత్తితివి. నీబలపరాక్రమము లమోఘములు. ఇట్టి లోకేశ్వరుఁడవగు నిన్ను పురుషోత్తముఁడవని యెఱింగి

నిన్ను సదా భక్తితో స్మరించి యీ యితిహాసరూపమగు నీ స్తోత్రమును కీర్తించు మానవు లిహలోకసుఖము లనుభవించి మోక్షముపొందుదురుగాక" యనెను.

### రాముఁడు సీతను స్వీకరించుట.

ఇట్లు బ్రహ్మదేవుఁడు పలికినంతనే యగ్నిపురుషుఁడు సీత నొడిలోనుంచుకొని రామునితో "రాఘవా! నీ ధర్మపత్ని యగు సీత పూతచరిత. ఆమెయం దెట్టిదోషములేదు. నీ యాభిజాత్యగుణశీలముల కనువగు సాధ్వీమణిని నీవు నిశ్శంకముగ స్వీకరింపుము. నీ పరోక్షమున నబలను బలాత్కారముగ రావణుఁడు గొంపోవునప్పుడు పరాధీనయై దుఃఖాంబుధిలో మునిఁగి నిరంతరము నిన్నే స్మరించుచుండ నారాక్షసుఁడు ధనకనక వస్తువాహనాదులఁ జూపి నామెను వశపఱచుకొన నెంచెను గాని పరమపావనియగు సీత నిన్నుదప్ప నన్యుని మనసా వాచా కర్మణా కోరినదికాదు. నా మాటకు బదులాడకుము. ఇది నా యాజ్ఞ. ఈమెను సంతోషముతోఁ బరిగ్రహింపు" మనెను.

అంతఁ బరమధార్మికుఁడగు రాముఁ డగ్నిదేవునిఁజూచి "దేవా! నేను సీత నణుమాత్రము సందేహించినవాఁడనుగాను. ఆమె పరమపతివ్రతయని నన్నొక్కనిఁదప్ప నితరునిఁ గలలోనైన స్మరింపదనుట నే నెఱుఁగుదును. కాని లోకులు రావణు నింటనుండిన సీతను పరిగ్రహించెనని నన్ను నిందింతురు. కావున సీతయొక్క పవిత్రచరిత్ర నెల్లరెఱుఁగవలెనని నేనామె నగ్నిప్రవేశముచేయనిచ్చితిని. సూర్యుని తేజమునైన నతనినుండి వేఱుపఱుపనగునేమోగాని సీతయొక్క మనసు నెంతమాత్రము

నావద్దనుండి మరల్ప వీలుగాదు. ఇప్పుడు నీ వాక్కుచే సీత నిర్దుష్టురాలని లోక మెఱిఁగినందులకు సంతోషముతో నా ధర్మపత్నిని స్వీకరించుచున్నానని యామెను బరిగ్రహించి యానందించెను.

## ఈశ్వరుఁడు రాము ననుగ్రహించుట.

ఇట్లు పలికిన రాముని శుభవచనములను విని యంత కంటె శుభమగుమాటలు మహేశ్వరుఁ డిట్లు పలికెను. "పుండరీకాక్షా! మహాబాహూ! శ్రీనివాసా! శత్రుసూదనా! శస్త్రధారులలో నుత్తముఁడా! మా యదృష్టవశమున నీవు రావణవధయను నద్భుతకార్యముచేసితివి. శ్రీరామా! సకలలోకములకు రావణునివలన నేర్పడిన భయమను పెనుజీఁకటిని యుద్ధమున నతనిని సంహరించి పోఁగొట్టితివి, నీవిప్పు డయోధ్యకుఁ బోయి చాతకమువలె సన్నెదురుచూచుచుండు భరతుని సంతృప్తుఁజేసి, నిన్నుఁగని గొప్పకీర్తినిపొందిన నీతల్లి కౌసల్యను, రావణసంహారమను లోకోపకారకృత్యమునకు మూలకారకురాలయిన కైకేయీదేవిని, నిరంతరము నీ యం దత్యంతభక్తితో నిన్నుఁగొలుచు లక్ష్మణునితల్లియగు సుమిత్రను సంతోషింపఁజేసి యయోధ్యారాజ్యమున కభిషిక్తుఁడవై నీ యం దత్యంతానురాగముగల ప్రజల నానందింపఁజేసి పుత్రపౌత్రాదులఁగని యిక్ష్వాకువంశము నభివృద్ధిచేసి యశ్వమేధాది యజ్ఞములుచేసి శాశ్వతకీర్తి గడించి శ్రీవైకుంఠమునకురమ్ము. రామా! ఈలోకమున నీకుఁ దండ్రియు గురువునై నీచే నసత్యదోషమును దొలగించుకొని దేవలోకముచేరిన దశరథుఁడిదిగో

విమానమున నున్నవాఁడు. నీవు లక్ష్మణునిఁగూడి యతనికి నమస్కరింపుము".

ఇట్లు మహాదేవుఁడు చెప్పినమాటలువిని రామచంద్రుఁడు లక్ష్మణసహితుఁడై విమానమున నత్యంత తేజోమయుఁడగు దశరథుని దర్శించి యతనికి నమస్కరించెను. అంత దశరథుఁడు రాముని యొడిలోఁగూర్చుండఁబెట్టికొని కౌఁగిలించి లక్ష్మణుని కౌఁగిలించి "రామా! దేవలోకమున నింద్రభోగము లనుభవించినను సకల శత్రువుల సంహరించి యరణ్యవాసముతీర్చి శాశ్వతకీర్తిని సంపాదించి నా సత్యవ్రతమును వమ్ముగాకుండఁజేసి నన్నుఁ దరింపఁజేసిన నిన్ను లక్ష్మణునిఁ జూచినంత సుఖము పొందనైతిని. ఇప్పుడు నేను ధన్యుఁడనైతిని. కైకేయి మాటలు నన్నెప్పుడు బాధించుచుండెను. ఇప్పుడా బాధ తొలఁగినది. నీయం దత్యంతభక్తిగల భరతుని సంతుష్టుఁజేసి తల్లుల నాదరించి యయోధ్యకు రాజ్యాభిషేకము చేసికొని తమ్ములఁగూడి ప్రజారంజకముగ రాజ్యము పాలించి కీర్తిపొందు" మనెను.

అంత రామచంద్రుఁడు "తండ్రీ! నీవానాఁడు కైకేయితో "ఈవరమును విడువకున్న నిన్ను నీ కుమారుని విడుతు నంటివి. నీశాపము భరతుని యంటకుండున ట్లనుగ్రహింపు" మని ప్రార్థించెను. దశరథుఁడు వల్లెయని రామలక్ష్మణులఁ గౌఁగిలించి మఱల నిట్లనెను. "లక్ష్మణా! నీవు సకలసుఖముల విడనాడి సీతారాముల కనవరతము చేసిన సేవ శ్లాఘింపఁదగినది. దేవతలును ఋషులును రాముఁడే పరమాత్మ యనుచు

న్నారు. అట్టి రాముని యతని ధర్మపత్నినిఁ గొలుచుటచే నీవు ధన్యుఁడవైతివి. ఇఁకమీఁద నట్లే చేయుచుండుము. నీకు శుభమగుఁగాక" యని మఱల దశరథుఁడు చెంత నిలుచుండి తనకు మ్రొక్కుచున్న సీతనుజూచి "సీతా! నీ పాతివ్రత్యమహిమ సకల లోకములను వ్యాపించినది. భర్తయే నీపాలిటిదైవమను భావము నెప్పుడును బాటింపుము. నీకు సకల శుభములౌనఁ గూడు" నని పుత్రులను కోడలిని యనుగ్రహించి దశరథుఁడు విమానమున దేవలోకముచేరెను.

ఇట్లు దశరథుఁడు వెడలిపోయినంత నే తనకు మ్రొక్కుచున్న సీతారామలక్ష్మణులను జూచి దేవేంద్రుఁడు "రామా! నీతండ్రి పుత్రకామేష్టి చేసినకాలమున మేము గోరినట్లే రావణ వధ పరిసమాప్తమైనందున సంతోషించితిని. నీకు వలయు వరమడుగు" మనెను. రామచంద్రుఁడు చేమోడ్చి "సురనాథా! నాకొఱకు భార్యాపుత్రాదుల వదలి యుద్ధముచేసి మృతి నొందిన వానరభల్లూకములు పునర్జీవితులగునట్లనుగ్రహింపు" మనెను. అప్పుడు దేవేంద్రుఁడు "రామచంద్రా! నీ వడిగిన వరము చాలగొప్పది. అయినను నీవుచేసిన లోకోపకారము నకుఁ బ్రత్యుపకారముచేయ నెంచి నీకోరికఁ జొప్పున నీపక్షమున యుద్ధములో మరణించినవారెల్లరు సర్వాంగ సౌష్ఠవముతో మఱల బ్రతుకుదురు. వారు వసించు ప్రదేశములలో వృక్షములు అన్ని ఋతువులలోను పుష్పఫలభరితములుగనుండు"నని యనుగ్రహించెను. అట్లే మరణించినవారెల్లరు నిదుర మేల్కొనినవారివలె నెట్టిబాధయులేక సుఖముగనుండిరి. అంత దేవతలు "రామచంద్రా! నీ వయోధ్యకుఁబోయి రాజ్యాభిషేకము

చేసికొని సీతను మిక్కిలి యాదరించుచుఁ దమ్ములఁగూడి సుఖముగ రాజ్యముపాలింపు"మని యనుగ్రహించి దివంబు జేరిరి.

## అయోధ్యకుఁ బయనమగుట.

---

ఆరాత్రి రాముఁడు లంకలో సుఖముగ నిద్రించి మఱునాఁ డుదయమున లేచి కాలకృత్యంబులదీర్చికొనియుండ విభీషణుఁడు వచ్చి యంజలిబద్ధుఁడై "రామచంద్రా! స్నానమునకు సకలసన్నాహములు గావించియున్నాను. దివ్యవస్త్రాభరణాదులు సిద్ధముగనున్నవి. దాసీజనులు నీకుపచారములుసలుప నువ్విళ్ళూరుచున్నారు. నాయందనుగ్రహముంచి మంగళస్నానమాచరించి సకలపరివారముతో రెండుదినములు నా సపర్యలనందుకొనవలెనని వినయముగఁ బ్రార్థించుచున్నవాఁడను. నీయందలి ప్రేమాతిశయమునఁ జేయుప్రార్థనయని భావించి యనుగ్రహింపు" మనెను. రాముఁడందులకు "విభీషణా! నాయందు నీవింతవఱకుఁ గనబఱచిన విశ్వాసమును నాకొఱకు నీవుపడిన శ్రమమును గుర్తించియున్నాను. భరతుఁడు నాప్రాణతుల్యుఁడు. నా యాగమనము నిరీక్షించుచుండును. పదునైదవ సంవత్సర ప్రథమదిన సూర్యోదయమునకుఁ బూర్వము నన్నుఁ జూడకున్న నగ్నిప్రవేశముచేయును. నే నీమార్గముననే యయోధ్యకుఁబోయెద" ననెను. అంత విభీషణుఁడు "రామా! కుబేరుని జయించి రావణుఁడు గ్రహించిన పుష్పకవిమానమున్నది. కుబేరుఁడువచ్చినను దానినీయక నీకొఱకే యుంచియున్నాను. నీవీదినమే దానినెక్కి యయోధ్య చేరఁగల" వనెను. రాముఁడద్దానిఁ గొని తెచ్చున ట్లాజ్ఞాపింప సూర్యతేజముతో

బంగారుమయమగు చిత్రవిచిత్రమంటపములును రత్నమయ
మగు కిటికీలును కృత్రిమవృక్షములును పక్షులును గంటలును
ధ్వజములును గలిగి కామగమనశక్తియుక్తమైన దివ్యపుష్పక
మును దెచ్చి విభీషణుఁడు ప్రాంజలియై రామునకు విన్నవించి
వినయముతో నిలుచుండ రాముఁడు "విభీషణా! సుగ్రీవాది
వానరులును జాంబవదాదులును మనకుఁ జేసిన మహోపకార
ము సాటిలేనిది. వారినెల్లఱ ననేకవిధ స్వర్ణరత్నఖచితములగు
భూషణములతోడను దివ్యవస్త్రములతోడను ధనముతోడను
సంతృప్తులం జేసిన నీత్యాగబుద్ధియుఁ గృతజ్ఞతాధర్మమును వెల్లడి
యగునని చెప్పెను. విభీషణుఁడట్లే సకలపరివారమును వివిధ
దానములచే సత్కరించి రామునిసమీపమున నంజలి గీలించి
యుండెను.

రామచంద్రుఁడు లజ్జతోఁగూడిన సీత నంకంబునఁ జేర్చి
ధనుర్ధరుఁడగు లక్ష్మణునితోడ విమానమారోహించి "సుగ్రీ
వా! నీవు నీవానరసైన్యముతో యథేచ్ఛగాఁ గిష్కింధకేగి
సుఖముగ రాజ్యపాలన మొనర్చుచుండుము. ఉత్తమ స్నేహి
తునివలనఁ బొందఁదగిన సకలవిధ సహాయములు నీచేఁబొంది
సంతసించుచున్నాఁడను. విభీషణా! నీవు నిఁక నెట్టివారికేని
యెదిరింపవీలులేనివాఁడవై రాజ్యముపాలించుచు సుఖింపుము.
మీ రెల్లఱు నా కనుజ్ఞయొసంగవలెను. నేనును నాతండ్రి
రాజధానియగు నయోధ్యఁ జేరుదు" ననెను.

అప్పుడు సుగ్రీవాది వానరులును విభీషణాది రాక్షసు
లును "మే మెల్లఱము నీతో నయోధ్యకువచ్చి పట్టాభిషేక
మహోత్సవము దర్శించి నీతల్లి కౌసల్యాదేవికి నమస్కరించి

యెవరికేని యేవిధమగు బాధ లేశమైనను గలిగింపక మామా
నెలవులకు మరలిపతు"మని ప్రార్థించిరి. రాముఁ డందుల కత్యం
తానందమునొంది సుగ్రీవ విభీషణులను సపరివారముగఁ బుష్ప
కము నారోహింప ననుజ్ఞయొసంగినంతనే వానరులును మంత్రు
లతో విభీషణుఁడును విమానము నెక్కిరి. శ్రీరామచంద్రుని
యనుజ్ఞచే విమాన మాకాశమార్గమున లేచి యయోధ్యాభి
ముఖముగఁ బోవ నారంభించెను.

రాముఁడు సీతనుజూచి "ప్రియా! త్రికూటపర్వతశిఖ
రమున విశ్వకర్మచే నిర్మింపఁబడిన లంకారాజ్యమును జూడుము.
నిన్నపహరించి నాచే యుద్ధమునఁగూలిన రావణుని భస్మమును
జూడుము. ఇచ్చట నాచేఁ గుంభకర్ణుఁడు హతుఁడయ్యెను.
ఈచోట లక్ష్మణుఁ డింద్రజిత్తును వధించెను. నీకొఱకు వాన
రులు గట్టిన సేతువును జూడుము. ఈ ప్రదేశము నానావిధ
వృక్షములతోనిండిన సుగ్రీవుని పట్టణమగు కిష్కింధానగరము.
నేను వాలినివధించిన స్థలమియ్యది" యనుచుండ సీతాదేవి
'నాథా! వానరపత్నులతో నయోధ్యకుఁబోవలెనని నాకోరిక'
యనెను. అంత రాముని యోగంబున సుగ్రీవుఁడు తార మొద
లగు వానరపత్నులెల్లఱ నతిశీఘ్రముగ నలంకరించుకొని రమ్మ
నఁగా వారందఱువచ్చి పుష్పకము నెక్కిరి. రాము ననుజ్ఞచే
విమానముపోవుచుండ ఋశ్యమూకపర్వతసమీపముచేరఁగా
రాముఁడు "సీతా! ఈ పర్వతముననే నాకు సుగ్రీవునితో స్నే
హము హనుమంతునివలన లభించినది. ఇది పంపాసరోవర
తీరము. ఇచ్చట ధర్మచారిణియగు శబరిని జూచితిని. అదిగో
కనఁబడుచున్నదే యది యగస్త్యుని యాశ్రమము. ఇయ్యది

యత్రిమహాముని యాశ్రమము. ఇందే నీ వనసూయాదేవిని దర్శించితివి. ఈప్రాంతముననే మనము పది సంవత్సరములు వాసముచేసితిమి. ఆ యున్నతశిఖరమే చిత్రకూటపర్వత శిఖరము. ఇచ్చటికే భరతుఁడు వచ్చి నన్ను రమ్మని పిలిచెను. కొంతదూరమున యమునానది పారుచున్నది. అచ్చటనే భరద్వాజమునివరు నాశ్రమమున్నది. అదిగో గంగానది. గుహుని పట్టణమగు శృంగిబేరపుర మగుపడుచున్నది. సరయూతీర మావలనున్నది. ఇప్పు డయోధ్యాపురము కానవచ్చుచున్నది. మనము క్షేమముగ మఱలివచ్చినందుల కా నగరమునకు నమస్కరింపు" మనెను. అంత వానరులును రాక్షసులును లేచి తెల్లని మేడలతో నమరావతివలెనుండు నయోధ్యాపురముఁ జూచి సంతోషించిరి.

## భరద్వాజాశ్రమము.

---

ఇట్లు వనవాసము ముగిసిన ధాతృసంవత్సర *చైత్ర శుద్ధ పంచమినాఁడు శ్రీరామచంద్రుఁడు భరద్వాజాశ్రమము చేరి సీతాలక్ష్మణులఁగూడి మునివరునకు మ్రొక్కి వినయముతో "భగవానుఁడా! అయోధ్యలో నందఱు క్షేమముగనున్నారని తెలియునా? భరతుఁడు క్రమముగఁ బాలించుచున్నాఁడా? మాతల్లులు జీవించియున్నారా?" యని యడిగెను. అంత భరద్వాజుఁడు సంతోషించి నవ్వుముఖముతో "రామా! నీ సోదరుఁడు భరతుఁడు ధూళిధూసరితాంగుఁడై జడలుదాల్చి నీ

---

*శ్రీరాముని కిరువదియైదవ సంవత్సర ప్రారంభమగు దుందుభి సంవత్సర చైత్ర శుద్ధ పంచమి యరణ్యవాస ప్రయాణదినము.

పాదుకల ముందిడుకొని నీ రాక నెదురుచూచుచున్నవాఁడు. మీయింటిలోనందఱు క్షేమముగనున్నారు. మున్ను నీవు పితృ వాక్యపాలనము నేయ ధర్మమునే గోరి సకలైశ్వర్యములను మిత్ర బంధువర్గమును విడనాడి నారచీరలు ధరించి రాజ్యమును విడిచి కాలినడకతో వనవాసముచేయఁ బోయినపుడు నిన్నుఁ జూచి జాలినొందితిని. మునుల కభయమిచ్చి జనస్థానమున ఖర దూషణాదుల వధించుట, మారీచునిమాయచే రావణుఁడు సీత నపహరించుట, కబంధుని వధించుట, పంపాతీరముచేరుట, సుగ్రీవునిసఖ్యముపొందుట, వాలినివధించుట, సీత నన్వేషించుట, హనుమంతుఁడు సీతవృత్తాంతముగొనివచ్చుట, నలుఁడు సేతువుగట్టుట, వానరులు లంకనుగాల్చుట, పుత్ర మిత్ర బంధు భృత్యవర్గముతో రావణుని వధించుట, సీత యగ్నిప్రవేశము చేయుట, బ్రహ్మ రుద్రేంద్రాదులు నీ మహిమనుజాటుట మున్నగు విషయము లన్నింటి నెఱుఁగుదును. ఇప్పుడు సీతాలక్ష్మణ సమేతుఁడవై మిత్రవర్గముఁగూడి పుష్పకంబునవచ్చుటఁగాంచి యమందానందభరితుఁడ నగుచున్నాను. నీవీదిన మిచ్చట నా యాతిథ్యము పొంది రేపయోధ్యకుఁ బొమ్మ" నెను. అంత రాముఁడు భరద్వాజునియాజ్ఞను శిరసావహించి వల్లెయనెను. రాముఁ డంజలిబద్ధుఁడై "మహాత్మా! అయోధ్యవఱకు మార్గమున వృక్షము లకాలమైనను ఫలసమృద్ధములుగ నుండున ట్లనుగ్రహింపు" మనెను. ముని "అట్లేయగుగాక" యనినంతనే వృక్షములు పుష్పఫలభరితములాయెను. వానరులాఫలములందిని యానందించిరి.

## హనుమంతుని భరతునొద్దకుఁ బంపుట.

రాముఁడయోధ్యను స్మరించి యొకింత యాలోచించి హనుమంతునిఁజూచి "మారుతీ! నీ వయోధ్య కేగి రాజభవనమున నెల్లరిఁ గుశలములఁ దెలిసికొనుము. మార్గమున శృంగిబేరపురమున నిషాధాధిపతియగు నామిత్రుఁడు గుహునిఁజూచి నా క్షేమము దెలుపుము. అతఁడు చాల సంతోషించును. అతఁడు నాకు నీయంతటి మిత్రుఁడు. అతనివలన నయోధ్యకు మార్గమెఱిఁగి భరతునితో నేను సీతాలక్ష్మణులఁగూడి సుఖముగ మఱలివచ్చి భరద్వాజాశ్రమమున నేడుండి రేపుదయము వచ్చెదననుము. అతఁడు నన్నుఁగూర్చి యడుగఁగా సకలము విశదముగఁ జెప్పుము. నీ వతనితో సంభాషించునపు డతనిఁ జక్కఁగఁజూచి యతని ముఖము చూపులు మాటలు సైగలు బాగుగ గమనించి పదునాలుగేం డ్లనుభవించిన రాజ్యమును బాలింపఁ గోరుచున్నాఁడా రాజ్యకాంక్ష లేకున్నాఁడా యని నిశ్చయించుకొమ్ము. అతఁడొకవేళ రాజ్యకాంక్షగలవాఁడైనచో మేమిచ్చోటువదలి దూరమురాకమునుపే వేగముగవచ్చి యతనిభావమును దెల్పుము. అట్లు లేనియెడల నీవిచ్చటికి రావలసిన యగత్యము లేద"ని చెప్పెను.

అంత హనుమంతుఁడు మానవరూపమున సర్పమును గొనిపోవు గరుత్మంతునివలె శీఘ్రముగ బయలుదేరి యయోధ్యాభిముఖుఁడై వాయుమార్గమునం బోయి శృంగిబేరపురమున గుహునిఁజూచి "సత్యపరాక్రముఁడును నీ యంతరంగ స్నేహితుఁడునగు రామచంద్రుఁడు సీతాలక్ష్మణసహితుఁడై

క్షేమముగ మఱలివచ్చి భరద్వాజాశ్రమమున నీరాత్రి గడిపి వచ్చును. అతఁడు నీ క్షేమము విచారించె" నని చెప్పి పఱల వేగముగఁబోవుచు నందిగ్రామముచేరి భ్రాతృవియోగ దుఃఖముతో దీనుఁడై నారచీరలను కృష్ణాజినమును ధరించి ఫలమూలములు మాత్రము భుజించి జడలుదాల్చి మలినదేహుఁడయి బ్రహ్మర్షివలె తేజోవంతుఁడై రామపాదుకలను ముందిడుకొని ప్రజలకు హితమగురీతిని రాజ్యము పాలించుచుండు భరతునిఁజూచెను. అతనిమంత్రులును పురోహితుఁడును రాజు ననుసరించి కాషాయవస్త్రధారులుగ నుండిరి. హనుమంతుఁడా ధర్మాత్ముఁడగు భరతునిఁజూచి యంజలిగీలించి "నీకు శుభసమాచారము చెప్పుచున్నాను. ఎవఁడు దండకారణ్యమున వసించుటచే నీవీరీతి నారచీరలు జటలుధరించి శోకించుచున్నావో యట్టి నీసోదరుఁడగు రామచంద్రుఁడు నీక్షేమ మడిగెను. అతఁడిప్పుడు రావణునివధించి సీతనుబరిగ్రహించి విజయుఁడయి మఱలివచ్చి సీతాలక్ష్మణ మిత్రవర్గముఁగూడి భరద్వాజాశ్రమమున నున్నాఁడు. నీవతని నతిశీఘ్రమున దర్శించి యానందింపఁగల" వనినంతనే భరతుఁడు సంతోషముతో మూర్ఛిల్లి కొంతవడికి లేచి హనుమంతు నాలింగనముచేసికొని యానందబాష్పములు గారుచుండ మారుతిఁజూచి "ఇట్టి శుభసమాచారము గొనితెచ్చిన నీవు దేవతవా? మానవుఁడవా? నీకు లక్షగోవులను గ్రామములను దివ్యకుండలములు ధరించిన పరిశుద్ధచరిత్రలగు పదునాఱుగురు కన్యలనిచ్చెదను. ఎన్నాళ్ళకిట్టి శుభసమాచారము వినఁగలిగితిని. "బ్రతికియుండినచో నూరేండ్లకైనను మానవుఁడు శుభమునుబొందు"నను లోకోక్తి

సత్యమయ్యెను. నన్ను రాముఁడు విడిచినదాదిగా నిప్పటివఱకాతని వృత్తాంతము సవిస్తరముగఁ జెప్పు" మనెను.

అంత హనుమంతుఁ డతనితో "నీవు పాదుకలను గొనిరాఁగా రాముఁడు దండకారణ్యము ప్రవేశించి విరాధుఁడను రాక్షసుని వధించి శరభంగుఁడను మునినిదర్శించి జనస్థానము చేరెను. శూర్పణఖయను రాక్షసస్త్రీని రామునను జ్ఞఁబొంది లక్ష్మణుఁడు ముక్కు-చెవులుకోసి పంపెను. ఖరదూషణాదులను రాక్షసులు పదునాల్గువేల మందిని రాముఁ డొక్కఁడే వధించెను. ఈసంగతి వినిన రావణుఁడు మారీచుఁడను వానిని మాయలేడిరూపమున సీతను భ్రమింపఁజేయ నామె కోరిక చొప్పున రాముఁ డద్దాని వెన్నంటిపోయి దానిఁ బట్టుకొనలేక వధింప నారాక్షసుఁడు రామునికంఠస్వరమునఁ గూయ లక్ష్మణుఁడు సీత నొంటరిగవిడిచిరాఁగా రావణుఁ డామెను గొంపోవునప్పుడు జటాయువను గృధ్రరాజు రావణునెదుర్కొని కుటాపిడితో నేలఁబడెను. రావణుఁడు సీతనెత్తుకొని పోవుచుండ ఋశ్యమూకమున సుగ్రీవాది వానరులు చూచిరి. రావణుఁడామెను లంకలో నశోకవనమునునుంచి యనేకవిధముల నామెను వశపఱచుకొననెంచి విఫలుఁడయ్యెను. కాని సీత వానిని తృణముగ నెంచెను. రాముఁడామెను వెదకుచు లక్ష్మణునిఁగూడి వచ్చి జటాయువునకు దహనక్రియలుచేసి కబంధుఁడను రాక్షసుని వధించి యతనివలన సుగ్రీవుని దర్శించి యతనితో సఖ్యముపొంది యతనియన్నయగు వాలిని వధించి సుగ్రీవుని రాజ్యమున కభిషేకించి సుగ్రీవునిమూలమున వానరులను నలుదిక్కుల సీతను వెదుకఁ బంపెను. దక్షిణముగఁబోయిన మేము సీతను

గానక దుఃఖించుచుండ జటాయు సోదరుఁడగు సంపాతివలన సీత లంకలో నుండుట వినినంత నేను సముద్రమును దాఁటి లంకలో సీతను దర్శించి యామెకు రాముని యంగుళీయకము నిచ్చి యామె యిచ్చిన చూడామణిని బదులపడుచుకొని వనధ్వంసము చేసి రాక్షససైన్యముల వధించి లంకనుగాల్చి తిరిగివచ్చి చూడామణిని రామున కిచ్చితిని. అంత యుద్ధమునకుఁబోవ నలునిచే సేతువుగట్టించుకొని లంకలోఁ బ్రవేశించి యుద్ధముచేసిరిమి. రావణుని బంధు మిత్ర పుత్ర భృత్య వర్గముతో నతని తమ్ముఁడగు విభీషణునిసాయమున వానర సేనలఁగొని రాముఁడు వధించి విభీషణుని లంకకుఁ బట్టముగట్టి సీతాలక్ష్మణులఁగూడి క్షేమముగ సుగ్రీవాదివానరులను విభీషణాదులను వెంటఁగొని యిప్పుడు భరద్వాజాశ్రమమున నున్నవాఁడు. సూర్యోదయమున కిచ్చటికి వచ్చు" ననెను.

## రామ భరత సమాగమము.

అంత భరతు నాజ్ఞ చొప్పున శత్రుఘ్నుఁడు నందిగ్రామమునుండి యయోధ్యవఱకుఁ గల మార్గము చక్కఁబెట్టించి యయోధ్యాపురమును తోరణములతోడను ధ్వజములతోడను చిత్రవిచిత్రములగుబహువిధాలంకారములతోడను ప్రకాశించునట్లు చేసి శ్వేతచ్ఛత్రములను చామరములను రథ గజ తురగ పదాదులను గొనితేర నేర్పాటులుగావించి కౌసల్యాది తల్లులును సుమంత్రాది మంత్రులును వసిష్ఠాది పురోహితులును పురప్రముఖులును వారివారికిఁదగు వాహనముల నెక్కివచ్చునట్లు యేర్పాట్లు గావించెను. ఎల్లరు నందిగ్రామము చేరిరి.

తెల్లవాఱునంతలో భరతుఁడు వాద్యఘోషములు చెలంగ వంధిమాగధులు గొలువ బ్రాహ్మణులు పుష్పములు కుడుములు అక్షతలు గంధము లెత్తికొని ముందునడువ మంత్రులు పురోహితులు పౌరులు సేనాపతులు వెంటరాఁగా శ్వేతచ్ఛత్రములతో చామరములతో నన్నపాదుకల శిరముననుంచికొని నంది గ్రామము విడిచి భరద్వాజాశ్రమమువైపు కొంత దూరముపోయి రాముని రాక నెదురుచూచుచుండి "హనుమంతా! నీవు వానరుల సహజచాపల్యమునఁ బలుకవుగదా! ఇంకను రామచంద్రుని గానకున్నానే" యనెను. అంత హనుమంతుఁడు "భరతా! భరద్వాజుని యనుగ్రహమున వృక్షములన్నియు పుష్పఫల భరితములుగనున్నవి. వానరుల ఘోషము వినవచ్చుచున్నది. వా రిప్పుడే వాలుకినీనదినిదాఁటి సాలవనమున వచ్చుచున్నారు. ధూళి యాకసమువఱకు లేచియున్నది. ఇప్పుడుచూడుము. సూర్యోదయమువలెఁ బ్రకాశించుచున్నది పుష్పకవిమానము. అది విశ్వకర్మచే నిర్మింపఁబడి కుబేరుని వశముననుండి రావణునిచే యుద్ధమునఁ బొందఁబడినది. విమానము గనఁబడినంతనే ప్రజలెల్లరు సంతోషముతో ధ్వనులు చేసిరి. ఇంతలో విమానము సమీపించెను. భరతుఁ డానంద పరవశుఁడై రాముని దర్శించి నమస్కరించెను. రాముని యనుజ్ఞచే విమానము నేలకువ్రాలెను. భరతుఁడు రాముని సమీపించి వినయముతో మఱల నమస్కరింప రాముఁ డాదరమున భరతుని యంకమునఁ గూర్చుండఁబెట్టుకొని యాలింగనము చేసికొనెను. భరతుఁడు లక్ష్మణునిచే నమస్కరింపఁబడి సీతకు నమస్కరించి మఱల భరతుఁడు సుగ్రీవుని, జాంబవంతుని,

యంగదుని, మైంద ద్వివిదులను ఋషభుని కౌఁగిలించుకొనెను. ఇట్లే సుషేణుని, నలుని, గవాక్షుని, గంధమాదనుని, శరభుని పనసుని కౌఁగిలించెను. వారలనెల్లరఁ గుశలంబు లడిగెను.

భరతుఁడు మఱల సుగ్రీవుని కౌఁగిలించి "సుగ్రీవా! నీవు మా నలుగురు భ్రాతలలో నైదవవాఁడుగ నుంటివి. ఉపకారముచే మిత్రత్వమును నపకారముచే శత్రుత్వము నేర్పడును. నీ యుపకారము నెన్నఁడు మఱువ"ననెను. భరతుఁడు విభీషణుని మృదుమధురభాషణములతో నలరంజేసి "అదృష్టవశమున నసాధ్యమగు కార్యము నీ యసాధారణ సహాయముచే నిర్వర్తింపఁబడిన" దనెను. అంత శత్రుఘ్నుఁడు వినయముతో రామునకును లక్ష్మణునకును సీతకును బ్రణమిల్లెను. రాముఁడు శోకించుచుండిన తల్లి కౌసల్యను సమీపించి యామె పాదములకు భక్తితో నమస్కరించి యోదార్చి సుమిత్రకును కైకేయికిని నమస్కారములుచేసి వసిష్ఠాదులకు మ్రొక్కెను. పౌరులు భక్తియుక్తముగ రామునకు స్వాగతమిచ్చిరి. వారెల్లఱు చేమోడ్చియుండుటఁజూడ సరస్సునఁ దామరమొగ్గ లనేకము లుండినట్లగుపడెను.

అంత భరతుఁడు పాదుకలఁగొని తానే యన్నపాదములకుఁ దొడిగి శిరమున నంజలిగీలించి "నీవు నాయందిల్లడగ నుంచిన రాజ్యభారమును స్వీకరించి నన్నుఁ గృతార్థునిఁజేయుము. బొక్కసమున మునుపటికంటెఁ బదిరెట్లు ధనమున్న" దనెను. అట్టి యసదృశమగు భ్రాతృవాత్సల్యముగల భరతునిఁజూచి వానరులును విభీషణుఁడును కన్నీరుగార్చిరి. ఏలన, సుగ్రీవునకును విభీషణునకు నట్టిభాగ్యమబ్బలేదు. వారిరువు

రధర్మమార్గమవలంబించిన తమయన్నలగు వాలిని రావణుని రామునిచే వధింపఁజేయవలసివచ్చినది. కనుక వారు రామ లక్ష్మణభరతశత్రుఘ్నుల భ్రాతృవాత్సల్యమున కచ్చెరువొందవలసినఁ గారణమున్నది. రాముఁడు నందిగ్రామముచేరి విమానమునుండి దిగి "నీవిఁక ధనదునొద్దకుఁబొమ్మని యాజ్ఞాపింపనా పుష్పక ముత్తరదిక్కుగాఁ బోయి కుబేరునొద్దకుఁ జనెను. రాముఁడు వసిష్ఠునిపాదములకు మ్రొక్కి యతని యాజ్ఞఁబొంది సమానమగు నాసనమునఁ గూర్చుండెను.

## శ్రీరామ పట్టాభిషేకము.

శిరమున నంజలిగీలించి భరతుఁడు రామునిఁజూచి "నాతల్లి పూజింపఁబడిన" దనెను. ఎట్లు? భరతుని భావము రెండువిధములుగ నుండవచ్చును. భరతుఁడు "రామా! నా తల్లి వరమడిగినపుడు నీ వడ్డుచెప్పక వనమునకేగుటచే నీచేఁ బూజింపఁబడినది" యనుట మొదటిది. రెండవది భరతుఁడు "రామా! నిన్నడవులకుఁ బంపుటచే నాకు నాతల్లియందు గలిగిన కోపముచే నేనామెను తిరస్కరించి ద్వేషముసాధించితినని యనుకొనకుము. నీవు చిత్రకూటమున నాజ్ఞాపించినరీతిని నా తల్లిని నేను భక్తియుక్తముగఁ బూజించితి" నని చెప్పినట్లును భావింపనగును. మఱల భరతుఁడు సత్యపరాక్రముఁడగు రామునితో వినయముగ "అన్నా! నీవు చిత్రకూటమున నాయందిల్లడగనుంచిన రాజ్యము నివ్వాడు గైకొనుము. గొప్ప వృషభము మోయఁదగినభారము నొక్కదూడమోయునా? గుఱ్ఱమువలె గాడిద పరుగిడునా! గరుత్మంతునివలెఁ గాకి యెగు

రునా? అట్లే యీగొప్పసామ్రాజ్యమునువహించ సర్వసమర్థుం డవగు నీవుండ నేనిద్దాని నెంతమాత్రము భరింప వీలులేదు. ఒకండు తనగృహావరణమున నొక ఫలవృక్షమునాటి దాని ఫల మనుభవింప నువ్విళ్లూరుచుండ నది చక్కఁగఁ బుష్పించి ఫల మునీయక నశించిపోయిన నతని కాశాభంగముగలిగి యెట్లు దుఃఖకారణమగునో యట్లే నిన్ను యజ్ఞయాగాది క్రతువులు చేసి పుత్రుఁడుగఁ బొందిన మనతండ్రి పితృపైతామహుల ధన మగు నీరాజ్యమును నీవు పాలింపకున్న నెంతమాత్రము సంత సింపలేఁడు. తండ్రి మరణించినను నతని యాజ్ఞ దాటరానిదని మఱలివచ్చి రాజ్యము పాలింతునని చిత్రకూటమున నీ వాడిన మాటచొప్పున నిప్పుడు తండ్రిలేకున్నను వనవాసానంతరము క్రమముగ నీవీ రాజ్యమును పాలింపకున్నఁ దండ్రియాజ్ఞమీఱి నట్లగును. కనుక రామచంద్రా! నీపాలనము నెదురుచూచు చున్న మహాజనులయొక్కయు నీ భక్త భృత్యవర్గముయొక్క యు మనోరథము నీడేర్పుము. నీ విప్పుడు పట్టాభిషిక్తుఁడవై మిట్టమధ్యాహ్నపు సూర్యునివలెఁ బ్రకాశింప నిన్ను దర్శించి యానందింప లోక మెదురుచూచుచున్నది. ఇన్నిదినము లడ వులలో నన్నివిధముల బాధల ననుభవించివచ్చిన నీవిఁక మం గళవాద్యఘోషములతో మేలాకించి కాలచక్రము తిరుగు నంతదనుక ప్రపంచ ముండువంతకాలము రాజ్యపాలనము సేయు"మని త్రికరణశుద్ధితోఁ బ్రార్థించెను.

అంత రామచంద్రుఁడు భరతునిప్రార్థన నంగీకరించి శత్రుఘ్ననిచే నియమింపఁబడిన సుఖహస్తులును శీఘ్రహస్తు లు నగు క్షౌరకులచే దీక్షావిసర్జనము గావించుకొనెను. లక్ష్మ

ణుఁడును భరతుఁడు నక్షౌరము గావించుకొనిరి. రామునాజ్ఞచే భరతుఁడు, లక్ష్మణుఁడు సుగ్రీవుఁడు, స్నానముచేసిరి. తరువాత రామచంద్రుఁడు జటలువిడఁదీసి నున్నని వెంట్రుకలతో స్నానమాచరించి దివ్యవస్త్ర మాల్యాభరణాదులతోడను సుగంధ పరిమళ మిళితమైన చందనానులేపనమునను నలంకరించుకొని సుఖాసీనుఁడై యుండెను. శత్రుఘ్నుఁ డన్నల కలంకారములు సేయ, దశరథపత్నులత్యాదరమున సీతకు నలంకారములు చేసిరి. కౌసల్య పుత్రప్రేమాతిశయమున వానరపత్నుల కెల్లరకు నలంకారములు చేసెను.

అంత శత్రుఘ్ను నాజ్ఞచే సుమంత్రుఁడు సూర్యసమాన తేజముతో వెలుఁగు సకల శుభాలంకారములుగల దివ్యరథమును గొనివచ్చెను. రాముఁడు దానినారోహించెను. సుగ్రీవుఁడును హనుమంతుఁడును దివ్యవస్త్రాభరణముల నలంకరించుకొని దేవలోకతుల్యమగు నయోధ్యాపురముఁ జూడఁబోయిరి. సీతాదేవియు సుగ్రీవపత్నులఁగూడి యయోధ్యను జూడఁబోయెను. ఇంతకుమునుపే మంత్రులును వసిష్ఠాదులును పురములోఁ బట్టాభిషేకమునకు వలయు నేర్పాటులు గావింపఁబోయియుండిరి. వారు శ్రీరాముని వృద్ధికొఱకును అయోధ్యాపురాభివృద్ధికొఱకును నుచితమగు కార్యములు చేసిరి. మంత్రులు రామునిఁజూచు నాతురమున మఱల నందిగ్రామమునకు వచ్చుచుండిరి. రాముఁడు దేవేంద్రునివలెఁ బ్రకాశించెను. భరతుఁడు రామునకు రథసారథ్యముచేసెను. శత్రుఘ్నుఁడు శ్వేతచ్ఛత్రము పట్టెను. రామకైంకర్యమే సంపదగనెంచు లక్ష్మణుఁడు రామునిశిరమునకు నేరుగ వీవనతో వీచుచుఁ

దనివితీరక వింజామరముకూడ ధరించెను. విభీషణుఁడు రెండవ వింజామరము వీచెను. ఆకాశమున దేవ ఋషి సంఘములు రాముని బొగడుచుండినవి. వానరరాజగు సుగ్రీవుఁడు శత్రుం జయమను నేనుఁగు నెక్కెను. మానవరూపముదాల్చిన వానరులు దివ్యవస్త్రాభరణాదుల నలంకరించికొని తొమ్మిదివేల యేనుగుల నెక్కి వెంటవచ్చిరి. మేడలవరుసలతో నిండిన యయోధ్యాపురమును రాముఁడు శంఖ భేరీ నినాదములతోఁ బ్రవేశించెను. మంత్రులు రాముని దర్శింప నెదురు వచ్చుచు నలుగురు తమ్ములంగూడి వచ్చుచున్న రాఘవుని జయజయ శబ్దములతో దీవించిరి. ఇట్లు బ్రాహ్మణులతోడను పౌరులతోడను పరివేష్టింపఁబడి వచ్చు రామచంద్రుఁ డాకాశమున నక్షత్ర సమూహమునఁ బ్రకాశించు నిండుచందురునివలెఁ గాంతితో వెలిగెను.

వాద్యవిశేషములును వందిమాగధులును బంగారువన్నెగల యక్షతలుగలవారును, గోవులును, కన్యలును, బ్రాహ్మణులును, కుడుములుగొనివచ్చువారును, రామునిముందుగఁ బోయిరి. అంత రాముఁడు మంత్రులతో సుగ్రీవునితోఁ దన కేర్పడిన స్నేహమును, హనుమంతుని ప్రభావమును, విభీషణ శరణాగతిని వివరముగఁ జెప్పెను. మంత్రులును పౌరులును రాముని వాక్యములు విని యానందించిరి. రాముఁడు ధ్వజములతోడను, తోరణములతోడను సకలవిధముల నలంకరింపబడిన నగరముఁజొచ్చి తండ్రిగృహమును బ్రవేశించి కౌసల్యాసుమిత్రలకును గైకేయికిని మ్రొక్కి భరతునిఁజూచి "ముత్యములతోడను వజ్రములతోడను బ్రకాశించు నా భవనమును

ఆరామాంతఃపురములతో సుగ్రీవునకు విడిదిగ నొసంగు"మని చెప్పెను. వెంటనే భరతుఁడు సుగ్రీవునిచేయిఁబట్టుకొని యా భవనమునకుఁ గొంపోయెను. శత్రుఘ్నుని యానతిచొప్పున భృత్యులు తైలదీపములను దివ్యాసనములను మంచములను పడకలను గొని యా గృహమునకుఁ బోయిరి.

అప్పుడు భరతుఁడు సుగ్రీవునితో "రాజా! శ్రీరాముని పట్టాభిషేకముకొఱకు హేమఘటంబులందు నాలుగు సముద్రములనుండి తీర్థము దెచ్చునట్లు వానరుల కాజ్ఞాపింపు"మనెను. సుగ్రీవుఁడు బలిష్ఠులగు నలుగురు వానరులతో "మీరు తెల్లవాఱునప్పటికి నాలుగు దిక్కులలోని సముద్రతీర్థము గొనిరావలె"నని యాజ్ఞాపించెను. అంత జాంబవంతుఁడును, హనుమంతుఁడును, ఋషభుఁడును, వేగదర్శియు వాయువేగమునఁ బోయి యైదువందల నదులనుండి తీర్థముఁ గొనివచ్చిరి. సుషేణుఁడు తూర్పునుండియు, ఋషభుఁడు దక్షిణమునుండియు, గవయుఁడు పశ్చిమమునుండియు, నలుఁ డుత్తరమునుండియు సముద్రజలమును దెచ్చిరి. మంత్రులతోఁగూడి శత్రుఘ్నుఁడు వానరులు దెచ్చిన తీర్థమునుగూర్చి వసిష్ఠమహర్షికిని బంధువులకును దెలిపెను.

## అభిషేకము.

అంతఁ బరిశుద్ధుఁడును వృద్ధుఁడు నగు వసిష్ఠుఁడు బ్రాహ్మణులఁగూడి రత్నమయసింహాసనమున రాముని సీతతోఁ గూర్చుండఁబెట్టెను. అష్టవసువులు దేవేంద్రున కభిషేకించునట్లు వసిష్ఠుఁడును, వామదేవుఁడును, జాబాలియును, కాశ్య

పుఁడును, కాత్యాయనుఁడును, సుయజ్ఞుఁడును, గౌతముఁడును, విజయుఁడును నిర్మలమును సుగంధముతోఁగూడినదియు నగు జలముతో బురుషశ్రేష్ఠుఁడగు రాము నభిషేకించిరి. పిదప వసిష్ఠాదులు ఋత్విక్కులచేతను, బ్రాహ్మణులచేతను, పదు నాఱుగు కన్యలచేతను, మంత్రులచేతను, సేనాపతులచేతను, పౌరులచేతను, రామున కభిషేకము చేయించిరి. వసిష్ఠాదులు మున్ను బ్రహ్మచే నిర్మింపఁబడినదియు, మనువునుండి వంశ పారంపర్యముగ ధరింపఁబడినదియు నగు నవరత్నఖచితమగు కిరీటము నొక రత్నాసనమున నునిచి దాని కభిషేకించి దానిని పూజించి దానితో రామున కభిషేకముఁ గావించిరి. అంత శత్రుఘ్నుఁడు రామునకు శ్వేతచ్ఛత్రమును బట్టెను. వానర రాజగు సుగ్రీవుఁడు వింజామరము వీచెను. రాక్షసరాజగు విభీ షణుఁడు చంద్రునివంటి తెల్లని వింజామరము వీచెను. ఇంద్రుని ప్రేరణమున వాయువు రామునకు వంద బంగారు తామరలు గల హారమును కానుకగ నొసంగెను. మఱల నట్లే వాయు దేవుఁడు రామునకు నాయకమణితో వెలయు ముక్తాహారము నిచ్చెను. అప్పుడు గంధర్వులు పాడిరి. అప్సరసలు నాట్య మాడిరి. దేవతలు పుష్పవృష్టి గురిపించిరి. దుందుభులు మ్రోగించిరి. ఇట్లు రామచంద్రుని పట్టాభిషేకము జరిగినపు డు చెట్లు పుష్పఫలములతో నిండెను. పైరుపంటలు గోముగ వర్ధిల్లెను. పుష్పము లపరిమిత వాసనలతో నిండియుండెను.

రామచంద్రుఁడు బ్రాహ్మణులకు నానావిధ వస్తువులను గోవులను దానముచేసెను. రాముఁడు సుగ్రీవునకు నానా రత్న భూషితమగు బంగారుహారము నిచ్చెను, అంగదునకు రత్నము

లతో నలరారు బాహుపురుల నిచ్చెను. రామచంద్రుఁడు సీతకు మణులుచెక్కిన ముక్తాహారము నొసంగెను. సీతాదేవి హనుమంతునకు మంచివస్త్రద్వయమును, మేలుకాంతులనీను భూషణముల నిచ్చెను. అంత సీత రాముఁడు తనకిచ్చిన ముక్తాహారమును గంఠమునుండి తీసి వానరు లందఱినిఁ జూచి భర్త యనుజ్ఞఁ బొంద నెంచి రామునివైపు చూచెను. ఇంగితజ్ఞుఁడగు రాముఁ డామెభావముఁ గనుఁగొని "బుద్ధియందును పౌరుషము నందును బలపరాక్రమంబునను గుణాతిశయంబునను నీ కెవ్వఁడు ప్రీతిఁగూర్చెనో యాతనికి" మ్మనెను. వెంటనే సీత యా ముక్తాహారమును హనుమంతున కిచ్చెను. ఆంజనేయుఁ డా యాభరణముతోఁ దెల్లని మేఘముఁ గూడిన పర్వతమువలె శోభించెను. రామచంద్రుఁడు మైంద ద్వివిదులకును, నీలునకును వారుకోరినవస్తువుల నొసంగెను. రాముఁడు వానరులకు వారి వారికిఁ దగు బహుమతుల నిచ్చెను. రామచంద్రుఁడు సుగ్రీవునకు, విభీషణునకు, జాంబవంతునకు, హనుమంతునకు నానావిధ రత్నముల నవ్వారిగ నిచ్చెను. వానరులు పట్టాభిషేక మహోత్సవము సందర్శించి రామునిచే బహుమానింపఁబడి సంతుష్టులయి యతని యనుజ్ఞఁ బొంది కిష్కింధానగరమునకుఁ బోయిరి. సుగ్రీవుఁడు నట్లే రామునివీడ్కొని నిజపురంబుచేరె. విభీషణుఁ డిక్ష్వాకు కులధనమగు రంగనాథస్వామిని పొంది లంకఁ జేరెను.

## శ్రీరాముని పరిపాలన.

---

అంత రామచంద్రుఁడు లక్ష్మణుని యువరాజుగ నుండఁ గోరెనుగాని రాముని కన్నివిధముల సేవచేయుటయే తన జీవిత పరమావధియని నిశ్చయించిన లక్ష్మణుఁ డందులకు సమ్మతింపనందున రాముఁడు భరతుని యువరాజుగ నభిషిక్తుఁ జేసి తమ్ములఁగూడి ధర్మమార్గ మవలంబించి ప్రజారంజకముగఁ బాలనము చేయుచుండెను. రాజశ్రేష్ఠుఁడగు రామచంద్రుఁడు పౌండరీకాశ్వమేధవాజపేయములను యజ్ఞములనుగావించి విశేషముగ భూరిదక్షిణలిచ్చుచు సకలవిధ దానంబుల విరివిగ నిచ్చుచు శతాధికములగు నశ్వమేధములను జేయుచుఁ బది వేలేండ్లు సకలజనరంజకముగ రాజ్యమేలెను. రామరాజ్యమున వైధవ్యము ననుభవించినస్త్రీయేలేదు. ప్రజలు సర్పము మొదలగు దుష్టజంతువులవలన దుర్మరణము పొందలేదు. వ్యాధిభయము లేక శత్రువుల బాధ నెఱుఁగక సుఖముగ సర్వసంపదలతో సకలసుఖము లనుభవించుచుండిరి. వారెచ్చటఁజూచి నను రాముని గుణగణములఁబొగడుచు మాటిమాటికి రాముఁడు రాముఁడు రాముఁడనుచు నతని రాజ్యపరిపాలనను వేనోళ్ల పొగడుచుండిరి. యుక్తకాలమున వర్షముకురియుచుఁ బైరు పంటలు చక్కఁగఁ బండుచు, వృక్షములు ఫలములతో నిండి రాజ్యమంతయు ధనధాన్య సమృద్ధిగ నుండెను. ప్రజలు వారి వారి కులాచారములను వారివారి వృత్తుల ననుసరించి వారి వారి ధర్మములకు లోపములేక నిర్వర్తించుచుండిరి. రామ

రాజ్యమునఁ బ్రజలు సత్యమునే పలుకుచు నొకరి నొకరు ప్రేమించుకొనుచు నైకమత్యముగలిగి పరస్పర సహాయములు చేసికొనుచు రాజును బొగడుచు నానందముగ జీవనముగడుపు చుండిరి. రామచంద్రుఁడు భక్తిభరితులగు సోదరులఁగూడి పదునొకండు వేలేండ్లు సకలవిధముల నాదర్శపురుషుఁడుగ రాజ్యము నేలి "రామరాజ్యమని" స్వర్గతుల్యమగు పరిపాలన మని జనులు బహువిధముల మెచ్చునట్లు శాశ్వతకీర్తిగడించుచుఁ బాలనము సేయుచుండెను.

వాల్మీకిముని విరచితమగు శ్రీమద్రామాయణమును వ్రాయువారును పఠించువారును వినువారును వ్యాపింపజేయు వారును సకలపాపములనుండి విడివడుదురు. రామాయణ మాదికావ్యము. దానిని వినినఁ బుత్రసంతానముగోరువారి కది లభించును. ధనధాన్యములుగోరువారి కవి ప్రాప్తమగును. దీనివలన నాయురారోగ్యములు గలుగును. శ్రీరామ పట్టాభి షేకమును చదువువారును విను వారును స్త్రీలగుచోఁ గౌస ల్యాదులవలె సత్పుత్రులఁగని సంతోషింతురు. శ్రీమద్రా మాయణము వినువారికి కామక్రోధాదులు నశించును. దేశాంతరము పోయిన స్వజనులును సుఖముగ మఱలివత్తురు. రాజులు శత్రువుల జయింతురు. రామాయణ పారాయణము వలన గృహముననుండు భూత పిశాచాదులు తొలఁగును. గ్రహచారదోషములు పోవును.

మహాజనులారా! ఇది మునుపు జరిగిన వృత్తాంతము. దీనిని భక్తి శ్రద్ధలతోఁ బఠించినను వినినను వ్రాసినను వ్రాయించినను సకల శుభము లొనఁగూడును. ఇట్లు విష్ణు దేవుని మహిమను దెలిసినవారు పునర్జన్మములేని యానంద మయమగు వైకుంఠము చేరుదురు.

యుద్ధకాండము సమాప్తము.

---

నమోస్తు రామాయ సలక్ష్మణాయ
నమోస్తు దేవ్యై జనకాత్మజాయ
నమోస్తు రుద్రేంద్ర యమానిలేభ్యో
నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్యః॥

మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాత్మనే,
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళమ్॥

శ్రీరామార్పణమస్తు.

---:O:---

# రామమంత్రము

పాట — ఆటతాళము. నీలాంబరిరాగము.

రామమంత్రము - శ్రీరామమంత్రము
దీనిఁబోలుమంత్రమెద్ది దివిజులకైనఁ ॥రామ॥

సకలపాప హారంబగును
సర్వతాప శమంబగును
సాటిలేని సౌఖ్యమిచ్చు
సారతమం బగుచువెలయు ॥రామ॥

సహస్రనామతుల్యమగుచు
సకలలోక పూజ్యమగును
సనక సనందాదులచే
సతతము భజియింపఁబడెను ॥రామ॥

భుక్తి ముక్తి రొసఁగునట్టి
భువినివెలయు మంత్రము
దీనజనుల కల్పతరువు
తెలియఁదరమె దీనిమహిమ ॥రామ॥

ఆప దుద్ధారకంబు
ఆనందదాయకంబు
అసురగర్వభంజకంబు
అమృతతుల్యమగుచువెలయు ॥రామ॥